ఆవేదన

డాక్టర్ పి. రామమూర్తి

గంగా ప్రచురణలు, గుంటూరు.

సోల్ డిస్ట్రిబ్యూటర్సు:

ఆదర్శ గ్రంథమండలి, విజయవాడ-2.

ప్రథమ ముద్రణ

మార్చి, 1965.

★

వెల : రు. 6-00

★

ముద్రణ :

శ్రీ వేంకటేశ్వర ప్రింటింగు వర్క్సు,

విజయవాడ-2.

మనవి

డాక్టరు శ్రీ పి. రామమూర్తిగారి రచనలలో ప్రతిదానిలోనూ ఒక ప్రత్యేకత వుంటుంది. స్వతంత్ర రచనలలో యింత జిగువు కలిగి, హృదయాలకు హత్తుకుపోతూ అంతమువరకు చదువరులనాకట్టివుంచ గలిగేవి అరుదు.

వీరి రచనలు వున్నతస్థాయిలోనివి. రసవత్తర సన్నివేశాలతో, గిలిగింతలుపెట్టు సంభాషణలతో, మానవమనస్తత్వ యదార్ధస్వరూపాన్ని సృష్టిస్తారు. శ్రీ రామమూర్తిగారు. ఆర్థిక, రాజకీయ, సాంఘిక విషయాలను విశేష విజ్ఞతతో సిద్ధాంతరూపంతో విశదీకరిస్తారు. వీరు సృష్టించు పాత్రలలో వుదాత్తత వుట్టిపడుతుంటుంది. ప్రతి పాత్ర ఆకర్షణీయంగా వుంటుంది. ప్రతి గ్రంథం నీతిప్రబోధంగా వుంటుంది. వీరు రచించిన యీ గ్రంథంలోని సన్నివేశాలు అత్యధిక ఆకర్షణీయమైనవి. పాత్రల ద్వారా సంఘంలోని లోటుపాట్లను నగ్నంగా చిత్రించారు. నేటి సమాజాన్ని, దాని విభిన్నస్వరూపాలను వివిధకోణాలలో చిత్రించారు. అంతిమ తరుణోపాయాన్ని సూచించారు. శ్రీ రామమూర్తిగారి కలంనుండి వెలువడిన ఈ 'ఆవేదన' గ్రంథాన్ని ప్రచురించి పాఠకలోకానికందిస్తున్నందుకు గర్వపడుతున్నాము. మా ఈ ప్రయత్నాన్ని పాఠకులు హర్షిస్తారని ఆశిస్తాం.

ఇట్లు,

ప్రచురణకర్తలు.

D

20.	పాపాలపట్టీ	213
21.	నగ్నసత్యాలు	227
22.	సత్యస్వరూపం	230
23.	వాంఛితశిక్ష	240
24.	ఆధునికదోపిడి	251
25.	ఆవేదన	255
26.	అస్పృశ్యం	264
27.	లక్ష్యం	273
28.	ఆదర్శసమాజం	283
29.	సంధి	292
30.	ప్రతిఫలం	296
31.	అమరత్వం	301

కీర్తిశేషులు

శ్రీ యమ్. ఎస్. రాయ్ గారికి

అంకితం

H

అధ్యాయ సూచిక

		పేజి
1.	ఆహ్వాన ఆర్భాటం	1
2.	సభ్యత	25
3.	ఆశయం	45
4.	ప్రయోగశాల	53
5.	డిన్నర్ల గంగరాజు	59
6.	కార్యాచరణ	65
7.	ఎన్నికలరాణి	74
8.	మాయాజాలం	89
9.	అర్థంగాని ప్రయోగాలు	96
10.	వకాల్తాలేని వకీలు	107
11.	ప్రేమోపాసకుడు	123
12.	ఎండమావులు	135
13.	పాముకాటు	138
14.	పరాజయం	145
15.	హనీమూన్‌యాత్ర	152
16.	ప్రేమకానుకలు	161
17.	ప్రేమ-ప్రేరణ	188
18.	యుగధర్మం	192
19.	అంతర్రహస్యం	201

1549

ఆవేదన

1. ఆహ్వాన ఆర్భాటం

అది విజయనగరం రైల్వేస్టేషను. ప్లాట్‌ఫారంమీద ప్రయాణీకులు యెక్కడికక్కడే కుప్పలుతిప్పలుగా కూలబడి నిరుత్సాహంతో నిమిషాలు లెక్కించుకుంటున్నారు. వైజాగ్‌నుంచి వస్తున్నబండి ఆలస్యాన్ని 30 నిమిషాలనుంచి 50 నిమిషాలకు సవరణ చెయ్యబడింది. అరగంటముందే మిత్రబృందంతో వచ్చిన స్వర్ణకుమారి ప్లాట్‌ఫారం మీద అన్నివైపులా ప్రదక్షిణాలుజేసి, విసిగి, వెయిటింగ్‌రూముకెళ్ళి ఒక యీజీఛైరులో వాలిపోయి దీర్ఘనిట్టూర్పును విడిచింది. ప్రక్క ఆసీనులైనవారిలోనుంచి "పోనీ రెండోతభా ప్రకటించిన టైముకయినా బండి వస్తుందన్న గ్యారంటీ చెప్పటంలేదుగదా!" అన్నది శశీదేవి. "బండిని నడిపేవారు, నడిపించేవారుకూడా, ఆ గ్యారంటీ యివ్వలేరంటున్నాడు యస్. యమ్." అని వినిపించింది కస్తూరి.

కైలాసపతి వారితో కలిసివచ్చినవాడే. కాని వారితోపాటు లోపల ప్రవేశించే అర్హత లోపించి ఆగిపోయాడు. వాకిటిముందు తగిలించి వున్న బోర్డునుచూస్తూ ఆలోచనలు చేస్తున్నాడు.

బైటనున్న కైలాసపతినిచూచి స్వర్ణకుమారి తన పొరపాటుకు నొచ్చుకుంటూ బయటకొచ్చి 'క్షమించండి కైలాసపతిగారూ, పరధ్యాసలో వెళ్ళి కూర్చున్నాము' అన్నది.

"మీరు వెళ్ళి కూర్చున్నందుకు బాధపడుటలేదు గాని, సమాన హక్కులను సమాన ప్రతిపత్తిని, ఏకత్వాన్ని చాటుతూ, యీ వేరువేరుగా స్త్రీపురుష విభజన చేసిన విధానంలోని దోషం ప్రభుత్వానిదా, స్త్రీ లోకానిదా, అని ఆలోచిస్తున్నాను." అంటూ గలగల నవ్వాడు కైలాసపతి.

కైలాసపతి వసంతకుమార్‌కు దూరపుబంధువు. కాలేజీ చదువుల

వరకు సహవిద్యార్థులుగా కలిసి చదివినవారు. ఆర్థికస్తోమతు అధికంగా లేనందున అధిక ఆశలను వమ్ముచేసుకుని తండ్రి యిచ్చానుసారంగా కాలేజీలో చేరిపోయాడు కైలాసపతి.

వసంతకుమార్ బెంగాలులోని ఒక మెడికల్ కాలేజీలో దొనేషన్ ద్వారా సీటుపొంది చేరిపోయాడు. ద్వితీయ సంవత్సర అర్థంలోనే ఆ కాలేజీకి స్వస్థిజెప్పి పెద్దప్రయత్నాలతో విదేశయాత్ర సాగించాడు. ఆజ్ఞలు అతనిముందు పనిచేయవు, సలహాలు వినిపించవు. అందుకే ఆయన పయనాన్ని యెవ్వరూ అడ్డగించలేకపోయారు.

ఏ మోజుతో ఆశలతో విదేశ పయనం సాగించాడో అవి అక్కడకు చేరిన నెలలోనే మారినవి. లిటరేచరు చదవాలని అక్సుఫర్డులో ప్రవేశించాడు. అర్థంలోనే లిటరెచర్‌కు స్వస్తిజెప్పి ఎకనమిక్సులో అడుగుబెట్టాడు. కొంతకాలానికి తిరిగి మెడిసిన్‌వైపుకే మొగ్గాడు. ఒకటి తరువాత ఒకటిగా అభిప్రాయాలను, అధ్యయనాలను, మార్చుకుంటూ లండనులో పది సంవత్సరాలు గడిపివేశాడు. ప్రారంభించిన ప్రతి విషయంలోను పట్టుదల వహిస్తాడు. అందరికి మిన్నగా కనిపిస్తాడు, కాని అర్థంలోనే ఆపివేయడం ఆయన కలవాటైపోయింది. అందుకే సన్నిహితులైన మిత్రులు ఆయన్ను 'అసంపూర్ణరాయుడు' అన్న పేరుతో పిలుస్తుంటారు. ప్రవేశించినదాంట్లో విశేషప్రావీణ్యమే పొందుతాడు గాని యోగ్యతాపత్రం పొందే యోగమేలేదు, అంటా రనేకులు.

బొబ్బిలియుద్ధపు రోజులలో వసంతకుమార్ పూర్వుడు రజపతిరావు బొబ్బిలి ఆస్థానంలో వుంటూ విజయనగరంవారికి లాలూచీపడి అనేక అంతర్రహస్యాలు అందజేసినందుకు, బొబ్బిలి పతనం తరువాత విజయనగరంవారు సమర్పించిన సంపత్తి అత్యధికమైంది. పది తరాలు విచ్చలవిడిగా ఖర్చుపెట్టినా తరుగనిది. ద్రోహియైన రజపతి క్షమించరానివాడని బొబ్బిలి ప్రదర్శిస్తున్న విషదృక్కుల భరింపలేక విజయ నగరానికి తరలివచ్చాడు.

రజపతిరావు విజయనగరంలో గొప్పవీరుడుగా సన్మానింపబడ్డాడు, పూజింపబడ్డాడు. ఆనాడు ద్రోహంద్వారా ఆర్జించిన సంపత్తి

రెండు తరాలు విచ్చలవిడిగా ఖర్చుపెడినా నేటికీ విశేష సంపత్తి నిలిచి వుంది. అందుకే వసంతకుమార్ చదువులు, వుద్యోగాలకొరకు, సంపాదనలకొరకో కాదని, విజ్ఞానంకొరకు వినోదం కొరకని అనుకోవటం పరిపాటి. ఈ అసంపూర్ణ అంగలద్వారాకూడా వినోదం పొందుట వసంతకుమార్ ఆశయమేమో!

వసంతకుమార్ హైస్కూల్లో చదువుతున్నరోజుల్లో తండ్రి మరణించినపుడు చుక్కానీ జారిపోయిన నావవలె కుటుంబం కొన్ని రోజుల వరకు అయోమయంలో నిలిచిపోయింది. తల్లి వింధ్యారాణి అమాయకురాలు, ప్రేమపాత్రురాలు. ఆమె నిలువెల్లా వాత్సల్యంతో నిండి వ్యక్తిత్వం కరువైంది. తానుగా యేవిషయాన్నీ నిర్ణయించుకోలేదు. బిడ్డ మీదేగాదు నౌకర్లమీదైనా దబాయించుతూ పెత్తనం సహించు తత్వం లేదు. ఆమె హృదయంలో యెక్కడా కాఠిన్యతలేదు. అధికారంతో ఆజ్ఞగా చెప్పవలసినచోట వినతితో వేడి చెబుతుంది. ఆమె హృదయము మనస్సు మధుభరితాలు, మాటలలో వాత్సల్యామృతం పలుకుతుంటుంది, నౌకర్లకు ఆమెయెడ భక్తివుంది. ప్రతిఒక్కరు ఆమెద్వారా గుప్తదానాలు పొందినవారే. 'ఆ మహాతల్లి చల్లనిచూపులు లేకపోతే యేనాడో వుద్యోగంనుంచి పారిపోయి వుండేవాడిని' అని ఎవరికివారే అనుకుంటుంటారు. కర్తవ్యంకంటె ఆమెలో కరుణ ప్రధానమైంది. జాలి కరుణ దయిలతో నిండిన హృదయం కాఠిన్యత సహించలేదు. హృదయకాఠిన్యత లేనిచోట కర్తవ్యం కుంటుపడుతుంది. దేశంలో సంపద లేదు. అందుకే రాజపతిరావు అనంతరం కుటుంబయంత్రాంగం అస్తవ్యస్త రూపం ధరించింది. వింధ్యారాణి దుఃఖాన్ని భరించలేక మంచమెక్కింది.

వసంతకుమార్‌కు పూర్ణస్వేచ్ఛ లభించింది. చదువుకు స్వస్తి జెప్పాడు. మిత్రులసంఖ్య పెరిగింది. ఆటపాటలలో మునిగిపోయాడు. కావుతియిల పందాలలోను, కుక్కలచేత నీటిలో విసిరిన బంతిని తెప్పించుటలోను, ఆకాశంలో యెగురుతున్న గాలిపటాన్ని పావురాయి దంత్రింప క్రిందికి తెచ్చుటలోను, కరపత్రాలను నోటకరచుకెళ్ళ పావు

రాయి ఆకాశంలో విడుచుటలోను, గుఱ్ఱపుగ్యాలప్‌తో చిన్నిచిన్ని గోడలు దూకించుటలోను మొదలగు ఆటలలో లీనమైనాడు. అందుకే మిత్రులు 'సర్కస్ మాష్టర్' అని పిలుస్తుంటారు.

'పెద్దఅయ్యగారు కర్కోటకులుగా కనిపించినా అందరి యోగ క్షేమాలను ఒకకంట కనిపెడుతూండేవారు. వారి ఆదరంలో అందరం నిశ్చింతులమై వుండేవారము. వారి మరణం మా అందరికుకూడా అంధ కారాన్నిచ్చింది. పోయినవారితో యెవ్వరమూ పోలేము. పొగొట్టుకున్న వారివిచారంతో అంతకుమించిన నష్టాన్ని పొందుట వివేకం కాజాలదు. మీరు ధైర్యంతో నిలిచి అబ్బాయిగారిని అదుపుచెయ్యకపోతే యెందునా కాకుండా పోతారమ్మా,' అంటూ వృద్ధుడైన మానేజరు వినిపించినపుడు వింధ్యారాణి బొలబొల విలపించింది.

వసంత్‌కుమార్ తండ్రి స్వభావాలనే పుణికిపుచ్చుకున్నాడు. ఒక్కమాటుగా వుబికిన వుల్లాసోత్సాహాలతో పరువులుబెడుతున్న అతనిని అడ్డగించి అదుపులోవుంచుట నౌకర్లకు తల్లికి శక్యంగాలేదు. మిత్రుల ద్వారా డ్రామాపిచ్చికూడా పట్టుకున్నది, ఒక స్వంత డ్రామా ట్రూపును తయారుచేసి రిహార్సల్సు పెట్టిస్తున్నాడు. తానే దర్శకుడు, అన్ని పోర్షన్ లని కంఠస్తంచేశాడు. పాటలను పద్యాలను రాగయుక్తంగా పాడు తున్నాడు. ఒక త్రాగుబోతుపాత్రను నటించుటకు, వాస్తవంగా త్రాగి నటిస్తే యెలావుంటుందోనని అర్థబ్రాందీ బాటిలు త్రాగి రిహార్సల్స్‌లో పాల్గొన్నాడు. నటన అద్భుతంగా వుందన్నారు. ఆ మెప్పులతో బ్రాందీ రుచి అధికమయిండి.

ఇక వసంత్‌కుమార్ జీవితం వ్యర్థమైనట్లేనని అంతటా అను కుంటున్నారు. చుట్టపుచూపుగా చూసిపోను వచ్చిన వింధ్యారాణి అక్క భూదేవి యిక్కడి స్థితిగతులన్నీ చూసి చింతితురాలయినది. మానేజరు ద్వారా వివరాలన్నీ తెలుసుకుని, డ్రామాడ్రస్సులు, కర్టెనులు, హార్మో నియం, మద్దెల వగైరా లన్నిటినీ ఒక గదిలోపెట్టి తాళంవేసి, చెవిని కొంగున కట్టుకున్నది. సింహగర్జనలతో చీవాట్లువేసి డ్రామాట్రూపు వారిని తిరిగి రాకుండా తరిమివేసింది. ధైర్యము హస్తసైవస్యము లి

గినవానిముందు పొగరుబోతుపాము శిరస్సు వంచునట్లు, సాధుపైపోవు నట్లు వసంత్‌కుమార్ పెదతల్లిముందు నోరు మెదపలేకపోయాడు.

"చదువుకు పేరు ప్రతిష్టలు సంపాదించి కుటుంబాన్ని వుద్ధరించ వలసినవాడివి దుర్బుద్ధులలో బడి అప్రయోజకుడివిగా, గాలివాడివిగా తయారై సర్వనాశనానికి హేతువుకాను వీల్లేదు. సన్మార్గంలో సత్ప్రవర్తనలో చదువులలో కావలసినంత ఖర్చుబెట్టుకో. నిన్ను యెవరూ కాదనరు. ధనానికి లోటులేదు. నిన్ను సంపాదించమని యేనాటికీ కోర వలసిన అవసరం లేనంత ఆస్థి వున్నది. ఈ అయిశ్వర్యాన్ని అష్టాత్ర గల సభ్యతలో అనుభవించు. లేదని పిచ్చిపిచ్చి వేషాలువేస్తే మతి పోయిందని పోలీసువారి కష్టడీలో పెట్టిస్తాను జాగ్రత్త!" అని భూదేవి గద్దించి వినిపించినపుడు; యెదుటనున్న వసంతకుమార్ యేమిచేసి కూర్చుంటాడోనని వింధ్యరాణి, వృద్ధమానేజరు భయకంపితులైనారు. కాని వసంతకుమార్ మాట పలుకు లేకుండా వినమ్రతతో నిలిచివుండుట వారి కాశ్చర్యాన్ని కలిగించింది.

భూదేవి లేచివెళ్ళి వసంతకుమార్ శిరస్సుమీద చేయివేసి నిమురుతూ 'నీమంచికే చెబుతున్నాను నాయనా, నీవు బాగా చదివి గొప్ప వాడివై విదేశాలుకూడా వెళ్ళి ఖ్యాతిని గడిస్తావని, వంశోద్ధారకుడ వవుతావని పెట్టుకున్న మా ఆశలను నిరాశలు చేయవోకు తండ్రీ!' అంటూ తీసుకెళ్ళి తన వొడిలో కూర్చుండపెట్టుకుని బుజ్జగించింది.

భూదేవివచ్చి 15 రోజులయింది. ఇప్పుడు వసంత్‌కుమార్ బైటకు పోవుట మానివేశాడు. ఎక్కడిమిత్రులక్కడ సర్దుకున్నారు. ట్యూటర్ యింటికేవచ్చి చదువుచెప్పి పోతున్నాడు. భూదేవిలో అదుపుచేయగల నేర్పుతోపాటు ప్రేమాదరాలతో ఆకర్షించగల శక్తికూడా వున్నది. చెప్పనవిషయం చెప్పకుండా చెబుతూనే వుంటుంది.

అన్నీ చక్కబెట్టిన భూదేవి, చెల్లినుంచి సెలవుతీసుకుని వెళ్ళిపో వయనమయినప్పుడు 'మీరున్న యీ కొద్దిరోజులలోనే చెదిరిన యింటి వ్యవహారాలను చక్కదిద్దారు. చిన్నబాబుగారిని సరియైన బాటలో పెట్టారు. అన్నివైపులా ఆనందదాయకంగా వుంది. మా అమ్మగారి వుదాసీనతకూడా అదృశ్యమైంది, మీ రీనాడు వెళితే అన్నీ తిరిగి యధా

విధిగావచ్చు. మీరు తలుచుకుంటే యీ కుటుంబాన్ని వుద్ధరించగలరు. అంతకంటె అధికంగా విన్నవించగల హక్కుకూడా నాకులేదు. నన్ను మన్నించండి' అని వినయపూర్వకంగా ప్రార్థించాడు మానేజరు.

మానేజరు వినతిని ఆశ్రయంచేసుకుని, వింధ్యారాణికూడా అక్కను ప్రార్థించింది.

భూదేవి బాలవితంతువు. భర్తఆస్తిలో అర్ధభాగాన్ని వారసులకు విడచి మిగిలిన సగభాగాన్ని సర్వహక్కులతో పొందింది. బాలవితంతువులు వయసు మరలిన తరువాత అధికారదర్పాన్ని సహజరూపంలో పొందుతారు. తన ఇరవయ్యోయేట అన్ననుంచి వేరై తన ఆస్తిని తానే చూచుకుంటూ ఆరితేరిన వ్యవహర్త. తన అన్న కుమార్తె స్వర్ణకుమారిని తనవద్దనే వుంచి గారాబంగా పెంచింది. పొలాలు చాలాభాగం అమ్మి రెండులక్షల ధనాన్ని బ్యాంకులో నిలవచేసింది. గొప్ప భవన నిర్మాణం కూడా చేయించింది. స్వర్ణకుమారికి యింటిలోనే చదువు చెప్పిస్తున్నది.

అంత అల్లరివాడుగా, గడుగ్గాయగా, దిమ్మరిగా ప్రచలితమైన వాడు వసంతుందు వినయుడై జవదాటనివాడుగా తయారైనందుకు కలిగిన ఆత్మానందం పరవశం చేస్తున్నది. ముద్దుగా తన యెదుటగూర్చుని యెంతోఆసక్తితో విషయాలను వింటున్నందుకు ఆమె హృదయం అనురాగంతో ఆర్ద్రమైంది. తన బిడ్డలు లేని కొరత తీరినట్లు తోచింది. అలాంటి ఒద్దసహానుడైన వసంతకుమార్‌కు మారంగాలేని మమత వో ప్రక్క మానేజరు వినతి తన చెల్లి దీనత మరోప్రక్క భూదేవిని ఆకర్షించినవి.

ఆమె చెల్లి కుటుంబాన్ని సరిదిద్ద నిర్ణయించుకుని వుండిపోయింది. స్వర్ణకుమారినికూడా తనవద్దకే పిలిపించుకున్నది. భూదేవి యాజమాన్యంలో నౌకర్లంతా అప్రమత్తులైనారు. ఆస్తి ఆయవ్యయాలు స్పష్టంగా తేలిపోతున్నవి. వసంతకుమార్ వినయుడై చదువులో లీనమైపోయాడు.

స్వర్ణకుమారికెప్పుడు పాఠాలు చెప్పుట, చదివించుట వసంతకుమారే. రాత్రిపూట తన ప్రక్కన గూర్చుని చదువుతూ చదువుతూ కునుకుతూ రెప్పవాల్చినపుడు, చెవి మెలివేసి 'కుంభకర్ణుని తోబుట్టువు!' అంటాడు.

విడిపించుకోను ప్రయత్నిస్తూ 'నా చెవి గిల్లేస్తున్నాడు అమ్మా!' అంటూ కేకపెడుతుంది.

"ఒక చెవి పోయినా రెండో చెవి వుంటుంది చాలులే," అంటూ నవ్వుతాడు వసంతం.

పెరట్లోనుంచి హాలులోనికివచ్చిన భూదేవి గంభీరత నటిస్తూ 'చెవులేని పిల్లను చేసుకోనని నీవే గోలపెడతావుగదరా! చెవులేనిదాన్నే చేసుకోవాలనుకుంటే వూడబెరుక్కో' అంటుంది.

"చూడవే అమ్మా, యింకా యెక్కువగా మెలిపేస్తున్నాడు" అని నంగితో రాగయుక్త యేడుపుతో కేకపెట్టింది స్వర్ణ.

"దాన్ని యేడ్పించమాకు వసంతం."

"నాకు యిష్టమైతే చెవి వూడబెరికి వేయమన్నావుగా"

"దాని అందంమీద నీ కంత అసూ యెందుకుబాబూ?"

"ఏమి అందంగుంటుందమ్మా, నల్లటి కనురెప్పలు, బుగ్గమీద మచ్చ!" అన్నాడు.

పగలబడి నవ్వుతూ ప్రక్కనున్న చెల్లితో 'చూశావా వింధ్యా. ఆడదాని అందాన్ని గుర్తించగల శక్తి వీడి కింకా రాలేదు.' అంటూ వసంతంవైపు తిరిగి, 'వెర్రివాడా, అంత యర్రటి ఆడపిల్ల నయనఫలకాలు నల్లగా కాటుకరంగులో వుండుట మహా అందంగా పరిగణిస్తారు. బుగ్గమీద పుట్టుమచ్చ అదృష్టంక్రింద లెక్కిస్తారు. స్వర్ణ సాక్షాత్ లక్ష్మి స్వర్ణప్రతిమనాయనా,' అంటూ వచ్చి స్వర్ణ లలాటంమీద ముద్దిడుకున్నది.

కుటుంబ బరువుభారాల యావత్తు బాధ్యతను అక్కమీద విడచి నిశ్చింతురాలై ఆనందంతో కాలంగడుపుతున్నది వింధ్యారాణి. వసంతకుమార్, స్వర్ణకుమారి ఒకరికి మించి ఒకరు వింధ్యారాణిమీద పెత్తనం చెలాయిస్తుంటారు. ఆమెలో విసగడ లేదు. చిరాకులేదు. ఓరిమిలో ఏమి చెప్పినా చేస్తుంది. ఎంతటి బాధనైనా సహిస్తుంది.

పెరట్లోని గంగరేగిచెట్టువైపు యెపుడువెళ్ళినా ముళ్లు గుచ్చుకుంటవి స్వర్ణకు. కనుక ఆచెట్టును నరికివేయించమంటుంది. బాల్యంనుంచి ఆ చెట్టెక్కి దోరకాయలను తింటుంటాడు వసంతం. కనుక ఆ కల్పతరువును నరక నీల్లేదంటాను, మోతీపక్క స్వర్ణచేతిలో యేదైనా

వున్నపుడు దగ్గరకొస్తుంది, యేమీ లేనపుడు యెంత పిలిచినా రాకుండా వసంతం వెంట వుంటుంది. అందుకని మోతీని కట్టివేస్తుంది స్వర్ణ. వదిలివేస్తాడు వసంతం.

ఈ తగాదాలలో మొట్టికాయలు దొరుకుతుంటవి స్వర్ణకి. ఏడుస్తూ వెళ్ళి వింధ్యరాణిముందు ఫిర్యాదుచేస్తుంది. ఆమె కవుగిటిలోకి దీసుకుని ముద్దిడుకుంటూ 'వాడు వట్టి మొండివాడమ్మా, భయంలేని పోకిరీ. అమ్మలో చెప్పి వాడిపని పట్టిద్దాం పద.' అంటూ భూదేవి ముందు కొచ్చి 'వాడిని బాగా కోప్పడక్కా, పసిబిడ్డను పద్దాక యేడ్పిస్తూంటే యెలా !' అంటుంది.

భూదేవి మందహాసాలొలికిస్తూ 'వాడి భార్య యెలా వుండాలో యిప్పటినుంచే తర్ఫీదు యిచ్చుకుంటున్నాడు. అందులో ఆపిడకు అనేక అయిష్టాలు బాధలు కలుగవచ్చు అందుకు నీ సానుభూతి అప్రస్తుతమే అవుతుంది చెల్లీ,' అంటుంది.

"నీవు మరీ వాడిని సమర్థించమాకు అక్కా, వాడి తర్ఫీదులో నా నా బిడ్డ నిరంతర బాధ సహించేదెలా ! రత్నానికి సానబెట్టడం తెలియ నపుడు రూపం హరించి విలువ హీనమైపోతుందేమో,' అన్నది వింధ్యారాణి.

"వసంతం అంత తెలివితక్కువవాడుగాదు. ఎలాచేస్తే వాడికి నచ్చుతుందో, విలువ పెరుగుతుందో వాడికి తెలుసు. ఆడదానికి అణ కువ సహనము ఎంతపెరిగితే అంతమంచిది. విజ్ఞానంలో బాధవుంది. బాధలేనిదే విజ్ఞానం కలుగనట్లే, వికాసం పొందనట్లే తర్ఫీదులోని శ్రమను గురికాకుండా నచ్చిన మచ్చు నిలువదు. తర్ఫీదులో బాధవున్నా బాధలలోనే బాంధవీయనిజస్వరూపం నిగ్గుతేలేది." అంటుంది భూదేవి.

· వింధ్యారాణి కోపగించుకోవటం కుదరక విసగటలో 'వాడు చేసే వాటన్నిటిని సమర్థించి నెత్తికెక్కిస్తున్నావు. 'క్వశ్చన్‌మార్క్' అని దానికి పేరుపెట్టి గేలితో వేధించుకు తింటుంటే అది గదిలో జేరి నా వడిలో దూరి ఒక్కటేమన యేడుస్తున్నది. అదేమంటే, ఆ పేరునే మరీ మరీ పాటలరూపంగా అల్లి యేడ్పిస్తున్నాడక్కా' అన్నది.

"నీవు మరీ పిచ్చిదానివి వింధ్యా! స్వర్ణ కుర్చీలో కూర్చున్నా, చాపమీదకూర్చున్నా, క్వశ్చన్‌మార్కు-వలె కూర్చుంటుందట. కుర్చీలో కూర్చున్నపుడు పాదాలు కిందికి వదలి కూర్చోమని, చాపమీద కూర్చున్నపుడు మామూలుగా కూర్చోమని యెంతచెప్పినా క్వశ్చన్‌మార్కు-గానే కూర్చుంటుంది గనుక వాడు గేలిజేస్తున్నాడు. వాడి కిష్టమైనట్లు వాడు చెప్పినట్లు యెందుకుచేయగూడదు!" అని యెదురు చివాట్లువేసి పంపుతుంటుంది.

ఈ రూపంగానే వారి బాల్యమంతా గడిచిపోయింది. వసంతం మెడికల్‌కాలేజీలో చేరటానికి భూదేవి ప్రోత్సాహం లోడ్పడింది. విదేశాలు వెళ్ళుటకు ఆమె అంతగా సమ్మతించకపోయినా నిరోధించలేదు. వెళ్ళినప్పటినుంచి యెప్పటికప్పుడు ప్రారంభించి, ఆతరువాత విడచి మరో లైనులో దిగుతూ అందుకుగల కారణాలను అనేకరీతుల విశేషరూపంలో వివరించి వ్రాస్తూవచ్చిన వుత్తరాలు భూదేవిని ఆకర్షించినవి. తనబిడ్డ సంపాదనాపరుడు కావాలనో, స్థిరమైన వుద్యోగం పొందాలనో ఆమెకులేదు. గొప్ప విజ్ఞానవంతుడు, వివేకవంతుడుయై అందరను ఆకర్షించు యోగ్యుడై శాశ్వతకీర్తిని పొందాలని ఆమె అభిలాష.

వసంతం లండన్‌లోని ఒక మెడికల్‌కాలేజీలో చదివి డిగ్రీ పొంది, స్కిన్ స్పెషలిస్టుగా వుత్తీర్ణుడై ఆతరువాతకూడా, అక్కడే నల్లటివారిని యెర్రటివారినిగా చేయు సులువైన క్రియకొరకు పరిశోధనలు ప్రారంభించి ఆ వివరాలను యింటికివ్రాసినపుడు భూదేవి అబ్బురపడి పోయింది. ఆ వుత్తరాన్ని నాలుగుమారులు చదివి వినిపించింది వింధ్యారాణికి.

"వాడికి నలుపు గిట్టదు, అందుకే వాడు పసితనంలో స్వర్ణ నేత్ర ఫలకాలమీది నలుపునుకూడా యేవగించుకుంటుండేవాడు!...." అంటుండగా మధ్యలో వింధ్యారాణి కల్పించుకుని, 'వాడుజేసే వెర్రిమొర్రిపనులకుకూడా గొప్ప విలువ నివ్వటం మంచిదిగాదు. ఎవరైనా వింటే వాడి పిచ్చిలోని సగ అంశం నీలోనూ వున్నదంటారు.' అన్నది.

"పిచ్చివూహలనుంచే కొన్నికొన్ని వేళలందు గొప్పఫలితాలు లభ్యమవుతుంటవి. వాడికి నలుపంటే అయిష్టం. పోనీ వాడిద్వారా

దేశంలో నలుపుమనుష్యులు లేకుండాపోయే రోజు వస్తుందేమో." అన్నది భూదేవి.

"నలుపుకూడా ఒకరకంగా అందమైంది. నలుపులేకపోతే యెరుపుకు ఆ విశేషవిలువ వుండదు;" అన్నది.

"అవి తృప్తిని కల్పించుకునే మాటలు. కళ్ళు మూసుకుని కంఠసాలుజేసి పెద్దపెద్ద డిగ్రీలు పొందటం గొప్ప విశేషంగాదు. ఏదో ఒక కోణంలో నూతనపరిశోధనజేసి నూతనావిష్కర్తగా పేరుబొందుట సామాన్యంగాదు. ఆధిక్యతలను అర్థంచేసుకోగల విజ్ఞానం వున్నపుడే యథార్థలోతులు తెలుస్తవి వింధ్యా," అన్నది భూదేవి.

మనస్సులో పురివిప్పి నాట్యం సలుపుతున్న ఆనందాన్ని బయల్పడనీకుండా 'అమ్మా, బావ రాగానే ముందు నా కనురెప్పలమీద నలుపును నిర్మూలించే ప్రయోగం చేస్తాడేమో!' అన్నది స్వర్ణ.

భూదేవి ఆమె లలాటంమీద ముద్దిడుకుంటూ 'నిన్ను ఈనాడు చూస్తే వాడిలోవాడే విస్మితుడవుతాడుతల్లీ! భగవంతుడు తన నైపుణ్యాన్నంతటిని క్రోడీకరించి నిన్ను సృష్టించాడు; తెలియక వాడు ఆనాడు నిన్నుచూసి యేవి లోపాలుగా భావించాడో అవి స్త్రీకి ప్రత్యేక ఆకర్షణీయ సొత్తులని తెలుసుకుని తన తప్పిదానికి తానే సిగ్గుపడతాడు తల్లీ.' అన్నది భూదేవి.

గర్వము సిగ్గులలో ముడుసుకుపోతూ తల్లివక్షస్సులో ముఖాన్ని దాచుకున్నది.

భూదేవివ్రాసే ప్రతివుత్తరంలోను స్వర్ణనుగురించి యెన్నోరకాల ప్రశంసిస్తూ వ్రాస్తుంది. కాని వసంతంనుంచి వచ్చే వుత్తరాలలో యెవరిని గురించీ వుండదు. ఆయన మనస్సులో వుక్కిరిబిక్కిరవుతున్న నూతన పరిశోధనల ఫలితాలను, ఆనందంతోగూడిన అభిప్రాయాలను, తాను పొందుతున్న ప్రశంసలను వరుసగా వ్రాయుటలోనే వుత్తరాలు నిండిపోతున్నవి. ఆ వుత్తరాలను చదివే ఆమె మురిసిపోతుంటుంది పొంగిపోతుంటుంది.

అంతటి విజ్ఞానవేత్తగా, నూతన పరిశోధనావిష్కర్తగా పాశ్చాత్యుల మన్ననల సందుతున్న వసంతం భూదేవిదృష్టిలో ప్రఖ్యాత పురుషుగా రూపొంది, దినదినము తేజోవంతుడగుచున్నాడు. అంతటి

ప్రఖ్యాత ఆవిష్కర్తకు కాబోవు సతీమణి యెంతటి అధునాగరిక యువతిగా వుండాలోనని వూహించినపుడు ఆమె మనస్సు తవుడున్నట్లై స్వర్ణ చదువుమీద ప్యాషన్లమీద కేంద్రీకరించింది. సంకల్పసిద్ధికొరకు మంచి నీటివలె ధనాన్ని ప్రవహింపజేశారు.

పదిసంవత్సరాలనాటి స్వర్ణకు నేటి స్వర్ణకు సంబధంలేదు. నేటి స్వర్ణ నవనాగరిక విదుషీమణి. అనేక గేములలో ఆరితేరింది. చదువుకు యెంతటయం పడుతుందో అంతకుమించి అలంకారాలకు పడుతుంది. ఇంటిలోని దాసి పద్మావతి పనికిరాక మిస్ లూసీని బొంబాయి నుంచి రెండు సంవత్సరాలనాడు పిలిపించింది బూదేవి.

స్వర్ణ పైజామా హాఫ్ షర్టు వేసినపుడు చూసి మనస్సా నొచ్చుకుంటూ 'లక్షీదేవతలాంటి బిడ్డను యీ వేషంలో యెలా చూడగల్గుతున్నావక్కా. భగవంతుడు కొందరికి సృష్టిలో లోపంచేస్తుంటే కొందరు స్వయంకృతంగా వికృతరూపాన్ని కొనితెచ్చుకోవటం యెంత హాస్యాస్పదం' అన్నది వింధ్యారాణి.

వింధ్యా నీవు నాకంటె చిన్నదానివైనా, వెనుకటికాలపు స్వభావం గనుక నీ కర్థంగాదు. ఈ అధునికయుగంలో అలంకారాలే ఆకర్షిస్తున్నవి. ఆ పరమ సత్యాన్ని తెలుసుకుంటే నీలో మనస్తాపన వుండదు.'

"అద్వితీయమైన సృష్టిలోని అందాన్ని అలంకారాలద్వారా వికృతంచేయుట వివేకంకాదు. అరుణరంగులలో మృదుత్వాన్ని వలికిస్తూ ఆకర్షిస్తున్న ఆ అధరాలమీద రంగుపులిమి పొందే అందమేమిటి ? రంగు పూతలతో అధరాలిమీది మృదుత్వపు మెరుపులు అదృశ్యమై పాలిపోయి వికారత్వాన్ని చెందాక యెవరుచూచి ఆనందించగలరు. అందం మోజులో వికారత్వాన్ని పొందువిధానమిది." అని ఆవేశంలో అన్నది వింధ్యారాణి.

"ఈ విషయాలు నీ కర్థంకావు. చెప్ప ప్రయత్నించుటకూడా వ్యర్థమవుతుంది. నీ రుచులనుబట్టే అన్నిచోట్లా వంటకా లుండవు. భుజించేవారినిబట్టి వుంటవి. స్వర్ణ వసంతానికి కాబోయే భార్య. కనుక వాడికి నచ్చేరీతిలో మెలగటమే పుత్తమమార్గం. లండన్లో అంత ఘనతగా

వుంటున్నవాడి భార్య వాడికి తగినట్లుండుటకూడా అవసరమన్నది నీ బుర్రకు తెలియకపోతే నన్నేమి చేయమంటావు చెప్పు ?"

వసంతకుమార్ తన పరిశోధనలలోని కొన్ని అంశాలలో సఫలత పొందినట్లు వ్రాసినపుడు గొప్పవిందు ఏర్పాటుచేయించింది. అన్నివేల మైళ్ళ దూరానవున్న వసంతం చేస్తున్న పరిశోధన యే సంబంధమైనదో, యే విషయంలో సఫలత కలిగిందో తెలుసుకోవాలని కొందరు విజ్ఞులు ఆశించారు. పాపం స్వర్ణ ముఖం వివర్ణత చెందింది.

పద్మ దాసి, స్వర్ణను మేనత్తయింటికి పంపినపుడు తోడుగా వుంటూ ప్రత్యేకశ్రద్ధలు తీసుకుంటుండని వెంటపంపారు. ఇరువురు సమ వయస్కులే అయినా పద్మలో వయసుమళ్లినవారి కుండవలసిన సహనము ఓర్పు లున్నవి. స్వర్ణకుమారి చిరాకులకు, వేసే మొట్టికాయలకు, తిట్లకు అలవడిపోయింది, ఎన్ని తిడుతున్నా కొడుతున్నాచెదరని గంభీరతతో సహిస్తుంటుంది. స్వర్ణకుమారికి కావలసినవి సమకూర్చుట సింగారించుట మొదలగు కార్యభారములన్నీ పద్మవే. భూదేవికి వింధ్యారాణికి పద్మ యెడల అపార ప్రేమ విశ్వాసాలు ఆదరాలు వున్నవి. కాని మిస్ లూసీ ప్రవేశంతో పద్మ కౌశల్యతకు విలువలేకుండా పోయింది. వంటశాలలో కూడా మిస్ లూసీ డైరెక్షన్ పెరిగిపోయినందున పద్మ వింధ్యారాణీ సేవవైపు మొగ్గింది, క్షణం మిస్ లూసీకి సహాయకారిగాను మరోక్షణం వింధ్యారాణి సేవలోను వుంటున్నది.

పద్మ శ్యామలవర్ణంలో బొద్దుగావుంటుంది. స్వర్ణకంటె యెత్తరి. వింధ్యవిగ్రహం, ముఖమండలం పున్నమిచంద్రాకారంలో ఆకర్షణీయంగా వుంటుంది. ఆమె నయనాలే ఆకర్షణకు కారణమంటుందిభూదేవి. తీర్చి దిద్దినట్లున్న ఆ నాసిక, చుట్టుకున్న రెండు గులాబీరేకులను జోడించి నట్లున్న ఆ అధరాలు అంత ఆకర్షణకు కారణమంటుంది వింధ్యారాణి. శ్యామలంలోనే మృదువుగా నునుపులతోనున్న ఆ విశాలపాలభాగం, కపోలాలు, చుబుకమే అంత ఆకర్షణకు కారణమంటుంది స్వర్ణ. ఆమె శ్యామలమయినా ఆమెలోని సర్వము ఆకర్షణీయమే అంటారు అందరు.

పద్మ మితభాషిణి, సేవాభావం జీర్ణించుకున్నది. ఎవరు యేది చెప్పినా ఆజ్ఞగా స్వీకరిస్తుంది. క్రొత్తగావచ్చిన బంధువులు, అతిధులు,

యింటిలోని యితర నౌకర్లు ఆమెమీద అధికారాన్ని జోరుగా చలాయిస్తుం టారు అనవసరమైన పనులను అనేకం పురమాయిస్తుంటారు. అవుసరం లేకుండానే దాహం అడుగుతుంటారు. వక్కపలుకుల సీసా కొరకని, అగ్గిపెట్టెకొరకని పదేపదే త్రిప్పుతుంటారు. కాని విసగడ విసుక్కి క్రోధము మచ్చుకుకూడా కనిపించవు. ఎదుటివారిని పరిశీలనగా యెన్నడూ పరికించదు. పనిలో లీనమై యంత్రమువలె చేస్తుంటుంది. ఆమెలో దుఃఖాన్ని చిరాకును చూడాలని మిస్ లూసీ కోర్కె. కాని ఆమె నిరాశతోనే వుండిపోయింది.

అందరికీ ఆమెయడల విశేషశ్రద్ధ, విశ్వాసము, అభిమానము లున్నవి. వింధ్యారాణికి పద్మ లేకుండా ఒక్క రోజుకూడా గడువదు.

మందమతియని, చొరవలేనిదని, వెనుకటితత్వాలు కలిగినదని, అసలైన దాస్యతత్వాలు కలిగినదిగనుక 'నేటి సమాజంలో దాసీగా వుండగల అర్హత లేదని భూదేవి నిర్ణయం. 'నేటి పల్లెటూరి ఒక అనాగరికురాలు కూడా యింతకంటె ఫ్యాషనుగా అలంకరించుకుని ఆధునికతను చాటు తుంది. ఈ వెర్రిబాగులది వసంతం స్వర్ణలలాంటి నవనాగరికులకు దాసిగా యెలా వుండగలుగుతుంది ! ఇది వింధ్యకే తగినది.' అని మనస్సులో తలపోస్తుంటుంది భూదేవి.

వసంతకుమార్ లండన్‌వెళ్ళి పదిసంవత్సరాలు దాటిపోయింది. లండన్‌నుంచి వస్తున్నట్లు ఆకస్మికంగా టెలిగ్రాం వచ్చినపుడు ఆనం దాశ్చర్యాలలో మునిగిపోయారు. అనేక చదువులు చదివి, నూతన పరి శోధనలలో పాశ్చాత్యుల ప్రశంసల నందుకున్న విజ్ఞానవేత్తయైన తమ బిడ్డ వస్తున్నాడని తెలిసినపుడు పట్టరాని సంతోషంతో వుక్కిరిబిక్కిరి అయ్యారు. స్వర్ణకుమారి అంగ అంగము విచ్చుకుంటున్నది. ఏమి చెయ్యాలో తోచక తడబడి పోతున్నది. హాలులోవున్న రౌండు టేబుల్ చుట్టూ అస్తవ్యస్తంగా వున్న కుర్చీలనుచూసి చీకాకుపడిపోతున్నది. 'ఇంతమంది నౌకర్లు యింటినిండా వ్యర్థంగా వుంటున్నారు. ఆ కుర్చీలను సరిగా పెట్టించాలన్న బుద్ధి ఆ పద్మకైనా వుండొద్దూ ! ఆ పూలదానిలో వాడినపూలు అలానే వున్నవి !' అంటూ చిరాకుపడిపోతున్నది. వసంత కుమార్ బాల్యంనాటి యెన్లార్జిచేయబడిన ఫొటో గోడమీద వక్రంగా

వుండుట చూచి చిరాకుపడిపోతున్నది. తను చిన్ననాడు నరికించివేయా లని, వసంతం వీలేదని పోరాడుకున్న ఆ రేగిచెట్టువైపు దృష్టిబడినపుడు ఆమె హృదయం నవనీతంవలె ద్రవిస్తున్నది. ఆ వృక్షంక్రింద రాలి వున్న ఆకు అలం అడుగుయెత్తున వున్నది. 'అబ్బ ! ఆ చెట్టుక్రింద యినా శుభ్రపరచలేదేమిటి ?' అని నొచ్చుకుంటున్నది.

మనస్సు ఆదుర్దాతో తికమకపడిపోతున్నది. ఒకటి చేయబోయి మరొకటి చేస్తున్నది. తన దుస్తులనుజూసి తానే అసహ్యించుకుంటు న్నది. ఏ చీరె ధరిస్తే బావుంటుందా అని ఆలోచన ఉత్సాహ ఆవేశాలలో పృథ్వీమీద పాదాలు నిలుచుటలేదు. తడబడలాడిపోతూ 'పద్మా, ఓ పద్మా వంటయింట్లోనే ప్రొద్దుగూకులూ కూర్చో!' అంటూ కేకవేసింది.

బల్లమీదున్న బ్యాట్‌ను తీసి గోడకు తగిలించాలనుకుంటూ పర ధ్యాసగా అటూయిటూ తిరుగుతున్నది.

పద్మ వచ్చి ప్రక్కననిలిచి 'పిలిచారెందు కమ్మాయిగారూ !' అని ప్రశ్నించింది.

"ఎన్నాళ్లు సర్దుకున్నా నీ పనులు నీకు తెమలవు" అని కఠిన మైన కంఠధ్వనితో అన్నది.

"చిన్నబాబుగా రొస్తున్న ఖబురు యెన్నాళ్ళకు విన్నాము. సాక్షాత్ భగవంతుడే యీ యింటికి నేడు రాబోతున్నట్లు వా రొచ్చు వేళకు యిల్లు తీర్చిదిద్దినట్లుండవద్దా, అమ్మా ! అందుకని అందరము ఆ పనులలో పడిపోయాము. కొందరు బయట బాగుచేస్తున్నారు. పూలతోట్ల లోని ఆకు అలము తీసివేసి కుళ్ళగించి నీరుపోస్తున్నారు. మేము వంట యిల్లు భోజనశాల బాగుజేస్తున్నాము. సున్నపుపనులు రంగుపనులు చాలా వున్నవి. మనుషులకు ఖబురుపంపాను రాగానే యీ హాలు, రీడింగు రూము పనులుకూడా ప్రారంభిస్తాము." అంటూ చెప్పుకుపోతుండగా స్వర్ణ మధ్యలో కల్పించుకుని తీక్షణస్వరంలో 'ఈ పనులతో యిక్కడ కూర్చుంటే వారు స్టేషనులో యెంత అవస్థ పడతారు? తీసుకొచ్చేయేర్పా ట్లేమయినా అమ్మగాని మరెవరయినా ఆలోచించారా ?' అన్నది స్వర్ణ.

పద్మ మృదుస్వరంలో 'వేలమైళ్ళ దూరానవున్న బాబుగారు రావా లనుకుని టెలిగ్రాఫ్ యిచ్చారు. టెలిగ్రాం గనుక వెంటనే అందింది. వా

రెపుడు బయలుదేరతారో, యెటువస్తారో, యే టయిముకు చేరతారో యింకా వివరాలు తెలియజేయలేదుగదా! అంత తొందరేమీ లేదమ్మాయిగారు.' అన్నది.

ఆ మాటలకు స్వర్ణ చల్లబడిపోయింది. స్థిమితపడిన మనస్సుతో యీజీచైర్‌లో కూర్చుని స్మృతులను దొర్లించుకోసాగింది.

పెరటివాకిలినుంచి లోపలికి ప్రవేశిస్తున్న భూదేవి 'పద్మా, గోడల క్రిందిభాగపు గచ్చుమీద కెంపురంగువేయిస్తానన్నావుట యెందుకు? ఆ గచ్చుభాగం కడిగి వదిలితేనే బాగుంటుంది.' అన్నది.

"కెంపురంగు డబ్బాలతో రేపుదయానికి రమ్మని ఖబురంపాను. ఆ పనికూడా రేపటికి అయిపోతుందమ్మా'

"చక్కగావున్న గోడల కిపుడు రంగులెందుకు పిచ్చిదానా!"

"బాబుగారికి నలుపంటే యిష్టంలేదు. అందుకని గోడల క్రింద భాగం అంత నలుపుగా గనిపించుట మంచిదిగాదని ఆ యత్నం పెట్టుకున్నాను."

"వాడికి నలుపుమీద అయిష్టంగాదు. నల్లటి మనుష్యులు లేకుండా అందరూ యెర్రటివాళ్ళుగా మారాలని వాని కృషి. గోడలను యెరుపు చేయను ప్రయత్నిస్తున్నావు ముందు నీవు యెరుపుగా మారను ప్రయత్నించికపోయావా పద్మా!"

ఖిన్నతతో 'నేను దాసీదాన్ని యెలావుంటే యేంబోయిందమ్మగారు.'

డబ్బాలోని జీడిపప్పును చాటలోబోస్తున్న వింధ్యారాణి 'పద్మ నలుపైనా దాని అందం అమూల్యమైంది. దాని అందానికితోడు నమ్రత సహనశీలత, నిరాడంబరత మెరుగులు దిద్దుతుంటవి. కోప మెలాంటిదో యెరుగదు. దాని కదేసాటి అక్కా,' అన్నది విధ్యారాణి.

పద్మ అధోముఖంచేసి అక్కడినుంచి వెళ్ళిపోయింది.

పద్మ తలచినట్లే హడావుడిగా పనులన్నీ రెండురోజులలోనే చక్కబెట్టారు. మిస్ లూసీద్వారా స్వాగత అర్చిలుకూడా తయారయినవి. అన్నివైపులనుంచి యింటికి నూతనశోభను సృష్టించారు. కైలాసపతి తన కోర్టు వ్యవహారాలను కట్టిపెట్టి యిక్కడే వుంటున్నాడు. స్వర్ణ సహ

బృందమంతా సోమరితనాన్ని పారదోలుకుంటున్నారు. వారి చిన్నచిన్ని కార్యాలకు సలహాలకు మంచి విలువ ప్రదర్శింపబడుతున్నది. ఏరోజు కారోజు పోస్టుకొరకు వేయికన్నులతో యెదురు చూస్తున్నారు. ఒకొక్కరోజు ఆలస్యమైనకొంది యింటిలోని అలంకారాలను దిద్ది యింకా శోభనీయం చేస్తున్నారు.

ఎదురుచూస్తూ వారంరోజులు గడిచిపోయింది. స్వర్ణ తనకు నచ్చిన దుస్తు లన్నిటిని ఒక్కటొక్కటిగా ధరించి తీసివేసింది. తిరిగి వాటిమీద మనస్సుపోక షాపులోవున్న విలువైన చీరె లన్నిటినీ తెచ్చి డ్రెస్సింగురూమును బట్టలషాపుగా తయారుచేసింది. చీరె మడతలు విప్పి నచ్చక సోఫామీద కుప్పగావేసిన చీరెలను పద్మ అతిజాగ్రత్తగా మడతలువేసి బీరువాలో సర్దుతున్నది. స్వర్ణ మిత్రురాండ్రుకూడా యెన్నెన్నో రకాల ముస్తాబవుతున్నారు. పద్మ అందరకూమించి యింటిఅలంకారాలు చేస్తున్నది. క్షణం తీరుబడిలేకుండా అన్నివైపులా మనస్సుంచుతున్నది. కాని తను సాధారణరూపంలోనే వుండిపోతున్నది. ఎల్లవేళలా తిలకం మాత్రం ఆమె లలాటంమీద ప్రతిబింబిస్తుంటుంది.

"పద్మం, ఆ చీరెలలో నీకు నచ్చిం దొకటి తీసుకుని కట్టుకో," అన్నది వింధ్యారాణి.

ఆశ్చర్యాన్ని ప్రకటిస్తూ 'ఇంత విలువైన చీరెలు నే నెపుడైనా ధరించానా అమ్మగారూ!' అన్నది పద్మ.

"అవకాశం గలిగినపుడు ధరిస్తే అపరాధం గాదులే"

"అవకాశం వున్నంతమాత్రాన అందరూ అన్నీ చేయలేరు అమ్మగారు! అవకాశమున్నపుడయినా చేయతగినవే చేయుట ధర్మయుక్తమవుతుంది.'

"అంత చాదస్తంకూడా మంచిదిగాదు పద్మా. చేయగూడనిదేమున్నది? ఆ చీరెల్లో ఒకటి ధరించ తగవా?"

"హద్దులూ అంతస్తులూ గొలుసుల్లాంటివి. ఒకదాన్ని నిర్లక్ష్యం జేస్తే ఆతరువాత అన్నీ అదృశ్యమైపోతవి. దాసీనైవుండి అంత విలువగల చీరె ధరిస్తే అందానికి, నిండుతనానికి బదులు అపోహలిలోవి

వికృత మేర్పడుతుంది. దీనత్వానికి నిడారంబరత శోభిస్తుంది. దీనత్వంలోని ఆడంబరత మానవత్వాన్నే మాయజేస్తుంది." అన్నది పద్మ.

"నీ మొండితనమే నీది" అని విసుటగా వెళ్ళిపోయింది వింధ్యారాణి.

ఒకప్రక్క పద్మ చేస్తున్న యేర్పాట్లలోను, అలంకారాలతోను మరోప్రక్క మిస్ లూసీ మార్పులతోను దిద్దుళ్ళతోను యేర్పడిన ఫ్యాషను భారతీయ పాశ్చాత్య మిశ్రమరూపం ధరించి శోభిస్తున్నవి. అప్‌టుడేట్ రూపందాల్చి వున్నతసంస్కార స్థాయిని ప్రదర్శిస్తున్నవి.

కొన్ని భారతీయ సాంప్రదాయాలలో చిక్కుకుపోయిన పాశ్చాత్య వనితగా కనిపిస్తున్నది స్వర్ణకుమారిప్పుడు. పసుపు వక్రాలుత్రిప్పి, వెనుక క్లిప్‌లో కూర్చబడినవి. మిస్ లూసీకి వాటిని సరిదిద్దుటలో విసగటలేదు. అధరాలమీద ముదురు కెంపురంగు లద్దినందున స్వతఃసిద్ధశోభను బెదిరిస్తున్నట్లున్నది. ముఖమండలానికి లేత గులాబీరంగు పవుడ రద్దినందున నయనఫలకాలు తమ కాటుకరంగును మెరిపిస్తున్నవి. ఆమె అటుయిటు కదులుతుంటే ఒక డ్రామాలోని హీరోయిన్ పాత్రధారిణిగా గోచరిస్తున్నది.

శశి కుర్చీలోనుంచి లేచి తన చేతిరుమాలుతో స్వర్ణ ముఖాన్ని అద్దుతూ 'పసడపు అద్దినందువలన మృదుత్వపు మెరుపు శోభించాలిగాని పవుడరు కోటింగుతో కప్పుకుపోవుట వికారంగా వుంటుంది' అన్నది.

"మిస్ లూసీ చేసిన మేకప్‌ను యెక్కడ వసంత దిద్దినా ఆమె నొచ్చుకుంటుంధి అందుకే నేను అద్దంలో చూచుకోవటంకూడా మానివేశాను." అన్నది స్వర్ణ.

'ఆశలోని బలం అధికమైనకొలది అందుకుచేసే యత్నాలమీద విశ్వాసం కుదురుతుంది. కాని నచ్చినా నచ్చకపోయినా వసంతకుమార్ నిన్నుచేసుకొనుట తథ్యం గనుక భయాడ్చాటం అనవసరం.' అన్నది శశి.

అవునన్నట్లు శిరస్సునూపుతూ 'అయినా నేను చేసిన ఆర్భాటాలేమున్నవి శశీ.'

"నిన్ననేగా అవుసరంలేకపోయినా అయిదువేల రూపాయల చీరెలు తెచ్చి బీరువాలు నింపింది."

హాలులో ప్రవేశిస్తూ భూదేవి 'ఇంతమందివున్నారు యెందుకు ? ఒక్కరి బుర్రయినా సరిగా పనిచేయటంలేదు. ఏమీ తెలియని పద్మ నయం,' అన్నది.

"పద్మ ఏమి చెబుతుందమ్మా !" అని ప్రశ్నించింది స్వర్ణ.

"స్టేషనులో అబ్బాయికి పూలమాలలు వేశాక అక్కడినుంచి మేళతాళాలతో వూరేగింపు చేస్తూ తీసుకొస్తే బాగుంటుందన్నది."

"నిజమే మంగళవాయిద్యాలతో వస్తే బాగుంటుంది" అన్నారు అందరు.

"ఏరోజు కారోజు ఖబురులేకుండా వున్నది. ఎపుడొచ్చేది తెలియదుగదా యేమిచేయటానికయినా," అన్నాడు కైలాసపతి,

అందరిలోని వుత్సాహము వెలవెల బోయింది.

ఆదుర్దాలలో పదిరోజులు గడిచిపోయినవి. సనాయి, బ్యాండు మేలగాళ్ళుకూడా పగలు రాత్రి వేచివుంటున్నారు. వచ్చినా రాకపోయినా మర్యాదలు ఆదరాలు అన్నీ లభ్యమవుతున్నవిగనుక విసగటకుబదులు ఆనందమే కనిపిస్తున్నది. ఎప్పుడు ఎక్కడ యేరూపంలో యేమి జరిగింది మొదలగు వింతలు విశేషాలు అందరిలో చర్చనీయాంశాలుగా జరుగుతున్నవి. కాలక్షేపం బాగానే జరిగిపోతున్నది. స్వర్ణ, శశి, కస్తూరి, లూసీలమధ్య క్యారంబోర్డు టక్‌టక్ లాడుతున్నది. కస్తూరి పక్షంలో నున్న స్వర్ణ 'నీవు చెప్పుడుమాటలు వింటూ ఆట చెడగొడుతున్నావు కస్తూరి.' అన్నది.

చెప్పుడుమాటలు యెప్పుడూ చెరుపన్నది యధార్థసత్యం.. కాని చెప్పేవారు క్షేమంగోరి చెబుతున్నపుడు వినక తప్పదుగదా ! నీవు మనస్సులేక చెడగొడుతున్నవిషయం గుర్తించు," అన్నది కస్తూరి.

కస్తూరికి ప్రక్కనుండి సలహాలిస్తున్న కైలాసపతి మందహాసం చేస్తూ 'అపునులే వుచితసలహా యెంతవిలువైనవయినా తుస్కారించబడుట సహజము' అన్నాడు,

"అందుకే మీ కోర్టులలో గెలిచినా వోడినా ఫీజులు ముందు వసూలు చేసుకుంటారు. ఫీజు ప్రధానం...." అని యింకేమో అనబోతుండగా సైకిల్ మీదనుంచి దిగిన పోస్టుమాన్ 'టెలిగ్రామ్' అన్నాడు.

క్యారంబోర్డు దిక్కుమాలిందిగా అక్కడే వుండిపోయింది. ఎక్కడివాళ్ళక్కడ హడావుడిగా అంగలు వేసుకుంటూ బయటికొచ్చారు. కైలాసపతి టెలిగ్రాం తీసి చదువుతున్నాడు. 'ఇంతకుముందే విమానం నుంచి వైజాగ్‌లో దిగాను, ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణమై వస్తున్నాను.' అని టెలిగ్రాంలో వున్నది.

ఉత్సాహంలో స్వర్ణను తమ కౌగిట బంధించి పైకియెత్తారు శశి కస్తూరిలు. ఆమె కిలకిల నవ్వుతూ 'వుండండోయ్' అని ప్రార్థిస్తున్నది.

మేళతాళగాళ్లు యే ముహూర్తంకొరకు వేచివున్నారో ఆ ముహూర్తం ప్రవేశించినట్లు వుత్సాహభరితులై తమ వాయిద్యాలను మ్రోగించసాగారు.

వసంతకుమార్ వచ్చాడుగావోలునని లోపలినుంచి యిరుగు పొరుగునుంచి జనం గుమిగూడారు. వింధ్యారాణి జనంలో వెదుకుతున్నది.

"ఏమిటి, ఏమిజరిగింది?" అని భూదేవి కేకలుపెడుతున్నది. ఆనందపరవశంలో, వాయిద్యాలమధ్య ఒకరుచెప్పేది ఒకరికి వినిపించటలేదు. పరువులెత్తుకుంటూ వచ్చిన పద్మ అటుయిటు పరికించి వాయిద్యాలవారివైపు వెళ్ళి ఆపించింది.

ఎక్స్‌ప్రెస్ 12 గంటలకొస్తుంది. ఆ బండిలోనే వస్తాడు వసంతకుమార్. అందరిలోనూ నూతనోత్సాహం బయలుదేరింది. వాయిద్యగాళ్లను స్టేషనుకుపోయి వుండమన్నాడు కైలాసపతి. భూదేవినిగూడా స్టేషనుకు తీసుకెళ్ల ప్రయత్నించాడు. 'ఇక్కడ నేను లేకపోతే ఏర్పాట్లు సరిగా జరుగవు. మీరందరు స్వర్ణకు తోడుగా వుండగా యింకా లోటేముంటుంది పోండి నాయనా.' అన్నది.

మిస్ టూసీ, పద్మలు వంటశాలలోనే వుండిపోయారు.

ప్లాట్‌ఫారంమీద పెట్టెలతోను బెడ్డింగులతోను మూటలతోను వున్న జనం అధికంగానే వున్నది. కాని నిరీక్షణలో ప్రతిముఖము విసగట చెందినట్లు గనిపిస్తున్నది.

స్వర్ణకుమారి మిత్రబృందంతో వచ్చి గంట దాటిపోయింది. ఖబుర్లు వినగల వుత్సాహంకూడాలేదు.

కైలాసపతి గడియారంచూస్తూ 'టయం 12-30 అయింది. ఇక బండికి 20 నిమిషాలే టయముంది,' అని వుత్సాహ పరచ ప్రయత్నించాడు.

"ఆ బోర్డుమీద మళ్ళీ లేటును దిద్ది పెంచాదేమో," అన్నది కస్తూరి.

"అవును అదీ నిజమే, ఆబోర్డును చూదాము" అంటూ అందరూ బోర్డువైపు నడిచారు.

ఉత్సాహితుడై, 'మార్పులేదు. 20 నిమిషాలలో బండి వస్తుంది,' అన్నాడు కైలాసపతి.

"లేటును దిద్దటానికి యింకా చాలా టైముందిగదా!" అని వెటకారంగా అన్నది స్వర్ణ.

మొదటిగంట మ్రోగింది.

"ఇకనైనా ధైర్యం కలిగిందా," అన్నాడు కైలాసపతి.

"ఈ గంటనుమాత్రం యెలా నమ్మటం," అన్నది శశి.

రెండోగాంట మ్రోగింది.

"బండి వస్తున్నది, అ-గో, అదిగో!" అంటూ రైలుపట్టాల మీదకెళ్ళి చూస్తున్న పిల్లలు కేకలు పెడుతున్నారు.

ఒకర్ని ఒకరు పడదోసుకుంటూ సామాన్లతో కదులుతున్నారు ప్రయాణీకులు.

స్వర్ణ కైలాసపతి వగైరాలుకూడా ప్లాట్ఫారం అంచువైపు కెళుతున్నారు. పూలమాలలున్న బుట్టలను తెమ్మని నౌఖరిని కేకలు పెడుతున్నది కస్తూరి.

బండి వచ్చి ఆగింది. స్వర్ణ పాదాలు భూమిమీద ఆనుటలేదు. ఒకటోతరగతి పెట్టెకోసంకు వెదుకుతున్నారు. అది స్త్రీల పెట్టె. వెంటనే ఆతురతతో ముందుకు నడిచారు. పాశ్చాత్య భాషనులో దిగిన ప్రతి ఒక్కరిని ఆమెరనదానిపలె చూస్తున్నది స్వర్ణ. రెప్పవాల్చనంత శ్రద్ధతో తీక్షణదృక్కులతో బండి అంతా వెదికి నిరాశచెందిపోయారు. వారు చూస్తూచూస్తుండగానే యక్స్ప్రెస్ కదిలి వెళ్ళిపోయింది! వారి ప్రాణాలను ఆ బండి దొంగిలించు కెళుతున్నట్లు దానిపైపే దీనదృక్కులలో

చూస్తున్నారు, ఏ బండికొరకు యింత నిరీక్షణ చేశారో ఆ బండి వచ్చింది, వెళ్ళిపోయింది. ఎవరిలోను మాట పలుకులేదు. దీర్ఘనిట్టూర్పులు ఢీకొంటున్నవి.

ఓ బల్లమీద కూలబడిపోయింది స్వర్ణ.

ప్రక్కగా కూర్చుంటున్న కస్తూరి 'వారి కీబండి అందలేదేమో!' అన్నది.

"తరువాత బండి యెన్నిగంటల కున్నదో?" అని శశి ప్రశ్న.

"ఏరోడ్రోంలో దిగగానే టెలిగ్రాంయిచ్చి వుండవచ్చు. కాని, ప్రయాణబడలికవలన యీ బండిని అందుకోలేకపోయారేమో!" అని కైలాసపతి వూహ.

చేతులమీద శిరస్సును వాల్చుకున్న స్వర్ణ మరో నిట్టూర్పును విడచింది.

"ఈ పూలమాలలను యేమి చేయమంటారు అమ్మాయిగారు," అని ప్రశ్నించాడు నౌకరు.

"నీ మొఖానికేసి కొట్టుకో," అని చిరాకుపడింది స్వర్ణ.

బాజాభజంత్రీల తాలూకు మనిషి వచ్చి 'అమ్మాయిగారు, బండి పోయిందిగదా!' అన్నాడు.

"నీవుకూడా అందులోయెక్కి పోకపోయినా," అని ధూత్కారించింది.

ఆలోచనలుచేసిచేసి ఒక నిర్ణయానికొచ్చిన కైలాసపతి 'తిరిగి బండి రాత్రి యేడు గంటల కున్నది. కనుక మనం యింటికివెళ్ళి, తిరిగి ఆరుగంటలకే యిక్కడికి చేరదాం,' అన్నాడు.

"అవును, యీ అభిప్రాయం బాగుంది. 7 గంటల ప్యాసింజరులో తప్పకవస్తారు," అని సమర్థించారు శశి కస్తూరీలు.

"వెళదాం పద స్వర్ణా," అన్నాడు కైలాసపతి.

"6 గంటలకు తిరిగివచ్చేబదులు నేను యిక్కడే వుంటాను మీరు వెళ్ళిరండి," అన్నది నిరాసక్తతతో బరువుకంఠంతో.

"వైజాగ్‌చేరిన వసంతకుమార్ రాక యెక్కడికి పోతాడు. అంత నిస్పృహతో దిగాలుపడిపోతావెందుకు స్వర్ణా." అన్నాడు కైలాసపతి.

ఆ మాటకు యెదురు పలుకజాలకగా బోలు లేచి బయటివైపు పిల్లి అడుగులు వేయసాగింది. అదురుతున్న పాదాలు హిల్ బూటునుంచి జారిపోతవేమో ననిపిస్తున్నది.

పూలబుట్టను తిరిగి కారులో పెట్టారు. వాయిద్యగాళ్ళను యింటికి చేరమని ఆదేశించారు.

కారు యింటిముందొచ్చి ఆగింది. అందరూ దిగారు. కాని స్వర్ణ మోకాళ్ళమీద శిరస్సుంచి అలానే వుండిపోయింది.

"దిగు స్వర్ణా" అన్నది శశి. ఆ మాట స్వర్ణకు వినిపించిందో లేదో తెలియదు.

"అంత బేలపోగూడదు స్వర్ణా, తిరిగి స్టేషనుకు నాలుగింటికే వెళ్ళి కూర్చుందాము. పాసింజరులో తప్పకవస్తారు, లేచిపద, యింట్లోకి వెళదాం," అంటూ భుజస్కంధాలమీద చేయివేసి లాగింది శశి.

స్వర్ణ మోకాళ్లమీద మోటించిన శిరస్సు పైకెత్తింది. అశ్రుబిందువులు బొలబొల దొర్లుతున్నవి. శశి వెలవెలబోయింది. మనస్సు ద్రవించింది. కారు దోరుతీసి స్వర్ణప్రక్కన కూర్చుని, ఆమె శిరస్సును వక్షస్సుమీదవేసి అదుముకుంటూ, అశ్రువులను అద్దుతూ 'కన్నీరు కార్చవలసిన అవసరమేమిటి చెప్పు ? అబ్బ ! వూరుకో స్వర్ణా.' అని బుజ్జగిస్తున్నది.

పసిపాపవలె స్వర్ణ ఆమెకు కరుచుకుపోయి, ధైర్యాన్ని పూరించుకుని, 'ఎందుకో నామనస్సంతా వికలం చెందింది. తెలియకుండగానే కన్నీరు కారుతున్నది. తిరిగి నాలుగుగంటలకే స్టేషనుకు వెళదాం శశి,' అన్నది.

శిరస్సుమీద చేయివేసి నిమురుతూ 'అలానే వెళదాం తప్పక ఆ బండికి వస్తారుగా,' అంటుండగా పద్మవచ్చి కారులో తొంగిచూస్తూ, మందస్మితవదనంతో 'అమ్మాయిగారూ, మీరింకా దిగకుండా కూర్చున్నారేమిటి ? రండి !' అన్నది.

ఆవెడ సంతోషాన్నిజూచి వోప్రక్క క్రోధమూ మరోప్రక్క అర్థంగాక సిగ్గు పెనవేస్తున్నవి. ఏమి అడగను చెప్పనుకూడా మనస్సు బోవక వెలవెల బోతూ యిరువురూ దిగి పద్మవెంట నడుస్తున్నారు.

ఇంటిలోపల అంతా కోలాహలంగావుంది. అందరి ముఖాలలోను నవ్వులు చిందిస్తున్నవి. సమూహంమీద సంతోషం తరంగాలవలె వూగు లాటలతో పరుగులెడుతూవున్నది.

కూడిన జనమంతా రెండోవైపునుంచి వేడుకగా యేవో చెప్పు కుంటూ లోపలివైపు చూస్తున్నారు. హాలులో ఒక యీజీచైర్‌లో లాల్చీ దోవతి ధరించిన ఒక సర్వసాధారణవ్యక్తి వున్నాడు. ఆయనముందు నిలిచి మిస్ లూసీ యేదో వివరిస్తున్నది.

హాలులో ప్రవేశిస్తున్న స్వర్ణనుచూసిన లూసీ ఆనందాన్ని అణచు కుంటూ 'క్షమించండి, ఒక్క నిమిషంలో వస్తాను,' అని యీజీచైర్ లోని వ్యక్తి అనుమతిపొంది, టక్‌టక్ యెదురొచ్చి, స్వర్ణను ప్రక్క వాకిలినుంచి టాయిలెటింగ్ రూముకు తీసుకెళ్ళి 'మీ రెవరికొరకు యింత ఆర్భాటంగా వెళ్ళారో ఆయన మామూలుగా రిక్షాలో వచ్చారు. మీరేమో అక్కడే వుండిపోయారు. ఆ కుర్చీలో కూర్చున్న మీ బావ గారిని గుర్తించలేదు ?' అన్నది లూసీ.

స్వర్ణ ఆశ్చర్యానికి అంతులేదు. కొన్ని క్షణాలుగాదు నిమిషాల వరకు చైతన్యమే లేనట్లుండిపోయింది. ఆమె చెదరిన శిరోజాలను సరి దిద్ది, అన్నివైపులనుంచి అలంకారాలను సవరించింది. నలిగిన చీరెను తీయించి మరో విలువైన చీరెను ధరింపజేసింది. నాలుగురకాల సెంట్లను మిశ్రితంచేసి చీరెకు జాకెట్టుకు పులిమింది. పవడరు తిరిగి అద్ది తుడిచింది.

ఇంతవరకు స్వర్ణనుంచి మాట పలుకు లేదు. 'ఇక పద' అన్నది లూసీ.

"మాకు తెలియకుండా, మమ్మ చూడకుండా యెలా వచ్చారు ?" అని ప్రశ్నించింది.

మామూలుగానే దిగి రిక్షాలో వచ్చారట. వారు స్టేషనులో మిమ్మ గమనించలేదట. మీరు యూరపుఫాషనులో దిగే దొరగారికొరకు వెదుకు తుండాలి," అన్నది లూసీ.

ఆయనంత సామాన్యుడుగా వున్నాడేమిటి ? అంతటి గొప్ప విజ్ఞానవేత్తగా, ఆవిష్కర్తగా తెలుసుకున్నది. వూహించినవన్నీ

యేమిటి? ఇంతదీర్ఘకాలం యీరపులో యీ రూపంలోనే గడిపాడా? ఇలాంటి ఆమె ఆలోచనలకు తోచక అర్థంగాక అయోమయంలో పడి పోయి వెర్రిదానివలె లూసీ చెప్పినట్లు చేస్తున్నది.

"అమ్మాయిగారూ," అంటూ సన్నని గొంతుకతో పిలుస్తూ పద్మ వచ్చి, కారులోనుంచి తెచ్చిన పూలమాలలు వారిచేతి కిస్తూ 'మేలగాళ్లిపుడే చేరుతున్నారు. వారు వాయిద్యం ప్రారంభించగానే మీరు వెళ్ళి బాబుగారికి దండ వేయండి.' అని పురమాయించి, యెదురుచూపు లేకుండా వెళ్ళిపోయింది.

క్షణంలో సనాయివాయిద్యం ప్రారంభమైంది. పూలమాలలతో వస్తున్న స్వర్ణనుచూచి వసంతకుమార్ లేచి. చిరునవ్వును చిలికిస్తూ నిలిచాడు.

ఆమె హారాన్నివేసి చేయిచాపింది. తన హస్తద్వయంతో పట్టి వూపుతూ 'మూఁ' అంటూ మురిపెపు దృక్కులతో ముంచెత్తించాడు.

వెనుకగా వచ్చిన పద్మ కర్పూరంలో వెలుగుతున్న తన చేతి లోని పళ్ళెరాన్ని స్వర్ణవైపు పెడుతూ సన్నని గొంతులో 'బాబుగారికి దిష్టితీసి బొట్టుపెట్టండి,' అన్నది.

స్వర్ణ తన ముఖాన్ని వికృతం చేసుకుని. ఆ పళ్ళెరాన్ని పద్మ వైపుకే నెడుతూ 'నీ హాస్తం చాల్లే తీసుకెళ్ళు' అంటూ రుసరుస లాడింది.

పద్మ ముఖంలో మలినరేఖలు అలుముకుంటున్నవి. కాని చిరునవ్వును ప్రదర్శించాలని ప్రయత్నిస్తున్నది. అది గమనించిన వసంత కుమార్ వెంటనే కల్పించుకుని ఒక్కఅడుగు పద్మవయిపుకు వేసి 'పోనీ, నీవే దిష్టి తీసివేయి' పద్మా అన్నాడు.

పద్మ తడబడుతూ పళ్ళెరాన్ని మూడుమారులు ఆయనవముందు త్రిప్పి, స్వర్ణవయిపు చూస్తున్నది. వసంతకుమార్ విజ్ఞానంద్వారా నిండైన మానవత్వాన్ని పొందినవాడు, కర్తవ్యజ్ఞానం కలిగినవాడు, పటాటోపాలకు ఆర్భాటాలకు అతీతుడు. నిర్మల నిస్వార్థ ఆదరం పవిత్రమైంది ఆయనదృష్టిలో. వెంటనే పద్మ కుడిచేతి బొటనవ్రేలిని పట్టుకుని సింధూరంలో అద్దించి తన నొసట దిద్దించుకున్నాడు.

పద్మ ఆయన ముఖంవయిపు చూడగల సాహసంలేక గడగడ వణికి పోతున్నది. నిత్యమువలె సామాన్యదుస్తులు ధరించి, శిరోజాలను దూముడి వేసుకుని, అలంకరణ నామమాత్రంగానైనా లేకుండా పిచ్చి దానివలె సామాన్య రూపంలో నున్నది. అలాంటి ఆ వెర్రిదానిచేత అంతటి మహాయోధుడు తిలకం అద్దించుకున్నందుకు, అందరు విస్మిత రూపంలో చూస్తున్నారు.

ఈవార్త ఫలహారాల యేర్పాట్లలోనున్న భూదేవికి, వింధ్యారాణికి తెలిసినపుడు స్వర్ణయెడల ఆవేశపడ్డారు. స్వర్ణే, అలాచేసి వుండవలసిం దన్నారు. కమదాసీ పద్మద్వారా జరిగిందిగనుక మంచిదేనని తిరిగి సమర్థించుకున్నారు. పద్మ పిచ్చిదానివలె మెలగినా ఆ అమాయ కత్వంలోకూడా నేర్పు వున్నదనుకున్నారు.

2. స భ్య త

డైనింగుహాల్‌లో అంతా లూసీ దర్శకత్వంతో యేర్పాట్లు జరిగి నవి. పాశ్చాత్య పద్ధతిలోనే అన్నీ అమర్చబడినవి.

భూదేవి డైనింగ్‌హాలుకు అందరను ఆహ్వానించింది. అపె ఆశించినట్లే వసంతకుమార్ ప్రక్కన స్వర్ణ కూర్చున్నది. ఆమె ప్రక్క లూసీ చూర్చున్నది. కేకులు, బిస్కెట్లు, సొమాసులు, ఆమ్లెట్లు, కట్ లెట్లు, జీడిపప్పులు మొదలగు అనేకం సాసర్లలో నింపి అమర్చబడినవి.

అందరూ ఫలహారం చేస్తున్నారు. కాని వసంతకుమార్ ఒక్కొక్క జీడిపప్పు తీసుకుంటూ నటన చేస్తున్నాడు. దేనికొరకో యెదురుచూస్తున్నట్లుకూడా తోస్తున్నది.

"నీ నటన మా పాలిటి అన్యాయమవుతుంది వసంతం," అన్నాడు వుండబట్టలేక కైలాసపతి.

"ఆదేమీలేదు, ఇడ్లీ కందిపచ్చడి రుచిచూసి యెంతకాల మయిందో! అందుకు మనస్సు పీకుతూ ఏటిమీదకు పోనటంలేదు," అన్నాడు.

స్వర్ణ హృదయానికి గతుక్కుమనిపించింది. ఇడ్లీలు, దోసెలు కూడా వుండాలని పద్మ ప్రతిపాదించింది. ఇడ్లీ సాంబార్ కొరకు తపించే అనాగరికత ఆయనలో యింకా వుండదులే. అని తానే మందలించింది.

రవ్వదోసె, కొబ్బరిచట్నీ వున్న ప్లేటులు తెచ్చి ముందుంచుతూ 'నీకు ఆరోజుల్లో యేవేవి యిష్టమో వాటన్నిటిని గుర్తుంచుకున్నది పద్మే. మేము నిన్ను గురించి వూహించే విధానంలో నీతోపాటు అన్నీ మారి దొరలలో కలిసి అప్పుడు దొరగానే వస్తావనీ, ఆ అభిరుచులతోనే దిగుతావనుకున్నాము. కాని నీలోని ఆనాటి మొండితనము, గద్దరతనము, ఆవేశము, ఆర్భాటము, దర్పము అదృశ్యమై, సాధుత్వము, సజ్జనత్వము నిండుతనములతో సామాన్యరూపమే ధరించి వచ్చావు. నీకుకాకపోతే నాకైనా అవసరమని యీ రవ్వదోసె కొబ్బరిచట్నీ పద్మ తయారుచేసి వుంచిందట. దాని మందబుద్ధే వుపకరించింది. తిని చూడు బాబూ.' అన్నది భూదేవి.

ఫలహారంచేస్తూ 'ఆ కేకులు బిస్కట్లూ బాగుండొచ్చు కాని యింతటి స్వాదిష్టమైన కమ్మటి మన పదార్థాల నెలా మర్చిపోగలమమ్మా, నేతితో తయారయిన యీ రవ్వదోసె కొబ్బరిచట్నీ ఒకసారి భుజించాక. ప్రపంచంలో యేమూలకెళ్ళినా యీరుచిని స్మరిస్తుండవలసిందే,' అంటూ యెంతో ఆప్యాయంగా భుజించాడు. పద్మ తెచ్చిన మరో అట్టుకూడా స్వీకరించాడు.

చిక్కటి పాలతో తయారుచేసిన కాఫీకప్పులు సాసర్లు అందరికీ అందించబడినవి.

"కాఫీ నాకు అలవాటులేదే. పాలుంటే తెచ్చిపెట్టు పద్మా," అన్నాడు.

ఆ పలుకులలో తెలియని తీయదనమేదో పద్మ హృదయాన్ని రాగరంజితం చేసింది. ఒకసారి ఆయనవైపు చూస్తూ వుండిపోయింది. తనకు నచ్చిన సన్నిహితమైన సాధుత్వస్వభావమేదో ఆయనలో వున్నట్లు వుల్లాసభరితురాలైంది. వెంటనే వెళ్ళి పాలలో గ్లూకోస్‌వేసి తెచ్చింది.

"ఇంతకాలం అంత చలిదేశంలో వున్నావు' కాఫీ యెలా మానే

కావు నాయనా ?" అన్నది భూదేవి.

"కాఫీద్వారా పోయేవరి వేడిపాలవ్వాళ్నైనా పోతుందిగదా !"

"స్వప్న కాఫీ రోజుకు పదినూరుసార్లైనా త్రాగవలసిందే. ఒకపూట భోజనం మానమంటే సంతోషమేగాని కాఫీ ఒకపూట మానమంటే నా వల్లగాదు. ప్రాణమేపోతుం దంటుంది నాయనా."

"అది కేవలం మానసిక బలహీనత." అని సామాన్య ధోరణిలో అన్నాడు.

స్వప్న ముఖం మారిసమయింది. మరెవరైనా ఆమాట అనివుంటే యుద్ధానికిదిగి నోరు మూయించివుండేది. చాదస్తాన్ని కట్టిపెట్టమని అరిచేది. నాలుగు దబాయింపులతో కాఫీ త్రాగించివేసేది. ఆ మాట వసంతకుమార్‌నుంచి మామూలుధోరణిగా వచ్చిందిగనుక మాట్లాడజాలక కోరగా చూస్తూ కించ చెందుతున్నది.

"కాఫీ అలవాటు మానసిక బలహీనత అంటున్నావు. కాఫీ అలవాటు ఆకలిని చంపివేస్తుంది. ఆరోగ్యాన్ని నాశనం చేస్తుందని పద్మ అంటుంది. అది యెన్నడూ గ్రుక్కెడు కాఫీ త్రాగదు. అందరూ కాఫి త్రాగునపుడు అది గ్లాసుడు మజ్జిగ త్రాగుతుంది."

పద్మను పరిశీలనగా చూడ ప్రయత్నిస్తూ 'అవును ఆమాట నిజం అమ్మా. కాఫీ త్రాగుట బలహీనతగాదు. అలాంటి ఒక అలవాటుకు దాసులై పోవటం మానసికబలహీనతను సూచిస్తుంది. మజ్జిగ చాలా శ్రేష్ఠమైంది, వాటి విశేషం తెలుసుకున్నప్పుడు అవే త్రాగాలనిపిస్తుంది వాటి విశేషం తెలుసుకున్నపుడు అవే త్రాగాలనిపిస్తుంది. కాని నీ వన్నట్లు అక్కడ చలిబాధ యెక్కువ, కనుకనే అక్కడవి పనికిరావు.' అన్నాడు.

భూదేవి విస్మూపడుతూ 'మజ్జిగలో అంత గొప్ప గుణముందని ఆ పిచ్చిబాగులదానికేమి తెలుసురా !' అన్నది.

"కొన్ని కొన్ని గొప్ప విషయాలు సామాన్యులు అనుభవంలో అర్థం చేసుకుని ఆర్భాటం లేకుండా అనుకరిస్తారు"

"నీవు తెలుగు మర్చిపోలేదు, స్వల్పయాస కనిపిస్తుంది, ..." అన్నాడు కైలాసపతి.

"తెలుగుభాషను మర్చిపోతే మిమ్మలనే మరిచిపోయి వుండే వాడిని గదా !" అని హాస్యంగా అన్నాడు.

ఫలహారాలు ముగించుకుని మెయిన్‌హాలులో ఆసీనులయినారు. పద్మ గాబోలు లోటోన్‌లో రేడియోపెట్టి వెళ్ళింది. భానుమతి ప్రారంభపురోజులలోని పాట గాబోలు వినవస్తున్నది. రికార్డు పాతదయినందునేమో స్పష్టంగా వినిపించుటలేదు. ఆ పాటలోని కమనీయత చెదిరి పోతున్నది.

కస్తూరి సరసరవెళ్ళి రేసియోను ఆపి వచ్చి 'మా శశి బాగా పాడుతుంది ఒకపాటపాడుతుంది. వినండి.' అన్నది.

ఎన్ని విధాల ప్రాధేయపడినా శశి సిగ్గునుంచి బయటపడలేకపోయింది. కస్తూరే మధురమైనధ్వనిలో పాట ప్రారంభించింది.

నేడీ లోకంలో నీతికి విలువేలేదా !
సభ్య సంస్కారాల హోరులో
దానధర్మాల మరుగులో
జరిగే పాపాలకు శిక్షే లేదా !

అజ్ఞానలే ఆశయాలై
ధనధాన్యాలే సర్వంబై
చేసే మోసాలకు శిక్షే లేదా !

....
....
....

సన్నటి స్థాయిలో శ్రావ్యంగా పాడింది. పాట బాగుండలేదుగాని రాగం చాలా బాగుం దన్నారు కొందరు. అది పాటగాదు ఏదో సంకేతంతో నోటికొచ్చిన మాటలకు రాగాన్ని కల్పించి పాడింది, అన్నారు కొందరు. 'పదకూర్పులలో సంయమం లేకపోయినా. భావము అంతకంటె మంచిరాగము బాగున్నది.పాటలోని శ్రావ్యత ముగ్ధపరుస్తున్నది. ఆకర్షణే కళా విలువకు పడికట్టురాళ్ళుగదా ! కస్తూరీదేవికి నా ధన్యవాదాలు' అన్నాడు వసంతకుమార్.

అందరిలోను వుత్సాహం పొదిసూపింది. ఇకనైనా పాడవోయి శశీ,' అన్నది కస్తూరి.

వెంటనే శశి శ్రీకృష్ణలీలలలోని ఒక మధురమైన పాట పాడింది. తన్మయత్వంతో ప్రతిఒక్కరు తలలూపసాగారు. క్షీరసాగరతరంగాల మీద తేలియాతున్నట్లున్నది. పాట ఆపినపుడు గగనయానంలో విహరిస్తూ అకస్మికంగా పృధ్విమీద పడిపోయినట్లున్నది.

"మనస్సును కదిపివేశావు శశీ। హిందూకవుల స్థాయి ప్రపంచంలోనే విశిష్టమైంది. భక్తిలో శృంగారరసాన్ని నింపారు. అందుకే మన భక్తిస్తోత్రాలలో పరవశం వేసే మాధుర్యముంటుంది. ప్రత్యేక ఆకర్షణుంటుంది. భక్తిసాగరంలో శృంగార నావయాత్ర సాగించుట. పట్టామీద నడచు రైలు యాత్ర లాంటిది. అవలీలగా ఆత్మార్పణ చేసుకుని వ్యక్తిత్వాన్ని కోల్పోయి. లీనమై పూర్ణత్వాన్ని పొందుట కిది అనువైన ఆకర్షణీయమైన మార్గము. అందుకే హిందూసాహిత్యం. హిందూ సంగితం మహోన్నత స్థాయికి చెందినటువంటివి. శశీ। నీవు పాడిన ఆ చిన్ని పాటలో యెన్నివైపుల లోతులు స్మృతులమీద మీటుతూ నూతనత్వాన్ని చిత్రిస్తున్నవో చూడు। కవిత్వంలోని మాధుర్యాన్ని భక్తిలోని పారవశ్యాన్ని. తాత్వికంలోని ఆధిక్యతను శృంగారంలోని సౌకమార్యాన్ని విస్పష్టరీతిలో ప్రదర్శిస్తున్నవి. ఆయావత్తను నీ రాగయుక్త సంగితంలో పలికించిపుడు అపూర్వమైన అద్భుత సృష్టి యేర్పడుతున్నది" అన్నాడు వసంతకుమార్.

అందరూ విస్మితులై చూస్తున్నారు. ఆ సంగీతంకంటె పాటలోని భావంకంటె ఆయనచేసిన వ్యాఖ్య. తీర్పు వారిని ఆశ్చర్య పరుస్తున్నది. భారతీయసాంప్రదాయాలలో పండిపోయినవాడో. సంస్కృత సాహిత్య మోజులో జీవితం తరింపజేసుకున్నవాడో, జీవితరహస్యాన్ని తరచిచూచినవాడో యివ్వవలసిన నిర్ణయాన్ని వ్యక్తపరచినట్లు అందరూ అభిప్రాయపడ్డారు.

భూదేవి, వింధ్యారాణీలు సంస్కారము, వివేకవిజ్ఞానములతో గూడిన అనుభవము గలవారు. తమ బిడ్డ స్వభావం తెలుసు. విదేశంలో వుంటూ గొప్ప కార్యదీక్షలో నిమగ్నుడై వేలకువేల ధబ్బును కోరి తమ

ద్వారా పొందుతూ మితిమించిన వ్యయంతో గడుపుతున్నవాడు తెల్లదొరలకు మించిన ఫ్యాషన్లతోను ఖర్చులతోను అలవడి వుంటాడని, దొరలకుమించిన డాంబికంగాను, అంతస్తుగాను, సామాన్యతకు అతీతంగాను వుంటాడని వూహించారు. అది ఘనమైందిగా తలంచి అందుకనువైన వాతావరణాన్ని సృష్టించను ప్రయత్నించారు. వారి ఆరూప అభిప్రాయాల ప్రోత్సాహంతోనే స్వర్ణ ఆంగ్లేయ భాషనులలో తయారై కూర్చున్నది. ఆమె యూసీవలె ఆంగ్లేయ వుచ్చారణకు అలవడింది.

కాని నేడు వసంతకుమార్ సమక్షంలో తమలోతామే సిగ్గిలుతున్నారు. తమ బిడ్డ డాంబికాలతోను, దర్పాలతోను, పటాటోపాలలోను, వేషభాష ప్రదర్శనలతోనుగాక యదార్థ రూప విజ్ఞాన నిధిగా వచ్చినట్లు తెలుసుకుని వోప్రక్క ఆత్మతృప్తి నొందుతున్నారు. మరో ప్రక్క తమ వూహలు తలక్రిందులైనందుకు బిడియపడుతున్నారు.

వసంతకుమార్ విజయనగరం చేరి నెలరోజులు గడిచిపోయినవి.

మేము యెంత ప్రయత్నించినా నీకు నచ్చని ప్రతి విషయంలోను చీకాకుపడి చీదరించుకుంటావని నీవు యేమి కోరితే యెలాచేస్తే నచ్చుతుందే అలాచేయుట మావల్లకాదేమోనని. స్వర్ణ యింత తర్ఫీదులో ఆరితేరినా నీ ఫ్యాషన్లముందు తృణప్రాయమవుతుందని యెంతో భయపడిపోయాము. ఈ చాదస్తపు పద్మ నీ కంటపడితే అసహ్యించుకుంటావని, అది మీకు దాసీగా వుండగల అర్హత లేదని. దాని యెడల జాలికూడా చెందాము. కాని నీవందుకు భిన్నంగా విచిత్రంగా గోచరిస్తున్నావు. నీలోని ఆనాటి కోపతాపాలు కనిపించకుండా పోయినవి. ఏమి చెప్పినా విని ఆనందపడుతున్నావు. ఎలాంటిభోజనమైనా కావలసినంత వరకు స్వీకరించి మవునం ధరిస్తున్నావు. ఏవంత వ్యతిరేకతను ప్రకటించవు. కలలోకూడా జరుగని మార్పు జరిగింది. ఇది ఒకప్రక్క తెలియని బాధనుకూడా కలిగిస్తున్నది నాయనా. నీ సహనము మవునము వినయము నీ వాంఛలను తెలియకుండా చేస్తున్నందుకు గా[illegible]లు మాతృ హృదయాలకు ఏదో యెక్కడి కక్కడ లోపించినట్లు కొరతగా గనిపిస్తున్నది నాయనా.' అన్నది భూదేవి.

ఆయన గలగల నవ్వుతూ 'ఆనాడు తెలియక మిమ్ము అనేక విధాల బాధించవచ్చు, యీనాడు మీ మనస్సులను నొప్పింపజేయుట విజ్ఞత కాజాలదుగదా, అమ్మా!' అన్నాడు వసంతం.

"నీవు ప్రతి విషయంలోను తగాదాబెట్టి వేధించినపుడున్న తృప్తి నేడెందుకో కలుగుటలేదు బాబూ."

"అది మానవ స్వభావ విచిత్రతతప్ప మరేం లేదు."

ఆమె మారు మాటాడలేక చూస్తూ వుండిపోయింది. సాధారణ దుస్తులే వేసుకున్నాడు. ముఖానికి స్నోలుగాని పవుడర్లుగాని పులుముకో లేదు. కాని మందహాసాలొలికించే ఆయనముఖంలో అద్వితీయమైన ఆకర్షణ కనిపిస్తున్నది. శిరస్సుమీద దువ్వెన వేయవలసిన అవసరమే లేకుండా అంటక త్తిరించిన క్రాపులాగున్నది. వేషధారణ సామాన్యంలో అతి సామాన్యంగా వున్నది. విదేశాలలో పది సంవత్సరాలు గడిపి, లక్షలు ధనం వ్యయంజేసి, అనేక రంగాలలో అధ్యయనం జేసి, పరిశోధనలు నడిపి ప్రశంసలు బొందిన విజ్ఞానవేత్తగా ఆయన్ను యెవరూ అనుకోలేరు. అది ఒకవిధంగా భూదేవికి మనోవేదనను కలిగిస్తున్నది. తన బిడ్డ గొప్పగా కనిపించాలని, ఆధిక్యతతో అలరారుతుండాలని ఆమె ఆకాంక్ష. నిరాడంబరగా సర్వసామాన్యుడుగా అందరిలో అణకువగా కలిసి మెలిసి పోతూ సహజరూపంలో మెలగుట ఆమె కంతగా రుచించుట లేదు, తన మనస్సులోని భిందను తెలియజేయలేక పోతున్నది. కనీసం, ధోవతి ధరించుట మంచిదిగాదని సలహా యివ్వగోరుతున్నది. కాని ఆవిషయాన్నికూడా వినిపించలేకపోతున్నది,

వసంతకుమార్ రాకకొరకు స్వప్న యెంత ఆదుర్దాతో కలలు గన్నదో ఆయన ప్రవేశించాక రెండురోజులవరకు అంతకుమించిన నిరుత్సాహంతో గడిపింది. ఆయన ప్రతి చర్య ఆమెకు బాధనే కలిగించింది, భూదేవి యెంత ప్రోత్సాహమిస్తున్నా చనువుగా మాట్లాడగల సాహసమే లేకపోయింది. ఆయన ప్రక్కనున్నపుడు ఒకక్షణం వుత్సాహం మరోక్షణం నిరుత్సాహం కలుగుతుంటుంది. ఆయన ప్రతి మాటను అతి శ్రద్ధతో వింటుంది. ఆ మాటలలోని నిరాడంబరత బాధిస్తుంటుంది. లూసీతో ఆంగ్లములో మాట్లాడినపుడు విని ఆశ్చర్యపోయింది, ఆనంద

పడింది. తనలో తనకే గర్వం పొడసూపింది. ఆ వుచ్చారణలో అతి మాధుర్యం గనిపిస్తున్నది, లూసీ మాటలకంటె ఆయన మాటలు అత్యధిక ఆకర్షణీయంగా వినిపించినవి. తనతోకూడా అలానే ఆంగ్లంలో మాటాడితే యెంతో బావుంటుందని లోభపడి. ఆశించి యేదో తెలుసుకోగోరినట్లు ఆంగ్లంలో ప్రశ్నించింది. అందు కాయన సుస్పష్టమైన తెలుగులో జవాబిచ్చినపుడు హతాశురాలైంది. ఆ భాషలో అంత పాండిత్యము అభ్యాసము వుండికూడా తనతో ఆ భాషలో యెందుకు సంభాషించడా, అని తనలో తానే ఫిర్యాదు చేసుకుంటుంది.

కొద్దిరోజులలో స్వర్ణ ఆయనవద్ద చనువును పొందింది. భీతి పోయింది. నిర్భీతిగా మనస్సులోని విషయాలను అడుగగలుగుతున్నది. ఆయన సమాధానంతో తృప్తికలుగనపుడు నిగ్గదీసి ప్రశ్నిస్తుంటుంది. ఆమె పట్టుదలతో ప్రశ్నించినపుడు సరళమైన స్నేహార్ద్ర దృక్కులను బరపుతూ చిరునగవును చిందిస్తూ, వినయాన్ని ప్రదర్శిస్తూ వివరించినపుడు ఆమె మనస్సు నవనీతంవలె కరిగిపోయి 'క్షమించు బావా!' అంటుంది.

"అంత తేలిగ్గా రాజీకి రావటంకూడా మంచిదిగాదు స్వర్ణా!" అని మందహాసం చేస్తాడు.

"పట్టుదలతో నిన్ను వేధించయినా ఒకో విషయం తెలుసుకోవాలని ప్రతిసారి వస్తాను. కాని నీ సమక్షంలో నా మనస్సే బలహీనపడి పోతుంటుంది. నీలో అర్థంగాని మాంత్రికశక్తి వుంది బావా!"

"నీవు యెప్పుడూ కోపంగా వుంటే యెంత బావుండునా, అనిపిస్తుంది."

మునగదీసుకుంటూ 'ఎప్పుడూ రుసరుస లాడుతుంటుంది, పిచ్చిది, అనవచ్చునా?'

"కోపంలోని నీ అందాన్ని చూస్తూ వుండాలనిపిస్తుంటుంది."

మొఖంలో చిగురుస్తున్న ఆనందాన్ని దాచుకుంటూ 'నీ మాటలను అర్థం చేసుకోవటం చాలా కష్టం!'

"సరళమైనవాటికి నిగూఢత, నిగూఢమైనవాటికి సరళత కల్పించుకుని అర్థంగానివిగా నిర్మించుకొనుట విశేష నైపుణ్యం!"

అందుకు ప్రతిని వెదుకజాలక 'నాతో ఇంగ్లీషులో యెందుకు సంభాషించవు!'

"తెలుగు నీకు తెలియనపుడు గదా ఆ సమస్య!"

"తెలుగుకంటె ఆంగ్లంలో మీకు మరింత అభ్యాసము, పాండిత్య మున్నదిగా!"

"పాండిత్యాన్ని ప్రదర్శించుటకని మాటాడుట, ప్రయత్నించుట అవివేకమవుతుంది."

మారుమాటలేక దీనదృక్కులను బరపింది.

రోజులు గడిచినకొలంది చనువు మరింత సన్నిహితమైంది. తను రాగానికి అధికార కోరలు పగిలించగలుగుతున్నది. 'ఇక నేను తినలేను స్వర్గా,' అన్నపుడు, అనునయంతో 'అలా వీల్లేదు. తినకుండా చిక్కిపోతున్నారు. ఆ కాస్త ముగింపందే విడువను.' అని బలవంతపెడుతుంటుంది. 'నీ వినయంకంటె కోపమే ఆకర్షణీయమైంది. నేను తినకపోతే నీవు కోపగించుకుంటావు, నా వాంఛనీయదృశ్య మదేగా!' అంటాడు. 'అబ్బ! మిమ్ము మాటలతో జయించలేము.' అంటుంది.

ఇరువురిలో అన్యోన్యత పెరిగినందుకు భూదేవి ప్రసన్నురాలైంది. లూసీని పంపివేయాలని ఆలోచన చేసింది. కాని వసంతకుమార్ ఆమెను వుంచమని సలహా యిచ్చాడు.

వసంతకుమార్‌కు స్వర్ణకు కావలసిన సేవాకార్యక్రమమంతా పద్మమీద పడింది. ఫ్యాషన్లు, ఆధునిక విధానాలు తెలియకుండా సీదా సాదాగా పిచ్చిదానివలెనుండు పద్మనుచూసి వసంతకుమార్ హేళనపడతాడని చిరాకు చెందుతాడని అందరు అనుకున్నారు. గ్లాసు నోటలు ప్లేట్లు సప్లయిరుకుబదులు క్లీనర్ సప్లయి సందితే భుజించలేనట్లు పద్మ సామాన్యతను నొచ్చుకున్నారు. అయినా ఆమెయెడలగల ఆదరంలోని ఆత్మీయతతో దూరంగుంచలేకపోయారు. పద్మ చేసుకుంటున్న సేవను కాదనలేకపోయారు, కాని పద్మయెడల ఆయన దయామయుడుగా మెలగటం వారి కాశ్చర్యాన్ని గల్పించి ఆనందితులయ్యారు.

నిరాడంబరతతోపాటు నిష్కల్మషము అల్పసంతోషమూ పద్మలో తొణికిసలాడుతుంటవి. పెద్ద నవ్వులు చిందులు కనిపించవు. అధరాల

మీద యెల్లవేళలా చిరునవ్వు చిందులు వేస్తుంటుంది. నిద్రిస్తున్నపుడు కూడ ఆమె ముఖంలో విచారరేఖలు కనిపించవు. పనులలో పరువులెడు తుంటుంది. మితసంభాషిణి.

వసంతకుమార్ పుస్తకంలో లీనమై యున్నపుడు పద్మ వచ్చి ప్రక్కన నిలిచి 'బాబుగారు, చాలా వేళయింది భోజనానికి లేవండి,' అని మృదువుగా పలికి అక్కడే వుండిపోయింది' 15 నిమిషాలు గడిచి పోయినవి. ఆమె అలానే వుండిపోయింది. ఇంకా వినిపించుకోనక్లే వుంటే యేమిచేస్తుందో చూడాలని వుబలాటం పొడసూపింది. పుస్తకం చదువుతూనే వున్నాడు. కాని మనస్సు అర్థం చేసుకోగల స్థితిలో లేదు. ఓరగా ఆమెను చూడ ప్రయత్నిస్తున్నాడు. నిర్మలమైన ఆమె ముఖం లోని ప్రశాంతతను ముగ్ధుని జేస్తున్నది. మెరుగుళ్ళు దిద్దిళ్ళు లేకుండానే ఆమె ముఖంలోని మృదుత్వంలో గూడిన స్వభావసిద్ధమెరుపు అత్యధిక శోభ నిస్తున్నది. ఆమె శ్యామలమే, అయినా అందము ఆకర్షణ స్వజని తాలని, అలంకార ఆర్భాటాలలో వాటి స్వయంప్రభావాన్ని కోల్పోతవని స్వజనిత సౌందర్యాన్ని పరిగ్రహించలేని పామరులను అలంకారాలు ఆకర్షిస్తవని, ఆలోచనలు చేస్తున్నాడు.

సంకోచిస్తున్న వణుకుతో సన్నటి మధురధ్వనులలో తిరిగి 'బాబుగారు!' అని పిలిచింది. ఆ పిలుపులో యెక్కడో దాగిన గిలిగిలిం తల అనుభూతి నిస్తున్నవి. పిలిచి వెళ్ళిపోక అక్కడే నిలిచి వుండటానికి కారణ మేమిటా యని మదనపడుతున్నాడు.

రీడింగురూమువైపు ప్రవేశిస్తున్న భూదేవి 'వసంతం, 12 గంటలయినా భోజనానికి లేవకపోతే యెలా బాబూ,' అన్నది.

"ఈ పుస్తకంలో చదువుతున్న అధ్యాయం అయిపోవచ్చిం దమ్మా, అరగంటలో వస్తాను."

ఆమె మందహాసంలో ఆదుర్దాను ప్రదర్శిస్తూ 'అధ్యాయం అయ్యే లోగా ఆ పిచ్చిదాని ప్రాణం కాస్తా పోతుందేమో!'

"స్వప్న నాకోసరకు యింకా కాచుకు కూర్చున్నదా అమ్మా!"

"అది కుంభకర్ణునికి పోటీయా అన్నట్లు గుర్రకబెట్టి నిద్ర పోతున్నది."

"మరి నేను తొందరగా లేవకపోతే యెవరి ప్రాణం పోతుం దంటావు !"

"అందరమూ ఫలహారాలుచేసి కాఫీలు త్రాగాము. నీవుదప్ప భోజనాలుకూడా అందరివీ అయిపోయినవి. కాని పద్మ పచ్చిగంగకూడా యింతవరకు ముట లేదురా పాపం."

"కాఫీ నిషేధం గావచ్చు, ఫలహారాలెందుకు తీసుకోగూడదు ?"

"దాని కా అలవాటు యెన్నడూ లేదురా. అందరి భోజనాలు అయ్యాక భోంచేస్తుంది. అంతవరకు యెక్కువగా వంటయింట్లోనే వుంటుంది."

ఆయన చేతిలోని గ్రంథ రాజాన్ని టేబులుమీదపెట్టి కరుణాభరిత దృక్కులతో ప్రకటనున్న పద్మను తిలకిస్తున్నాడు. ఆమె ముఖం వోరగా గనిపిస్తున్నది. ముఖంమీద సిగ్గురేఖలు గిరిగిర తిరుగుతున్నవి. కాలి బొటనవ్రేలితో రాతిఫలకాన్ని ఛేదించ చూస్తున్నది. 'పరవాలేదు మీరు చదవాలనుకున్నంతవరకు చదువండి. నాద్వారా మీ చదువు విఘ్నం కారాదు,' అన్నట్లు మనస్సులో ప్రతిధ్వనించింది.

"పొరపాటు జరిగింది. చాలా ఆలస్యం చేశాను."

"పొరపాటేమున్నది బాబుగారు ! చదువుతున్న ఘట్టాన్ని పూర్తి జేయ జూస్తున్నారు."

"అమ్మ అన్నట్లు ఆ ఘట్టం పూర్తయేలోపల నీ జీవితఘట్టమే సమాప్తం కానచ్చుగదా !"

"ఒక్కపూట వుపవాసంతో యెవరిప్రాణమూ పోదు. స్త్రీ ప్రాణం మహా మొండిదంటారు."

మధుభరిత దృక్కులలో యేకాగ్రంగా చూస్తూ 'భక్తివిశ్వాసాల లోని లక్ష్యంద్వారా నీలోని శుద్ధ్యాధ మధ్యంగావచ్చు, నాతరపుగా అది మహాపరాధమే అవుతుంది,' అంటూ లేచాడు.

ఆత్రతతో ముందుకు నడుస్తూ 'వడ్డనకు అమ్మాయిగారిని లేపు కొస్తాను బాబుగారు' అన్నది.

"పద్మా, నిద్రాభంగం చేయవలసిన అవసరంలేదు. గాఢనిద్ర

లోని సుఖం విశిష్టమైంది. నీవు వడ్డించు పనవాలేదు." అంటూ వంటయింటిలో ప్రవేశించి పీటవేసుకు కూర్చున్నాడు.

ఆమె తడబడిపోతూ 'అదేమిటి బాబుగారు! అది మా స్థానం. పనివాళ్ళు కూర్చునేచోట కూర్చుంటారేమిటి! దయచేసి డైనింగ్ హాల్లోకి రండి,' అన్నది.

"నిర్బంధం ద్వారానో నియమంద్వారానో పొందే ఆధిక్యతలోని ఆనందంకంటె స్వేచ్ఛద్వారా పొందే తృప్తిలోని ఆనందం అధికమైంది పద్మా."

"అక్కడ టేబుల్ వగైరాలన్నీ మీ సౌకర్యాల కనుకూలమయిన ఏర్పాట్లు చేయబడినవి. ఇక్కడ కూర్చుని నన్ను చిన్నబుచ్చకండి బాబుగారు!"

"భయంకంటె నాకు భక్తివిశ్వాసాలు యిష్టం. నా ముందు యెన్నడూ భయపడవలసిన పనిలేదు. నిశ్చయంగా వడ్డించు పద్మా."

"ఉన్నత స్థాయిలోనుండే భక్తిలో భయం తొంగిచూస్తున్నది. ఆ స్థాయిలోని ఆ రెంటినీ విడదీయుట సాధ్యంగానిది బాబుగారు."

"భయంలేని భక్తివిశ్వాసాలు ఆత్మీయమైనవి. భయంలో స్నిగ్ధరూప ఆత్మీయతుండదు."

"భక్తినుంచి భయాన్ని మాటలలో విడదీయవచ్చు. అనుభవంలో అసాధ్యం. భక్తివిశ్వాసాలలోని ఆత్మీయత అధికస్థాయిలో నున్నపుడు భయం దాగివుండుట సత్యం. భయంతో పొందికలేని భక్తివిశ్వాసాలు పేలవంగా వుంటవి."

తనపనిలో తాను నిమగ్నమై మౌనముద్రలోనుంటూ అమాయకురాలుగా ద్యోతకమవుతున్న యీమెనుంచి వచ్చిన మాటలను జూసి తనలోతానే ఆశ్చర్యపోయాడు. సాంపర్క్యం ద్వారా సభ్యసంస్కారాలను పొందవచ్చు. కాని మనస్తత్వాలకు సంబంధించిన ఒక నిగూఢ రహస్యాన్ని ప్రకటించుట సామాన్యవిషయంగాదు. మందస్మిత వదనంతో ఆమెవైపు చూస్తున్నాడు. ఆమె ముఖంలోని వినమ్రత ప్రదర్శితమవుతున్నది.

"కోరి కూర్చున్నవారిని కాదనగూడదు."

విచారగ్రస్తధ్వనిలో 'నన్ను కించపరచుట ధర్మంగాదు.'

"నీవు యెక్కడ కూర్చుని భుజిస్తావో అక్కడ కూర్చుని భుజించుట నిన్ను గౌరవించుటగా తలంచాను. అది నీ అగౌరవంగా తలంచుట నా దురదృష్టం." అంటూ లేచి బయటివైపు నడుస్తున్నాడు.

అపరాధినివలె ఆరాటపడుతూ, ఆయనకు యెదురు నిలిచి 'బాబుగారు' అన్నది.

ఆయన ప్రక్కగా తప్పుకుని పోబోతున్నాడు. పద్మ తోచని స్థితిలో ఆవేశితురాలై, హస్తాన్ని గట్టిగా పట్టి వినమ్రతతో 'క్షమించండి బాబుగారు,' అన్నది.

"అవమానించి క్షమాపణగోరుట గౌరవించుట కాజాలదు." అంటూ దృష్టిలో దృష్టిని బరపాడు. ఆమె నేత్రాలు సజలమైనవి. మనస్సు అస్వస్థమయింది. బరువుకంఠంతో 'పోనీ ఆ పీటమీదే కూర్చోండి.' అన్నది.

ఆమె కపోలంమీదికి దొర్లుతున్న కన్నీటిబిందువును అంగుళీయంతో తుడిచివేస్తూ 'నీకు యింతబాధను కలిగించుట మంచిదిగాదు. డైనింగ్‌హాల్‌లోనే కూర్చుంటాను పద.' అంటూ ముందు కడుగిడబోయాడు. కాని ఆమె పట్టివుంచిన హస్తాన్ని విడువలేదు.

"నేను దాసీని. నా మాటకు విలువ నీయవలసిన అవుసరంలేదు. మీకు యిష్టమైనచోటనే కూర్చోండి," అన్నది.

"అయితే నేను డైనింగ్ హాలులోనే కూర్చుంటాను"

"మీయిష్ట మదికాదని మీకూతెలుసు నాకూ తెలుసు. వంటయింట్లోనే కూర్చుందురుగాని రండి." అంటూ ఆమె లాక్కువెళ్ళి కూర్చుండబెట్టింది.

"ప్రతి విషయంలోను నిన్ను నీవు దాసీగా గుర్తించుకొనుట ఆత్మవంచనకదా చెప్పు?"

"వాస్తవికతను విస్మరించి గొప్పగా వూహించుట ఆత్మవంచన కావచ్చు: నిజస్థితిని స్మరించుకొనుట ఆత్మవంచ నెలా అవుతుందంటారు?"

"మాట విలువ, మానవ విలువ ఆర్థికఅంతస్థునిబట్టి పరిగణించుట అవివేకమవుతుంది."

"రూపాయనోట్లు అన్నీ కాగితాలే, కాని ఆ కరెన్సీ నోట్లన్నిటికీ ఒకే విలువ వుండదుగదా!"

"మానవవిలువ హృదయ అంతస్థును, నిజాయితీని, నీతిని, విజ్ఞాన వికాసాలను బట్టి వుండవలసిందే. విలువగలమాట, కార్యము యెవరిద్వారా వచ్చినా, జరిగినా వాటికి విలువరేకుండా పోవుట ధర్మంగాదు గదా!"

ఆమె యీ మాటలు విన్నదో లేదో వర్ధనలో మునిగిపోయింది. గాబరాలో వడ్డించిన కూరలనే వడ్డిస్తూ గిన్నెలను చుట్టూ చేరుస్తున్నది.

"మాట్లాడవేమిటి పద్మా!" అని ప్రశ్నించాడు.

సిగ్గిలుతూ 'గొప్పవారిముందు నిలిచి మాట్లాడటం నాకు అలవాటు లేదు, శక్తిలేదు.' అంటూ నేతిగిన్నెను ప్రక్కన పెట్టబోతుండగా జారి ఆయన పళ్ళెంలో పడిపోయింది, ప్లేటులోపడిన ఆ గిన్నెలోని నెయ్యి చింది వసంతకుమార్ ధోవతిమీద కూడా పడింది. భోజనంమీద వడికిన ఘృతం తక్కువకాదు. ఆమె కళవళపడి పోతున్నది. కాలుచేతులు గడగడ వణికిపోతున్నవి. అధరాలు అదురుతున్నవి. పృథ్విమీద పడి విలపిస్తుందేమో ననిపిస్తున్నది.

వసంతకుమార్ గలగల నవ్వును ప్రదర్శిస్తూ 'ఏ భయాన్ని నీలో చూడగూడదని ప్రయత్నిస్తున్నానో ఆ భయమే నీలో ప్రళయరూపం ధరిస్తున్నది. నా ముందు యెన్నడూ భయపడవద్దని నా కోర్కె. నెయ్యి దుస్తులమీద పడినందువలన చెడేదిలేదు, నీవు వడికించిన అంతటినీ తింటాను చూడు.' అంటూ బుజ్జగించాడు.

ఆమె తెప్పరిలుకుని 'చెయి జారింది బాబుగారు' అని బరువుకంఠంతో అన్నది.

"నీలోని అత్యధికశ్రద్ధ నంటిపెట్టుకుని భయంకూడా వుంది. అందుకే అది జారిపోయింది." ఆమెవైపు చూస్తూ 'ఈ నెయ్యి అంతటిని నాచేత తినిపించాలని నీ అంతరాత్మ ఆశయమై వుంటుంది. ఈనాడు

నీలోని ప్రతికోర్కెను మన్నించాలని నా మనస్సు వుద్వేగపడుతున్నది. గనుక అంతటిని తింటాను." అంటూ భుజిస్తున్నాడు.

సిగ్గుదొంతరల మధ్యగా "అవి మీకు సయించదు బాబుగారు. వేరేప్లేటులో వడ్డిస్తాను. అది విడిచివేయండి." అంటూ లేచింది.

"బాల్యంలో నేను మొండి వాడినని నీకు తెలుసు. ఈ ప్లేటులోది పూర్తిచేయకుండా విడిచిపెట్టను. భక్తి, శ్రద్ధ, ప్రేమలతో పెట్టినది అమృత సమానం. యీరుచిలోని స్వాదిష్టాన్ని చవిచూడగల సామర్థ్యం అందరికీ వుండకపోవచ్చు. భక్తిని ప్రేమతోను, ప్రేమను ఆదరంతోను సత్కరించుట నాకూ చేతనవుతుంది పద్మా." అంటూతృప్తితో భుజిస్తున్నాడు.

"నౌఖర్లు మార్చునేచోటకూర్చోబెట్టాను. తినడానికి ప్లేట్లేకుండా భోజనం వడ్డించాను. అమ్మగారు చూస్తే నన్ను ఎంత కోప్పడరారో కాస్త ఆలోచించండి." అని ప్రార్థనారూపంలో అన్నది.

"అనవసరమైన సంభాషణతెచ్చినందుకు తిరిగి నీవే పశ్చాత్తాపపడతావు. నేను మధ్యలో విడిచివెళితే నీ మనస్సెంత వేదనపడుతుందో చెప్పు?"

ఆమాటలతో ఆమెనోరు కట్టుబడిపోయింది. ప్రక్కన గూర్చొని వీవనతో విసురుతూ, తన వడిలోని ముతక అటుకులను ప్రేమతో భుజిస్తున్న కృష్ణభగవానుని ఎదుట-గూర్చున్న భక్తకుచేలుడు పొందిన ఆనందాన్ని అంచనాగడుతున్నది. ఆయన వంటయింటిలోని ప్రతిదాన్ని పరిశీలనగా చూస్తున్నాడు. ఆమెవైపు చూస్తూ అలానే వుండిపోయాడు. ఆమెసిగ్గుతో శిరస్సు వంచుకొని కోరగా చూస్తున్నది. అయిదు నిమిషాలు గడిచిపోయినా ఆయన అలానే వున్నాడు.

"భోంచేయటం మర్చిపోయారేమిటి బాబుగారు!" అని ప్రశ్నించింది.

"వయస్సులో స్వల్పకంటె చిన్నదానివి. అయినా పెద్దరాలవుగా మెలగుతావెందుకు పద్మా!"

"నేను పసిపాపనేమీ కాదు. మీరు భోంచేయండి. ఆ తరువాత విషయాలు ఒక్కటొక్కటిగా అడుగుదురుగాని."

'అలంకారాలు నీకు అయిష్టమా!'

'మీరు ముందు భోంచేయండి బాబుగారు.'

'సమాధానం రానిదే నేను భోంచేయను.'

'దాసీదానిమీద పంతం చేయగూడదు బాబుగారు. అలంకారాల ద్వారా ఆకర్షణ పెరగవచ్చు. కాని ఆ వెంట అతిశయము ఆధిక్యత మొదలగునవి తోడుజాడ్యాలు యెన్నో వెంటబడి ఆశలకు వాంది అవుతవి. నిరాడంబరతలో నిండుతనంతో గూడిన సాత్వికత, సంతృప్తి కలుగుతవి.'

'అలంకారాల కవకాశం లేనివారు నిరాడంబరత కాధిక్యతను చాటి ఆదర్శమని నిరూపణ నిచ్చారేమో!'

'అలంకారాలకు అవకాశం లేకపోవటమంటూ లేదు. ఎక్కడి కక్కడే అలంకారాలుంటవి. ఉన్న అవకాశాలలోనే అవి ప్రత్యక్షమవుతుంటవి. వాటిని నిరాదరం చేసినపుడే అవి దూరమై తృప్తి మిగులుతుంది.'

'కురులను ఏమేమో చేయకుండా దూముడివేసి వూరుకున్నావు. అది ఒక విశేష అందంతో శోభిస్తున్నది. సామాన్యదుస్తులు మామూలుగా ధరించావు. అవి నీకు మరింత ఆకర్షణ నిస్తున్నట్లున్నది. అలంకారాలలో మునిగినవారికంటె నీలోని అతిశక్తి యేదో నిన్ను అద్భుతమైన ఆకర్షణతో నింపుతున్నది. చూస్తున్నకొంది నీలో తెలియని శృంగారం గోచరిస్తున్నది. నిరాడంబరతలో యింత వుజ్వల తేజోమయ నిండుతన ముంటుందని నీద్వారా అనుభవం పొందగలుగుతున్నాను.' అంటుండగా పద్మ కల్పించుకుని, ధైర్యాన్ని పూరించుకుని 'బాబుగారు, మీరు విదేశాలలో చేసివచ్చిన పరిశోధన లన్నిటిని నా మీద ప్రయోగించకండి.' అన్నది.

ఉత్సాహంలో 'నీమీద ప్రయోగించినపుడే నా పరిశోధనలు ఫలప్రదమవుతవి.' అన్నాడు.

'ముందు మీరు తొందరగా భోంచేయండి.'

'భోజనం ముగిస్తే యీసదవకాశం తిరిగిలభిస్తుందో లేదో గదా!'

'ఇక్కడ భోంచేసినసంగతి పెద్దమ్మగారికి తెలిస్తే యీ సదవ కాళ ఫలితంకూడా తెలిసివస్తుంది.'

'ఒక సందర్భం ఒకరి\కిచ్చే హాయి మరొకరి కివ్వదు. అంత మాత్రాన దాని విలువ హీనంకాదు.'

'పద్మా !' అన్న భూదేవి పిలుపు హాల్లోనుంచి వినిపించింది. పద్మ గాబరాపడుతూ 'అమ్మగా రొస్తున్నట్లున్నారు.' అన్నది. ఒకరి గాబరా యెదుటివారినికూడా గాబరాపరుస్తుంది. అంతేగాదు తన సానుభూతిని చూరగొన్న ఆమెకు నొప్పిగలుగుట సహించరానిది. అందువలన వసంతకుమార్ తచ్చాట్లాడుతూ లేచి బేసిన్‌లో చేయి కడుక్కున్నాడు.

'మీరు డైనింగ్‌హాల్లో కెళ్ళి కూర్చోండి. ఈ వడ్డనలన్నీ యిక్కడెందుకు వడ్డించా వెందుకంటుందేమో. నేను తింటున్నట్లు కూర్చుంటాను.' అంటూ ఆమె పీటమీద కూర్చుని కూరలు కలుపుతూ నటన చేస్తున్నది.

డైనింగ్‌హాలులోనికి వెళ్ళిన వసంత్ రెండు నిమిషాలు కుర్చీలో కూర్చుని, తల్లి ప్రవేశించనందుకు సంతోషపడుతూ చిన్నగా పద్మవైపు నడిచాడు. అడుగుల చప్పుడికి భూదేవి ప్రవేశిస్తున్నదన్న భయంతో పద్మ నటనను మరచి స్వయంగా భుజిస్తున్నది. తొంగిచూసిన వసంత్ విస్మితుడై నొచ్చుకుంటూ ముందుకొచ్చి 'ఎంగిలి తినిపిస్తున్న నా పాపానికి పరిహారం వుందా పద్మా !' అని ప్రశ్నించాడు.

ఆమె నివ్వెరపోతూ 'అయితే అమ్మగారు రావటం లేదా ?' అంటూ ఆగిపోయింది.

'తింటున్న భోజనం ఆపించి మరో పాపం చేశాను చూశావా ?'

'నేను దాసీని, నన్ను మీ యెంగిలి భ్రష్టం చేయలేదు. కాని నా యెంగిలిద్వారా యీ ప్లేటులు అపవిత్రమయిపోయినందుకు విచారపడుతున్నాను.'

'నీవు భుజించకుండా సగంలోనే ఆగిపోతే ఆ దోషం నాదే అవుతుంది. కనుక నామీద గౌరవముంటే నాకుదోషంలేకుండా చూడు.'

'అమ్మగారు వస్తున్నారన్న భయంతో గాభరాపడి భుజించాను. మీ యెంగిలిని పూర్తిగా తినిపించాలని చూస్తున్నారా ?'

"అది యిపుడు మన యిరువురియెంగిలి మిశ్రితమై వున్నది. కనుక పవిత్రమో అపవిత్రమో నీవే నిర్ణయించాలి."

"అమృతం అమూల్యమైంది కాదని యెవరనగలరు! కాని అందు ఒక బిందువు విషం కలిసినా, సర్వము విషముగా పరిణమిస్తుంది."

అనునయదృక్కులను బరపుతూ "పోనీ ఆ విషాన్నే పూర్తిగా సేవించమని నా కోర్కె."

సిగ్గును అబినయిస్తూ "మీరు కూర్చున్నచోటనే కూర్చుని, మీరు భుజించిన ప్లేటులో భుజించుట మిమ్ము అవమానించి నట్లవుతుంది గనుక, తెలిసి చేయుట మంచిదిగాదు క్షమించండి." అని లేవబోతుండగా, వసంతకుమార్ ఆమె హస్తాన్నిబట్టి "అర్ధాకలితో లేవను వీలులేదు." అన్నాడు.

వస్తున్న నగవును ఆపుకుంటూ ఆయనచేతిలోనున్న తన చేతి వైపు చూసుకుంటూ "దాసీదాని చేయి పట్టుకోకూడదు బాబూ, మీరూ అర్ధాకలితో లేచారు. నేనూ మిమ్ము అనుసరించాను. ఇది ధర్మానికి విరుద్ధంగాదు గాని మీ చేయి యెక్కడున్నదో చూడండి." అన్నది.

"నీతులు నియమాలు యెక్కువగా అధర్మానికే అండగా నిలుసవి. ఆ పేరుతో మైదుపుచ్చజూచుట నాముందు సాగదు." అంటూ ఆమె చేతిని ప్లేటువైపు అదిమాడు. ఆమె దీనంగా చూస్తూ "నేడీ అఘాయిత్యానికి పూనుకున్నారేమిటి బాబుగారు." అన్నది.

ఒకవిషయంలో పట్టుదల కలిగినపుడు విచక్షణాజ్ఞానం నశిస్తుంది. తన చేతిని బలంగా పట్టిన ఆయన హస్తాన్ని చూచుకుంటున్నది. తన చేతిమీదున్న ఆయనచేయి ఒక పూలగా ద్యోతిత మవుతున్నది.

ఆయన వెంటనే తన ద్వితీయ హస్తంతో పట్టివుంచి మొదటి హస్తంతో ఒక ముద్దను అమె అ:చేతిలోవుంచి పైకినెట్టాడు. అయిష్టతను ప్రదర్శిస్తూ భుజించింది. సిగ్గుగాను భీతిగాను వుంది. కాని అర్ధంగాని ఆనందం కలుగుతున్నది. ఎన్నడూ తెలియని రుచిని పొందు

తున్నది. విదేశాలలో చదివి విఖ్యాతి బొంది వచ్చిన విజ్ఞానవేత్త తన యెదుట ఒకసర్వసాధారుణునివలె వుండి ప్రేమతో తనకు భోజనం తినిపి స్తున్నాడు, ఏ విజ్ఞానవేత్తనుగురించి అందరూ యెంతెంతగానో పొగడు కుంటున్నపుడు, అంతటి గొప్పవ్యక్తి ముందుకు పోగల అవకాశం లభిస్తుందో లభించదోనని, ఎన్నివిధాల ఆలోచనలతో విసిగిపోయిందో, ఆ అందనివ్యక్తే తన అంతస్థుకు దిగివచ్చి గొప్పగా ఆదరిస్తున్నాడు. తన అసభ్యతను, అలంకారహీనతను, నిరాడంబరతను. అమాయకతను చూసి యే మహావ్యక్తి అసహ్యించుకుంటాడని అందరూ తనను చులకన చేసి నపుడు వివశతతొ తనమీద తానే జాలిచెందిందో ఆ మహావ్యక్తే నేడు తనకు అత్యధిక ఆదరణ నిచ్చి విందు గుడిపిస్తున్నాడు, నిస్సంశ యంగా ఆయన మహావ్యక్తి. కాని వా రూహించుకున్న చిత్రించుకున్న దర్పము, డాంబికము పటాటోపము స్వార్థములతో నిండిన వ్యక్తి మాత్రం కాదు. మానవత్వంతో నిండిన సర్వశ్రేష్టవ్యక్తి, ఆదర్శమూర్తి. ఆయన ఆదరాలలో పులకితమై పొంగిపోతున్నది. మనస్సు హృచ యము కృతజ్ఞతతో పురివిప్పుకుంటున్నది.

ఆమె పళ్ళెరంలోని పదార్థాలవైపు చూచుటలేదు. ఆ ధ్యాసే లేదు. ఆమె భుజిస్తున్నది ఆ పదార్థాలనుగాదు, ఆయన అనురాగాన్ని, ఆద రాన్ని, హృదయపూర్వక సానుభూతిని. ఏకాగ్రంగా ఆయనవైపే చూస్తున్నది. ఆయన్ను ధర్మదేవతగా తనలోతాను పోల్చుకుంటున్నది. పాశ్చాత్య సభ్యతలో మానవత్వానికే విలువేమో ననుకువి తృప్తి చెందలేకపోతున్నది. అది ఆయన ప్రత్యేక హృదయసొత్తుగా సిరీకరించుకున్నది. ఆయన ముఖమండలంలో ప్రేమతో నిండిన శాంతి స్వరూప తేజస్సు గోచరిస్తున్నది. కటికి చలిలో వణుకుతున్నవాడు యెండపొడలో హాయిని గ్రోలునట్లు ఆ తేజస్సులో ఆమె అనంత తృప్తిని పొందుతూ తన్మయత్వంలో తనను తాను మర్చిపోతున్నది. కనుకొలకులప్రక్క కన్నీటి బిందువులు ముత్యాలవలె నిలిచి మెరు స్తున్నవి. అవి ఆమె దీనతను పెంచి అందాన్ని అద్వితీయం చేస్తున్నవి.

ఆ దృశ్యాన్ని చూస్తున్న ఆయన మనస్సు ద్రవించింది, జాలితో

'నా బలవంతంతో ఫోం చేయవలసివచ్చినందుకు చింతిస్తున్నావా !' అని ప్రశ్నించాడు.

కృతజ్ఞతాభరిత కంఠంతో 'లేదు బాబుగారు, నా జీవితంలో యింతటి ఆప్యాయతను యెన్నడూ పొందియుండలేదు. ఇది నాకు మరువరాని మధురసన్నివేశము. నిరాదరంగా నిర్లక్ష్యంగా వుంటున్న నేను ధన్యురాల నయినందుకు నా హృదయం ఆనందభాష్పాలను ప్రదర్శిస్తున్నది. హృదయంలోని కృతజ్ఞత మీ వైపు పరుగులెడుతున్నది.' అన్నది.

"నివురు గప్పిన నిప్పువలె నీలోని విశిష్టత తరచినకొలది హెచ్చుస్థాయికి చెందుతున్నది. నీ హృదయం అతి వున్నతమైంది. నిన్ను అర్థం చేసుకోగలుగుట మానవీయతనే అర్థం చేసుకొనుటగా యెంచి ఆనందపడుతున్నాను."

"బాబుగారు, నన్ను చిన్నబుచ్చను ప్రయత్నించకండి. మానవ సమాజంలో మానవత్వం కరువైపోయి మీబోటివారిలో మచ్చుగా మిగిలి వున్నది. స్వార్థ ఆరాటపోరాటంలో మానవత్వాన్ని కోల్పోయి రాక్షసత్వాన్ని నింపుకుని, పశుత్వాన్ని ప్రదర్శిస్తూన్న నేటి సమాజంలో మీబోటి దయామయులు అరుదు. మీరు దేవతా స్వరూపులుగా నేడు అనుభవం చేసుకుని నా జీవితం ధన్యమైనట్లు ఆనందపడుతున్నాను. మీరు మానవశ్రేష్ఠులు బాబుగారు."

"వినయవిధేయతలతో తనను తాను అల్పం చేసుకుని యెదుటివారికి ఆధిక్యతనిస్తూ, వివేకులకు నూతనస్ఫూర్తిని కల్పించగల నీవు ఆదర్శ మహిళవు. నీ రూపురేఖలలో, నిరాడంబరతలోని నీ నడవడిలో యెదుటి హృదయమందు నీతిని, నియమాన్ని పాటించు మానవత్వాన్ని, ఆదరాభిమానాన్ని సృష్టించగలశక్తి వున్నది...." అంటుండగా మధ్యలోనే కల్పించుకుని "మీ నోటితో నన్ను పొగడి న్యూనతపర్చకండి. నేను దాసిని."

శయనాగారంనుంచి వినిపించిన స్వర్ణకుమారి మాటతో పద్మ గాబరాపడుతూ ప్లేటులను సర్దుతూ 'బాబుగారు, తొందరగా వెళ్ళిపోయి నా మర్యాదను కాపాడండి,' అంటూ హస్తాలు జోడించింది.

ఆ దృశ్యం ఆయన హృదయాన్ని చలింపజేసింది. ఆమెవైపు దీనంగాచూస్తూ వెళ్ళిపోయాడు.

3. ఆ శ యం

రజపతిద్వారా అన్ని హంగులలోను నిర్మింపబడిన అతిధిగృహం ఆయన తదనంతరం నిరాదరం చేయబడింది. గబ్బిళాలు నివాసంచేస్తున్నవి. ఆ గృహం అనుకోనిరీతిగా మరమ్మతులు చేయబడి ఆధునిక ఫర్నిచరుతో అమర్చి శోభాయమానం చేయబడింది. ఇంతకాలం నిర్లక్ష్యంచేయబడిన ఆ గృహానికి ఆకస్మికంగా అంత ధనం వెచ్చించి అంత శృంగారం చేయు టెందుకో యెవరూ వూహించలేక పోయారు. అందు వసంతకుమార్ చేత ధర్మ చికిత్సాలయం నడిపించాలని భూదేవి ఆశయం.

కొంతమంది శారీరకబాధలను నివారించుట గొప్ప విశేషం గాదని, అది దేశానికి ఘనమైన సేవ గాదని, సామాన్య వ్యాధులు కుదర్చును అనేకమంది అందుకు తయారైన డాక్టర్లున్నారని, వికృతమైన వికార జబ్బులు నయంచేసి అధమస్థపు జీవితాలను నిలిపి జనాభానే కొరవడకుండా జాగ్రత్త తీసుకోవలసిన అవుసరం తన దృష్టిలో అసలే లేదని, అది అనవసరమని వసంతకుమార్ వినిపించినపుడు అందరూ ఆశ్చర్యపోయారు.

భూదేవి నిస్పృహ చెందింది. 'వ్యాధిబాధనుంచి విముక్తిని కల్పించుటకంటె పుణ్యకార్య మేముంటుంది బాబు,' అని ప్రశ్నించింది.

ఆరోగ్యవంతు లందరికి సమాన సౌకర్యాభివృద్ధులను, శారీరకంగాను మానసికంగాను వికాసావకాశాలను కల్పించుటద్వారా సంఘాన్ని సర్వతోముఖ సౌష్టవం చేయు టవుతుందని, మానవజాతిని అన్నివైపుల వున్నతస్థాయికి చేర్చు వుపాయమే సర్వశ్రేష్టమయిందని, రోగగ్రస్తులైనవారి సేవలో జీవితాన్ని వ్యయపర్చుటకంటె ఆరోగ్యవంతులైనవారి అభివృద్ధిలో మానవ సంతతిని శ్రేష్టవంతం చేయుటకు సలిపే కృషి వున్నతకార్యమని, సంతతి సంఖ్యాభివృద్ధికంటె, శ్రేష్టసంతతి

కృషి ముఖ్యమని వసంతకుమార్ వినిపించినపుడు భూదేవి ప్రాన్పడి పోయింది. వికృతభావాలుగా వినాశ హేతువుగా తోచింది,

మేలైన పశుజాతి అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిని, పశు ప్రదర్శన శాలలలోని ప్రచారంలో యెన్నోరీతుల విన్నది, చూసింది. ఆ భావాల తాలూకు మాటలనే వసంతం మనుష్యజాతి విషయంలో అంటున్నట్లు తెలుసుకుని విస్మయమందుతున్నది. వికటభావంగా తోచింది. మేలైన ధృఢమైన అందమైన పశుజాతి అభివృద్ధికొరకు చేసే కృషి యోగ్యమైందిగానే తోచింది. పశుజాతిలోని హీనజాతిని అభివృద్ధి కాకుండా అరికట్టటంకూడా యోగ్యంగానే తోచింది. కాని మానవజాతిలోని వికలాంగులను, భయంకర రోగాలకు గురియైనవారిని, వికార రూపంగలవారిని, అందవిహీనులను. నిరాదరం చేయుట నిర్మూలనం చేయుట మొదలగు భావాలు కఠోరంగాను, కర్కశంగాను, రాక్షస స్వభావంగాను తోచింది. అందుకే కఠినంగా మందలించింది.

మందస్మితవదనంతో వినమ్రుడై 'నీవు అంటున్నవి సమాజ అభ్యాసంలోని సామాన్యమాటలే, గనుక అందున పొరపాటు లేదమ్మా! నా భావాలు అందరికీ వికృతంగా తోచవచ్చు. మానవులకు సహాయ సంపత్తిగా వుంటున్న పశుజాతియొక్క మేలుకొరకానికి, ధృఢత్వానికి. జాతి పెంపుకు చేస్తున్న కృషికి హర్షిస్తున్నవారు, అదేరీతి మానవ సంతతి విషయంలో కూడా కృషి చేయదలచినవారిని చూసి హేయపడుట హాస్యాస్పదం.'

ఉదాసీనతతో 'నల్లటివారిని యెర్రటివారినిగా మార్చుటకు ప్రయోగాలు చేస్తున్నావంటే వైద్యంలో గొప్ప నిపుణుడివై వస్తున్నావనుకున్నాను. చికిత్సలు పొందలేక అల్లాడిపోతున్న రోగులపాలిటి రక్షకుడివి వుద్ధరించి కీర్తి పొందుతావని సంబరపడ్డాను. కాని రోగుల యెడల నిరాదరంగా పలుకుతున్న నిన్ను చూసి యేమనుకోవాలో నాకే తెలియటంలేదు.' అన్నది,

అనునయంతో 'నా విషయంలో నిరాశ చెందవద్దమ్మా. కీర్తి కాంక్షతోనో, ఆర్థిక ఆశలతోనో, పుణ్యము ముక్తి, మోక్షముల మోహంతోనో రోగులకు చేసే సేవలకు విలువ వుండవచ్చు, ఆదతము అభి

మానము పొందవచ్చు, కాని అలాంటి కార్యంద్వారా సమాజపుమూలంలో మార్పుండదు, శాశ్వత క్షేమమూ జరుగదు. ఆకలితో అలమటించేవారిని విడచి బొమ్మలకు భోగాలు కల్పించినట్లే, శారీరక సౌఖ్యాలను పూర్తిగా పొందలేనివారిని, మృత్యుముఖంనుంచి మరల్చి జనాభా లెక్కలను తరుగకుండా కాపాడినందువలన జరిగే మేలు సంఘానికుండదు, వ్యక్తికీ వుండదు, ఆరోగ్యవంతులై ఆకలితో అలమటించేవారి గోడు విస్మరించి శరీరాలే భారాలుగా అయినవారి ప్రాణాలను నిలుపుటలో సర్వశక్తిని వినియోగించుట విజ్ఞత కాజాలదు. సమాజ సంఖ్యాబలాన్ని కొరవడకుండా పాటుబడేకంటే శారీరక మానసిక సౌష్టతను పెంచి ఆర్థికంగా అన్నిరంగాలలోను సమానావకాశాలను కల్పించుటగా చేయు కృషి నేడు అవసరం. సంఘసంక్షేమ స్వార్థానికివ్వవలసిన విలువ వ్యక్తిగత స్వార్థానికిచ్చుట లోభత్వ మవుతుంది. నా లక్ష్యంలోని యదార్థవిలువను తెలుసుకున్నరోజున నీవు మహదానంద పడతావమ్మా.' అన్నాడు.

ఆవేశాన్ని అణచుకోలేక 'నీవు వెర్రివాడివి, మానవసేవే మాధవ సేవ, వ్యాధితుని విడిచి ఆరోగ్యవంతుని అభివృద్ధినిగురించి, చికిత్సను గురించి ఆలోచనలు చేయుట హాస్యాస్పదము,' అన్నది భూదేవి.

"అభ్యాసంలో లేనివి, అలవాటుకు భిన్నమైనవి విన్నపుడు, కన్నపుడు ప్రథమంలో హాస్యాస్పదంగాను, భయంగాను కనిపించవచ్చు. కాని కొంతదూరం పోయాక అవి హత్తుకపోయినప్పుడు అమూల్య ఆదర్శాలుగా కనిపిస్తవి."

"నీ మాటలు అర్థంగానివి, గొప్ప డాక్టరువై యుండి, విదేశంలో చదివి అనుభవం గడించివచ్చిన నీవు చికిత్సాలయం లేకుండా రోగ చికిత్సలేకుండా చేయగలిగే దేముంటుంది?"

"నేను చేయదలచిన సేవగాని, చికిత్సగాని కొంతమంది వ్యక్తులకు గాదు. సమస్త సంఘానికి, యావత్తు ప్రజానీకానికి. అంతేగాదు, తాత్కాలికంగా సంఘాని కుపకరించుట గాకుండా శాశ్వతంగా వుద్ధరించేవిగా వుండాలనుకుంటున్నాను."

"వ్యక్తి లేకుండా సంఘ మెక్కడుంటుంది వెర్రివాడా! ఎవరికీ సహాయాలు చేయకుండా చికిత్స చేయకుండా సంఘానికి నీవు చేయా లనుకున్నవి చేయగల మరోవిధానంమాత్ర మేముంటుంది?"

"తరతరాలకు అంటువ్యాధులుగా వుంటూ జాతి సౌష్ఠవాన్ని చెదర్చే వికారరూప జబ్బులు ప్రవేశించకుండా వుండేందుకు, మానవ జాతిలో అందముతో గూడిన దార్ఢ్యతను పెంచుటకు అవుసరమైన మార్గాలకొరకు పరిశోధనలు సలుపుతాను, ప్రయోగాలు చేయదలచాను. మానవులలో వికలాంగులేగాదు నల్లటి శరీరం గలవారినిగూడా లేకుండా చేయాలని నా ఆశయం. దరిద్రదేవత వడిలో మ్రగ్గుతూ సర్వనాశన మయ్యేవారి సంఖ్యకూడా సమాజంలో లేకుండా సుఖసౌఖ్యాల అవ కాశాలు అందరికీ సమానరూపంలో లభ్యమవురీతిలో వుండేట్లు కృషి సలుపుట నా ధ్యేయం. ఈ పరిశోధనల కృషికి, కార్యరూప సాధనకి నా జీవితాన్ని అంకితం చేయదలచానమ్మా."

"లేత మనస్సులమీద జీర్ణం చేసుకోజాలనంత విశేష విషయ జ్ఞానం పడినపుడు యిలాంటి వికృత ఆలోచనలు ఆవిష్కృతిస్తుంటవి. నల్లటివారిని యెర్రటివాళ్ళుగా రూపొందించే ప్రక్రియకొరకు పరిశోధ నలు సలుపుతున్నావంటే ఒక విధంగా ఆనందపడ్డాను. కాని యీనాడు నీవు చెబుతున్న విషయాలనే ఆలోచిస్తూ, ఆ విషయాలనే అందరి ముందూ వినిపిస్తే మతి బోయిందంటారు నాయనా!"

యువకత్వంలోని మొదటివ్యూహం మొండిధైర్యంతో నిలిచి వుంటుంది. ఆ మొదటి వ్యూహంలోనే సర్వశక్తిని కేంద్రీకరించగలుగు తారు. సఫలంకంటె విఫలమే యెక్కువగా సంభవిస్తుంటుంది. ప్రథమ కృషిలో సఫలం పొందిన వ్యక్తి విజయ శిఖరంమీద అంగలు పంగలు వేస్తుంటాడు.

తన ఆశయాల అంతస్థును అర్థం చేసుకోగల తాహతు సామా న్యులకు వుండదని, హాస్యాస్పదంగా తోస్తుందని, ప్రజా నిరాదరం తోను, ఆత్మీయుల అనాదరంతోనే తన సాధన సాగించక తప్పదని, సమాజోద్ధారకు లందరు యేకాకులుగా సాధించిన తదుపరే, సత్కారా

లను సన్మానాలను పొందారని, అందువలననే తాను నిశ్చింతుడై, నిర్భీతిగా తన ధ్యేయాన్ని సాధించాలని కఠోర నిర్ణయం చేసుకున్నాడు.

వాద వివాదాలకు స్వస్తిజెప్పి పెదతల్లిమాటలను విని వారి అభిప్రాయాలను కాదనకుండా, చిన్న నవ్వును ప్రదర్శించి మౌనముద్రతో ముందుకుపో నుద్యుక్తుడయ్యాడు.

భూదేవిద్వారా అలంకారాలు చేయించబడిన అతిథి గృహాన్నే తన ప్రయోగశాలగా చేసుకున్నాడు. విదేశాలనుంచి లక్షల విలువచేసే అనేక పరికరాలు రాబడినవి. వాటిని తానే స్వయంగా అమర్చుకున్నాడు. మైక్రోస్కోపులద్వారా సూక్ష్మజీవులను పరిశీలించగలిగినట్లు, యెక్సరేద్వారా ప్రేగులను శల్యాలను నాడులను మొదలగు వివరాలను చూడగలిగినట్లు, నాడులలో ప్రవహించు రుధిరాన్ని, అందున్న కణాలను స్పష్టరీతిలో వివరంగా చూడగల మొదలగు పరికరాలు అమర్చబడినవి. ఇంకా అనేక ఆధునిక పరికరాలు రాబడినవి.

ఇపుడు వసంతకుమార్‌కు తీరుబడిలేదు. రేయింబవలు పరిశోధనశాలలోనే గడిచిపోతున్నది, కాని ఆయన పరిశోధనశాలకు రోగులుగాదు వస్తున్నది. ఆరోగ్యవంతులైన పసివారు, ఆయనప్రక్క సహకారిగా వసంతకుమారి వుంటున్నది.

"జబ్బులేని పసివారిని అన్నివిధాల పరీక్షించు టెందుకండి ?" అంటుంది.

"రోగులకు మందులిచ్చే కార్యరంగాన్ని నే నెంచుకోలేదు. ఆరోగ్యవంతులైనవారిని ధృడకాయులుగాను, విశాలకాయులుగాను, అందమైనవారుగాను రూపొందించుటకు కావలసిన ప్రయోగాలు చెయాలిగదా !"

"తిను పదార్థాల ద్వారాను మందులద్వారాను దార్ఢ్యత పెరగవచ్చు కాని పుట్టుకలోనేవున్న పొట్టివారిని దీర్ఘకాయులుగాను, నల్లటివారిని యెర్రటివారుగాను, అందహీనమైనవారిని సుందరులుగాను యెలా చేయగలరు ?"

"ఆ విషయాలలోనే పరిశోధనలు సలుపుతున్నాను. సాధ్యమని మాత్రం విశ్వసించు. కాని యీ విధానం ప్రయోగాత్మకంగా తెలుసు

కోనుమాత్రమే. భవిష్యత్సంతానవిషయంలో శ్రద్ధ తీసుకొనుటకు కావలసిన మార్గాన్వేషణ చేయవలసి వుంది."

"మానవులలో వికారులు, వికృతులు అదృశ్యమై అందరూ అందమైనవారు ఆరోగ్యవంతులైనవారుగా రూపొందితే అద్భుతమైన విషయమే. కాని అది సాధ్యమంటారా ?" అని ప్రశ్నించింది స్వర్ణ.

"దీక్షాపరునిముందు సాధ్యమా, అసాధ్యమా అనే సందిగ్ధాలుండవు. సాధనే సమస్య, లక్ష్యమువైపు దీక్షవహించుట కర్తవ్యము. సంపూర్ణ విశ్వాసంలో విజయంతథ్యం. ఆత్మ విశ్వాసంలోనికృషి పవిత్రమైంది."

ఆ విధానంలోగాని, కృషిలోగాని స్వర్ణకుమారికి విశ్వాసం కుదురుటలేదు. కాని మనస్సు ఆవైపే పరువులెడుతున్నది. ఆకర్షింపబడుతున్నది, వసంతకుమార్ విదేశాలలో వుండి, నల్లటివాళ్ళను యెర్రటి వాళ్ళుగా మార్చుటకు పరిశోధనలు జరుపుతున్నట్లు విన్నపుడు తానెంతో ఆనందపడింది. నల్లటివారంటే ఆయన కంత అయిష్టమయినట్లు, సౌందర్యారాధకు డయినట్లు వూహించి తన అందాన్ని పరిశీలించుకుని ముగ్ధురాలయ్యేది. కనకాంబర కాంతుల నెదజల్లుతున్న తన శరీర కాంతి స్థాయిని యింకా అభివృద్ధిచేయు అభిలాషతో నూతన సబ్బుల నెన్నిటినో అరగదీసింది. అలంకారాలలో అద్వితీయమైన నేర్పు పొంది, నిలువుటద్దాలముందు నిలిచి వివిధభంగిమలలో సవరణలు చేసుకునేది. ఆనాడు చిత్రించుకున్న సుఖస్వప్నాలు నేడు తిరిగి చిగిర్చుతున్నవి.

వసంతకుమార్ వచ్చిన ప్రథమరోజుల్లో ఆమెను ఆవరించిన వుదాసీనత అదృశ్యమైంది. ఇపుడు వసంతకు భావాలు చాలావరకు అర్థమైనట్లున్నవి. నిరాడంబరతను ప్రదర్శిస్తున్నా, కార్యవిధానం ఆధిక్యతలకు అంతస్తులకీ దారితీస్తున్నట్లు భావించి తృప్తిచెందుతున్నది. భరింపరానిది బాధాకరమైంది హేయమైంది దారిద్ర్యము. దారిద్ర్యం అందానికి వికారరూప మిస్తుంది. మృదుత్వానికి కర్కశరూపధారణ నిస్తుంది. వెలుగును అంధకారం చేస్తుంది. నిస్పృహ నిరాశలలో నలిపివేస్తుంది. వివేకము విజ్ఞానము సంస్కారము వికారరూపంలో ప్రతిబింబిస్తుంటవి. అందుకే ఆ దరిద్రజాతిలోని ప్రజ స్వర్ణకుమారికి హేయంగా గనిపిస్తారు. వారి సాంపర్క్యం వెగటుగా దోస్తుంది. ఆధునిక అలంకారాలలో వున్నత

స్థాయిలో ప్రదర్శితమయ్యే వా రామె నాకర్షిస్తారు. వాటితో మెరుగుట సభ్యసమాజంలో మెలగుటగా దోస్తుంది. వసంతకుమార్ అందుకు భిన్న స్వభావిగా తలంచినపుడు బాధపడింది. నిరాడంబరతలోని ఆయన దరిద్రు లైన అసభ్యజాతికే సన్నిహితుడైనట్లు ఆనాడు వూహించింది. అది ఆనాటి తన పొరపా టభిప్రాయమైనట్లు నేడు అనుకుంటున్నది. నల్లటి వారన్నా, కురూపులన్నా, అనారోగ్యులన్నా ఆయనకు అయిష్టం. అంద రిని అందమైనవారినిగా, ఆరోగ్యవంతులైనవారినిగా రూపొందించ అభిలషిస్తున్నాడుగనుక తన అభిమతంలోనివాడుగానే భావించి ఆనంద పడుతున్నది. ఆయన కార్యరంగంయెడల వుత్సాహితురాలై అన్నివిధాలా తోడ్పడుతున్నది.

తన అందాన్ని యింకా పెంపొందించుకుని ఆయన్ను ముగ్ధుని చేయాలని యేన్నోవిధాల ప్రయత్నిస్తున్నది. ఆహారవిషయంలో అనేక మార్పులు చేసింది. అలంకారాలలోకూడా కొన్నిమార్పులు చేసింది. ఎప్పటికప్పుడు యేదో ఒక వినూత్నరూపంలో వచ్చి ఆకర్షింపబడాలని వచ్చి నిరాశ చెందినపుడు వికారంగా ప్రదర్శించే ఆమె ముఖంద్వారా విరక్తి వ్యక్తమవుతుంటుంది. ఆయనయడల, ఆయన కార్యరంగంయడల వుదాసీనత వహించి మౌనముద్రలో నున్నపుడు మరీమరీ పలుకరించి పనులు పురమాయిస్తుంటాడు. ఆప్యాయత లొలికిస్తుంటాడు, ఆమె పశ్చాత్తాపపడుతూ తిరిగి వుత్సాహితురా లవుతుంటుంది.

ఆయన పరిశోధనలకు వెంటవుంటూ అడుగు అడుగున సహకరిస్తూసర్వతోముఖంగాతోడ్పడుతున్నది, వారిరువురికి ఫలహారాలు, భోజనా లుసమకూర్చుట మెదలగుసౌకర్యాలు కల్పించుట మొదలగుకార్యభారాలు పద్మమీద పడినవి. క్షణం తీరుబడిలేకుండా పనులలో మునిగిపోవటం పద్మ స్వభావం, అనేక సమాయాలందు భోజనంకూడా ప్రయోగశాలకే తేబడుతున్నది. తెచ్చికూడా గంటలతరబడి వారిరాకకొరకు యెదురు చూస్తుంటుంది.

"మనం భోంచేసివద్దాం పద స్వర్ణా, యీ కార్యంలోపడి మర్చిపోతే ముందు పద్మ ప్రాణంపోతుంది." అన్నాడు వసృతకుమార్,

"తాను మనతోపాటు వుదయమే ఫలహారం చేయగూడదా ? లేక తనకు ఆకలయినపుడు భోజనం చేయవచ్చుగదా ! దాసీవాళ్ళలో యిలాంటి నిష్ఠలు శోభించవు."

"నిష్ఠలు నియమాలు ఆర్థిక అంతస్థునిబట్టి రావు. అవి కొన్ని ప్రత్యేకతలున్న స్త్రీల నంటివుంటవి."

"ఇలాంటి నిష్ఠలు నియమాలు ఆసభ్యమైనవి. అనర్థమైనవి. వీటిని నిర్మూలించే కార్యక్రమాన్నికూడా మనబోటివాళ్ళం వహించ వలసి వుంటుంది."

"నిష్ఠలు, నియమాలు, వ్రతాలు స్త్రీకి రాణించే ప్రత్యేక సొత్తులు గదా !"

"సంఘంలో కురూపులు అనారోగ్యులు లేకుండా చేయాలనే మీరు అంధ ఆచారాలను ఆదరించుట హాస్యాస్పదము."

"కొన్ని నిష్ఠలు, నియమాలు. వ్రతాలు ఆచరించుటలో స్త్రీలోని ఆత్మశక్తి, తద్వారా ఆత్మవిశ్వాసము పెరుగుతుంది. ఆ అభ్యాసంలో ఆకర్షణాశక్తికూడా పెరుగుతుంది. అవి స్త్రీకి అమూల్యమైనవి."

"నిష్ఠలు, నియమాలుద్వారా చాదస్తం బయటపడి వెగటుదనం పుడుతుంది. ఆహారము, ఆరోగ్యము, ఆనందము, అలంకారములద్వారా అందము అభివృద్ధి చెందుతుంది. ఆకర్షణ కలుగుతుంది. అంధ అచా రాలలోని చాదస్తంద్వారా పాటించే నిష్ఠలు యెలా ఆకర్షింపబడుత వంటారు ?"

మందహాసంతో 'కొన్ని చెప్పినా అర్థంగానివి, కొన్నివేళలందు అనుభవంలో తేలికగా అర్థమవుతవి. అలాంటిసమయం రానపుడు ప్రయాసపడినా ప్రయోజనముండదు. కాని ఒక్క విషయంమాత్రం గుర్తుంచుకోస్వర్ణా, నిష్ఠలు నియమాలు అమాయకత్వాన్ని ధృడత్వాన్ని పవిత్రాన్ని ప్రకటిస్తవి. అంతటి విశిష్టతలు కలిగిన స్త్రీలలో ఆకర్షణ వుండదని పవుడరు పటాటోపాలలో వుంటుందని అనుకోవటం గొప్ప పొరపాటు.'

ఆ మాటలలోని నిగూఢత ఆమె కర్థంకాలేదు. ఆయన స్వభావాన్ని గురించి తాను చేసుకున్న నిర్ణయాలు తొణికినట్లయింది. అధునాగరిక భావాలను సనాతన అంధ ఆచారాలలో పెనవేసి పేనినట్లనిపించింది.

"ఈ అంధ ఆచారాలలోని ఒక ఘోరరూపమైంది నేడు మన ముందు లేకుండా పోయింది. ఆనాటి సహగమనంకూడా మీ దృష్టిలో గొప్పదేనేమో!"

"దాన్ని అంత మూర్ఖపువిధానంగా అనుకోవటం పొరపాటే. నిర్బంధవిధానం చెడ్డదేకాని స్వచ్ఛందరూపంలోని సహగమనాన్ని మూర్ఖపుదిగా తలంచుట అమాయకత్వమే అవుతుంది. అనేక పక్షిజాతులలో జంటకు యేర్పడ్డాక, జంటలో ఒకటిపోతే రెండోది కృశించి ఆత్మాహుతి అవుతుంది. అయినా యీ విషయాలలో తర్కించుట అంత మంచిదిగాదు. ముందే నీకు చెప్పాను. అధ్యయనంద్వారాను ఆలోచనల ద్వారాను అర్థంగాని కొన్ని అనుభవంద్వారా అర్థమవుతవి. తార్కికం కంటె అనుభవంద్వారా అర్థమయేవే గీటురాళ్ళుగా మనస్సులో నిలుస్తవి."

ఇలాంటి సంభాషణలు జరిగినపుడు పద్మయడల ద్వేషభావం పొడసూపుతుంటుంది. మరుక్షణమే ఆమెడ దాసియని, అమాయకురాలని, ఎల్లపుడు పనులలో మునిగివుంటుందని, వినయశీలియని, పాపం నల్లటిదని తలపోసి జాలి నొందుతుంటుంది.

4. ప్రయోగశాల.

ప్రయోగశాలలోని ఒకవిభాగం నర్సింగ్‌హోం రూపం ధరించింది. అనేకమంది పసిబిడ్డలు తరగతులవారీగా విభజింపబడి పోషింపబడుతున్నారు. అనుభవంగల నర్సులుకూడా నియమింపబడ్డారు. శాస్త్రోక్త పద్ధతులలో పోషింపబడుతున్నారు. నియమవిధానంలో ఆహారాలు, విభిన్న రీతులలో పరీక్షార్థం కార్డులవారీగా యివ్వబడుతున్నవి. ప్రతిబాలునికి రోజువారీ పరీక్షాఫలితాలతో హిస్టరీ కార్డులు తయారుచేయబడుతున్నవి.

ప్రయోగశాలలోని మరో విభాగంలో నల్లటివారిని, పొట్టివారిని, వికలాంగులను, ప్రత్యేక దీర్ఘరోగులను జేర్చి అనేక సౌకర్యాలు కల్పించబడినవి. వారిమీదకూడా క్రమబద్ధమైన పరిశోధనలు జరుపబడుతున్నవి.

ఈ కార్యరంగ మంతటిలోను స్వర్ణకుమారి శ్రద్ధతీసుకుంటున్నది. ఉత్సాహంతో వివరాలు మరీమరీ అడిగి తెలుసుకుంటున్నది. కాని కుష్టువ్యాధితులున్నవైపు, కాన్సర్ట్యుమర్ జబ్బులవారివైపు మాత్రం యెన్నడూ పొరపాటునకూడా పోదు.

"రోగుల సేవాభారాన్ని నిర్వహించు కార్యరంగాన్ని యెన్నుకోలేదని చెప్పినపుడు నేనుమాత్రం మనస్సార ఆనందించాను. కాని నేడు మీరు రకరకాల భయంకరరోగులను జేర్చుకు కూర్చున్నారు. ఇది అర్థంగాకుండా వున్నది." అని ప్రశ్నించింది స్వర్ణ.

తరతరాలవరకు సంతానానికికూడా సంక్రమించే కొన్ని భయంకరవ్యాధులకు పూర్తినివారణకు కావలసిన మందుల ఫార్ములాలను కనిపెట్టుటకూడా మనధ్యేయం. కాని యీ శ్రమ యీ పదిమంది రోగుల కొరకు మాత్రంకాదు. ముందుతరాలవారిలో ఆలాంటి భయంకరవ్యాధుల భయమే లేకుండా నిర్మూలించుటకు." అన్నాడు వసంతకుమార్.

"జబ్బులన్నీ నయంకాగలవని, అసంభవమైనవేవీ లేవని తెలిసినపుడు రోగనివారణద్వారా చేసే మానవసేవ వుత్తమమైందిగా యెంచవచ్చుగదా !"

"ఆ మార్గంతో కొందరి శారీరకబాధలు నివారణ కావచ్చు, వ్యక్తిగతంగా కొందరికి వుపకరించవచ్చు. అది అనేకమంది డాక్టర్లు అనుకరిస్తున్న మార్గం. ఆ మార్గంద్వారా సంఘానికి సమిష్టిరూపంలో శాశ్వతమైన సంస్కారం జరగదు. మానవజాతి వున్నతస్థాయి చేరదు. నేను అవలంబిస్తున్న మార్గం యెవరూ హర్షించనిది, అవహేళనపాత్రమైంది. అయినా అది నా యేకయిక మార్గం."

ఆమాట లామెకు అర్థమయినట్లూలేదు, కానట్లూ లేదు,

వసంతకుమార్ ప్రయోగశాల ప్రారంభించి రెండు సంవత్సరాలు గడిచిపోయినవి. ఉన్నభవనం చాలక నూతనభవన నిర్మాణం ప్రారంభమయింది. అనేకవైపులనుంచి వివిధ వదంతులుకూడా ప్రబలినవి. 'ఇంతచదువులు చదివి విదేశాలలో గణితికెక్కి వచ్చి ధనార్జన లెక్కించకుండా సంఘోద్ధరణకు యేదో గొప్ప కార్యాన్నే తలపెట్టాడు' అని కొంతమంది, 'డాక్టరైనవానికి చికిత్స ప్రధానాశయంగా వుండాలి, అందుకు ప్రతిగా వికృతకార్యాలకు దిగిన ఆయనకు మతిభ్రమ కలిగి వుంటుంది' అని కొందరు అనుకోసాగారు.

పసివారికి తగినరీతిలో పోషణ జరుగుతున్నదన్న ఆశతో అనేకమంది తెలివిగలవారు తమపసి బిడ్డలను స్వయంగా తీసుకొచ్చి ప్రయోగశాల కప్పగించి వెళ్ళిపోతున్నారు. అందాన్ని ఆకాంక్షించే కొందరు తమ నల్లటి పసిబిడ్డలను యెర్రటివారినిగా చూడ ఆశించి వసంతకుమార్ కందజేస్తున్నారు.

ప్రథమంలో యీ కార్యరంగంయెడ భూదేవి అసంతృప్తి చెందినా పోనుపోను వుత్సాహితురాలైంది. ఈ నూతనరంగంలోనైనా తన బిడ్డ తప్పక పేరు గడిస్తాడని గొప్పగొప్పవారిచేత శ్లాఘించబడతాడని వూహలు సలిపి ఆనందపడింది.

"వాడి వెర్రిపనులకుకూడా యేవో రూపఘనతలు సృష్టించుకుని గొప్పగా శ్లాఘించుకోవడం నీకు అలవాటయిపోయింది అక్కా" అన్నది వింధ్యారాణి.

"వాడు వెర్రివాడుగాదు, నీవే వెర్రిదానివి చెల్లీ! వాడు డాక్టర్లందరివలె వైద్యవృత్తిలో దిగి సంపాదించవలసిన అవసరంలేదు. ఏదో ఒక గొప్ప కార్యాన్ని సాధించి చిరస్థాయిగా పేరును నిలబెట్టుకునే సాధన చేయుట వివేకమే అవుతుంది అవివేకంగాదు." అన్నది భూదేవి.

"నీ ప్రోత్సాహము స్వర్ణ సహకారంతోవాడు మరీ వెర్రివాడై తన వికటరూప కార్యరంగాన్ని విస్తృతం చేసుకుంటున్నాడు." అన్నది.

నీ మాటలతో నిరుత్సాహపడకుండా మా ప్రోత్సాహంలో ముందుకు పోతే అదీ మంచిదేగా."

భూదేవి సంతృప్తికి, ప్రోత్సాహానికి అంతర్యమైన అసలు కారణం, వసంతకుమార్ తలపెడుతున్న ప్రతి కార్యంలోను స్వర్ణ పాల్గొని శ్రద్ధ వహిస్తున్నది. ఆ రూపంలో యిరువురి అన్యోన్యత పెరుగుతున్నది. వారి కలయికలో ఆత్మానందాన్ని పొందుతున్నది. ఆ మూడు ముళ్ళు వేసి అదే రీతిలోని వారి కృషిని చూసి ఆనందించుట కంటె ఆమె వాంఛించగలిగిం దేముంది!

పోనుపోను భూదేవి వారి వివాహ విషయంలో ఆదుర్దా చెందు తున్నది. వసంతకుమార్ దృష్టి కేవలం యీ ప్రయోగాలమీదనే లగ్నమై యాంత్రికజీవిగా మారతాడనే భయమూవుంది. వివాహమైతే గృహజీవితం వైపు మరలుతాడని ఆమె ఆశ. నిత్యము తోడుగా సహకరిస్తున్నపుడు యెలా మెలగుతున్నాడో, స్వర్ణద్వారా తెలుసుకుని సంతోషపడుతున్నది.

వివాహ నిర్ణయం చేయాలనేవాంఛతోనే అనేకమారులు ప్రయోగ శాలవైపు వెళ్ళి అనేక విషయాలను తెలుసుకుని ప్రశంసించింది. వసంతకుమార్ స్వర్ణకుమారి ఆమెను వెంటదీసుకెళ్ళి, ప్రతి విభా గాన్ని పరిశీలనగా చూపి వివరించినపుడు పొంగిపోయి శ్లాఘిస్తూ 'స్వర్ణ నీ పనులలో యిమిడిపోయింది వసంతం. దీనికి యింత శ్రద్ధాసక్తులు కలుగుతవని యెన్నడూ వూహించలేదు.' అన్నది భూదేవి.

"వయస్సులో సాహసముంటుంది. ఆ సాహసంలోనే అసాధ్యాల వైపుకూడా అడుగు వేయగల విశ్వాసం కలుగుతుంది."

"కార్యంమీద విస్వాసము వుత్సాహము స్వతహాగా లేకపోయినా ప్రేరకుల యెడ గల ప్రేమ విశ్వాసాలతోకూడా దీక్ష వహించవచ్చు గదా వసంతం!"

"లక్ష్యంమీద విశ్వాసదీక్ష లేకుండా అభిమానంద్వారా జరిగే కృషిలో పటుత్వముండదు. పటుత్వంలేని కృషిలో సఫలత కష్టసాధ్య మమ్మా."

"ప్రేమాభిమానాలు ధృఢమైన వయినపుడు అవలంభించినబలం కూడా ధృఢమైన సఫలం వైపుకే నడుస్తుంది బాబూ. జీవితంలోని నడ కంతా స్వమతానికి కట్టుబడి వుండదు. కొంత యిష్టమైనవారి మతాను

సారం నడక సాగుతుంది. ప్రేమానురాగాలమధ్య విభిన్నతలు అదృ శ్యమై ఏకత్వం మిగులుతుంది."

"నా కార్యరంగం నేటికయినా నీకు నచ్చిందా అమ్మా!"

"నీవు జీవితంలో ఒక విశిష్టకార్యాన్ని సాధించి వంశానికి శాశ్వత కీర్తిని గడిస్తావని యేనాడో పసిగట్టాను."

భక్తితో పాదాలంటుతూ 'అంతా నీ ఆశీర్వాదబలమే అమ్మా!'

చుబుకాన్ని పుణుకుతూ 'నిన్ను ఒక యింటివాడిని చేస్తే మా బాధ్యత తీరిపోతుంది. ఆ శుభవార్త నీద్వారానే అందుతుందని యెప్పటి కప్పుడు యెదురుచూస్తున్నాను నాయనా!'

"వివాహంద్వారా మానసిక బలహీనత యేర్పడుతుంది. లక్ష్య సాధనలో కుంటు జరుగుతుంది. కనుక సలుపుతున్న కృషి సఫలతవైపు మొగ్గందే వివాహవిషయంవయిపు మనస్సు పోనివ్వదలచలేదమ్మా."

"విశ్వాసంలోని కృషికి అపజయమంటూ వుండదు. కాని విజ యంతో కార్యరంగం ముగిసిపోదు. ఆ తరువాత చేయవలసిందే అధి కంకా వుంటుంది. వివాహం నీ కృషికి ప్రతిబంధకం కాజాలదు బాబూ. తద్వారా దోహదమే జరుగుతుంది."

ఆవిషయంలో యింకా లోతుకు పోవటం ఆయన కిష్టంలేదు. ఆమె మనస్సు మరల్చను, తన పరిశోధనలో ఫలించిన కొన్ని నిదర్శన లను చూపను ఆదుర్దాతో నర్సింగ్‌హోంవయిపు తీసుకెళ్ళి కారునలుపు నుంచి యెరుపుకు మారుతున్న యిరువురి పసివారిని చూపించాడు. ఆమె వుత్సాహంతో మరీమరీ పరిశీలిస్తున్నది.

తన విజయానికి తల్లి పొందుతున్న సంతోషాన్ని చూసి తన్మయుడవుతూ కాన్సర్‌కు, ట్యూమర్‌కు, డైబిటీస్‌కు, కుష్టుకు, పక్ష వాతానికి, గుండెసంబంధమయినవాటికి సంబంధించి తను సలిపిన పరి శోధనలను వాటి ఫలితాలను ప్రత్యక్ష అప్రత్యక్ష రూపంలో సిద్ధాంతరీక రిస్తూ వ్రాసిన పెద్దపెద్ద వ్రాతప్రతులను చూపుతూ 'ఇవి నా కృషిలోని అమూల్య భాగమమ్మా. శరీర శాస్త్రానికి నూతన సందేశాల నిస్తవి. చికిత్సకు కావలసిన ఫార్ములాస్‌ను కూడా స్థిరీకరించాను. ఈ ఫార్ములాస్

అమ్మితే కొన్ని లక్షల ధన మొస్తుంది. కాని యీ ద్వారా ధనసేకరణ చేయాలని లేదు నిర్ణయం చేయలేకపోయినందునే ఆ ఫార్మిలాస్ విష యంలో యింకా పరిశోధనలు జరుపుతున్నాను.'

"రోగుల నుద్ధరించుట నా లక్ష్యంగాదు. ఆరోగ్యంతో అందంతో, దార్ఢ్యతతో దీర్ఘ కాయంతో మిసమిసలాడే మానవసమాజసృష్టికి నాందివే యుట నా కర్తవ్యం. నా సర్వశక్తిని అందుకే వినియోగిస్తానుదప్ప చావు మంచాల మీదనున్నవారి ప్రాణాలను నిలిపి అర్భకులుగా జీవించేట్లు చేయుట నా కార్యంగాదు అన్న నీవు యీ భయంకర జబ్బుల కుదుర్పు టకు యింత శ్రద్ధ యెలా తీసుకున్నావు బాబూ!"

"నూతన నిర్మాణం ప్రారంభించిన క్షణమే పాత శిధిలాలను నిర్మూలించి మనుట కష్టము. శిధిలాల స్థానాన్ని నూతన నిర్మాణం సంయమరూపంలో పొందాలి. అంతవరకు ఆవైపు రక్షణకూడా అవస రమే. నా లక్ష్యంలో బలం దొరికేవరకు చికిత్సకులకు నూతన సందే శాలను ఫార్మిలాస్ రూపంలో అందించ దలచాను."

"నీ వూహిస్తున్న యోగ్యలక్షణాలన్నీ వున్న ఒక వ్యక్తి రుగ్మ తతో బాధపడుతున్నపుడు, చికిత్సద్వారా పూర్తి ఆరోగ్యాన్ని పొంద గల అవకాశమున్నపుడు, ఆ వ్యక్తిని ప్రారబ్ధానికి వదలుట ధర్మమా బాబూ!"

"అక్కడ చికిత్స కర్తవ్యంగానే భావిస్తాను. కాని కేవలం నిత్య చికిత్సాబలంతో, మందుల ఆధారంతో అందవిహీనులుగానో, అర్భకులు గానో, నిత్య గణ్డాలతో యమయాతనలతో జీవింపజేయుట అనర్థ ప్రయాసని నా తలంపు. అలాంటివారిద్వారా వారి సంతానంద్వారా సమాజస్థాయి దిగజారిపోతుంది తప్ప సుఖశాంతులు చేకూరవు."

ఇది ఆమెకు కలతను కలిగించే సమాధానం. ఇంకా ప్రశ్నిస్తే యెలాంటి కఠిన విషయాలు వినవలసివస్తుందోనన్న భీతితో ఖిన్నవద నంతో తిరిగి వెళ్ళిపోయింది.

ఆమె మనస్సులో ఆ విషయాలే మెదులుతున్నవి. గొప్ప అను భవంగల స్త్రీ గనుక మందలింపులతోగాని మరోవిధ యత్నాలతోగాని

ఆయన అభిప్రాయాలను మార్చుట దుర్లభమని నిర్ణయించుకున్నది. స్వర్ణ అభిప్రాయాలను తెలుసుకోవాలని యెన్నోమారులు ప్రయత్నించింది. స్పష్టమైన అభిప్రాయాలు తెలియకపోయినా ఆత్మపూర్వకంగా ఆయనకు సహకరిస్తున్నట్లు స్పష్టమయింది. వారి కృషి స్వరూపమెలాంటిదయినా యిరువురిలోని కలియక ఆమె నాకర్షిస్తున్నది. ఆ ఒక్క విషయంతోనే సంతృప్తి చెందుతున్నది.

5. డిన్నర్ల గంగరాజు

గంగరాజు నేడు రాజయకీనాయకుడు. దేశ స్వాతంత్ర్య పోరాటపు రోజులలో ఒక చిన్న వ్యాపారి. యుద్ధసమయపురోజులలో కంట్రోళ్ళు పర్మిట్లు లైసెన్సులు ప్రబల ప్రభావంలో నున్నపుడు చీకటి వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తి. అనేక సారాషాపుల, నల్లమందుకొట్టుల లైసెన్సు లన్నీ ఆయనమీదగానే నడుస్తుండేవి. పోలీసువారిపాలిట ఆప్తమిత్రుడు. రాజకీయ నాయకులలో యెవరిమీద యెలాంటి నిగా వుంచాల్సింది, కేసులు పెట్టాల్సింది, యెంతెంత శిక్షలు విధించాల్సింది మొదలగు కర్మకాండంతా ఆరోజుల్లో గంగరాజుగారి సలహామీదగానే జరుగుతుండేది. రాజకీయ సత్యాగ్రహులమీద కేసులుపెట్టి జర్మానాలు విధించినపుడు, ఆ జర్మానాలకొరకు వారి ఆస్తులను వేలం పాడినపుడు అన్నిటిని చౌకపారుగా తన పేరనే కొట్టివేయించుకున్నాడు. ఆ రూపంగా కూడా ఆయన ఆస్థి అనేకవిధాల అభివృద్ధి చెందింది. ఆఫీసర్లకు తరచుగా డిన్నర్లివ్వటం ఆయనకు బాగా అభ్యాసమయింది. ప్రజలలో ఆయనకు డిన్నర్ల గంగరాజని ప్రతీతి కలిగింది. ఆస్థితోపాటు అయన అభ్యాసాలుకూడా వున్నతస్థాయికే చెందినవి. పూర్తిబాటిల్ త్రాగి ఖిల్లీవేసి పొరబడకుండా మాట్లాడుతుంటాడు, ప్రేమకలాపాలలో ఆరితేరిన రశికాగ్రేసరుడు. ఆరోజుల్లోనే ఆ డిన్నర్ల బలంతోనే జిల్లాబోర్డు ప్రెసిడెంటుగా నామినేటు అయ్యాడు. బోర్డు కాంట్రాక్టులన్నీ లంచాలతో ముంచి ఆ రూపంగాకూడా అపారధనం సంపాదించాడు.

బ్రిటిషువారు వైదొలగి స్వతంత్ర పరిపాలన ప్రారంభమయ్యాక తన నివాసాన్ని వైజాగ్‌నుంచి విజయనగరానికి తరలించాడు.

స్వతంత్ర ప్రభుత్వంలో యెన్నికలకు ప్రాధాన్యం పెరిగింది. యెన్నికల సంరంభంలో విజయం పొందుటకు వోట్లు కొనుగోలుశక్తి గలవారిని, యెన్నిక తాంత్రికులను తమ ప్రతినిధులుగా తీసుకోవలసిన దుర్బలత పార్టీలకు పట్టింది. గంగరాజుకు కాంగ్రెస్ తరపుగా అసెంబ్లీసీటుటిక్కట్టు లభించింది. ప్రజలుకూడా అలాంటివారి విజయానికే జేజేలుకొడుతుంటారు, ఆయన కాంగ్రెస్‌తరపుగా అసెంబ్లీసభ్యుడేగాదు యింకా చిన్న చిన్న అనేక పదవులనుపొంది ప్రచలితుడయ్యాడు. ప్రభుత్వంలో ఆయన పలుకుబడి స్థిరపడింది. ప్రస్తుతం పొందూరుఖాదీదప్ప ధరించడు. ఇపుడాయన విజయనగరానికేగాదు, జిల్లా నాయకుడుగా మెదులుతున్నాడు.

గంగరాజు తన ప్రభావాన్ని మరింత విస్తృతం జేసుకునే వుద్దేశంతో రాష్ట్రరాజకీయ మహాసభలను విజయనగరంలో జరుపుటకు ఆహ్వానించాడు. ఈ ఆర్భాటాలు చేస్తున్న మధ్యకాలంలో జరిగిన విద్యార్థుల సమ్మేల సందర్భంలో జరిపిన ఆయన చర్యలకు విద్యార్థులు క్రుద్ధులై గంగరాజుగారి నగ్నరూపాలు, అంటూ కరపత్రాలద్వారా ప్రచారంచేసి ఆయన్ను అన్నివయిపులా యెదుర్కొన్నారు. ఆయనలో మహాసభలు జరిపించలేనన్న అధైర్యం పొడసూపి మరో శక్తిమంతుడు, అధికారకాంక్షారహితుడు, ప్రజాప్రభావం కలవాడు అయినవారి సహకారాన్ని వాంఛిస్తూ ఆలోచనలు సలుపసాగాడు.

ఆయన మనస్సును ఒకేవ్యక్తి ఆకర్షిస్తున్నాడు. ఆర్థిక అంతస్థు గలవాడు, వ్యయంలో వెనుకాడనివాడు, ధనాన్ని మంచినీటివలే పారబోయగలవాడు నిస్వార్థనిరాడంబరియై ప్రజలలో ప్రభావంగల వసంతకుమార్ ఒక్కడే తనను వుద్ధరించగలవాడుగా నిర్ణయించుకున్నాడు. విదేశాలలో గొప్ప కీర్తి గడించివచ్చిన వసంతకుమార్ ప్రారంభించిన ప్రయోగశాలను గురించి పలువిధాల వదంతులు ప్రబలినవి. ఆయనేదో విశిష్టకార్యాన్ని సాధిస్తాడని కొంద రంటుంటే మతిపోయిన కార్యాలు చేస్తున్నాడని మరికొంద రంటున్నారు. అయినా ఆయనమీద ద్వేషం గాని యీర్ష్యగాని యెవ్వరికీలేదు. సానుభూతి, ఆదరము, అభిమానము

అందరిలోను వున్నవి. అందుకే ఆయన్ను తనకు సన్నిహితం చేసుకుని తనమీది వ్యతిరేకవర్గాలు రేపుతున్న దుమారాన్ని అణచివైచి తిరిగి వస్తున్న యెన్నికలకు వాతావరణాన్ని యోగ్యంగా చేసుకునే తలంపుతో వసంతకుమార్ సహకారాన్ని వాంఛిస్తున్నాడు.

ఆయన్ను ఆహ్వానసంఘ అధ్యక్షుడుగా వుండమని అర్థించాడు.

"అన్యథా తలంచక క్షమించండి. అంత సమయాన్ని వ్యయం చేయగల అవకాశం నాకు లేదు." అన్నాడు వసంతకుమార్.

"రాజకీయ మహాసభ ఆధిపత్యం వహించుట సమయవ్యర్థంగా భావిస్తున్నారా? మీరు కీర్తిగడించిన విజ్ఞులు. సమాజసేవకు కంకణం గట్టిన త్యాగమూర్తులు. నేటి రాజకీయరంగంలో మీబోటి హర్షులు యోగ్యులు అయినవారి నేతృత్వం అవసరం. అందుకే సాహసంతో మిమ్ము ఆహ్వానిస్తున్నాను. మీరు నిర్లక్ష్యంచేయుట నా దురదృష్టంగా భావిస్తున్నాను." అన్నాడు గంగరాజు.

వసంతకుమార్ మందహాసాలోలికిస్తూ 'నేను నిర్లక్ష్యంతో అన్న మాటలుమాత్రం కాదు. నేడు రాజకీయం లేకుండా సంఘజీవితమే లేదు. సమాజానికి రాజకీయం ప్రధాన కీలకమయింది. అయినా నేటి రాజకీయాలలో నాకు తృప్తిలేదు. ఒక పార్టీప్రభుత్వం సర్వజన క్షేమకరం కాదని, సర్వజన ప్రభుత్వం వాంఛనీయమని, రాజకీయ అధికారంద్వారా శాసనాలద్వారా ప్రయత్నించే ఆర్థిక సమానత్వం, యదార్థ సమానత్వాన్నివ్వజాలదని, మానవస్థాయినే వున్నతంజేసి, భావవిప్లవంతెచ్చి స్వార్థకాంక్ష అను వ్యామోహాలను, యీర్ష్యాద్వేషాలను నిర్మూలించి సహనత్యాగశీలతను మస్తిష్కాలలో నింపి సమిష్టి సంఘ క్షేమ వాంఛను రేకెత్తించాలని నా అభిమతం. అభిలాష లేనివైపు మనస్సు నడువదుగదా!' అన్నాడు.

"మీ యెదుట సాహసించుట అధిక అపరాధమే అవుతుంది. అయినా నిష్కాపట్యులు, నిస్వార్థపరులు, సంఘ సేవా తత్పరులు అయిన మీ ముందు మనస్సులోని మాట చెప్పకపోవుటకూడా దోషమవుతుంది. మీరు విజ్ఞానవేత్తలు, వివేకులు, అధిక అధ్యయనపరులు అయిన మీరు

శ్రద్ధతో ఆలోచిస్తే యదార్థాన్ని గ్రహించగలరు. సర్వజన ప్రభుత్వ స్థాపన రాజకీయ పార్టీలద్వారానే కాగలుగుతుంది. ఒక పార్టీద్వారా నిర్మింపబడిన ప్రభుత్వమే సర్వజనశ్రేయోదాయక ప్రణాళికలద్వారా పార్టీ యితరులనుకూడా ఆకర్షించి అందరి ప్రాతినిధ్యాన్ని వహించ గలుగుతుంది. ఆర్థికసమానత్వం శాసనాలద్వారాగాక ప్రబోధాలద్వారా యెన్నటికీ రాజాలదు. రాజకీయపక్షాల అధికారాల ప్రభావం మనకు వ్యక్తం చేస్తున్నదె అది. ప్రజలకు రాజకీయపార్టీలకు సంబంధం లేకుండా మీరు తేదలంచిన భావవిప్లవంకూడా సాధ్యంకాదు. రాజకీయాధికారం లేకుండా సంఘంలో యేమీ చేయలేము. కనుక మీరు ప్రత్యక్ష రాజకీయాలలో ప్రవేశించాలని నా మనవి." అన్నాడు గంగరాజు.

"శాసనాలద్వారా తెచ్చే సమానత్వం భూమిపదిరి మ్యాపులోని రంగులమార్పుతో సమతలం చేయుటలాంటిది. మానవవాంఛలోని రాక్షసత్వాన్ని సహకరించకుండా, త్యాగబుద్ధిని అలవర్చకుండా ఈర్ష్యాద్వేషాలకు స్వస్తిజెప్పకుండా శాసనాలద్వారా సమానత్వం రాజాలదు. వచ్చినా నిలువజాలదు. శాసనాధికారాలకు అతీతుడై శాసించకుండా, అధికారాలు చలాయించకుండా సమానత్వాన్ని ప్రబోధిస్తూ, వ్యక్తిగత సంపత్తిని నిరోధిస్తూ, అహింసాతత్వాన్ని, సేవాభావాన్ని, త్యాగాన్ని నూరిపోస్తూ యావత్ మానవజాతిని ఆకర్షించి తనవైపు మరల్చి తన పరిధిలో నడిపిన గౌతమబుద్ధుని విజయాన్ని యెవరు కాదనగలరు? మానవ విజయాలమీద ఆయన పొందిన విజయమే యదార్థమైన విజయము. వ్యక్తిగత స్వార్థకాంక్షలోని తీవ్రత సమిష్టి సంఘానికి వేరుపురుగు లాంటిది. దాన్ని శాంతింపజేయుటలోనే, నిర్మూలంచుటలోనే సమాజ కళ్యాణమున్నదని గుర్తించాడు గనుక బుద్ధభగవానుడు ఆ చికిత్సనే ప్రారంభించి దిగ్విజయం పొందాడు. హృదయ పరివర్తనకు నాంది వేయకుండ, సహనతకు, సేవాభావానికి, త్యాగానికి విలువను పెంచకుండా అధికార వ్యామోహాలకు, హీనమైన స్వార్థపోరాటాలకు పోటీలు పెంచుతూ, హృదయాలలో హింసాత్మకమైన క్రూరతను, రాక్షసత్వాన్ని బర్బర రూపంలో నింపుతూ శాసనాలద్వారా సంఘాన్ని స్వర్గతుల్యం చేయగలమని చాటుట హాస్యాస్పదం గదా!"

సమాధానం ఘాటుగా తోచింది. గంగరాజు మనస్సు చివుకు లాడింది. రాజకీయవాదులు శబ్దార్థతర్కానికయినా గొప్ప యుద్ధకాండను సృష్టించగలరు. అయిష్టవాతావరణంలోకూడా చిరునగవును చిలికిస్తూ ఆవేశాన్ని హరించగలరు. కార్యసాధనకు కావలిసిన సహనం సరి తూగుతుంటుంది.

"వసంతకుమార్‌గారూ, మీ వాదనను కాదనగల శక్తి నాలో లేదు. ఏ పరిధిలో అశాస్త్రీయత నిండివున్న దనుకుంటామో దాని కతీతంగా వుండి విమర్శించేకంటే, ఆ పరిధిలోనే అడుగిడి సంస్కరించి శాస్త్రీయ దృక్పథాన్ని కల్పించుట వివేకమవుతుంది, కనుక రాజకీయ రంగంలో మీ సాంపర్క్యం అత్యవసరంగా భావిస్తున్నాను. మీరన్న గౌతమబుద్ధుని ఆశయాలలో యెక్కడో లోపం వుండబట్టే కాలగర్భంలో మరుగున పడిపోయింది." అన్నాడు గంగరాజు.

"అది పొరపాటు. బుద్ధుని ఆశయాలలో లోపమూలేదు. నేటికీ మరుగున పడలేదు. అనేక దేశాలలో ఆయన ఆశయాలు నేటికీ స్మరించబడుతున్నవి. అమలు జరుగుతున్నవి. కాని ఆయన ఆశయాలు యధాతథంగా గాక వికృతరూపం ధరించినవంటే అతిశయోక్తి గాదు. ఆశయాలు, ఆలోచనలు, నీతులు, నియమాలు యెల్లకాలం ఒక్కరూపంలో వుండవు. అన్నిటిమీద సమాజ సంపత్తి ప్రభావం యెప్పటికప్పుడు మార్పు తెస్తుంటుంది. విధానాలు ఒకే రీతిలో శాశ్వతం కాజాలవు." అన్నాడు వసంతకుమార్.

తాను రాజకీయ మహాసభలలో పాల్గొను యిష్టగించకపోయినా తనంతట తానుగా రెండువేలు చందావేసి వెంటనే యిచ్చినపుడు గంగరాజులోని అసంతృప్తి అదృశ్యమైంది, ఆశ్చర్యం కలిగించింది. అభిమానంకూడా కలిగింది. ధనం మనస్తత్వానికి గీటురాయివంటిది. అలాంటి ధనాన్ని అయిష్టమైనచోట అంత ధారాళంగా యివ్వగలిగిన వసంతకుమార్‌లోని అవ్యాజమైన వుదారతకు ముగ్ధుడైపోయాడు. ఇక ఆయన సాంపర్క్యాన్ని సానుభూతిని అనేకవిధాల పెంచుకొను ప్రయత్నిస్తున్నాడు. ఆయన అభిమానాన్ని చూరగొనుటే ప్రజాభిమానాన్ని చూర

గొనుటగా దలంచాడు. తన రాజకీయ విజయం ఆయన సాంపద్యం లోనే యిమిడివున్నట్లు గ్రహించాడు, ప్రజలలో ఆయనయెడల గల సానుభూతిని తెలుసుకున్నాడు. అందుకే ఆయనవద్దకు రాకపోకలు పెంచివేశాడు. ఆయనకు యిష్టమున్నా లేకున్నా తన కార్యక్రమాలన్నిటి మీద ఆయన మౌనముద్రలు వేయించుకుంటున్నాడు,

విద్యార్థులద్వారా ప్రచారమయిన కరపత్రాలను స్వర్ణకుమారి చదివింది. కటిక స్వార్థియని, మోసగాడని, దొంగనాటకాలలో ఆరితేరిన వాడని, నీతిలేని వాడని ఒకనాటి దేశద్రోహి నేడు నాయకుడుగా చలామణి అవుతున్నాడని ఆమె అర్థం చేసుకున్నది. రాజకీయ మహాసభలకు చందాలు యిచ్చుటగాని, ఆయన రాకపోకలుగాని స్వర్ణకుమారి కేమాత్రము యిష్టములేదు. తన మనస్సులోని అయిష్టతను వసంతకుమార్‌కు స్పష్టం చేయలేకపోతున్నది.

ప్రయోగశాలలోని సర్వింగ్‌హోం నుంచి అపుడే వచ్చి ఆఫీసులో కూర్చుని వ్రాసుకుంటున్న వసంతకుమార్ యెదుటగా టేబులుముందు నిలిచిన స్వర్ణకుమారి 'గంగరాజుగారిని గురించి మీ అభిప్రాయమేమిటి?' అని ప్రశ్నించింది.

ఆయన చేస్తున్న పని ఆపి నవ్వుముఖంతో 'అలా ప్రశ్నించావేమిటి?' అన్నాడు.

"ఆయన ఒకటోనెంబరు దుష్టగ్రహం, గొప్ప మోసగాడు." అన్నది.

"ఆయన్ను గురించి ఆలోచించటానికి మనకు సమయ మెక్కడిది! అయినా ఆయన రాజకీయ నాయకుడుగదా!"

"రాజకీయ నాయకులంతా రాంత్రికులు, మోసగాళ్ళే నంటారా?"

"అనేకులు కాకపోవచ్చు. నేటి రాజకీయ వాతావరణమే దుర్గంధ పూరితమై ఆపాప ప్రోత్సాహమిస్తున్నది."

"అలాఅయితే ఆ రాజకీయాలకు ఆ నాయకులకు దూరంగా వుండుట మంచిదిగదా!"

"నేటి జీవితసమస్య అడుగడుక్కీ రాజకీయాలతో ముడివడి పోయింది."

"రాజకీయం లేకుండా జీవితమే లేదంటారా?"

"సన్యసించుట అందరికీ సాధ్యంగాదు. ఒకవేళ విరాగియై సన్యసించినా అక్కడా ఆ రాజకీయా లుండవని యెవరు చెప్పగలరు?"

"ఈ గంగరాజుతో సంబంధం లేకపోతే మనం రాజకీయాల కతీతులమేగదా!"

"ఆదర్శ సమాజంయొక్క నమూనాను ప్రదర్శించు కృషిలోని మనం దాని కతీతుల మెలా కాగలం?"

"అలాంటి అప్రత్యక్ష రాజకీయ వాదులమైనందున యిబ్బంది లేదు. కాని యీ పచ్చి మోసగాడైన గంగరాజు సాంపర్క్యం హర్షింప దగినది గాదు."

"మన విశ్వాసాలమీద మనం దృఢ సంకల్పులమైనపుడు మన సాంపర్క్యం ద్వారా అతనిలోని దుర్గుణాలు దూరం గావచ్చుగదా!"

6. కార్యాచరణ

కాలం గడుస్తున్నకొంది భూదేవిలోని ఆదుర్దా ఆందోళనరూపం ధరిస్తున్నది. వివాహ విషయంలో యింకాతాత్సారం చూడదనుకున్నది.

వివాహ విషయంలో తన కంత ఆదుర్దా లేదని, ఆ నిర్ణయాని కొచ్చినపుడు సర్వసామాన్యురాలయిన అనాథవిధవనుగాని, కడజాతి కన్యనుగాని వివాహమాడదలంచినట్లు, వసంతకుమార్ తన దృఢ నిర్ణయాన్ని వినిపించినపుడు ఆమె విస్తుపోయింది. మతి పోయినట్లయింది. మామూలు స్థితి కొచ్చుటకు కొంత సమయం బట్టింది. తనను పరిహాసం చేస్తున్నట్లనిపించింది, 'నేను పదేపదే తొందరపెడుతున్నానని వేళాకోళం జేస్తున్నావా బాబూ!'

"లేదమ్మా. అలాంటిదేమీ లేదు. నిజమైన నిర్ణయాన్నే చెప్పాను. నచ్చిన ఒక విధవనో కడజాతి కన్యనో పొందజాలనపుడు ఒక్క అనాధనైనా ఆదరించాలని నా తలంపు."

"వివాహంద్వారా నీవు ఒక్క అనాధనో విధవనో ఆదరించి నంత మాత్రాన దేశంలోని అనాధుల సంఖ్య అంతంగాదు. అధికంగా చదివిన వెర్రిఫలిత మిది వసంతం!"

"విశ్వాసాలమీద జీవితమంతా వట్టి ప్రచారాలు చేసేకంటే నిర్మా ణాత్మకంగా స్వానుభవంలో ఆదర్శరూప త్యాగ నిదర్శనను ఒక్కటి చూపుట మహత్వపూర్ణమైందమ్మా. అభిప్రాయాలు, వుపన్యాసాలుగాదు కావలసినది, ఆచరణ. ఆచరణ వేయివిధాల ప్రభావా న్నిస్తుంది, ప్రచారం జరుగుతుంది. నిర్మాణాత్మక నాంది ప్రారంభమవుతుంది."

"ఆధునిక భావాల మోజులో, ఆదర్శము ఆచరణీయము అనే భ్రమలో, సామరులలో పొందు మన్ననల ప్రలోభంలో అనుభవజ్ఞానం లేని నేటి యువకు లనేకమంది అవలంబిస్తున్న ధోరణి యిదే. నీవు యీ వెర్రిలోనే పడిపోయావు. ఎంత విచిత్రం! కులాలు మతాలు ఆర్థిక అంతస్థులు పవిత్రం గాకపోవచ్చు, శాశ్వతం కాకపోవచ్చు కాని వివే కము విజ్ఞానము వున్నచోటే సంస్కారముంటుంది. అక్కడే మానవ మూల్యముంటుంది. అక్కడనుంచే కళ్యాణకర మార్గ నిర్మాణం జరుగు తుంది. అందుకు ప్రతిగా వికృతభావంతో, జీర్ణంగాని ఆశయాలతో మురికికూపంలో దొర్లుటే ఆదర్శంగాను, ఉద్ధరణగాను భావించి సహజ సిద్ధమైన శక్తిని క్షీణింపజేసుకుని, దుర్గంధ వాతావరణంతో పశ్చాత్తాప పడక తప్పదు. సభ్య సంస్కారాలలో తరతరాలుగా వస్తున్న కుటుంబం లోనివారి హృదయస్థాయి వున్నతమైంది, వుదారమైంది అని అనుభ వంతో తప్పక తెలుస్తుంది."

"నీముందు తర్కించుట గొప్ప సాహసము అసభ్యమే అవుతుం దమ్మా, అయినా వ్యక్తపరచుటకూడా ధర్మం. నీ అనుభవాలు, భావాలు యదార్థసత్యాలు గావచ్చు. ఈ లోకంలో మానవ మనుగడ సౌకర్యాల కొరకు, సామరస్యంతోగూడిన వున్నతస్థాయికొరకు, హృదయోన్నతి

కొరకు సృష్టించబడిన కులాలు మతాలు నేడు కంటకరూపం దాల్చినవి. పురోగమన నిరోధకాలైనవి. కలహాలను దుఃఖాలను సృజించు సాధనాలైనవి. కనుక నేడు వాటిని నిర్మూలించి, కుల మత రహిత మానవసమాజాన్ని నిర్మించి, ఆర్థిక సమానత్వాన్ని కల్పించి, మానవులందరు ఒకేజాతివారని, సమానులని నిరూపించుట ధర్మము. ప్రభావవంతులందరు ఆదర్శపుమాటలను వల్లిస్తుంటారు, ఆర్భాటంతో ప్రచారం చేస్తుంటారు. ప్రచారం అన్నిటికంటె సులువైంది. ఆచరణ అన్నిటికంటె యోగ్యమైంది. ప్రభావవంతమైంది. అలాంటి ఆచరణ యోగ్యులద్వారానే సమాజం వుద్ధరింపబడుతుంది."

ఆమె లలాటంమీద చేయివేసి మోదుకుంటూ 'చదువులు యెంత చదివినా, గొప్ప డిగ్రీలు మన్ననలు పొందినా లోకానుభవములేనిదే యీ అంతర్రహస్యం అర్థంగాదు నాయనా. లోకంలో సౌజన్యత, సౌభ్రాతృత్వము, సేవాభావము, త్యాగస్వభావము అదృశ్యమైనవి. స్వార్థము, కుటిలనీతి, కుతంత్రము, వికటస్వభావము ఆదరింపబడి అభివృద్ధి చెందినవి. ద్రోహులకు విశ్వాసఘాతకులకుకూడా అధిక ఆదరం లభిస్తున్న రోజులివి. అయినా ప్రజలలో ఆదర్శ శద్ధాలమోజు అధికంగానే వున్నది. అలాంటి అవకాశాన్నే అవకాశవాదులుపయోగించుకుని ప్రచారాలు చేస్తూ నాయకత్వాన్ని పొంది వ్యక్తిగత స్వార్థాని కుపయోగిస్తున్నారు.'

ఉత్సాహపూరితుడై 'నీవు నా మనస్సులోని మాటలనే వినిపించావమ్మా. శుష్కప్రచారాలతో ప్రజలలోని మోజులను వుపయోగించుకుని స్వార్థప్రయోజనాలను పొందుతున్నమాట వాస్తవము. అందుకే నేను యదార్థరూపంలోని రచనాత్మక—నిర్మాణాత్మక—కార్యాలవైపు పోదలచాను. నా కృషిలో కృతార్థుని కావాలని ఆశీర్వదించమ్మా.'

"అలౌకికరూపంలో నీవు తలపెట్టేకార్యం నేటి సమాజంలో విరాట్‌రూపం ధరించుట దుర్లభం బాబూ! ఆర్థిక సమానత్వం కోరే నాయకుడు తన సంపత్తిని ముందు పంచి, ఆ తరువాత ప్రచారానికి బయలుదేరితే ఆదరించదు. హాస్యంగా చూస్తుంది. ఉన్నవారిని ఆదరిం

చటలో అలవడిన సమాజంముందు దరిద్రుడివిగా నిలిచి నీవు యేమి చెప్పినా పరిహసిస్తుంది. ఉన్నవాడివిగావుండి చెబుతున్న నీ మాటలను లోకం పాటిస్తుంది, ఆదర్శిస్తుంది. ఊబిలోనున్నవారిని లాగ ప్రయత్నించుట వూబిలో దిగిగాదు, వూబి వెలుపలనుంచి లాగుటే సులభం."

"వారి అమాయకత్వాన్ని ఆశ్రయం చేసుకుని ఆదర్శహీనమైన అపమార్గాన పయనిస్తూ ధర్మబోధలు సలుపుట మంచిదిగాదమ్మా !"

భూదేవి విసగటతో సమాధానం చెప్పకుండానే వెళ్ళిపోయింది. ఆమె హృదయం కల్లోలపడిపోయింది. స్వర్ణ విషయ మాలోచిస్తే మనస్సు ద్రవిస్తున్నది. పూర్వంవలె పదేపదే పిలువలేకపోతున్నది. స్వయంగా తప్పుకు తిరుగుతున్నది. దీర్ఘకాలంగా తాను కంటూవచ్చిన కలలు ఒక్కమాటుగా వమ్మయిపోయినందుకు క్రోధిస్తున్నది. సిగ్గుతో శిరస్సు వంచుకుంటున్నది.

భూదేవికి వసంతకుమార్‌కు జరిగిన వాదవివాదం వారిరువురిలోనే వుండిపోయినవి. వసంతకుమార్ ఆ విషయాన్ని మామూలుగానే పరిగణించి మర్చిపోయాడు. భూదేవి మనస్సు ఆ విషయాలమీదనే ఆలోచలు చేస్తున్నది. స్వర్ణ ఎప్పటివలె ప్రయోగశాలలో వసంతకుమార్‌కు సహాయంలో గడిపివేస్తున్నది.

రాజకీయ మహాసభలకు చందాగా వసంతకుమార్ యిచ్చిన రెండువేల విషయం పట్టణమంతటా ప్రచారంచేశాడు గంగరాజు. వసంతకుమార్ అభిప్రాయంతోనే, ఆశీర్వాదబలంతోనే, ఆదరాలతోనే తాను యీ సభ యేర్పాట్లుచేస్తున్నట్లుకూడా ప్రచారం చేస్తున్నాడు. ఆ ప్రచారంద్వారా అనేకమంది సహకారాలను చందాలను పొందగలుగుతున్నాడు. చిన్నచిన్న విషయానికికూడా వసంతకుమార్ దగ్గర కొచ్చి వివరించి అనుమతిబొందుట అవుసరమైనట్లు, మవునముద్రలను వేయించుకెళుతున్నాడు.

పదేపదే గంగరాజు రావటం స్వర్ణకుమారికి చిరాకును కలిగిస్తున్నది. సహించలేకపోతున్నది. అరికట్టడానికి అనేక ఆలోచనలు చేస్తున్నది. వసంతకుమార్ దగ్గర ప్రయత్నించి చూసింది. కాని ప్రయోజనం

లేకపోయింది. మరోమాటు ఘాటుగా చెప్పాలనివుంది కాని అభిమానం అడ్డువస్తున్నది. తన మాటను నిర్లక్ష్యంచేసి మౌనరూపంలో గంగరాజు కిస్తున్న ప్రోత్సాహానికి లోలోన క్రుద్ధురాలయింది.

ప్రయోగశాల ఆఫీసుగదిలో యేకాంతంగా కూర్చున్న స్వర్ణ కుమారి పత్రికను తిరుగవేస్తున్నది. వసంతకుమార్ కొరకు వచ్చిన గంగరాజు ఆఫీసులో ప్రవేశిస్తూ 'నమస్కారం స్వర్ణకుమారిగారు, వసంత కుమార్ గారి కొరకొచ్చాను. వారు వైజాగ్ వెళ్ళినట్లు తెలిసింది. మిమ్ము సంప్రదించినా ఆ కొరత తీరిపోతుందని యిటువచ్చాను. రేపటి మహా సభలలో పెట్టుటకు తయారుచేసిన యీ చిత్తు తీర్మానాలను చూడండి.' అంటూ ఒక కాగితాలప్రత్తిని ఆమె ముందుంచాడు.

ఆమె తన క్రోధాన్ని అణచుకో ప్రయత్నిస్తూ 'ప్రజల మనస్సును రంజింపజేయటానికి, మైదుపుచ్చటానికి, మభ్యపెట్టటానికి తీర్మానాలు తయారు చేయుటలో మీరు అందెవేసినవారేగా. ప్రజలను భ్రమలలో ముంచి, అధికారాలను హస్తగతం చేసుకుని స్వార్థప్రయోజనాలతో రాజకీయాలను సార్థకం చేసుకుంటున్న మీరు మా సహకారాన్ని కోరటం మంచి చతురతే!' అంటూ తనలోని వ్యాక్రోషం యింకా వెల్లడిక చూస్తున్నది.

గంగరాజు నవ్వును ప్రయత్నిస్తూ 'క్షమించండి. మీరు పొర పాటుగా అపోహలోపడి అంటున్న మాట లవి.' అన్నాడు.

"పొరపాటింమలో యేమీలేదు. మీ రాజకీయజీవిత రహస్యాన్ని ఆ విద్యార్థుల నడగండి, స్వాతంత్ర్య పోరాటపు రోజులలో ప్రభుత్వ అండలో దూరి స్వార్థ ఆరాటంలోవున్న మీరు త్యాగము, ఆదర్శము, దీక్ష, లక్ష్యము అంటే తెలియని మీరు నేడు ప్రజానాయకులుగా ప్రచారాలు చేసుకుంటూ అధికారాలను అందుకుంటున్నారంటే అది మీ యదార్థ ఆధిక్యతగాదు, ప్రజలలోని అమాయకత్వం.' అన్నది.

బిగబట్టిన ఉదాసీనకంఠంతో 'మీ మనస్సిరోజు బాగున్నట్లులేదు. లేక నేను బయలుదేరినవేళ మంచిదిగాకపోవచ్చు. దేవుని హృదయ పూర్వకంగా విశ్వసించినా విశ్వసించకపోయినా, అందరూ ఆపత్తిలో

గాని అంతిమఘడియలలోగాని ఆయన్ను వేడుకుంటారు. ఆదినుంచి భగవంతుని ఆశ్రయించనివాడు, ఏదో ఒక ఘడియన విశ్వసించి ఆశ్రయించుట అపరాధంగాదు. భక్తుడుగా పరిగణింపగల హక్కును కోల్పోజాలడు. భక్తిలో జీవితమంతా గడిపినవాడు ముక్తిని పొందలేకపోవచ్చు. చివరిఘడియలలో భగవన్నామభజన జేసినవాడు బొందితో కైలాసం పోవచ్చు. మనకు కావలసింది గతంకాదు స్వర్ణకుమారిగారు'

ముఖకవళికలను వికృతంచేసుకుని 'భక్తులతో పోల్చుకుని వారినవమానపర్చుట యెందుకు? నిష్కామము యేకాగ్రత లేని దీర్ఘకాల భక్తికంటె ఆత్మార్పణ చేసుకుని తననుతాను విస్మరించి భక్తిలో లీనమైనవారు వెంటనే ముక్తిపొందుతా రంటారు. కాని మీరు దేశసేవలో సర్వమూ కోల్పోయిన త్యాగమూర్తులు, ఆదర్శవీరులు అయినందునగాని జైళ్ళకు, లాఠీచార్జీలకు గురియై పొందిన నష్టాలతోగాని కాదు మీరు పొందిన నాయకత్వము, అధికారము. ప్రజలలోని అమాయకత్వాన్ని వినియోగించుకుని, కుతంత్రాలతోను, మోసాలతోను నాయకత్వ అధికారాలను హస్తగతం చేసుకుంటున్నారు.' అన్నది.

"ప్రతిఒక్కరు సైన్యంలోచేరి పోరాడగలరు కాని అందరూ పరిపాలనకు పనికిరారు. సంగీత మాధుర్యాన్ని అందరూ గ్రోలగలరు కాని పాడటం అందరికీ సాధ్యంగాదు. అధికారం వహించటానికి ప్రత్యేక నైపుణ్యం వుండాలి. స్వాతంత్ర్యపోరాట నాయకత్వం వహించినవారు కూడా అధికారంలో అగ్రస్థానం వహించుటకు అనర్హులు కావచ్చు. మానవసంఘర్షణలో యే ఘట్టానికి కావలసిన అర్హులను ఆ ఘట్టానికి యేరుకుంటుంది. ఈ పరమ సత్యాలు మీకు తెలియనివి కావు."

"మీలాంటివారు అధికారం వహించుటకు అర్హులు, తగినవారు అని విశ్వశించేవారిముందుకే తీసుకెళ్ళి మీ తీర్మానాలను చూపించుకోండి!" అంటూ మధ్యలో చిన్న శుష్కనవ్వును హేళనరూపంగా ప్రదర్శిస్తూ 'ఒక్క విషయంలోమాత్రం ప్రజలు మిమ్ము విశ్వసింపవచ్చు. బ్రిటిషువారి హయాంలోనూ ప్రభుత్వానికి అంటుకుని అండగానే వున్నారు. నేడూ మీరు ప్రభుత్వంలో అంతటి భక్తులుగానే వున్నారు.

ఆనాడు ప్రభుత్వంమీద పోరాటకారిగా పోరాడినవారిలో కొందరు నేటికి యింకా అలానే పోరాటకులుగానే వున్నారు. పాపం వారి పోరాటం ముగియలేదు గాబోలు. మీరు ఆనాడూ ప్రభుత్వదాసులే. లేక ప్రయోజనాలకు దాసులే.' అన్నది.

గంగరాజు నేర్పును క్రోడీకరించుకుంటూ 'వేళావిశేషం మంచిది గాదు. మీరు యెంతకఠినంగా అన్నా నిందించుటకో పరాభవించుటకో అన్నట్లు భావించలేకపోతున్నాను. మీరేదో పనిచీకాకులో వున్నట్లు న్నారు క్షమించండి.' అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

ఆమెలోని ఆవేశం యింకా అణిగిపోలేదు. తన దుష్టత్వాన్ని బట్టబయలు చేస్తుంటే యెదుర్కో-లేక వెళ్ళిపోయాడని, ఎట్టయెదుట యింత నేరుగా యెవ్వరూ అనివుండరని, యికనెన్నటికీ యీవైపు రా సాహసించడని అనుకున్నది.

ప్రజలను మరో వెర్రిలో ముంచను తయారుచేసి చిత్తుతీర్మానాలను తీసుకొచ్చారు. ఈ దేశోద్ధారకుని నాయకత్వాన జరిగే సభలో ఆ తీర్మానాలను పెట్టి ప్యాస్‌చేయించి పేపర్లలో వేయించుకుంటే ప్రజలకు కలిగే ప్రయోజనమేమిటో! తన పేరు యింకా ప్రచలితమవుతుంది. అంతకంటె ప్రజలుపొందే దేముంటుంది! అయినా ఆ తీర్మానాలేమిటో ఒక్కమాటు చూసి యింకా ఘాటుగా నాలుగు వడ్డించవలసింది. అన్నిటికీ అతను నవ్వుతూ సహిస్తుంటే యింకా పోరాడటం మాత్రం యెలా? అని మనస్సులో యేమేమో అనుకుంటున్నది.

అంతంలేని ఆలోచనలలో మునిగి యెంతసే పున్నదో ఆమెకే తెలియదు. పద్మవచ్చి భోజనానికి పిలిచినపుడు త్రుళ్ళిపడి లేచింది.

మహాసభలకు వసంతకుమార్‌ను తీసుకెళ్ళాలని గంగరాజు పెద్దగా ప్రయత్నించాడుగాని ఫలితం లేకపోయింది.

మహాసభలు దిగ్విజయంగా జరిగినవి. ఇంత దిగ్విజయంగా జరగటానికి డాక్టర్ వసంతకుమార్ అజ్ఞాతరూపంగా యిచ్చిన అమూల్య సహకారమే కారణమని, అలాంటి ఆదర్శపురుషుల అజ్ఞాతకృషే సమా

జంయొక్క భవిష్యత్తని సభావేదికనుంచి అనేక సందర్భాలలో ప్రశం సించాడు గంగరాజు.

మద్యనిషేధముద్వారా నిరుద్యోగులైన కల్లుగీత పనివారికి పని గల్పించుటకై తియ్యకల్లు తీయుటకు బెల్లముచేయుటకు లైసెన్సులు ధారాళంగా యిచ్చు విధానమును ప్రభుత్వమును వెంటనే అమలుపర్చ గోరుతూ యేకగ్రీవంగా తీర్మానించినట్లు పత్రికలలో ప్రకటించబడింది.

ఈ విషయం పేపర్లో చదివినపుడు స్వర్ణకు చిరాకు కలిగింది. ఆమె నిబ్బరించుకోలేక పేపరును చేతబట్టి ప్రయోగశాలలోనున్న వసంత కుమార్ ముందుకెళ్ళి 'చూశారా, కాంగ్రెసువారు గాంధీమహాత్ముని అభి ప్రాయాలకు యెంత మహత్తు నిస్తున్నారో ?' అన్నది.

ఆయన ప్రశాంతతనిండిన నవ్వుముఖంతో 'ఏమిటి ?' అంటూ ఆమె దృష్టిలో దృష్టిని గలిపాడు.

"ఈ తీర్మానం చదివి చూడండి. యింతకంటె మోసం యింకా మేముంటుంది ?"

"ఒకవిధంగా అది దోషం గాకపోవచ్చు."

"సిద్ధాంతరీత్యా త్రాగుడును నిషేధిస్తున్నారు, అనుభవంలో సూత్రప్రాయంగా త్రాగేవారికి సదవకాశాన్ని కల్పిస్తున్నారు. ఆహా, యేమి ఆదర్శము !"

"నిరుద్యోగాన్ని నిర్మూలించుట, ఆహారోత్పత్తిని అధికం చేయుటగూడా వారి పథకంలోని ఆశయంగదా !"

"అవును వారి విధానం చాలావుంది. పొదుపుపేరుతో ఆఫీసుల లోని కొందరిని తగ్గించుట, ఆద్వారా నిరుద్యోగులయినవారికి వుద్యోగా లను చూపుటకు అప్రస్తుతమైన శాఖలను సృష్టించి అనవసరంగా అతిగా వ్యయంచేస్తున్న యీ విధానాలు యెంత ఆదర్శవంతమైనవి !" అని యీసడింపుగా అన్నది.

"ఇది యెన్నికల ప్రభుత్వంగనుక వోటర్ల అభిప్రాయాలను పాటించాలి, వాటినే తీర్మానాలుగాను, శాసనాలుగాను చేయాలిగదా !"

జనవాక్యాన్ని పాటించుచే ప్రభుత్వవిధానమయితే మద్య నిషేధ చట్టం తెచ్చుట గొప్ప పొరపాటు."

"ప్రజాభిమతం కంటె ప్రజా శ్రేయస్సు ప్రధానం."

"అది మీ అభిప్రాయం. కాని నేటి రాజకీయవాదులు అలాంటి అభిప్రాయానికి వికృతమైన నామకరణ లిస్తారు."

విప్పారిన ముఖంతో 'నా అభిప్రాయాలకు ప్రత్యేకమైన వ్యక్తిత్వమున్నదని విశ్వసిస్తే, వారి అభిప్రాయాలలో వారు చేసుకున్న వారి తీర్మానాలకు చిరాకు చెందగూడదు.'

ఆ మాటలలోని ఆత్మీయత ఆమెలో చొరబడినట్లు ముఖం వికసించింది. ఆవేశపడిపోయింది. 'మీరు జేస్తున్న తీర్మానాలుగాని శాసనాలుగాని లోకకళ్యాణ దృష్ట్యాగాదు, మభ్యంతో ప్రజాభిమానాన్ని చూరగొని వోట్లు పొంది అధికారంలో సుస్థిరం కావడానికి' అన్నది.

"అన్యులనుసరించిన నిర్ణయాలు నిర్దాక్షిణ్యంగా వుండగూడదు స్వర్ణా."

"మీరు ఉదాత్తవేత్తలుగా రెండువేలు చందా యిచ్చినందుకు మహాసభలో మిమ్ము వేయినోళ్ళ ప్రశంసించాడుట, అందుకు ప్రతి విశ్వాసం కలిగిందా బావా!" అని వేళాకోళంగా అన్నది.

ఆయన కోరచూపులలో మందహాసంచేసి వూరుకున్నాడు.

సభల అనంతరం గంగరాజు స్థాయి పెరిగిపోయింది. అనేక సమితులవారు, సొసైటీలవారు ఆయన ఆదరాభిమానాలకొరకు తాపత్రయ పడుతున్నారు. పల్లెలనుంచి రైతునాయకులు కూలినాయకులు ఆయన సహకారా న్నర్థిస్తున్నారు.

సభలుజరిగి రెండుసంవత్సరములు గడిచిపోయినవి. చీటికి మాటికి చిల్లరగావచ్చే యెన్నికలన్నీ గంగరాజు నేతృత్వంలో జరిగి పోతున్నవి. జిల్లా సహకార పరపతిసంఘానికి అధ్యక్షుడయ్యాడు. జిల్లా మార్కెటింగుసొసైటీ అధ్యక్షుడుగా నామినేటు చేయబడ్డాడు.

శాసనసభ సభ్యుడుగా యెన్నికయినతదుపరి జిల్లాపరిషత్ అధ్యక్ష స్థానాన్నలంకరించాడు.

ఆయనయడల అదివరకున్న దుష్ప్రచారం మరుగున పడిపోయింది. ఇపుడు ప్రజానాయకుడుగా, రక్షకుడుగా ప్రచలితమై పోతున్నాడు. వినయం విశాలరూపం ధరించింది. వసంతకుమార్‌ను పదేపదే దర్శించి సాంపర్క్యాన్ని ముడివేసి వుంచుతున్నాడు. స్వర్ణకుమారి వికృతభావంతోనే చూస్తున్నది. ఆ విషయం అర్థం చేసుకోలేని సాధువు వలె నవ్వుమొహంతో వెళ్ళిపోతుంటాడు.

సభలు సమావేశాల ప్రాధాన్యతతో వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవచ్చు. ఆధిక్యతను అధికం చేసుకోవచ్చునని అనుభవం పొందిన గంగరాజు మహిళాచోవను ఆదరాన్ని పొందగోరి పట్టణమహిళామహా సభ యేర్పాట్లకుద్యుక్తుడయ్యాడు. ఆ సభకు పట్టుబట్టి స్వర్ణకుమారినే అధ్యక్షురాలుగా వప్పించాడు. నాగరిక లోకంలోని పట్టణ మహిళల నందరిని చేరి యేకత్రితంచేసి మంచి సంచలనాన్ని కల్పించాడు.

స్వర్ణకుమారి సమ్మతితో అధ్యక్షస్థానానికి అనుమతించలేదు. గంగరాజు జిద్దిగా పట్టుబట్టినపుడు విసిగిపోయి సహించలేని వుద్రేకంతో, ఆయన ప్రోత్సాహపరుస్తున్న సభలోనే ఆయన నగ్నసత్యాలను బయటపెట్టి తిరిగి ప్రజలముందుకు యెన్నటికీ రాకుండా చేయాలన్న నిర్ణయం చేసుకుని అంగీకరించింది.

7. ఎన్నికల రాజీ

మహిళాలోకకళ్యాణంకొరకు కంకణంగట్టి, మహిళాస్వాతంత్ర్య పోరాటం పేరుతో తిరుగుతున్న సుభద్రాదేవి జిల్లాఅంతటా చిరపరిచితురాలు. తాను శాసనసభ్యురాలు కాగోరి, యెన్నికలలో నిలిచి, ఖర్చులకు వున్న పొలమమ్మి ధనమిమ్మని భర్తను కోరినపుడు, ఆయన నిరాకరించుటేగాక, ఆ కార్యక్రమానికి యెన్నికలకు ప్రతికూలత ప్రదర్శించాడు. ఆమె వుగ్రురాలై తన భర్త కాశీదాసు కృూరుడని జారుడని కోర్టు

కెక్కి అర్థభాగ ఆస్తిని విడాకులను పొంది పూర్ణస్వేచ్ఛతో తన కార్య క్రమంలో లీనమైపోయింది.

సుభద్రాదేవి అనేక యెన్నికలలో నిలిచింది. కాని యెందులోను డిపాజిట్టును పొందలేకపోయింది. అయినా ఆమెలో అధైర్యంగాని, నిరాశగాని మచ్చుకుకూడా లేదు. జయాపజయాలు కాకతాళీయాలు, పోరాటం మానవ కర్తవ్యం అంటుంది. అపజయాలతో జరిపే పోరాటంలోనే ఆఖరిలో వాంఛనీయమైన ఫలితం సంభవిస్తుందని ఆమె విద్బోధ. సామరస్యం ద్వారాను, రాజీలద్వారాను పొందే ఫలితాలు మరింత బంధనాలై అధోగతికి తీసుకెళతవని, నిష్కర్షగా నిర్భీతిగా జరిపే పోరాటంలో పొందే అంతిమవిజయంలోనే మహిళావికాసముంటుందని ఆమె నిర్వచన, పురుషుల సహకారంతోనే పురుషజాతిమీద పోరాటం సలిపి స్త్రీజాతికి విజయాన్ని సాధించాలని ఆమె ఆశయం. ఏ జాతి వుద్ధరణ ఆ జాతిద్వారానే కాగలుగుతుందనిగాని, కావాలనిగాని కలలుగనుట పొరపాటని, ఒకరి వుద్ధరణ మరొకరి నేతృత్వంతోగాని సహకారంతో గాని జరుగుట సహజమని ఆమె తలంపు.

సుభద్రాదేవి స్వయంగా యెన్నికలలో విజయం పొందలేక పోయినా అనేకమంది విజయానికి తోడ్పడింది. ఆరూపంగానే ఆమె గంగరాజుకు అభిమానపాత్రురాలు, గంగరాజు తలపెట్టిన ప్రతికార్యానికి ఆమె చేయూతుంటుంది. ఆమె ప్రోత్సాహంకూడా మహిళాసభల యేర్పాట్లకు కారణం. ఆమెకు స్వర్ణకుమారిని పరిచయం చేయగలిగాడు. ఆ తరువాత కార్యక్రమాం సుభద్రాదేవే నిర్వర్తించుకోగలిగింది.

సుభద్రాదేవి మాటలలో తెలియని ఆకర్షణ వుట్టిపడుతుంది. ఆమెను ద్వేషించేవారుకూడా సమక్షంలో సాహసించి కాదనలేరు. రెండు రోజుల పరిచయంతరువాత స్వర్ణకుమారి సర్వము మరిచి వుత్సాహభరితురాలై ఆమెవెంట తిరుగుతున్నది.

మహిళామండలి మహాసభ యేర్పాట్లు అద్వితీయంగా చేయబడినవి. జీవితసర్వస్వాన్ని మహిళాలోకోద్ధరణకు అంకితంజేసిన మహానాయకురాలైన (భ్రమలలోని) రాజ్యలక్ష్మిగారిని, పారిజాతాన్ని, సుమతిని, వనజను మొదలగు అనేకమందిని ఆహ్వానించారు.

వేదికమీద సభాధ్యక్షురాలిపీఠం అద్వితీయరూపంలో అలంక రించబడింది. అత్యున్నతమస్థాయిలో నిర్మించిన ఆ వేదికమీదకు సభా ధ్యక్షురాలినిగా స్వర్ణకుమారి నాహ్వానించినపుడు, గంగరాజు ప్రేరణతో జేజేలు మిన్నుముట్టినవి. పూలమాలలతో ముంచెత్తించారు. అనేక సంఘాల తరపుగా సమితుల తరపుగా మాలలు వేయబడినవి. ఆమె ఒక పెద్ద పూలరాశిగా గోచరిస్తున్నది. ఆమెలో ఆమె తన్మయురాలయింది. సర్వాంగాలు పులకితమైనవి. మనస్సులోని వూహలు పొంగి తడబాటుతో పొర్లుతున్నవి. ఆహ్వానసంఘం తరపుగా తననుగురించి, మహాసభ ప్రాశ స్త్యతనుగురించి వివరిస్తున్న సుభద్రను చూస్తూ మైమరస్తున్నది. ఊహా విహారంలో మునకలువేస్తున్నది.

సభాసమూహ చివరవుండి సర్దుబాటుజేస్తూ కెమేరావానికి సలహా లిస్తున్న గంగరాజును చూచినపుడు ఆమె మనస్సు జాలితో పెనవేసింది. ఇంతటి మహాసభలో తాను పొందుతున్న యీ ఘనతకు ముఖ్యకారకుడు ఆయనే. అని మనస్సులోని కృతజ్ఞత పెల్లుబుకుతున్నది. ఆయనలోని నిరా డంబరత నిస్వార్థత కళ్లకుగట్టినట్లు కనిపించి హృదయం నవనీతంవలె కరిగి వూగుతున్నది, తా నంతకుముందు ఆయన్నుగురించి అనుకున్న దురూహలకు సిగ్గిలుతున్నది. ఆయనలోని శాంతి సహనతలు వరుసగా మనస్సులో అనుభవమవుతున్నవి. ఆనాడు తాను యెంత నొప్పించే మాటలన్నా సమాధానంగా చిరునగవుని చిందించాడు.

ఆమెనేత్రాలు చెదరినట్లయి రెండు ప్రతిమలు యెట్టయెదుట కనిపిస్తున్నవి. ఒకటి గంగరాజు మరొకటి వసంతకుమార్. ఒకరు చేస్తున్నవి ప్రత్యక్షంగా కనిపిస్తున్నవి, అర్థమవుతున్నవి. అనుభవం కలుగుతున్నది. రెండోవారు చేస్తున్నది వెదుక్కోవలసివస్తున్నది. అగ మ్యంగా అర్థంగానిదిగా గోచరిస్తున్నది. అనుభవంలో ఫలం బొందుట కష్టమనిపిస్తున్నది.

సుభద్ర తన వుపన్యాసం ముగిస్తూ స్వర్ణకుమారిని మరీమరీ స్తుతించినపుడు ఆమెలో సిగ్గు దొంతరలుగా క్రమ్మింది. తాను యేమి మాట్లాడటమా, అని ఆలోచించినపుడు కంఠం శుష్కించి, ఆలోచనల్లు

చెదిరి మనస్సు వెలవెలబోతున్నది. హృదయంలో దడ యేర్పడు తున్నది.

ముద్రితకార్యక్రమంలోలేని గంగరాజుగారి వుపన్యాసాన్ని అర్థించవలసినదిగా అధ్యక్షురాలైన స్వర్ణకుమారి చెవిలో వూదింది సుభద్ర. ఆ విషయం ఆమెకు మరింత వుత్సాహాన్నిచ్చింది.

తలవని తలంపుగా తనకీ మహాసభలో మాట్లాడే అదృష్ట యోగం బట్టినందుకు ధన్యుడయినట్లు వుపోద్ఘాతంతో ప్రారంభించి, స్త్రీ ప్రాముఖ్యతను, సమస్యలను, బాధ్యతలను, హక్కులను, సమానత్వాన్ని గురించి అనర్గళమైన అమోఘశైలిలో వుపన్యసించి ముగింపులో వసంతకుమార్ ప్రయోగశాలనుగురించి, వారి అమూల్యభావాలను గురించి, వారి పరిశోధనలద్వారా భావిసంఘానికి కలుగబోయే ప్రాముఖ్యతను, ఆ తరువాత అధ్యక్షపీఠం అలంకరించిన స్వర్ణకుమారిని గురించీ, ఆమె వినూత్నభావాలలోని ఒక ఆదర్శమహిళ అయినట్లు, అంతటి విజ్ఞాననిధియైన ఆమె సహకరించుట మహాసభకే విశిష్టత చేకూరినట్లు, వారి తోడ్పాటుతోనే సుభద్రాదేవి యీ సభకు యింతటి శోభ వాటిల్లినట్లు గొప్పగొప్పగా పొగడినపుడు ఆమె హృదయం వూగిపోయింది.

ప్రజామన్ననల ప్రభావం నేడు స్వయంగా అనుభవంతో చూసి విస్తుపోతున్నది. అధికారము ఆధిక్యతల మహత్తు మానవులనేగాదు దేవతలనుగూడా బానిసలుగా చేసుకొను శక్తిగలదని, ఒకమాటు యీ మోజులో మునిగినవారు తిరిగి విముక్తి పొందలేరని, సమర్థుని అసమర్థునిగా చేయగల సర్వశక్తులు అందు గలవని ఆలోచనలు చేస్తున్నది.

సభ ముగిసిపోయిన వారంరోజులవరకు మహాసభల విశేషతను గురించి, స్వర్ణకుమారి సహకారమే సభల దిగ్విజయానికి కారణమైనట్లు పత్రికలలో వస్తున్నది. స్వర్ణకుమారిని స్తుతిస్తూ అనేకరక ప్రశంసలతో కొన్ని వ్యాసాలుకూడా ఆమె బొమ్మలతో ప్రకటితమయ్యాయి. ఒక్కొక్క పేపరులోని తననుగురించిన విషయాలను యెన్నెన్నో మార్లు చదువుకుని పరవశురాలైంది.

ఇంతవరకు అంధకారంలో జీవితాన్ని గడిపినట్లు నేడు జీవితానికి వెలుగు దొరికినట్లు, సార్థకత కలిగినట్లు ‌ వూహించుకుంటున్నది. రాజకీయ జీవితమే ప్రముఖమైందని, రాజకీయాలలో త్యాగము, ప్రజాసేవ, మన్ననల రాణింపు, రాజసము లున్నవని వూహిస్తున్నది. వసంతకుమార్ భావాలు, ప్రయోగశాల కార్యక్రమాలు అనుభవం లేనివిగా తోచింది. అమాయకుడనిపించింది. ఫలితంలేని త్యాగంవలన ప్రయోజనం లేదనిపించింది. లోగడ గంగరాజునుగురించి తాను విన్నదంతా దుష్ప్రచారంగా భావించి తాను అపుడపుడు వసంతకుమార్ యెదుట విమర్శించినందుకు పశ్చాత్తాపపడుతున్నది.

సుభద్రాదేవి కృషితో మహిళామండలి కార్యాలయం తెరువబడింది. ఆమె ప్రోత్సాహంతో కార్యాలయ బాధ్యతనంతా స్వర్ణకుమారి వహించింది. కార్యాలయ ప్రారంభోత్సవానికికూడా పెద్ద తతంగమే చేయబడింది. ఈ ప్రారంభోత్సవానికైనా వసంతకుమార్‌ను ఆహ్వానించి ఆధిఖ్యత నివ్వాలని గంగారాజు సుభద్రలు యెంతో ఆశతో వారిని సభావేదికమీదికి రప్పించాలని ప్రయత్నించారు. కాని ప్రయోజనం లేకపోయింది.

పేరుప్రతిష్టల వ్యామోహాలు, స్వార్థకాంక్షలు మచ్చుకుకూడా లేకుండా నిస్వార్థ త్యాగంతో, ఆదర్శసమాజ నిర్మాణకృషి సలుపుతున్న వసంతకుమార్ మహాయోధుడని, ఆదర్శపురుషుడని, సాటిలేని ప్రజ్ఞాశాలియని ప్రశంసించింది సుభద్ర.

ఆ పొగడ్తలలో అపశ్రుతులు వినిపించినవి స్వర్ణకుమారికి. వేదికమీద కూర్చున్న ఆమె మనస్సులో క్రమహీనమైన ఆలోచనలు పరువులెడుతున్నవి. వసంతకుమార్ ఆహ్వానసందర్భంలో స్టేషనుకు వెళ్ళిన సందర్భంనుంచి నేటివరకు జరిగినదంతా మెదులుతున్నది. అంతా నిరాసక్తతతో నిస్తబ్ధతతో నిండిన సమయాలుగా తోచింది. గంగరాజును గురించి విద్యార్థుల కరపత్రాలద్వారా తెలుసుకుని భ్రమలో హేయపడిన దుష్ప్రచారము ఆ తరువాత యదార్థంగా చూస్తున్న సత్యాలుకూడా కనులముందు కనిపిస్తున్నవి. అంతగా వసంతకుమార్‌ను

పొగడిన సుభద్ర, యదార్థరూపంలో సంఘాన్నుద్ధరించగలుగుతున్న యీ గంగరాజుగారిని గురించి కాస్తయినా ప్రశంసించ దెందుకు? వీరు లేకపోతే యీ సభలు సమావేశాలు అసలుండవు. రాజకీయ సాంఘిక హడావుడు లన్నిటికి ప్రత్యక్ష ప్రోత్సాహకుడు గంగరాజు. అలాంటి ఆ మహావ్యక్తిని పొగడకపోవుట యెంత వెర్రితనం! అన్నియేర్పాట్లు జరిపి సామాన్య ప్రేక్షకులలో కలిసివున్న ఆయన త్యాగాన్ని, ప్రజ్ఞను విస్మరించుట యెంత శోచనీయం! ఇంతటి శోభేపేతమైన సభలో, యిన్ని ప్రాంతాలవారు చేరి తమ భావైక్యతతో మహిళోద్ధారణ విషయాలు చర్చించుకునే మహదవకాశం కలుగుటకు ముఖ్యకారకు లయిన గంగరాజుగారిని ప్రశంసించకుండుట సిగ్గుచేటని మందలిస్తూ మైకుముందుకెళ్ళి వుపన్యసించాలని హృదయోద్వేగం ప్రబలుతున్నది. అంతటా విస్మయమందేట్లు యేరీతిగా పొగడాలో ఆలోచిస్తున్నది. సుభద్రమైనె సద్భక్తిగా, ధారాళంగా మాటాడలేనని విచారం పొడసూపింది. ఆవేశం ముందుకు నెడుతున్నది. గుండెదడతో గొంతు యెండుకుపోయింది. నిట్టూర్పు విడుస్తూ అలాగే వుండిపోయింది.

స్వర్ణకుమారి యికమీదట ప్రత్యక్ష రాజకీయజీవితమే గడుపుటకు నిశ్చయించుకున్నది. పగలంతా మహిళామండలి కార్యాలయంలోనే వుంటున్నది. పట్టణంలోని నాగరిక మహిళాయువతులతో సాంపర్క్యం పెరిగింది. కార్యాలయానికి దినపత్రికలు వారపత్రికలు మాసపత్రికలు అనేకం వస్తున్నవి. ఎప్పటికప్పుడు వారిముందు కొస్తున్న చర్చనీయాంశాలు యెంత పురాతనమైనవయినా నూతనత్వాన్ని పొందుతున్నవి. చర్చలలో స్వర్ణదే పైచేయిగా వుంటున్నది. ఆ వుత్సాహంతో విషయ జ్ఞానం యింకాయింకా తెలుసుకోవాలన్న కాంక్షతో రాజకీయ సాంఘిక సంబంధ పుస్తకాలను మరీమరీ చదువుతున్నది, రాత్రి 8 గంటలవరకు కార్యాలయంలోనే కాలం గడిచిపోతున్నది. గ్రంథ అధ్యయన విజ్ఞానంతో స్వర్ణకుమారి, జీవితానుభవవిజ్ఞానానుభవంతో సుభద్ర పోటీపడి నపుడు అంతంలేకుండా చర్చ జరుగుతుంటుంది. అలాంటి చర్చలో ముందుకు పోలేక అపజయాన్ని అంగీకరించలేక స్వర్ణకుమారి ఆవేశ పడుతున్నపుడు గంగరాజు కల్పించుకుని చిరునగవును చిందిస్తూ నివే

దన్నారూపంగా తన చతురతను క్రోడీకరించి సుభద్రను పొగడుతూ స్వర్ణకుమారి వాదనను గెలిపించినపుడు అందరి ముఖాలలోను ఆనందం చిందులాడేది. స్వర్ణ హృదయం కృతజ్ఞతతో నిండిపోయేది.

ఆయన కార్యరంగమంతా ప్రత్యక్షఫలితనిదర్శనలతో సజీవరూపంలో అమోఘంగా గనిపిస్తుంది. ఏ కోణంలోను ఆయన అలసట చెందినట్లు కనిపించడు. ఎక్కడా జీవన్మరణ సమస్యగా పోరాడవలసిన అవుసరమూ గనిపించదు. ఆయన తలపెట్టే ప్రతిది స్పష్టమైన రీతిలో అందరికీ తేలికగా అర్థమవుతుంది, ఆకర్షిస్తుంది, ప్రభుత్వంకూడా హర్షించి ఆదరిస్తుంది. ఆయన సాగిస్తున్న సమిష్టి వ్యవసాయక్షేత్రం ఆదర్శప్రాయమైందని, అద్భుతమైన ఫలితాల నిస్తున్నదని, ప్రజలలో సామరస్యత పెంచుతున్నదని, వ్యక్తిగత స్వార్థాలకు స్వస్తిజెప్పి సంఘక్షేమానికి దోహదమిస్తున్నదని, వీరు స్థాపించిన నీరాసంఘాలు వృత్తిని కోల్పోయి ఆకలితో అలమటిస్తున్న గీతపనివారలకు జీవనాధారమైనదని, ప్రభుత్వనిధి సహాయంతో వీరు నెలకొల్పిన కుటీరపరిశ్రమలు అనేకమంది నిరుద్యోగులకు అనాధస్త్రీలకు జీవనభృతిని కల్పించినవని, మత్స్యపరిశ్రమ ఆశ్చర్యకరమైన ఫలితాల నిస్తున్నదని అనేక వార్తాపత్రికలు స్తుతించినవి. ప్రభుత్వ బులెటెనులు పొగడినవి. మంత్రులుకూడా శ్లాఘించారు, మహిళోద్ధరణకుకూడా కంకణంగట్టి చేయూతనిస్తున్న గొప్ప సంస్కర్త ఆయన. ప్రజలపాలిట రక్షకుడని భావిస్తుంది ప్రజ. ఆయన ప్రతికార్యం అడుగునదాగి యెక్కడో స్వార్థముంటుందని ఆయన్ను విమర్శించేవారు లేకపోలేదు. కొన్నిరోజులముందు, యీ పరిచయానుభవం లేనపుడు తానూ అదేరీతిగా విమర్శించింది. కనుక ఆ విమర్శలకు విలువరేదు.

ఆయన ప్రజారక్షకుడు. అందుకు సందేహంలేదు. పల్లానికి ప్రవహించు నీటివలె ఆయన కార్యాలు సాఫీఅయినవి, సమంజసమైనవి, వుత్కృష్టమైనవి.

ఈ ఆలోచనలలో కలగలుపుగా అస్పష్టరూపంలో మరొకవ్యక్తి, ఆ వ్యక్తి కార్యరంగము కనిపిస్తున్నది. ఆ మరోవ్యక్తి వసంతకుమార్,

తన బుర్రి యెంత బ్రిద్దలుకొట్టుకున్నా ఆయనగాని, ఆయనకార్యరంగం గాని అర్థంగాని సమస్యలుగానే వుండిపోతున్నవి. ఎప్పుడూ దీర ఆలోచనలలో మునిగివుంటాడు. క్షణ తీరుబడిలేకుండా చేసినపనే చేస్తూ వుంటాడు. ఎన్నిరోజులు చేసినా ఆ పరిశోధనాలయ:భవనంలోపలే. అవి అర్థంగానివి. ఎన్నటికీ అర్థంగావేమో! అవి విపరీతంగాను వికటంగాను తోస్తవి. వాటిలో ఒక్కదానికికూడా ప్రజాదరణ లేదు. ప్రభుత్వ ఆదరం అసలేలేదు. ప్రవాహాన్ని యెదురుపంపటంలాంటి ఆయన కార్యరంగం ఆనందం లేనిది.

అందుకే యిపుడా ప్రయోగశాల ఆమె దృష్టికి వింతలతోగూడిన పిచ్చాసుపత్రి. కదాచితుగా ప్రయోగశాలలో ప్రవేశించినా, అన్నివైపులా వింతవింతగా చూసి ఆయనయెడల జాలిచెందుతుంటుంది. కాని ఆయన యెదుట గంగరాజునుగురించి ప్రశంసించలేదు, ప్రస్తావించనూలేదు. ప్రయోగశాలవైపు వెళ్ళుట తగ్గించివేసింది. అంత వ్యవధి లభించుట దుర్లభంగావుంది. ఆకస్మికంగా వసంతకుమార్ యెదుటపడితే అంతరాత్మ వెలవెలలాడి పారిపోవాలనిపిస్తుంది.

ఆయన యెదుటపడినపుడు నిర్మలమైన నవ్వుతో 'ఓహో, మహిళామండలి అధ్యక్షురాలుగారు తీరుబడిగా కనిపిస్తున్నారే!' అంటాడు.

ఆమె:- అందుకు యీర్ష్య పడుతున్నారా?

వసంతం:- తీరుబడిగా వున్నందుకు యీర్ష్యగాదు. తరతరాలుగా యుగయుగాలుగా అనుభవిస్తున్న మా హక్కులను అధికారాలను హ్రస్వంచేసే మీ వుద్యమంయెడల యీర్ష్యపడుట స్వభావికమేగదా!

ఆమె:- స్త్రీలను అమాయకులనుజేసి అంధులనుజేసి అధములుగా యెంచి బానిసలుగా వుంచి యింకా ఆ అధికారాలను చలాయిద్దామన్న ఆశ మీకుకుడా వున్నదా?

వసంతం:- ఎదుటివారినుంచి ఆదరము, అభిమానము, ఆధిక్యత, ప్రీతి విశ్వాసము పొందుటకు పోరాటము సల్పుట వివేకమని యెవ రనగలరు ? పోరాటముద్వారా ఆ కావాలని కాంక్షిస్తున్నవాటికి దూరమై హీనమవుతారేమో !

ఆమె:- స్వాతంత్ర్యము సమానత్వము యాచనద్వారా యెన్నడూ లభిం చవు. పోరాటముద్వారా పొందిన స్వాతంత్ర్యమే పవిత్రమైం దని గుర్తించ ప్రార్థన.

ఆయన:- ఆవేశం అంధత్వాన్నిచ్చి అప్రస్తుత సమస్యలను సృష్టి స్తుంది. స్త్రీ పురుష పరస్పర అంతస్తులు ప్రకృతిసిద్ధమైన కొన్ని నియమాలకు కట్టుబడినటువంటివి. అతివృష్టి అనావృష్టి దుష్ఫలి తాల నిస్తవి. అదేరీతి పోరాటంలో అధిక ఆధిక్యతను పొందితే వికృత ఫలితాలే సంభవిస్తవి.

ఆమె: పొంది అనుభవిస్తున్న అధికారాలు ఆధిక్యతలు పోతవన్న భయంతో అనే మాటలవి. అధికారాలకు ఆధిక్యతలకు మూలం సంపత్తి. ఆ సంపత్తిని తన వశంలో వుంచుకుని స్త్రీని వంచిస్తూ వస్తున్నాడుదప్ప స్త్రీ యేవిషయంలోను తీసిపోదు. నేడు స్త్రీ జాతి మేలుకున్నదిగనుక యిక పురుషుని అత్యాచారం సాగదు.

ఆయన:- స్త్రీలు ముందుకురావటం ముదావహం. కాని అది పురుషుని మీద ప్రతీకారంతోనో పంతంతోనో కాదు. వివేకంతో వివక్ష తతో సామరస్యమైన ఆదర్శరూపంలో జరగాలి. ఏదియేమయినా భావవిప్లవ వుదృతపు జోరులో ఆవేశంలో నున్న నీకు నా మాటలు నచ్చవు. కొంతదూరం పోయాక జోరు మందగించాక అన్నివైపులనుంచి ఆలోచించే శక్తి వస్తుంది. ఆనాడు నీలోని ఆత్మే నీకు యెదురునిలిచి కావలసిన విధానాన్ని నేర్పుతుంది.

ఆమె:- స్త్రీలోక వుద్ధరణ స్త్రీల ద్వారానే కలుగుతుంది. ఒకరి లక్ష్యాల మీద ఆశయాలమీద మరొకరికి వుండవలసిన అవుసరం లేదు.

ఆయన:- (మందహాసాలొలికిస్తూ) ఎవరివుద్ధరణ వారిద్వారానే కాగ లుగుతుందన్నది అమాయకపుమాట. మరొకరి సహకారము ప్రోత్సాహము కూడా అంతకంటె అవుసరము. విశ్వాసంద్వారా లక్ష్యం పవిత్రతను పొందజాలదు. లక్ష్యంలో పవిత్రత వున్నపుడే సర్వశ్రేయోదాయకమైన సత్ఫలితాల నిస్తుంది.

అంతకుముందేవచ్చి సంభాషణ వింటున్న పద్మ బాధతోగూడిన నిట్టూర్పును విడుస్తూ 'అమ్మాయిగారు. చూస్తూచూస్తుండగానే రాజకీయంలో ఆరితేరిపోయారు. మీ రంటున్న స్త్రీ స్వాతంత్ర్య పోరాటం ద్వారా పొందేదిగాదనిపిస్తున్నది,' అన్నది.

స్వర్ణ:- పోరాటంకాకపోతే ప్రార్థనలు చేయమంటావా లేక తపస్సు చేయమంటావా ?

పద్మ:- వివేక విజ్ఞాన పెంపులద్వారా హృదయఅంతస్థులు విశాలమై పరస్పర అనురాగాలద్వారా స్త్రీ ఔన్నత్యాన్ని పొందగలుగుతుందనుకుంటాను.

స్వర్ణ:- స్త్రీలలో బుద్ధిమాంద్యం పోనంతవరకు పురుష శాసనాలలోనుంచి స్త్రీలోకం బయటపడజాలదని సుభద్రాదేవి చెప్పింది యదార్థమని నీద్వారా రుజువవుతున్నది. నీవు స్త్రీ వైయుండికూడా స్త్రీ స్వాతంత్ర్యపోరాటాన్ని నిరసిస్తున్నావంటే సిగ్గుపడాల్సుంటుంది.

పద్మ:- మీ మాటలు యెలాంటివయినా వినగలను గాని వారిమాటలు తేకండి అమ్మాయిగారు. ఆ మాటలలోను వాదంలోను వున్న బలంకూడా పోతుంది. సుభద్రాదేవిగారు తమ స్వ జీవితంలో పరాజితురాలు. ఆమె చరిత్రనుగురించి అనేకవిధాలుగా వింటుంటాము. ఆమెలాంటివారు అమాయకులైన మరికొందరికి వెర్రి నెత్తించి స్త్రీ స్వాతంత్ర్యమనే వుద్యమాన్ని లేవనెత్తి ప్రచారాలు సాగించినందువలన కొన్ని అనరాలు వాటిల్లవచ్చు దప్ప కళ్యాణం కలుగదు.

స్వర్ణ:- పద్మా, నీవు దాసివి. దాస్యస్వభావం యెక్కడికిపోతుంది ! నా
యెదుట అలాంటి సాహసం యెన్నడూ చేయవోకు. సుభద్రా
పేరు నుచ్చరించగల అర్హతలేదు నీకు. వ్యక్తిగత జీవితాన్ని
విమర్శించవలసిన అవుసరంలేదు నీకు. ఆమె ఆదర్శ ఆశయాలను
కార్యరంగాన్నిమాత్రమే గుర్తించాలి. తన జీవితాన్ని మహిళా
వుద్యమానికి అంకితంజేసిన ఆదర్శ మహిళ.

పద్మ:- (నవ్వుముఖంతో) నేను దాసిని. ఆ విషయాన్ని మరువకుం
డుటే ధర్మం అమ్మాయిగారు. నా ధర్మాన్ని విస్మరించినపుడు
విమర్శించే హక్కునుకూడా కోల్పోతాను. ధర్మం తప్పినవారు
వుద్ధారకులు కాజాలరు. వ్యక్తిగత జీవితంలో న్యాయము ధర్మము
నీతి లేనివారు లోకోద్ధరణకు కంకణంకట్టుట హాస్యాస్పదమయిన
కపటనాటకం లాంటిది. వారు సాగించే వుద్యమాలలో వారి
జీవితంలోని ప్రతిబింబాలే దాగివుంటవి. అలాంటివారి ప్రేరణల
ద్వారా అనేక అనర్థాలు జరుగ వీలుంది. అందుకు ప్రత్యక్ష
నిదర్శనగా వారి సాంపర్క్యంలో మీరు యెంతగా మారిపో
యారో చూడండి !

స్వర్ణ:- నీ తెలివికి చాలా సంతోషం. యిక చాల్లే వూరుకో. సుభద్రా
దేవిని గంగరాజుగారిని మహానాయకులుగా దేశోద్ధారకులుగా
యెంచి పూజించే ప్రజలంతా వెర్రివాళ్ళయి నీవే తెలివికల
దానవనుకుంటున్నావా ? నీలోని తేలికతనాన్ని తెలియజేసు
కుంటున్నావు.

పద్మ:- బాబుగారుకూడా యెదుటవున్నారు, మాట్లాడుట సాహసమే అవు
తుంది. అందుకు క్షమాపణ గోరుతున్నాను. ఒకరికి ప్రజలు
బ్రహ్మరథం పట్టినంతమాత్రాన వారు పరమ పవిత్రులని,
యోగ్యులని, ప్రజారక్షకులని వూహించుట గొప్ప పొరపాటవు
తుంది. ప్రజలలోని వెర్రితనాన్ని బాగా గుర్తించి, బ్రహ్మరథం
పట్టించుకుంటూ నాయకులుగాను ప్రజారక్షకులుగాను చలామణి

అవుతున్నవారు మితిమించిన కాంక్షలతోను, స్వార్థాలతోను, కుటిలతోను, వ్యామోహాలతోను, యీర్ష్యాద్వేషాలతోను నిండిన పెద్ద శాంత్రికులన్నా భీబత్సకులన్నా అతిశయోక్తి కాదు. మీరు యెవరిని దేశసేవకులని, ప్రజారక్షకులని, ఆదర్శమూర్తులని అంటున్నారో ఆ సుభద్రాదేవి గంగరాజులకంటె అవినీతిపరులు అక్రమదారులు, అపభ్రంశకులు మరొకరు లేదన్న సత్యాన్ని మీ అనుభవంలో తెలిసినప్పుడు పశ్చాత్తాపపడక తప్పదు.

స్వర్ణ:- ఇక చాలించు, పేరు ప్రతిష్టలుకలిగి అధికారాలున్న నాయకులంతా అలాంటివారయితే, దేశంలో రోజుకొక రూపంలో చెందుతున్న అభివృద్ధి ఔన్నత్యము యెలా జరుగుతున్నదంటావు !

పద్మ:- ఇలాంటిమాటలు నాబోటి దాసీదానిద్వారా వచ్చుట మీకు హాస్యాస్పదము హేయముగా తోచవచ్చు కాని వాస్తవాన్ని గుర్తించమని నా మనవి. దేశంలోని ప్రజల కష్టసుఖాలకుగాని అవసరాలకుగాని సంబంధంలేకుండా తన ప్రియురాలి వియోగ వ్యథతో ఆమె స్మృతిచిహ్నంగా కోట్లకొలది ప్రజలసొమ్మును వెచ్చించి తన ఆత్మశాంతికి నిర్మించిన తాజ్‌మహల్, తన ప్రియురాలి స్మృతిచిహ్నంగా నిర్మించిన సమాధి ప్రపంచంలోనే ఖ్యాతి వహించింది. దానితో షాజహాన్ అజేయమయిన కీర్తిని గడించాడు. చరిత్రలో ఆయనపేరు స్వర్ణాక్షరాలతో లిఖింపబడింది. అంతమాత్రాన ఆ నిర్మాణంగాని, దాని హేతువునుగాని కర్తనుగాని పవిత్రులనుట పొరపాటవుతుంది, త్యాగమనుట, త్యాగానికి ద్రోహంచేయుట. అంతేకాదు అణ్వాస్త్రాలనిర్మాణ హేతువు హేయమైన కాంక్ష, భయపూరితమైందే, కాని ఆ సైన్సు పరిశోధన అమూల్య విజ్ఞానాన్ని, సంపత్తిని, అభివృద్ధిని కల్పిస్తున్నది. అంతమాత్రాన మారణయంత్ర పరిశోధన మంచిదని యెవరనగలరు ?

ఇంతవరకు ఆశ్చర్యంతో వింటున్న వసంతకుమార్ "ఈ మాటలన్నీ యెక్కడ నేర్చుకున్నావు పద్మా." అని ప్రశ్నించాడు.

"ఒకప్పుడు మీరు, అమ్మాయిగారు చర్చించుకుంటున్నపుడు విన్నవి దప్ప క్రొత్త మాటలుగాదు బాబుగారు!" అంటూ బయటవైపు నడిచింది.

స్వర్ణకుమారి తిరిగి యేదో ప్రశ్నించాలనుకున్నది గాని సందర్భం కుదరక తప్పటడుగులతో వెళ్ళిపోయింది.

వసంతకుమార్ అలానే కుర్చీలో వుండిపోతున్న యిరువురివైపు చూస్తూ లోలోపల నవ్వుకుంటున్నాడు. ఒకరి తరువాత ఒకరిగా ఆలో చిస్తున్నాడు.

కొద్దిరోజులలోనే స్వర్ణ యింతగా మారిపోయింది, ఆమె స్వభా వమే తారుమారైంది. కీర్తి కాంక్ష శక్తివంకమైంది. ఆ మోజులోదింపి మత్తును కలిపించి భ్రమలలో పరువులెత్తిస్తుంటుంది. ఆమెనే అధ్యక్షు రాలనుగాజేసి ఆడిఖ్యతను ప్రదర్శించి దండలతోను ప్రశంసలతోను నింపి పరవశురాలను చేశారు చతురులైన గంగరాజుగారు, ఆ మోజులో మునిగిపోయింది. వారి అడుగు జాడలే ఆమెకు శరణ్యమైంది.

సర్వశక్తులను గర్భంలో యిముడ్చుకుని గంభీరతతో మవున ముద్రలో స్థిరంగా నిలిచిన మలయంవలె వుంటుంది పద్మ. తన కర్త వ్యాన్ని నిర్వర్తించుకొనుట ధర్మంగా విశ్వసిస్తుంది. తృప్తి తొణికిస లాడుతుంటుంది. విశ్వాసం ప్రతిబింబిస్తుంటుంది.

ఒకరి తరువాత ఒకరిగా ఆలోచిస్తూ యెంతసేపు కాలం గడిపాడో చెప్పలేము. స్వర్ణ సహకారం లోపించినందున ప్రయోగశాల కార్య క్రమాలలోని చిన్న చిన్నవి కూడా వసంత్‌కుమారే చూసుకోవలసి వస్తున్నది. ఆమె లేవిలోపం తెలియని రీతిలో బాధిస్తున్నది. అయినా ఆమెను గురించి విరుద్ధ ఆలోచనలు చేయలేకపోతున్నాడు. తాను నియ మించిన నర్సులలోని ప్రతి ఒక్కరితోను ఆమెను పోల్చినపుడు ఆమెకు ఆమెయే సాటిగా దోస్తుంది. ఆమె నిర్వహణలో పూర్తి విశ్వాస మేర్ప డింది. అందుకే ఆమె వున్నపుడు అనేక వైపులనుంచి నిశ్చింత వుండేది. నేడు ఆమె మరో కార్యరంగంలో అడుగిడింది. అలా ఆమె యెందుకు

దూరమయింది. అని యెన్నివిధాల ఆలోచించినా సమాధానం దొరకలేదు.

పద్మకిపుడు తీరుబడి వుండుటలేదు. ఇంటి దగ్గర పనులతోపాటు వసంతకుమార్‌కు భోజన ఫలహారాలు చేయుట, మహిళా మండలికి స్వర్ణకుమారికి భోజనఫలహారాలు చేరవేయుటలతో సరిపోతున్నది.

గంగరాజన్నా సుభద్రన్నా పద్మకు పట్టరానికోపము. వారిరువురిలో యెవరో ఒకరు స్వర్ణకుమారితోపాటు వుంటుంటారు. అందుకనే తన పని ముగించి ఒక్క నిమిషంకూడా అక్కడుండదు.

వసంతకుమార్ యెడల భక్తి విశ్వాసాలున్నవి. కాని ఆయన ప్రయోగశాలయెడల తృప్తిలేదు. ఆయన మీదున్న భక్తికొంది తనకు చేతనైన సహకారం చేయాలని, స్వర్ణకుమారిలేని లోటును భర్తీచేయాలని వాంఛిస్తుంటుంది.

శిశుకేంద్రంలోని ఒక్కొక్క విభాగాన్నిచూస్తు విస్తుపోతుంటుంది. పొట్టి వారిని ఆజానుబాహువులుగాను, నల్లటివారిని యెర్రటివారుగను, అవయవ లోపాలున్నవారిని దిద్ది సుందరరూపులుగా చేయుటకు వసంతకుమార్ కృషినిచూచి జాలిచెంతుంటుంది.

"భగవత్ సృష్టిలోని జీవ స్వరూపాలను మార్చాలని ప్రయత్నించుట హాస్యాస్పదమవుతుందేమో బాబుగారు," అన్నది పద్మ.

వసంత:- అది భగవత్ సృష్టి అయినా, దాన్ని దిద్దాలని, పరివర్తన చేయాలని ప్రయత్నించుటకూడా విజ్ఞానవికాస ప్రకృతిసిద్ధ స్వభావంగదా!

పద్మ:- అసంభవమును సంభవంగా చేయజూచుట అతిగా కనిపించవచ్చు!

వసంత:- ఒకనాడు అసంభవమనుకున్నవి నేడు అనేకం సంభవమవుతున్నపుడు నేడు అసంభమవి భావించేవి రేపు సంభవంకావని యెలా చెప్పగలవు?

పద్మ:- మీరనుకుంటున్నట్లు అందరినీ అందమైన వారినిగాను, వికలాంగులను సకలాంగుల వారినిగాను చేయగలిగితే పూర్వజన్మ సుకృత ఫలితాలు యెగిరిపోతపగదా! అది సాధ్యమా బాబుగారు?

వసంత:- తలిదండ్రుల ఆరోగ్య ఫలితాలే పూర్వజన్మ ఫలితాలు. వికలాంగులు కురూపులు .అయినవారికి సంతానాన్ని పొందే హక్కు లేకుండా కృత్రిమరూపంలో అరికట్టాలని నా అభిమతం.

పద్మ:- బాబుగారు! పాప పుణ్యమూ, వాటి ఫలితాల సంగతేమిటి! నరకము స్వర్గము దేముడు మాట యేమిటి ?

వసంత:- ఏది చేస్తే తనకు మరితరులకు అశాంతి లభిస్తుందో, అనారోగ్యం ప్రాప్తిస్తుందో అదే పాపము. దేని ద్వారా తనకు తదితరులకు శాంతి సుఖము లభిస్తుందో అదేపుణ్యము. బాధే నరకము, సుఖమయ ఆనందమే స్వర్గము. మనకు తెలిసిన దేవుళ్ళందరు మన సృష్టిలోనివారు. మన గుణ గణాలనే, లోపాలనే మన నిర్మిత దేవుళ్ళకు కల్పించుకున్నాము. యదార్ధదేవుడు ఎలా వుంటాడో, యే రూపంలో వుంటాడో ఎవరికీ ఎన్నటికీ సంపూర్ణంగా అర్ధంగాని అజ్ఞాత శక్తి స్వరూపుడు.

పద్మ:- (భయ కంపితకంఠంతో) బాబుగారు, నా హృదయ మెందుకో దడ దడ లాడుతున్నది. పూజా పునస్కారాలు, నిష్ట నియమాలు వ్యర్ధమేగదా !

వసంత:- వ్యర్ధం ఎన్నటికీగాదు, ఆ ద్వారా ఆత్మబలము శాంతి కలిగి కర్తవ్యోన్ముఖులు కాగలుగుతారు. కార్యసాధన పెరుగుతుంది. జీవితసఫలం వైపుకు నడుపుతవి.

పద్మ:- సృష్టికి మూలమో !

వసంత:- ప్రకృతి సంయోగం, దాన్నే భగవత్ సంకల్పమన్నా, అజ్ఞాత శక్తి ప్రక్రియ ఫలితమన్నా ఫరవా లేదు.

జీవితమంతా సంచయించుకున్న సంపత్తి అంతా ఒక్కమాటుగా అదృశ్యమైనట్లు భార హృదయంతో చిన్నబుచ్చుకున్న ముఖంతో మారు మాటలేక తప్పటడుగులు వేసుకుంటూ బయటకు నడిచింది.

విరాట్ రూపంలోని గుళ్ళు గోపురాలు, మందిరాలు, సుశోభిత రూపంలోని విగ్రహాలు, భజనలు మొక్కులు అర్చనలు, యజ్ఞ యాగ క్రతువులు కళ్ళముందు కనిపించినట్లు ఆమె మనస్సులో మెదల సాగినవి. ఆ సర్వాంతర్యామియయిన భగవంతుడే కర్మకు కట్టుబడిన బాధలు, అవుసరానికి యెత్తిన అవతారాలు వరుసగా కనిపించి ఖంగారు పడిపోయింది. ఇన్ని యుగాలనుంచి వస్తున్న యీ పరమ సత్యాలను చిన్ని చిన్ని మాటలతో చెరిపివేసి మానవ కృషికే ప్రాధాన్యత నిస్తున్న వసంత కుమార్ మాటలు చెవులలో మారు మ్రోగినపుడు అడుగులు తడబడి కూలబడి పోయింది పద్మ.

చల్లగాలికి మెల్లగా తేరుకున్న పద్మ చిన్నగా శిరస్సు పైకెత్తి "భగవాన్, బాబుగారి హృదయం అతి నిర్మలమైంది, నిస్వార్థమైంది. పరమ పవిత్రమైంది. కాని పరదేశ చదువులవలన మనస్సులో అనర్థానికి మూలమైన మార్పులు జరిగినవి. అవి దోషంగా యెంచక వారిని క్షమించు." అని అంటుండగా కన్నీరు క్రమ్మి గొంతు బొంగురు పోయింది.

8. మాయా జాలం

స్వర్ణకుమారి సుభద్రాదేవుల సహకారంతో గంగరాజు శక్తి విశాలరూపం ధరించింది. కుటీర పరిశ్రమల కేంద్రము, నీరా సంఘాలను, మత్స్య పరిశ్రమను, కోళ్ళు, పందుల పెంపక కేంద్రాలను, వస్తు విక్రయ సంఘాలను, పరపతి సంఘాలను, కుట్టుమిషను కేంద్రాలను, వయోజన విద్యా కేంద్రాలను నిర్వహిస్తున్నారు. నిత్య పరిశీలనా బాధ్యత స్వర్ణకుమారి పరమైంది. 60 మైళ్ళలోనున్న సమిష్టి వ్యవసాయ క్షేత్ర పరిశీలనకూడా ఆమె ద్వారానే జరుగుతున్నది.

ఆమెను వెంట నిడుకొని సంఘాలకు సమితులకు కేంద్రాలకు తీసుకెళ్ళి పరిచయాలుచేస్తూ రోజుకో రీతిలో తెలియజెప్పుతుండేవాడు.

ఒకొక్కదాని నిర్మాణ విషయంలో తను యెదుర్కొన్న సమస్యలను, బాధలను, తన ధైర్యాన్ని తాను వీరోచితంగా త్యాగ బుద్ధితో నిష్కల్మషమైన సేవాభావంతో అన్నిటిని దాటి సఫలం పొందినరీతిని, ఆ తరువాత జరుగుతున్న కార్యక్రమాన్ని, అభివృద్ధిని విశదంగా వివరించి "ఇక ముందు అభివృద్ధికి దెచ్చే బాధ్యతను మీపరం జేస్తున్నాను, ఇందు లోని యావన్మంది వుద్ధరణ మీ చేతులలో వుంది. మీ అండలో నేను నిశ్చింతుడనై నూతన సమస్యలవైపు మరలుతాను. ఈ జీవితంలో విశ్రాంతిలేదు. గిట్టనివారు నిందలు మోపుతున్నా, విమర్శలు చేస్తున్నా సమాజ సేవలో మునిగిన నాకు వినిపించవు. నా లక్ష్యాలే నా ముందు గనిపిస్తుంటవి. ఆ దృష్టితోనే ముందుకుపోను సర్వతోముఖ కృషి చేస్తుంటాను. ప్రత్యేకించి మీ ఆదరం లభించాక నాలో నూతనోత్సాహం వుద్భవించింది. నా బలమిపుడు ద్విగుణీకృతమైంది. ఇక మీదట మీపరం జేసిన యీ సంస్థల బాధ్యతా భారమంతా మీరే వహిస్తుండాలని నా అభ్యర్థన" అన్నాడు గంగరాజు.

"ఏమీ తెలియని అనుభవంలేని నా మీదకునెట్టి మీరు తప్పుకో వాలని చూస్తే మీరింతకాలంచేసిన శ్రమ వ్యర్థంకావచ్చు. మీ అడుగు జాడలలో నడుస్తూ మీరు వేసిన భారాన్ని నిర్వహించుటలో వెనుదీయను గాని, మీ ప్రక్కనుంటూ మీ ప్రత్యక్షంలో మాత్రమే చేయగలను." అన్నది స్వర్ణ.

ఆయన మందహాసాలొలికిస్తూ "ఈ సంస్థలన్నిటిని మీ కప్ప గించి పారిపోవుట నా అభిమతంగాదని ముందే విన్నవించుకున్నాను. ఈ దళితజాతి సేవలో మీకు సదవకాశాన్ని కల్పించాలన్నదే నా సంకల్పం. నేను యెల్లవేళలా మీపిలుపుకు అందుబాటులోనే వుంటాను." అన్నాడు.

ఆ మాటలకామె ప్రఫుల్లితురాలై పోయింది. ఆయన యడల కృతజ్ఞత హృదయంనుంచి పొంగింది. తా నొకప్పుడు ఆయన్ను గురించి దురూహపడినందుకు మరోమారు సిగ్గునొందింది. ఇటీవల

పద్మ అన్న మాటలు గుర్తుకొచ్చి మనస్సా నొచ్చుకున్నది. పద్మను అనేక విధాల నిందించుకున్నది. ఆయన కృషిద్వారా దళితజాతిలోని ప్రజలు యెంత ఆనందం పొందుతున్నది, అభివృద్ధిచెందుతున్నది ప్రత్యక్ష నిదర్శనగా తన యెదుట కనిపిస్తున్నది.

ఇపుడు ఆఫీసులో పుస్తకాలతోను పేపర్లతోను వాద వివాదాల తోను కాలం వెళ్ళబుచ్చు అవకాశం లేదు. సంఘంనుంచి సంఘానికి, కేంద్రానికి, సమితికి తెరపిలేకుండా తిరుగవలసివస్తున్నది. వెళ్ళిన చోటల్లా ప్రియ పూర్వక ఆహ్వానాలు పిన్నపాటు లభిస్తున్నవి. ఆమె తమ పాలిటి రక్షకురాలైనట్లు, ఆమె సమక్షంలోనే స్తుతిస్తున్నారు తమ తమ చిన్ని చిన్ని సమస్యలను ప్రార్ధనారూపంలో విన్నవించుకున్నారు. శ్రద్ధగావిని నోట్ చేసుకుని పరిష్కరించను ప్రయత్నించి విఫలమయి నపుడు గంగరాజును సంప్రతిస్తుంటుంది. ఆయన సమాధానంలో సంతృప్తిచెందక. ప్రత్యక్ష పరిష్కారమార్గం చూపమని దీనంగా ఆయన వైపు చూస్తుంది. ఆయన గంభీరరూపంలో మందహాస మిళిత మధు భరిత దృక్కులను బరపుతుంటాడు. ఆమె పసిదానివలె హటంజేస్తూ "మీరు నన్ను మైదుపుచ్చాలని యెందుకు చూస్తారు! ఈ సమస్యను పరిష్కరించేమార్గం చూపండి!" అంటుంది.

మౌన భంగంగాకుండా ఆయనలానే చూస్తుంటాడు. "ఆవేదన మీకు ఆహ్లాదంగా వుందా? దయచేసి మాట్లాడండి." అన్నది.

గంగరాజు:- మీరు అన్యధా భావించి ఆగ్రహావేశాలకు గురిగాకపోతే ఒక్క యదార్ధాన్ని చెబుతాను.

స్వర్ణ:- ఎలాంటి విషయం చెప్పినా సంతోషంతో వింటాను చెప్పండి!

గంగరాజు :- మీ కోపంలో అద్వితీయమైన ఆకర్షణుంది. హటంవేసి అలకతో అడుగుట అంతకంటె ఆకర్షణీయమైంది. కోపంలోని మిమ్ము జూచుటలో తన్మయత్వం కలుగుతుంది. వెంటనే జవాబు చెప్పిఅలాంటి ఆహ్లాదకరమైన అదృష్ట ఘడియలను కోల్పోవు టకు నేను తెలివి తక్కువవాడినికాదు గదా!

స్వర్ణ: (సిగ్గుదొంతరుల మధ్య) మాటను మరుగుపరచి మరోవైపు
మరలింపజూస్తున్నారు.

ఆయన చూపులోని కాంతి మెలివేస్తున్నది. ఆ దృక్కుల అడుగునవున్న దీనత్వం వుబుకుతున్నది. కనుకొలుకుప్రక్క కన్నీటి బిందువులు ముత్యాలవలె మెరుస్తున్నవి. తిరిగి యేదో అడగాలని వుందికాని నోరు పెగలక అధరాలు అదిరి వూరుకున్నవి.

ఆదుర్దాతో "మీరు కన్నీరు పెడుతున్నారెందుకు గంగరాజు గారు!" అని ప్రశ్నించింది.

ఆయన ముఖాన్ని మరోవైపుకు త్రిప్పుకుని అశ్రువుల నద్దుకుంటూ "ఏమీ లేదు." అన్నాడు బరువు కంఠంతో. ఆ ధ్వనిలో తీరని వ్యధ కనిపిస్తున్నది.

"నావల్ల యేమయినా పొరపాటు జరిగిందా? క్షమించి వెంటనే చెప్పండి!" అన్నది.

"అలాంటిదేమీ లేదు. మీరడిగిన ప్రశ్నల విషయమే ఆలోచిస్తున్నాను. భావిలో తోడుతున్నకొంది నీరు వూరునట్లు ప్రజాకార్యాలలో సమస్యలను పరిష్కరిస్తుంటే నూతన సమస్య లుద్భవిస్తుంటవి. ఎప్పటికప్పుడు తప్పని వాటిని పరిష్కరింప ప్రయత్నించుటే మన ధర్మం! ప్రజాకార్యాలు నిర్వహించుట కంపతొడుగు లాగుటలాంటిది. అనుభవంలోనే అవి అర్థమవుతవి. అక్కడ ఆవేశాలకు ఆదుర్దాలకు ప్రయోజనముండదు." అన్నాడు.

ఏ విషయం మీద మనస్సు వుత్సాహపడుతుంటుందో ఆ సమయంలోనే అంతకు మించిన విషయం ముందు కొచ్చినపుడు ప్రథమ విషయ ప్రాముఖ్యం అదృశ్యమవుతుంది. అదే రీతి స్వర్ణ కిపుడు ఆ సంఘాల సమస్యలగూర్చి వుత్సాహంలేదు, ఆయన హృదయంలోని వ్యధ ప్రతిబింబ మైనమయిన కన్నీటితో ఆమె మనస్సు కళవళ పడిపోయింది.

"ఆ విషయాలు మీరన్నట్లు అనుభవంతో తెలుసుకుంటాను. ముందు మీ కన్నీటికి కారణ మేమిటో చెప్పండి !" అన్నది.

"కారణమంటూ చెప్పదగింది లేదు. అయినా యీ చిన్ని విషయానికి మీ రాందోళన పడవలసిన పనిలేదు. అది మనస్సులోని కుటిలం బయటపడిపోవటం గావచ్చు. క్షమించండి." అన్నాడు.

"పురుషుని కన్నీరు అగాధ బాధలకు చిన్ని నిదర్శన మవుతుం దంటారు. మీలోని ఆ విషయం యెలాంటి దయినా సరే చెప్పినందు వలన కలిగే దుఃఖంకంటె చెప్పనందువలనే కలుగుతుంది. కనుక దయతో చెప్పండి." అని వినయపూర్వకంగా అర్థించింది.

"యదార్థం చెబితే దోషినిగా నిర్ణయం కావచ్చు. అయినా మీరు కోరిన మీదట చెప్పకపోవుట అంతకంటె దోషమే అవుతుంది. పెను తుఫానుకు అల్లల్లాడి మొదలు కదిలి పెళ్ళగిలనున్న వృక్షంవలె కంపనలతో కదిలిపోతున్న నా హృదయ వ్యధ యెందుకో యేమిటో నాకే తెలియదు. నిగ్రహించుకోగల శక్తి సన్నగిలుతున్నది. ఆ వ్యధను వ్యక్తం చేయగల భాషగాని శక్తిగాని నాలో లేదు స్వర్ణకుమారిగారు." అన్నాడు.

"అర్థంగాని పొంతనలేని మాటలతో ప్రయోజనంలేదు. ఏ విషయాన్ని గురించి మీరింత బాధ చెందుతున్నారో చెప్పండి దయచేసి" అన్నది ప్రాధేయ పూర్వకంగా.

అధోముఖంచేసి "పున్నమి చంద్రునిజూసి మహాసాగరం ఘోషించే పొంగులతో అందుకో యత్నించునట్లు మిమ్ముజూచినపుడు నా హృదయం దడదడలతో వూగి కల్లోలపడిపోతుంటుంది. వశం దప్పి తెలియని రీతిలో పొంగి పొరలుతుంటుంది. ఆలోచనలన్నీ అదృశ్యమై అంతటా మీరే కనిపిస్తుంటారు. శరీరంలోని ప్రతి అణువు మీ యెడల కృతజ్ఞతతో ప్రీతితో ఆరాటపడుతుంటుంది. మీ పాదాల క్రిందున్న ధూళిలో గలిసిపోయిన స్పర్శానుభూతిని పొందాలని ఆరాటం

కలుగుతుంటుంది. ఇది నాజీవితంలో యెన్నడూ యెరుగని నూతనాను భవం. హృదయంలోని యీ రహస్య సంఘర్షణనుకూడా మీకు తెలియ నీయకుండా అణచివేయాలని, తుడిచివేయాలని విశ్వప్రయత్నాలు చేశాను కఠోర శపథాలు తీసుకున్నాను. కాని నిష్ఫలమయింది. హృద యంలోని యీ కాంక్షను ఆరాటాన్ని అణచివేయటానికి యెంతగా ప్రయత్నించానో అంత వుధృతరూపం దాల్చసాగింది. నేడు మీముందు పట్టుబడిపోయాను. నా నేరం బయటపడిపోయింది. అపవాదుకలు యెన్నివున్నా నా జీవితంలోని యదార్థం నేరం యిదే ప్రథమం. శబ్దా నికి, కాంతికి మించినవేగం, శతకోటి ఆటంబాంబులకు మించిన శక్తి వున్న యీపాడు మనస్సుయొక్క స్వభావసిద్ధమైన నడక అవినీతివైపుకే వెళుతుంటుంది. ఎన్ని నియమాలు నీతులు ధర్మాలు భయాలు చూపి భయపెట్టినా, వద్దన్నవైపుకే మనస్సు పరువులెడుతుంటుంది. అలాంటి స్వభావసిద్ధమైన ప్రవృత్తితోనే యింత నేరంచేసి కూర్చున్నాను. మీకు తోచిన కఠినాతి కఠినమైన శిక్షను విధించండి. స్వీకరించి విముక్తి పొందుతాను." అన్నాడు.

ఆ మాటలు వింటున్నపుడు మధ్యలో ఆమె శరీరం కంపించింది. ఆయనవైపు చూస్తూనే అన్నీ విన్నది. మనస్సులోను హృదయంలోను యెన్ని తుఫానులు చెలరేగినవో చెప్పలేము. కాని శిలాప్రతిమవలె అలానే నిలచి వున్నది.

అయిదు నిమిషాలు గడిచిపోయినా జవాబులేదు. గంగరాజు ఆమె వైపు చూశాడు. ఆమె నేత్రాలలో భీతిని గల్పించే శక్తి గనిపించింది. చూస్తూ చూస్తూ వుండగానే ఆమె కుప్పవలె కూలబడిపోయింది.

అది ఆఫీసుముందున్న పశ్చికబయలు, అటు యిటు చూశాడు, యెవరూ లేరు. తచ్చట్లాడుతూ తడబడలతో ఆమె చుట్టూ తిరుగు తున్నాడు. ఒక దీర్ఘ శ్వాస వినిపించింది. ధైర్యాన్ని పూరించుకుని ఆమెను బాహువుల్లో తీసుకుని ఆఫీసుగదిలోకి చేర్చాడు. సోఫామీద పరుండబెట్టాడు. ఆమె కూలబడినపుడు క్రిందవైపున్న చేతిగాజు చిట్లి

శూలప్రక్క గాయపర్చింది. ఆ గాయంద్వారా స్రవించిన రుధిరంతో చీర మరకలు మరకలుగా అంటుతున్నది. ఆ దృశ్యం ఆయన్ను మరింత ఆదుర్దా పెట్టింది. ఆ గాయాన్ని తన వుత్తరీయంతో అద్దుతున్నాడు. అద్దుతున్నకొద్ది రుధిరం స్రవిస్తున్నది. భయ విసగటలతో కంపించిపోయాడు. ఆ వుత్తరీయాన్నే ఆమె నడుముచుట్టూ త్రిప్పి కట్టుగా కట్టివేశాడు. సొమ్మసిలిన నిద్రలో నున్నట్లున్న ఆమె ముఖ మండలంలోని లావణ్యం అద్వితీయమై శోభిస్తున్నది. చూస్తున్నకొంది దోచుకుంటున్న దొంగవలె హృదయం దడ దడ కొట్టుకుంటున్నది. ఊపిరి సలుపుటలేదు. ముందు తన ప్రాణమే పోతుందని భయమేస్తున్నది. దాగుడుమూత లాడుతున్న జాబిలివలె ముకుళిత నయనాలతో నున్న ముఖాన్ని చూస్తుంటే చుంబించాలని శరీరంలోని సర్వశక్తులు ఆవేశ పరుస్తున్నవి. సుకోమల కుసుమంలాంటి ఆ ముఖ మండలాన్ని ఒక్కమాటు చుంబించి మరణించినా జీవితం సార్థకమయినట్లని సాహసానికి వూతం దొరుకుతున్నది. వంగి ఆమె కపోలంమీదికి జారిన శిరోజాలను అంగుళీయములతో నెట్టివేస్తూ చుంబించాలని ప్రయత్నించాడు. పవిత్రమై ఖణ ఖణ లాడుతున్న అగ్నిశిఖను చుంబించబోతున్నట్లు తానే భస్మమైపోనున్నట్లు భయభీతితో శరీరం కంపించింది. తనకు తెలియకుండానే దూరమయ్యాడు.

ప్రక్కనున్న కూజాలోని నీటితో ఆమె ముఖాన్ని తుడిచాడు. అయిదు నిమిషాల అనంతరం ఆమె నేత్రాలు తెరచిచూసి ఖంగారు పడుతూలేచి "ఇదేమిటి, ఏమి జరిగింది!" అంటూ తన నడుమునున్న కట్టునువిప్పి రుధిర మరకలను చూసుకుని ఖిన్నురాలయింది.

ఉదరం మీదయిన రుధిరజిడ్డుమరకలను తుడుచుకుంటూ "నాకీ గాయమెలా పడింది!" అన్నది.

ప్రక్కనుండి భయంతో వణికిపోతున్న గంగరాజు కంపిత కంఠంతో "మీరు పడిపోయినపుడు గాజు చిట్లి గుచ్చుకున్నది." అన్నాడు.

రుధిర మరకలతో నిండిన వుత్తరీయాన్ని చూసి బిత్తరపోతూ "ఎవరూ రాకముందే యీ వుత్తరీయాన్ని యెక్కడైనా దాచివెయండి." అన్నది.

ఆయన వెంటనే దాన్ని బీరువామీద కాగితాలక్రిందకు నెట్టి వేశాడు.

ఆమె చీరెను సర్దుకుంటూ మరకలను కప్పిపుచ్చుకుంటూ బయలుదేరి వెళ్ళిపోయింది.

9. అర్ధంగాని ప్రయోగాలు

అపరాహ్నసమయమది. ధూమ్రమదాంతరులవలెనున్న తేలిక మబ్బులు అనంతఆకాశంలో పూర్వదిశకు పరువులెడుతున్నవి. తన మేలును గుర్తించని యీ మానవలోకంమీద విసిగిపోయిగాబోలు పవనం స్తంభించింది. శాల్మలీ వృక్షంమీదనున్న కాకములు మవునవ్రతం వహించినవి. నారికేళవృక్షంక్రిందనున్న పోతమట్టి సందులనుంచి చీమలదండు బారులుదీరి యే ప్రోజెక్టు నిర్మాణానికో సుశిక్షిత రీతిలో పయనమై పోతున్నవి. చెట్టు మొదలమీదనున్న తొండ బస్కీలు కొడుతున్నది. పరిశోధనశాల ఆఫీసు గోడమీదనున్న బల్లి అహోరాత్రం తపస్సు చేస్తున్నది. సీలింగు ఫ్యాను పంతంతో తిరుగుతున్నది. ఆ ఫ్యాను క్రిందకూర్చుని రికార్డు షీటులను ఒక్కొక్కటిగా పరిశీలనగా చూస్తున్నాడు వసంతకుమార్. టేబులుమీదున్న ఒక గ్రంధంలోని కాగితాలు గాలికి రెపరెపలాడుతున్నవి. గోడనున్న గడియారం సమయాన్ని సమాన ఖండ ఖండాలుగా ఖండిస్తున్నది. డైనింగ్ టేబులుమీదనున్న కారియర్ మీద చేయివుంచి ప్రక్కన నిలిచిన పద్మ తదేకంగా వసంతకుమార్ వైపు చూస్తున్నది. ఇంతలో గడియారం టింగ్ మని పెద్దగా ఒక్కదెబ్బగొట్టి చైతన్యాన్ని గలిగించింది.

నిద్రమేల్కొన్న దానివలె పద్మ హడావుడిపడి, నిభాయించు

కుంటూ, సన్నటి మధురమైన ధ్వనితో ''బాబుగారు మీరు భోజనం మాట మర్చిపోయారు లాగుంది ?" అన్నది.

''ఆయన ''వూ(.....వూ(....." అంటూ ఒక రికార్డు షీటును బట్టుకుని ఆనందపడుతూ ''26 వ నంబరు పాపాయిని చూశావా యెంత మార్పు వచ్చిందో" అన్నాడు.

ఆమె చిన్నగా చిలికించే నవ్వుతో ''26 వ నంబరులో పాపాయి గాదండి వున్నది, బాబు (శంకరబాబు). ఆ విషయాలు తరువాత చూసుకోవచ్చు; ఒంటిగంట అయినా భోజనం చేయకపోతే యెలా చెప్పండి!" అన్నది మృదువుగా.

ఆమె వైపుచూసి ''ఓ(, ఇంతలోనే ఒంటిగంట అయిందా ? నీవు పాపం యింతవరకు ఫలహారంకూడా చేసివుండవు. చాలాపొరపాటు జరిగింది. వడ్డించు వస్తున్నాను" అంటూ చేతిలోని కార్డును ప్రక్కగుర్తుగా పెట్టుకున్నాడు.

డైనింగ్ టేబులుముందు నిలిచి, భోజనం వడ్డిస్తున్న పద్మవైపు ప్రేమభరిత దృక్కులతోజూస్తూ "ఆలస్యంచేసి నిత్యము నిన్ను బాధిస్తున్నాను. ఇప్పటికి వంట అయింది. తిరిగి యింటికెళ్ళి యెప్పటికి భోంచేస్తావో, ఇక్కడే భోంచేయరాదా పద్మా ?" అన్నాడు వసంత కుమార్.

"ఇవన్నీ నాకు మామూలే బాబుగారు. చూచేవారికి బాధగా కనిపించినా నాకు అలాంటి బాధేమీ వుండదు. మిమ్ము గురించి బాధపడుతుంటాను కాని భయంతో హెచ్చరించలేక పోతుంటాను. మీరు గొప్ప డాక్టర్లు, విజ్ఞానవేత్తలు. లోకంలోని అందరి ఆరోగ్యాన్ని గురించి ఆందోళన చెందుతుంటారు. స్వఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తుంటారు. సరియైన నియమానికి భోంచేయకపోవుట యెంత దోషమో ఒక డాక్టరుగా మీరే చెప్పండి!" అన్నది.

"అవును....అవును....ఆవిషయం మర్చిపోతుంటాను" అన్నాడు.

"ఎవరి రక్తంలో ఏ కణాలసంఖ్య యెంతవున్నదో యీప్రయోగ శాలలోని ప్రతిఒక్కరిని గురించి స్పష్టంగా చెప్పగలరు. ఎవరిలో థైరాక్సిన్ యే రూపంలో అభివృద్ధి చెందింది వివరించగలరు. కాని మీ ఆకలి విషయము ఆరోగ్య విషయము మీకు తెలియదు, తెలుసుకోలేరు." అన్నది.

ఆయన మధుభరిత దృక్కులలో తదేకంగా చూస్తున్నాడు.

ఆమె భయాన్నభినయిస్తూ "కోప మొచ్చిందా, క్షమించండి బాబుగారు. నిజానికి మీలాంటి అఖండ విజ్ఞానవేత్తలు కేవలం రక్త కణాల థైరాక్సిన్‌ల పరిశోధనలలో మునిగిపోవుట లోపమేమో ననిపిస్తున్నది." అన్నది.

ఆదరంతో అభిమానంతో విశ్వాసంతో వినయంతో భయభీతులతో గంభీరముద్రలోనుండే పద్మ ఒక్కమాటుగా సాహసించి అన్న మాటకు బాధకలుగుటకు బదులు ఆనందం కలిగింది. ఆమెలోని అభిమానం మరింత లోతులు బారినట్లు వూహించి ప్రసన్నుడైనాడు.

"నేడు కయ్యానికి కంకణం కట్టుకుని వచ్చినట్లున్నావు. తన ప్రజ్ఞ యెంతటిదయినా కొన్ని పరిధులలోనే ప్రతిబింబింప జేసినపుడు సత్ఫలితాన్నిస్తుంది, అన్నిటిలోను అడుగుబెట్టినపుడు అప్రయోజకత్వం బయల్పడుతుంది. అవునా?" అని ప్రశ్నించాడు.

"అవధులుదాటి అన్నందుకు మన్నించండి. మీ ప్రయోగాలు పరిశీలనలు యెవరికీ అర్థంగానివి. రాణింపు అంతకంటె కనిపించుటలేదు. మీ కొరకు వేయికళ్ళతో యెదురుచూసి ఆశలుపెట్టుకున్న పెద్దమ్మగారు నేడు లోలోపల కృశిస్తున్నారు. ఇంటిలోని అందరికి నిరాశ కలిగింది. మీది వింత ప్రవృత్తి అని, పనికిరాని ప్రయోగాలని లోకులు అనుకుంటుంటే విన్నపుడు చెప్పుకోలేని దుఃఖం కలుగుతుంటుంది. అయినా అమ్మాయిగారు యీ కార్యాలయంలోనే వుంటున్నపుడు కొంత నిండుగా వుండేది. నేటి స్థితి హృదయాన్ని కదిపివేస్తున్నది. మీరు వీటన్నిటికి అతీతులై మామూలుగానే వుంటున్నారు." అన్నది.

"అయితే నా మీద చాలా ఫిర్యాదులున్నవన్నమాట."

"మీస్వభావంమహానిండైనది. గంభీరమైంది, తొణకనిది. భయపడే చోట, ఆవేశపడేచోట క్రోధంతో కారకారలాడేచోటకూడా మీరునిర్మల మైనప్రశాంతంతో చిన్నినవ్వును ప్రదర్శించి వూరుకుంటారు. కాని మీకు అయిష్టమైన విషయాన్ని ప్రశ్నించుటకు పెద్దమ్మగారుకూడా జంకు తారు. అయినా నేడు యింతగా నేనెలా మాట్లాడగలుగుతున్నానో నాకే తెలియదు. ప్రజలకుగాని మీకుగాని ప్రత్యక్ష ప్రయోజనాలు కనిపించని మీ ప్రయోగాలకు యెలా విలువ వస్తుంది చెప్పండి। గంగరాజుగారు ఒకనాడు మీ పేరునుపయోగించుకుని యెన్నికలలో గెలిచాడు. నేడు ప్రఖ్యాతి బొందిన మహానాయకు డయినాడు. ఉన్నవారు లేనివారు, కూలీలు రైతులు, నిరుద్యోగులు ఉద్యోగస్తులు అందరూ ఆయనద్వారా సహాయాన్ని పొందుతున్నారు, పొగడుతున్నారు. ఆయన మీదున్న అప వాదుకలు నేడు మరుగున పడిపోయినవి. వారిని అంతగా విమర్శించిన అమ్మాయిగారే వారి అడుగుజాడలలో మహిళోద్ధరణకు కంకణం కట్టింది. అంత హీనంగా చెప్పుకోబడిన ఆయన యింతమందిచేత పూజించబడుటలో ఎక్కడో తెలియని విచిత్రతదాగివుండాలి." అన్నది.

"అలాంటిఖ్యాతి, పూజ నాకు లేదని మీరు దుఃఖపడుతున్నావన్న మాట. అందరిదీ ఒకే విధానమయితే ప్రమాదముంటుంది, ఎవరు చేపట్టిన విధానంలో వారికి ఆత్మ విశ్వాసము పట్టుదలవున్నపుడే ఆశయం నెరవేరుతుంది. పేరు ప్రతిష్టల కాంక్ష వుండవచ్చు కాని ఆ ప్రయోజనం కొరకే ప్రణాళికను తయారు చేసుకోవటం కటికి స్వార్థాన్ని రుజువు చేస్తుంది. గొప్ప లక్ష్యాన్ని సాధించుటకు చేసే సాధన పేరే తపస్సు. ఆ తపస్సు ఫలించినపుడు సంఘానికి అమూల్య అభివృద్ధి కలుగుతుంది. తాత్కాలిక చిట్కాలవలన శాశ్వత ప్రయోజనం కలుగదు. శాశ్వత పరిష్కారమార్గ ఆవిష్కరణ కొరకు అనంత తపస్సు చేయక తప్పదు. త్యాగం వున్నచోటే అవి ఫలిస్తవి." అన్నాడు.

"మీముందు తర్కించగల శక్తి మాకులేదు. కాని మీ నిర్ణయాలు

ప్రయోగాలు ఆకర్షవంతంగాలేవు. ఎక్కడో లోపమున్నదనిపిస్తున్నది, కాని వివరంగా చెప్పలేక పోతున్నాను. మానవులందరిని అందమైన వారినిగాను యెర్రగా సౌష్టవమైన ఆరోగ్యవంతులుగాను ధృఢకాయులు గాను చేయాలంటున్నారు. ఆర్థిక సమానత్వం సర్వవైపులనుంచి వుండా లంటున్నారు. ఇది సృష్టిని పరిహసించుట గావచ్చు బాబుగారు. ఒకే గర్భ ఫలితాలు ఒకేరీతిలో వుండవు. విభిన్నమైన ప్రవృత్తులు గలిగిన మానవులందరు ఒక ఆశయానికి యెలా కట్టుబడగలరు? భగవంతుని విశ్వసించకపోయినా స్వర్గ నరకాలను, పాపపుణ్యాలను, పునర్జన్మలను నమ్మకపోయి నా కృషి ఫలితాలమీద, ఆరోగ్య అనారోగ్యాలమీద అన్నిటిమీద అజ్ఞాతశక్తి ప్రభావం కొంత వుంటుందని వప్పుకుంటారు గదా! కుడియడమలు లేకుండా ఒకే విధంగా చేయబూనుట అంత సాధ్యమయే పనిగాదు." అన్నది.

"అవి ఆత్మబలం సడలినపుడు అనేమాటలు. అందుబాటైన ఆర్భాటమైన, అతి తేలికగా ఖ్యాతి పొందగలిగిన అధికారాలు హస్తగత మయ్యే కార్యక్రమాలు అందరినీ ఆకర్షిస్తవి. అసాధ్యమైన కార్యాల వైపు అందరూ వెళ్ళలేరు. వెళ్ళినవారు అపజయాలను అపహేళనలను అడుగు అడుగున భుజానవేసుకుని ముందుకు నడువాలి. ఆ భారంతో సంకల్పబలంతో నడచుట ఘోరమైన తపస్సు నాచరించుటలాంటిది. అలాంటి తపోబలంతో సాధించిన విజయం వెనువెంటనే అందరికీ అర్థంగాక పోవచ్చు. భూమికి ఆకర్షణ వున్నదని మొట్ట మొదటగా అన్న న్యూటన్‌ను పిచ్చివాడన్నారు. సంఘం తాత్కాలిక ప్రయోజనాల కొరకు నడుంకట్టుట ఎక్కువ మందికి సాధ్యమయ్యేది. నా పరిశోధన యెవరికీ అర్థంకాకపోవచ్చు, హాస్యాస్పదంగావచ్చు. ఆఖరకు వ్యర్థం గావచ్చు. కాని నా లక్ష్యంతో దృఢమైన విశ్వాసంతో ముందుకు పోవుట నా ధర్మం గదా!" అన్నాడు.

"మీరు యీ మాటలలోపడి భోజనంమీద అశ్రద్ధ చేస్తున్నారు. ఈ సమయంలో సంభాషణ తెచ్చుట నా పొరపాటు. ముందు మీరు భోంచేయండి బాబుగారు"

ఆమె ముఖాన్ని మరింత శ్రద్ధగా పరిశీలిస్తూ భుజిస్తున్నాడు.

ఆమె సిగ్గుతో అధోముఖం చేసుకున్నది. ఆయన మాటలతో తృప్తికలుగకపోయినా హృదయం సానుభూతితో నిండింది. "ఆయన నిష్కల్మషమైన నిర్మల హృదయుడు. ఎంత నిస్వార్థత్యాగి, తపస్వి అయినా సంఘసేవలో ఆయన యెన్నుకున్నమార్గం కంటకావృతమైంది. ఆత్మవిశ్వాసంతో · లక్ష్యసిద్ధి ప్రేరణతో అంధకారంలో వెలుగును సృష్టించుకుని అడుగులు వేస్తున్న యోధుడు. ఆయన అడుగులు ముందుకు పడుతున్నవో వెనక్కు పడుతున్నవో తెలియదు. భగవంతుని నిర్ణీతమైన కర్మసిద్ధాంతంమీద ఆయనకు విశ్వాసంలేకపోవుట దురదృష్టం. అయినా జాలితో కృతజ్ఞతతో నా హృదయం తొణుకుతున్నది. ఆయన పవిత్ర హృదయంలోని ఆలోచనలను సఫలీకృతం చేయమని ప్రార్థిస్తున్నాను భగవాన్," అని మనస్సా అనుకుంటుండగా నేత్రాలు జలభరితమైనవి.

పద్మకు ప్రయోగశాలమీద విశ్వాసంలేదు. వసంత కుమార్ కార్యక్రమాలమీద శ్రద్ధలేదు. అమాయకపు ఆలోచనలని ఆమె వూహ. కాని వసంతకుమార్ యెడల అద్వితీయమైన భక్తి విశ్వాసాలున్నవి. ఆ కారణంతోనే అయిష్టమైన ఆ ప్రయోగశాల కార్యాలలో విశ్వాసం గలవారికంటెకూడా శ్రద్ధగా విసుగు విరామం లేకుండా పాల్గొంటుంది. ఇంటిపడ్డనున్న పనులకు స్వస్తిజెప్పి వసంతకుమార్ ఆరోగ్య విషయంలోను, ఆయన కార్యక్రమాలలోను శ్రద్ధతీసుకుంటున్నది.

ఆయన కార్యరంగాన్ని అవహేళనగా భావించేవారుకూడా అనేకమంది తమ స్వప్రయోజనాలకొరకు వసంతకుమార్ ముందుజేరి శ్లాఘిస్తున్నపుడు పద్మ ఆత్మ క్షోభిస్తుంటుంది. మందులు మాకులేగాక ధనసహాయంకూడా పొందుతున్న అనేకమంది విశ్వాస ఘాతకులనుజూచి మనస్సు మండిపోతుంది, వారందరిని దూత్కారాలతో వెడలిద్రోల వసంతబాబును మందలించి వేడుకోవాలనుకుంటుంది. ఆయన విశ్వాసాలలో విశ్వష్టురాలై అండగా నిలిచి ఆయన్ను దృఢతరం చేయాలనిపిస్తుంది. కాని బయటకు అనలేక ఆందోళనలో మనస్సులోనే బాధపడుతుంటుంది.

"పద్మా, ఇంటివద్ద క్షణంకూడా వుండకుండా అక్కడే వుంటు న్నావు వాడితోపాటు నీకు కూడా మతిపోయిందా!" అన్నది వింధ్యారాణి.

"అంతమాట అనకండి అమ్మగారు! బాబుగారు దైవ సమా నులు" అన్నది పద్మ.

"అయితే వాడిపిచ్చి నీకు నచ్చిందన్నమాట. వాడిపిచ్చి పను లకు వెచ్చించే డబ్బుకు అంతులేదు. పేరులేదు ప్రతిష్టలేదు ప్రయోజనం లేదు. ఉన్నదంతా హరించాక ఆ వెర్రిపనులు యెలా సాగుతవో చూస్తాను" అన్నది వింధ్యారాణి.

పద్మ హృదయం గతుక్కుమన్నది. ఆయన కార్యాలు సఫలం కావాలని, ఆయన కార్యాల యెడల నిరాదరం, అవహేళన చేసినవారంతా పశ్చాత్తప్తులు కావాలని, ఆయన ఆరాధ దేవతై అందరిముందు నిలు వాలని వూహలు పరువు లెత్తుతున్నవి. తన ఆత్మకు విశ్వాసం పొడసూపు తున్నది ఆయన ధ్యేయమే తన ధ్యేయంగా యెంచుకోవాలనిపిస్తున్నది. "బాబుగారు అసమర్థులుగాదు అమ్మగారు. వారు ధనాన్ని కాంక్షిస్తే లక్ష్మీపుత్రులు కాగలరు, వారు క్రొత్తగా కనిపెట్టిన మందుల ఫార్ములాల ద్వారా వచ్చిన డబ్బు తక్కువదా అమ్మా?" అన్నది పద్మ.

"వాడు యింటిలోని వారి అందరి ఆశలను వమ్ము చేశాడు, నిష్ప్రయోజకుడుగా రుజువు చేసుకుంటున్నాడు."

ఆ మాటలను పద్మ వినలేకపోయింది. మనస్సంతా వికలం చెంది నట్లయింది. ఆయనవైపు సానుభూతి పెరిగింది. ఆయన ఆశయాలు నెర వేరి అందరి ముందు విజేతగా నిలిస్తే యెంత బావుండును! అని పించింది.

ఆయన కార్యరంగాన్ని ప్రజలేకాదు యింటిలోనివారుకూడా నిర్లక్ష్యము చేస్తున్నారన్న విషయం ఆమెకు బాధను కలిగిస్తున్నది.

ఆందోళన పడిపోతున్నది. ఆయనేదో అఘాతంలోపడి కొట్టుకుపోతు న్నట్లు, అయినవారు కానివారు చూస్తూ వినోదాన్ని తిలకిస్తున్నట్లు, ఆయన యింకా యింకా అఘాతం అడుక్కుపోతున్నట్లు వూహలు కలిగి నపుడు క్షణపాటు హృదయ స్తబ్దత కలుగుతుంటుంది. ఆయన్ను చూడాలని మనస్సు ఆందోళన పడుతుంటుంది. ఆమె వెంటనే వెర్రిదాని వలె ప్రయోగశాలలోని విభాగాలలో వెదుక్కుంటూ పోతుంది. ఆయన ప్రశాంతమైన మందస్మితవదనంతో కనిపించినపుడు, హృదయం చల్ల బడుతుంది. క్షణ ఆనందం తరువాత నిస్పృహల హోరులో తిరిగి తెలి యని అసంతృప్తి దుమారం చెలరేగుతుంది. అది ఆయన భావాలకు కార్యరంగాలకు చెందింది. విచిత్రమైన యీ ద్వంద్వాత్మ సంఘర్షణలో నలగిపోతూ శక్తిని కూడదీసుకుని ఒక నిర్ణయానికి వస్తుంది. మరు క్షణం అది యెగిరిపోతుంది.

ప్రయోగశాలలోని పసివారందరికి యిపుడు పద్మ ఆత్మీయు రాలైంది. ఆమె యెదుట ప్రతి ఒక్కరు ఆనందంతో కేరింతలు కొడు తుంటారు.

వసంతకుమార్ పసివారియెడ వోర్పుతో ప్రీతిలో అధిక ఆప్యా యతతోనే వుంటుంటాడు, కాని నిత్యము ఆయన ప్రతి ఒక్కరిని అనేక రకాలుగా పరీక్షిస్తుంటాడు. వారానికోమాటు రుధిర బిందువునుకూడా తీసి పరీక్షిస్తుంటాడు, ఆ చిన్ని బాధతో ఆయనంటేవారికి భయం. చూడ గానే వెలవెలబోతూ యేడుస్తారుకూడా. పద్మనుచూస్తే ఖిలఖిలా నవ్వు లతో చేతులు చాస్తుంటారు. అందుకే నిత్యము పరీక్ష సమయంలో ఆయనవెంట పద్మకూడా వుండుట అవసరమవుతున్నది. పసివారి నామె ఆకర్షించింది. ఆమె చెంతకు చేరినపుడు చాలుచేతుల నాడిస్తూ కేరింతలతో హత్తుకు పోతున్నారు. ఆ దృశ్యాలను చూసినపుడు వసంత కుమార్‌కు గొప్ప ఆనందం కలుగుతుంటుంది.

"ఎక్సరే దృష్టి శరీరంలోని విభాగాలు గనిపించునట్లు పసివారి దృష్టికి స్త్రీలోని మాతృత్వపు నిజస్వరూపం కనపడుతుందనుకుంటాను" అన్నాడు.

"ఈ విషయంలోకూడా పరిశోధనలు జరుపుతున్నారా?" అన్నది పద్మ.

"అనుక్షణము కనిపెట్టి వుంటున్న ఆ నర్సులు వచ్చినపుడు లేని వుత్సాహము వుల్లాసము నీవు కనిపించినపుడు యెందుకు రావాలి! ఆ పసివారి చిన్న మనస్సులు నీలోని వాత్సల్యాన్ని యెంతగా పసిగట్టక పోతే విన్నా చూస్తూనే అంతగా పొంగిపోతారు? నూటికి నూరుపాళ్ళు స్త్రీత్వము, సుకుమారమైన మాతృత్వము నీలో నిండివున్నట్లు ఆ పసివారే ప్రదర్శిస్తున్నారు."

"స్త్రీలో స్త్రీత్వము మాతృత్వముగాక పురుషత్వ మెందుకుంటుంది చెప్పండి!"

"స్త్రీ కుండవలసిన కొన్ని ప్రత్యేకమైన లక్షణాలు కొన్ని వుంటవి. అవి అందరిలోను పూర్తిగా వుండవు"

"ఆ లక్షణాలేమిటో నిర్వచిస్తారా?"

"అన్నివేళలా పురుషుని ఆకర్షించాలి, పసివారికి హత్తుకుపోవాలి, పురుషుని భావాలకు ఆశయాలకు భిన్నమైనకూడా నిరోధించుటకు బదులు సానుభూతితో సహకరించాలి. సహనము త్యాగము అడుగు అడుగున కనిపించాలి. నవనీతము బోలిన హృదయ ముండాలి. మాతృత్వ మమత లుట్టిపడుతుండాలి, అలాంటి ప్రత్యేకమైనవే స్త్రీ లక్షణాలు. నా ప్రయోగశాలమీద కార్యరంగంమీద నీకు విశ్వాసంలేదు. నా మీదున్న భక్తివిశ్వాసాలతో నా కార్యాలయెడ సానుభూతి చూపుతున్నావు. సహకరిస్తున్నావు. ఇది సామాన్య విషయంగాదు పద్మా"

ఆమె కంఠం నిండుకుపోయి మాట పెగలలేదు. నేత్రాలు బరువెక్కినవి. మొఖం ప్రక్కకు త్రిప్పుకుని "బాబుగారు, నాకు మీ కార్యాలయడ విశ్వాసం లేదనకండి. మీరు తలపెట్టే ప్రతి కార్యంలోను మహత్తు వుంటుందని నేను విశ్వసిస్తున్నాను. మిమ్మల్ని విశ్వసించటంలోనే నాకు ఆత్మ శాంతి లభిస్తున్నది. నా సంశయాలు మీ సమక్షంలో

దూరమై ధన్యురాలనయినాను. మీ కుటుంబంలో వారసత్వంగా వస్తున్న హోదాలు దర్పాలు డాంబికాలు మీలో లేనందుకు ఆనందపడ్డాను. ఉన్న వారిని ఆదరించుట లేనివారిని నిరాదరించుట మీకు తెలియదు. అందుకు నాలో నేనే పొంగిపోయాను. మీలోని యీవుదాత్తతను విశిష్టతను ఆదర్శ ఆశయాన్ని యీ పామరలోకం గుర్తించలేక పోతున్నందుకు పశ్చాత్తాప పడుతున్నాను బాబుగారు"

"అందుకు పశ్చాత్తాప మెందుకు?"

"విదేశంలో అంత పేరు ప్రతిష్టలు పొందివచ్చిన మీరు పోను పోను యిక్కడి సామాన్యులలో కలిసిపోతున్నారు. మీరు చేస్తున్న అవిరళ కృషి నిస్వార్థసేవ నిష్ఫలమవుతున్నవి. కొందరి దృష్టిలో మీ కార్యరంగం హాస్యాస్పదంగా కనిపిస్తున్నది. అందుకు పశ్చాత్తాపమే గాదు నా మనస్సు వికలంచెందుతున్నది. మీరు ధన కనకాలు ఆర్జించుటలేదని చింతలేదు. కాని పేరు ప్రతిష్టలతో ఖ్యాతిచెందుతూ, అందరూ మిమ్ము ఆదరిస్తుంటే సన్మానలతోను సభలతోను సత్కరిస్తుంటే, మిమ్ము గురించే అంతటా పొగడుతుంటే వినాలని చూడాలని కాంక్ష కలుగుతున్నది. గంగరాజుగారిని గురించి కీర్తించిన విషయాలను పేపర్లలో చూసినపుడు, మీ గురించి వ్యథ కలుగుతుంటుంది. మీరు నిస్వార్థులు, దీక్షాపరులు కనుక నిశ్చింతులు. కాని మా మనస్సులు స్వార్థాలలో అలవడినవి. అందుకే ఆరాటపడుతుంటాము."

"నేను సామాన్యులలో కలిసిపోతే అందరికీ అర్థమవుతూ ఆకర్షించే కార్యరంగంలో వుండేవాడిని. మీరు ముగ్ధులయేట్లు అన్నివైపుల నుంచి పొగడ్తలను పొందేవాడిని. సామాన్యులతో కలువలేక మీ అందరినీ బాధపెడుతున్నాను. కైలాస పర్వతంమీద పార్వతీ పరమేశ్వరులులేరని తెలుసు. ప్రయోజనాలకు పనికివచ్చేవి యేవీ అక్కడలేవని తెలుసు. అయినా ఆ అగ్రాన్ని దర్శించి వచ్చామన్న ఆత్మ తృప్తి కొరకు వుత్సాహప్రేరణలో మృత్యుభీతిని త్రోసి కొంటూ ఆరోహణకు యత్నించేవారు వెర్రివారుగాదు. అదే రీతిని అనేకమంది యత్నాలుంటవి.

వాటికీ ఒక రోజు విలువరావచ్చు. అనేక నిగూఢ రహస్యాలు బయ ల్పడి అనేక వుపకారాలు జరుగవచ్చు. తాత్కాలికంగా అందరికీ అర్ధం గాని నేను చేస్తున్న ప్రయోగాలు ఫలించినపుడు లోకోద్ధరణకే మార్గం గావచ్చు. ఆ రోజు శాశ్వతమైన కీర్తిబడయవచ్చు. కీర్తిని స్వార్థాన్ని ధ్యేయంగా పెట్టుకున్నవారు యిలాంటి దుస్తర కార్యాలలో దిగజాలరు. కీర్తికాంక్షలో నాయకత్వాలవైపు పరువులెత్తువారికి ఆత్మతృప్తి ఎన్నడూ కలుగజాలదు. అజ్ఞాత ప్రయోగాల సలుపువారికే ఆత్మ తృప్తి లభ్య మవుతుంది. నన్ను గురించి జాలిపడుట చిన్న బుచ్చుటమే అవుతుంది పద్మా."

భయసంకోచాలనుంచి ధైర్యాన్ని పూరించుకుని "అమ్మాయి గారుకూడా గంగరాజుగారి కార్యరంగంలో పూర్తిగా ప్రవేశించుట పెద్దమ్మగారికి బాధ కలుగుతున్నది బాబుగారు."

"స్వర్ణ పొరపాటు చేయలేదు. ఆత్మోత్సాహాన్ని బంధించుకుని, నిర్బంధ ఖైదీవలె యిష్టంలేని మార్గంలో పయనించుట శ్రేయస్కరం గాదు."

"పురుషుని అనుసరణలోనే స్త్రీకి ఆత్మోన్నతి కలుగుతుందని యింతకు ముందంటిరిగదా !"

చిరునవ్వు లొలికిస్తూ "ఆ మాట అన్నచోటనే వర్తిస్తుందిగాని అన్నిచోట్లగాదు. ఒకరికి ఒక మార్గంలో కలిగే ఆనందం మరొకరికి కలుగకపోవచ్చు. అక్కడ నిర్బంధం మరింత దుఃఖహేతువవుతుంది."

ఆమె వెర్రిదానివలెచూస్తూ, అయిదు నిమిషాల అనంతరం "బాబుగారు, మీ వలె ఆత్మ ధైర్యం కలిగేటట్లు నన్ను ఆశీర్వదిం చండి."

"అభిమానములోని ఆత్మీయత విశ్వాసాన్ని కలిగిస్తుంది. విశ్వా సంతో దీక్ష నిలుస్తుంది."

ఏదో పనిమీద హెడ్‌నర్సు వచ్చి నిలిచింది. పద్మ వెంటనే వెడలిపోయింది.

10. వకాల్తాలేని వకీలు

కైలాసపతి క్రిమినల్ వకీలుగా విజయనగరంలోనే ప్రాక్టీసు ప్రారంభించాడు. వసంతకుమార్ బాల్యమిత్రుడు సహవిద్యార్థి అయినందున ఆరోజుల్లో ఆకాయ పోకాయగా తిరిగాడు. డ్రామాలలోను అవారా కార్యాలలోను సహకరిస్తుండేవాడు. అలాంటి నిర్లక్ష్య చదువుల లోనే, అనేక క్లాసులలో ఢింకీలుగొడుతూ 'లా' పూర్తిచేసి పట్టాపుచ్చుకుని తండ్రి మన్ననలకు పాత్రుడయినాడు. వకీలుగా ప్రాక్టీసు ప్రారంభించిన కొంతకాలానికి నిస్పృహ చెందాడు. ఖర్చులయినా గిట్టుబాటుగాదని, మరోమార్గం వెదుక్కోవటం మంచిదని నిర్ణయించుకున్నాడు.

కాని ఆకస్మికంగా ఫీజు యివ్వలేని ఒక ఖూనీ కేసును చేపట్టి విజయంపొంది ఒక్కమాటుగా ఆకర్షింపబడ్డాడు. ఒక గ్రామవాసి తన భార్యతో తన సోదరుడు సరసల్లాపాలాడుటచూచి భరించలేక ఆవేశపుడై వెంటనే ప్రక్కనున్న పచ్చడి బండతో చావమోదాడు. తమ్ముని శిరస్సు చిట్లి రుధిరం ప్రవహిస్తున్నపుడు నయనాలు చెదిరి గుండెదడలతో తమ్మునిమీదనే పడిపోయాడు. ఆదృశ్యంజూసిన అతని సతీమణి పలాయనం చిత్తగించింది.

స్పృహ కలిగి లేచినపుడు తన ముందు తమ్ముని శవం కనిపిస్తున్నది. వెనుదిరిగితే పోలీసువారు హాజరై వున్నారు.

కావలసిన వాఙ్మూలాలను తీసుకుని ఆయన్ను ఖైదుచేశారు. పచ్చడి బండను, రుధిర మరకలతోనున్న అతని దుస్తులను సీలుజేసి కోర్టు కప్పగించారు.

సానుభూతిపరులు దూరంనుంచే దుఃఖంతో నిట్టూర్చారు. ప్రతి

కక్షులు, యీ దెబ్బతో వురిశిక్ష తప్పదని: ఆనందాన్ని ప్రకటించు కున్నారు.

పోలీసువారికి కావలసిన సాక్ష్యసేకరణ తేలికగానే లభ్యమైంది. ముద్దాయి తరపు యెవరూ ముందుకు రాలేదు. నిరాశతో ఉరికంబాన్ని కౌగలించుకోను నిర్ణయించుకున్నాడు.

హడావుడులు లేకుండా చేతిలో ఒక్క కేసుకూడా లేకుండావున్న కైలాసపతి యీ ఖూనీకేసు విషయం విన్నపుడు ఆదుర్దా చెందాడు. ఇంకా వివరం తెలుసుకోవాలనిపించింది. కాలాన్ని వృధా చేసేబదులు ఆ దిక్కు-లేని ముద్దాయికి మేలుచేయాలనిపించింది.

తన పలుకుబడినంతా ప్రయోగించి ముద్దాయిని దర్శించగలిగాడు. తనతరపు సాక్ష్యానికి యెవ్వరూరారని, తను యెవరికయినా ఖబురుపంపి అర్థించినా వ్యర్థమవుతుందని మొదలగు తన అసహాయస్థితిని వివరించి, తాను మరణదండనను స్వీకరించను స్థిరీకరించుకున్నానని, ఆ ఖైదీ విని పించినపుడు కైలాసపతికి నిరుత్సాహం కలిగింది.

మరో వ్యాపకం లేనందున మనస్సంతా ఆ విషయంమీద కేంద్రీ కృతమైనందున వుపాయం పొడసూపింది. అవుసరం అవకాశాలను వుపాయాలను సృష్టించుకుంటుంది. వెంటనే వకాల్తాను పొందాడు. తన కొరకు పెట్టలేని ఖర్చును ఆ ముద్దాయి కొరకు పెడుతున్నాడు. జైలు వార్డర్ల సహకారాన్ని పెంచుకుని ముద్దాయికి తన తరపుగా భోజనాన్ని పంపుతున్నాడు.

ఒక్క సాక్ష్యాన్నయినా సేకరించకుండా మరే విధమయిన ఆధా రాలను వెదుక్కోకుండా వకాల్తామాత్రం తీసుకుని నిశ్చితంగా వుంటున్న కైలాసపతి వెర్రితనానికి తోటి న్యాయవాదులు పరిహసిస్తున్నారు. ఫీజు ఆశ, గెలిపించే ఆశలేక కేసును చేపటుట పద్ధ వెర్రితనమని యెదుటనే అంటున్నారు.

పోలీసువారి సాక్ష్యం అన్నివైపుల సమకూరింది. ప్రతిపక్షంగా ప్రయత్నాలులేవు గనుక వారు నిశ్చింతులైనారు.

వాయిదాలతో నాలుగు నెలలు గడిచిపోయినవి. నిత్యము ఖైదీకి తన ద్వారా పోతున్న భోజన సందర్భంగా నాలుగువందలు వెచ్చించాడు. ఈ విషయం యెవరికైనా తెలిస్తే నవ్విపోతారని నౌఖరుసైతం సిగ్గుతో కుమిలిపోతున్నాడు.

"కొన్ని కొన్ని వేళలందు అనవసరమైన వాటికి అవుసరమైన వాటికంటె ప్రాధాన్యత నివ్వవలసి వుంటుంది. మనభోజన సప్లయి అతి రహస్యమైంది. కొంపతీసి మరెవరికి చెప్పలేదుగదా!" అన్నాడు కైలాసపతి.

"ఘనకార్యమైతే చెప్పివుండేవాడిని. కాని యీ విషయం చెబితే మతిబోయిందని నన్నే గేలిచేస్తారు." అన్నాడు నౌఖరు.

కేసు విచారణ జరిగింది. ఎక్కడా ఒక్కమాట కూడా ముద్దాయికి అనుకూలంగాలేదు. సాక్షులందరూ స్పష్టంగా పోలీసువారు కోరినట్లు వాగ్మూలమిచ్చారు. ఎండిపోయిన రుధిర మరకలున్న పచ్చడిబండ, ముద్దాయి బనీను, షర్టు మొదలగు దుస్తులు కోర్టులో ప్రదర్శింపబడినవి.

"ఆ దుస్తులు ముద్దాయి శరీరంనుంచి విడిపించినవా లేక అక్కడ దొరకినవా?" అని ప్రశ్నించాడు కైలాసపతి.

ఆ సమయంలో వాగ్మూలాలు తీసుకున్న తదుపరి రక్తమరకలతో నున్న దుస్తులను విప్పించి సాక్షుల యెదుట సీలుచేయబడినట్లు పోలీసు వారు వినిపించారు.

ఒక్కమాటు ఆ దుస్తులను ముద్దాయిచేత తొడిగించి చూడవలసి నదిగా కోర్టువారి అనుమతితో పోలీసువారిని కోరాడు.

ఎంత ప్రయత్నించినా ఆ బనీను ముద్దాయికి చాలలేదు. షర్టు

తొడిగినా బిర్రబిగిసిపోయింది. ఆ విషయాన్ని నోట్ చేసుకోవలసిందిగా కోర్టు వారిని కోరాడు.

ఆ దుస్తులు అతనివి కానేకాదని, నిర్బంధంలో నియమిత జైలు భోజనంలో, మరణవేదనలోని దుఃఖంలో మనిషి క్షీణించను వీలుంది గాని బలవను వీలులేదని, యీ స్థితిలో ఆ దుస్తులు చాలుటలేదంటే హాస్యాస్పదమైనరీతిలో కేసు ముద్దాయిమీద మోపబడిందని, అది కేవలం యితర కక్షలతో ఖూనీచేసి తమమీదకు రాకుండా, తమ్ముని దుస్మరణ దుఃఖంలో మతిపోయి ఖంగారులోనున్న అమాయకుడయిన ముద్దాయిని హంతకుడుగా పోలీసువారి కప్పగించి సాక్ష్యస్థానంలో నిలిచినవారే ఖూనీ చేసినట్లు అనేక నిదర్శనలున్నవని కైలాసపతి తన ఆర్గ్యుమెంట్సులో వివరించి రుజావులు చేశాడు. ఆ దుస్తులు సాక్షులలోని ఒకరివైనట్లు కూడా రుజావు పర్చాడు.

కేసులు లేక వూసుబోక వకాల్తా తీసుకుని వాదించే కైలాసపతి ఆర్గ్యుమెంట్సును పోలీసువారు లక్ష్యం చేయలేదు. ఆయన తెలివితక్కువతనానికి జాలికూడా చెందారు.

కాని కైలాసపతి వాదాన్ని కోర్టు ఆమోదించింది. ఆయన పక్షం నెగ్గింది. ముద్దాయి విడుదల చేయబడ్డాడు. బస్తీలోనేగాదు పల్లెలలో కైలాసపతిని గురించి వింత వింతగా ఖ్యాతి పెరిగిపోయింది. ఫీజు ఆశలేకుండా సాక్ష్యబలంగాని మరో ఆధారంగాని లేకుండా కేవలం తన యుక్తితో వురిపీఠంమీదనున్న వ్యక్తిని రక్షించి విడుదలచేయించగలిగాడని ప్రతీతిగా చెప్పుకున్నారు.

మానవ జీవితంలో అదృష్ట దురదృష్టాలు దాగుడు మూతలలాంటివి. అదృష్టమో దురదృష్టమో వరించనున్నపుడు ఆకస్మికంగానే వస్తుంది. లా పుస్తకాలు మాగ్జయినులు చదివి, విసిగి పనిలేక సోమరిగాను అసఫల జీవిగాను బాధపడుతున్న కైలాసపతి నేడు ముగ్గురు గుమాస్తాలను నియమించాడు. ఆయనవద్ద కిపుడు దూర దూరాలనుంచి జనం వస్తున్నారు. పెద్ద పెద్ద జటిల కేసులు ఆయన వద్దకే వస్తున్నవి.

ఒక్క కేసుకూడా చేతిలో లేకుండా కోర్టులో తిరుగుతున్నపుడు నిర్లక్ష్యంగా చూసి, పరిహసించిన వారందరు నేడు విశేష ఆదరంతో అభిమానంతో చూస్తున్నారు. ఆయన ముఖమండలంలో యిపు డందరికి తేజస్సు కనిపిస్తున్నది. బారొరూంలో పావులాట ఆడనుగాని, చీట్లాట ఆడనుగాని నేడు తీరుబడి చిక్కుటలేదు.

కాంక్షలోను ఐశ్వర్యంలోను రాక్షసత్వ ముంటుంది. ఆకలితో అలమటించువాడు అన్నం కోరతాడు. అది లభ్యమైనపుడు సామాన్య అనుపానం కోరతాడు, వృక్షచ్ఛాయను కోరతాడు; కుటీరాన్ని, పంచభక్ష భోజ్యాలను తిరిగి మహలును, ఆ తరువాత సకల సౌకర్యాలతోగూడిన అష్టైయిశ్వర్యాలను అంతంలేకుండా కోరుతూ ముందుకు పోటుంటాడు. అయిశ్వర్యాలను వాంఛించుట అపరాధం కాకపోవచ్చు, కాని సఫలతలో పరువులెడుతున్న కాంక్షలో ద్వేషము యీర్ష్యలు చిందులు త్రొక్కుతుంటవి.

కైలాసపతి లీడింగు లాయర్లలో ప్రథమ శ్రేణిలో లెక్కించబడుతున్నాడు. ఇపుడు పెద్దపెద్ద కేసులన్నీ ఆయన వద్దనే నడుస్తున్నవి. ఇరువురు జూనియర్లుకూడా పనిచేస్తున్నారు. ఆదాయము అంతస్థు ఒక్కమాటునా పెరిగిపోయాయి. అధికారవాంఛ అంకురమైంది గాబోలు రాజకీయాలవైపు మనస్సు మొగ్గుతున్నది. బాల్యస్నేహితుడైన వసంత కుమార్‌తో సహకరించాలని ఆయన ప్రయోగశాలకు అనేక రోజులు రాకపోకలు సాగించాడు. ఆయన కార్యరంగము, ప్రయోగశాల అయోమయంగా తోచినవి. అర్థంగాలేదు. ప్రజల ఆదరములేదు. ఆకర్షణ అసలే లేదు. అందువలనే సమయం వ్యర్థంగాయెంచి అటుపోవుట మానివేశాడు.

గంగరాజు సుభద్రాదేవి రాజకీయ నాయకులుగా ప్రజారక్షకులుగా ప్రచలితమైపోయారు. నూతనంగా వారి ప్రక్కజేరిన స్వర్ణకుమారి కూడా గొప్ప నాయకురాలుగా పరిగణించబడుతున్నది. వారిని గురించి పత్రికలు పొగడుతున్నవి, ప్రజలు ఆరాధిస్తున్నారు. వారు ముగ్గురూ జేరి రాజకీయరంగంలో నూతనాధ్యాయాన్ని సృష్టించినట్లు ప్రచారమువు

తున్నది. వారిని గురించి, వారి ఖ్యాతిని గురించి అనేకమారులు ఆలో చించాడు. అనుకోనిరీతిగా వారి యెడల ప్రభావితుడైనాడు.

మహిళామండలి కార్యాలయ నిర్మాణానికి కైలాసపతినుంచి తప్పక వందరూపాయల చందా వసూలు చేయాలని సుభద్ర వచ్చి నపుడు, చందా పుస్తకంలో వ్రాసే అవకాశమివ్వకుండా అయిదు వందల రూపాయలు ఆమె చేతిలో వుంచినపుడు ఆశ్చర్యంలో చూస్తూనే వుండిపోయింది. "ఈ దేశంలో చందాలు యింత తేలికగా వసూలవు తవి గనుకనే యిన్ని రకరకాలపార్టీలు నిత్యము పుట్టిపోతుంటవి" అని మనస్సా అనుకున్నది.

"మీ బోటి వుత్సాహులు వుదారులు అయిన యువకులు రాజ కీయ రంగంలోదిగి ముందుకువచ్చినపుడే సమాజ కళ్యాణం జరుగు తుంది కైలాసపతిగారు" అన్నది సుభద్ర.

"మాబోటి వాళ్ళం మీ కార్యంలో ప్రవేశించినపుడు నాయకత్వపు పోటీలు పెరుగుతవేమో!" అన్నాడు కైలాసపతి ఛలోక్తిగా.

"అన్నిచోట్ల అలాంటి పోటీలురావు. నూతనోత్సాహులకు తగిన అవకాశమిచ్చుట మాబోటి డస్సిపోయిన వారి కర్తవ్యం" అన్నది.

"మీరు నా ముఖప్రీతికొరకు నన్నుత్సాహ పరుచుటకు అంటు న్నారేమో! వెనుకటి రాజులకు వయఃపరిమితి వుండేది. నేటి నాయకు కులకు మతిపోయినా దృష్టిపోయినా వున్న అధికారంలోనే జీవితం గడచి, తన శవం రాజలాంఛనాలతో పోవాలనుకుంటున్నట్లు అనుభవ మవుతున్నదిగదా!"

"అలాంటి స్వార్థపూరితమైన హేయకాంక్షలున్నవారిని బల వంతంగానైనా విశ్రాంతి గృహానికి పంపుటకు మీబోటి యువకులు ముందుకు రావాలని నా ఆదుర్దా"

"మీరు వయస్సులో నాకంటె పెద్దగాదు, ఇంతవరకు మీరు పొందిన అధికారాలు ప్రముఖమైనవిలేవు. నాబోటివాళ్ళు వచ్చినందున

మీకున్నవి పోయేదీలేదు. అందువలనే ప్రోత్సహిస్తున్నారేమో" అంటూ గల గల నవ్వాడు.

ఆమె ముఖం దీనత్వపు అలలతో తొణికింది. అస్పష్టమైన శబ్దాలలో చేతులు జోడించి" క్షమించు కైలాసబాబు" అన్నది.

ఆ దృశ్యం ఆయన్ను గాయపర్చింది గాబోలు. తప్పు జేసినవాని వలె తడబడుతూ, ఆమె దృష్టిలో దృష్టిని బరపుతూ" మాటల ద్వార జీలో అనగూడని మాటలు అనేశానులాగుంది. నా పొరపాటును మన్నించండి"

"మీ మాటలలో పొరపాటులేదు. మానవ కళ్యాణానికని, మహిళోద్ధరణకని కంకణంకట్టి స్వసుఖాలను త్యజించిన స్వార్థతతో యింత కాలం సేవజేస్తున్న ఫలితంగా నన్ను ప్రజలు గుర్తించిందిలేదు. ఎన్ని మారులు యెన్నికలలో నిలిచినా డిపాజిట్లు పోయినవి. నన్ను అయినా గొప్పనాయకురాలుగా గంగరాజుగారు మీ బోటి వారు గుర్తించినపుడు ఆనందంతోను. దుఃఖంతోను మనస్సు కళవళ పడిపోతుంటుంది."

"ఈ రాజకీయ నాయకత్వాలుకూడా గుర్రపు పందాలు లాంటవి. ఇందు మనుషులను మయిదుపుచ్చే శక్తి యెక్కువ కావాలేమో,"

మేఘాలమధ్య మెరుపువలె ఆమె చిరునవ్వును ప్రదర్శిస్తూ "వున్నవాటిని లేనట్లు, లేనివాటిని వున్నట్లు దోషిని నిర్దోషిగాను. నిర్దోషిని దోషిగాను చేయగలుగుట మీ వృత్తి. కనుక మీకు రాజకీయాలు అటపట్టువుఃవుతవి. మా తపస్సు యెంతటి దయి మీ ముందు యెగరి పోతుంది. కనుకనే మీ బోవాటివారు రావాలని నా సంకల్పం."

"మిమ్ము పరాజితుల జేసినవారిమీద నన్ను యెక్కు బెట్టాలని చూస్తున్నారా?" అవి పరిహాసంగా అన్నాడు.

"మానవునికి స్వార్థం స్వభావసిద్ధమైంది. కాని ఆ రూపంగానే కొన్నిచోట్ల త్యాగంకూడా స్వాభావికమైందన్న సంగతి మీకు తెలియందిగాదు."

"పరిహాసాన్నికూడా మీరు అంత సీరియస్‌గా తీసుకోకండి. జీవితంలో పరిహాసానికి స్థానంలేకపోతే మొండితన మొస్తుంది. మొండి జీవితంలో ఆనందం లభ్యంగాదు."

"అబ్బ! క్షమించండి! మీలో యింతటిటి వాక్చాతుర్యముంది గనుకనే నిరాధారమైనచోటకూడా ఆధారాలను సృష్టించి, మాటలతో కేసులను గెలిపించు ఖ్యాతిని పొందారు."

ఆయన ఆమె వైపు ఏదో కాంక్షభరితదృక్కులతోచూస్తూ వుండి పోయాడు.

కైలాసపతికి రాజకీయరంగంలో చేరాలని, బ్రహ్మాండమైన వుప న్యాసాలిచ్చి జేజేలుకొట్టించుకోవాలని, నాయకుడుగా అందరిలోను గొప్ప ఆదరం పొందాలని, వుత్సాహం కలుగుతున్నది. సుభద్ర ప్రోత్సా హంలో మనస్సు చిందులు త్రొక్కింది. అనేకపర్యాయాలు ఆమెతో కలిసి సంఘాలకు వెళ్ళాడు. అక్కడ ఆమెకున్న ఆదరము అభిమానము ఆదిఖ్యతలను చూసినపుడు ప్రేరితుడయ్యాడు. కాని సుభద్రాదేవి వుప న్యాసాలు విన్నపుడు తనలో అంత సమర్థతలేదని భీతిలు తుంటాడు. కోర్టులోని ఆర్గ్యుమెంట్లకు ఇక్కడి వేదికలమీది వుపన్యాసాలకు యెక్కడా సామ్యంలేదని, యిదొక విశేష నైపుణ్యమని అభ్యాసం అవుసరమని అనుకున్నాడు.

దూరప్రాంతాలలో జరిగే సభలకు సమావేశాలకు కైలాసపతిని వెంట తీసుకెళుతున్నది సుభద్ర. ఆమె పిలుపు వినినపుడు కోర్టుపనులు యెంతటివైనా విడిచి వెడుతుంటాడు.

"మీ వుపన్యాసం వింటున్నంతసేపు మనస్సు పరాధీనమై పోతుంటుంది సుమా!" అంటాడు కైలాసపతి.

"అలా పరాధీనమైన మనస్సుకాస్తా వాళ్ళే వశీభూతం చేసుకుంటే పెద్దచిక్కే వచ్చిపడుతుంటుంది."

"మీరు చిన్నబుచ్చుతున్నారు."

"అది మరెపరినోటీసుంచైనావస్తే వాసుంటుందిగాని మీరు గొప్ప

న్యాయవాదులు. మానవ మనస్తత్వాలను అర్థంచేసుకుని యెదుటికాళ్ళకు బంధాలు వేయగలరు. మేము విషయం లేకుండాకూడా గాలిలో వూక దంపుడు వుపన్యాసాలలో జోరునుతెచ్చి వెర్రిప్రజలను ఆకర్షించ గలుగుతాము. మీరు లేవిదాన్ని వున్నట్లు రుజువులతో నిర్ధారణచేసి వాక్చాతుర్యాలతో అనుభవజ్ఞ మేధావియైన న్యాయాధీశుని ఆకర్షింపజేస్తారు."

"అయితే మన యిరువురి విధానము ఒకటి అవుతున్నది. ఉన్నవాటిని లేనివాటినినై పుణ్యంతోగొప్పగాచిత్రించి నమ్మించి వశీభూతంచేసుకోవటంలో యిరువురము ఒకటే. మీ వుపన్యాసాలు వింటుంటే విసుగనిపించదు. వక్తలుగా అనుభవం పొందారు."

"మీరుకూడా రాజకీయాలలో ప్రవేశించమని నా హృదయపూర్వక ప్రార్ధన కైలాసపతిగారు. మీరు వేదికప్రక్క నున్నపుడు నాలో ఆనందోద్వేలిత వుత్సాహం చిందులు త్రొక్కుతుంటుంది, నాలో నాకే నిండుతనంతోగూడిన ధైర్య సాహసాలు కలుగుతుంటవి. అందుకే మీరున్నపుడు నేను విశేషంగా మాటాడగలుగుతుంటాను."

ఆయన జవాబుచెప్పనొల్ల చూస్తుంటాడు.

ఇల్లువాకిలి మంచిచెబ్బర్లలు లేకుండా సంఘాలకు సభలకు తిరుగుతూ సంఘ ఆఫీసులలోనే తలదాచుకుంటూ గడుపుతున్న ఆ నిస్సార జీవితంలో స్వాంతన తృప్తి యెక్కడ లభిస్తున్నవా, అని ఆమెను గురించి వెదుకసాగాడు,

వైజాగ్ షోడా ఖిల్లీ వ్యాపారస్తుల మహాసభలకు దీసుకెళ్ళి ఆకస్మికంగా కైలాసపతిని అధ్యక్షస్థానంలో కూర్చుండబెట్టించి సుభద్ర. తానే సభా ప్రారంభకురాలుగా నిలిచి, సభలకు అధ్యక్షుని పరిచయం చేస్తూ హద్దుదాటికూడా ప్రశంసించింది. కోర్టులలో ఆయన ప్రతిభ అజేయమైందయినట్లు, ఫీజుమాట అటుంచి వకాల్తాబిళ్ళకు కావలసిన రూపాయికూడా యివ్వలేకపోతూ ఒక్కసాక్షినైనా తమతరపు సమకూర్చుకోజాలని దీనుల ప్రక్క నిలిచి రక్షకకవచము ధరించి ఉద్ధరించిన అనేక సందర్భాలను సాదృశ్యంగా వర్ణించినపుడు అధ్యక్షస్థానంలో నున్న కైలాసపతి పరవశుడైనాడు. తను ఆ రూపంగా చేసిన ప్రతి

సందర్భంలోను యెక్కడో తన స్వార్థం దాగివున్నట్లు, ఆ ప్రేరణతోనే తా నన్నివిధాల ఆడినట్లు, ఆ రహస్యం ఆమెకుగాని సభికులకుగాని తెలిసిపోతుందేమోనన్న భయం గుండెలమీద దడదడ మోదసాగింది.

ఆమె యింకా తననుగురించే వుపన్యసిస్తున్నది. నిజాయితీలోను నిర్మలమైన స్వభావంలోను, సౌభ్రాతృత్వంలోను యుధిష్ఠిరునికి, దానంలో కర్ణునకి. అభయరక్షణలో పార్థునికి, శౌర్యంలో పరశు రామునికి. చాకచక్యంలో చాణక్యునికి, బీదల సేవాకార్యక్రమంలో ఖాండేకు, తనను పోల్చి వర్ణిస్తున్నపుడు సభనుంచి కరతాళధ్వనులు మిన్నుముట్టుతున్నవి. తనలో తానే తబ్బిబ్బైపోతున్నాడు. నిజానికి ఆ గుణాలలో ఒక్కటీ తనలో మచ్చుకుకూడా లేదని మనస్సు వినిపిస్తున్నది. ఖిన్నపడుతున్నాడు. ఇకమీదట అంత వుదారంగా వున్నతంగా వుండాలని నిర్ణయించుకున్నాడు. ప్రేక్షకలోకమంతా కేంద్రీకరించిన దృష్టితో తనను చూస్తున్నారు. మధ్యమధ్య స్పష్టమైన శబ్దాలలో తనకే జేజేలు కొడుతున్నపుడు విని పులకితుడవుతున్నాడు.

లోసభదాసుభ్రదేవి తరువాత వుపన్యసించినవారుకూడా తనను పొగడుటలో విశేషశ్రద్ధ తీసుకున్నారు. తెలియవి ఆనందం ప్రక్క అర్థంగాని భీతి మరోప్రక్క పెనవేస్తున్నవి. లలాటంమీద శ్వేద క్రమ్ముతున్నది.

"అధ్యక్షులుగా మీరు నాలుగు మాటలు వినిపించండి." అని ప్రక్కకుర్చీలోనున్న సుభద్ర ఆయన చెవిలో చెప్పినపుడు, ఆయన గొంతుకలో తడి ఆరిపోయింది. కోర్టులోని అనుభవం యీ సాధారణ సభముందు నిరర్థకంగా కనిపించింది.

ఆమె కైలాసపతి చేతిమీద మోచేత్తో పొడుస్తూ లెమ్మని సైగ చేసినపుడు వివశుడై నిలిచాడు. గొంతుపిడస గడుతున్నది. మాట పెగలుటలేదు. విషయాలు మనస్సులో జిలిబిలిగా పరువులెడు తున్నవి.

ప్రారంభంలో తపుడుకున్నట్లు మాట్లాడినా. పోను పోను ధ్వారణి జారిగింది. జంకుపోయింది. ప్రభుత్వ విధానాలను ఘాటుగా విమర్శించాడు. ప్రజల అమాయ కత్వాన్ని వివరిస్తూ నొచ్చుకుంటూ రాజకీయ

రంగంలో కంకణబద్ధులైన కార్యకర్తలు త్యాగశీలురైన యువకులు ముందుకు రావాలన్నాడు. ఇకమీదట తాను కూడా తన యెక్కువ సమయాన్ని దళితజాతి వుద్ధరణకే వినియోగించుటకు ప్రతిజ్ఞచేశాడు. కరతాళ ధ్వనులు వినిపించినవి. మరింత వుత్తేజితుడై అవుసరమైతే సమాజ కళ్యాణం కొరకు తన జీవిత సర్వస్వాన్ని అంకితం చేసుకుంటానని కూడా అన్నాడు.

సభ ముగిసింది. కైలాసపతి అభ్యర్ధనను అంగీకరించి సుభద్రాదేవి కూడా టాక్సీలో విజయనగరం రాను పయనమైంది.

రాత్రి 11 గంటల సమయమది. జాబిలి పశ్చిమానికి వాలిపోయింది. పెద్ద బూజురు మబ్బులచాటున దాగివుంది. ఆ దాగివున్న శశిధరుని వెదుకుతున్నవి గాబోలు నభోమండల మంతటా నక్షత్రాలు తొంగి తొంగి చూస్తున్నవి. విసిగిన నక్షత్రాలు విడిచిన నిట్టూర్పులువిని గాబోలు మబ్బుల చాటునుంచి తొంగిచూస్తూ కిరణహస్తాలతో గేలిచేస్తున్నాడు. కారురోడ్డుమీద సరసర గాలికంటె వేగంగా కోసుకు పోతున్నది. కటిక భటులవలెరోడ్డు ప్రక్కనున్న వృక్షాలు 'బుజ్' మంటూ వెనక్కు పరువులెడుతున్నవి. కారు ధ్వనివిని భూమిబద్దలవుతున్నదన్న భయంతో గాబోలు రోడ్డుప్రక్కల పొదలలోనున్న ముంగిసలు మూషికాలు పరువులెడుతున్నవి. సస్యశ్యామల క్షేత్రాలనుంచి వీస్తున్న శీతలపవన తెమ్మెరలు 'బుయ్' మంటూ కారులోకి జొరబడుతున్నవి.

వక్రాలుతిరిగి జూకాలవలె వ్రేలబడుతున్న సుభద్ర కురులు పాలభాగంమీద నృత్యం సలుపుతున్నవి. ఆమె వెనుకసీటుమీద వాలి కనుమోడ్చింది. ప్రక్కనకూర్చున్న కైలాసపతి రోడ్డుప్రక్కనవస్తున్న మైలురాళ్ళను లెక్కిస్తున్నాడు, కాని మనస్సు పరుసదప్పి సుడిగాలిలోని తుణకవలె గజిబిజి అవుతున్నది. వేదికమీది కార్యక్రమమంతా నేత్రాలముందు కనిపిస్తున్నది. తానుకూడా బాగా మాట్లాడినట్లు తలంచినపుడు ఆనందం కలుగుతున్నది. కాని అందరికంటె ఆకర్షణీయమైన ధ్వోరణిలో మాట్లాడింది సుభద్రాదేవి. ఆమెలో అంత పాండిత్యము,

సాహసము, అనుభవము, ధ్వారణి యెక్కడినుంచి వచ్చినవి? అని పించినపుడు ఆమెవైపు తిరిగి చూశాడు. ప్రశాంతంగా నిద్రపోతున్నది. మబ్బులచాటునుంచి బయటికొచ్చిన జాబిలికారు అద్దాలలోగుండా ఆమెను తొంగిచూస్తున్నాడు. ఆ స్నిగ్ధవెలుగులో నిర్మలమైన ఆమె ముఖమండలం మరో చంద్రబింబంవలె ప్రభవిస్తున్నది. ఆ పాలభాగం మీద నృత్యం చేస్తున్న సిరోజాలు మరింత అందాన్ని కల్పిస్తున్నవి. గాలికి రెపరెప కొట్టుకుంటున్న పవిటచెరగు ప్రక్కకుతొలగి పోయింది. చాచివున్న ఆమె చేయి జారి కైలాసపతి వీపుమీద పడింది.

"నిద్రపోతున్నారా?" అని చిన్నగా ప్రశ్నించాడు. ఆ కారు ధ్వనిలో వినిపించిందో, లేక నిద్రలోవున్నదో తెలియదు. జవాబు లేదు. ఆయన శ్వాస యెందుకో ఆగిపోయింది. ఊపిరి సలుపుటలేదు. గుండె దడదడ లాడుతున్నది.

ధైర్యాన్ని పూరించుకుని, ఆమె హస్తాన్ని సీటుమీద సౌకర్యంగా పెట్టాలన్న భావంతో తన హస్తాలలోకి తీసుకున్నాడు. పూలచెండును పట్టుకున్నట్లున్నది. "అబ్బ! స్త్రీ శరీరంలో యింత మృధుత్వమున్నా నృప్పలోన రాళ్లను పొంగించే వేడి యెందుకుంటుంది!" అనిపించింది. సీటుమీద నెమ్మదిగా పెట్టివేశాడు. ఆకలిగొన్నవాడు షాపులోని అద్దాల బీరువానందున్న ఆహారాన్ని చూస్తున్నట్లు ఆమెను దృష్టితో త్రాగివేస్తు న్నాడు. ఆమెతో అనేక సభలకు వెళ్ళాడు. ప్రక్క ప్రక్కన గూర్చుని అనేకమారులు సంభాషించాడు తర్కించాడు పరిహాసాలు చేశాడు కాని యెన్నడూ ఆకర్షింపబడలేదు. అభిమానందప్ప అన్య భావనలు కలుగలేదు, ఆమె యెంతో సన్నిహితంగా స్త్రీ పురుష అంతరం లేకుండా మాటాతుంటుంది. ఆమెను గురించి స్నేహభావనలు దప్ప మరో ఆలోచన కలుగలేదు. నేడు మనస్సు స్వాధీనందప్పి కుప్పిగంతులు వేస్తున్నది. ఆమె సౌందర్యం నేడు నూతన రూపంలో గోచరిస్తున్నది. ఆకర్షిస్తున్నది. ఆమెలోని ఆ సౌష్టము, అందము ఇంత కాలము యెలా దాగివున్నదా అవి పిస్తున్నది. లలాటంమీద ఆడు కుంటున్న కురులనుచూసి యీర్ష్య వద్దాడు. తొలగిపోయిన పవిట, ప్రక్క

నుండి పవనాలకు రెపరెపలాడుతున్నది. జాకెట్టు క్రెప్ బటనులు రెండు ఊడిపోయినవి గాబోలు లోపల బిగించిన బాడీ స్పష్టంగా కనిపిస్తున్నది. ప్రకృతి సిద్ధమైనవాటిని యింత నిర్బంధంలో బంధించి వికృతరూప మివ్వట మెందుకో అనిపించింది. ఆయన దృష్టి మనస్సు అక్కడే కేంద్రీకృతమైనవి.

ప్రక్కనుంచి ఆకస్మికంగా రోడ్డుమీద కొచ్చినయే జంతుజాలం కారకో 70 మైళ్ళ స్పీడులో వెళుతున్నకారుకు సడన్‌బ్రేకు వేశాడు డ్రైవరు. ఎంత దీక్షగాచూస్తూ ఆద్యంతాలులేని ఆలోచనలు చేస్తున్న కైలాసపతి ముఖంవెళ్ళి ఆమె వక్షోజాలమీద మోతుకున్నది. ఆమె త్రుళ్ళిపడి కేకపెట్టి స్పృహను కోల్పోయింది. డ్రైవరు మోటారు వర్కర్సు యూనియన్ కార్యదర్శి చిన్న చిన్న ఆఫీసర్లనే లెక్క చేయడు. సడన్‌బ్రేక్‌వల్ల వెనుకనున్న వారి స్థితి యేమి జరిగింది చూడాలన్నంత భ్రమాలేదు భయమూలేదు. డ్రైవరు చాలా చిన్న కద్దు మనిషి పైకిలేచి వెనుదిరిగితేతప్ప వెనుక సీటులోవారు యేమి చేస్తున్నది కనిపించదు. డ్రైవరు అశ్రమ తీసుకోకుండానే పోనిస్తున్నాడు. సుభద్రా దేవినుంచి వెలువడిన కేక ఆ డ్రైవరుకు అందలేదు.

తత్తరపోతున్న కైలాసపతి, ఆమె మీదనుంచిలేచి, ఆమె శిరస్సు క్రిందచేయివేసి తొడలమీదికి తీసుకుని "సుభద్రా దేవిగారు! సుభద్రా దేవి గారు!" అంటూ ఆదుర్దాతో పిలుస్తున్నాడు. ఆమె ముఖాన్ని నిమురుతూ నేత్రఫలకాలను తెరువ ప్రయత్నిస్తున్నాడు ఆమెనుంచి ఒక చిన్న నిట్టూర్పుమాత్రం వినిపించింది. ఆయన ఆదుర్దా కొంత సర్దుకున్నది. ఫాలభాగంమీది కురులను వెనక్కు దిద్దుతున్నాడు. ఆమె నేత్రాలు తెరచి ఆశ్చర్యపోతూలేచి, దుస్తులు సవరించుకుంటూ "ఏమి జరిగింది కైలాసపతిగారు?" అని ప్రశ్నించింది.

కైలాసపతి:- ఏమీలేదు, మీరు గాబరాలో స్మృతి కోల్పోయారు.

సుభద్రా దేవి:- నామీద యేమో పడినట్లు, అనిపించింది.

కైలాసపతి:- దారిలో యేదో అడ్డమువచ్చినపుడు సడన్ బ్రేకు వేశాడు. ఆ అదురులో నేను మీమీద పడిపోయాను.

సుభద్ర:- భయంతో గాభరాపడిపోయాను.

కైలాసపతి:-మీరు కారులో కూర్చుంటూనే నిద్రపోయారేమిటి ?

సుభద్ర:- చాలా ప్రొద్దుపోయింది, చల్లటిగాలి.

కైలాసపతి:- మీరు నిగ్రహాలు నిశ్చింతులు అనుకుంటాను.

సుభద్ర:- ఒకరి హృదయంలోనిది మరొకరికి తెలియదుగదా ?

ఆయన యేమి సమాధాన మివ్వాలో తెలియక అమాయకదృక్కులను బరపుతున్నాడు.

సుభద్ర:- పిరికివానివలె సిగ్గును అభినయిస్తూ ఆఖరకు అనర్గళంగా వుపన్యసించారు, మేము వాంఛిస్తున్న అభిప్రాయాన్ని వ్యక్త పరచారు. అందుకు అభినందించాలని అనుకునికూడా వెంటనే చేయలేకపోయినందుకు క్షమించి నా అభినందనలనుస్వీకరించండి.

కైలాసపతి:- మీరు వాంఛిస్తున్న దేమిటి ?

సుభద్ర:- నిరంతర మీ సహకారాన్ని, మీ నాయకత్వాన్ని.

కైలాసపతి,- సమ్ముఖాన న్యూనతపరచుట అంత మంచిదిగాదు.

సుభద్ర:- న్యూనత పరచుటగాదు కైలాసపతిగారు, మీరు రాజకీయాలలో ముందడుగు వేయగలరు. రాణించగలరు. మమ్ము పుత్సాహపరచగలరు. కనుకనే మిమ్ము వాంఛిస్తున్నాము.

కైలాసపతి:- ఇంతకుముందే ప్రకృతిసిద్ధమైన ఒక నగ్నసత్యాన్ని చూశాను. దానిముందు యివన్నీ అసత్యాలవి, ప్రగల్భాలవి, వెర్రివేషా లనిపిస్తున్నది.

సుభద్ర:- ఆ సత్యస్వరూప మెలాంటిదో నా చెవినికూడా వేయండి.

కైలాసపతి:- ఇపుడదంతా విడిపోయింది. అలవాటయిన స్వభావంమీద సవారీచేస్తున్నందున వివరించుట కష్టం. నియమబద్ధమైన నిశ్చయా

లన్నిటిని మరుగుపర్చి, వాటన్నిటిని అవహేళన చేస్తూ స్వభావ సిద్ధ ప్రవృత్తి నామీద కొద్దిసేపు సవారీ చేసింది. ఆ సమయంలో యీ నిర్మిత సభ్యతంతా మనస్సునుంచి అదృశ్యమైంది. నిజానికి ఆ స్వభావసిద్ధప్రవృత్తే యదార్ధసత్యం గదా!

సుభద్ర:- అసలు విషయం అర్ధంకాకుండా యెంతచెప్పినా యేమి ప్రయోజనం.

కైలాసపతి:- అంతకుమించి చెప్పలేను క్షమించండి. స్త్రీ పురుషుని ఆకర్షిస్తుంది. ఎంతగాఆకర్షిస్తుందంటే అన్నిటిని యెగరగొట్టి యెదురీద గలిగేంతగా! అది ప్రకృతిలోని నిజస్వరూపం. ప్రకృతిలోని యదార్ధ సత్యమే బలమైంది గదా!

సుభ: మీరింత వొంక తిరుగుడుగా అర్థం గాకుండా చెబుతున్నారు. వజ్రం అతివిలువైందేగాని దాన్ని యధాతథంగా వుంచినపుడు గాదు సానదట్టిన కొంది. కనకాన్ని కాల్చకుండా మెరుగు దిద్దకుండా ఆకర్షణరాదు. అదేరీతి ప్రకృతిసిద్ధ స్వభావాలకుకూడా కొన్ని కృత్రిమాల సంయమం జరిగినపుడే రాణింపు కలుగుతుంది.

కైలాసపతి:- ఆ సిద్ధాంతాన్ని మీరు విశ్వసిస్తే జీవితంలో అనేక విషయాలనుంచి విముక్తిని కలిగించుకుని స్వతంత్రించు టెందుకు?

సుభ:- అది అవసరం గనుక. ఆచారాలను అలవాట్లను పూర్తిగా నిరసించలేను. యధాతథంగా శిరసుదాల్చలేను. ఒకనాడు సౌకర్యంగా వుపకరించినవి మరోనాడు భారంగా గనిపిస్తవి. ఆదిమ సమాజంలో, సంపత్తి అంటూలేని నాటి సమాజంలో - స్త్రీ సత్తాత్మక సమాజంలో - స్త్రీ అధికారమే చలామణి అయింది. సంపత్తి కూడి సమాజంలో పురుష ప్రభావం పెరిగినపుడు తమ ఆధిక్యతను పెంచుకొను స్త్రీలకు బానిసలస్థాన మిచ్చారు. స్త్రీలలో తరతరాలుగా బానిసభావాలనునింపి వ్యక్తిత్వాన్ని నిర్మూలించారు.

స్త్రీలు ఆ బానిస భావాలలోనే అలవడి అక్కడే సుఖమనే ఆత్మ సంతృప్తిని సృష్టించుకుని స్థిరపడిపోయారు. అలాంటి ఆ తారతమ్యం ప్రకృతి సిద్ధమైందిగాదు. అందుకే ఆ విషయంలో నేను పోరాడాలంటాను. స్త్రీలకు సమాన ప్రతిపత్తి, అధికారం, ఆధిఖ్యత వుండాలంటాను. ఆ సమస్య పోరాటంలో నా జీవితాన్ని అంకితం చేశాను.

ఆయన మనస్సులోని సమస్య సంభాషణలలో మారిపోయింది. మనస్సెందుకో నొచ్చుకుంటున్నది. ఆమెమీద విముఖరేఖలు పొడ సూపుతున్నవి. ఆఖరిమాటలలో గర్వమో లేక వెర్రితనమో వున్నట్లు భావన కలిగింది. కొద్దిసమయం ముందు ఆమెయడల ఆకర్షింపబడి నందుకు పశ్చాత్తాపం కలిగింది. ఎంతటివాడయినా కొన్నికొన్ని ప్రత్యేక సమయాలందు అజాగ్రత్తలో స్థానంతప్పి పడిపోవటం యెంత తేలికో అనుభవమయింది. ఇపుడు ఆమెను తాకనుకూడా ఘృణీకారం కలుగుతున్నది. ఆలోచనారహితంగానే ఆమెకు దూరంగా జరిగి కూర్చు న్నాడు. తన మనస్సులో ఆ సమయమందు దొర్లిన ఆలోచనలన్నిటిని ఆమెకు తెలియజేయనందుకు అదృష్టంగా ఆనందపడుతున్నాడు. స్త్రీని పురుషునినుంచి వేరుచేసి సంభాషించుటే అప్రస్తుతమని, హక్కులని అధికారాలని కోరి పోరాడుట హాస్యాస్పద మనిపించింది. శరీరంలోని హస్తాలను పాదాలను వేరుచేసి పాదాలకుకూడా ప్రాధాన్యత నివ్వాలని పోరాడుటగా తోచింది. అవి అవిచ్ఛిన్నమైన యేకత్వంలోనివని తెలుసు కోలేకపోవుట వెర్రితన మనిపించింది. శివుడు గంగాదేవిని శిరస్సున ధరించాడు. కృష్ణపరమాత్ముడు సత్య పాదధూళిని శిరస్సున పొంది నపుడు, ధన్యుడనైనా నన్నాడు. స్త్రీ పురుష జంట విడదీయజాలదని, ఒకక్షణం ఒకరిమాట మరుక్షణం మరొకరిమాట నిరాఘాటంగా సాగి పోతుంటవని తెలుసుకోలేక విడదీసి హక్కుల పోరాటం సాగించుట యెంత వెర్రితనం! అనిపించింది.

"మౌనం వహించారేమిటి, కోపమొచ్చిందా?"

"కోపమెందుకు? మాటలు దొరక్క వెదుక్కుంటున్నాను."

ఇంతలో కారు కైలాసపతి యింటిముందొచ్చి ఆగింది.

వేమన పంచాయతీ గ్రంథాలయం, అల్లవ్రోలు

11. ప్రేమోపాసకుడు

గంగరాజిపుడు స్వర్ణకుమారి ముందు కెళ్ళుటకు భయపడుతున్నాడు. ఆమె మహిళామండలివైపు రాకుండా వెళ్ళిపోతుందేమోనని భీతి. అందుకే సిగ్గు బిడియాలను అభినయిస్తున్నాడు. ఆమె ఆఫీసులో వున్నంతసేపు తప్పుకు తిరుగుతున్నాడు.

ఏమీ జరుగనట్లే ఆమె వచ్చి ఆఫీసు కార్యకలాపాలను చూసుకుంటున్నది. సమితులకు సంఘాలకు కూడా వెళ్ళి వస్తున్నది. ఆమె గంగరాజుతో మాటాడి పదిరోజులు గడిచిపోయినవి. మనస్సులో యేమేమి ఆలోచనలు దొర్లుతున్నవో తెలియని రీతిలో వుంచుతున్నది.

ఈలోపలే వోమాటు సుభద్రాదేవికూడా వచ్చి రెండుమూడు రోజులు మకాం వేసింది. భవిష్య కార్యక్రమాలగూర్చి స్వర్ణకుమారితో చర్చించింది. గంగరాజుగారి సలహా అవుసరమని స్వర్ణకుమారి కబురంపింది. కాని ఆయన వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళినట్లు తెలిసింది.

సుభద్ర వెళ్ళిపోయాక గంగరాజును చూడాలన్న తాపత్రయం స్వర్ణకుమారిని వేధించసాగింది. కాని తానుగా పిలుపనంపలేక పోతున్నది.

ఆరోజు ఉదయం రెండుగంటల ఆలస్యంగా ఆఫీసుకు వచ్చింది స్వర్ణకుమారి. టేబులుమీద ఒక నూతన వారపత్రిక వుంది. ఆ పేపరును ఎవరు తెచ్చివుంటారా, అన్న ఆలోచనలో మునుగుతూ పేజీలు తిరుగ వేయసాగింది. ఆ పత్రిక తెరుచుకున్న చోటనే ఒక చిన్న వుత్తర మున్నది. అక్షరాలు ముత్యాలవలె స్పష్టంగా కనిపిస్తున్నవి. ఆదుర్దాతో ఆ వుత్తరాన్ని తీసి చదివింది.

"స్వర్ణకుమారీ,

మీ యెదుటికి రాజాలక భయంతో బాధపడుతున్నాను. నన్ను క్షమించమని వినయపూర్వకంగా ప్రార్థించుకుంటున్నాను. దుర దృష్టవశాత్తు, అనాలోచితంగా నాద్వారా యీ అపరాధం జరిగింది గనుక క్షమాపణ వేడుకుంటున్నాను."

అనిశ్చిత్తరంలో వున్నది. క్రింద సంతకం లేదు.

ఆ చిన్ని వుత్తరాన్ని స్వర్ణకుమారి యెన్నోమారులు చదివింది. ఒకొక్కమాటు చదివి పైవంకచూస్తూ దీర్ఘ నిట్టూర్పులుకూడా విడిచింది. ఆ వుత్తరంలోని విషయాలు మామూలుగానే వున్నవి. కాని మరోమాటు చదువాలన్నంత ఆకర్షణీయమైన మాటలు యెక్కడో దాగివున్నట్లు తోచింది. ఆయనమీద జాలి కలిగింది. ఆ వుత్తరాన్ని తన బ్యాగ్‌లో జాగ్రత్త చేసుకున్నది.

పేపరు తిరుగవేస్తున్నా ఆ వుత్తరంలోని రెండు వాక్యాలు మనస్సులో పరువులెడుతున్నవి.

పేపరుమీద ధ్యాసలేదు. అయినా పేజీలు తిరుగవేస్తున్నది. విషయసూచికను చూసినపుడు, ఒక శీర్షిక క్రిందవున్న తన పేరును చూసి విస్మితురాలయింది. మరెవరి పేరయినా కావచ్చు, అనుకున్నది. 'వ్యక్తి - సంఘము-సంపత్తి' అన్నది శీర్షిక. ఆ వ్యాసమున్న పేజీతీసి చూసి మరింత ఆశ్చర్య పోయింది. సుస్పష్టంగా అది తన పేరే. తన కున్న హోదాలన్నీ వరుసగావేసి వున్నవి. తను యెన్నడూ ఆ శీర్షిక మీద వ్యాసమంటూ వ్రాయలేదు. తనకు తెలియకుండానే తన పేరుమీద వ్యాసం ప్రకటింపబడింది. ఆశ్చర్యము అంతకంటె ఆందోళనగావుంది.

వ్యాసమంతా చదివినపుడు అరగంటవరకు అలానే ఆలోచనలలో మునిగిపోయింది. తను యెంత ప్రయాసపడినా అంతటి వ్యాసం వ్రాయ జాలదు. అందలి భాషాభావము అద్భుతంగా వుంది. సంపత్తియొక్క ప్రభావాన్ని వ్యక్తి స్వాతంత్ర్య హద్దులను, సమిష్టి క్షేమ ఆవశ్యకతను సమన్వయంతో వివరిస్తూ శాస్త్రీకంగా వ్రాయబడింది. ఇంత ప్రశంస

సీయంగా వ్రాసిన వ్యాసానికి తన పేరునెందుకు పెట్టారా, అని యెంతో ఆలోచిస్తున్నది. మరోమాటు చదివినపుడు అందులోని కొన్ని శబ్దాలు ప్రత్యేకించి గంగరాజుగారి వుపన్యాసాలలో విన్నవి.

ఆ శబ్దాలనుబట్టి యీ వ్యాసం ఆయనే వ్రాసి తన పేరు పెట్టి వుంటాడని ఆలోచించినపుడు, ఆ వ్యాసంలోని పోకడంతా ఆయనదిగా కళ్ళకుకట్టినట్లు కనిపించింది. ఇంత శ్రమతో వ్రాసిన వ్యాసానికి తన పేరెందుకు పెట్టాడు? అనుకున్నపుడు ఆయన వుదాత్తత మనస్సులో మెదిలింది. సభలలో తనను హద్దులకు మించి కొనియాడిన విషయాలు, ఆఫీసులో యే కొరతను గురించి అనుకున్నా వెంటనే సమకూర్చిన సందర్భాలు తాను మాటవరుసగా, నాలుగు పడకకుర్చీలు ఆఫీసులో వుంటే బాగుండునన్నంతమాత్రాన మరునాడు మంచివి నాలుగు పడక కుర్చీలు తనకంటె ముందే ఆఫీసులో చేరివున్న విషయము వరుసగా ఆమెకు గుర్తువచ్చి హృదయం కృతజ్ఞతతో ద్రవించింది.

ఆయన వుత్తరాన్నిదీసి మరోమాటు చదివింది. ఆయన హృదయ మెంతో సునిశితమైందిగా వుదాత్తమైందిగా తోచింది. చూడాలని మనస్సు వాపోవసాగింది. బైట యెక్కడయినా కనిపిస్తాడేమోనని పనిని గల్పించుకుని అరగంట బైట గడిపింది. ప్రయోజనం లేకపోయింది.

ఆదుర్దాలోనే రెండురోజులు గడిచిపోయినవి. ఆయన కనిపించ లేదు. కబురు చేయలేకపోయింది. అనేకమంది వస్తున్నారు పోతున్నారు. కాని ఆయన రాక లేదు. ఆమె ఆఫీసు వదలి వెళ్ళిపోయాక వచ్చి రెండు మూడు గంట లుండి వెళుతున్నాడని తెలిసింది.

ఆరోజు ఆమె నాలుగు గంటలకే యింటికి వెళ్ళిపోయింది. తల నొప్పిగా నున్నందున వెళుతున్నట్లు నౌకరుకు చెప్పి వెళ్ళింది.

దినకరుడు పశ్చిమాద్రిలో మునిగిపోయాడు. పూర్వదిశనుంచి కాళరాక్షసి కోరలుచాచుకుంటూ పశ్చిమానికి పరువు లెడుతున్నది. స్వర్ణ కుమారి తిరిగి ఆఫీసు సమీపానికి చేరింది, లోపల బల్బు వెలుగు

తున్నది. తన కుర్చీలో యెవరో కూర్చుని పేపర్లు తిరుగవేస్తున్నారు. హాలుద్వారంవరకు పిల్లి అడుగులు వేసుకుంటూ నడిచింది. కిటికీలో గుండ వెనుకనుంచి చూసింది. ఆయన పేపరు చదువుతున్నట్లులేదు. అన్యఆలోచనంలో మునిగి పేపరులోని కార్టూన్సు మాత్రమే చూస్తున్నాడు.

ఆ సమయంలో అక్కడ నౌఖరులేడని తెలుసు. అయినా బయటివైపు తిరిగి "గోవింద్, గోవింద్," అని చిన్నగా కేకలు పెడుతూ లోపల ప్రవేశించింది.

గంగరాజు గాబరాతోలేచి, చేతిలోని పేపరును అలానేవిడచి "వాడులేడండి," అని వినయపూర్వకంగా పలుకుతూ, అవలకుపోయి అథోముఖంచేసి చూస్తున్నాడు.

"మీరు లేచారెందుకు. కూర్చోండి." అన్నది ఆమె.

గంగరాజు:- మీరు గోవిందుని పిలిచారు. ఏమయినా పని వున్నదా చెప్పండి.

ఆమె:- వాడు లేడుగా.

ఆయన:- నేనున్నాను ఫరవాలేదు చెప్పండి.

ఆమె:- మీరు చేయగల పనికాదులెండి! సుభద్రాదేవిగారు రేపు వుదయమే వస్తున్నట్లు తెలిసింది. ఆ విషయం కైలాసపతిగారింటికెళ్ళి తెలుసుకు వస్తాడని పిలిచాను.

ఆయన:- నేను వెళ్ళి తెలుసుకు వస్తానులెండి [అంటూ ఆయన బయలుదేరి వెళ్ళబోతున్నాడు.]

ఆమె:- మీరు పోవటమెందుకు? పోనీ తెల్లవారి గోవిందును పంపుతాలెండి.

ఆయన:- మీరీ సమయంలో యీ విషయం తెలుసుకోను రాగా లేనిది నేను వెళ్ళి రావటం దోషంగాదు లెండి. (అంటూ ఆయన బయ

టకుపో ప్రయత్నిస్తున్నాడు. ఆమె హస్తాలుచాచి దారికి అడ్డంగా నిలిచి "నౌఖరు పనిని మీచేత చేయించే అంత దిగజారుడు స్థితికి నేనింకా రాలేదులెండి." అన్నది.

మతిబోయిన వానివలె వెనుదిరిగి రెండడుగులువేసి నిలిచాడు. ఆమె యెదుట నిలిచి ముఖం చూపలేకపోతున్నాడు.

"మీరు లేచారెందుకు? ఆ కుర్చీలో కూర్చోండి." అని మృదువుగా అన్నది.

"అది మీ స్థానం. మీ సమక్షంలో అక్కడెలా కూర్చోగలను?"

"అలాంటి మాటలని నన్ను చిన్నబుచ్చుతూ మిమ్ము మీరు న్యూనత పర్చుకొనుటం మంచిదిగాదు. వెంటనే వెళ్ళి కూర్చోండి" అని కొంచెం జోరైన కంఠంలో అన్నది.

గంగరాజు తడబడుతూ వెంటనే ప్రక్కనున్న మరో కుర్చీలో కూర్చున్నాడు.

"అదేమిటి? మొదట కూర్చున్న కుర్చీలో కూర్చోమంటే, అలా సంకోచిస్తారెందుకు?"

దీనదృక్కులతో "పొరపాటు తెలిసి చేసేవాడికి ధైర్య మెలా వుంటుంది చెప్పండి!" అన్నాడు.

"ఏమి పొరపాటు చేస్తున్నారు?"

"ఆనాటి పొరపాటుకే మీముందుకు రాలేక భయపడి చచ్చిపోతున్నాను, చాటుచాటుగా తిరుగుతున్నాను. ఇది శిక్షగా సరిపోయింది. ముందు ఆ అపరాధానికి మీ తరపుగా శిక్ష విధించండి."

"అది ప్రథమ అపరాధం. ద్వితీయ అపరాధాన్నికూడా చెబితే ఒకటిగాచేర్చి విచారణ చేయవచ్చు."

"మొదటి అపరాధానికి శిక్ష లభిస్తే, ఆ ధైర్యంతో రెండో పొరపాటును చెప్పుకో గలుగుతాను."

"అభయమిస్తున్నాను గనుక ధైర్యాన్ని కూడదీసుకుని చెప్పండి."

"మీరు కూర్చునే కుర్చీలో కూర్చుని, మీ అందచందాల గూర్చి ఆలోచనలు చేస్తున్నపుడు అద్వితీయమైన ఆనందానుభూతి కలుగుతుం టుంది. మీ స్పర్శల ద్వారా కలిగే వెచ్చదనమే వస్తుంటుంది. అందుకే మీరు లేనపుడు మీ కుర్చీలో కూర్చుంటాను" అన్నాడు.

క్రోధాన్ని అభినయిస్తూ "మీరు వట్టి కుట్రదారులుగా తోస్తున్నది. మొదటి అపరాధానికి శిక్ష పొందకుండానే ద్వితీయ అపరాధం చేసిన కఠినుడివి గనుక మిమ్ము క్షమించికూడా ప్రయోజనం లేదనిపిస్తున్నది. పరస్త్రీ యెడల యిలాంటి ఆలోచనలు సలుపుట యెంత ఘోర నేరమో రవంతయినా ఆలోచించారా ?" అన్నది.

"ఈ ఒక్కమాటుకు క్షమించండి. ఇవి తెలిసి చేసిన నేరాలు గాదు. అనాలోచితంగా జరిగినవి. అందుకు ప్రతిగా చేసిన ప్రయత్నాలు విఫలమయినవి. మనస్సు నా స్వాధీనంలో లేకుండా జరిగిన పనులు గనుక ఈ ఒక్కమాటుకు క్షమించండి."

"వివరాలు తెలిసినకొంది మీ అపరాధం మరింత కఠోరమైనదిగా తోస్తున్నది. మనస్సు మీ స్వాధీనంలో లేనపుడు క్షమించికూడా ప్రయోజనంలేదుగదా! తిరిగి అలాంటి అపరాధం చేయరనే గ్యారంటీ యెక్కడున్నది!"

"లేదు, అలా తిరిగి జరుగను వీలులేదు. ఆ అపరాధం వెనుక నా హృదయ కల్లోల బాధ భరించరానిది. అంతటి బాధతో జీవించుట దుర్లభం. కనుక యీ ఒక్కమాటుకు క్షమించండి!"

"మీ అపరాధం క్షమించలేనిది. ఇపుడు మీరు చెబుతున్న విషయాలు అంతకంటె ఆపత్తికరమైనవి. మనస్సు ఆధీనందప్పి నడుస్తున్న దంటున్నావు. అలాంటి నడక భరించరానిదంటున్నావు - అది ఉన్మాదికి మొదటి దశ. మీరు ప్రమాదకరమైన వ్యక్తులు. పోనీ క్షమిస్తే మీ విషయంలో మీరు యేమి జాగ్రతలు తీసుకుంటారో చెప్పండి."

"అలాంటి ఆలోచనలు మనస్సుకు రాకుండా ప్రయత్నిస్తాను. మీకు కనిపించకుండా వుండే వుపాయం వెతుక్కుంటాను."

"మీ ప్రయత్నంవలన ప్రయోజన ముంటుందనే గ్యారంటీ కనిపించటలేదు. చాటుగావుండికూడా మీరు చేసేది దుష్ట ఆలోచనలు. క్షమించుటకంటె తగిన శిక్ష నిచ్చుటే వుత్తమం."

గంగరాజు గొప్ప కార్యసాధకుడు. అమాయకుడుగా అలౌకికుడుగా, ఆదర్శమూర్తిగా కనిపిస్తాడు. అయిష్టమైన కార్యంతలపెట్టినపుడు యెదుటి వారి మధ్య మరొకరినిరికించి తెరచాటుగా కార్యాన్ని సాధిస్తుంటాడు. రాజకీయాలలో ప్రవేశించినపుడు అతను దుష్టుడుగాను, దుర్మార్గుడుగాను, కటికి స్వార్థుడుగాను, విశ్వాసఘాతకుడుగాను ప్రచలితుడు. కాని నేడు వాటికతీతుడై ఆదర్శవాదిగా ప్రజల దృష్టిలో నిలిచాడు. రాజకీయాలు ఆయనలో లౌకికాన్ని పెంచినవి. నటనా నైపుణ్యాన్ని దిద్దినవి. వినయ ప్రదర్శనతో ప్రజలనాకర్షించ గలుగుతున్నాడు. ఆయన అంతర్గత నిజ స్వరూపాన్ని రహస్యమయంగా వుంచుకో గలుగుతున్నాడు.

స్వర్ణకుమారి సంపన్న కుటుంబంలోని యువతి. నవనాగరికత విదుషిమణి. అపురూప సుందరి. ముక్కుకు సూటిగా నడచుట తెలుసు, అనుభవంలేని ఆమెలేత హృదయం పసితనంతో ఆకర్షిస్తుంటుంది.

ఆమె గంగరాజుకు అందని గగన కుసుమంలాంటిది. ప్రథమంలో ఆమె యెడల అలాంటి ఆలోచనలులేవు. భక్తి విశ్వాసాలుండేవి. ఆమె సహకారాన్ని మహద్భాగ్యంగా భావించాడు. సన్నిహిత అనుభవంలో ఆమెలోని అమాయకత్వం అర్థమయింది. ఆశ కలిగింది. అందుకే నేర్పులో సోపానాలు నిర్మిస్తున్నాడు. ఆమెకు బాధ్యతలను అంటగట్టాడు. పేరు ప్రతిష్టలు ఆదరసత్కారాలు అనే భ్రమలలో ముంచి వెర్రిదాన్ని జేశాడు. స్టీరింగు తన చేతిలో వుంచుకుని యాక్సిలేటర్ త్రొక్కు అధికారాన్ని దత్తంజేసినట్లు ఆమెను అనేక సంఘాలకు అధ్యక్షురాలిని చేశాడు. జిల్లా రాజకీయ నేతృత్వమంతా ఆమె

మీదుగా నడుస్తున్నట్లు కనిపించు స్థితిని తెచ్చాడు. వెళ్ళిన చోటల్లా పూలమాలలతో సత్కారాలు లభిస్తున్నవి. అందరూ ఆధిక్యతనిచ్చి పూజిస్తున్నట్లు హస్తాలు జోడిస్తున్నారు.

ఈ యావత్తు వాతావరణాన్ని సృష్టించిన గంగరాజు తెరవెనుక తెలియనివానివలె అమాయకంగా నిలుస్తుంటాడు. పొందుతున్న ఆధిక్యతలలో పరవశమై ప్రక్క సామాన్యుడుగా ఆదర్శమూర్తిగా, ఆదరమూర్తిగా నిలిచిన గంగరాజు యెడల కృతజ్ఞతతో చూస్తూ యెక్కువ చొరవనిచ్చింది. కృతజ్ఞతరూపంలో ఆమె హృదయంలో అంకురమైన మృదుత్వాన్ని పసిగట్టిన గంగరాజుకు ప్రకృతిసిద్ధమైన ఆశ ఆవిర్భవించింది. సాధనలో చతురుడు గనుక మరింత సన్నిహితం చేసుకుని సులువుగా పొందుటకు ఆమె సమక్షంలో తన అమాయకత్వాన్ని అసహాయత్వాన్ని అనేక విధాల ప్రదర్శించుకుంటున్నాడు.

స్త్రీ పురుషులమధ్య యుక్తుల జిత్తులకంటె అతి తెలివిలోగూడిన యోజనలకంటె నిష్కపటంతో గూడిన అమాయకత్వం అత్యంత ఆకర్షణీయమైంది. కనుకనే గంగరాజు నటన ఫలించింది. ఆకర్షింపబడ్డాడు. అయినా తొందరపాటు లేకుండా నిగ్రహాన్ని పాదదీనుకుంటున్నాడు.

ఆమె గొప్ప శిక్షను విధించబోతున్నట్లు, అది యెంత కఠినమైందయినా శిరసా వహించనున్నట్లు, త్యాగదీక్షతో దీనతకు మిళితం జేసి "మీరు క్షమించకుండా శిక్షను విధిస్తే నేను ధన్యుణ్ని. అది యెంతటి కఠిన శిక్షయైనా నాపాలిటి అమృత యోగంగా స్వీకరిస్తాను." అన్నాడు.

"శిక్షద్వారానేరం అంతరిస్తుందంటారా ?"

"అంతరించదు, క్షమద్వారా దోషం రద్దుగావచ్చుగాని శిక్షద్వారా కాదు."

"శిక్షద్వారాను క్షమద్వారాను అంతంగాని అపరాధం ఆత్మ పరితాపంలోని పశ్చాత్తాపంద్వారా అంతమవుతుందంటారు."

"అది గొప్ప వుదారతలోని నిర్ణయం. అదే మీ నిర్ణయమైతే

నేను అనుక్షణము పశ్చాత్తాప పడుతున్నాను. నా హృదయం పశ్చాత్తాపంతో పరితపిస్తున్నది."

"పశ్చాత్తాప పడుతూ మరో ప్రక్క అంతకు మించిన అపరాధం చేస్తూ పోయేవారికి యేరూపశిక్షవిధించాలో మీరే నిర్ణయించి చెప్పండి."

"మీ ద్వారా మరణశిక్ష పొందినా ఆనందంతో స్వీకరిస్తాను. మీ శిక్షస్వీకారంలో ఆత్మతృప్తి కలుగుతుంది. ఆత్మతృప్తిలో పొందేమరణం అమరత్వమిస్తుంది. కనుక మీరు స్వయంగా తీర్పు నివ్వండి."

"నా కుర్చీలో కుర్చోమని శిక్షగా ఆజ్ఞాపిస్తున్నాను శిక్షను పాలించండి."

ఆయన భయపడుతున్నవానివలె హస్తాలు జోడించి "ఇది మీ సమక్షంలో నేను చేయలేనిది. మరణశిక్షను విధించండి విషాన్ని త్రాగి అమరత్వాన్ని పొందుతాను."

"చిన్న ఆజ్ఞను శిరసావహించని మీరు మరణశిక్ష వాంఛించుట హాస్యాస్పదం!"

"మీ యడల నాకున్న భక్తి విశ్వాసాలను శంకించుట భరింపరానిది. అసాధ్యమని మీరనుకున్నది యిపుడే రుజువు చేసుకుంటాను. అరగంటలో నాశవం మీముందుండునట్లు చేస్తాను చూడండి." అంటూ బయటకు సరసర నడిచాడు."

ఆమె మరేమీ చెప్పబోయినా వినిపించుకోకుండావెళ్ళి కరెంటు స్తంభంపైకి పాకప్రయత్నిస్తున్నాడు. ఆమె భయవిహ్వాలురాలై పరువులెత్తువెళ్ళి ఆయన పాదాలుపట్టి క్రిందకులాగ ప్రయత్నిస్తున్నది. బలంతో విడిపించుకుని పైకిపోను ప్రయత్నిస్తూ "నా హృదయంలోని విశ్వాసాన్ని మీ కంటిముందు కనపర్చనీయండి." అని వినయంగా ప్రార్ధించాడు.

"విశ్వాసం యెంతటి దృఢతరమైందయినా ప్రాణం పోయాక చేయగలిగిందిమాత్రం యేముంటుంది."

"అవిశ్వాసంతో జీవించుటకంటె ప్రాణత్యాగంచేసి అయినా విశ్వాసాన్ని పొందితే నీ హృదయంలో అమరత్వాన్ని పొందుతాను.

అంతకంటె జీవించిపొందే మాధుర్యం మాత్రమే ముంటుందిచెప్పండి!"

"అలా వీల్లేదు ముందు క్రిందికి దిగిరండి" అంటూ క్రిందికిలాగ ప్రయత్నిస్తున్నది.

"అనవసర ప్రయాసతో నా నిర్ణయాన్ని చెదర్చక నన్ను మర జించ నివ్వండి, ఆత్మ శాంతిని పొంద నివ్వండి. అశాంతిలోని జీవితం కంటె యిది వుత్తమమైనది. అంటూ బలంగా పాదాలను పైకి లాక్కు న్నాడు.

చేతులలోనిపట్టు తప్పినందున ఆమె క్రింద కూలబడుతూ గాద్గదిక కంఠంతో "గంగరాజుగారు, నాకొరకని మీరు ఆత్మహత్యకు సిద్ధ మైతే నేనూ మిమ్మనుసరిస్తాను. మీ శవంకంటె నాశవమే ముందు పృధ్వీమీద పడుతుంది." అంటూ చేతితో శిరస్సు మోదుకున్నది.

గంగరాజు వెంటనే క్రిందికిదిగివచ్చి ఆమెశిరస్సునుపట్టి ప్రక్కగా కూర్చుని నిమురుతున్నాడు. అతని బాహువులలో వాలిపోయింది. అశ్రు స్రవంతి వలుకుతున్నది. అంగుళీయములతో అద్దుతూ "కన్నీరు కారుస్తా రెందుకు?" అన్నాడు.

అందుకు సమాధానమా అన్నట్లు తన ముఖాన్ని ఆయన వుద రంలో దాచుకున్నది. శిరస్సుమీద చేయివేసి నిమురుతూ దీర్ఘశ్వాసను విడచాడు. ఆయన,

కదలిక మెదిలికచేస్తే ఆమె లేచివెళ్ళిపోతుందేమో నన్న భయంతో వూపిరిబిగబట్టి కూర్చున్నాడు. శరీరమంతా వేడెక్కుతున్నది. హృదయం దడ దడ లాడుతున్నది, విచిత్రమైన ఆనందానుభూతి కలుగుతున్నది. ఈ ప్రపంచంలోని యావత్తు సుఖసంపద తన బాహు వులలో యిమిడివున్నట్లుతోచే, వూపిరి సలుపుటలేదు. రాత్రి కాపలాకు నౌఖరు వస్తాదేమోనని పిరికి వెంటాడుతున్నది. అపు డపుడు హృదయ స్పందనలు ఆగిపోతున్నవి. వడిలోని ఆమెను ముద్దార వత్తివేయాలని పెరపెరకలుగుతున్నది. కాని ధైర్యం చాలుటలేదు.

ఆమె ఆయనవడిలోనుంచి మెల్లిగాలేచి "పదండి" అంటూ ఆయన్ను లోపలికు తీసుకెళ్ళి, ఆ కుర్చీలోనే కూర్చుండ బెట్టింది.

"ఆత్మహత్య మహాపాపం. అలాంటి పనికి యెన్నడూ తలపడకండి." అన్నది.

"శిక్షను స్వీకరించి మరణించుట మహాపాపంగాదు. నీతితో గూడిన వీరత్వంతో అమరత్వం ప్రాప్తిస్తుంది:"

"మరణ శిక్ష నేను విధించలేదుగా."

"ఆదర్శాల ఆశయాల, లక్ష్యాల ఆవేశంలో జీవితాన్ని అంకితం చేసి వురికంబంవైపు నడచుటలోని అనుభవాన్ని మాత్రమే యింతవరకు పొందాను. ప్రేమ దేవత సామ్రాజ్యంలో శరీరంలోని అంగ అంగము, కణ కణము కృతజ్ఞతలో ప్రఫుల్లితమై ఎలా తరంగితమై పరిస్తుందో నేడు తెలుసుకుంటున్నాను. ఈ ఆనందానుభూతిలో ఆత్మార్పితం చేసుకుని దేవత పాదాలముందు ప్రాణాలర్పిస్తే అనంత ఆనందం కలుగుతుందని పిస్తున్నది. ఆత్మ చావులేనిదైతే ఆరాటాలు విస్మరించి తృప్తితో ఆనందమత్తులో కొన్ని మన్వంతరాల కాలం నిద్రిస్తుంది. ఆ విధమైన మానవ పూర్ణత్వం ప్రేమదేవత పాదాలవద్దతప్ప యెక్కడ లభిస్తుంది!"

ప్రేమ విషయంలో స్త్రీ గంభీరురాలు. తనకు యిష్టమైనచోట అలకముఖంబుట్టి యెదురు ప్రశ్నలు వేస్తుంది. అర్థం చేసుకోనట్లు అయిష్టమైనట్లు ప్రదర్శిస్తుంది. అంతకంటె అయిష్టమైనచోట అన్నిటికి మౌనముద్ర దాలుస్తుంది. నేత్రాలలో జవాబులిస్తుంది. పురుషుడు సాహసించినచోట స్త్రీ సాహసించలేదు. స్త్రీ సాహసించినచోట పురుషుడు సాహసించలేడు. పురుషుని సాహసం హద్దులలో వుంటుంది. స్త్రీ సాహసం అవధులులేనిది. కాని అలాంటి సాహసం స్త్రీలో అరుదుగా జనిస్తుంటుంది.

గంగరాజు పలుకులు స్వర్ణకుమారి హృదయ తంతులమీద జిలిబిలి ధ్వనులను కల్పిస్తున్నవి. మృదుమధుర సంగీతంవలె ఆయన మాటలు యింకా యింకా వినాలనిపిస్తున్నది. విన్నకొలది వినాలని ఆశ కలుగుతున్నది.

ప్రేమపూజారివలె ఆయన మాట్లాడుతున్నపుడు, ఆమె క్రోధాన్ని

అభినయిస్తూ "మనిషికి మాట విలువ అన్నిటికంటె ముఖ్యమైంది. అది మీలో శూన్య మనుకుంటాను. గతానికి క్షమించమన్నారు, శిక్ష విధించమన్నారు. తిరిగి అలాంటినేరం యెన్నడూ చేయనన్నారు. అరగంట గడువకముందే, అంతకుమించిన నేరానికుద్యుక్తులవు తున్నారు. ఇదేనా మీ నీతి!" అన్నది.

వెలవెల బోతున్న ముఖంతో "నా నేరాన్ని పదే పదే చెప్పుకుంటున్నాను. నా అవినీతి స్మరణతో నన్ను నేనే యేవగించుకుంటున్నాను, అందుకే సిగ్గుతో మీ ముందుకు రాలేకపోతున్నాను. ద్రోహిగా జీవించుటకంటె ఆత్మహత్యద్వారా విశ్వాసాన్ని ప్రకటించుకొనుట మంచిదని చేసుకున్న యత్నాన్ని మీరే విఫలంచేశారు. మరణోన్ముఖిని బ్రతికించి, నిందించుట ధర్మమా చెప్పండి."

బ్రతికి సాధించలేనివారు కొందరు చచ్చిసాధిస్తారు. మీరు ఆ మార్గాన్ననుసరించగోరుతున్నారు గాబోలు. అవును మీరు ఆత్మ హత్య చేసుకుంటే, యెదుటనున్న నేను హంతకురాలినిగా కోర్టులో నిలువక తప్పదు. మరణశిక్ష ప్రాప్తిస్తుంది. మీరు హత్యచేసుకుంటారు, నేను హత్యకావింపబడతాను. గొప్పవుపాయాన్నే నిర్మించుకు కూర్చున్నారు."

"అందు కాయన దగ్గర జవాబులేదు. క్షోభతో కన్నీరు కారుస్తున్నాడు, ఆమె హాస్యధ్వారణిలో "చూశావా మరో అపరాధంచేస్తున్నారు. అడుగు అడుగున అపరాధాలు చేసి కూర్చోవటం మీకు పరిపాటయిపోయింది. అశ్రువులు ఆడవారి ప్రత్యేకసొత్తు, వాటిని అపహరిస్తున్నారు ఇది దొంగతనంగాదా చెప్పండి!"

ఆయనలోని వుత్సాహం వురకలు వేసింది. అశ్రువులను అద్దుకుంటూ భయందీరిన కంఠంతో "మీరు అర్థంగారు, ఎన్నటికీ అర్థం చేసుకోలేనేమో! చనువుగా కనిపించినపుడు అందంతో ఆకర్షిస్తారు. గంభీరతలోని మీ రూపురేఖలు భయపెడుతుంటవి. నన్ను యీరీతి సందిగ్ధంలో పెట్టి బాధించినందువలన మీకు కలిగే ప్రయోజన మేమిటి చెప్పండి!"

"ఒకరి దుఃఖం మరొకరికి వినోదాన్ని సమకూర్చే సన్నివేశాలు

కూడా వుంటవి. తన వినోదాన్ని యెవరైనా చేతులారా దూరం చేసుకుంటారా చెప్పండి!''

''ఒకరిని దుఃఖపెడుతూ పొందే ఆనందంకంటె దుఃఖం పొందుటే మంచిది.''

''ఇక్కడ ధర్మ అధర్మాల, మంచిచెడ్డల మీమాంసలేదు. ఇలాంటి ఆనందాన్ని పొందుటకుకూడా ఒక ప్రత్యేక నైపుణ్యం, అది అందరికీ అందుబాటైందిగాదు.''

''అయితే నన్ను ఆటవస్తువుగాచేసి ఆనందాన్ని పొందుటకే బ్రతికించారా?''

ఆమె కోరగా అయిదు నిమిషాలుచూసి నవ్వు ముఖంలో, దంతాలు బిగబట్టి ''మీరు గొప్ప సాహసవంతులేగాని స్త్రీ ముందు పిరికివారు. రాజకీయ ఆర్థిక సాంఘిక విషయాలలో మీ బుద్ధి చురుకైందిగాని స్త్రీ భావాన్ని అర్థంచేసుకోగలశక్తి లేదు. నేను వెళుతున్నాను ఆ కుర్చీలోనే వుండి ఆలోచనలు చేయండి'' అన్నది.

12. ఎండమావులు

వసంతకుమార్ ప్రయోగశాలను గురించి ప్రజలు చెప్పుకోవటం మర్చిపోయారు. ఆయన విదేశంనుంచి వచ్చినపుడు గొప్పగా వూహించి అనేక విధాల పొగడుకున్నారు. ధన ఆర్జనకుగాని అధికార ఆర్జనగాని ఖ్యాతి ఆర్జనగాని ఆశించకుండా విచిత్రరూపంలో ఒక ప్రయోగశాలంటూ పెట్టి పెద్దపెట్టుగా పరిశోధనలు సలుపుతున్నపుడు ఆయన గురించిన వూహలు ఆశలు సన్నగిలినవి. నేడు ఆయన్ను మర్చిపోయినట్లుంది. ఎక్కడయినా ప్రజలలో ఆ సందర్భాలు వచ్చినపుడు ఆయన్ను చాదస్తునిగా చిత్రించుకుని జాలిని ప్రకటించి విస్మరిస్తుంటారు.

నేడు గంగరాజుకు పూర్తిస్థాయి చిక్కింది. అధికారాలు ఆధిక్య

తలు లభించినవి. చీకటి మార్గాన అంతంలేని ధనం కూడబడుతున్నది. వెనుకటి అపవాదులు మరుగున పడిపోయినవి. ఆదర్శమూర్తిగా చలామణి అవుతున్నాడు. నేడు ఆయన ముఖమండలంలో నూతన తేజస్సు వెలువడుతున్నది. శాంతిమూర్తిగాను దయానిధిగాను ద్యోతితమవుతున్నాడు. సుభద్రాదేవి స్వర్ణకుమారిలు ఆయన అడుగుజాడలలో నడుస్తున్నారు.

గంగరాజిప్పుడు వసంతకుమార్ సలహాలకుగాని, సందర్శనాలకుగాని వెళ్ళుటలేదు. ఆయన అవుసరం తీరిపోయింది గాబోలు యెక్కడా ఆ పేరు నుచ్చరించుటలేదు.

వసంతకుమార్ కార్యరంగం ప్రజలదృష్టికి మరుగున పడిపోయింది. స్వయంగా ఆయనే అజ్ఞాతవాసి అయినట్లున్నది. స్వర్ణకుమారికివు డవన్నీ వెగటుగా తోస్తున్నవి. చాదస్తంగా గనిపిస్తున్నది. తాను ఆ ప్రయోగశాల యెడల తీసుకున్న శ్రద్ధ శ్రమ మనస్సులో మెదిలినపుడు అది తన అనాటి అవ్యక్తతగాలోచి సిగ్గిలుతుంటుంది. అదొక మతిబోయిన కార్యక్రమంగా వూహించి ఆయన యెడల గలిగిన జాలితో ఒక దీర్ఘ నిట్టూర్పును విడుస్తుంది. 'జీవితాన్ని అవ్యక్తంగా ఆ విధంగా అనర్థం చేసుకునేవారీ లోకంలో యెందరుంటారో!' అని విచారపడుతుంది.

"విశేషజ్ఞానం కలిగినవారు వితండవాదులుగాను ప్రజావసరాలకు అందనివారుగాను యిలాగే తయారవుతారుగాబోలు." అని పశ్చాత్తాపపడుతున్నది.

పద్మకు ఆయన యెడల కలిగిన భక్తి విశ్వాసాలద్వారా ఆయన కార్యాలయెడ శ్రద్ధ కలిగి విశ్వాసం కుదిరింది. అందులీనమైంది. ఇప్పుడాయన ఆసక్తిలోనే తన ఆసక్తిని చూడగలుగుతున్నది.

వసంతకుమార్ హృదయం దయార్ద్రమైంది. అందరి యెడల ఆదరం చూపుతాడు. ఆశతో అడిగిన ప్రతివారికి సహాయపడుతుంటాడు. అనేకమంది రాకపోకలు సాగుతున్నపుడు పద్మ తన బాధ్యతను

మాత్రమే నెరవేరుస్తూ వచ్చింది. స్వర్ణకుమారి మహిళామండలివారి ఆఫీసులో పీఠంవేసి గంగరాజు అడుగుజాడల్లో నడువసాగాక వసంత కుమార్‌కు దూరమైపోయింది. ప్రయోగశాల కిపుడు నామమాత్రంగా కూడా రాలేకపోతున్నది.

పట్టుదలతో దీక్షగలవాడు గనుక ఆయన వుత్సాహంలో మార్పు లేదు. ఎవరి యెదుటయినా నిలిచినపుడు నవ్వు ముఖంతో వుంటాడు. ఎవరూ లేనపుడు దీర్ఘ ఆలోచనలో వుంటాడు.

ఆయన యెడల పద్మలోని సానుభూతి నానాటికి పెరిగింది. బాధ్యతలను పెంచుకున్నది. ఇపుడామెలో సందిగ్ధాలు సంశయాలులేవు.

ఆయనలోని నిర్మలరూప నిస్వార్థ విశ్వాసం పద్మను విశ్వస్థురాలను చేసింది. నిస్వార్థ త్యాగంతో గూడిన విశ్వాసమే దైవ స్వరూపమని మనస్సును తృప్తిపరచుకున్నది. ఇపుడు ప్రయోగశాల కార్యాలందు మనస్సు లగ్నమవుతున్నది. సంఘ క్షేమంకొరకు స్వసుఖాలను త్యజించి ఆత్మార్పణగావించుట అత్యుత్తమ ఆదర్శమని వుత్సాహాన్ని పొందింది.

పద్మ కిపుడు వసంతకుమార్‌లోని అజ్ఞాతశక్తి వేయివిధాల గనిపిస్తున్నది. ఆయన గనిపించినపుడు వెర్రిదానివలె అదే పనిగా చూస్తుంటుంది. చూసినకొంది ఆయనలోని తేజస్సు విశిష్టరూపందాల్చి లీనంచేసుకుంటుంది. మరింత ఆకర్షిస్తుంటుంది. ఇంతకాలం ఆ విశిష్టతను కనుగొనలేకపోయిన తన వెర్రితనాన్ని తలంచి చిన్నబోతుంటుంది.

ఆమె చూపులకు ఆశ్చర్యపోతూ "అలా చూస్తావెందుకు ?" అన్నాడు.

ఆమె నేత్రాలు సజలమైనవి. అధరాలు అదురుతున్నవి,

"నా ముఖంలో యేమున్నది?" అంటూ చేతిగుడ్డలో ముఖం తుడుచుకుంటున్నాడు.

"మీ ముఖంలో దివ్యతేజస్సువుంది బాబుగారు."

"నేడు నూతనంగా కనుగొన్నావా ?"

"విశిష్టతను అనుభవంలో దప్ప అర్థం చేసుకోలేము.

"భ్రమలో గొప్పగా వూహించి పరువులిడి యెండమావులుగా గ్రహించినపుడు కలిగే పశ్చాత్తాపం కటువైందిగా వుంటుంది."

"పిరికితనంతో వజ్రాన్ని గాజుముక్కగా భావించి నిర్లక్ష్యంతో పారిపోవటం పెర్రితన మౌతుంది."

"ఇంతకు నా ముఖంలో యేమి చూశానంటావు ?"

"నిర్మలమైన తేజస్సును చూశాను. అద్వితీయమైన ఆకర్షణను చూశాను. ఆ వెలుగులో పరమ పవిత్రమైన దీక్ష గనిపిస్తున్నది. అది ఆత్మ ధైర్యాన్ని ప్రబోధిస్తున్నది అంటూ తాను అధికంగా మాట్లాడి నందుకు సిగ్గుపడుతూ వెనుదిరిగి వెళ్ళిపోయింది.

13. పాముకాటు

కిన్నెర గంటలరాత్రివేళ ఆఫీసునుంచిబయలుదేరిన స్వర్ణకుమారి రోడ్డు మలుపు వరకు నడిచి ఆగిపోయింది. మనస్సులో గంగరాజు మాటలు పదే పదే మెదులుతున్నవి. వేదికలమీద వక్త వుపన్యాస చక్రవర్తి. కార్యరంగంలో దీక్షాపరుడు, సంఘాల సమితులలో ప్రత్యేక నైపుణ్యం గల అర్థనైజరు. అన్నిరంగాలలోను ఆకట్టి అందరను ఆకర్షించు యోగ్యుడు. గొప్ప తెలివిగలవాడని, తాంత్రికుడని చాణక్యుడని ప్రతీతి. కాని తనముందు ఒక సర్వ సాధారణునివలె మెలగుతుంటాడు. సిగ్గిలుతూ మనస్సులోని మాటను చెప్పలేక పోతుంటాడు. వినయంగల భృత్యునివలె భయపడుతుంటాడు. తాను నటనతో క్రోధాన్ని ప్రదర్శించి నందుకు ఆత్మహత్య కుద్యుక్తుడయినాడు. ఆ విద్యుత్ స్తంభంమీదినుంచి తాను బలవంతంగా లాగివుండకపోతే అయిదు నిమిషాలలో ఆత్మ హత్యకు గురయ్యేవాడు. ఆ విషయాలన్నీ మనస్సులో మెదులుతుంటే ఒక మంచి సినిమా చూస్తున్నట్లు వినోదం కలుగుతుంది. ఆ విషయాలనే

ఆలోచించాలనిపిస్తున్నది. అతని వినయము, భయము, అమాయకత్వము ఆమెను ఆకర్షిస్తున్నది.

ఆ విషయాలను ఆలోచిస్తూ ఆమె అక్కడ యెంతోసేపు వుండి పోయింది. ఆయన సమక్షంలో వున్నంతసేపు దాగుడు మూతలలాంటి గిలిగింతల అనుభూతి కలుగుతుంటుంది. తిరిగి ఆ అనుభూతిని పొంద గోరుతున్నది హృదయం. పాఠాలురాని విద్యార్థివలె ఆయన తన ముందుపడు తడబడలను, భయవిహ్వలతలను స్మరించి ముగ్ధురాలవు తున్నది. ఆ దృశ్యాలలో విసగటలేదు.

ఆ విషయాలలో ఆలోచించినకొంది ఆయనమీదజాలి, ఆ తరు వాత అభిమానము, అర్థంగాని అనురాగము కలుగుతున్నవి. తిరిగివెళ్ళి ఆయన ముందు నిలిచిన తన గంభీరతను విడనాడి "నాముందు మీరు గాభరా పడవోకండి. మీయే కార్యంయెడలా నా మనస్సు నొచ్చుకోలేదు. నా కోపమంతా నటనమాత్రమే. మీరు యేమిచేసినా సహించాలనిపిస్తు న్నది. అందులోనే ఆనంద ముద్భవించునట్లున్నది. కనుక భయపడ కండి." అనాలనిపిస్తున్నది.

ఇంతదూరంవచ్చి తిరిగి వెళ్ళటం మంచిదిగాదని మరో ప్రవృత్తి ప్రబోధించింది. ముందుకు నడిచింది.

ఆమెకు ఆ రాత్రి నిద్రపట్టలేదు. పద్మ పాలగ్లాసు ముందుంచి యేదో చెప్పాలని ప్రయత్నించింది. కాని నిద్ర పడబోసుకొస్తున్నట్లు చెప్పి తప్పించుకున్నది. ఏకాంతంలోని హాయిని అర్థం చేసుకున్నది. ఈ హాయిని మరెవరయినా దోచుకుపోతారేమోనన్నట్లు గది తలుపు బిగించుకుని మెర్క్యురీలైటు వేసుకుని శయ్యమీద అటూ యిటూ దొర్లుతూ ఆలోచనలకు నూతనత్వ మిస్తున్నది. ఆయన హస్తాలు జోడించి క్షమాభిక్ష వేడుకుంటున్నట్లు, మరుక్షణం దూరంగా దీనత్వంతో నిలిచినట్లు, తన ఆజ్ఞ పొంది ప్రక్కకుర్చీలో కూర్చున్నట్లు అనిపించి "ఎంత అమాయకుడివి?" అని మనస్సా అనుకున్నది.

రాత్రంతా స్వర్ణకుమారి నిద్రలేకుండానే గడిపింది. తొందరగా

తెల్లవారాలి, వెంటనేవెళ్ళి ఆయన్ను చూడాలి, అని ఆందోళన కలిగించి కాని ఆ అంతర్గత ఆరాటంలోబాధ వ్యధలేదు. ఆనందము హాయి కలుగు తున్నది.

ఉదయం నిలువుటద్దంముందుజేరి యెంత శృంగారించుకున్నా తృప్తి కలుగుటలేదు. ఆఫీసుకు వెళ్ళాలనే ఆదుర్దా ఒకవైపు సవరింపులు మరోవైపు సతాయిస్తున్నవి. ధరించిన దుస్తులనే నచ్చక పూర్తిగా మార్చివేసింది. గోధుమవన్నె జాకెట్టుమీద కనకాంబరం రంగుచీరె ధరించింది. కెంపుల నెక్లెసును వేసుకున్నది. అలంకారాలు నిరాడంబరత లోనే అందాలను చిందిస్తున్నవి. దువ్వి చుట్టిన శిరోజాలను కొంత చెద ర్చింది. అది ఆధునిక అందం గాబోలు. ముఖమండలానికి దట్టంగా అద్దిన పౌడరును సిల్కుకచ్చీపుతో తుడిచి వేసుకున్నది. పొందుపడు తూనే అద్దంముందు అరగంటసేపు అలకరించుకున్నా సంతృప్తి కలుగ లేదు.

రెండుగంటలుముందు ఆఫీసుకు చేరింది. ఆఫీసు తలుపులు వోరగా వేసి వున్నవి. టయంకాదుగనుక నౌఖరింకా వచ్చివుండడు. ఆమె ఆఫీసు తలుపులుతెరచి ఆశ్చర్యపోయింది. హాలులోని ఒక యీజీ చైర్‌లో గంగరాజు నిద్రిస్తున్నాడు, శబ్దంకాకుండా పిల్లి అడుగులలో దగ్గరగా వెళ్ళిచూసింది. గాఢనిద్రలో నున్నాడు. నిద్రను చెదర్చ నొల్లక ప్రక్కనే నిలిచి చూస్తున్నది. ఫాలభాగంమీద జిలుగు జిలుగు స్వేదబిందువులు ప్రతిబింబిస్తున్నవి. ఆయనలోని తీవ్రకాంక్షలు ఆ బిందువుల రూపంగా గోచరిస్తున్నట్లున్నది. ముత్యాలవలె మెరుస్తున్న ఆ బిందువులన్నీ యేక కంఠంలో తమ గాథలను వినిపించుకోగోరు తున్నట్లున్నది. వాటిలోని నీడలు నోళ్ళుతెరచి వూపిరి సలుపకుండా మాట్లాడుతున్నవి. కాని వాటి భాష ఆమె కర్థమవుటలేదు. ఆ దృశ్యం నుంచి దూరమవుట కిష్టమూ లేదు.

ఆమె పిల్లి అడుగులతోనేవెళ్ళి టేబులుమీదనున్న వార్తాపత్రిక తెచ్చుకుని ప్రక్కనున్న మరో యీజీచైర్‌లో ఆసీనురాలై పేపరులోను పేజీలను తిరుగవేస్తున్నది. కాని యేపేజీలో చూసినా, ఫాలభాగంమీద

మంచుముత్యాలవలె స్వేదబిందువులతో శోభిస్తున్న ఆ ముఖమండలమే కనిపిస్తున్నది. తనకువలెనే ఆయనకుకూడా రాత్రంతా నిద్రలేదుకాబోలు. అనుకున్నపుడు జాలికలిగింది. పుస్తకాన్ని వక్షస్సుమీదవదిలి, నేత్రాలు మూసి అదే ఆలోచనలుచేస్తూ నిద్రదేవత ఒడిలో ఒరిగిపోయింది.

అరగంట తరువాత గంగరాజు మేల్కొన్నాడు. ప్రక్కకుర్చీలో పవళించి నిద్రిస్తున్న స్వప్నను చూసి విస్తుపోయాడు. ఆమెను చూస్తున్న కొంది చూడాలనిపిస్తున్నది. ఆమెకు యెదురుగా మామూలు కుర్చీ వేసుకుని, ఆమె వైపుచూస్తూ కూర్చున్నాడు. కపోలమీద నునుపులు దేలిన మృదుత్వం మెరుపులు గ్రక్కుతున్నది. ఉన్మాదివలె యేకాగ్రంగా నిర్భీతిగా కరువుదీర చూస్తున్నాడు. విషపసరుతో గూడినదృష్టి యేకాగ్రంగా యెదుటివారిమీద పడినపుడు వారి మనస్సుమీద వేవ్వుమీటినట్లవుతుంది. ఆ చూసేదృష్టిలో శక్తివున్నపుడు నిద్ర లోనివారుకూడా లేవకతప్పదు. ఆ దృష్టి ఒకనగ్నరూప వీపుమీదపడినప్పుడు వారు వెనుదిరిగిచూడకతప్పదు.

గంగరాజు చూపులు ఆమె ముఖంమీదనో హృదయంలో గుచ్చుకున్నవి గాబోలు నేత్రాలు తెరచిచూసి, చివుకుపాటుతో "మీరు నిద్ర లేచారా?" అంటూ ఆమె కుర్చీలోనుంచి లేచింది.

"నా యెదుట కూర్చున్నారెందుకు?" అని తిరిగి ప్రశ్నించింది. అందుకాయన దగ్గర చెప్పగల సమాధానంలేదు. ఆలోచనలనుంచి బయట పడి "నేను పరాజితుణ్ణి: మనస్సు వశంలోలేదు. ఏమిచేస్తే మిమ్ము గురించిన ఆశలు హృదయంనుంచి దూరమవుతవో తెలియక మరో వుపాయం తోచక బాధపడుతున్నాను. ఈ వ్యధతో నిసహాయుడనై బాధపడేకంటె సన్యసించి సాధువులలో గలసి దూరప్రాంతం వెళ్ళి పోతే బావుంటు ననిపిస్తున్నది." అని బరువు కంఠంతో వినిపించాడు.

"కోర్కెలు నశించినవారో జీవితంమీద విరక్తి కలిగినవారో సన్యసించితే శాంతి లభించవచ్చు. కాని తీరని కోర్కెలతో సన్యసించితే అశాంతితో బయలుదేరిన చోటికే తిరిగి చేరవలసివస్తుందేమో?" అన్నది.

"అశాంతితో అల్లాడేకంటె మృత్యు కుహరంలో జారబడుట మంచిది" అన్నాడు.

"ఆత్మ హత్య మరింత దోషమైందిగదా !"

"పిరికివారు ఆత్మహత్యకు భయపడినవారు - నిశ్వసించిన మాట లవి."

"అయితే నన్ను చూస్తూ వోర్చలేక ఆత్మహత్య చేసుకుంటే ఆ మహాపాపం నాకే సంక్రమిస్తుందిగదా ! అది సజ్జనత్వమా చెప్పండి!"

"మరి నన్ను యేమిచేయమంటారో మీరే సెలవివ్వండి." అంటూ హస్తాలు జోడించాడు.

"మాకు అనేక కార్యరంగాలను కల్పించి మార్గాలను చూపించి వెలుగులోకి నడిపించి, మీరు స్వయంగా అంధకారంలోకి పోవటం ధర్మంగాదంటాను."

స్వవిషయంలో అనివార్యంగా అంధకారమే లభ్యమౌతున్నపుడు చేయగలిగేదేముంది!"

"అంధుల సేవలో పుణ్య ఫలిత మెక్కువంటారు. మీకీ అంధ కారంలో ఆసనం కనిపించదేమోనండి." అంటూ ఆయన హస్తాన్ని బట్టి టేబులు యెదుటనున్న కుర్చీవద్దకు లాక్కెళ్ళి "వెనుకనే కుర్చీ వున్నది కూర్చోండి." అంటూ ఆయన భుజస్కంధాలమీద హస్త ద్వయాన్నివేసి అదిమి కూర్చో పెట్టింది.

ఆయన నిరుత్తరుడై కూర్చుండిపోయాడు. చుబుకంక్రింద చేయి వేసి పైకి యెత్తి కొంటెగా నవ్వుతూ "ఈ అంధకారంలో నేను కని పిస్తున్నానా?" అన్నది.

పసివానివలె ఆయన ముఖం చిన్నబోయున్నది. ఆమె మరింతగా నవ్వుతూ "పిరికివారిలో కోర్కెలు అధికంగావుంటవి. కోరినవి యెదుట కనిపించినప్పుడు భయంతో వణికిపోతుంటారు. ఉన్నవాటిని పొందటం, పొందిన వాటి ననుభవించటంకూడా ఒక విశేష నైపుణ్యం గంగరాజు గారూ." అంటూ ఆయన చుబుకాన్ని వూపింది.

అప్పటికి గంగరాజు తనలోని నిగ్రహాన్ని విడనాడాడు. ఆమె అరచేతిని తన ముఖమండలంమీదవేసి అదుముకున్నాడు. ఆమె ఆనందాన్ని అణచుకుంటూ "సాధుపుంగవులు అత్యాచారానికి తలపడుతున్నారే," అన్నది.

ఆయన అనూతం మీదకు లాక్కుని, శిరస్సును వక్షస్సుకేసి అదుముకుంటూ దీర్ఘ నిట్టూర్పు విడుస్తున్నాడు.

"నౌఖరొస్తాడేమో।" అన్నదామె.

గంగరాజుకు ఆ మాటలు వినిపించలేదు గాబోలు ఆమెను ఇంకా తన వడిలోకి లాక్కుంటున్నాడు. ఆమె రొమ్ములు ఆయన ముఖానికి మోటుకుంటున్నవి. నప్పుమువలె ఆ దుస్తులలోనున్న స్థనాలను కాటు వేశాడు.

"అబ్బ!" అంటూ ఆమె బలవంతంగా లేచింది. అస్తవ్యస్తమైన చీరెను సర్దుకుంటున్నది. నౌఖరు వస్తున్నట్లు దూరంనుంచే కనిపించాడు. గంగరాజు కుర్చీలోంచిలేస్తూ ఆదుర్దాతో "నౌఖరు వస్తున్నాడు తొందరగా తలసవరించుకుని ఆ పడకకుర్చీలో కూర్చోండి" అంటూ తాను పేపరుచేతబట్టి దూరంగావున్న పడకకుర్చీలోకి వెళ్ళిపోయాడు.

తప్పుచేసిన వారికి భయ మెక్కువ. ఇరువురు యెవరికి వారే చేతిలోని పత్రికలలో లగ్నమైనారు. కాని కీగంటగా చూపులు కలుసుకుంటున్నవి, ఆమె అధరాలమీది నవ్వురేఖలు ఆయన్ను రెచ్చగొడుతున్నవి.

గంగరాజు వుండలేక బయట తోటవైపు వెళ్ళాడు. తిరిగి అరగంటకు వచ్చినా నౌఖరు గదిలో యింకా పనులు సర్దుతూనే వున్నాడు. ఒకప్పుడు నౌఖరు కనిపించనందుకు బాధ పడేవాడు. నేడు యెక్కడైనా పోక గదిలోనే పనులు చేస్తున్నందుకు బాధపడుతున్నాడు. అవసరం వుపాయాలను వెదికిస్తుంది. వెంటనే అలమరలోని ఫ్లాస్కుతీసి మైలు దూరంలోవున్న ఉడిపీహోటలునుంచి కాఫీ టిఫెను తెమ్మని పంపేశాడు. ఆమె పేపరువైపు ముఖాన్నుంచి కోరగా ఆయన్నే చూస్తున్నది.

ఆయన దీర్ఘశ్వాసను విడుస్తూ నలువైపులా పరికిస్తున్నాడు. భయం దీరిన పసివాడు ఆ భయంకర వస్తువుతోనే ఆడుకొను ఆరాటపడునట్లు గంగరాజు మనస్సిప్పుడు ఆమె వైపు పరువులెడు తున్నది.

గజ దొంగనలె అటు యిటూ చూస్తూ ఆమె చెంతకు చేరి "ఏదో చదువుతున్నా రే!" అంటూ శిరస్సుమీద చేయివేసి నిమురుతూ ప్రక్కకు వంచి అధరాలమీద గాఢంగా చుంబించాడు.

మధురాలొలికించే కంఠంతో "సన్యసించే సాధువుల స్వభావమిలానే వుంటుందా?" అన్నది.

"సాధువులకు పూజారులకు అంతరం అంతగా వుండదు." అంటూ ఆమె మీదకు వాలిపోతున్నాడు.

"హద్దులులేకపోతే అనర్థాలు వాటిల్లుతవి. ఎవరైనా వస్తే.

కుర్చీలోని ఆమెను బాహువులతో బంధించి, తన ముఖాన్ని ఆమె వక్షోజాలమీదవేసి అటూ యిటూ రుద్దుతూ దంతాలు కర కరమని పిస్తున్నాడు!

"అబ్బ! వుండండి!" అంటూ ఆమె విడిపించుకో ప్రయత్నిస్తున్నది. ఆయన ప్రేమావేశాన్ని పట్టజాలక మోకాళ్ళ క్రిందగాను నడుము క్రిందగాను చేతులుదూర్చి యెత్తుకున్నాడు. ఆమె ఖిల ఖిల నవ్వుతూ కాలుచేతులు ఆడిస్తూ "ఏమిటిదంతా, దించండి!" అన్నది. లోపలరూమువైపు తీసుకెళుతున్నాడు. వివశురాలై బాహువులను కంఠానికిచుట్టి పాదాలను ఆడిస్తూ, క్రిందకు వాలబడి, విదిలించుకుని రొప్పుతూ "ఈ అఘాయిత్య మేమిటి?" అంటూ క్రోధాన్నభినయిస్తున్నది.

అధరాలను బిగబట్టి ఆకలిగొన్న దృక్కులతో తిరిగి ఆమెను బాహువులలోకి తీసుకోబోయాడు. కాని ఆమె దూరంగా వెళ్ళి నిలిచి కఠినమైన శబ్దాలతో "చలిపిగాను చిల్లరిగాను తయారు కాకండి, తొందరపాటు చెరుపుగా పరిణమిస్తుంది" అని మందలించింది.

ఆయన కట్టుబడిపోయినట్లు నిలిచి నిరాశతో చూస్తున్నాడు.

14. పరాజయం

సుభద్రా దేవిపుడు యెక్కడినుంచి విజయనగరం చేరినా కైలాస పతి యింటికే చేరుతున్నది. అక్కడనుంచే తన కార్యక్రమాన్ని నిర్వ హిస్తుంటుంది. మహిళామండలి కార్యక్రమాలన్నిటిని స్వర్ణకుమారికి వదిలిపెసి యిపుడు సలహాలు మాత్రమే యిస్తుంటుంది. మహిళామండలి నుంచి విముక్తిపొంది కైలాసపతి యింటిలోని తనగదికి చేరుతుంటుంది.

సుభద్రాదేవి తన యింటినందున్నన్నిరోజులు కోర్టు పనులకు వాయిదా వేస్తుంటాడు కైలాసపతి. ఏదో ఒక్క చిన్న విషయంమీద వారికి తర్కం బయలుదేరుతుంటుంది. గంటలకాలం వాదవివాదం జరి గినా అంతంకాదు. సుభద్ర పైచేయిగా కనిపిస్తుంది.

అనురాగ దృక్కుల బంపుతూ "నీవు తర్కపండితురాలవు. నీవు పురుషుడవై జన్మిస్తే బావుండేది." అన్నాడు కైలాసపతి. ఆమె చిరు నగవును చిలికిస్తూ హస్తాలు జోడించి "మహాజయా నేను పురుషుడనై విజయం పొందుటకంటె మీ ముందు స్త్రీనై ఓడిపోవటమే నాకు సమ్మతం" అన్నది సుభద్ర.

"మీకు తెలియని అజ్ఞాతమైన మార్పు నేడు మీలో కనిపిస్తున్నది. ఆ విషయాన్ని మీకు తెలియజేస్తే తిరిగి యీ ప్రకృతిసిద్ధ స్వభావాన్ని వికృతంజేసి పంతంమీద పట్టుదల వహిస్తారేమో!" అన్నాడు.

"ఏమి మార్పో చెప్పండి"

"పురుషజాతిమీదున్నపంతం కొంతకాలంనుంచి మీలో తగ్గి పోతున్నది. అది మీ ఆశయానికి విరుద్ధమైంది అన్నాడు.

ఆమె చిన్నబుచ్చుకున్న ముఖంతో "ఎంతటివారికైనా ఎక్కడో ఒకచోట పరాజయం తప్పదు. మీ పరిచయం ఆ తరువాత సన్నిహితం నన్ను బలహీనపర్చినమాట వాస్తవం. మీ ముందు మీలోపాటు మీ పురుషజాతినే గౌరవించాలనిపిస్తుంది. నాలోని ఆ ప్రకృతిసిద్ధ స్వభావం నన్ను జయించింది. ఆ యదార్థాన్ని వప్పుకోక తప్పదు.

"మీరు చాలామారిపోయారు. మీలోని పురుషద్వేషం అణగారి పూజాంకురం ప్రబలుతున్నకొద్ది ఆకర్షణ పెరుగుతున్నది. పరస్పర గౌరవ, ఆదర, అభిమానాలలో అద్వితీయమైన ఆకర్షణ వున్నట్లు నేడు అనుభవంలో తెలుసుకున్నాను. నేను పురుషుణ్ణయినందువలనో లేక నా శరీరంలోని సనాతన రక్తప్రసార ప్రభావంవలనో మీరు పురుషజాతిని యెంత బహిరంగంగా, కర్కశంగా విమర్శిస్తుంటే అంత బాధ కలిగేది. ఆ దూషణల దుమారమంతా నన్ను గురించే అయినట్లు నా మనస్సు వికలం చెందేది...." అంటుండగా మధ్యలోనే సుభద్ర కల్పించుకుని, ఆదుర్దాతో, "అదేమిటి కైలాసపతిగారు, మీరు నా అభిప్రాయాలను సర్వవిధాల సమర్థిస్తుండేవారు. అనేక సందర్భాలలో నా అభిమతానికి అనుగుణంగానే వుపన్యసించారు. అదంతా నటనంటారా!"

తటపటాయిస్తూ "యదార్థానికి అవి విశ్వాసంలో అన్నమాటలు కాదు. మీ అభిమానాన్ని చూరగొనాలని మిమ్ము ఆనందపర్చాలని తెలియని ప్రేరణ హృదయంలోని యేకోణంనుంచో వత్తిడి పెట్టింది. అంతేగాకుండా ఆధునిక నాగరికతా మోజు పేరిటవున్న మీ మాటలను కాదంటే అభ్యుదయ విరోధకుడనని అవహేళన చేస్తారేమోనని భీతితో మీ భావాలను నేను మాటలలో తిరిగి వినిపించాను."

"అదంతా కేవలం నా ముఖప్రీతికొరకు మాటాడినదేనా! ఇది ఒక విధంగా మోసమేమో!"

"మీలోని ఆనాటి భావాలకు యీనాటి భావాలకు విరుద్ధతున్నది. అది మోసంగాదని ప్రకృతి ప్రభావితమార్పుని అంగీకరిస్తూ నామాటలను మోసమని యెలా అనగలరు?"

"మానసికబలహీనత స్వభావంలోని నిజస్వరూపాన్ని ఋజువు చేస్తుంది. పట్టుదల, దీక్ష కట్టుబాట్లు యెంత కఠోరమైనవయినా ప్రకృతి ముందు యెప్పుడో ఒకనాడు విడిపోవుట తథ్యం. మానవుడు యెంత విజయం పొందినా ఆఖరి విజయం ప్రకృతిదికాదని యెవరనగలరు! నేను యే వ్యధతో అసంతృప్తితో బాధతో పురుషద్వేషినిగా అయ్యానో,

యే పదవీ కాంక్షతో. అధికార వ్యామోహంతో అధికార కాంక్షతో పది మంది మెప్పుల మోజులో అంధురాలనై పురుష ద్వేషినిగా అయ్యానో అని నేడు మీ సమక్షంలో మీ పరిచయంలో మీ ఆదరాభిమానాలలో ఎగిరి పోయినవి. స్త్రీ ప్రత్యక్ష ప్రకాశంలేని చందమామలాంటిదని నేడు అనిపిస్తున్నది. మిమ్మల్ని చూస్తున్నపుడు పురుషుడు స్త్రీకి సర్వకాలాలందు పూజనీయుడనిపిస్తున్నది. పురుషుని అడుగుజాడల్లో నడిచి మన్ననలందుటలోనే స్త్రీకియదార్థమైన ఆనందం కలుగుతుందనిపిస్తున్నది. మీ ద్వారా జీవితంలోని నిజమైన సత్యాన్ని తెలుసుకున్నాను." అంటుండగా కైలాసపతి మధ్యలో కల్పించుకుని "తమాషా మాటలతో నన్ను న్యూనత పర్చకండి" అన్నాడు.

"మీరలా భావించుటలోకూడా తప్పులేదు. కాని నేను మీ ద్వారా పూర్తిగా మారిపోయాను. ఇతరుల హృదయాలను పురుషులకంటె స్త్రీ అధికంగా అర్థంచేసుకుంటుంది. నా మనస్సులోని ఆలోచనలను మీరు పసిగట్టలేకపోయినా, మీ మనస్సును నేను అర్థంచేసుకున్నాను. నన్ను మనస్ఫూర ప్రేమిస్తూకూడా దూరదూరంగానే వుంటున్నారు. నన్ను మీ ఆవేశాలకు బలిచేయకుండా నిగ్రహంతో మనస్సులోని ప్రేమ పునాదులను పెంచుకుంటున్నారు. అంతా అర్థంచేసుకోగలిగాను కనుకనే మీ అధీనమైపోయాను. నాలోని గర్వం వ్యక్తిత్వం తుడుచుకుపోయినవి. నేడు మీ అధీనం కావాలని అంగ అంగము కోరుతున్నది కైలాసపతి గారు" అంటూ ఆయన చెంతకువెళ్ళి వక్షస్సుమీద చేతులువేసి శిరస్సు వాల్చింది.

వెంటనే ఆమె శిరస్సును వక్షస్సుకేసి అదుముకోవాలనిపించింది. కాని మరో ప్రవృత్తి నిరోధించింది, తనమీద వాలివున్న శిరస్సును చూస్తూ వుండిపోయాడు. ఆమెమీదున్న అపవాదుకలన్నీ వరుసగా మనస్సులో దొర్లుతున్నవి. పతితురాలుగా భావనగలిగి శరీరం జలదరించింది. పురుషులను నిర్లక్ష్యంచేస్తూ నిందిస్తూ, హేళనరూపంగా ఇచ్చిన ఆమె వుపన్యాసాలలోని నిర్వచనలు వరుసగా గుర్తుకొచ్చి, క్షుద్రతగా తోచి మనస్సు కళవళ పడుతున్నది. సిగ్గు బిడియాలు లేశమాత్రంగా

నైనా లేకుండా నిస్సంకోచంగా వివశతారహితంగావుండే ఆమె ప్రవర్తన కనులముందు కనిపించి హేయంగా తోచింది. తాను యింతకాలం ఆమె కొరకు ఆరాటపడిన వివరాలన్నీ హృదయంలో సుడులు తిరిగి కింపవడుతున్నాడు. కాని తన వక్షస్సుమీదనున్న శిరస్సును నెట్టివేయలేక వివశుడై అధోముఖంచేసి చూస్తున్నాడు. రేగిన ఆమె కురులు ఆయన చుబుకానికి తగులుతున్నవి. హెయిరాయిల్ పరిమళాలు కమనీయతను కల్పిస్తున్నవి. జలతరింపులు గగుర్పాటులు, క్షుద్రతలు, హేయతలు అన్నీ రెప్పపాటుకు మరుగునపడినవి. ఆ శిరోజాలనే చూస్తూ, వాలిపోయిన పైరులోని కాలిబాటవలెనున్న పాపడిని పరిశీలిస్తున్నాడు.

అయిదు నిమిషాల అనంతరం ఆమె శిరస్సును పైకెత్తి చూస్తూ "ఏమిటలా వున్నారు ? మీ విషయంలో నేనన్నమాటలు అబద్ధమా చెప్పండి ?" అన్నది.

వెనుకకు్కుంటున్నవానివలె "ఏ విషయాలు."

"నా విషయంలోని మీ ఆలోచనలు" అంటూ ఆయన చుబుకాన్ని బట్టి తన దృష్టిని ఆయన దృష్టికి సూటిజేసింది.

ఆ లాలింపులలో మత్తువుంది. మాటలలో మాధుర్యముంది. స్పర్శలో వేడితోగూడిన గిలిగింతలున్నవి.

"మీరు నిశ్చయించింది యదార్ధం" అన్నాడు.

ఇప్పుడామె వుత్సాహానికి ధైర్యం తోడ్పడింది. వెంటనే బరువు కంఠంతో "నిజంగా నేను మీ ద్వారా స్త్రీ నిజస్వరూపాన్ని ధరించాను కైలాసపతిగారు. గతాన్ని విస్మరించి పవిత్ర హృదయంతో మీకు ప్రేమపాత్రురాలనై, మీకు అంకితమైపోవాలని హృదయం కాంక్షిస్తున్నది. మీ సేవతో నా జీవితం తరిస్తుందని ఆత్మ ప్రబోధిస్తున్నది" అన్నది.

వెంటనే ఆమెను హృదయానికేసి అదుముకోవాలనిపించింది. కాని మనస్సులోని కొన్ని ప్రవృత్తులు నిరోధించినవి.

ఆమె శిరస్సుమీద చేయివేసి నిమురుతూ "ఒక్కమాటుగా వున్నత శిఖరంనుంచి క్రిందకు జారుట క్షేమంగాదేమో। మహిళాలోక సేవకు అర్పితంచేసిన నీ జీవితాన్ని సామాన్యుడనైన నావైపు మరల్చినందు వలన సంఘానికి గొప్ప నష్టం కలుగవచ్చు." అన్నాడు.

"అవి పట్టుదలతో నిర్ణయించుకున్న అభిప్రాయాలు. ఇవి స్వజనిత అభిప్రాయాలు. వీటిలోనే ఆత్మానందం కలుగుతున్నది. యేమార్గంలో ఆనందం కలుగుతుందో అదే మానవునకు ఆచరణీయు యోగ్యమవుతుందిగదా :"అన్నది.

"నిన్నటివరకు త్యాగం మహత్తరనీయమైందని, సేవ ఆదర్శనీయమైందని, నేడు స్వార్థపూరితసుఖం యోగ్యమైందని నిర్ణయించుట సమంజసమూ చెప్పండి" అన్నాడు.

ఆయన్ను అనునయంతో లాక్కెళ్ళి సోఫాలో కూర్చుండబెట్టి, తాను ప్రక్కగా కూర్చుని, ఆయన హస్తాన్ని తన హస్తాలలోవుంచి, అటు యిటు వత్తుతూ ఆకలిగొన్న దృక్కులను ఆయన దృష్టిలో బర పుచూ "ఆనాటి నా ఆశయాలు ఆవేశంలోనివి. వివేకులలో అలాంటి ఆవేశం జనించినపుడు విశిష్ట కార్యాలు సాధించబడుతవి. కాని ఆ యావేశం యెల్లకాలం వుండదు. నాలోని ఆవేశంద్వారా సమాజానికి మేలు జరిగిందో కీడు జరిగిందో చెప్పలేను. మీ పరిచయంతో నేను మారిపోయాను. మీ చూపులు నా హృదయ తంతువులమీద నూతన గీతి కాలాపనను మీటినవి. మీమధురవాక్కులు శ్రుతినికలిపినవి. హృదయం తరంగితమైంది. దృక్పథము మారిపోయింది. ఈ వైపు వూహలలో యింత తన్మయత్వపు మత్తు వుంటుందని మీ ద్వారా అనుభూతిని పొందాను" అన్నది.

ఆనందానికి బదులు ఆయన మనస్సు వెలవెల బోయింది. ఆమె చేతులలోని చేతిని తీసుకోవాలనిపించింది. కాని సాహసం చేయలేక పోతున్నాడు. ఇంతకుముందు అంతగా ఆకర్షించుటకు కారణమేమిటో ఆలోచిస్తున్నాడు.

ఆమె: ఆలోచనలలో పడిపోయారేమిటి?

ఆయన: ఏమున్నది? ఏమీలేదు?

ఆమె: ఒక్కమాట అడుగుతాను నిజం చెబుతారా?

ఆయన: అడగండి.

ఆమె: మీరు నన్ను మనఃస్ఫూర్తిగా ప్రేమించారా లేదా చెప్పండి.

ఆయన: ఆ విషయమే ఆలోచిస్తున్నాను.

ఆమె: వైజాగ్‌నుంచి కారులో వస్తున్నపుడు నన్ను గురించి యెంతో ఆదుర్దాపడ్డారు. ఆ నాటి మీ మనస్సులోని ఆలోచనలు అద్దములోవలె కనిపించినవి. ఆ విధంగా అపుడపుడు మీ ద్వారా కలిగిన అవకాశాలతో నా అభిప్రాయాలు తారుమారైనవి.

ఆ మాటలు వింటున్నపుడు ఆయన ముఖం మ్లానత చెందు తున్నది. అపరాధివలె ముఖాన్ని దాటుజేసుకో చూస్తున్నాడు. గుండెలు దడదడలాడుతున్నవి.

ఆమె ఆయన మౌనాన్ని చూస్తూ భరించలేక ఆదుర్దాతో "నా మాటలమీద విశ్వాసం లేదా కైలాసపతిగారు!" అంటూ ఆయన మరు కావిన్ని పుణుకుతూ అడిగింది.

మనస్సంతా ప్రశ్నలతో చీకాకు పడిపోతున్నది. ఆమె కార్య దీక్షలో వరువులెదుతున్నంతవరకు, స్వార్థత్యాగిగా వివేకిగా మహా వక్తగా కనిపించినంతవరకు, తన యెడల ప్రేమదృష్టిలేకుండా తనను కూడా సాంఘిక రాజకీయరంగాలలోకి లాగ ప్రయత్నిస్తున్నంతవరకు, ఆమె వున్నత శిఖరాలమీద వున్నట్లు తోచింది. ఆకర్షించింది. ఆమెను చూసినకొలంది విశిష్టతేజస్సు దృగ్గోచరమయ్యేది. అంగ సౌష్టవం తెప్పగొడుతున్నట్లనిపించేది. స్పర్శలో అద్వితీయమైన ఆహ్లాదం కలిగి మత్తు జనింపేది. ఎప్పుడూ ఆమె ప్రక్కనే వుండాలనిపించేది. ఆనాడు వైజాగ్‌నుంచి కారులోవస్తూ ఆమె అధరాలను చుంబించినపుడు సర్వాంగాలుపులకితమైనవి. ఆమె వక్షోజాలు తన శరీరానికి వత్తుతున్న

వుడు పరవశుడయ్యాడు. ఆ క్షణంలో కలిగిన ఆలోచన అద్భుతమైనవి. కావి ఆమె యెడలనున్న భయము భక్తి వివశుని జేసినవి.

నేడు ఆమె జ్ఞానుగా ఆ స్థానాన్ని విడనాడి ఆయన పాదపద్మాల ముందు తిష్టవేయను సంసిద్ధురాలైంది. ఆయన సేవకు అంకితం కాగోరింది. కనుక ఆమె యెడలనున్న భక్తి, భయము అదృశ్య మైనవి. గ్లామర్ పోయింది. అందుకే ఆమె ముందు వెల వెల బోతు న్నాడు. ఆమె దాపుకు చేరుతున్నకొంది దూరం కావాలనిపిస్తున్నది. ఆ నాటి తన చర్యలని ఆమె స్మృతికి తెస్తుంటే సిగ్గుతో కుంచించుకు పోతున్నాడు.

తాను అనాడు ప్రభావితుడైంది ఆమె అందానికా లేక కార్య రంగానికా, స్వార్ధ సుఖత్యాగానికా అని ప్రశ్నించుకున్నపుడు మనస్సు కల్లోలితమౌతున్నది. పురుషులను విమర్శిస్తూ, నిందిస్తూ, స్త్రీ సమాన త్వాన్ని, అధిక్యతను కోరుతూ తిరిగే ఆమె కార్యరంగం తనకు హాస్యా స్పదమైంది. ఆ కార్యరంగంలో అంకితమైన ఆమెది త్యాగంకాదు, వెర్రితనమౌతుంది. అయినా తాను ఆకర్షింపబడ్డాడు. ఆమె వెంట నడి చాడు. ఆమె మాటలనే వల్లించాడు. ఆమె స్పర్శానుభూతిలో పరమా నందాన్ని పొందాడు.

ఇది తన అంధత్వం కాదుగదా! అని అర్థంగాని ఆలోచనలో పిస్తుపోతూ పశ్చాత్తాపపడుతున్నాడు. ఆమె సన్నిహిత మౌతున్నకొంది దూరంగా గోరుతున్నాడు. అందుకుగల కారణాలు ఏమిటా తెలియవు.

ఆయన వివర్ణముఖాన్ని చూసి చేతిని విడిచిపెట్టి దీర్ఘ నిట్టూర్పు విడుస్తూ "భయపడవోకండి. పురుష స్వభావంకూడా విచిత్రమైంది. అమాయక స్త్రీలో సాహసాన్ని నింపి రెచ్చగొడతారు. ఆ తరువాత భయంతో ఆమెకు ఘోర అన్యాయాన్ని ప్రసాదిస్తారు. పురుష ప్రేమ ణలో నాశనమైన స్త్రీలు అసంఖ్యాకము. పురుషులకు దైవమిచ్చిన వర మది. అందులో వారికి బాధావుండదు పశ్చాత్తాపమూ వుండదు." అన్నది.

ఆ మాటలలోని ఘాటు సరిపోయిందిగా బోలు కైలాసపతి మన

ఇప్పుడు వెనక్కి తిరిగి ఆలోచించసాగింది. "అవును ఆమె మాట నిజం. పురుషుని సాహసానికి హద్దులుంటవి. స్త్రీ సాహసానికి హద్దులుండవు." అని మనస్సుకు వినిపించింది. ఆమెకు తానేదో అన్యాయం చేస్తున్నట్లు బాధకలిగింది. నవ్వటానికి ప్రయత్నిస్తూ "మీరు పొరబడుతున్నారు సుభద్రాదేవిగారు. నేను రెండురోజులనుంచి ఒక చిక్కుమారి వ్యవహారంలో వున్నాను. మీరు వచ్చినా ఆ పాడు వ్యవహారం నుంచి బయటపడలేక పోతున్నాను. ఓ ప్రక్క అదే ఆలోచన మరో ప్రక్క తలుపులు తీసివున్నందున యెవరైనా వస్తారన్న భయంతో అలా వున్నాను. మీరు అపార్థం చేసుకోవద్దు," అన్నాడు.

"ఏమయినప్పటికీ నా తరఫుగా ఫిర్యాదుండదు కైలాసపతిగారు." అన్నది.

నౌకరు టీ తీసుకురావటం. ఆ సమయంలోనే కోర్టునుంచి వచ్చిన గుమస్తా ప్రవేశించటంతో వారి సంభాషణ ఆగిపోయింది.

15. హనీమూన్ యాత్ర.

గంగరాజు వినయవిధేయతలతోను, అలౌకిక ప్రదర్శనతోను తన ఆశయాన్ని నెరవేర్చుకున్నాడు. స్వర్ణకుమారి పూర్తిగా ఆయన ఆధీనమయింది. ఆయన్నే వివాహమాడ నిశ్చయించుకున్నట్లు భూదేవి చెప్పినపుడు పెద్దదుమారం చెలరేగింది. ఈ అప్రతిష్ఠ భరించేకంటే ఆత్మహత్య మంచిదని విలపించింది. వింధ్యారాణి యెన్నోవిధాల వినతి చేసి స్వర్ణకుమారి నిర్ణయాన్ని మార్చలేక హృదయభారంతో మంచ మెక్కి ప్రాయోపవేశం ప్రారంభించింది. పద్మ ప్రయత్నాలుకూడా నిష్ప్రయోజన మయినవి. పద్మను చులకనచేసి దూత్కారంచేసింది. అవమానంతో బాధపడటానికి బదులు ప్రాధేయతలతో నగ్నసత్యాలను వినిపిస్తూనే వున్నది. కాని ప్రయోజనంలేక ఆఖరి వుపాయాన్ని ఆలోచించింది.

వసంతకుమార్ ప్రయత్నిస్తే ఫలితముంటుందని పద్మ విశ్వాసం.

"ఈ ఆపత్సమయంలో మీరు పట్టుబట్టి కుటుంబగౌరవం నిల బెట్టకపోతే చిన్నాభిన్నమవుతుంది బాబుగారు." అన్నది పద్మ.

"పేరుప్రతిష్టల వ్యామోహంకంటె, పట్టుదలలు అభిమానాల కంటె యుగధర్మం గొప్పది. ధర్మాన్ని పాటించుట సర్వశ్రేష్టం." అన్నాడు వసంతకుమార్.

"అర్థమయ్యేట్లు చెప్పండి."

"స్వర్ణ గొప్పగా చదివిన విదుషీమణి. తన సుఖమయ భవిష్యత్తును నిర్ణయించుకోగల వయస్సున్న శక్తివంతురాలు. ఆమె జీవిత విషయంలో స్వయంనిర్ణయాధికారం ఆమెకేవున్నది."

ఆవేశంతో "అంధత్వంతో అనర్థంవైపు వెళుతుంటె మన్నించటం మంచిదంటారా?" అన్నది పద్మ.

"ఏది అనర్థమో యెవరికితెలుసు? ఏమార్గంలో ఆమెకు ఆనందం లభిస్తుందో అదే ఆమెకు యోగ్యమైంది."

"గంగరాజు మోసగాడు, చరిత్రహీనుడు, కటిక కసాయివాడు. నేడు నాయకుడుగా ఖ్యాతి గాంచవచ్చు. కాని అతని అసలు తత్వాలు వికృతమైనవి. అతనిద్వారా అమ్మాయిగారి జీవితమే సర్వనాశన మవుతుంది. కనుక యీ ఆపత్సమయంలో మీరు కల్పించుకుని ఆమె మనస్సును మార్చండి.

"భయంకరమైన వరద అనేకమందికి నష్టాలను కలిగించవచ్చు. కాని కొంతమందికి ప్రత్యేకమయిన ప్రయోజనాన్నిస్తుంది. అలానే గంగరాజు యెలాంటివాడయినా, అందరిని మోసగించే స్వార్థిఅయినా ప్రేమించిన స్వర్ణను వుద్ధరించవచ్చు. కటిక కసాయివాడు ప్రేమించిన స్త్రీ ముందు అందరికంటె అధికంగా లొంగిపోయి ఆమె సుఖంకొరకు తన శక్తి నంతటిని వినియోగిస్తాడు, కనుక ఆ రూపంగా ఆమె అదృష్టవంతురాలు గావచ్చు."

"బాబుగారు, సహించరాని విషయాలలో సంతృప్తిని కలిగించా లని ప్రయత్నించుట భరించరాని విషయం. ఈ విషయంలో మీరు పట్టించుకుని అమ్మాయిగారి భవిష్యత్తును కుటుంబ గౌరవాన్ని రక్షించక పోతే జరిగే అనర్థం భరించరానిది."

"జరుగనున్న రంగాన్ని అపుజేయప్రయత్నిస్తే అంతకు మించిన అనర్థమే జరుగవచ్చు."

"అలాకాదు, మీరు గట్టిగా ప్రయత్నిస్తే అమ్మాయిగారి మనస్సు మారుతుంది."

"యౌవనప్రేమ అంతస్తులను అనర్థాలను గుర్తింపజాలని అగ్ని శిఖ వంటిది. అక్కడచేసే నిరోధప్రయత్నాలు వికృత ఫలితాల నిస్తవి. కనుక అక్కడ ఆశీర్వదించి ఆనందించటమే వుత్తమమవుతుంది."

"మీ నిగ్రహం భరింపరానిది బాబుగారు. ఒకవేళ అమ్మాయిగారి కోర్కెతో అలాంటి అనర్థం జరిగితే నేడు కళకళ లాడుతున్న యీ యింటికి యెంత అనర్థం జరుగుతుందో ఒక్కమాటు ఆలోచించండి. పెద్దమ్మగారిని చిన్నమ్మగారిని చూడగలమా చెప్పండి! వారి స్థితిని ఆలోచించయినా కాస్త బాధ్యత వహించండి."

"శిరస్సుమీద పడినపుడు భరించలేనివాటినికూడా భరించకతప్పదు. అది మానవత్వం పద్మా! మనం గీసినగీటుమీద స్వర్ణను నడువమనుట కూడా ధర్మంగాదు. ప్రకృతి మన పిడికిటిలో నిలువదు. కొన్నివేళ లందు జరిగే అనర్థాలను చూసికూడా ఆనందపడగల సహనం కావాలి. త్యాగంలో యదార్థమైన సుఖముంటుంది. స్వార్థంలో కృత్రిమ సుఖ ముంటుంది. హృదయ విశాలతలో ఉదాత్తతతోగూడిన తెంపువుంటుంది. తెంపులో తృప్తి, తృప్తిలో ఆనందము వుంటుంది. కనుక నీవు ప్రయ త్నించి అమ్మలోను పెద్దమ్మలోను త్యాగాన్ని, తృప్తినికలిగించి స్వర్ణను ఆశీర్వదించునట్లు చేయుటే మంచిది."

"అలా యెన్నటికీ జరుగదు బాబుగారు. ఇది మీ ద్వేషంలోని నిర్ణయం. చూ చూస్తూ తమ బిడ్డను యెవ్వరూ నరక కూపంలోకి తోయరు."

మందహాసంతో "నాకు ద్వేష మెందుకు పద్మా ?"

ఆమె తన పొరపాటుకు నాలుక కొరుక్కుంటూ "ఈ ఆందోళనలో పొరపాటున అనేశాను బాబుగారు. మా ముందు యేది జీవన్మరణ సమస్యగా నున్నదో అది మీకు ఆషామాషీ విషయంగా నున్నది. ఈ విషయంలో మీరింత అశ్రద్ధ వహించుట మంచిదిగాదు."

"ఈ ఒక్క విషయంలోనే నీవు చాలా పొరబడ్డావు. నాకు ద్వేషం యెవరియెడలాలేదు, ఇపుడామె గొప్పసాహసం చేయబోతున్నది గనుక సానుభూతి వున్నది. ఆమె యెడల నాకున్న సానుభూతిని నీవు అశ్రద్ధగా పరిగణిస్తే అది నా తప్పుగాదు."

స్వర్ణకుమారి తలిదండ్రులకి విషయం తెలిసినవుడు ఆవేశతులై వచ్చి, ఆమెను తమ యింటికి తీసుకెళితే యీ ప్రేమకలాపం అంతమౌతుందని ప్రయత్నించారు. "నాశవాన్ని మాత్రమే మీరు తీసుకు వెళ్ళగలిగేది." అని స్వర్ణ తన దృఢత్వాన్ని మరింతగా గనపర్చినపుడు, వారు వివశులై, అన్ని ప్రయత్నాలనుంచి హతాశులై, తెగతెంపులుచేసుకుని, తమబిడ్డ కానేకాదనుకుంటామని నిట్టూర్పుతో వెళ్ళిపోయారు.

భూదేవి తను యేవూహలతో స్వర్ణను వెంటనిడుకొని విజయనగరం ప్రవేశించిందో ఆ మనోరధం విఫలమవుటేగాక వికృతం సంభవించింది. అన్నివైపులా నిరాశకలిగింది. అందరూ తన మాటను అక్షరాలా ఆదరిస్తారు. తనను దేవతగా పూజిస్తారు. కాని ముఖ్యమైన అసలువిషయంలో వసంతకుమార్, స్వర్ణకుమారి తనను నిర్లక్ష్యం చేశారు. అది ఆమెకు భరించరాని విషయం.

ఇతరులమీద మమతలు పెంచుకోవటం మహా అపరాధమని, తన సంపత్తిని యే ధర్మసంస్థకో చేయుట మంచిదని, శేష జీవితాన్ని భక్తిలోగడిపితే ముక్తి లభిస్తుందని, అంటూ భూదేవి వెళ్ళిపో ప్రయత్నించింది.

"పెద్దమ్మగారు, యీ సమయంలో మీరు వెళ్ళిపోతే యీ కుటుంబం యెలావుంటుందో విచారించండి. ఇలాంటి కష్టసమయంలో

నిలిచి యెదుర్కొని ఒక ఒడ్డుకు చేర్చవలసిన బాధ్యత మీమీదున్నది అమ్మగారు." అని ప్రాధేయపడింది పద్మ.

భూదేవి విరుద్ధకంఠంతో "నేను యెవరికొరకు యిల్లువాకిలి వదలుకుని యిక్కడ తపస్సు చేస్తున్నానో వాళ్ళే నన్ను నిర్లక్ష్యం చేస్తున్నపుడు, వారికివారే స్వతంత్రులై వారి నిర్ణయాలకు వారే తన్మయులవుతున్నపుడు, నేను వారికి భారంగా యిక్కడెందు కుండాలి!"

"అమ్మాయిగారి అమాయకత్వాన్ని మీరు క్షమించకపోతే యింకెవరు క్షమిస్తారు అమ్మగారు! మీరు వెళ్ళటం జరిగితే, ఇంతకాలంచేసిన మన శ్రమ వృధా అవుతుంది. అసంతృప్తిలో వహించే ధైర్యం మంచి ఫలితాన్నిచ్చితీరుతుంది. మీ రిచటినుంచి కదిలితే జరిగే అనర్థం తిరిగి యెవరిద్వారానూ యెన్నడూ పూర్తికాజాలదు. కనుక వెళ్ళేయత్నం విచారించకండి అమ్మగారు." అంటూ యెన్నోవిధాల నచ్చజెప్పి బలవంతంతో భూదేవి పయనాన్ని రద్దుచేయించింది పద్మ.

పద్మ దాసిఅయినా, తన వినయంతో కార్యకుశలతతో అవిరళ శ్రమతో అందరను మెప్పించగలిగింది. నొక్కిచెప్పి నప్పించగల చనువును ప్రతిఒక్కరిముందు పొందింది. కాని స్వర్ణముందు విఫలమొందింది. అక్కడ ఆమెమాటకు విలువలేదు.

వసంతకుమార్ ప్రయత్నిస్తే తన మాట నెగ్గుతుందని విశ్వాసమున్నది. కాని ఆమెను సమర్థించుట సమంజసమని ఆయన భావిస్తున్నాడు. పద్మ ఆయనముందు నొక్కి చెప్పలేకపోతున్నది.

ప్రేమప్రవాహంలోపడి కొట్టుకుపోతున్నవారికి ప్రక్కనున్న తరంగ తపతపలు వినిపించవు. ఇంటిలోనివారి బాధ కనిపించదు.

స్వర్ణకుమారి కిపుడు యింటివద్ద క్షణంకూడా వుండబుద్ధి పుట్టుటలేదు. ఆఫీసు స్వర్గంగా గనిపిస్తున్నది. గంగరాజుతో కలిసి మాట్లాడుతుంటే, దినము క్షణంగా గడిచిపోతున్నది. సంఘాలకు సమితులకు వెళ్ళుటకూడా మరచిపోయారు. మధ్యలో యేకార్యకర్త వచ్చినా, గ్రామనాయకులొచ్చినా వారికి చీకాకు కలుగుతున్నది.

ప్రేమోన్మాదములోని వారికి ప్రారంభపు రోజుల్లో వున్నచోట వుండబుద్ధిగాదు. బయటవుంటే భయంగా చీకాకుగా వుంటుంది. గదిలో వుంటే అరగంట తరువాత వూపిరిసలుపదు. ఏమేమో తలంచియూరులు వేయాలనిపిస్తుంది. కాని టూరులోకూడా కనపడే ప్రజల చూస్తుంటే చీకాకు కలుగుతుంటుంది. ఎన్నివిధాల అనుభవించినా ప్రేమికులలోని కాంక్షలు యింకా తీవ్రరూపం దాల్చి ఆవేశపడుస్తుంటవి. అలాంటి ఆవేశంలోని వారి కార్యాలు పదువులెత్తిస్తుంటవి. చూసేవారికి పెద్దూరాన్ని యేవగింపును కలిగిస్తుంటవి.

స్వర్ణ గంగరాజు హనీమూన్ ట్రిప్పులు యెన్నో వేశారు. సింహాచలంకన్నా, కాశీ కలకత్తాలకన్నా నిర్జనప్రాంత అరణ్యాలవైపుచేసిన యాత్రలే వారికి మన స్తృప్తిని కలిగించినవి. క్రూరమృగ భీతినిగొలిపే అరణ్యప్రాంతాలలో నిండు వెన్నెలరాత్రులెన్నో నిర్భీతిగా గడిపారు. హరోశ్చాదిత మైదానంమీద స్వర్ణని ఆయన వడిలో శిరస్సుంచి గగనంవైపుచూస్తుంటే, మబ్బుల్లోగుండా శశిధరుడు తొంగిచూస్తున్న దృశ్యం గిలిగింతలు పెట్టినట్లనిపించింది. తన నిర్ణయాన్ని యింటిలోని వారు నిరోధిస్తున్నట్లే, అనంత ఆకాశంలోని స్వేచ్ఛావిహారియైన చంద్రుని మబ్బులు అడ్డుకుంటున్నట్లు తోచింది. ఆ నిరోధాలన్నిటిని త్రెంచుకుని స్నిగ్ధరూపంలోని చంద్రుడు యెంతసేపటికి బయట పడతాడాయని యేకాగ్రంగా చూస్తున్నది. వరుసగావచ్చి చేరుతున్న చిలిపి మబ్బులను యెదుర్కొనుటలో విసిగిపోయి గాబోలు మబ్బులను చీల్చుకుని బయటపడ ప్రయత్నిస్తున్నాడు. కాని ప్రయత్నం అంత సులభంగాలేదు.

ఆమె కురులలోకి అంగుళీయములను దూర్చి కెలుకుతూ "మౌనం దాల్చి అలా చూస్తున్నారేమిటి?" అని ప్రశ్నించాడు గంగరాజు.

"ఆ పాడుమబ్బులు చుట్టుముట్టుతుంటే పాపం ఆ రేరాజు బయట పడటానికి యెంత ప్రయాసపడుతున్నాడో చూడండి!" అన్నది స్వర్ణ.

గంగరాజు గలగల నవ్వేశాడు.

ఆయన హస్తాన్ని నిమురుతూ "నవ్వుతారేమిటి ?" అని ప్రశ్నించింది.

"నీ పొరపాటుకు నవ్వుతున్నాను. ఆ రేరాజు టక్కరివాడు. ప్రేమికులను కవ్విస్తుంటాడు. ఆనంద మత్తులో మునకలు వేస్తాడు. గెంతులాటలాడిస్తాడు. ఆశాసౌధనిర్మాణానికి ప్రేరణ నిస్తుంటాడు. నిత్య నూతనత్వంతో మధురీకృతం చేస్తుంటాడు. పొరపాటున ఆ ప్రేమ నాటకంలో కాలుజారి పడితే హేళనచేస్తాడు. కవ్వించి యేడిపిస్తాడు. హృదయంలో మంటలు రగిలిస్తాడు, భరించలేని బాధలమధ్యకు నెట్టి వేస్తుంటాడు. వ్యథాభరిత హృదయంతో విలాసగీతికను పాడుతుంటే వంతవాయిద్యాలను వినిపించి స్థాయిని అగ్రానికి లాగుతాడు. ఇంకా జీవించటమెందుకు. అని అవహేళనచేస్తాడు, ఆత్మహత్యవైపుకు తొంగి చూస్తే వీల్లేదంటూ మృదుమధుర స్మృతులను హృదయంమీదికి వెద జల్లుతుంటాడు. జీవచ్ఛవంలా బ్రతుకమని ఆశీర్వదిస్తూ రెండోవైపు తిరిగి హేళన చేస్తుంటాడు. నవ్వేవారిని ఆనందపర్చుట, యేడ్చేవారిని మరింత దుఃఖపెట్టుట ఆయన అసలు స్వభావం. ఇపుడాయన నీ వను కున్నట్లు మబ్బులతో పోరాటం సలుపుటలేదు. తెరచాటునుంచి కొంటెగా చూచువారివలె మబ్బులచాటునుంచి మనలను చూస్తున్నాడు".

"చాటునుంచి చూడవలసిన పనేముంది ?"

"నీ మీద యీర్ష్యపడి చాటునదాగి చూస్తున్నాడు."

"నామీద యీర్ష్యెందుకు ?"

"అపురూప సౌందర్యంతో ఆకాశంలో విహరించే నాకు పోటీగా నన్నుమించిన అందాల రాణిగా భూలోకంలో ద్యోతితమవుతున్న యీ చిన్నారి యెవరా. అని యీర్ష్యపడి మబ్బులలో దాగి చూస్తున్నాడు.

"అబ్బ ! వేళాకోళం చేయకండి."

తన వడిలోని ఆమె శిరస్సును పైకెత్తిపట్టి చుంబించి "వేళా కోళంగాదు స్వర్ణా. నిజంగా ఆ జాబిల్లి నిన్నుచూసి సిగ్గిలుతున్నదంటే

ఆశ్చర్యంగాదు. నేను జన్మజన్మల పుణ్యఫలితంగా పొందిన అదృష్టం యిది." అంటూ ఆమె శిరస్సును పట్టి వూపాడు.

ఆకస్మికంగా ఆకాశంనుంచి ఒక తోకచుక్క జారి పృథ్విని ఆలింగనం చేసుకున్నది.

ఆమె భయవిహ్వాలురాలై "అదేమిటి, మనకు దగ్గరలో పడి నట్లున్నది" అన్నది.

ఆయన తేలిక భావంతో "ఆ మిణుకు మిణుకు మంటున్నవన్నీ శశిధరుడు తనలోకంలో క్రమబద్ధంగా వెలిగించుకున్న నూనె దీపికలు. అందులో ఒక ప్రమిద గాలికి వరిగినందున అందున్న వత్తి ఆ వెలుగు తోనేజారి పృథ్విమీదకు రాలి వుంటుంది."

ఆమె వ్యంగ్యంగా "మీ కల్పనలో వాటిని చంద్రుడుని నిర్మించు కున్న విద్యుద్దీపాలుగానైనా చేయండి మహాశయా."

"గాలిలో వెలిగే ప్రమిద ద్వీపాలే రెపరెపలాడుతూ దూరానికి మిణుకు మిణుకు మంటవిగదా''

అడివిలోని ఒక నక్కకూతవినిపించి స్వర్ణ గాభరాపడింది.

"అది నక్కకూత దానికింత భయ మెందుకు ?"

"క్రూరమృగమైతే మనమేం చేయగలం !" అంటూ ఆయనకు కరుచుకుపోయింది.

"తుపాకివుండగా మనకేమిభయం ?" అన్నాడు.

"క్రూరమృగం మీదకు వచ్చినపుడు, ధర్మయుద్ధం పేరుతో కారు దగ్గరకెళ్ళి తుపాకి తెచ్చుకొమ్మని టయమిస్తుందా !"

ఆమెను బాహువులలో బిగించుకుంటూ "అపారమైన ప్రేమ సాగరంలో మునకలువేస్తూ ముగ్ధతలో తనను తాను మర్చి నీ ప్రేమలో ఐక్యమై వుండగా మృత్యువాత బడితే నా జీవి తమే ధన్యమవుతుంది. అది అందరికీ లభ్యమయ్యే సామాన్య అదృష్టం కాదుగదా !" అన్నాడు.

ఆయన అధరాలమీద చేయివేసి మృదువుగా అదుముతూ

"అలాంటి మాట లనకండి. మీరు లేకపోతే నేనేమి కావాలి? మీరు కేవలం నా ప్రియులుమాత్రమేగాదు, ప్రజాసేవకులు, ప్రజానాయకులు. ప్రజలకు మీరు చేస్తున్న సేవ మరెవరు చేయగలరు? అలాంటి దుస్సంఘటన జరిగితే ఆ మృగదేవతముందు నేను హాజరై నన్నే అర్పించుకుని మిమ్ము విడువమని కోరతాను."

"నీవులేని యీలోకంలో గంగరాజు ఒక్కక్షణంకూడా వుండజాలడు స్వర్ణా!"

"మీరులేని నా అస్థిత్వం అనవసరం, అప్రయోజనం. నేను లేకుండాకూడా మీ అవసరం సంఘానికి యెంతోవుంది. మీరు కేవలం నా ప్రియులుగా నాలో అంతం గావటానికి వీలులేదు. నా వియోగం ద్వారా పొందే వ్యధాప్రేరణలో లోకోద్ధారకుడవుగా ఖ్యాతిగాంచాలి."

"ప్రేమకు వుదారత విరుద్ధమైంది. ప్రేమోపాసకుడు పరమస్వార్థి. తన సర్వస్వాన్ని తన ప్రియురాలుకు దప్ప అన్యులకు అర్పించలేడు. నాలో, నీవే ప్రవేశించి ప్రతిబింబిస్తున్నపుడు నీవులేనిది, నీవుకానిది నేను యేదీ చేయలేను. నీవు లేనపుడు నాకంటే బాధితుడు, దరిద్రుడు, హీనుడు, వ్యధితుడు, అప్రయోజకుడు యింకెవరుంటారు. అలాంటి నేను నీ తరువాత వ్యధితజాలలలో నిలిచి విలాపగీతిక నాలాపించుటకంటె చేయగలిగిందేముంటుంది! ఆ బాధలు నేను భరించలేను. నీ తరువాత నేను జీవించలేను. నన్ను క్షమించు స్వర్ణా!" అంటూ ఆమె వక్షస్సుమధ్య ముఖాన్నుంచి అదుముకుంటున్నాడు.

ఆయన నయనాలనుంచి వలుకుతున్న అశ్రువులు ఆమె గుండెలమీద వెచ్చగా తొణుకుతున్నవి. గొప్ప ఆపత్తి సంభవించినట్లు ఆమె భయకంపితురాలై అమాయకంగా పలపించసాగింది.

"ఇదేమిటి స్వర్ణా, చూడు, ముఖం పైకెత్తు" అన్నాడు. ఆమె దుఃఖాన్ని బిగబట్టి వెగిలీ వెగలని కంఠంతో "బాధలు యెంతటివైనా భరిస్తూ జీవించటం మానవత్వం. నా కొరకని మీరు చనిపోవటానికి వీలులేదు, మీరు జీవించి తీరాలి" అంటూ ఆమె తిరిగి దుఃఖించసాగింది.

ఆయన తీక్షణమైన స్వరంలో నవ్వును మితంజేసి "మన కలాంటి ఆపత్తి యేమీరాలేదు, రాదు. మనయిరువురం బ్రతికేవుంటాము. కల్పిత వూహలో అంతదూరం వెళితే యెలా? ముఖంపైకెత్తి యిటు చూడు, ఏ మృగమూ రాలేదు యెందుకీ భయం" అంటూ ఆమె శిరస్సును పైకియెత్తి ఆమె ధృక్కులలో తన ధృక్కులను కలుప ప్రయత్నించాడు.

ఒక్కమాటుచూసి, సిగ్గిలుతూ చేతులలో ముఖాన్ని దాచుకుంటూ నవ్వసాగింది.

ప్రచండ తుఫాను తరువాత తీవ్రమైన యెండకాచి నట్లున్నది యిరువురి మనస్సుకు.

"సినిమారీలులోవలె ఫట్టుమని పదినిమిషాలలో దుఃఖాన్ని ఆతరువాత సుఖాన్ని తమాషాగా కల్పించావు" అన్నాడు.

"అబ్బ నాకిపుడు భయం పోయిందండి. నన్ను నేను మర్చి నిజమైన దుఃఖంలో మునిగిపోయాను."

ఆమె చుబుకాన్ని పుణుకుతూ ముద్దిడుకుంటూ 'మనలను యెవ్వరూ వేరుచేయజాలరు. ఏలోకానికయినా జంటగానే పయనిస్తాము' అన్నాడు.

"ఆషామాషీగా అన్నవి నిజమైనట్లు భ్రమనొంది భయంతో వణికిపోయాను. అలాంటి దుష్టసమయం యెన్నటికీ రాగూడదని భగవంతుని ప్రార్థిస్తున్నాను" అని భయందీరిన కంఠంతో అన్నది.

16. ప్రేమ కానుకలు

స్వర్ణకుమారి గంగరాజుతో యెంత అన్యోన్యంగా కలిసిపోయి ఆనందాన్ననుభవిస్తున్నదో అంతదుఃఖాన్ని పొందుతున్నది తన యింటికి చేరినపుడు.

"నీవు బిడ్డవుగాదు, మేము నీకు తలిదండ్రులమూగాము" అంటూ

ఆఖరి తెగతెంపులమాటలు వినిపించి వెళ్ళిపోయారు తలిదండ్రులు. భూదేవి ఆగ్రహరాలై అనేకవిధాల నచ్చజెప్పి, పోరాడి విసిగివిముఖతతో రుసరుసలతో కృశిస్తూ వుంటున్నది.

'కళకళలాడుతున్న యింటిలో యీదుర్దశ సంభవించుట భగవత్ సిద్విలాసం గాబోలు' అంటూ తనలో తానే దుఃఖిస్తూ మంచమెక్కి రోజులు లెక్కిస్తున్నది వింధ్యారాణి.

తనకు తోడుగా నీడగా వుండుటకని తన యింటినుంచి తనతో వచ్చి యింత దీర్ఘకాలంగా సహనమూర్తిగా సేవాకాంక్షగా త్యాగనిధిగా వుంటూవచ్చిన పద్మ నిష్కర్షగా పోరాడింది. అపమార్గాన పోయి అందరినీ శాశ్వతాంధకారంలోకి తోయగల హక్కు తనకు లేదని హెచ్చరించింది. అనూయకత్వంతో వయస్సులోని ఆవేశంలో రత్నాలహారమని గర్విస్తూ ధరించి ఆ తరువాత అది గాజుముక్కహారమని తెలిసినపుడు జీవితమే అంధకారమవుతుందని బోధించింది. నీ మూర్ఖత్వం నిన్నేగాక తరతరాలుగా యీ యింట వస్తున్న ఖ్యాతిని మంటగలుపుతుందిగనుక వివేకంతో విచారించుకొమ్మని విజ్ఞప్తిచేసింది. ఈ యింటిలోని పవిత్ర ఆత్మల నన్నిటిని క్షోభపెట్టిపోతే నీవు పొందేది మహాదుఃఖమే అవుతుందని శపించింది. నీవు యెవరిమోజులో అంధురాలవై పోయావో ఆయన చరిత్రను ఒక్కమాటు నిర్మలహృదయంతో ఆలోచించుకొమ్మని సలహానిచ్చింది.

ఇపుడు స్వర్ణకుమారి విషయం యెవరూ పట్టించుకొనుటలేదు. తనను చూడటానికి యిష్టంలేక గాబోలు తను యెదుటపడినపుడు వారు మరోవైపుకు తిరుగుతున్నారు. తనయెడల పూర్తిమౌనం ధరించారు. అందువలన వారిలో యే ఒక్కరిని యే విషయంలోను సంప్రదించగల అవకాశం లేదు.

ఈ లోకమంతా యేకమై యెదురు తిరిగినా తాను గంగరాజును వివాహమాడుట నిశ్చయము. కనుక తన కోర్కెను మన్నించి వివాహానికి సమ్మతిస్తారో లేక శాశ్వతంగా తమనుంచి దూరమై వెళ్ళిపోమం

టారో ఆఖరిసారిగా అడిగి స్పష్టంగా తెలుసుకోవాలనివుంది. కాని అడుగలేకపోతున్నది.

ఈ సమస్య విషయంలో వసంతకుమార్ అభిప్రాయమేమిటో కూడా తెలియదు. ఒకప్పుడు ఆయనతో అతి చనువుగా సన్నిహితంగా వుండేది. గంగరాజుతో మైత్రి పెరిగినకొద్దీ ఆయన ముందుకు పోగల ధైర్యం సన్నగిలింది. ఒకానొకప్పుడు గంగరాజును ఆయన ముందు తాను విమర్శించింది. అందుకే నేడు మరింత బిడియంతో ఆయనవైపు నడువలేక పోతున్నది.

ఆమె అసహాయత గంగరాజుకు తెలియందిగాదు, ఎప్పటి కప్పుడు కావలసిన ధైర్యసాహసాలను కల్పిస్తున్నాడు. ఆర్భాటాలు లేకుండా ఆమె సమ్మతితోనే రిజిష్టరు వివాహ విధానం ననుసరించి, వివాహం జరుపుకున్నారు.

వివాహాల రిజిష్ట్రారు స్పెషలుఫీజుతో తమ యింటికే (మహిళా మండలి ఆఫీసుకే) వచ్చాడు. ఆయన రిజిష్టరు రికార్డుతోపాటు బిళ్ళ బంట్రోతుకూడా ప్రవేశించాడు. స్వర్ణ గంగరాజుల తరఫు యిరువురు దూరపు సాక్షులు హాజరయ్యారు. సంతకాలలో నాలుగుమాటల ప్రమాణాలతో వివాహతంతు ముగిసింది. మంత్రతంత్రాలు లేవు. ఆశీర్వాదాలు అసలేలేవు. వేడుకలకు అవకాశంలేదు.

స్త్రీ మనస్సులో యే మూలనో అబలత్వం దాగివుంటుంది. రిజిష్ట్రారు సాక్షులు వెళ్ళిపోయారు. గదిలో గంగరాజు స్వర్ణకుమారి మిగిలారు. అనేక ఆర్భాటాలతో ప్రయాసలతో వేడుకలలో ఆచారాలతో యెంతోమంది సమక్షంలో వేల వ్యయంతో జరిగే వివాహం పదినిమిషాలలో నిశ్శబ్దవాతావరణంలో జరిగిపోయింది. ఆమె మనస్సులో యేమేమి దాగివున్నవో ముఖాన కారుమేఘాలు క్రమ్మినవి. దుఃఖం పొర్లిందిగాబోలు గుండెలు దడదడలాడినవి. సోఫామీద పడి విలపించసాగింది.

గంగరాజుకు అర్థంగాక గాభరాపడుతూ 'ఏమిటి, ఏమి జరిగింది స్వర్ణా?' అంటూ ప్రక్కనజేరి తెలుసుకో ప్రయత్నించాడు,

అరగంట యేడ్చి కన్నీరు యేకధారగా కార్చాక భారంతగ్గి తేలిక పడిందిగా బోలు అశ్రువులను అద్దుకుంటూ బొంగురుగొంతుతో 'ఏమీ లేదు' అన్నది.

'ఇది నాపాలిటి అన్యాయమే అవుతుంది. నా అపరాధమేమయినా వుంటే నన్ను శిక్షించు — నన్ను క్షమించు స్వర్ణా' అని విచార సూచకంగా అన్నాడు.

ఆమె వెంటనే లేచి శిరస్సుమీద చేయివేసి నిమురుతూ 'నా మనస్సు బాగుండలేదు. మీరు అటువెళ్ళి కుర్చీలో కూర్చోండి' అని నిరాసక్తతతో అన్నది.

మరోమాటు అడుగను ధైర్యంచాలక, పిచ్చివానివలె చూస్తూ దూరంగావెళ్ళి కూర్చుని కోరగా ఆమె ముఖాన్ని పరిశీలిస్తున్నాడు.

ఆమె సోఫామీద వొరగలబడి నిద్రపోయింది. మరునాటికి ఆమెలో రవంత స్థిమితం చిక్కింది. కాని తానుగా సంభాషణ కుపక్రమించలేకపోతున్నది. పలుకరిస్తే కోపమొస్తుందనే భయంతో ఆమెకు దూరంగానున్న కుర్చీలో కూర్చుని శిరస్సు అధోముఖంచేసి కీగంటగా ఆమెవైపు చూస్తుంటాడు.

"మీరలా మౌనంగా వున్నారేమిటి ?" అని ప్రశ్నించింది"

"పలుకరించాలనివుంది. ధైర్యంచాలక వూరుకున్నాను."

"నన్నుజూసి భయపడటమెందుకు ? వైభవోపేతంగా వేల జనాభాలో జరుగవలసిన వివాహం గదిలో గుట్టుచప్పుడిగా జరిగి పోయింది. ఆశీర్వదించుటకయినా ఒక్కరులేకపోయారు. జీవితంలో ఇది కూడా ఒక దురదృష్టమేమోనని మనస్సు వికలం చెందింది."

"భగవంతుని ఆశీర్వాదం అన్నిటికంటె వున్నతమైంది, పవిత్రమైంది. ఆ భగవంతుని ఆశీర్వాదంతోనే మన ఆశయం నెరవేరింది."

"కల్పించుకునే తృప్తిలో అందరూ యదార్ధ ఆనందాన్ని పొందలేరు."

ఆమెలోని వుదాసీనతనుచూస్తూ మారు పలుకలేకపోయాడు.

ఆమె అంతర్గత ఆలోచనలతో విసిగిపోయింది. తన వారందరి మీద ద్వేషాన్ని కల్పించుకున్నది. వ్యక్తిత్వం కలిగి తన మంచిచెడ్డలు తెలుసుకుని తన జీవితభవిష్యత్తును తాను నిర్ణయించుకుంటే సహించలేని దలిదండ్రులను మేనత్తలను యెందుకు మన్నించాలి. వారి ఆశీర్వాదాలకొరకు యెందుకు విచారపడాలి! అని వారిని నిర్లక్ష్యంగా చిత్రించుకుని తృప్తిపడింది. ఇక వారి చాయలకు పోగూడదని, వారిని విస్మరించుటే శ్రేయస్కరమనికూడా నిర్ణయించుకున్నది. ఇపు డామెలోని దుఃఖం మాయమయింది. ఉత్సాహం కలిగింది. ఒక్కమాటు శిరస్సు పైకెత్తి గంగరాజువైపు ప్రేమభరిత దృక్కులబరపింది.

ఆ దృక్కులతో ఆయన మనస్సులోని కళవళం యెగిరిపోయి వుత్సాహ భరితుడయినాడు,

ఆత్మబంధువులందరిమీద విరక్తి కలిగిందిగాని వసంతకుమార్ విషయంలో మనస్సు తటపటలాడుతున్నది. ఆయన అభిప్రాయాన్ని తెలుసుకోవాలని ఆదుర్దా కలుగుతున్నది. వారిలోనివాడే గనుక వారి అభిప్రాయాలే వుంటవనిపించింది. అయినా వుత్తరం వ్రాయాలని వుత్సాహపడింది,

"పూజనీయ బావగారికి,

వందన సమర్పణతో వ్రాయునది. నా జీవిత భవిష్య నిర్ణయంలో నేను చేసిన సాహసంద్వారా పెంచినవారికి కన్నవారికి దూరమయ్యాను. పవిత్రమైన ప్రేమలోని పట్టుదల సాహసము యెంత కఠోర రూపంలో వుంటవో అనుభవంలోదప్ప అర్థంగావు. ప్రేమలో అపరోధాలు కలిగినపుడు యీలోకంలోని సర్వము తుచ్ఛమవుతవి. ప్రేమ విజయంలో సర్వస్వాన్ని కోల్పోయినా సహించవచ్చుగాని, ప్రేమ పరాజయంలో జీవితమే వ్యర్థమవుతుంది. ప్రేమించిన వ్యక్తిని పొందుటలో మీ అందరికీ దూరంగావలసి వచ్చుట నా దురదృష్టంగా భావిస్తున్నాను. నిన్న నా వివాహం గంగరాజుతో జరిగిపోయింది. రిజిష్టరు

వివాహం చేసుకున్నాను. అంత వున్నతకుటుంబంలో జన్మించి, మొన్నటివరకు అదృష్టదేవతనుగా మెలిగిన నేను, నిన్న కేవలం యిరువుర సాక్షుల సమక్షంలో సంతకాలరూపంగా వివాహం జరుపుకున్నపుడు ఆశీర్వదించేవాడు ఒక్కడైనా లేనందుకు ఆత్మ క్షోభించింది. మీరందరు నా అపరాధానికి మించిన శిక్ష నిచ్చుట ధర్మంగానని మనస్సు విలపించింది. అయినా ప్రేమించిన వ్యక్తిని భర్తగా పొందగలిగినందుకు ఆనందపడుతున్నాను."

"నా తలిదండ్రులతోపాటు గారాబంగా పెంచినమేనత్తలు పద్మ కూడా నన్ను ఘృణీకరించుకుంటున్నారని నాకు తెలుసు. ఈ జన్మలో వారి ఆశీర్వాదాలు పొందగల అదృష్టం నాకులేదు. మీరు నిష్కల్మషమైనవారు, నిస్వార్థులు. మీ ఆశీర్వాదాలకొరకు నా హృదయం వాపోతున్నది. మీరు నన్ను మన్నించి మీ ఆశీర్వాదాలను ఉత్తరంద్వారా పంపితే నేను ధన్యురాల నవుతాను. అన్ని కొరతలను దుఃఖాలను విస్మరించి నూతన దాంపత్య జీవితంలో ప్రసన్నంగా ప్రయన్నిస్తాను. ఇది నా ఆఖరి ప్రార్థన.

మీ ఆశీర్వాదాల నర్థించు,

స్వర్ణకుమారి."

అని వుత్తరంవ్రాసి పోస్టుకు పంపింది. ప్రయోగశాల అడ్రసుకే వ్రాసింది. ఉత్తరం పోస్టులోవేశాక ఆదుర్దా విడిలిపోయింది. మనస్సు తడబడపడసాగింది. ఆ వుత్తరాన్ని యింటిలోని అందరిముందు చదివి వినిపించి నవ్వి వూరుకుంటాడని, చేసిన మూర్ఖత్వం చాలక ఆశీర్వాదాలు కావాలసివచ్చినవా, అని మేనత్తలంటారని తెలిసితెలిసి సాగరంలో మునుగుతున్నవారికి తోడు యెవరు పోగలరు? అని పద్మ అంటుందని, వినిపించి చెవులు దిబ్బిళ్ళెత్తిపోయినవి.

ప్రయోగశాల కెళుతుందిగనుక, అక్కడనే కవరుచించి చదువుతుంటాడని. ప్రక్కనున్న పద్మ చూసి ఆశ్చర్యపోతూ, తానూ చదివి, నిట్టూరుస్తూ. "అదృష్టాన్ని అవలకునెట్టి దురదృష్టాన్ని కవాగలించు

కున్నది అమ్మాయిగారు. ఎవరి అవసరమూ లేనపుడు బాబుగారి ఆశీర్వాదాల అవుసరంమాత్రం యెందుకు?" అని అంటుందని, 'పిచ్చిపిల్ల' కోరినపుడు ఆశీర్వదించుట ధర్మంగనుక ఆరెండు ముక్కలు వ్రాస్తాను. అని ఆయ నంటాడని అంతరాత్మ వినిపించింది.

మనస్సులో క్షణానికొక విరుద్ధధ్వని వినిపించి విసిగిపోయి సోఫామీద ఒరిగిపోయింది.

ఆ రాత్రి ఆమెకు నిద్రపట్టలేదు. వసంతకుమార్‌కు వుత్తరం వ్రాసినందుకు పదే పదే పశ్చాత్తాప పడుతున్నది. ఆ వుత్తరాన్ని పట్టుకుని కొందరు కఠినంగా తిడుతున్నట్లు కొందరు హేళనగా నవ్వుతున్నట్లు అనిపించి బాధపడుతున్నది.

మానసిక వ్యధలో చీకాకు క్షణ మొకరీతిగా పెరుగుతుంది. ప్రతిది వికటంగా కనిపిస్తుంది. వ్యంగ్యంగా వినిపిస్తుంది.

ఆమె వుదాసీనతను దూరంచేయాలని ధైర్యంచెప్పి ఆనందాన్ని సృష్టించాలని, వచ్చి పలుకరించిన గంగరాజు ఆమె ఆవేశపు మాటలతో ఖిన్నుడై బయటకు వెళ్లిపోయాడు.

గంగరాజు వెళ్లిపోయాక ఆమెలో పశ్చాత్తాపం కలిగింది. తన ప్రవర్తనకు తానే ఖిన్నురాలైంది. తిరిగి ఆయన్ను పిలిచి పొరపాటుకు క్షమాపణ కోరాలని బయటికొచ్చి వెదికింది. కాని ఆయన కనిపించ లేదు.

భర్తమీద జాలికలిగింది. నిష్కారణంగా కోపగించుకున్నందుకు వేదనపడసాగింది. తిరిగి లోపల ప్రవేశించి ఆయన రాకకొరకు నిరీక్షణ చేస్తున్నది. వసంతకుమార్ యెడల నిర్లక్ష్యం పొడసూపింది. ఆయనకు వుత్తరం వ్రాయటే పొరపాటుగా నిర్ణయించుకున్నది. తనను తేలికగా తలంచి చులకనగా అందరిముందు విమర్శిస్తాడనిపించి మరింత క్రోధం కలిగింది. వెర్రితనంగా వుత్తరం వ్రాసినందుకు మరీ మరీ పరితాపపడ సాగింది.

గంగరాజును అనాలోచితంగా నిర్లక్ష్యంచేసినందుకు సిగ్గుపడుతూ

ఆయన రాకకొరకు తహతహలాడుతున్నది. రాగానే ఆయన పాదాలంటి క్షమాపణ వేడుకోవాలని, యిక యెన్నడూ అలా ప్రవర్తించగూడదని గతాన్ని విస్మరించి గంగరాజును సుఖపెట్టుటలోనే తన సుఖముంటుం దని ఆలోచనచేస్తూ యీజీచైర్‌లో నిద్రపోయింది.

టిఫిన్‌క్యారియర్ తెచ్చిన నౌకరు ఆమె నిద్రను భంగంచేయలేక దూరంగాపెట్టి కిటికీ తలుపులుమూసి ఆఫీసు తలుపులు వోరగావేసి బయటకు వెళ్ళిపోయాడు.

వేసవిలో చల్లగావున్నా, శీతాకాలంలో వెచ్చగావున్నా నిద్రమత్తు ఆవరిస్తుంది. అదేరీతి అంధకారంకూడా నిద్రను ఆహ్వానిస్తుంది.

కిటికీతలుపులు మూసినందున మసకచీకటిగావుంది. ఆ చీకటి గదిలో యీజీచైర్‌నందు నిద్రిస్తున్న స్వర్ణకుమారి గురక చిన్న మోతాదులో వినిపిస్తున్నది.

'స్వర్ణా స్వర్ణా,' అని ప్రక్కనుంచి పిలుపు వినిపించినపుడు 'ఊఁ' అని మాత్రమే అనగలిగింది.

భుజంమీద రేయి తట్టి 'పగటిపూట యింత నిద్రేమిటి స్వర్ణా, లే !' అని పెద్దగా వినిపించినపుడు నిద్రమత్తు వదిలింది. మనస్సులో నిద్రకు ముందున్నవన్నీ మెదిలినవి గాబోలు, అదే ఆలాపనలో, ఆ మసక చీకట్లో చివ్వున లేచి ఆయన పాదాలమీద వాలుతూ 'నన్ను క్షమించండి, నావాళ్ళందరిని మనస్సునుంచి తుడిచివేసుకున్నాను. వసంతకుమార్‌కు పొరపాటుగా వుత్తరం వ్రాశాను. వారి ఆశీర్వాదాలు నాకు అనవసరం. నా సర్వస్వము మీరే. మీ ఆశీర్వాదాలు చాలు, నా మనస్సులోని వ్యధంతా యీక్షణంలో యెగిరిపోయింది. ఇక యెప్పుడూ ఆనందంతో మీ సేవ చేస్తుంటాను, ఇందాక కోపంతో యేమో అన్నందుకు యెంతో పశ్చాత్తాపపడ్డాను. నన్ను క్షమించండి.' అంటూ లేచి చూచి విస్తు పోయింది.

కిటికీతలుపులుమూసి వున్నందున వెలుతురు మసకగావున్నది. కాని ముఖం స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన గంగరాజుగాదు వసంతకుమార్.

ఆమె ముఖం మలినత చెందింది. పొరపాటుగా నిందారూపంగా అన్నమాటలకు హృదయం బాకులతో పొడుచుకున్నట్లుంది. భూమి బ్రద్దలయితే వెంటనే దుమికి యెన్నటికీ మలినముఖం చూపకుండా పారిపోతుంది. శిరస్సును గోడకేసి మోదుకోవాలనిపిస్తున్నది.

'నిన్ను స్వయంగా ఆశీర్వదించి వెళ్ళటానికి వచ్చానమ్మా" అన్నాడు వసంతకుమార్ మృదుమధురమాటలలో.

"బావా....'' అంటూ ఆయన పాదాలకు కరుచుకుపోయి వెక్కి వెక్కి యేడుస్తున్నది.

"నిన్ను హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాను వే స్వర్ణా." అని ఆమె హస్తంబట్టి లేవదీయబోయాడు.

ఆమె, చేతిని విడిపించుకుని ఆయన పాదాలకు చుట్టవేసుకున్నది. అశ్రువులతో పాదాభిషేకం చేస్తున్నది. పాదాలమీదనుంచే ముఖం పైకిత్రిప్పి ఆయన ముఖంలోకి జూస్తూ 'నేను పరమ మూర్ఖురాలను బావా.' అన్నది.

"నీ హృదయం పవిత్రమైంది. నీవు సర్వతోముఖ సుఖంతో ఆయురారోగ్యంతో అభివృద్ధి చెందాలని ఆశీర్వదిస్తున్నాను శ్రే స్వర్ణా" అంటూ చేయిబట్టి లాగి నిలిపాడు.

ఆమె సిగ్గుదొంతరలమధ్యగా చూస్తూ ఙమేదో అన ప్రయత్నిం చిందిగాని గొంతు పెగలలేదు. శరీరం కంపిస్తున్నది. ఆయన చేతిని శిరస్సుమీదుంచి అదుముకుంటూ కన్నీరు కారుస్తున్నది.

వసంతకుమార్ ఆమెను బుజ్జగించి సోఫాలో కూర్చుండబెట్టి తన జేబులోని కవరు తీసి ఆమెచేతి కిచ్చాడు.

"ఇదేమిటి బావా ?"

"ఇది నా కానుక. కాని నేను వెళ్ళేవరకు ఆ కవరు చించవద్దు"

ఆమె వినమ్రతలో దీనవదనియై చూస్తున్నది.

"నీవు, నీభర్తా సుఖప్రద జీవనయాత్ర సలుపాలని ఆశీర్వదిస్తూ.

అవుసరమైనప్పుడు నా సహాయాన్ని పొందటానికి సంకోచించవద్దని కోరుతున్నాను." అని ఆశీర్వదించి వెళ్ళిపోయాడు.

ఆ కవరు అతి పలుచగావుంది. ఆయన బయటికి వెళ్ళిపోగానే, ఆయన్నుగురించి ఆలోచించు అవకాశం లేకుండా దృష్టంతా కవరు మీదనే వున్నది.

ఆ కవరు చించి చూచి ఆశ్చర్యపోయింది. అందులో వున్నది లక్షరూపాయలచెక్కు. తనపేరనే వ్రాసివున్నది. పదినిమిషాలవరకు ఆలోచించగల స్థితిలోలేదు. ఆనందాశ్చర్యాలలో తడబిడలాడిపోయింది. వసంతకుమార్‌ను గురించి ఆవుదయమే వికృతంగా వూహించింది. అంతకుముం దనేకమారులు హేయంగా చిత్రించుకున్నది. అందు కిపుడు పశ్చాత్తాపంతో తపించిపోతున్నది. తనవాళ్ళందరూ కఠోరమైన పంతంలో తనను వ్యతిరేకిస్తున్న యీ సమయంలో వసంతకుమార్ స్వయంగా తన సమక్షానికి వచ్చి హృదయపూర్వకంగా ఆశీర్వదించి లక్షరూపాయల కానుక నిచ్చిపోవుట సామాన్యులు చేయగలిగింది కాదు. ఆమె మనస్సు కృతజ్ఞతతో వూగిపోతున్నది.

ఆమె యేకార్యంలోను నిమగ్నం కాలేకపోతున్నది. చదువుకోవాలని యే పేపరు తీసినా ప్రయోజనం లేకపోతున్నది. ఆయన వుదారతను కరుణను గురించి ఆలోచించినకొంది హృదయం ద్రవిస్తున్నది. కొన్ని వేళలందు యెదుటివారి వుదారత మోయను భయం కలుగుతుంది. ఆ చెక్కును వారికే పంపాలని నిర్ణయించుకున్నది.

"ఆదరణీయ బావగారికి,

పాదాభివందనములతో వ్రాయునది. దయానిధులైన మీ వుదారత నా హృదయంలో నూతన సంచలనాన్ని కలిగించినది. నన్ను మార్చివేసింది. హృదయ అంతస్తును వున్నతం చేసింది. మీ యదార్థ శక్తి స్వరూపాన్ని తెలియజేసింది. ఇప్పుడు మీరు దైవస్వరూపులుగా గోచరిస్తున్నారు. ఆదర్శపురుషులుగా మిమ్ము సదా పూజిస్తుంటాను, కాని మీరు నాకు కానుకగా యిచ్చిన చెక్కును తిరిగి పంపుతున్నందుకు

అన్యథా భావించక క్షమించండి. మీ ఆశీర్వాదాలు నాకు అమూల్య మైనవి. అందరూ నన్ను హేయంగా చూస్తున్న యీ సమయంలో మీరు స్వయంగా వచ్చి ఆశీర్వదించారు. నిజంగా నేను ధన్యురాలను. ఇంటిలోని అందరి అయిష్టతను నిర్లక్ష్యంచేస్తూ నాకు యింత ధనా న్నిచ్చుట సామాన్య సాహసంగాదు. మీ సహనము. త్యాగము. ధర్మ ములముందు నా సంకుచితాలు నన్ను పరిహసిస్తున్నవి. ఊపిరి వదలు పుటలేదు. అందుకని నా క్షేమంకోరే యీచెక్కును వాపసు చేసుకుంటు న్నాను. అవుసరమైనపుడు మొట్టమొదటిసారిగా మిమ్మే అర్థిస్తాను. మిమ్మే ఆత్మబంధువులుగా విశ్వసిస్తున్నాను. నన్ను క్షమించండి.

స్వర్ణకుమారి,"

ఉత్తరంలో చెక్కును కలిపి వసంతకుమార్‌కు పోస్టుచేసింది. అప్పటికి హృదయం తేలికపడింది.

కాని మూడోనాటి ఉదయం వసంతకుమార్‌నుంచి జవాబు వచ్చింది. అందులో చెక్కుకూడా తిరిగి అలానేవచ్చింది.

"శ్రీమతి స్వర్ణకుమారిని దీవించి వ్రాయునది.

బాధించేవాటిని ఖిన్నపరిచేవాటిని మననం చేసుకుంటూ వాటి ఆయువును వృద్ధిచేయగూడదు. మన శ్రద్ధలు శాశ్వతంకావు. మీ తలి దండ్రుల స్థానంలో నిలిచి వున్నాను గనుక నా కానుకను స్వీకరించుట వుచితం. కన్నవారి కానుకలను కాదనకుండా స్వీకరించుట స్త్రీ ధర్మం. హోటలు భోజనాలతో ఆరోగ్యాన్ని మృగ్యం చేసుకోకుండా చూడండి. ప్రేమతో యిచ్చిన కానుకను కాదంటే అవమానించినట్లవుతుంది. స్వీక రించినపుడే నా మనస్సుకు వూరట కలుగుతుంది. ఇది నా ఫార్మిలాస్ ద్వారా పొందిన స్వార్జితంలోని డబ్బు. కనుక యీ విషయంలో యెవరి అనుమతికూడా అవుసరంలేదు. వుంటా.

నీ క్షేమాన్ని కాంక్షించు.

వసంత్‌కుమార్."

అని ఆ ఉత్తరంలో వున్నది. ఆ వుత్తరాన్ని మెన్నోమారులు చదివింది. చదివినకొలంది ప్రతివాక్యంలోను వాత్సల్యం వలుకుతున్నది. ఆ వుత్తరాన్ని చేతిలో వుంచుకుని నేత్రాలుమూసి యెంతోసేపు ఆలోచించింది. ఎదుట నిలచి వసంత్‌కుమార్ దీవిస్తున్నట్లు తోస్తున్నది. ఆయన ముఖమండలం తేజోవంతమై కనిపిస్తున్నది. విదేశమునుంచి వచ్చినప్పటినుంచి యిప్పటివరకు ఆయన నడకను గుర్తు జేసుకున్నపుడు ఆయన అర్థాంగాని అతీత శక్తివంతుడుగా మహత్తర వ్యక్తిగా గోచరించింది. ఆయనలోని ఆదర్శత్వాన్ని అర్థంచేసుకోజాలక నిర్లక్ష్యం చేసినందుకు ఖించపడింది. తన లక్ష్యసాధనలో నిమగ్నమై వుంటూ కూడా తీరుబడి సమయాలలో యత్నించిన ఫలితంగా భయంకర వ్యాధులకు కనిపెట్టిన ఫార్ములాస్ద్వారా లక్షల ధనం పొందాడు. వాటిని ప్రజా కార్యాలకే ఖర్చుపెట్టాడు. మొట్టమొదటిసారిగా గంగరాజు మహాసభల విషయంలో వెళ్ళి అర్థించినపుడు. విన్నవారు ఆశ్చర్యపోవునంత ధన మిచ్చిన సంగతికూడా గుర్తుకొచ్చింది. తానిపుడున్న సంకటమయ సమయంలో తనవారంతా ఘృణీకరించుకుంటువ్న స్థితిలో ఆయన నిస్వార్థ త్యాగమూర్తిగా ఆదర్శదేవతగా నిలిచి తన సమ్ముఖానికికొచ్చి ఆశీర్వదించాడు. లక్షరూపాయల కానుకనిచ్చి పోయాడు. ఒక్కొక్కటిగా ఆయన విషయాలు ఆలోచించినకొలంది హృదయం ద్రవిస్తున్నది. ఆదర్శ మూర్తిగా ఆమె హృదయంలో శాశ్వతంగా హత్తుకుపోయాడు.

గంగరాజు తన యింటిలోనే క్రొత్తకాపురం సాగించాలని స్వర్ణ కుమారిని తీసుకెళ్ళ ప్రయత్నించాడు. కాని ఆమె నూతన గృహనిర్మాణం జరిగేవరకు ఆఫీసులోనే కాలక్షేపం చేయనిశ్చయించుకున్నది. స్వల్ప విషయాలకు ప్రాధాన్యతనిచ్చి సంకటపడుట మంచిదిగాదని ఆ లక్ష రూపాయలను తన పేరునేవుంచుకుని. యింటికి పదమవి ప్రాదేయ పడ్డాడు.

'వసంతవిహార్' పేర భవనాన్ని నిర్మించి. అందు నివసిస్తే తన ఆత్మకు శాంతి లభిస్తుందని, ఆమె వివిపించినపుడు గంగరాజు మనస్సుకు శాంత కష్టం కలిగింది.

"దయ మానవస్వభావం. దయచూపినంతమాత్రాన యెదుటివారు బానిసలవుట వివేకంకాదు." అన్నాడు గంగరాజు.

"హద్దుల నధిగమించిన కరుణ భగవత్ స్వరూపం. అది అన్ని హృదయాలలోను ప్రావిర్భవించదు." అన్నది స్వర్ణ.

"సమయము సందర్భము కుదిరినపుడు యేఒక్కరైనా చేయగల కార్యమిది."

"ఉపన్యాసాలలో అది తేలికకావచ్చు. కాని అనుభవంలో అందరికీ సాధ్యమయ్యేదికాదు."

"ప్రజల కుపకరించని. ప్రజాముద్రలు పొందని ఆయన కార్యరంగాన్ని అనేకమారులు నీవే విమర్శించావు. వాస్తవానికి ఆయనొక వైరిత్వంగల వ్యక్తి. ఆయన్ను గౌరవించినా పూజించినా నష్టంలేకపోవచ్చు. అయినా ఆ విషయానికంత ప్రాధాన్యత నిచ్చుట పిచ్చితనమవుతుందేమో!"

ఆమాట లామెకు వెగటుగా వికారాన్నికలిగించినవి. భరించలేక కర్ణాల మీదహస్తాలువేసి అదుముకుంటూ "అబ్బ! ఆ విషయాలను ఇక చాలించండి. అంధుడు సౌందర్యాన్ని చూడలేనట్లే,చెవిటివాడుమధురితసంగీత మాధుర్యాన్ని వినలేనట్లే నేను ఆయన్ను యదార్థరూపంలో అర్థంచేసుకోలేనిరోజులవి. అపోహతో ఆయన్ను ఒకనాడు చులకనగాచూశాను. అంతమాత్రాన ఆయన హృదయ సౌకుమార్యం నశించలేదు. ఆయన నిర్మలతటాకంవంటివాడని, లోకానికి వెన్నెలవంటివాడని .నే డర్థంచేసుకున్నాను. అందుకే నా పూర్వాపరాధానికి నేడు పశ్చాత్తాపపడుతున్నాను. ఆ తాపంనుంచి శాంతిపొందే ఆశతోనే ఆయనపేర ఆయన ప్రసాదించిన ధనంతో భవనం నిర్మించి అందు జీవనయాత్ర సాగించాలనుకుంటున్నాను" అన్నది.

గంగరాజు వివేకంగల లౌకికుడు. తెగువరకు సాగదీయు అవ్యక్తుడుగాదు. అవుసరమైనపుడు తన అభిప్రాయాలను తనలోనే వుంచుకుని, యెదుటివారి అడుగుజాడ అడుగువేస్తూ తనవైపు నడుపుకోగల

విపుణుడు. తను వసంతకుమార్‌ను వ్యతిరేకించినకొంది ఆమె మనస్సు అటువైపే పరుగులెడుతుందని, ప్రభావితురాలవుతుందని, తన బలం సన్నగిలుతుందని గ్రహించాడు. అయిష్టమైన విషయాన్ని తొలగించాలని పంతంతో ప్రయత్నించినకొంది బలపడుతుంటుంది. ఆ విషయాన్ని విస్మరించుటో దాటవేయుటో ద్వారా బలహీనపడుతుంది.

స్వర్ణకుమారి యింటికొచ్చుట పూర్తిగా మానివేసి మహిళా మండలి ఆఫీసులోనే గంగరాజుతో వుంటున్నప్పటినుంచి పద్మ మరింత ఆందోళన పడుతున్నది. ఈ విషయం తెలిస్తే భూదేవి వింధ్యారాణి క్షోభిస్తారన్న భయంతో యేవోజూకాకోజా వచ్చిపోతున్నట్లు వుపాయాలతో కప్పిపుచ్చుతున్నది. అటు వారిబాధను చూడలేక యిటు స్వర్ణకుమారి యెదుట నిలిచి మాటాడలేక పద్మ యమయాతన పడుతున్నది.

వసంతకుమార్ అంతకుముందే వచ్చిన వుత్తరాలలోంచి ఒక విదేశీ వుత్తరాన్ని చదివి తనలో తానే నవ్వుకుంటున్నాడు. ఆ నవ్వులో బాధలన్నిటిని తుడిచివేసుకోగల ఆనందం లభించింది పద్మకు. ఆ వుత్సాహంలో యెదుటికెళ్ళి 'నవ్వుతున్నారేమిటి బాబుగారు?' అని ప్రశ్నించింది.

"నేను కనిపెట్టిన నూతనమందులు గొప్పగా పనిచేస్తున్నట్లు విరివిగా అమ్ముడుపోతున్నట్లు మందులకంపెనీలవారు తెలియజేశారుట. అందుకని ఆ సందర్భంగా నన్ను సన్మానించి ఒక బిరుదు నివ్వాలని ఎసోసియేషన్ నిర్ణయించిందట. ఈ దేశంలోనివారికి లక్ష్యం లేకపోయినా ఆదేశంలోని వారికయినా నా మందులవిలువ తెలిసిందని ఆనందపడుతున్నాను పద్మా. ఈ శుభసమయంలో నీకు కానుకగా యేమి యిస్తే బావుంటుందో చెప్పు?" అంటూ ఆలోచన చేస్తున్నాడు.

ఎంతోకాలానికి నేడు పద్మ ప్రఫుల్లితురాలైంది. నయనాలలో ఆనందభాష్పాలు మెరిసినవి. 'అయితే నాకు కావలసిన కానుకను నేనే కోరుకుంటాను బాబుగారు' అన్నది.

ఆయన పసివానివలె పకపక నవ్వుతూ 'చాలా మంచిది, అంతకంటె నాకు కావలసిందేముంది?' అన్నాడు.

"కోరినతరువాత కాదనకుండా మాట యివ్వండి బాబుగారు."

"నిన్ను శంకించుట సహించరాని దుర్బలత్వ మవుతుంది. నీవు యేదికోరినా యివ్వగలను పద్మా."

"మీ కీర్తిని వినటంకంటె యీ లోకంలో ఆనందకరవిషయం మరోటిలేదు. కాని యీ ఒక్క కార్యంతో మీ బాధ్యత తీరిపోలేదు. కుటుంబంలోని అన్నివైపులా శ్రద్ధవహించమని నా మనవి. స్వర్ణ కుమారిగా రిపుడు కొన్నిరోజులనుంచి యింటికి రావటం మానివేశారు. వారి ఆఫీసులోనే గంగరాజుగారితో కలిసి వుంటున్నట్లు తెలుస్తున్నది. ఇది పోనుపోను అప్రతిష్ఠ భరించరాని రూపం ధరిస్తుంది. వెర్రి మోహా నికి కట్టుబడిపోయినప్పుడు పోనీ ఆయనతోనే వివాహం జరిగేట్లు చూసి అపవాదుకలనుంచి కాపాడండి బాబుగారు."

"హృదయపూర్వకంగా విశ్వసించి చేసే ఒక పవిత్ర కార్యాన్ని అర్ధంచేసుకోజాలనివారు ఆపోహపడినంతమాత్రాన ఆ కార్యం అపవిత్రం కాజాలదు."

"అంటే! పరాయి వానితో కలిసిమెలిసి కాపురం సాగించుట పవిత్ర కార్యమంటారా ?"

"స్త్రీ పురుషులు పవిత్రమైన ప్రేమతో ఐక్యమై యేకత్వాన్ని పొందుతారుగాని, కేవలం వివాహతంతు ముగిసినంతమాత్రాన ఐక్యం కాజాలరు."

"బాబుగారు, నన్ను అర్థంగాని మాటలతో తికమక పెట్టకండి. సాహసంతోనో, అమాయకత్వంతోనో ఆమె గంగరాజును ప్రేమించ వచ్చుకాని వివాహం చేసుకోకుండా బహిరంగంగా కాపురం సాగించితే లోకమే మనుకుంటుందో చెప్పండి. ఆ అపవాదుకను మనం భరించినా అమ్మగారెలా భరిస్తారు చెప్పండి!"

"నేను చెప్పినా నీవు అర్థంచేసుకోలేవు పద్మా. ఆమె గంగ రాజును మనస్పూర ప్రేమించింది. వారిరువురికి ముచ్చటగా వివాహం జరిపే అవకాశం మనంగాని ఆమె తలిదండ్రులుగాని యివ్వలేదు.

అలాంటి అవకాశాలు లేనందువలన, వివాహం లేకుండా వివాహితులవలె క్రొత్తకాపురం అజ్ఞాతరూపంలో సాగిస్తున్నారు. రాతిబండ క్రింద పడినబీజం మొలకెత్తినపుడు ప్రక్కకు పెరిగి ఆ తరువాత స్వేచ్ఛతో పైకి పెరుగుతుంది. స్వభావసిద్ధ ప్రకృతిని, అవకాశాలకు అనుగుణంగా చేసుకోవటం దాని ధర్మం. అదేరీతి రెండు హృదయాలు ప్రేమద్వారా యేకమై ఐక్యరూపంపొంది, ఒకే రాగంలో యుగళగీతికను పాడునపుడు, అపార్థంచేసుకునే వారి మాటలు వినగలస్థితీవుండదు అవసరమూ వుండదు."

"ఈ ఒక్క విషయంలో మీ మాటలను వినలేక పోతున్నందుకు క్షమించండి బాబుగారు. విధిలేక పరిస్థితులకులొంగి అమ్మాయిగారిని ఆశీర్వదించటంవేరు, ఆమె కార్యాన్ని పవిత్రమైందిగా సమర్థించుటవేరు అవుతుంది. అది పవిత్ర ప్రేమగాదు. అమాయక మోహం. నరకకూపం లోకిపోయేవారినైనా ఆఖరిక్షణంలో ఆశీర్వదించుట పెద్దవారి ధర్మం గనుక పెద్దమ్మగారిని వప్పించి వారి వివాహం నామమాత్రంగానైనా జరిపించి అపవాదుకలకు దూరం చేయమని నా మనవి."

"అనేక విషయాలలో నీవు వివేకివి, ఆదరాభిమానాలలోను, భక్తి ప్రపత్తులలోను, విశ్వాసంలోను, త్యాగంలోను నీకు నీవేసాటి. కాని యీ ప్రేమ సంబంధ విషయాలలో నీవు అనభిజ్ఞురాలవు. ఆ అనభిజ్ఞతకూడా ఒక విశేష ఆకర్షణీయ సంపత్తిగా నిన్ను రాణింపచేస్తున్నది. అందుకే నీవు స్వర్ణను అర్థంచేసుకోలేక బాధపడుతున్నావు. అమాయకప్రేమే పవిత్రప్రేమ. అక్కడ అంతస్థులకు అనర్థ ఆలోచనలకు, తారతమ్యాలకు తావులేదు. ఆత్మార్పణతో వ్యక్తిత్వాన్ని కోల్పోవటం జరుగుతుంది. ఆ రీతిగా స్వర్ణ ఆత్మార్పణ చేసుకున్నది కనుకనే నీ వలె ఆమెకు ఆయన్నుగురించిన అన్యథాలోచనలులేవు. అ, అయినా నంద గీతికాజోరులో అపవాదుకలగోడు వినిపించదు. సామాన్యులమైన మన ఆశీర్వాదాల అవుసరంకూడా వుండదు. వారినిగురించి విచారపడక ఆనందపడటం నేర్చుకో"

"పోనీ వారిరువురూ ఆనందంగావుంటే నాకు సంతోషమే. కాని.

వారు అవివాహితులై కలిసి కాపురం చేస్తున్నందువలన వచ్చే అపవాదు-కలు వారినేమీ చేయలేకపోవచ్చు. అవి మీ కుటుంబంమీద, మీమీద కూడా ప్రసరిస్తవిగదా బాబుగారు. ఆ భయంకూడా లేదంటారా?"

"చెట్టుపేరుతో కాయలమ్మే రోజులు గతించినవి. ఆ యుగం మారిపోయింది, పరిస్థితులు వేరైనవి. తల్లిదోషం బిడ్డకు, బిడ్డదోషం తల్లికి చెందదని రుజువుచేస్తున్న రోజులివి. స్వర్ణకుమారి అపవాదుకలు మనమీద ప్రతిబింబించినా భయపడుట వెర్రితన మవుతుంది. రాపిడితో రత్నం అరగవచ్చు కాని కాంతితోపాటు విలువ పెరుగుతుంది. ఎవరి శక్తి వారిని యదార్థరూపంలో నిలుపగలుగుతుంది."

"మీముందు తర్కించగల శక్తి నాకులేదు. కాని నాలోని బాధ నన్ను బాధిస్తున్నది. అమ్మాయిగారి అమాయకతకు గొప్ప పరిభాష కల్పించినంతమాత్రాన ఆమె మార్గం ఆదర్శం కాజాలదు. అలాంటి స్వేచ్ఛద్వారా స్త్రీ యెన్నటికీ శాంతిని పొందజాలదు."

"స్త్రీ లోకమంతా స్త్రీ స్వాతంత్ర్యం కావాలని గోలపెడుతుంటే, నీవు నిరోధిస్తే అభ్యుదయ నిరోధకురాలివిగా పరిహసింపబడతావు."

"అభ్యుదయ నిరోధకురాలినిగా పేరుపడితే, నిజమైన స్త్రీ నిగా నిలిచి ఆనందపడతాను. ప్రకృతిసిద్ధమైన యదార్థ విషయాలను ఆదరించుటకు భయపడగూడదని యింతకుముందు మీరే అన్నారు. స్త్రీ పురుషుని అనుసరణలో మాత్రమే రాణించగలుగుతుంది. అది ఆమె స్వభావసిద్ధ ప్రకృతి. స్త్రీ ప్రత్యక్ష ప్రకాశములేని శశివంటిది."

"ఈ విషయంలో నేను యేకీభవిస్తున్నాను కాని యీ విషయాలు బహిరంగంగా అని అభ్యుదయ నిరోధక టైటిలును పొందగల సాహసం లేదు."

ప్రేమార్ద్ర కంఠంతో 'హాసీ, మీ రలా అనకండి బాబుగారు.'

'నా బలహీనతను సమర్థించుట నన్ను వెర్రివాని చేయుటవుతుంది.'

ఆమె నేత్రాలు సజలమైనవి. తొణుకుచున్న కంఠంలో 'మీకీర్తి

అనంతంగా పెరగాలని నా హృదయం ఆరాటపడుతుంటుంది. విదేశం నుంచి మీరు వస్తున్నపుడు అందరమూ హడావుడులు పడ్డాము. ఆర్భాటపు యేర్పాట్లు కావించాము. మీ యెదుటికి రాగల అవకాశ ముండదని, మీతో మాట్లాడగల అర్హత నా జీవితంలో యెన్నటికీ కలుగదని అంతర్గతంగా ఆందోళన చెందాను. నాబోటి ఆడంబరాలు చేతగాని సామాన్య దాసీ మీరున్న యింటిలో వుండే అవకాశముండదని భయపడ్డాను. కాని మీ రాక విచిత్రంగా జరిగిపోయింది. ఆర్భాటాలన్నీ యెగిరిపోయినవి. లూసీముందు పనికిరాకుండా పోయిన నాకు తిరిగి ప్రాధాన్యత వచ్చింది. ఆ దృశ్యం నా హృదయంలో శాశ్వతంగా ముద్రించుకుపోయింది. నిజంగా మీరు దైవసమానులు బాబుగారు. మిమ్ము అభ్యుదయ నిరోధకులని, అయోగ్యులని యెవరైనా అంటే విని జీవించగల శక్తి నాలో లేదు బాబుగారు.'

బల్లమీదవేసిన ఆమె హస్తాన్నిబట్టి లాగి టేబులుప్రక్కగా తనకు సన్నిహితంగా చేసుకుని, చెవిపట్టి మృదువుగా మెలిపెస్తూ 'సజీవంగా సౌందర్యాన్ని చిందించే పద్మంలాంటి నీముఖంయొక్క మూల్యం నీకు తెలియదు. వజ్రం విలువ వజ్రానికెలా తెలుస్తుంది?'

'అయోగ్యమైన వాటిని గొప్పగా చూస్తూ అమూల్యంగా తలంచుట మీ అంతర్దృష్టి లోపం బాబుగారు!' అంటూ ఆయన చేతిలో నుంచి చెవిని విడిపించుకోజూస్తున్నది.

"ఆత్మాభిమానము ఆత్మ విశ్వాసము కోల్పోగూడదు" అన్నారు

"ఆత్మాభిమానంద్వారా గర్వము, గర్వముద్వారా అంధత్వము, అంధత్వముద్వారా మూర్ఖత్వము వరుసగా వస్తవిబాబుగారు"

"ఆత్మాభిమానాన్ని విస్మరిస్తే వ్యక్తిత్వం యెగిరిపోతుందిగదా!"

"ఆదరించేవారిమీద భారంవేసినపుడు వ్యక్తిత్వంతో పని యేముంటుంది?"

ఆ మాటలు వింటున్నపుడు ఆయన మనస్సు కరిగిపోయింది. ఆమెపైపుచూస్తూ "మాటల తిరుగుడులో నీ కివ్వదలచిన కానుక మర్చిపోయాను." అంటూ తన వ్రేలిరింగునుతీసి ఆమె వ్రేలికి తొడిగివేశాడు.

ఆమె భయభీతావహురాలై బంగారుతో ఆ రింగును పూడబెరికి ఆయన హస్తంలోబెట్ట ప్రయత్నిస్తూ "బాబుగారు నన్ను క్షమించండి. నేను దాసీని. అంతస్తుకుమించిన ఆధిక్యతను స్వీకరించుట అవ్యక్తతవుతుంది. శక్తికి మించిన కానుకను స్వీకరించుట ధర్మంగాదు. ఇది నేను భరించలేని అవదారంగా పరిణమించవచ్చు. నన్ను క్షమించి మీ ప్రేమనే ధరించండి"

"కేవలం నీ దృష్టితోనే అన్నిటి విలువలను గుణించగూడదు పద్మా. ఎదుటవారి దృష్టిని ఆదరించుట నేర్చుకోవాలి. జన్మతః మానవులందరి అంతస్తు ఒక్కటే. గుణగణాలు ఆచార వ్యవహార విజ్ఞతల ద్వారా అంతస్థులు యేర్పడవచ్చు. ఆ ద్వారా నీ అంతస్థు అత్యుత్తమమైంది. నీతి ద్వారాను. సేవాభావత్యాగాలద్వారాను. సహనంద్వారా, ఆత్మోన్నతిద్వారాను, నిస్వార్ధ నిరాడంబరయోగంద్వారాను నీకు ఆ అంతస్థు లభిస్తుంది. నిన్ను న్యూనత పర్చుకునే దాస్యభావాలను విస్మరించుమని నా కోర్కె. నా తృప్తికొరకయినా దీన్ని స్వీకరించు పద్మా."

'మీరు యదార్ధమైన నిస్వార్ధత్యాగమూర్తులుగనుక మీ దృష్టికి నే నలా కనిపించవచ్చు. అది కేవలం మీ హుందాతనంలోని ఉదాత్తత. నా స్థితి నాకు బాగా తెలుసు. అభిమానంతో మీరు నన్ను అదరంగా చూపినంతమాత్రాన నా అంతస్తును నేను విస్మరిస్తే ఆత్మద్రోహమే అవుతుంది. నేను అధమస్థాయిలోని దాసీని. మీ కానుక మరో రూపంలోవుంటే తప్పక స్వీకరించి వుండేదాన్ని. ఇది నా శక్తికి మించింది.'

'నీవు దాసివే అయితే యజమాని ఆజ్ఞను శిరసావహించాలి. అది నీ ధర్మం. కనుక నా ఆజ్ఞగా ఆ రింగును ధరించు.'

'మీరిచ్చే యే దానాన్నయినా స్వీకరించగలను కాని యిది నేను పొందరానిది పొందగూడనిది గనుక నన్ను క్షమించండి బాబుగారు.'

విసిగిపోయినందున ఆయనముఖం వివర్ణమైంది. బల్లమీదనున్న ఆ విదేశపు వుత్తరాన్ని ముక్కలుముక్కలుగా చించి క్రిందకు వదిలాడు.

ఆమె నిర్ఘాంతపోతూ 'అదేమిటి బాబుగారు, అంతటి అమూల్య పుత్తరాన్ని చించివేశారేమిటి ?' అంటూ క్రిందపడిన ఆ ముక్కలను యేరి బల్లమీద పెడుతూ ఆయన ముఖంలోకి చూసింది. కొలిమిలో కాలిన యినుమువలె కంది వున్నది. ఆయన ముఖంలో యింతటి క్రోధాన్ని చూడటం యిదేప్రథమం, ఎంతకూడదీసుకో ప్రయత్నించినా ధైర్యానికి బదులు అధైర్యమే పొడచూపుతున్నది. అంత నిర్మలప్రశాంత మూర్తిగావుండే ఆయనముఖం చూడలేకపోతున్నది. స్వర్ణకుమారి అందరినీ నిర్లక్ష్యంచేసి అంధకూపంలో మునిగిపోయిన సందర్భంలోకూడా ఆయనలో క్రోధచిహ్నాలు తొంగిచూడలేదు.

తిరిగి ప్రశ్నింపగల సాహసంలేదు. హృదయం ఖంగారుతో కళవళపడిపోతున్నది. శరీరం కంపిస్తున్నది. హస్తాలు అదురుతున్నవి.

బల్లమీదున్న వుత్తరం ముక్కలను చూస్తూ కంపిస్తున్న కంఠంతో 'బాబుగారు, యీ అధమురాలిమీద కలిగిన ఆవేశంలో అంతటి అమూల్యపత్రాన్ని చించివేశారు. ఈ నష్టాన్ని యెన్నిజన్మలలోనైనా పూర్తిచేయలేని హీనదాసినని గుర్తుండికూడా నాకు శాశ్వత దుఃఖాన్ని కల్పించారు........' అంటూ పొర్లుతున్న దుఃఖంలో మాటలు పెగలక ఆగిపోయింది. కళ్ళనుండి కారుతున్న కన్నీరు ఆ వుత్తరం ముక్కల మీద పడుతున్నవి.

"అశ్రువులను వృథాచేసుకోవలసిన అవుసరం నీకు లేదు పద్మా. ఒక విధంగా నేడు నాకు జ్ఞానోదయం కలిగింది. నా ఆశయాలు, ఆదర్శాలు, ఆలోచనలు అన్నీ వ్యర్థమైనవి, నేటితో మృగ్యమైనవి. ఈ లోకానికి ఒక విధానమంటూ వుండదని, మంచికి ఆదరము చెడుకు నిరోధములుంటవనను వీలులేదని, యెవరిని యేరూపం విశ్వసించినా పొందేది దుష్ఫలితమేనని నేడు విశ్వసనీయంగా తెలుసుకున్నాను. నన్ను పూర్తిగా అర్థంచేసుకున్న నీ ముందు నా మాటలకు విలువలేకపోయినపుడు పొందే నా హృదయక్షోభను, అన్నివేల మైళ్ళదూరానవున్న వారిచ్చే కీర్తి తుడిచి వేయకలుగుతుందా ! ఇక వాటితో నాకు పనిలేదు.

నిశ్చింతుణ్ణి." అంటూ బల్లమీదున్న వుత్తరం ముక్కలను రింగును క్రిందకు నెట్టివేశాడు.

రింగు ఖంగు ఖంగున మ్రోగుతూ దొర్లుకుంటూ బీరువాక్రిందకు పోయింది. కాగితం ముక్కలు అల్లీ బిల్లీ తిరుగుతూ చెల్లాచెదరుగా పడిపోయినవి.

ఆమె నిశ్చేష్టురాలైంది. పట్టుదప్పినట్లు శరీరమంతా నిర్జీవమైంది. తప్పటడుగులతో బీరువాదగ్గరకెళ్లి రింగును తీయ ప్రయత్నిస్తున్నది. బీరువా కదిలి టాపుమీదున్న పాతపటంజారి పద్మ శిరస్సుమీద పడింది. చిన్నగాయమైంది గాబోలు రుధిరబిందువులు ఒక్కటొక్కటిగా పృధ్వి మీద పడుతున్నవి. ఆమెకా గమనమేలేదు. క్రిందకుదూరి రింగును తీసింది. ఆమె కురులనిండా బూజుచుట్టుకున్నది. తెలిపోతున్న అడుగులతో ఆయన ముందు నిలిచి. జాలిని గొలుపు వినయంతో, దుఃఖం పొర్లుతున్న కంఠంతో "బాబుగారు, మీ చేత్తో నా వ్రేలికి తొడగండి." అన్నది.

ఆమెవైపుచూడకుండానే నిర్లిప్తకంఠంతో "నా మాట కొరకు నీవు ధర్మచ్యుతురాలవు కావలసిన పనిలేదు." అన్నాడు.

"బాబుగారు!" అంటూ చేతులు ప్రక్కగా ఆయన పాదాలవైపు శిరస్సును పృధ్వీమీదుంచింది. ఆమె ఆఖరి పిలుపులో వేదన నిండి వున్నది.

శిరస్సుమీదనుంచి వలుకుతున్న రుధిరము, కురులమీద ఆ ధూళి చూసి విచలితుడయ్యాడు. వెంటనే ఆమె శిరస్సునుబట్టి లేవనెత్తాడు. ఒక రుధిరధార కపోలంమీదిగా పోతున్నది. వెర్రివానివలె క్షణంలో ఆమె యందు కలిగిన మార్పును చూస్తున్నాడు.

గాద్గదిక కంఠంతో, సుడులు తిరుగుతున్న అధరాలతో "బాబుగారు, యిది నా వ్రేలికి తొడగండి." అని దీనాలాపంగా అన్నది.

శిరస్సుమీదనుంచి వలుకుతున్న రుధిరబిందువులు ఒక్కటొక్కటిగా పృధ్వీమీదకు రాలుతున్నవి. ఆమె దోషం హరించింది గాబోలు.

ఆయన హృదయం ద్రవించింది. వెంటనే ఆ రింగును ఆమె వ్రేలికి తొడిగి ప్రక్కనున్న సోఫాలో కూర్చుండబెట్టి కర్చీపుతో తుడిచి గాయం మీద మందువేశాడు. తన అంగుళీయములతో కురులమీది ధూళి నంతటిని తీసివేశాడు.

ఆయన చేస్తున్న సేవను భరించలేక భయకంపిత కంఠంతో "నేను పరమమూర్ఖురాలను. నామీద యింతదయ యెందుకు బాబుగారు?" అన్నది.

'దయకూడా ప్రేమవలెనే భగవత్స్వరూపంలాంటిది. దయ కావాలని ప్రయత్నిస్తే వుత్పన్నమయ్యేదికాదు. దయను చూపాలని అనుకుని చూపే దయ కాగితపు పుష్పంలాంటిది. సహజ జనితమైన జాలితో దయ వుత్పన్నమవుతుంది.'

'మీ అపారదయకు పాత్రురాలనైన నా జీవితం ధన్యమైంది. కాని మీరు కోపంతో చించివేసిన వుత్తరాన్ని తిరిగి పొందటం సాధ్యమా బాబుగారు?'

ఆమెభయాన్ని అర్థంచేసుకున్నాడు. అందుకని వోదార్పుధ్వనిలో 'వుత్తరంలోని విషయాలను స్వీకరించాను. చించివేసింది కాగితాన్నేగా!'

క్షణంలో ఆమె ముఖమందు ప్రసన్నరేఖలు మెరిసినవి. యెండలో చిటపటచినుకులు పడుతున్నపుడు ఆహ్లాదాన్ని కలిగించు దృశ్యమువలె దృగ్గోచర మవుతన్నది ఆమె ముఖమండలం.

నాలుగుమాసాలలోనే స్వర్ణకుమారి కోరినరూపంలో మహల్ తయారైంది. ఆధునికపద్ధతిలో అందాలుచిందించే విధానంలో, నిర్మాణం జరిగింది. 'వసంతవిహార్' అని స్వర్ణాక్షరాలలో చెక్కబడిన పెద్ద పాల రాతి ఫలకం భవనంముందువైపు బిగించబడింది. వసంతకుమార్కి కిష్టమైన గెరువారంగుతో భవనమంతా చిత్రించబడింది. భవనంముందు చిన్న పూలవనం తయారుచేయబడింది.

గృహప్రవేశం గొప్ప ఆర్భాటాలతో జరుగాలని గంగరాజు

సంకల్పం, కాని స్వర్ణకుమారి అందు కిచ్చగించలేదు. హోటలులో ప్రవేశించునట్లు నూతనభవంలో ప్రవేశించారు.

'వసంతవిహార్' అనే పేరును పెట్టుటకుగాని, ఆ పేరున శిలా ఫలకాన్ని భవనంముందు బిగించుటగాని గంగరాజు కిష్టములేదు. ఆ విషయంలో స్వర్ణకుమారికున్న పట్టుదలను అర్థంచేసుకుని ఆమె అభి ప్రాయాన్ని నెరవేర్చారు.

గంగరాజు స్వర్ణకుమారి మహిళామండలి ఆఫీసులో కలిసి వుంటున్న సందర్భాలలో బయలుదేరిన గుసగుసలు సామాన్యమైనవి గాదు. వారు నూతన గృహంలో ప్రవేశించి క్రొత్తకాపురం సాగిస్తున్న పుడు వివాహంలేని యీ విడ్డూర దంపతులగూర్చి యెన్నెన్నో రకాల పుకార్లు రేగినవి.

పామర ప్రజలలో కీర్తి సంపాదించు టెంత తేలికో అపకీర్తి సంపాదించుట అంతకంటె తేలిక, స్వర్ణకుమారికి గంగరాజుకు జేజేలు కొట్టిన ప్రజలే, వారు దయానిధులని, త్యాగమూర్తులని ప్రజారక్షకులని పొగడినవారే నేడు బెమరుచూపులతో నిందలతో ఆనందాన్ని పొందు తున్నారు.

స్వర్ణకుమారి యింటినుంచి లేచివచ్చిందని, పారిపోయివచ్చి దొంగకాపురం సాగిస్తున్నదని, ఇంటిలోనివారు విడిచిపెట్టి వూరుకున్నా రని, యింతకంటె వేశ్యలు వుత్తములని జనంలో ప్రబలంగా అను కుంటున్నారు.

కటికికసాయివాడు, మహా మోసగాడు, లోలుడు అయినవాడే నేడు రాజకీయరంగంలో ముందుకు నడువగలుగుతున్నాడని, గంగరాజు ఒక ప్పుడు స్వార్థకాంక్షలలో హీనుడని, కిరాతకుడని, రాజకీయరంగంలో గొప్ప నాయకాగ్రణిగా త్యాగమూర్తిగా ప్రజల మన్ననల పొందాడని, నేడు అసలుస్వరూపం బయటపడుతున్నదని, నేర్పుగా అమాయకు రాలైన స్వర్ణకుమారిని చేజిక్కించుకున్నాడని, ఆమెను అధోలోకానికి నెట్టివేస్తాడని మరికొందరు అనుకుంటున్నారు.

గంగరాజు దుష్కార్యాన్నయినా సత్కార్యాన్నయినా నిర్భీతిగా సాహసోపేతంగా చేసి వెరపులేకుండా జనంముందు నిలిచేవాడు. తాను చేసిన ఘోరాలను కూడా మరపునపెట్టి మెప్పులుపొందేవాడు. స్వర్ణకుమారిని పొందాక ఆ కోణంలో ధైర్యచ్యుతి కలిగింది. జనంవైపు చూసినపుడు భీతి కలుగుతున్నది. కార్యరంగాలన్నిటిలోను మందగమనం ప్రారంభమయింది. తప్పనిసందర్భాలలో ఆఫీసువైపు సంఘాలవైపు వెళుతున్నాడు. ఎక్కువమందిని కలుసుకోవటం అధికంగా సంభాషించవలసిన అవుసరం కలిగినపుడు మనస్సు చీకాకుచెందుతున్నది. ప్రజాకార్యాలమీద సంపాదనలమీద వున్న వుత్సాహం సన్నగిలింది. ఆ కార్యక్రమమంతా పేలవంగా గనిపిస్తున్నది. విముక్తిపొందాలని కూడా వుంది. అందుకనే ప్రజాకార్యాలపేరుతో చీకటిదారిగుండా పొందుతున్న వాటాల తాలూకు లెక్కలను సరిజేసుకునే ప్రయత్నాలు సలుపుతున్నాడు. కాని నాటినబీజాలు ఫలవంతమై లెక్కకు మిన్నగా యిస్తున్న ఫలితాలను తెంపుకున్నా వెంటవచ్చునట్లు లావాదేవీలు వెంటాడుతున్నవి. పెరిగేరోజు వచ్చినపుడు ధనం పోటీపడి పాపంకంటె మిన్నగా పెరుగుతుంది. లెక్కలలో తేలుస్తూ తన చేతికందిన అనేక మొత్తాలను వేరువేరు దూరపు బ్యాంకిలలో వేస్తున్నాడు.

అతివిలువైన ఆధునిక స్త్రీఅలంకార సామానులు ఫర్నిచరు మొదలగునవి అవుసరమైనంత యింటికి చేర్చినపుడు స్వర్ణకుమారి ఆనందపడింది. రాజకీయమే జీవిత పరమావధిగాయెంచి లోక కళ్యాణంకొరకు జీవితాన్నర్పించిన ఆయన తనను గురించి యింటి విషయం యింతగా పట్టించుకుంటున్నందుకు సంతోషపడుతున్నది. గంగరాజు వరుసగా నాలుగురోజులు యింటినుంచి కదలకుండా వున్నపుడు, తన ద్వారా ఆయన సామాన్యులలో ఒకటుగా కలిసిపోతాడని భీతిచెందుతుంటుంది. ప్రజలలోని ఖ్యాతిపోతుందని నాయకత్వం యెగిరిపోతుందని పరితాపపడుతుంటుంది.

"ప్రజలను మర్చిపోయి, కార్యక్రమాలను విస్మరించి, యేమీ మెరుగుపట్లు, అన్నిటికీ అతీతులై రేయిబవలు యింటిలోవుంటే

యెలా చెప్పండి? బయటకువెళ్ళి అందరనూ పరామర్శించైనా వస్తుందండి.'' అన్నది స్వర్ణ.

నిరాసక్తతతో 'మనస్సు మరోవైపు మరలినందున అటు ఉత్సాహం కలుగుటలేదు. ఆవైపు నీతో జరుగుచున్న అశ్రద్ధ నాలో ప్రతిబింబిస్తున్నది. నేను వెళ్ళలేక పోతున్నాను. ఏమిచేయమంటావు చెప్పు?' అన్నాడు గంగరాజు.

'గృహస్థు అయినంతమాత్రాన మానవకర్తవ్యాన్ని మరువరాదు. వ్యక్తిగత జీవితసమస్యలు ప్రేమ కలాపాలకంటె సంఘ సమస్యలు ప్రజాకార్య భారాలు బృహత్తరమైనవి. త్యాగంనుంచి స్వార్థానికి ప్రజాసేవలనుంచి సతి సేవకు మారినపుడు వున్న అంతస్తునుంచిజారి సామాన్యులకంటె హీనులుకావటం జరుగుతుంది. అలాంటి అసంబద్ధ జీవితం వ్యర్థమైంది. కనుక మీరు వున్నస్థాయినుంచి జారి సామాన్యులలో కలువకండి.'

'నీవు లేకుండా ప్రజల యెదుటికిపోను భీతి కలుగుతున్నది. నీవు నా ఆత్మ ప్రేరకుడవు, అడుగు అడుగున నీవు వున్నపుడే నా నడక సాగుతుంది. వెనుకటి ధైర్యం నాలో లేదు. ప్రారంభించిన కార్యాలలో ముందుకు పోను వుత్సాహంలేదు. ఆ జీవితంమీద విసుగట కలిగింది.'

ఆమె మనస్సుకు తెలియని బాధ కలుగుతున్నది. సంఘాలకు సమితులకు సభలకు పోగలిగితే బాగుండు ననిపిస్తున్నది. జరిగిపోయిన ఆ సభల కార్యక్రమం నెమరువేసుకున్నపుడు వుత్సాహం ముందుకు నెడుతున్నది. కాని మరోవైపునుంచి పిరికితనం అదిమివేస్తున్నది. తాను ఆధునిక రూపంలోని గాంధర్వ వివాహమాడింది. తన చాటున అందరూ నిందిస్తుంటారని, చెప్పేది శ్రీరంగనీతులు చేసేది క్షుద్ర కార్యాలు అని అపహాస్యం చేస్తుంటారని భీతి కలుగుతున్నది.

తన వాళ్ళు సమ్మతించి వివాహం జరిపివుంటే నేడు ప్రజలందరూ హర్షిస్తూ తన వెంట వుండేవాళ్ళు. వెనుకటికంటె వుత్సాహభరితంగా సంఘాలలో గంగరాజుతో కలిసిమెలిసి తిరుగుతూ ప్రజాకళ్యాణం

వైపు పరువులెత్తేదాన్ని. పేరు ప్రతిష్ఠల పెంపులో గంగరాజు రాష్ట్రి నాయకుల స్థాయి నందుకునేవారు. నేను జిల్లాలలో తీరుబడిలేని కార్య క్రమాలలో తిరుగుతుండేదాన్ని. ప్రజలమధ్య జేజేలతో పూజలనందు కోవటానికి బదులు వెరపుతో దొంగవలెదాగి కాలక్షేపం చేయవలసి వస్తున్నది అని వ్యాకుల పడుతున్నది స్వర్ణ.

సుభద్రాదేవిని, మహిళామండలిలో తనను గౌరవించిన అనేక మందిని, వ్యవసాయక్షేత్రంలోని వారిని, యితర సంఘాధ్యక్షులను చూడాలనిపిస్తున్నది. కాని తాను వెళ్ళలేదు. వారు రావటంలేదు. అధవా వారు వస్తే తడబడలాడి కంపించిపోతుంది. అందుకనే గంగరాజును బయట తిరుగుమని వత్తిడి పెట్టలేక పోతున్నది.

17. ప్రేమ - ప్రేరణ

మానవునికి అసఫలతలలో వాంఛలు తరుగుతుంటవి. సఫలతలలో అడుగుఅడుగున పెరుగుంటవి. కైలాసపతి ఆర్థిక అర్జనలో సఫలత పొందారు. ఆయన కృషి ఫలించింది. అధికార ఆధిక్యత కీర్తికాంక్ష లతో గంగరాజును సుభద్రాదేవిని అనుసరించాడు.

ఒక సామాన్య స్త్రీ అయివుండి మహిళాలోక కళ్యాణ కంకణ బద్ధురాలై దీక్షతో వుపన్యసిస్తున్న ఆమె వక్తృత్వానికి ముగ్ధుడవుతుండే వాడు. వేలమంది ఆకర్షితులై ప్రభావితులై తన్మయత్వంతో సుభద్రకు దిక్కులు పిక్కటిలునట్లు జేజేలు కొడుతుంటే కైలాసపతి పరవశుడవు తుండేవాడు. ఆమె భాష భావము, శైలి కంఠము విశేషరీతిలో హృదయానికి హత్తుకునేవి. ఆమె ప్రేక్షకులను నవ్విస్తుంది, యేడ్పి స్తుంది, ఆవేశితులనుచేయిస్తుంటుంది. అది ఆమెపొందిన వరంగాలోచేది. ఆ శక్తికొరకు యెంత తపస్సయినా చేయాలనిసించేది. నిత్యనూత నత్వంతో ముందుకు పోతూ ప్రజల నాకర్షిస్తూ, అగ్రస్థానాలలో నిలిచి విజయహారాల నందుకుంటూ, జేజేలమధ్య విరాజిస్తూ, రాజ్యాధిపతుల వలె దేవతా సంభూతులవలె ఘనతనువహిస్తున్న ఆమె యెడలప్రభావితు

డయ్యాక. ఆమె ననుసరిస్తూ, సన్నిహితత్వాన్ని పెంచుకుని స్వాంత నను కల్పించుకున్నాడు.

మీటింగులకని దూరప్రాంతాలకు ఆమెతో పయనిస్తున్నపుడు ఆనందం కలుగుతుండేది. స్నేహంగా సన్నిహితంగా మెలగ గలుగు తున్నందుకు తన అభిప్రాయాలకు ప్రాధాన్యత నిస్తున్నందుకు మనస్సు పొంగిపోయేది. కాని అనర్గళంగా అద్భుతరీతిలో వుపన్యసిస్తున్నపుడు భించకలిగేది. ఆ స్థాయిని అందుకోవాలని కాంక్ష కలుగుతుండేది.

స్త్రీ యెడలకలిగే అభిమానము గ్లామరు కొంత దూరంపొయ్యాక, కలియకలలో వ్యామోహానికి దారితీయుట పరిపాటి. అది స్వభావసిద్ధ మైన మానవ ప్రవృత్తి. సుభద్రాదేవితో కలిసిపయనం చేస్తున్నపుడు, కదాచితుగా తగిలే ఆమె స్పర్శలు వేడిని కలిగించి మనస్సును అస్త వ్యస్తంచేసేవి. తిరిగి ఆ స్పర్శలకొరకు మనస్సు వాపోయేది. ప్రక్కగా కూర్చున్న ఆమె భుజానికి భుజం తగిలి వత్తుకుని వున్నపుడుద్భవించే వేడిలో శరీరంలోని నరాలన్నీ విద్యుల్లతవలె తన్నితానం చేస్తున్నపుడు పొందే మధురానుభూతిలో పూర్వాలోచలన్నీ యెగిరిపోయి నూత నాలోచన లావిష్కృతించేవి. ఈ నూతనాలోచనాలోకంలో విహరిస్తుండే హృదయము మనస్సు యేకమై పులకిత రూపంలో నృత్యం సలుపు తుండేవి. కారుగతుకుడులో ఆమె మీదకు తాను, తనమీదకు ఆమె మోపుకున్నపుడు కలిగే వుత్సాహంలో వూపిరి సలిపేదిగాదు. తిరిగి అలాంటి గతుకుడు కొరకు తృష్ణ వెతుకుతుండేది. దోచుకోవటానికి ప్లానువేసి కూర్చున్నవానివలె గొంతులోని తరళం యెండుకుపోతుండేది. సాహసంచేసి ఆమె హస్తాన్ని పట్టి వూపినపుడు శరీరంలోని నర్వనాడులు జిగేలుమని జుళిపించేవి, ఆ జుళిపింపులో పొందేసుఖం విచిత్రానుభూతిని కలిగించేది.

చనువులోని సన్నిహితం పెరిగి ఆమె శిరస్సును హృదయంమీద వేసి అనుకోగలిగినపుడు గుండెలు దడదడలాడేవి. ఒక నిస్వార్థ త్యాగదేవతను, లోకోద్ధార కంకణబద్ధురాలిని, ప్రజల నుర్రూత లూపు

శక్తివంతురాలిని, విషయవిజ్ఞాన నిధిని తన వడిలో చేర్చుకున్నట్లు పులకితుడయేవాడు.

ఆమె అంటుతూ అందనట్లు కనిపించినంతవరకు ఆమెపై వున్న ఆకర్షణ స్నిగ్ధరూపం దాలుస్తున్నది. ఆమె పూర్తిగా కవుగిటిలో వాలిపోయి తననుతాను అర్పించుకున్నపుడు కొండెక్కినట్లయింది. ఆమె తన రాజకీయ జీవితానికి స్వస్తిజెప్పి కైలాసపతి ధర్మపత్నిగా గృహస్త జీవితాన్ని స్వీకరించసిద్ధమయినపుడు అయన మనస్సు బెదిరింది. కళవళపాటుతో రాజకీయాలను సమర్థించాడు. వ్యక్తిగతజీవితంలో విఫలమందిన వారికి కూటనీతిలోను కుతంత్రాలలోను, దౌష్ట్యంలోను దౌర్భాగ్యంలోను మునిగినకటికస్వార్థపరులకుమాత్రమే అక్కడస్థానమున్నది. ఆనందమయ జీవితానికి అవకాశం కలిగినపుడు వాటి కతీతమవుట వివేకమని ఆమె వినిపించినపుడు. తానేదో పొరపాటు చేసినట్లు ఆమెకు దూరమవుతుంటాడు. క్షణంలో ఆమెలోని ఆకర్షణంతా వెలవెలబోతుంటుంది.

పురుషుడు ప్రేరణచేసికూడా విముఖుడు కాగలడు. కాని స్త్రీ ప్రేరితురాలయ్యాక వెనక్కుమరలజాలదు. కైలాసపతి ప్రేరణ సుభద్రనావేశించింది. నూతన జీవితానికి వూహామందిరాన్ని నిర్మించుకున్నది. అణగారిపోయిన సుఖభ్రాంతులన్నీ తిరిగి చిగిర్చినవి. అవి ఆమెలోని వైరాగ్యాన్ని. ఆ ద్వారా సృష్టించుకున్న సేవాభావాన్ని, పురుషద్వేషాన్ని తుడిచివేసినవి.

ఇప్పుడు కైలాసపతి విడివడని చిక్కులో పడిపోయాడు. ఆమె యెదుట పడలేకపోతున్నాడు. శరీరం గగుర్పాటు చెందుతున్నది. స్థిమితమైన మనస్సుతో ఆలోచించ ప్రయత్నించి విఫలమవుతున్నాడు. తనను ఆకర్షించింది సుభద్రా లేక ఆమెలోని ప్రజాకార్యకృషా, అని యెంత ఆలోచించినా నిర్ణయం తెలియుటలేదు. ఆమెను, ఆమెకు ప్రజలలోనున్న ఖ్యాతినితూకంవేసి చూస్తున్నాడు, విడదీసి తెలుసుకోలేకపోతున్నాడు.

కర్మిష్టిగా అంతటి కార్యదీక్షను నిర్వహిస్తున్న ఆమె, ప్రజలలో మన్ననలను ఖ్యాతిని పొందుతూ, జేజేలు కొట్టించుకుంటూ పూజలనందు

కుంటున్న ఆమె ఒక్క మాటుగా యెందుకు దూరం కాగోరుతున్నది అన్న ప్రశ్న పదే పదే మనస్సులో మెదులుతున్నది. ప్రజలలోని ఆ ఖ్యాతికి ఆదరానికి అభిమానానికి, అధికారానికి జేజేలకు దూరమైన ఆమెను వూహించుకున్నపుడు నియుత్సాహం కలుగుతున్నది. హృదయం కూగపోతున్నది.

తాను మొదట యిచ్చిన ప్రేరణతో ఆమె తనలో లీనం కాగోరుతున్నపుడు బిడియంతో కళకళపడి పోతున్నాడు. పూలచెండును ప్రీతితో చేతబట్టినపుడు కీటకాలు చేతినిండా ప్రాకితే శరీరం జలదరించినట్లు ఆమె విషయంలో మనస్సు వెలవెలబోతున్నది. ఆమెకు అంత అవకాశాన్నిచ్చి ఆశలను కల్పించి నేను దూరం కాగోరుట కృతఘ్న తవుతుందని వేదన కలుగుతున్నది.

సుభద్రాదేవికి కైలాసపతి యెడల అనురాగాసక్తులు కలిగినప్పటి నుంచి రాజకీయవైరాగ్యం పొడసూపింది. మహిళామండలి కార్య క్రమాలు చప్పగా కనిపిస్తున్నవి. అన్ని వుద్యమాలయెడ నిరాసక్త కలిగింది.

ఆమె యే ప్రాంతంనుంచి వస్తున్నా నేరుగా కైలాసపతి యింటికే వస్తున్నది. మారిపోయిన ఆమె భావాలకు, ప్రేమమయజీవితానికి టిప్పణీలతో గొప్పగా సంభాషణలను ప్రారంభిస్తుంటుంది. అవి ఆయనకు విన గట విస్తుంటుంది. కాని గంభీరతలో దాటవేస్తూ గడిపివేసేవాడు. కోర్టు కార్యక్రమాలను కల్పించుకుని బయటకు వెళ్ళిపోయేవాడు.

ఆమె యెక్కడికి యే సభలకు వెళ్ళినా హృదయంలోని ప్రేమాంకురం క్షణక్షణమూ పెరిగి పెనవేసుకుంటున్నది. ఆయనలో ఆమెను గురించిన ఆదుర్దా సన్నగిలిపోతున్నది. లభ్యంగానిదాన్ని అమూల్యంగా చిత్రించుకుని అందుకు ఆరాటపడుట, అది లభ్యమైనపుడు సర్వ సామాన్యమైందిగా తోచి నిర్లక్ష్యపడుట ప్రకృతియొక్క నిజస్వభావం.

గంగరాజు అమాయకురాలైన స్వర్ణకుమారిని మైదులో ముంచి పూర్తిగా నాశనం చేశాడని,. వేరే భవనం ఆమెకొరకు నిర్మించి, పెళ్ళి

పేరంటం లేకుండా క్రొత్తకాపురం సాగిస్తున్నాడని. రాజకీయవ్యాపణి మందగించిందని తెలిసినపుడు మనస్సులోని వోకోణంనుంచి వుల్లాసం మరోకోణంనుంచి అంతకుమించిన క్రోధము జనించినవి కైలాసపతికి. ఆ విషయం పూర్తి ఆనందా నిచ్చింది సుభద్రకు.

"ఇది రాజకీయ నాయకుల పాలిటి కళంకం" అన్నాడు కైలాసపతి.

"ప్రేమ దైవప్రసాదిత పవిత్రవరం. ఆ వరం లభ్యమైనపుడు స్వీకరించగల శక్తి ప్రతి ఒక్కరికి వుండాలి. అనంత ఆనందానికి మూలమది. సృష్టికి కారణమది. జీవికి జీవమది. గంగరాజు అదృష్ట మంతుడు" అన్నది సుభద్ర.

"పొందలేని యువతిని పొందినందువలన ఆయన అదృష్ట వంతుడు కావచ్చు. కాని ఆమె దురదృష్టవంతురాలుగదా!"

"ఆహూతి అయ్యేవాటి యోగ్యతలను పరిశీలించుకుంటూ కూర్చో వలసిన అవసరము అవకాశము అగ్నిశిఖలకుండదు. ప్రేమాక్యతలో లీనమై ఏకరూపం ధరించినవారిని విడదీసి యోగ్యతలను యెన్నటం వివేకంకాదు. అక్కడ అంతస్థులు వ్యక్తిత్వాలు యేగిరిపోయి విరాట్ రూపంలోని ఆనందమే గోచరిస్తుంది."

"అంత గాఢంగా ప్రేమించినపుడు వివాహం విధిగా చేసు కోవాలి. అవివాహులై! కలిసికాపురం చేయుట సంఘాన్ని నిర్లక్ష్యంచేసి నట్లవుతుంది. భవిష్య ఆమె జీవితం వ్యర్థంగావచ్చు."

"వారు వివాహం చేసుకోలేదని చెప్పుట కెంత ఆధారమున్నదో చేసుకున్నారని చెప్పటానికయినా అంతే ఆధారమున్నది. గాంధర్వ వివాహం చేసుకున్నారేమో!"

"వ్యక్తిగతమైన తుచ్ఛప్రేమ వ్యవహారం ద్వారా రాజకీయ జీవి తానికి స్వస్తి చెప్పుట, రాజకీయవాదుల పాలిటి కళంకం. ప్రేమకొరకు సమాజసేవను, పేరు ప్రతిష్ఠలను అధికారాలను ఆధిక్యతలను మంటు గలుపుట తెలివి తక్కువవుతుంది."

"నేను యింతకాలము సభలలోను సమావేశాలలోను వివరించిన విషయాలనే మీరిపుడు వల్లిస్తున్నారు. రాజకీయ సాంఘిక సంబంధ లక్ష్యాలు ఆశయాలు ఆదర్శాలు గొప్పవే. కాని పవిత్రమైన ప్రేమ ముందు అవి నిలువజాలవు. పవిత్రప్రేమ జీవితంలో ప్రత్యక్షమైనపుడు అన్నీపోయి ఆ ప్రేమ మాత్రమే అనంత వెలుగుగా ఆనందంగా నిలుస్తుంది."

"శాశ్వతకీర్తి దోహదమిచ్చే ఆదర్శ ఆశయ లక్ష్యాలపోరాట కృషిని ప్రేమవలలోచిక్కి విస్మరించుట వివేకమెలా అవుతుంది. మీ రింతకాలం దీక్షతో లక్ష్యసాధనకొరకు పోరాటం సలుపుతున్న దెందుకు?"

"కీర్తి శాశ్వతమైందిగాదు. ఆదర్శ ఆశయలక్ష్యాలు అంతకంటె అశాశ్వతమైనవి. ఎప్పటి కప్పుడు యుగధర్మాలనుబట్టి మారుతుండవి. కాని ప్రేమ శాశ్వతమైంది. యుగయుగాలకు నిత్యనూతనత్వాన్నిస్తూ అదేరీతితో వుంటుంది. అవే ధ్వనులు అవే చూపులు, వూహాలు, చుంబనలు, ఆలింగనలు, ఆనందడోలికలు, ఆరాధనలు. అక్కడ విసగట వుండదు. అది సజీవ వెలుగు. ఇక నా విషయమంటారా, జీవితం లోని అసంతృప్తి అటువైపు నడిపించిందంటే నమ్ముతారా? నేడు ఆ మార్గం నాకూ కంటకంగా వుందంటే మీరు ఆశ్చర్యపోవచ్చు. మీ ప్రేమే మార్పుకునాంది అయింది. సుఖప్రద జీవితకాంక్ష కలుగుతున్నది. అటు విసగట యిటు వుత్సాహము కలుగుతున్నది" అన్నపుడు అక్కడ తన అపరాధ మేదో వున్నట్లు ఖేదపడ్డాడు.

ఆమె ముందు వాటిని విమర్శించలేక పోయాడు. కాని వారి రాజ కీయ జీవిత నిస్సారతకు కలిగిన క్రుద్ధతపోలేదు. సుభద్రాదేవిలోని రాజ కీయ విరాసక్తతకూడా ఆయన ముందు జిలిబిలిగా కనిపించింది. ఆమె ననుసరిస్తున్న తనను గురించి ఆలోచించినపుడు సిగ్గిల్లాడు.

తప్పటడుగులతో కర్తవ్యాన్ని విస్మరించిన వీరందరిని విడనాడి రాజకీయంలో ముందుకు పోవాలనిపించింది. కొరవడిన నాయకస్థానా

చికి తానే వారసురాలనని తోచింది. తన వ్యక్తిత్వాన్ని వికసింప చేసుకోవాలని వాంఛకలిగింది. వెంటనంటి వుంటున్న సుభద్రను దూరముచేయటం సాధ్యవిషయం గాదు. ఆమె సహకారంతో అగ్రస్థానాన్నధిష్ఠించుట సులభమనిపిస్తున్నది. ఆమెయందు రాజకీయ విషయాలేమీ వంటలో తెచ్చినా వికటరూపం దాలుస్తున్నవి. ఎవరైతే ఒక విషయంలో అతిగా పడుపులెత్తారో వారే ఒకనాడు ఆ విషయాలమీద విరక్తులవుతారు.

ప్రజాకార్యాలనే యేకైక లక్ష్యంగా యెంచి నిస్వార్థంతో నిష్కల్మష విమర్శలలో పడుపులెత్తిన సుభద్ర నేడు వాటికి దూరంగా వుంటున్నది.

18. యుగధర్మం

దుఃఖంలో జరిగే కఠోరనిర్ణయాలు దూరంపొయ్యాక విడిలిపోతుంటవి. స్వర్ణకుమారినిగురించిన వ్యథతో మంచమెక్కిన వింధ్యారాణి నెమ్మదిగా కోలుకున్నది. మనస్సులోనే మదనపడుతూ 'ఎవరి కర్మఫలితం వారే అనుభవిస్తారు. ఆవెడ అంధత్వానికి గురియై మేమెందుకు చనిపోవాలి' అనుకున్నది.

"మనస్సులోని వుద్రుతం తగ్గాక తప్పు తెలిసివచ్చినపుడు పడుపులెత్తుకుంటూవచ్చి మీ పాదాలమీద పడుతుంది, అమ్మగారు" అన్నది పద్మ.

"అది యిక యీ యింటికి రావటానికి వీలులేదు. నా పాదాలంటుకోవలసిన అవుసరం అసలేలేదు" అన్నది వింధ్యారాణి.

"అమ్మాయిగారు అమాయకురాలు. వారి తప్పులేదు. ఇదంతా గంగరాజు మోసం. బాగా చదివి వ్యక్తిత్వమున్న దనేవారు యిలాంటి మోసాలకు యెక్కువగా గురిఅవుతుంటారు" అన్నది పద్మ.

"దానిని అధికంగా చదివించి, సభ్య సంస్కారాలు పేరుతో

అక్కయ్య యిచ్చిన చనువుతోనే యిలా మూర్ఖురాలై కూర్చున్నది" అన్నది వింధ్యారాణి.

"అబ్బ! యెందుకీ అనవసర ప్రసంగాలు! దాని ప్రస్తావన నా ముందు రానీకండి" అని మందలింపుగా అన్నది భూదేవి.

స్వర్ణ విషయంలో భూదేవి యెంత బాధపడుతున్నదో యెవరికి తెలియని గంభీరతలో వుంటున్నది. ఆమె ముందు ఆ ప్రస్తావన తేను యెవరికీ ధైర్యంలేదు. పద్మ వంటయింటివైపు వెళ్ళిపోయింది.

స్వర్ణకుమారి పూర్తిగా విడిచిపోయాక యీ యింటిలో యెంత అనర్థం వాటిల్లుతుందో నన్న భయపడిన పద్మ యిప్పుడు స్థిమితపడింది. తుఫాను భీతిని గల్పిస్తూ ఆకాశవీధిలో విహరించు కారుమేఘాలవలె గంభీరతలో దాచుకుంటూ నిగ్రహించుకుంటున్న నిస్పృహ నిరాశలతో మెలగుతున్న వింధ్యారాణి భూదేవిలతో అలవడింది పద్మ. క్రమేపి యీ దుర్ఘటనను విస్మరించగలిగిన్న ధైర్యం పొడసూపింది.

వసంతకుమార్ వివాహమాడను సమ్మతించివుంటే యీ అనర్థం జరిగివుండేది కాదని, ఆయన వికట ఆలోచనలే యీ చేటుకు హేతువు లయ్యాయని వింధ్యారాణి భావన.

వసంతం మనస్సులోని అభిప్రాయాన్ను తెలుసుకోకుండానే యీ నీచానికి పాల్పడింపగనుక వసంతకుమార్ దోషం లేదంటుంది భూదేవి.

స్వర్ణకుమారి వెళ్ళిపోయినా, స్వగృహంలో తుఫాను చెలరేగినా, ఎవరెన్ని భావాలు చిత్రించుకుంటున్నా వసంతకుమార్‌తో వచ్చిముఖ కులు రావేమ. ఆయన ప్రయోగశాల కార్యక్రమం యథాతథంగా సాగిపోతున్నది.

జాతి మత వర్గ విపక్షత లేకుండా ప్రతిమానవుడు సమాన ప్రతిపత్తితో సహాపడుతూ వర్గరహిత సమాజంలో సంచరించాలని చాటుతున్న యీ ఆధునిక యుగంలో యానానికి ఆరోగ్యానికి దీర్ఘాయువుకి ధనికత్వానికి ప్రాధాన్యతనివ్వాలని, ఉత్సాహమని, విశృత స్వభావులు,

మొండివ్యాధిగ్రస్తులను లేకుండా చేయాలని కృషి సలుపుతున్న వసంతకుమార్‌కు కూడా కొంత ప్రభావం వచ్చింది. 'అభ్యుదయ నిరోధక చక్రవర్తి' అనే బిరుదునుకూడా రాజకీయ నాయకులోకపు ప్రసాదించారు. విదేశాలలోని విజ్ఞానవేత్త లనేకమంది ఆయన కృషిని ప్రశంసించారు. కర్మిష్టిగా తన ప్రయోగశాలను నిర్వర్తిస్తున్నాడు.

స్వర్ణకుమారి వెళ్ళిపోయాక, యింటిలో ఆవరించిన దుఃఖచ్ఛాయలతో విసిగి యింటికి పోవటం చాలావరకు తగ్గించాడు. గడియారంలోని గంటలవలె పద్మ ఆయనకు కావలసిన సౌకర్యాలన్నిటిని సమకూరుస్తున్నది.

ఆమె భోజన కారియర్ తెచ్చి, దగ్గరగా వెళ్ళి పిలిచినపుడు, యెన్ని పనులున్నా కట్టిపెట్టి పసివానివలె ఆమె ననుసరిస్తాడు.

ఆయన భోజనం ముగించుకుని చేతులు కడుక్కుంటున్నపుడు 'బాబుగారు, గంగరాజుగారు కట్టించిన నూతనభవనంమీద మీ పేరును లేబులుగా వేసుకున్నాడట. అందులోనే అమ్మాయిగా రుంటున్నారుట. వారి పశుత్వానికి హద్దులు చూపించవలసిన అవసరం మన కున్నద' అన్నది పద్మ.

ఆయన మృదుహాసంలో "వారి భవనానికి వారు నచ్చిన పేరు పెట్టుకోగల హక్కు వారికున్నదిగదా!"

"మీ పేరును కళంకితం చేయగలహక్కు వారికిలేదు బాబుగారు."

"నా పేరును మరెవరూ యే రూపంలోనూ వుపయోగించుకోగూడదని నేను యెక్కడా రిజిష్టరు చేయలేదు. చేసినా చెల్లదు."

"పోనీండి, ఇదీ ఒక మంచికే జరిగింది. మీపేరున పిలువబడే ఆ భవనంలో వుంటున్నందున అమ్మాయిగారి అపరాధాన్ని భగవంతుడు క్షమిస్తాడు."

"విశ్వాసంలో అంధత్వంతోపాటు తృప్తికూడా వుంటుంది."

"ఎక్కడ విశ్వసించాలో తెలుసుకు మసులుకోవటం అన్నిటి

కంటె గొప్ప నైపుణ్యం బాబుగారు. అమ్మాయిగారు సుఖంగావుంటే నాకు సంతోషమే. మన యింటిలోని నిస్సబ్దతను నిర్మూలించండి."

"కొన్ని కొన్నిటిని మానవుడు పరిష్కరించలేడు. అలాంటి వాటిమీద శ్రద్ధను పెంచితే చెడు ఫలితాలు సంభవిస్తవి. వాటిని కాల మొక్కటే సరిదిద్దగలుతుంది."

"అవి అశ్రద్దలోని ఆలోచనలు బాబుగారు సమస్య లుత్పన్నం కావటానికి కారణాలున్నట్లే పరిష్కరించుటకు మార్గాలుకూడా తప్పక వుంటవి. అమ్మాయిగారికంటె గొప్ప యింటి బిడ్డను మీరు వివాహమాడి యింటికితెస్తే యింటిలోని అందరి దుఃఖము దూరమవుతుంది."

"సుఖ దుఃఖాలు వెలుగుచీకట్లు లాంటివి. దుఃఖంలోనే నిజమైన జీవిత అనుభవాల్లు యేర్పడుతవి. జన్మతోనే దుఃఖాన్ని తెచ్చుకుంటూ, సుఖానికి వెదుకుతుంటాడు. కొన్నివేళలందు సుఖంకూడా దుఃఖంగా చరించి యేది సుఖమో యేది దుఃఖమో నిర్ణయించుకోలేని స్థితిలో వుంటాడు. సుఖమెంత నిత్యంకాదో దుఃఖమూ అంత నిత్యంకాదు. అలాంటి క్షణిక దుఃఖంకొరకు దీక్షలోని నిర్ణయాన్ని విస్మరించుట వెర్రితనమవుతుంది.

"అంత కఠోర నిర్ణయ మేమిచేసుకున్నారు బాబుగారు."

"దుఃఖంలో సుఖాన్ని పొందగల నేర్పును అలవర్చుకున్న తరు వాతనే లోకకళ్యాణం కొరకు దిగాలి. ప్రజాకార్యాలను చేపట్టాక ప్రతి అడుగులోను త్యాగము ఆదర్శము అనుభవంలో ప్రతిబింబించాలి మాటల లోను వుపన్యాసాలలోను ఆదర్శాలను వర్ణిస్తూ, స్వానుభవంలో స్వార్థాల వైపు మొగ్గుట ఘోరమోసమవుతుంది. నా వివాహంద్వారా ఒక అనాధ స్త్రీ వుద్ధరింపబడుట నా ఆశయం. సహనశీలి, సచ్చరిత్రి. సేవాభావి, ప్రేమమూర్తిని అయిన సామాన్య స్త్రీని వివాహమాడి ఆ స్త్రీని ఆదరిం చుట ఆదర్శం కాదంటావా?"

"మీరు విదేశాలనుంచి వచ్చిన ప్రధమంలో అన్నమాట లివి. ఆ మాటలే పెద్దమ్మగారికి చిన్నమ్మగారికి తీరని బాధను కలిగించినవి.

ఆ మాటలే యింత అనర్థానికి దారి తీసినవని అందరి అభిప్రాయము. పట్టుదలతో అనర్థాలను కల్పించుట అవివేక మౌతుంది బాబుగారు"

"నిజమైన త్యాగస్వభావంలోని నిర్ణయాలు స్వప్రయోజనాల కొరకు మారవు. స్వవిషయంలో సర్వాన్ని కోల్పోయినా లక్ష్యం తారు మారు కాదు."

"మీకు వచ్చిన అనాధను యెక్కడయినా చూసి మెచ్చు కున్నారా?"

"అవును చూసి అన్నివిధాలా సంతృప్తి చెంది శాశ్వత నిర్ణయం చేసుకున్నాను."

"అంత అదృష్టానికి నోచుకున్న ఆ అనాధయెవరో ఒక్కమాటు చూపెట్టండి బాబుగారు."

"నీకు నచ్చకపోవచ్చు, ఆత్మవిశ్వాసంతో జరిగిన నా నిర్ణయా నికి తిరుగులేదు. అక్కడ అప్రస్తుత చర్చలకు తావులేదు."

రుద్ధకంఠంతో "నన్నంత హీనురాలుగా యెంచకండి బాబు గారు. మీరు నాకు దైవసమానులు. దేశసేవచేయుట నాకు చేతకానిది. కాని సేవ నా వృత్తి కనుక మీరు వివాహితులైతే మీ కుటుంబ సేవలో నా జీవితాన్ని గడిపి తరిస్తాను. మీకుటుంబ సేవను దేశసేవగా భావించి తృప్తి పడతాను. అంతటి ఆశలతో ఆపేక్షలతో నున్న నాకు మన యింటికివచ్చు భాగ్యదేవతను చూడాలనివుండుట దోషంగాదుగదా!"

"ఆమె ద్వారా నా జీవితం ధన్యమవుతుందనిమాత్రం చెప్ప గలను."

"మీ క్షేమంకొరకు మీకుటుంబ పేరు ప్రతిష్ఠల కొరకు, పెద్దమ్మ చిన్నమ్మగార్ల తృప్తికొరకు వున్నతవంశంలో వివాహమాడ మని కోరాను. అది నా ధర్మం. కాని స్వయంగానే నొక దళితజాతిలోని దాన్ని మాలాంటి హీనజాతిలోని అనాధను వివాహమాడి మా జాతికే ఘనత నిచ్చుట నాకు హర్షదాయకం కాకపోదు. అయినా దాస్యవృత్తిలో కృతజ్ఞతలో తరతరాలు వస్తున్నందున గాబోలు మీ జాతిలో వున్నత

స్థాయిలోని తగిన యువతిని వివాహమాడితేనే బావుండునని పిస్తున్నది."

"కృతజ్ఞతలో వ్యక్తిత్వాన్ని కోల్పోగూడదు. దాస్యత్వంలో కరుడు గట్టిన బానిస స్వభావాన్ని తత్తునియలుచేయు భావ విప్లవం పరువులెడుతున్న యీ యుగంలో నీ మాటలు తగవు. యుగధర్మమే పరమధర్మము. నేను వరించిన వనిత వృత్తిరీత్యా దాసి కావచ్చు కాని సర్వవిధాలా నాకు యోగ్యురాలు."

ఉత్సుకభరిత కంఠంతో 'మీ పాదాలు పట్టుకుంటాను ఒక్కమాటు చూపెట్టండి బాబుగారు. ఆ అదృష్టవంతురాలున్న చోటైనా చెప్పండి' అన్నది పద్మ.

ఆమె కపోలంబట్టి మృదువుగా లాగుతూ 'ఆ అదృష్టవంతురాలు యీ పట్టణంలోనే వున్నది. నీకు బాగా పరిచితురాలే. కాని ఆమె నా ధర్మపత్ని అయ్యాకకూడా మరొకరి సేవలను స్వీకరించు స్వభావిగాదు. ఆమె రాకతో మా యింటిలో దాసి అవుసరం లేకపోవచ్చు.' అన్నాడు.

"నా అవుసరం లేకుండా మీ సేవలను ఆమె చేయవచ్చు. నేను ఆమె సేవలు చేస్తాను. అది నా హక్కు బాబుగారు."

"ఆమె మరొకరి సేవలను స్వీకరించదు సహించదు."

"ఈ యింటిలో సేవచేయు నా హక్కును తీసివేయు అధికారం ఆమె కుండదు."

"సర్వ అధికారాలను ఆమెకు సంక్రమింపచేయదలచాను. నన్ను నేను ఆమెకు అర్పించుకుని హాయిని పొందగోరుతున్నాను."

"ఆమెను ప్రార్థించి వేడుకుని నా హక్కును నిలుపుకుంటాను. ఆమె యెవరో దయచేసి చెప్పండి."

"ఆమె ముందు ప్రార్థించవలసిన పోరాడవలసిన అవసరముండదు. ఆమె పరిపాలన శాసనరూపంలో జరగదు. సేవికగా నిలచి అనురాగంతో అందరను ధర్మపథమునందు నిలిపి ఆనందితులను చేయగలుగుతుంది. ఆమెను చూసి నీవు అసూయపడవుగదా!"

'ఈ లోకంలోని సర్వసంపత్తి మీకు సంప్రాప్తమయితే నాకంటె ఆనందించేవా రుండరు. అలాంటి నేను అసూయపడతానా బాబుగారు :'

'అయితే చూడు, 'ఆమెచేతి వ్రేలినున్న రింగును అటూయిటూ త్రిప్పుతూ, చిన్నినవ్వును ప్రదర్శిస్తూ 'భగవంతుడు దయామయుడు. కొందరికి కావలసిన వన్నిటిని యెట్టయెదుటనే చేర్చివుంచుతాడు. మానవుడు వెర్రితో యెదుటివాని విలువ గుర్తించలేక వెతుక్కుంటూ పోయి విసిగి దొరికినదాన్ని మెడలో తగిలించుకోవటం కద్దు. నాకు కావలసిన వాటి నిర్ణయం సరియైన రీతిలో చేసుకోగల నిపుణత్వం ప్రసాదించినందుకు భగవంతునికి శతకోటి నమస్కారాలు చేస్తున్నాను. నా ద్వారా నీవు, నీద్వారా నేను వుద్ధరింపబడుటేగాదు, మన కలయకద్వారా భవిష్యత్తులో సమాజానికి వినూత్న సందేశాలు అమరవాణిరూపంలో వెలువడగలవని ఆశిస్తున్నాను పద్మా.'

కళవళపాటుతో ఆమెముఖం జేవురించింది. శరీరం కంపించింది. పాదాలు వణుకుతున్నవి. నేత్రాలు చెదురుతున్నవి. గుండెల్లో రైళ్ళు పరువులెడుతున్నవి. మనస్సులో కావుర్లు క్రమ్ముతున్నవి. అదరుతున్న అధరాలతో 'బాబుగారు' ఇది వుద్ధరణ కాజాలదు. ధర్మచ్యుతురాలివిగా రూపొందించట మవుతుంది.' అంటూ ఆయన పాదాలమీద వాలిపోయింది.

ఆయన అర్థంగాని ఆ దుర్వార్తతో చీకాకు పడుతూ ఆమె శిరస్సును బట్టి పైకి లేవనెత్తి "నీ బంగారు ? యేమిటి అనాలోచితంగా అనర్థపు మాటలనవోకు. ఆ తరువాత పశ్చాత్తాపంవలన ప్రయోజన ముండదు. నా ప్రక్కన ధర్మపత్నిగా నిలిచినందున నీ ధర్మం నశిస్తుందా ?" అని దృఢమైన శబ్దాలలో అన్నాడు.

"స్వార్థ ప్రయోజనంకొరకు, ఆదరించి పోషించే దాతలకు ద్రోహం తలపెట్టుటకంటె మరణించట మంచిది. నేను దాసిగా వుండి పొందుతున్న ఆదరాన్ని పొందనివ్వండి, ఆ స్థానమే నాకు ఆత్మీయ

మైంది. ఆక్రమణ అందరూ చేయగలిగిందిగాదు. రక్షణగా నిలిచినవారే భక్షకులుగా దిగుట భరింపరానిది.''

''ఇది నీవెర్రితనమూ అమాయకత్వమూదప్ప విశ్వాసద్రోహమూ గాదు, భక్షణాగాదు. నచ్చి, మెచ్చి, ప్రేమించి వివాహమాడ గోరినవారిని నిర్లక్ష్యంతో తిరస్కరించుట మూర్ఖత్వమౌతుంది. అందుకు తరువాత యెంతైనా పశ్చాత్తాప పడవలసి వస్తుంది.''

''నచ్చుట మెచ్చుటవేరు, ప్రేమించుటవేరు బాబుగారు. అందుకు అంతస్థును అర్హతనుపాటించుట అవుసరం, మీరు తరతరాలుగా వున్నత కుటుంబీకులు, విదేశాలలో విలువైన డిగ్రీలను పొంది ఖ్యాతి గడించిన వారు. విజ్ఞానవేత్తలు, మానవజాతి వుద్ధరణకు కంకణబద్ధులైన మీరు ఒక అనాథయైన దాసిని వివాహమాడ గోరుట సహింపదగ్గ విషయం గాదు.''

''ఒక అనాథ నుద్ధరించుట హర్షదాయకమేనని, ఆదర్శమని కొద్ది సమయం ముందుగనే అన్నావు.''

''ఒక అనాథను వివాహమాడుట మీకృత నిశ్చయమైనపుడు, అది ఆదర్శమని, దళితజాతి కొక వెలుగులాంటిదని అన్నాను. కాని ఆ ప్రయోగం నా మీదనే జరుప జూచుట నన్ను సంఘంలో పరిహాసాల పాలు చేయటమౌతుంది. మీ దాసిగావుంటూ మిమ్ముమవలలో వేసుకుని, వివాహం చేసుకుని భ్రష్టుని చేసినట్లు లోకం కోడై కూస్తుంది. లోకం దృష్టిలో ద్రోహినై మీ ధర్మపత్నిగా జీవించేకంటే మరణించుట మంచిదిబాబుగారు,''

''అనవసరమైన ఆలోచనలో నీవు యెంత అలసట చెందినా, నా నిర్ణయం ఆ రింగును నీకు ధరింపజేసిననాడే జరిగిపోయింది. ఆ రూపంగా నా హృదయాన్ని నీకు అర్పించుకున్నాను. అంకితమైపోయిన హృదయం అంతం గావచ్చుగాని మరోవైపు మరలదు.''

''మీపాదాలవద్ద రక్షణపొందే ఒక దాసికొరకు మీ అమూల్య జీవితాన్ని పణికట్టుగా పెట్టకండి. పాదరక్షలు పాదాలందే వుపకరిస్తవి శోభిస్తవి. వాటిని శిరస్సున ధరించ ప్రయత్నిస్తే వికటమౌతుంది''

'నా నిర్ణయాలు యెంత నిశ్చితరూపం దాలుస్తవో నీకు తెలుసు. నిన్ను పొందే అవకాశం కలుగనపుడు అవివాహితుణ్ణిగానే వుండి పోతాను'

ఆదుర్దాపడుతూ, 'అదేమిటి బాబుగారు! నేను జీవితాంతం మీ యెదుటనే మీ పాదాలచెంతనే దాసిగా వుంటాను. వివాహం తగిన యువతితో చేసుకుని, మీ యిరువురి సేవచేసే అదృష్టాన్ని నా కివ్వండి.'

"నీ హృదయంలోని దాస్యభావాన్ని తుడిచివేసి ఆత్మాభిమానంతో గూడిన వ్యక్తిత్వం పొందసూ పేవరకు నేను అవివాహితుణ్ణిగానే వుంటాను." అంటూ ఆయన ప్రయోగశాలవైపు వెళ్ళిపోయాడు.

దీనత కృతజ్ఞతభరిత దృక్కులతో ఆయన వెళ్ళినవైపు హస్తాలు జోడించి నమస్కరిస్తూ 'మీరు మహాపురుషులు. ఆకాశంలో విహరిస్తూ సమస్త జీవాలను ఒకేరీతిలో ఆదరించు ప్రభాకరునిబోలిన తేజో మూర్తులు, పట్టుపురుగులవలె తేనెటీగలవలె లోకంకొరకు మీ విజ్ఞానాన్ని ఆత్మత్యాగంతో వెదజల్లుతుంటారు. లోకమంతా అడుగుఅడుగు స్వార్థంకొరకు వేస్తుంటే మీరు ప్రతిఅడుగును లోక కళ్యాణంకొరకు వేస్తున్నారు. వారు స్వార్థంలో పరువులెడుతుంటే మీరు త్యాగంతో ఆత్మార్పణ చేసుకుంటున్నారు. యే స్వార్థకాంక్ష జీవసృష్టికి మూలమవుతుందో, యే స్వార్థకాంక్ష జీవి మనుగడకు మూలమవుతుందో ఆ కాంక్షలలోని కార్పణ్యాలే సర్వనాశనాలకు హేతువు కాబో తున్న యీ స్వార్థయుగంలో, కక్షలు కార్పణ్యాలు నగ్న స్వరూపం ధరిస్తున్న యీ యుగంలో బుద్ధావతారాన్ని స్మృతికి తెస్తూ నూతన యుగానికి నాందినిస్తున్న త్యాగమూర్తివైన నీ హృదయంలో నా యెడల కలిగిన శ్రద్ధకు ధన్యురాలిని. క్షుద్రమబ్బులు సూర్యుని అంటిపుండజాలనట్లు మీ ధర్మపత్నిగా వుండగల ఆశగాని అర్హతగాని నాకు లేదు బాబుగారు. తెలిసి, తెలిసి అపేక్షతో అందని స్థానాన్నిపొంది మీ ప్రక్కన నిలువగల దుస్సాహసాన్ని యెలాచేసేది! మీ అడుగులలో నా ప్రాణాలనర్పించగలను. ఈ లోకంలో చేయజాలవి

యేకార్యాన్నయినా చేయగలను. కాని మిమ్ము న్యూనతపర్చేది యేదీ చేయజాలను. అందుకు క్షమించండి!" అంటూ ఆ గచ్చుమీది ఆయన పాదాల అరవళ్ళలోని పాదధూళినితీసి నేత్రాల కద్దుకుంటూ దీర్ఘ శ్వాసను విడిచింది.

19. అంతర్రహస్యం

వసంతవిహార్ నిర్మాణము, అలంకారము అతి శ్రద్ధలో నిర్వహించబడినవి. ప్రతిదృశ్యంలోను దేశీయ విదేశీయ మిశ్రమ నవీన సభ్యత వుట్టిపడుతున్నది. భవనమునుంచున్న ఆవరణలో పూలమొక్కలు క్రోటన్సు, మొక్కలతోపాటు కొన్ని ఫలవృక్షములుకూడా నాటబడినవి. నిర్మాణము, అలంకారాలు పూర్తిఅయ్యాక జనసమర్ధం అదృశ్యమయింది. ఆవరణలో తోటమాలి మాత్రమే కనిపిస్తుంటాడు.

గృహప్రవేశం యెప్పుడు జరిగిందో ఎవరికీ తెలియదు. ఒక యాత్రికద్వయం ధర్మశాలలో ప్రవేశించునట్లు గంగరాజు స్వర్ణకుమారి భవనంలో ప్రవేశించారు. వారి వివాహం యెంత రహస్యంగా జరిగిందో అంత రహస్యంగానే కాపురం సాగిస్తున్నారు.

అటు ప్రజాకార్య దాగుడు మూతలాటలో యిటు నూతన దాంపత్యంతో రెండు సంవత్సరాలు గడిచిపోయినవి. నూతన కోర్కెలీడేరి వాంఛిత దాంపత్యం సమకూరినా రాజకీయరంగంలోను ప్రేమరంగంలోను కలిసి మెలిసి ఐక్యమై యేకరూపమొంది, కాదన్న వారిని కాలదన్ని గాంధర్వ వివాహం జరుపుకుని, నూతనభవన ప్రవేశం చేసుకుని అందరికీ అతీతమై యేకాంతంలోవుంటూకూడా ఉత్సాహాన్నిగాని ఆనందాన్నిగాని చవిచూడలేకపోతున్నారు. నిస్తబ్ధవాతావరణంలో నిర్లిప్తంగా నిరాసక్తంగా కాలాన్ని గడుపుతూ గతాన్ని నెమరువేసుకుంటూ పోతున్నారు.

గంగరాజు వెనుకటి వ్యాపకాలకన్నిటికి స్వస్తిచెప్పి, స్వర్ణచెంత నిర్మల జీవితంతో నిలిచి పోవాలని ప్రయత్నిస్తున్నాడు. స్వర్ణ మనస్సు

లోని కల్లోలాలను సర్దుబాటు జేసుకుని గంగరాజుమీద విశ్వాసాన్ని స్థిరం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నది. కాని ఆ ప్రయత్నాలలో అడుగు అడుగున కళవళపాటు జరుగుతున్నది. అలాంటి మానసిక అస్తవ్యస్త పరిస్థితులలోనే స్వర్ణ గర్భవతి అయింది.

ఇరువురిలోను యిప్పు డొకరూపమైన స్థిమితమేర్పడింది. ఎవరికి వారే అంతర్గత శాంతిని పొందుతున్నారు. ఇరువురిలో నిస్తబ్ధత దూరం గావటానికి మరొకరి ఆవశ్యకత కలిగిందా అన్నట్లు, ఆ కొరత తీరనే స్వర్ణ గర్భధారణ జరిగినట్లు సంభవించింది.

ప్రాతఃకాలపు దినకరుని లేత కిరణాలు వృక్షదళాలమీద జిలిబిలిగా ఆడుకుంటున్నవి. వసంతవిహార్‌లోని పైపుతో పూలమొక్కలపై నీరు చిందించినందువలన గాబోలు పుష్పగుచ్ఛాలమీద మంచిముత్యాలవలె నీటిబిందువులు మెరుస్తూ ఒక్కటొక్కటిగా క్రిందికి జారుతూ శోభను పెంచుతున్నవి. పూలదానిలలోకి గాబోలు తోటమాలి వెదికి వెదికి యెన్నుకున్న పుష్పరాజములను త్రుంచి బుట్ట నింపుకుంటున్నాడు. మధూటికలు గాలిలో తేలియాడుతూ తోటమాలి నీతిమాలిన పనికి నిందిస్తూ తమలో తాము ప్రచారం చేసుకుంటున్నవి. తోటలో నీటిని చిందిస్తూ తిరుగుతున్న ఫౌంటెన్ద్వారా యేర్పడుతున్న వలయానికి లేతయెండ అద్వితీయమైన అందాన్నిస్తున్నది. వసంతవిహార్ గోడమీద ప్రాకిన మాధవీలత మరోవైపుగా ప్రాకిన మాలతీలతలు కలిసి ఆర్చిగా అల్లుకున్నవి. వాటిలోని ఒక లత స్వర్ణ లిఖితఫలకంమీదుగా పోతూ 'వి' అను అక్షరాన్ని కప్పివేసినవి. 'వసంత హార్' అన్న అక్షరాలు మాత్రం ప్రతిబింబిస్తున్నవి.

భవనంలో మనుష్యలున్న అలికిడి కనిపించుటలేదు. ప్రశాంత వాతావరణం గంభీరముద్రను దాలుస్తున్నది. హాలులో కుర్చీనందున్న గంగరాజు దినపత్రికను తిరగవేస్తున్నాడు. స్వర్ణకుమారివచ్చి సోఫాలో కూర్చున్నది.

గంగరాజు ఆదుర్దాతో "అక్కడెందుకు స్వర్ణా, ఆ యీజీచైర్‌లో కూర్చో," అన్నాడు.

ఆమె చిరునగవును చిలికిస్తూ "పరవాలేదులెండి" అన్నది.

"నీకొరకుగాదు, నీ గర్భంలోని అదృష్టవంతునికొరకు చెబుతున్నాను."

"అంతవున్నత కలలమధ్య వుద్భవించేవాడు అదృష్టవంతుడవుతానుకోవటానికి వీలులేదు."

"మహా అదృష్టవంతుడవుతాడని నేను గట్టిగా చెప్పగలను. నీ అందచందము, నీ బుద్ధి, నా తెలివి, వక్తృత్వమువస్తే సాటిలేని మేటి కాగలడు. ముందు నీవు ఆ యీజీచైర్‌లోకి పో."

ఆమె మందస్మితంతో కొంటెగా చూస్తున్నది. ఆయన, చెంతకు చేరి లాలింపుగాచేయిబట్టి "లేచి పద, ఆ రోజుల్లో నా మాట అక్షరాల పాటించేదానివి. నేను ఒక్కమారైనా విసవెందుకు చెప్పు?" అంటూ మృదువుగా లేవ ప్రయత్నిస్తున్నాడు.

ఆయన్ను వినతితో ప్రక్కన కూర్చుండబెట్టి 'పుట్టబోయేది పిల్లవాడని యెలా అనుకుంటున్నారు? ఆడపిల్ల పుట్టుతుందేమో!' అన్నది.

"పిల్లవాడయితే నా పేరు ప్రతిష్ఠలకు ఖ్యాతికి ప్రజలలోని పలుకుబడికి వారసుడవుతాడు. నా త్యాగాన్ని, సేవను, ప్రజాపలుకుబడిని సద్వినియోగం చేసుకో గలుగుతాడు. నేరుగా నాయకుడై వున్నతపదవుల నందుకోగలుగుతాడు. శాసనకర్త కాగలిగితే మన జీవితాలు ధన్యమైన వనుకుంటాను." అన్నాడు.

"మీ మనస్సులో యిన్ని వూహలున్నవి గనుక నిస్సందేహంగా పాపాయి జన్మిస్తుంది" అన్నది.

"ఎందుకని?"

"ప్రకృతి యెప్పుడూ మానవ కోర్కెలకు ప్రతికూలంగా నడువ ప్రయత్నిస్తుందని మా బావ చెప్పగా విన్నాను."

'ఆత్మవిశ్వాసంలేని వారనే మాటలవి స్వర్ణా.' అంటుండగా బయటినుంచి పిలుపువచ్చింది.

తిరిగి ఆ కేక వినడానికి ప్రయత్నిస్తుండగా బయటనుంచి పది మంది జనం ఒక్కమాటుగా హాలులో ప్రవేశించారు.

వారిని చూచినదే తడవుగా గంగరాజు విశ్చేష్టుడయ్యాడు.

ఆ గుంపులోనుంచి యిరువురు పసివారు 'నాన్నా!' అంటూ గెంతులతో వెళ్ళి గంగరాజును చుట్టవేసుకున్నారు. ఒక బాలుడు ఆయన అంగుళీయములను బట్టి అటుయిటు గుంజుతూ, లాలింపుతో 'ఇన్ని రోజులనుంచి నీవు రావటంలే దెందుకని నాన్నా!' అంటూ ఆయన అరచేతిని తన ముఖంమీదవేసి అదుముకుంటున్నాడు.

గంగరాజు మనస్సిప్పటికి తేరుకున్నది. అయినా మనస్సును పూరించుకోవలసి వస్తున్నది. రోషావేశితుడై, వారిని విదిలించి ఒక్క త్రోపుతో గుంపుమీదికి నెట్టి "బుద్ధిలేని వెధవలు. ఎవరు మీరు? ఎవరను కుని భ్రమించి మాట్లాడుతున్నారు. ఎక్కడినుంచి వచ్చి పడ్డారు?" అని గద్దింపుగా గ్రుడ్లు వురుముతూ పళ్ళు పటపట లాడించాడు.

ఆ పసివారు భయభీతావహులై వచ్చిన ఆ గంతుకలలోనున్న స్త్రీ కాళ్ళకు చుట్టవేసుకున్నారు. ఆ స్త్రీ చలించినట్లులేదు. దీర్ఘమైనవేడి నిట్టూర్పును విడుస్తూ స్వర్ణవైపు తీక్షణంగా చూస్తున్నది.

ఆమెతో వచ్చినవారంతా ఆవేశాన్ని అణచుకుంటూ ఆమె వైపే చూస్తున్నారు.

గంగరాజు వృద్ధివైపుచూస్తూ కూడదీసుకున్న ధైర్యంతో, కఠోరమైన ధ్వనిలో "ధర్మసత్రవలో ప్రవేశించినట్లు దర్జాగా ప్రవేశించారు. ఏం పని యిక్కడ, యెవరిని మోసగించాలని - బయటకు నడవండిముందు" అన్నాడు.

ఆగంతకులలోని ఒక మహాబలి ముందుకు రెండడుగులు వేశాడు. కాని ప్రక్కనున్న మరోవ్యక్తి చేయిబట్టి ఆపి, ఆ పిల్లలతల్లి వైపు చూపాడు.

ఆమె నోట మాటలేదు. అధరాలు అదురుతున్నవి. నాసికా రంధ్రాలు బుసలు కొడుతున్నవి. కనుకొలకులగుండా కారుతున్న

కన్నీటి బిందువులు గచ్చుమీదికి రాలుతున్నవి. ఆమె చీరె చెరగులో దాక్కుంటూ వోరగా గంగరాజును చూస్తున్న బాలుంలోని భీతి భయంకరంగా గనిపిస్తున్నది.

'నాటకంలోని అంకం ముగిసిందిగా నడవండి బయటకు. ఈ బావా యీ వూరిదిగా కనిపించుటలేదే!' అని హేళనగా అన్నాడు గంగరాజు.

'ముయ్ నోరు మూర్ఖుడా, ఆదర్శాలని, ఆశయాలని, లక్ష్యాలని, ధర్మమని, నీతని, సేవని, త్యాగమని వేదికలమీద యెక్కి ప్రబోధిస్తూ అధికారాలను హస్తగతం చేసుకుని, చేసే అనర్థాలకు అంత ముందొద్దూ. ఓప్రక్క సొసయిటీలని, సంఘాలని పెట్టి చీకటిమార్గాన దోచుకుంటూ మరోప్రక్క అమాయకులయిన ఆడపిల్లల మోసగించి, వారి జీవితాలను సర్వనాశనం చేస్తున్నావ.' అంటూ క్రోధావేశాలతో ఒక నాగరిక యువకుడు గంగరాజువైపు గంతువేశాడు.

ఆ పసిబాలుర తల్లి బొంగుమన్న కంఠంతో 'అన్నాయ్, వారి మీదకు పోబోకు. దళసను పెంచి లోకంముందు నిలిచి ఘృణీకారాలు పొందేకంటే శోభను సహించుటే మంచిది' అన్నది.

"ఇలాంటి ఘోరపాపులకు కోర్టులు విధింపజాలని, పోలీసులు దండింపజాలని కఠోర శిక్షలను మా బోటివాళ్ళు చవిచూపకపోతే సంఘ భయం పోతుంది ఆ భయంలేకపోతే వీరి అఘాయిత్యాలకు అంత ముండదు." అన్నాడు యువకుడు.

గంగరాజు కిమన్నీ అర్థంగానట్లు, అమాయకునివలె గంభీరతను నటిస్తూ "మీరు యీ సంభాషణంతా నన్ను యెవరుగా భావించి అంటు న్నారో నాకే తెలియుటలేదు. ఆవేశాలవల్లగాని, కోపతాప ప్రదర్శనల వల్లగాని ప్రయోజన ముండదు. దయతో మీరంతా మహిళామండలి ఆఫీసుకుపదండి. అక్కడ విషయాలను వివరంగా మాట్లాడుకుందాము." అన్నాడు.

'ఛీ! ధూర్తుడా, మేము మాట్లాడుతున్నది మరెవరిని గురించో

గాదు. నీ పాపంపండి నిజస్వరూపం బయట పడుతున్నది. అమాయకు రాలైన విమలను మోసగించి. భార్యగా స్వీకరించి, భర్తగా నటించి, ప్రతిఫలమైన యిరువురు సంతానాన్ని ముందుంచి, వారి ప్రారబ్ధానికి వారిని విడిచి, మరో అమాయకురాలను మోసగించి కులుకుతున్నావు. నేడు యేమీ యెరుగని అమాయకునివలె మాట్లాడను పాపభీతయినా లేదు?' అంటూ దంతాల పటపటలతో తన చేతినిపట్టివుండిన విమలను విడి పించుకుని గంగరాజుమీదకు దూకప్రయత్నించాడు.

'ఆగు, ఆగు. ఆయన్ను అనవలసిన పనిలేదు అన్నయ్యా!' అంటూ ఆ యువకుని బలంతో ఆపింది.

'ఆయన్ను అనవలసిన పని లేకపోతే, ఆయన అపరాధమే లేకపోతే యీ హంగామా అంతా యెందుకు? మేము రావటమెందుకు? మాదే అపరాధమా?' అని ఆవేశంలో గద్దించాడు ఆ యువకుడు.

'నన్ను క్షమించండి. ఆఖరిక్షణాలలో నున్న వాడిహృదయము మనస్సు యేకమై రెపరెపలాడుతూ గది బయటవైపు వెలుగును ఆఖరి సారిగా చూసి తన ఆశలన్నిటిని నిరాశలుగా వదిలివేసి నిట్టూర్పుతో ప్రాణాన్ని త్యజించునట్లు, సర్వము కోల్పోయిన నేను జీవిత ముగింపుకు ముందు వారి నూతన అధ్యాయంలోని పాత్రనుకూడా దర్శించి యీపసివారి భవిష్యత్తును కూడా నూతన వధువుకే అప్పగించి సెలవు తీసుకుందామని వచ్చాను. నాలోని ఆశాసౌధాలు అంతమొందినవి. ప్రతీకారవాంఛ అంతకంటె లేదు. ఆయనగారి తృష్ణకు నాకంటె ముందు వారు ఆహుతి అయిన రీతిలో నేనూ అయినాను. నూతనంగా ప్రవేశించిన యీ స్వర్ణకుమారి జీవితమయినా సఫలం గావాలని ఆశీర్వదించి పోదామని వచ్చాను.........'

అంటూ ఆమె దుఃఖవేదనలతో నిండిన కంఠంతో చెప్పుకు పోతుండగా మధ్యలో విసగటతో హేయతతో పొంగుతున్న రుసరుసలతో 'నీవు ఆ గదిలోకి పద స్వర్ణా!' అంటూ స్వర్ణకుమారి చేయిపట్టుకున్నాడు.

స్వర్ణ యేకాగ్రంగా విమలవైపే చూస్తున్నది.

విమల తన వ్రేలిరింగునుతీసి "ఎన్నో ఆశలతో ఆనాడు వారి ప్రేమకానుకగా యీ రింగును పొందాను. రిజిష్టరు వివాహమని యెవరినో నాటక పాత్రధారిగా రప్పించి వారి సమక్షంలో నడిపిన వివాహ తంతు అంతా నా తృప్తికొరకు చేసిన నటన అన్నా, నా కంటె ముందు వారికి జరిగినవికూడా యీ రూప తంతులేనని తెలిసినా ఈ రింగునే పవిత్రప్రేమ స్వరూప ప్రత్యక్ష సత్యంగా తృప్తిని కల్పించుకుని నేటి వరకు గడిపాను. ఈ అభాగ్యురాలి కానుకగా ఈ రింగును స్వీకరించి నీవయినా సుఖపడమని ఆశీర్వదిస్తున్నాను చెల్లీ!" అని స్వర్ణ చేతికిచ్చింది.

గంగరాజు పట్టరాని ఆవేశపుడై నిరుపాయుడై ఘృణీకరించుకుంటూ స్వర్ణచేతిలోని రింగునులాగి తీసుకుని విమలమీదకు విసురుతూ "పో, ముందు బయటకు." అని గద్దించాడు.

విమలకు తగిలినరింగు పృధ్వీమీదపడి దొర్లుకుంటూ తిరిగి స్వర్ణ వైపుకే నడిచింది.

విమల పొర్లుతున్న దుఃఖాన్ని తమాయించుకుంటూ పూడిపోయిన గొంతుతో 'అంత కోపగించుకుంటా రెందుకు! మనం అపవిత్రులం గావచ్చు. అది ఒకనాటి మన పవిత్ర ప్రేమచిహ్నం. ఆనాడుకూడా మీలో మోసమే ప్రధానమై వుండవచ్చు. కాని నేను పరమ పవిత్రమైన స్థాయిలోవుండి స్వీకరించాను. కాని నేడు ఒక అభాగ్యురాలనుగా మీ ముందు నిలిచాను. నాలోని ఆశలను ఆశీర్వాదాలుగా యీ రూపంలో నా చెల్లికి సమర్పించుకుంటున్నాను. నా ప్రేమ పవిత్రమైనదయితే నా ఆశీర్వాదం ఫలిస్తుంది.' అంటుండగా గంగరాజు కల్పించుకుని 'పో నీచురాలా, కథ బాగా అల్లుకొచ్చావు' అంటూ స్వర్ణనుమారిని లోపలకు తీసుకెళ్ళ ప్రయత్నించాడు.

కాని స్వర్ణ నిర్జీవిగా ఆయన చేతిలోనుంచి జారుతూ సోఫామీద ఒరిగిపోయింది. గంగరాజు గాబరాపడుతూ ఆమెను బాహువులలోకి తీసుకుని పడకగదిలోనికి చేర్చి శయ్యమీద పవళింపచేశాడు. గది తలుపులు బిగించి దీర్ఘశ్వాస విడిచాడు.

విమల శిలాప్రతిమవలె అలానే నిలిచిపోయింది. వెంటవచ్చిన వారిలో అలజడి బయలుదేరింది. ద్రోహబుద్ధికి శాస్తి అవుసరమని, గది తలుపులు పగులగొట్టాలని నలుగురనోట పెద్దగా వినిపించింది. బయటకులాగి పట్టణ పెద్దబజారులో నిలబెట్టి వ్యవహారం బయటపెట్టి పదిమంది యెదుటే శాశ్వతంగా గుర్తుండునట్లు ప్రాయశ్చిత్తం చేయాలని మరొకరన్నారు. ఇలాంటి పచ్చిదొంగ, మోసగాడు, వ్యభిచారి, త్రాగుబోతు ప్రజా నాయకుడుగా చలామణికావటం మన దురదృష్టం! ఇలాంటివాడికి కోర్టు శిక్షలుగాని, పార్టీ క్రమశిక్షణచర్యలుగాని బుద్ధి చెప్పజాలవు గనుక మనమే పట్టుబట్టి అంగవికలుని చేస్తే సమాజసేవ చేసినట్లవుతుందని ఒక యువకుడు సరసర గదివైపు వెళ్ళాడు.

"ఆగండి, దయచేసి ముందుకు పోకండి. వారిని యేమిచేసినా నేడు నాకు కలిగే ప్రయోజనంలేదు. నాకు జరిగిన అన్యాయంలో నా పొరపాటుకూడా కారణం. చదవుకున్నానన్న గర్వంతో నా జీవిత నిర్ణయాన్ని చేసుకోగలనన్న అతిశయంతో తలిదండ్రులను నిర్లక్ష్యంచేసి, వయస్సులోని వెర్రివలపుమోజులోపడి ఆయన్ను చేపట్టి కాలేజీనుంచి పారిపోయి, అజ్ఞాత జీవితాని కుపక్రమించాను. అది అంధజీవితంగా పరిణమించి నేడు అంతిమ ఘట్టానికి చేర్చింది. స్వయంకృతాపరాధంతో క్షోభిస్తున్నాను. నా జీవితం అజ్ఞాతంగా అంత మొందినా విచారం లేదు. నా ద్వారా నా తలిదండ్రుల పేరు బయటకు రావటం క్షమార్హం గాదు. నా ప్రారబ్ధంతో నన్ను పోరాడనివ్వండి. క్షమించి మీరు బయటకు పదండి." అన్నది విమల,

అందరూ కలిసికట్టుగా వత్తాసుగా ఆమె వెంట రావటానికి ప్రోత్సహించిన వృద్ధురాలివైపు కొరకొరలాడుతూ నిందిస్తూ "ఏమైపోతే మన కెందుకు పదండి." అంటూ అందరూ బయటకు నడిచారు. ఆమె తన యిరువురి బిడ్డలతో వారి ననుసరించింది.

సునిశితమైన హృదయంగల స్త్రీలు కలవరపరిచే మాటలను భరించలేరు. భీతి, క్షోభకలిగే మాటలను విన్నపుడు గర్భవతులు స్మృతి హీనులవుట సహజం. స్వర్ణకుమారి నిండు గర్భవతి. అతి సున్నితమైన

హృదయిని. విన్న విషాద వార్తలద్వారా కలిగిన క్షోభతో స్మృతిని కోల్పోయింది.

గంగరాజు ఆమెను గదిలో పాన్పుపై పరుండబెట్టి యెన్నో సేవలుచేసిన తదుపరి నేత్రాలు తెరచింది. ఆ దృష్టి దైన్యతతో కంపిస్తున్నది. అధరాలు అదురుతున్నవి. మసకవేసిపోయిన్న చంద్ర బింబమువలె ముఖమండలంమీద కావుష్ణ సుడులు తిరుగుతున్నవి. లలాటంమీద శ్వేదబిందువులు క్రమ్ముకున్నవి. ఆమె హస్తాలను తన హస్తాలలో వుంచుకుని సవరింపులో వోదార్పు జూపుతున్న గంగరాజు ఫాలభాగంమీది శ్వేదబిందువులను అంగుళీయములలో తుడుస్తూ "అలా చూస్తావేమిటి స్వర్ణా?" అని లాలింపుగా అన్నాడు.

ఆమె వేడినిట్టూర్పును విడుస్తూ ముఖాన్ని క్రోధంతో త్రిప్పుకున్నది. 'వాళ్ళమాటలు నమ్మబోకు స్వర్ణా, రాజకీయ ప్రలోభాలతో నరిపడనివాళ్లు సృష్టించిన నాటకమది. ఆ పిల్లలకు మావాళ్ళ అంతవక్కాటి ట్రెయినింగ్ యిచ్చింటేగాని సామాన్యులుగారు' అన్నాడు.

ఆమెనుంచి జవాబులేదు. 'ఇంత దొంగనాటక మాడుతున్నా నీ సమక్షంలో వాళ్ళను మేమీ చేయలేకపోయాను' అంటూ ఆమె శిరస్సునుబట్టి తనవైపుకు త్రిప్పుకున్నాడు. నేత్రాలు జలభరితమై తొణికిసలాడుతున్నవి.

ధైర్యాన్నిస్తున్న కంఠంతో 'అలా కన్నీరు పెడతావెందుకు. నీవు భయపడవలసిన పనిలేదు స్వర్ణా. ఆ మూర్ఖులను పిశాలను తిరిగి జన్మలో నీకు కనిపించకుండా చేస్తాను.' అంటూ ఆమె ముఖాన్ని పుణుకుతున్నాడు.

హస్తాన్ని తీసి అవతలకు విసురుతూ 'ఛీ, ఫో' అన్నది.

"అబ్బ! నీవు అర్థంచేసుకోలేకపోతే యెలా! నిజం చెబుతాను విను స్వర్ణా" అన్నాడు అనునయంగా.

"నాముందునుంచి అవతలకు పోండి" అని పెద్దగా అంటూ తిరిగి స్మృతిని కోల్పోయింది.

గంగరాజు కూజాలోని నీటిని ఆమె ముఖంమీద చల్లి, తడి చేతితో తుడుస్తూ పైన తిరుగుతున్న సీలింగుఫానువంక చూస్తున్నాడు.

పావుగంట తరువాత నేత్రాలు తెరచి 'ఇంకా నా యెదుటనుంచి పోలేదా?" అని రుద్ధకంఠంతో గద్దింపులో అన్నది.

"నేను చెప్పవలసిన విషయాన్ని చెప్పి వెళతాను స్వర్ణా" అని దీనంగా అన్నాడు.

"నాకు యేమీవద్దు. కనిపించకుండా వెళ్ళండి" అని తిరిగి తీవ్ర స్వరంలో అన్నది.

ఆయన వివశుడై బయటకువచ్చి దాసిని పంపాడు. ఆ వచ్చిన గుంపు తిరిగి యేవిధంగా తిరిగి వెళ్ళినదీ నౌఖరుద్వారా తెలుసుకుని వూరట పొందాడు.

హాలులో అటూ యిటూ తిరిగాడు. ఆలోచనలతో మనస్సు వేడెక్కిపోయి వూపిరిసలుపక బయటకు వచ్చాడు. ముకుళించుకుపోయిన ముఖంలో పగడవృక్షం ప్రక్కనున్న అరుగుమీద ఆసీనుడై భూమి మీద రాలిపోయివున్న పుష్పాలను లెక్కిస్తున్నాడు.

విమల యీ రూపంగా యింతమందితో యిక్కడి కెందు కొచ్చింది! అంత ధైర్యంగా యెందుకు మాట్లాడింది? తాను రెండు మాసాలక్రితం వైజాగ్ వెళ్ళినపుడు ఆమెకు కావలసిన యేర్పాట్లన్నీ చేసివచ్చాడు. అప్పటికే ఆమె కందిన వార్తలతో పడిసకలవరపాటును తన మాటలతో తొలగించి విశ్వసింపజేసి. విన్నమాటలతో మనస్సును పాడుచేసుకోవద్దని, ఇంకా కొద్దికాలం వోపికపడితే రాజకీయంగా తనకు యింకా వున్నతస్థానం కలుగుతుందని అప్పుడు ఆమెను వెంట వుంచుకుంటూ సర్వసౌఖ్యాలను కలుగజేయగలనని. అలాంటి ఆ స్థిరమైన అవకాశంకొరకే నేను వంటరిగా విజయనగరంలో వుండవలసివస్తున్న దని. యెంతగానో చెప్పి ఆమె యెవరెవరిద్వారానో విన్న స్వర్ణ విషయాలను తుడిచివేసి నమ్మించివచ్చాడు.

కావాలని విశ్వప్రయత్నాలుచేసి ఆనాడు విమలను పొందాడు.

కాలేజీహాస్టలునుంచి అంతర్ధానం చేయించి విలాసయాత్రలలో మూడు నెలలు త్రిప్పాడు. అనేకవదంతులు ప్రసారమైనవి. తిరిగి హాస్టలులో చేరలేకపోయింది. ఇంటికి వెళ్ళను సాహసం లేకపోయింది. ఆయన మాటకు కట్టుబడిపోయింది. గర్భవతినన్న భీతితో లొంగిపోయింది. ఆయనప్రేరణతో తన అవ్యక్తతతో జీవితాన్ని అన్నివైపులా బంధించుకున్నది. అక్కడే తృప్తిని కల్పించుకోను వివాహం కొరకు పరితపించింది. రిజిష్టరు వివాహమనే తంతుతో దొంగ రిజిష్టారు, దొంగ పుస్తకాలతో మయిదులోముంచి సంతృప్తి పరచాడు.

ఒక పుత్ర సంతానాన్ని కన్నది. సంవత్సరం గడిచిపోయింది. ఆయన నిర్లక్ష్యం ప్రారంభమయింది. ఆమె దుఃఖ జీవితం అడుగిడింది. అంతకుముందే ఆరుగురు అమాయక యువతుల జీవితాలని సర్వనాశనం చేసినట్లు తెలిసి కంపించిపోయింది. తన వివాహంకూడా తంతుతో మోసగించినట్లు తెలిసినపుడు వణికిపోయింది. కాని బంధించుకున్న పంజరంలోనుంచి బయటకుపోను మార్గంలేదు. గత్యంతరంలేక తృప్తిని కల్పించుకుని కంటకావృతమైన ఆ బాటలోనే పయనించ సాగింది. విశ్వాసంలేనిచోటకూడా కొన్ని వేళలందు విశ్వాసాన్ని కల్పించుకోవటం స్వాభావికం. ఆయనద్వారా అంతకుముందు దుర్గతి పాలయినవారిగోడు ఒక్కటొక్కటిగా తెలుసుకున్నపుడు ఆయనమీద తన జీవితంమీదకూడా రోతపుట్టింది. కాని తన దోషఫలిత ప్రతిబింబాలుగా నిలిచిన యిరువురి పసిబిడ్డలనుచూసి వివశతతో వూరటపొంది విశ్వాసాన్ని కల్పించుకున్నది. ఏకైక శరణ్యమైన ఆ మార్గం చెదరకుండా వుండాలని ప్రార్థనలు సలుపుకుంటున్నది.

ఓటిపడవలో పయనం సాగిస్తున్నవారికి పెనుతుఫాను తోడైనట్లు స్వర్ణకుమారి విషయం విన్నపుడు విమల మతిపోయినట్లయింది. ఆవేశంతో కలవరపడిపోయింది. ఆకలిని చంపుకొని ఆరాటంతో అలమటిస్తూ శయ్య నాశ్రయించింది. వెలుగులో పయనించేవారికి వలెనే అంధకారంలో పయనించేవారికి కూడా నేత్రదృష్టి తీక్షణతపొందించి దారి కనిపిస్తూనేవుంటుంది. ఆ స్థితికికూడా అలానే విమల అలవడిపోయింది.

కాని కాలం జరుగుతున్నకొంది గంగరాజు తనకు దూరమవుతున్నట్లు తాను అనాధరూపం ధరించబోతున్నట్లు గోచరించి వెర్రి ఆలోచనలతో విమల పిచ్చిదైపోయింది. తనకు ముందు జరిగిన ఎరుగునకు వలెనే తనకూ జరిగింది. వారివలె తానూ దిక్కులేని దీనురాలిగా హీనురాలిగా, అనాధగా అయిపోయినట్లు అర్థమైనపుడు ఆందోళనతో ఆవేశితురాలై ప్రతీకారవాంఛలలో మునకలువేస్తూ తిరిగి తన తెలివితక్కువ తనాన్ని అంధత్వాన్ని లెక్కగట్టినపుడు చదువుకోని స్త్రీలకంటె చదువుకున్న స్త్రీలే ప్రేమ పథంలో స్వయం విద్యాధికారపు మోజులో మునగటం ఆ తరువాత దుఃఖించటం తెలుసు. రాజకీయ రంగంలో గంగరాజు స్వప్రజలను మభ్యపెట్టగలుగుతున్నట్లు ప్రేమ కలాపాలలో చదువుకున్నవారినే వరుసగా మోసగించగలుగుతున్నాడు. తన తెలివితక్కువతనాన్ని తెలుసుకున్నపుడు తనమీద తనకే రోతపుట్టి ఆత్మహత్య చేసుకోవాలనుకుంటుంది. బిడ్డలవైపు జూచి గుటకలు మ్రింగి వూరుకుంటుంది. ఇలాంటి ద్వంద్వాత్మ సంఘర్షణలో సతమతమైపోతూ తన క్షేమంగోరు ఒక వృద్ధురాలి ప్రేరణతో యిరుగుపొరుగు సహాయంలో వసంతవిహార్‌కు రాగలిగింది.

ఆమె రావటం పోవటం జరిగిన రభస విషయంలోనే ఆలోచన చేస్తున్నాడు గంగరాజు. ముల్లుగుచ్చుకున్న పాదంతో కంకరరోడ్డుమీద నడుచునపు డుండు బాధవలె యీ విషయాలు మనస్సులో దొర్లుతున్నపుడు హృదయం కవిలిపోతున్నట్లు భరించలేని బాధను పొందుతున్నాడు. విమల యింతటితో కనిపించకుండా పోతే బావుండు ననిపిస్తున్నది. ఒకప్పుడు విమలంటే చాలా యిష్టముండేది. ఆమె మాటలు ఆకర్షణీయంగా తోచేవి. కాని నేడు స్వర్ణకుమారి మోజుతో ఆమెను ఘృణీకరించుకుంటున్నాడు.

స్వర్ణకుమారి ప్రవేశం ఆయన జీవితాన్ని మార్చివేసింది. స్వర్ణకుమారి ప్రేమలో ఆయన హృదయంలోని మర్మస్థానం పుచ్చుకున్నది. అక్కడ అతనికి తెలియకుండానే ఆమె అధిష్టించింది. అది నిర్మాలనకు అవకాశంలేని ఆక్రమణ. ఆమె అతని హృదయపీఠాన్ని అధిష్టిం

చూటలోని శక్తి ఆయన్ను లొంగదీసింది, క్రుంగదీసి ఆమెమీద విలిచిపోయింది. ఆమెకు అంకితమైపోయాడు. వాడయినా ఎక్కడో ఒకచోట స్త్రీ అధీనమైపోవుట ప్ర... స్వర్ణకుమారిమీద మనస్సు పూర్తిగా లగ్నమయింది. హృదయంలోని సుకుమారమైన అసలుచోటనుంచి ప్రేమతరంగాలు వుబకసాగినవి. తంత్రులమీద లయతో మీటినవి. నూతనరాగం ధ్వనించింది. తన్మయత్వంతో ముగ్ధత మూలిగింది. ప్రేమయొక్క నిజస్వరూపం మొగ్గవేసింది.

పవిత్రమైన ప్రేమ ప్రతి ఒక్కరిలోను మొలకవేయదు. ప్రేమ సర్వప్రతిఘటనలను యెదుర్కొగల శక్తివంతమైంది. కాని ప్రేమ తన విజయ కొరకు యెంత మొండిదో శక్తివంతమైందో తన స్వార్థంకొరకు అంతపిరికిదికూడా. ప్రియురాలికవగిటిలో అన్నిటినిమర్చిపోయి అసమర్థుడుగా, అక్కడే శాశ్వతంగా వుండిపోవాలనిచూస్తాడు.

పాతవాటిని విసర్జించి నూతన వస్త్రాల ధరించుటలోవలె యెప్పటికప్పుడు నూతన స్త్రీని పొందటంలో గంగరాజుకుండే ఆనందం నేడు అదృశ్యమైంది. స్వర్ణకుమారితో శాశ్వతంగా వుండిపోవాలనిపిస్తున్నది. ఆమెమీద మమత పెరుగుతున్నకొంది దూరమై పోతుందేమోనన్న భయంకూడా అధికమౌతున్నది. భయంలో పిరికితనం తోడవుతుంది. ఆదుర్దాలోని ఆలోచనలకు హద్దులుండవు. హద్దులులేని ఆలోచనలలో స్వేదం క్రమ్మింది గంగరాజుకు. క్రమంలేని ఆలోచన లో భరించలేని వేడి కలుగుతుంటుంది. చికాకుతో మహిళామండలి ఆఫీసుకు నడిచాడు.

20. పాపాల పట్టి

ఒకనాడు నిత్యహడావుడులతో శోభిస్తుండే ఆఫీసునిర్జనంగా విశ్రాంతగా వున్నది. ఆ జరిగిపోయిన వైభవపు రోజులను గుర్తుజేసుకుని ప్రస్తుతస్థితిజూస్తుంటే భీతి గొల్పుతున్నది. నౌఖరు గోడప్రక్క గురు పెట్టి నిద్రపోతున్నాడు. ఆఫీసు తలుపులు అన్నివైపులా తీసివున్నవి. కాని ప్రవేశించేవారులేరు.

ఆ వే ద న

గంగరాజా ఆఫీసులో ప్రవేశించగానే స్వర్ణకుమారి స్మృతులనేకం ...గా మెదిలినవి. ఆమె మనస్సును చూరగొనగోరి తాను చేసిన అభినయము, ఆమె అమాయకంగా చూపిన ఆదరము మొదలగు దాగుడు మూతలాట అంతా గుర్తుకువచ్చింది. మనస్సులో తెలియని ఆనందం తొంగిచూపింది. కాని వెంటనే ప్రస్తుతస్థితి గుర్తుకొచ్చి అఘాతంలో పడి నట్లయింది.

అంతటి అనురాగమూర్తి ఆకర్షణీయ దేవత తనకు దూరమవు తుందేమోనన్న భయము పెనవేయసాగింది. ఇంతవరకు గడిపిన భీకర జీవితానికి స్వస్తిచెప్పి ఆమెతో కలిసి ప్రశాంత జీవనయాత్ర సలుపాలని పిస్తున్నది. ఆఫీసులో ఆమెకూర్చున్న ఒక్కొక్క స్థానాన్ని శూన్యంగా చూపినపుడు మనస్సుకలవరపడింది. ఆమె స్థితి యెలా వుందో చూడా లని ఆదుర్దా కలిగింది.

వెంటనే కాలుగాలినపిల్లివలె బయలుదేరి వసంతవిహార్ చేరాడు. ఆమెకు స్పృహ వచ్చిందని, మాట్లాడుటలేదని, హార్లిక్సుమాత్రం తీసు కున్నదని విన్నపుడు వూరటపొందాడు. ధైర్యాన్ని చెప్పుటవసరమని వుత్సాహంతో లోపలకు వెళ్లాడు.

ఆయన్ను చూస్తూనే వెర్రిదానివలె అయిదు నిమిషాలు చూసి తిరిగి స్మృతిహీనంగా పడిపోయింది. నిరుత్సాహంలో అటు యిటు అడుగులువేసి తోచక ఆఖరకు దాసీనిపిలిచి, బయటకు వెళ్లిపోయాడు. డాక్టరును పిలువ నంపాడు.

నాలుగురోజులు గడిచిపోయినవి. నిత్యము లేడీ డాక్టరువచ్చి పరీక్షచేసి వెళుతున్నది. టానిక్కులు వాడుతున్నారు. గర్భవతి గనుక చాలినంత విశ్రాంతి కావాలి, భయం కలిగే విషయాలు ఆమె ముందుకు రాకూడదన్నది. ఒక ప్రత్యేక నర్సునుకూడా నియమించారు.

గంగరాజా ఆమె ముందుకు రాకుండా దూరంనుంచే ఆమెనుచూసి తృప్తిపొందుతున్నాడు. స్వర్ణకుమారి నర్సుతోను దాసీతోను బాగానే మాట్లాడుతున్నది. కాని ఆమెలోని భయవిచారాలు పోయినట్లులేదు.

ఆమెతో మాట్లాడాలని మనస్సు వాపోతున్నది. అధైర్యం అడ్డ

గిస్తున్నది. క్షణ క్షణము ఆమెకు కావలసిన సౌకర్యాల విషయంలో నర్సుద్వారాను దాసీద్వారాను శ్రద్ధతీసుకుంటున్నాడు. తనను చూడాలని ఒక్కమారైనా కోరుకుంటుందేమోనని దాసీని యెన్నోమారులు ప్రశ్నించి నిరాశ చెందాడు.

అనుక్షణము పీడిస్తున్న ఆదుర్దాతో ఒక ఉత్తరాన్నివ్రాసి దాసీ కిచ్చి పంపాడు.

"ముద్దులకుమారి,

నిన్ను క్షమాపణ కోరగల అర్హత శక్తికూడా నాలోలేదు. ఓడి పోయిన అపరాధిని. శిక్షవిధించమని కోరుతూ, నీ ముందు యదార్థాన్ని వ్రాస్తున్నాను. అంధత్వంలోను అహంకారంలోను అనేక అపచారాలు చేశాను. మానవునికి జ్ఞానోదయం కలిగినపుడు పశ్చాత్తాపడతాడు. ఆ పశ్చాత్తాపమే పరిహారంగా పాపం పోతుందంటారు. జ్ఞానోదయం కలుగ కుండానే అనేక జీవితాలు అంతమవుతుంటవి. నీద్వారా నాకు కనువిప్పు కలిగింది. జ్ఞానోదయంజరిగింది.మానవత్వం జనించింది, పశ్చాత్తాపంతో కుమిలిపోతున్నాను. అయినా నన్ను క్షమించమని కోరబుద్ధి పుట్టట లేదు. నా మీద నాకు హేయతతో కక్షకలుగుతున్నది. కనుక కఠిన మైన శిక్షను విధించమని నా ప్రార్థన. విమల మీకు వినిపించిన విష యాలు యదార్థాలే. ఆనాడు విమలను ప్రేమించాను. అక్కడ కుట్రగాని మోసంలేదు. కాని ఆ తరువాత అక్కడ నా మనస్సు నిలువలేక పోయింది. అది యెవరి మందదృష్టమో చెప్పలేను. ఆ ప్రేమ యేమ యింది అనవచ్చు. ఆ ప్రారంభపు రోజుల్లోని ఆకర్షణద్వారా కలిగిన మోజులోని ప్రేరణ స్వరూపం ప్రేమ అవునోకాదో యీ నాటికీ నేను నిర్ణయించుకోలేని సమస్యగానే వుండిపోయింది. ఇదే రూపంగా అంతకు ముందు కొన్ని ఘటనలు జరిగినవి యదార్థం. అవి అంధత్వము రాక్ష సత్వము, క్రూరమోసము కావచ్చు. నేను యెవరిద్వారాను కట్టుబడలేక పోయాను. ఎవరూ నా హృదయాన్ని వశంలో చాచుకోలేకపోయారు గనుక నా విజయంగాను వారి పరాజయంగాను గడిచిపోయినవి. నేడు నీకుకట్టుబడిపోయాను. వశీభూతుణ్ణయిపోయాను. నాహృదయం మనస్సు

నర్వరూపంగా నీ కర్పించుకు కూర్చున్నాను. నీవులేనిదే బ్రతుకలేనన్న భయంతో వణికిపోతున్నాను. ప్రేమయొక్క నిజస్వరూపం నేడను భవంలో అర్థంచేసుకున్నాను. జీవితంలో మొదట జరిగినవన్నీ ప్రేమ అనే భ్రమలోని మోహ సంబంధమైనవనుకుంటున్నాను. అలాంటి భ్రమిత ప్రేమలోనే జీవితాలు పూర్ణయాత్ర సాగించుట అధికం. అక్కడ మరో అవకాశము ఆశవుండదు గనుక. నాకున్న అవకాశాలను బట్టి ప్రకృతిసిద్ధ ప్రేరణలు నన్ను అటు యిటు నెట్టినవి. ప్రవాహంలోని తరంగాల నెట్టుడుతో చేరవలసినచోటికి అదృష్టంకొద్దీ చేసినట్లు నేను నీ ఆశ్రయంలోకి చేరాను. నీవు లేనిదే జీవించలేనని, నిన్నుచూడకుండా నీ ప్రేరణ లేకుండా యేపనీ చేయలేనని అనుభవంలో తెలుసుకున్నాను. సర్వాన్ని అర్పించుకున్నాను. వ్యక్తిత్వాన్నికోల్పోయాను. నాహృదయం లోను శరీరం రగరగంలోను నీవు నిలిచిపోయావు. వారిలో లేనిది నీలో యేమున్నదో చెప్పలేను. కాని నీద్వారా జనించిన ప్రేమద్వారా నా ఉదాత్తస్థాయికి చేరింది. కనుకనే గతంలో చేసిన అపరాధాలకు నీ ద్వారా శిక్షను కోరుకుంటున్నాను. ఆ శిక్షను వెంటనే వినిపించ గోరు తున్నాను.

నిన్ను చూడాలనే కుతూహలంలో కుమిలిపోతున్న
గంగరాజు."

దాసీద్వారా అందిన కవరునుచూసి వెలవెలబోయింది. 'మీదే పుత్తరం. చదువుకోండి అమ్మగారు' అని దాసి అన్నప్పుడు, వసంత కుమార్ నుంచి వచ్చిన పుత్తరమని ఆదుర్దా పడుతూ, ఆనందోత్సాహంలో చించిచూసింది. అది పెద్ద పుత్తరం గంగరాజుది. హేయంతో గగుర్పాటు చెందింది. చేతిలోని పుత్తరం జారిపోయింది. ఆ గోడు పెట్టిన విషంలు ఓపను గుర్తుకొచ్చింది. ఆమెమీద జాలి, ఆయనమీద ఘృణీకారం అల్లీబిల్లీగా ఉరగిసవి. వేడి నిట్టూర్పు విడిచింది.

అయిదునిమిషాలయ్యాక అందులో యేమున్నదో చదువాలని పించింది. చదివి రోషావేశురాలై తిరిగి ఆ పుత్తరాన్ని దూరంగా విసిరింది.

పాన్పుమీద పవళించి ఆ వుత్తరంలోని విషయాలనే విచారిస్తున్నది. 'యదార్థాన్ని అంగీకరించాడు. నిజమైన పశ్చాత్తాపం ఆ వుత్తరంలో యేమూలనో దాగివున్నది' అని వో ప్రవృత్తి వినిపించింది.

ఎనిమిదిమంది అమాయక యువతులను నిలువున మోసగించిన కిరాతకుడు నేడు మరో దొంగమార్గాన్ని అవలంబించి మయిదుపుచ్చను ప్రయత్నించుటలో విశేష మేమున్నది' అని మరో ప్రవృత్తి వినిపించింది.

"విశ్వసించమని యెక్కడా కోరనవుడు మరో మోసానికి యెత్తు యెలా అవుతుంది। అపరాధాలకు శిక్ష గోరుతున్నాడు" అని మొదటి ప్రవృత్తి వినిపించింది.

"శిక్షకోరితే క్షమ లభిస్తుందని గొప్ప నిపుణతతో వేసిన యెత్తు దప్ప యదార్థం యేమీలేదు. అంతా మోసం" అని రెండో ప్రవృత్తి వినిపించింది.

"ఉచ్చులో చిక్కుకున్న వారికొరకు మరోవుచ్చు వేయవలసిన అవసరంమాత్రం యేముంది। విశ్వశించక క్షమించక చేయగలిగేది మాత్ర మేమిటి। తెలుసుకున్న విమల యేమి చేయగలిగింది। విమం స్థితే తన స్థితి" అని మొదటి ప్రవృత్తి వినిపించింది.

ఆ వుత్తరాన్ని మరోమారు చదువాలనిపించింది. వెంటనే తీసి చదివింది.

అనర్థాలతోనో అభిప్రాయ భేదాలతోనో అంతమయ్యేది అన్య మార్గం పట్టేది పవిత్రప్రేమ కాదని. అవుసరమైతే లోకానికి యెదురు తిరుగగలిగింది. నీతులను నియమాలను పాపపుణ్యాలను మ్రింగివేసి మిగులగలిగింది. దరిద్రవడిలోనైనా నవ్వుతూ నటిపించగలిగింది. ఆత్మార్పణ చేయగలిగింది, లీనమై యేకత్వాన్ని పొందగలిగింది పవిత్ర ప్రేమయని ఆ తాలూకు ధ్వని యీ వుత్తరంలో యెక్కడో తన సంబంధంగా దాగివున్నట్లు అనిపించింది.

ఎంతో సేపు ఆలోచించింది. తిరిగి చదువాలన్న వాంఛ కలిగింది.

నీరు పల్లానికి సర్దుకుని సమతలంగా వుండ ప్రయత్నించునట్లు, పరిస్థితులకు అనుగుణంగా సరిపెట్టుకోను మనస్సు వెదుక్కొంటుంది. నిర్మలమైన మనస్సుతో వుత్తరాన్ని మరోమాటు చదివింది. తన విషయంలో వాటిని విశ్వసించాలనిపించింది. కాని విమల దుఃఖితదృశ్యం గుర్తుకొచ్చి వికలం కలిగింది. వారందరికి వేషధారి రిజిష్ట్రారుద్వారా దొంగ రిజిష్టరు వివాహం జరిగిందన్న విషయం దొర్లినపుడు తన వివాహం తంతు గుర్తుకొచ్చి, మనస్సు తవుడుకోసాగింది. వెంటనే వుత్తరం వ్రాయుట కుపక్రమించింది.

"............ ,

మిమ్ము యేమని సంభోదించుటకు మనస్కరించుటలేదు. తలచుకుంటే హృదయాన్ని కదిపివేస్తున్నది. మీమాట వింటేనే శరీరం వణికిపోతున్నది. మీరు యెదుటపడితే భరించగల ధైర్యం లేదు. ఈ భయం యెంతవర కుంటుందో నాకు తెలియదు. అంతవరకు నా యెదుటికి మాత్రం రావద్దు. నా జీవితమే అంధకారమైంది. తపుళ్ళాడుకుంటున్నాను. విమలను చేపట్టింది కల్మషరహిత మన్నారు కాని ఆమె వివాహం పేరుతో నాటకమాడారు. దురుద్దేశంలేని ఆ సమయంలో అంత మోసం చేయవలసిన అవుసర మేమిటో? ఇక నా వివాహంపేరుతో చేసిన రిజిష్టరు నిజమైందో నాటకమో తెలియజేయండి. ఈ విషయం తెలుసుకొను ఆదుర్దా కలుగుతున్నది.

ఇట్లు,
స్వర్ణకుమారి."

ఉత్తరాన్ని పూర్తిచేసి దాసిద్వారా పంపింది. గంగరాజు వుత్తరాన్ని చదువుకుని వుత్సాహపడ్డాడు. ఎంత పరిశీలన చేసినా, విరక్తి విముఖత హద్దులకు మించి ఆ వుత్తరంలో కనిపించలేదు. ఉన్న కోపం నెమ్మదిగా సర్దుబాటయితే భయం పోతుందన్న ధైర్యం కలిగింది. తనకు జవాబువ్రాయుటకు సిద్ధమవుటలోనే ఆమె మనస్సులో కొంత స్థిమితం యేర్పడినట్లు భావించాడు. ఆమె అడిగిన ప్రశ్నకు సమాధానం వ్రాయుటకు యెన్నోవిధాల ఆలోచించాడు. ఎలా వ్రాస్తే ఆమెకు

హేయత కలుగదో, అలానే వ్రాయాలని నిర్ణయించుకున్నాడు. ఆ మాటలను ఆమె విశ్వసించకపోవటం మరో దుర్ఘటనకు నాంది కావచ్చునన్న భయంతో యదార్థాన్ని వ్రాయనే నిర్ణయించుకున్నాడు.

"శ్రీమతి స్వర్ణకుమారీ,

పెద్దమనిషైనవాడు లొంగినపుడు తన వ్యక్తిత్వాన్ని కోల్పోతాడన్నది యదార్థము. నేను లొంగిపోవటమేగాదు నా మనస్సు నీకు దాస్యంచేస్తున్నది. నీ ఆశలోను స్మరణలోను అస్తిత్వాన్ని నిలుపుకోగలుగుతున్నాను. ప్రేమయొక్క నిజస్వరూపాన్ని నేడనుభవంలో చూస్తున్నాను. ఇది నిజంగా అజేయమైంది. పవిత్రమైంది. ఇక్కడ కుట్రలకు కుతంత్రాలకు, స్వార్థాలకు అంతస్థులకు ఆధిక్యతలకు స్థానం లేదు. అన్నివైపుల త్యాగంతోగూడిన ఐక్యత పెనవేస్తుంది. నిన్ను స్పర్శించేహక్కు లేకపోయినా భరించగలనుగాని దర్శనావకాశమైనా లేకపోతే జీవితం యెంత దుర్భరమవుతుందో భయంగావుంది. నీ ముందు యదార్థాన్ని దాయగలశక్తి నేడు నాలోలేదు. నేను జీవితంలో ప్రథమంగా నళినీదేవితో సాంపర్క్యం కలిగినపుడు అనేక ఆలోచనల ఫలితంగా ఆమెను రాజమండ్రినుంచి తీసుకొచ్చి వైజాగ్‌లో రహస్యంగా వుంచినపుడు, వివాహం కాలేదన్న ఒక్కకొరతతోనే దుఃఖించసాగింది. బహిరంగంగా వివాహమాడే అవకాశాలుంటే తప్పక వివాహం చేసుకునివుండేవాడిని. కాని అప్పటి మాయిరువుర పరిస్థితులబట్టి అలాంటి అవకాశం లేకపోయింది. అందువలన ఆమె తృప్తి కొరకు ఒక దూరపు మిత్రుని స్పెషల్‌మారెజియాక్టు రిజిష్ట్రారుగాను మరొమిత్రుని ప్యూనుగాను వేషధారణ చేయించి క్రొత్త రిజిష్టర్లలో కొన్నిపేర్లనింపి కొయ్యపెట్టెలోపెట్టి, సాక్షులుగా మరో యిరువుర మిత్రులను రహస్యంగా హాజరు పర్చాను. విధాయికరూపంలో నాటకరంగం పూర్తిచేయించి ఆమెకు పూర్తి తృప్తిని కల్పించాను. కాని ఆ తరువాత కొన్ని ఆవాంతరాలవలన ఆమెకు దూరమయ్యాను. తరువాతకూడా అందరి విషయంలోనూ అలవాటయిన, తేలికయిన ఆ నాటకాన్నే ఆడాను. నీ విషయంలోనూ అదే నాటకం జరిగిందని చెప్పటానికి సిగ్గుతోను భయంతోను

పుడికిపోతున్నాను. ప్రేమలోని అమరత్వ ప్రధానందప్పు వివాహ విధా నాలుగాదని నా అనుభవం చెబుతున్నది. కలప యేజాతిదైనా అగ్నిని విరోధించలేనట్టే వివాహ విధానాలు విఫలత్వంపైపు నడచు సంబంధా లను ఆపజాలవు. పవిత్రప్రేమ ఒక్కటే వివాహ సంబంధాన్ని అవిచ్ఛిన్న రూపంలో నిలుప గలిగింది. మనస్సులు కలిసివుండజాలనపుడు, పరస్పర ఆకర్షణలేనపుడు, అన్యోన్యమైత్రి లేనపుడు, ద్వంద్వవిరుద్ధాలు అడుగున బయల్పడినపుడు నియమాలు నీతులు శాసనాలు బంధింపజాలవు. ప్రేమలో ఐక్యమై హృదయాలను చీలదీయుట శాసనాలకుకూడా చాతకాని విషయం. నీ వివాహంలోకూడా అలవాటయిన ఆటనే ఆడాను. ఆ నాటకానికికూడా నీవు జీవంపోశావు. పవిత్రత కలిగింది. నిజానికి నీ దాసుణ్ణయిపోయాను. కనీసం నీ యెదుటకువచ్చి పోయేహక్కైనా ప్రసాదించు.

నీ అనుగ్రహాకాంక్షితుడు,
గంగరాజు."

ఉత్తరమంతా చదివాక స్వర్ణ మనస్సు చీకాకు చెందింది. అదీ మోసం, యిదీమోసం, అంతా మోసం అనిపించింది. ఉత్తరాన్ని చేతిలోనే వుంచుకుని శయ్యమీదవాలిపోయి దీర్ఘ వేడి నిట్టూర్పును విడిచింది.

నాలుగు రోజులు గడిచిపోయినవి. స్వర్ణకుమారి ఆహారం మామూలుగా తీసుకుంటున్నది. దాసీమాటలను లక్ష్యంచేస్తున్నది. కాని మనస్సు గూడుకట్టుకున్న భీతి యింకా దూరంకాలేదు. ఎవరిని త్వరగా మనస్ఫూర్వ స్వీకరించిందో ఆయన విషయంలో చీకాకుపడి పోతున్నది. తను కనబోవు సంతానవిషయం విచారించినపుడు హృదయం కంపించి, నేత్రాలముందు అంధకారం ఆవరిస్తున్నది. ఏమీ ఆలోచించలేక లోచక వేడెక్కిన మనస్సు బొమ్మసిలిపోతుంటుంది.

గంగరాజు ఆలోచించిన విషయాలలోనే ఆలోచిస్తూ, భవనం ముందున్న పూలవనంలో తిరుగుతూ స్వర్ణకుమారి నిద్రపోయిన సంగతి దాసిద్వారా తెలుసుకుని గదిలో ప్రవేశించి ఆమెను తనివిదీర చూస్తుం టారు. నిద్రలోకూడా ఆమె ముఖంలో మలినముద్రలు సుస్పష్టంగా

కనిపిస్తుంటవి. వయసులోని వలపు వాంఛలను రెచ్చగొట్టినప్పుడు నిగ్రహశక్తి చాలక హస్తద్వయాన్ని శయ్యమీద మోపి ఆమె అధరాలను చుంబించాలని ప్రయత్నించాడు. మెలకువ వస్తుందేమో తిరిగి స్మృతిని కోల్పోతుందేమో నన్న భయంతో నిగ్రహశక్తిని కూడదీసుకుని వెనక్కు తగ్గాడు. ఆమెకు తెలియకుండా ఆమెను చూస్తూ యీ రీతిగా కాలం గడుపుతున్నాడు.

రెండు వారాలు గడిచిపోయినవి. స్వర్ణకుమారిలోని భయభీతులు సన్నగిలినవి. కాని తన భవిష్యత్తు తనకే అంధకారంగా గోచరించి బాధపడుతున్నది.

ఆరోజు ఉదయభాస్కరుని లేత కిరణాలతో పునీతమవుతున్న పూలవనంలోని అరుగుమీద కూర్చుని దినపత్రిక చదువుతున్న గంగరాజు ఆకస్మికంగా యేదో వార్త చదివి శిలాప్రతిమ అయిపోయాడు. ఆయన తెప్పరిలుకోవటానికి అరగంట పట్టింది. విమల అనే ఒక స్త్రీ తన యిరువురి బిడ్డలతో సహా సాగరంలో దూకి ఆత్మహత్య చేసుకున్నది. మూడు శవాలు వడ్డున వున్నవి. ఆ ఫొటోకూడా ప్రకటింపబడింది. ఆత్మహత్యకు కారణం ఒకరిద్వారా మోసగింపబడి జీవితమే కంటకమయం చేసుకున్న కారణం అంటున్నారు. అని, ఆ మోసగించిన వ్యక్తి గొప్ప రాజకీయ నాయకుడని, ధనికుడని, ఆ బిడ్డలుకూడా ఆయన సంతానమేననికూడా తెలుస్తున్నట్లు, ఆ విమల వుంటుండే చిరునామా సహితంగా పేపరులో ఒక పెద్ద శీర్షిక క్రింద వున్నది.

పోలీసువారు ఆ చనిపోయిన విమలాదేవి యింటినికూడా పరిశోధించినట్లు, యింకా ఆచూకీ తీస్తున్నట్లుకూడా ఆ పేపరులో వున్నది.

మామూలుగా పేపరు చదివి వెంటనే స్వర్ణకుమారికి దాసిద్వారా పంపుట అలవాటయింది. కాని పేపరులోని ఆ భయంకరవార్త చదివి చీకాకుచెంది, పాలుపోక భయకంపితుడై వణికిపోతున్నాడు. ఆ పేపరును చించి ముక్కలుచేసి సన్నజాజి పొదలోపలకు జారవిడచటం. వెంటనే మహిళామండలి ఆఫీసుకు చేరి, తలుపులు బిగించుకుని అంధ

కారాన్ని సృష్టించుకుని సోఫాలో పవళించాడు. ఎవరూ లోపల ప్రవేశించకుండా బయట తాళం వేసి వుంచమని నౌకరుకు ఆదేశించాడు. జాలితోను, పశ్చాత్తాపంతోను, వేదనతోను పొందుతున్న ఆలోచనలతో వేడెక్కి వూపిరి సలుపక లేచి కూర్చున్నాడు. భయంతో హృదయం భారగించిపోతున్నది. జీవితంలోని అనేక విషయాలను మర్చిపోగలిగాడు. సంభవించిన భీకరమైన దుస్సంఘటనలను తెప్ప పాటులో దాటి జీవిత నూతనాధ్యాయాన్ని సృష్టించుకోగలిగాడు. కాని స్వర్ణకుమారి ప్రవేశంతో హృదయపరివర్తన కలిగేది. ఆమె ప్రాంగణంలో శాశ్వత శాంతిని వాంచిస్తున్నాడు, జరిగిపోయిన ప్రేమకలాపాలలో విముక్తికొరకు తను ప్రయాసపడ్డాడు. ఎప్పటికప్పుడు నూతన సాంపర్క్యంకొరకు అన్వేషణ జరుపుతుండేవాడు. నేడు స్థిరత్వాన్ని కోరుతున్నాడు. వున్న సాంపర్కంలో శాశ్వతంగా వుండిపోగోరుతున్నాడు.

స్వర్ణకుమారి తనకు దూరమవుతుందేమోనన్న భయంతో వణికిపోతున్నాడు. ఆ భీతితోనే సన్మార్గతను సజ్జనత్వాన్ని సాధుత్వాన్ని శాంతిని కోరుతున్నాడు. కాని వెనుక నిర్మించుకున్న బంధనాలు చక్రవ్యూహాలుగా ముందుకొచ్చి నిలుస్తున్నవి. అవి కోరలుచాచి లాగుతున్నవి. నూతన ఆశలనుకూడా చూపుతున్నవి. కాదంటే నరకాన్ని శూన్యాన్ని చూపుతున్నవి. వణికిపోతున్న శరీరంతో లేచి, శ్వాస సలుపక కిటికీతలుపులు తెరిచాడు. బయటనుంచి 'బాబుగారు' అన్న పిలుపు వినిపించింది.

వసంతవిహార్‌నుంచి దాసీ వచ్చింది. అమ్మగారు స్పృహదప్పి పడిపోయారని, అందరికీ భయంగావున్నదని, వార్త వచ్చింది.

గంగరాజు గాభరాపడుతూ యింటికి పయనమయ్యాడు. స్వర్ణకుమారి నిండు గర్భవతి. అందువలన అందరూ ఆదుర్దాపడుతున్నారు. డాక్టరు యింకా రాలేదు. ఆమె ముఖంమీద చల్లిన నీటితో పాన్పుతడిసిపోయింది. మలినరేఖలతో ముఖమంతా కప్పువేసింది ఒక దీర్ఘనిశ్వాసమాత్రం వినిపించింది.

ఈ దృశ్యం చూస్తున్నపుడు ఆయన మనస్సు బలహీన పడుతున్నది. ఎవరిని యేమి అడుగనూ తోచక మాట్లాడితే తన గొంతుకలో అడ్డుకుంటున్న దుఃఖంపొర్లి యెక్కడ బయటపడుతుందోనని వెర్రివానివలె అటు యిటు చూస్తున్నాడు. రెండోవైపు టేబులమీద చించివున్న ఒక కవరు కనిపించింది,

ఆ కవరుమీద స్వర్ణకుమారి అడ్రసే వ్రాసివుంది. అందులోని వుత్తరాన్నితీసి చదివి ప్రాన్పడిపోయాడు. అది విమల వ్రాసినవుత్తరం.

"ప్రియసోదరి,

నేను యీ రాజకీయ మహానాయకుడైన గంగరాజుద్వారా మోసగింపబడిన దుర్భాగ్యురాండ్రలో ఒకతెను. ఒక వున్నత కుటుంబానికి చెంది ఘనతగా చదువుకుంటూ, గారాబంతో తలిదండ్రులు యిచ్చిన చనువుతో మర్యోగాన్ని పొందినదాన్ని. మానవలోక కళ్యాణ స్వరూపాన్ని చిత్రిస్తూ ఆదర్శాలను ఆశయాలను లక్ష్యాలను బోధిస్తూ, త్యాగదీక్ష ప్రతిగా గోచరిస్తూ, ప్రజలలో జేజేలుకొట్టించుకుంటూ సన్మానాలను పొందుతూ ప్రజానాయకుడుగా జనోద్ధారకుడుగా ప్రఖలిస్తున్న గంగరాజు మోజులోపడి విద్యార్థిని జీవితానికి తలిదండ్రుల సాంపద్యానికి స్వస్తి జెప్పాను. ఆ తరువాత ఆయన అసలు స్వరూపం తెలిసినపుడు, అనేక అమాయక యువతుల జీవితాలను సర్వనాశనంచేసిన విషయం బయల్పడినపుడు కంపించిపోయాను. సంతానవతిని కాబోతున్న నాకు అన్నిదారులు మూసివున్నవి. నడిసముద్రంలో మునిగినట్లయిన నేను పడిన ఆవేదన అనంతమయింది. స్వయంకృతాపరాధానికి గురియై చేయగలిగింది లేక అంధకార జీవితంలోనే అలవడిపోయాను. ఆయన రాజకీయ జీవితంకూడా కటికి మోసాలతోను ద్రోహాలతోను చీకటి విధానాలతోను నిండిన స్వార్థపూరితమైందని తేటతెల్లమయినపుడు భరించలేక ఆత్మహత్య కుద్యుక్తురాలనయ్యాను, కాని స్త్రీకి సంతానప్రీతి అన్నిటికి మించినదని అనుభవంలో ఆనాడు అర్థమయింది. అయినా నాయెడలగల వారి వ్యవహారం కొంత స్వాంతనను కలిగిస్తుండేది. వారి నూతన వేటకు మీరు గురియయ్యాక వెనుకటివారి స్థితి నాకు సంభవించింది. అందరూ

అన్ని విషయాలను భరించలేరు. వారు భరించిన విషయంలో నేను భరించ లేకపోయాను. వారు అపుడపుడూ వస్తూ వదంతులు పట్టినవి నన్ను మోసగించగలిగాయి. ఈ నాటకంలో మీతో జరుగుతున్న నూతన అంకాన్ని ధృఢంగా తెలుసుకున్నాక నిర్దిష్ట నిర్ణయానికి రాగలిగాను. నా స్థితి మీకు కలుగకుండా మిమ్ము ఆశీర్వదించాలని, నా అమాయ కత్వానికి ప్రతిఫలాలయిన నా యిద్దరి బిడ్డలను నీ పాదాలముందుంచి సెలవు తీసుకోవాలనుకున్నాను. నిశ్చింతతో ఆత్మహత్య చేసుకోవాలను కున్నాను. కాని భగవంతుడు నా కలాంటి అదృష్టాన్నికూడా కలుగ నివ్వలేదు. నా పాపం కోరలుచాచి నన్ను నా బిడ్డలనుకూడా మ్రింగి వేయజూస్తున్నది గనుక అసమర్ధురాలనై ఆ వైపుకే వెళ్ళిపోతున్నాను. అనాడు మీ ముందు కొచ్చింది ఆశతోగాని, మీకు అశాంతిని కలిగిం చనుగాని కాదని, మీ స్వసుఖ స్వప్నాలయినా యదార్థాలుగా రూపొం దాలని ఆశీర్వదించుటకే వచ్చినట్లు మీకు తెలియజేయాలని మనస్సు ఆందోళన చెందుతున్నది. బిడ్డలతో చావబోతున్న నాకు ఈ ఆందోళన యెందుకా, అని యెంతో ఆలోచించాను, అది మానవత్వమేమో!

నిర్భాగ్యురాలైన నీ సోదరి
విమల."

గంగరాజు వుత్తరాన్ని సాఫీగా చదువలేకపోతున్నాడు. ఒక్కొక్క వాక్యం చదువుతుంటే హృదయంమీద బాకులతో పొడుస్తున్నట్లున్నది. కంచెమీద అడుగులువేసినడుస్తున్నట్లున్నది. అగ్నిమంటలలో పరువులెత్తు తున్నవానివలె వుత్తరాన్ని ఒక్కబిగువులో చదివేశాడు. శరీరమంతా మంటలతో కాలిపోతున్నట్లున్నది. శయ్యమీద స్మృతిహీనురాలై పడి వున్న స్వర్ణకుమారిని చూసినపుడు రుధిరం వుడికిపోయింది. శక్తి యింతా క్షణక్షణమూ నీరసించిపోతున్నది. ప్రక్కనున్న కుర్చీలో వాల బడి పోయాడు. చేతిలోని వుత్తరం జేబులోనికి చేరింది. ఆ తరువాత ఆయన మనస్సు ఆధీనంలో లేదు.

నౌకరు గంగరాజు స్థితి చూసి గాబరాపడ్డాడు. వేరే శయ్యమీద పరుండబెట్టి సపర్యలు చేస్తూ దుఃఖభరిత కంఠంతో, చిన్న స్వరంలో

'బాబుగారు, అమ్మగారు చాలారోజులనుంచి యిలానే పడిపోతూ అర గంట తరువాత లేస్తుంటారు. వారిని గురించి యేభయమూలేదు. ఎన్నడూ యెరుగని మీరిలా అయిపోతే మాకు యెంతో భయంగావుంది మీరు లేవండి బాబుగారు' అంటూ గోణిగాడు. ఆ మాటలు గంగరాజు వినగలడన్న ఆశతో అన్నవికావు, అదుర్దాలో అన్నవి మాత్రమే.

మాఘమాసపు పగటి నిద్రనుంచి లేచినదానివలె మేల్కాంచింది స్వర్ణకుమారి. ముఖమంతా వెలవెల బోతున్నది. శయ్యచుట్టూ వున్న నౌకర్లను చూసి చిన్నబుచ్చుకుంటూ మాట్లాడలేకపోతున్నది. మనస్సు యేకాంతాన్ని కోరుతున్నది. స్థిమితాన్ని కూడదీసుకుంటూ ఏమీ యెరుగనిదానివలె గదిలోనుంచి బయటకుపోవ ప్రయత్నిస్తున్నది.

"బాబుగారు వచ్చారు, మిమ్మల చూచి భయపడిపోయారు గాబోలు మాట పలుకు లేకుండా మంచంమీద పడివున్నారు" అన్నది ఒక దాసి.

"ఎక్కడ?" అన్నది స్వర్ణ.

"వారి గదిలోనే."

స్వర్ణ అవ్యక్తరూపంలోని ఆదుర్దాతో ఆ గదికి వెళ్ళి చూసింది. అక్కడే నిలచిపోయింది.

"బాబుగారు' అమ్మగారొచ్చారు" అని ఆనందోత్సాహంతో అన్నాడు నౌకరు.

బైటనుంచి యెవరో పెద్దగా పిలుస్తున్న కేకలు వినిపిస్తున్నవి'

నౌకరు పరువుపెత్తుకుంటూ వచ్చి 'అయ్యగారికోరకు పోలీసువారొచ్చారు. మన యింటిచుట్టూ పోలీసులున్నారు'అని వినిపించాడు.

స్వర్ణకుమారి హాలులోకొచ్చి పోలీసు ఆఫీసర్లను చూసి ఆశ్చర్యాభిమానాలతో వెనక్కు నడిచింది.

గదిలో గంగరాజు విస్పారంగా పడివున్నాడు. ఆయన జేబులోనుంచి తొంగిచూస్తున్న పుస్తకంలోని కొన్ని పంక్తులు స్పష్టంగా కనిపిస్తున్నవి. 'ప్రియసోదరి' అన్న సంబోధన మరింత స్పష్టంగా కని

పిస్తున్నది. మనస్సంతా కలవరపాటు చెందింది, ఆ వుత్తరంలోని విష యాలు, విమల తన బిడ్డలతోపాటు వచ్చి ప్రాధేయపడుతుంటే గంగ రాజు క్రోధావేశాలతో మీదపడి పొరదోల ప్రయత్నించిన దృశ్యాలు ఆమె మనస్సులో పరువు లెడుతున్నవి. వేదికలమీద శృంగారశబ్దాలతో అమృతవాణి రూపంలో ఆయనయిచ్చిన వుపన్యాసాలు వికృతంగా పీను లలో వినిపిస్తున్నవి. శరీరం గగుర్పాటు చెందుతున్నది. బయటనుంచి అధికారదర్పంతో గూడిన పిలుపులు వినిపించి అన్నిటిని విస్మ రించిన ఆదుర్దాతో 'ఏమండి, బయట పోలీసు బలగం వచ్చివున్నది, చూడండి' అంటూ ఆయన్ను లేవ ప్రయత్నిస్తున్నది. వాకిటి ముందు కొచ్చి నిలిచిన పోలీసు ఆఫీసరు 'క్షమించి మీరు తప్పుకోవాలి' అన్నాడు.

ఆమె కంగారుపడుతూ 'ఏమీ, ఎందుకు?' అని స్పష్టంగా అనగలిగింది.

"గంగరాజుగారిని అరెస్టుచేసి తీసుకెళ్ళవలసివుంది" అన్నాడు పోలీసు ఆఫీసరు.

"ఎందుకు తీసుకెళతారు, స్పృహలోలేని ఆయన్ను యెలా తీసు కెళతారు?" అన్న ప్రశ్నలను వూహించగల శక్తికూడా ఆమెలో లేకుండా పోయింది. అయోమయంలో తడబడుతూ తప్పటడుగులు వేస్తూ వెనక్కి నడిచింది.

అప్పటివరకు స్పృహలేకుండా పడివున్న గంగరాజు చివ్వున లేచి పారిపోను ప్రయత్నించి విఫలుడయ్యాడు. కేంద్రప్రభుత్వ గూఢా చారుల వ్యూహంలో అన్నివైపులా అల్లుకునివున్న పోలీసువారిని తప్పు కోవటం ఆయన కంత తేలికగా వీలులేక పోయింది.

విమల ఆత్మహత్య సందర్భంగా యీ వారంటు జరిగి వుంటుం దని స్వర్ణకుమారి వూహిస్తున్నది. విమలమీద జాలి, ఆమె బిడ్డలమీద మమత, గంగరాజుమీద ద్వేషము కలుగుతున్నది. తాను కనబోతున్న సంతానంమీద ఆలోచించి, అనాథయైనట్లు, నిరాధారుడైనట్లు జాలినొందు

తున్నది. గంగరాజు చూపిన ప్రేమ ఆదరము మనస్సులో మెదులు తున్నవి. ఆయన విడుదలై రావాలని వాంఛిస్తున్నది.

దుఃఖిత మనస్సు యేకాంతాన్ని కోరుతుంది. కాని ఏకాంతంగా వుంటే హృదయం స్తంభించిపోతుందని భయపడిపోతున్నది స్వర్ణ కుమారి. ఊపిరి సలుపక వుక్కిరి బిక్కిరై పోతున్నది. అందుకే వున్న నౌకర్లందరిని ముందుంచుకుని కూర్చుంటున్నది. వారు అనేక రకాల ధైర్యాన్ని కల్పిస్తున్నారు. ఊరటపొందే మాటలు వినిపిస్తున్నారు. కాని పిన్నకొంది చిరాకు కలుగుతున్నది. మానసిక అశాంతి పెరుగుతున్నది. ఏకాంతానికి ఆరాటపడుతున్నది. ఏకాంతంలో భీతిచెంది పారిపో తుంటుంది.

గంగరాజు పలుకుబడి ప్రజలలోకంటె ప్రభుత్వంలో అధిక మైంది. మంత్రులకు సన్నిహితుడైనందున అన్ని ఆఫీసులలోను ఆయ నకు ఆధిఖ్యత వున్నది. కాలము ఖర్మము కలిసివచ్చినపుడు అన్ని వైపులా విజయం గనిపిస్తుంది. చేసిన ప్రతిది రాణింపుకొచ్చి ప్రత్యేకత పొందుతూ ఖ్యాతిని, ఐశ్వర్యాన్ని, ఆనందాన్ని పెదజల్లుతుంటుంది. అది వక్రించినపుడు పరాజయం చుట్టుముట్టి జీవిత నౌకకే దిగ్బంధం కల్పించి మృత్యువుచేత గేలిచేయిస్తుంటుంది. కేంద్ర ప్రభుత్వ గూఢచారులపట్టు దల ప్రయత్నాలవలన గంగరాజు పలుకుబడి నిష్ప్రయోజనమైంది. విమల ఆత్మ హత్యకు కారణభూతుడయినందున నిర్బంధించినట్లు ప్రజ లలో ప్రచారం జరిగింది. కాని ఆయనమీద అనేక కేసులు పెట్టబడినవి.

21. నగ్నసత్యాలు

గంగరాజుమీద పెట్టబడిన ఒక్కొక్క కేసు విచారణ ప్రారంభ మైనపుడు వేలాదిజనం వినోదంతో కోర్టుకువచ్చి విడ్డూరపడిపోతున్నారు. ఒకోరహస్యమే బయటపడుతుంటే కోర్టువారే చకితులవుతున్నారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రంగా ఆయన ఆధిపత్యంలో నడుపబడుతున్నది పచ్చిమోసమని బట్టబయలయింది. 20 మంది పేర్లతో సొసైయిటీని

రిజిష్టరు చేయించి, ఆ సొసైటీక్రింద మంచి విలువగల 500 యకర ముల ప్రభుత్వ బంజరు భూమిని మంజూరు చేయించి, ట్రాక్టర్లను, నీటియింజన్లను, యెరువులను విత్తనాలను ప్రభుత్వసహాయంతో పొంది 5 సంవత్సరములనుంచి వ్యవసాయం చేయిస్తున్నాడు. ఆ సొసైయిటీ మీద సంవత్సరానికి రెండు లక్షల ఆదాయం వస్తున్నదని, ఆ మొత్తం గంగరాజే పొందుతున్నాడని, సొసైటీ రిజిష్టరులోని 20 మందిలో 11 మంది, ఆ పేరు గల వ్యక్తులు అసలులేనేలేరని, నలుగురు వారసులు లేకుండా యే నాడో మరణించినవారిని, మిగిలిన నలుగురు తనదూరపు బంధువులలోని పేర్లని, అవుసరమైనపుడు అందరి విశానులు సంత కాలు గంగరాజే స్వయంగా చేస్తుంటాడని, ఆఫీసర్లముందు హాజరు కావలసినపుడు యెప్పటికప్పుడు యెవరినో పిలిపి సంఖ్యకు సరిపోను చూపెడుతున్నాడని, ఈ విషయాలు యెంతో రహస్యంగా వుంచబడుతున్నవని, మానేజిమెంటు చేస్తున్నందుకు తనకు నెలకు వందరూపాయిలు మాత్రమే యిస్తున్నాడని, సమిష్టి వ్యవసాయ క్షేత్ర మానేజరు కోర్టులో పలికినపుడు అందరూ ఆశ్చర్యపోయారు. దేశంలోని మహానాయకులు వల్లిస్తూ ప్రచారంచేస్తున్న సోషలిస్టు వ్యవస్థ నిజస్వరూపం యిదేనా, అనుకొన్నారు.

అందరిలోను గంగరాజునుగురించే చర్చనీయాంశమయింది. ఆయ నకు వురిశిక్ష తప్పదని వదంతులు ప్రబలినవి. నేటికి అతని పాపం పండిందంటున్నారు. అతి సన్నిహితులుకూడా ప్రతికూల సాక్ష్యం బాహాటంగా యిస్తున్నారు.

ఆయన సహకారంతో నడుస్తున్న నీరా సొసైటీలలోని పగ ఆదా యం ఆయనకే చెందుతున్నట్లు, నీరా సొసైటీలు కేవలం కల్లు అంగ ళ్ళగాను సారాదిపోలుగాను వ్యవహరిస్తున్నట్లు, నెలకు కొన్నివేలు రిస్వత్‌గా పోలీసువారికి ముడుతున్నట్లు ఆ సొసైటీలలోనే పనిజేస్తూ ప్రతిఫలం తనకు చాలినంత అందలేదన్న అసంతృప్తి పొందినవారు సాక్ష్యమిచ్చారు. ఆహా! అహింస నీతిని పరమధర్మంగా ప్రభోధించిన

ఆ మహాత్ముని అడుగుజాడలలో నడుస్తున్న మహానాయకుని యీ ప్రభుత్వాశయాల నిజస్వరూప మిదేనా?

ఆయనద్వారా భవననిర్మాణాలు జరిగి అందు గొప్పగా నడుపబడుతున్న పరపతిసంఘాలు, సహకార సొసైటీలు లక్షల నష్టంలోనున్నట్లు, దివాళా తీయటానికి తయారుగానున్నట్లు, అందుకు కారణం ఏమీ లేనివారికి, జూదరులకు లంచాలతో అప్పులుయిప్పించినట్లు, భవననిర్మాణాలలో సగం చేతబట్టినట్లు, సొసైటీలోని సరుకులు యెక్కువ భాగం యెలుకలపేర ఖర్చు వ్రాయబడినట్లు యీ దురంతాలన్నిటిని చూస్తూకూడా చేయగలిగింది లేక కాలానికి కట్టుబడి ప్రెసిడెంటుఅయిన గంగరాజునే అనుసరిస్తూ వచ్చినట్లు సెక్రటరీగారు స్వయంగా సాక్ష్యమిచ్చారు.

విన్నటివరకు గంగరాజుకు జేజేలు కొడుతూ పూలమాలలు వేసి వేయినోళ్ళ కొనియాడినవారే నేడు తెగబడి విమర్శిస్తున్నారు. నిందిస్తున్నారు. వ్యభిచారి, పచ్చిమోసగాడు, దోపిడిగాడు అని యేకరువు బెడుతున్నారు.

విమల ఆత్మహత్య సందర్భంలోనే అరెస్టుచేసి వుంటారనుకున్నపుడు కలిగిన దుఃఖాన్ని భరించగలిగింది స్వర్ణకుమారి. అంతకు ముందునుంచే ఆ విషయంలో వ్యధ చెందుతున్నందువలన అలవాటయిన దుఃఖంగా తోచింది. కాని దేశసేవ పేరుతోను, సంఘసేవ పేరుతోను ఆయన చేసిన దోపిడివిధానం, ఘోరమోసము వరుసగా ఆమెకు తెలిసినపుడు నిర్ఘాంతపోయింది. శరీరం గగుర్పాటు చెందింది. మహాకూపంలో శాశ్వతంగా మునిగిపోయినట్లనిపించింది. ఆకస్మికంగా సంభవించిన కుష్ఠుతో శరీరమంతా వికారం చెందినట్లు ఆమె శరీరం ఆమెకే రోతగా తోచింది. తన గర్భంలోని శిశువుని గురించి వూహించినపుడు గుండె దడదడ లాడింది. ఘోర పాపాల ప్రతిబింబమే తన వుదరంలో నున్నట్లనిపించింది. తనమీద తనకే కసికలిగి దంతాలు కరకరలాడించింది. వెర్రిదానివలె అటుయిటు పరికించింది. కాని అశ్రుభరితమైన ఆ నేత్రాలకు యేమీ కనిపించలేదు. విమల దీనంగా కన్నీరు

కారుస్తూ కనిపించి 'అభిజ్ఞతతో యీ లోకాన్ని చెరుపుకున్న మనకు మరో లోకం వుంది. ఆ లోకం దుఃఖంద్వారా ప్రాప్తంకాదు. తెంపుతో ఆత్మహత్య కావించినపుడే సంప్రాప్తమవుతుంది. భయపడక నాదగ్గరకు రా. మోసాలులేని యీ లోకంలో స్వేచ్ఛావిహారం సలుపుదాము' అని ఆహ్వానిస్తున్నది.

ఆ కనిపిస్తున్న విమలను కవుగలించుకుని విడువకుండా పట్టుకోవాలనిపించింది. దుఃఖభరితమైన అస్పష్ట కంఠంతో 'నేను మూర్ఖురాలను' అంటూ చేతులు చాచి పట్టుకోబోయి ముందుకు పడిపోయింది.

22. సత్యస్వరూపం

మహిళామండలి నాయకురాలుగా సుభద్రాదేవి గొప్పకీర్తిని గడించింది. ఆటలపోటీలలో పరువులెత్తు విద్యార్థివలె ఆమె మహిళామండలి వుద్ధరణ పేరుతో యిచ్చే వుపన్యాసాలద్వారా లభ్యమవుతున్న జేజేలతో వుప్పొంగిపోతూ యింకా యింకా ముందుకు పోయింది. ఉద్ధృతాన్ని పెంచుకున్నది. పురుష అధికారాన్ని వివిధ భంగిమలలో వర్ణించి నిందించటంలో ఆరితేరింది. స్త్రీ శక్తి అన్నిటికిమిన్నయైనట్లు, స్త్రీ తరువాతనే పురుషస్థానమైనట్లు, స్త్రీత్వాన్ని వేయివిధాల పొగడుతూ పురుషుని న్యూనతపరుస్తూ ఆమె యిస్తున్న వుపన్యాసాలకు పురుషులే ముగ్ధులై కరతాళధ్వనులుచేస్తున్నారు. ఆమెలోని వుత్సాహము, దీక్ష, వక్తృత్వము మాకు తెలియకుండానే కరతాళధ్వనుల చేసినవంటారు. పురుషులు కొందరు తన తల్లి యెడల, భార్య యెడల, సోదరి యెడల, పుత్రిక యెడల ప్రీతివున్న ఏ ఒక్కరు ఆమెను విరోధించలేరు, అని కొందరు పురుషులంటారు. ఆమెను యెవ్వరూ ప్రశ్నించనేలేదు గనుక స్త్రీ ఆధిక్యతను ఆమె చెప్పిన రీతిలో అందరూ అంగీకరిస్తున్నట్లేగదా, అంటారు మరికొందరు. దారితప్పిన స్త్రీలు నిరుపాయులై గోలపెడతారు, దారితప్పని ప్రతి స్త్రీకి అవసరమైనంత ఆధిక్యత వుంటుంది, అంటారు మరికొందరు పురుషులు.

మహాభారత ఘట్టం తాలూకు చూసిన డ్రామానే చూడటానికి

వుత్సాహితులైనట్లు, వుద్రేకపూరితమైన సుభద్రాదేవి వుపన్యాసాలలో వినోదాన్ని గ్రోలగలుగుతున్నారు పురుషులు. పసిపాపచేత లేత చిగురు టాకుల్లాంటి చిట్టి అరచేతులతో చప్పిడి దెబ్బలు కొట్టించుకోవటములో కలిగే ఆనందమే కలుగుతున్నది గాబోలు సుభద్రాదేవి వుపన్యాసాలలో.

ఇపుడు సుభద్రాదేవికి ఆహ్వానాలు ఆతిధ్యాలు యెక్కువయినవి. నిత్యము ఏదో ఒక సభకు ఆహ్వానమందుతూనే వున్నది. ప్రతిసభలోను ఆమెను గురించి ఆమె దీక్షా వ్రతాన్ని గురించి స్తుతిస్తున్నారు.

ఒకప్పుడు అలాంటి పొగడ్తలకు పొంగిపోయి తన దీక్షలో వుగ్రరూపాన్ని ప్రదర్శించ ప్రయత్నించిన సుభద్రాదేవి నేడు నిరుత్సాహ పడుతున్నది. గానుగలాగు వృషభాన్ని బోలినట్లు తోచి అంతర్గత అసంతృప్తి అధిక మౌతున్నది. కైలాసపతి హాజరైన సభలలో పూర్ణిమనాటి సాగరునివలె ఆనందంతో పొంగి నృత్యం సలుపుతుంటుంది. వక్తృత్వంలోని చాతుర్యాన్నంతా వలకబోస్తుంటుంది.

ప్రతిసభకు తనతోపాటు ఆయన హాజరుకావాలని ఆమె వాంఛ. అందుకే ఆయనకు సభతరపు ఆహ్వానం వంపే యేర్పాట్లు ఆమే చేయిస్తుంటుంది.

"మీరు యెక్కువగా మహిళాసభలకే హాజరవుతుంటారు. అన్నిటికి నేను రావటం బావుంటుందా చెప్పండి!" అన్నాడు కైలాసపతి.

"ఎందుకు రాగూడదు? మీరు మహిళా వుద్యమ అభిమానులు గనుక తప్పక వచ్చితీరాలి" అన్నది సుభద్ర.

"ప్రతి పురుషునిలోను మహిళాభిమానం వుంటుంది. స్త్రీ ద్వేషిగా కనిపించే పురుషునిలో స్త్రీని పూజించే తత్వాలు మరింతగా దాగివుంటవి. కాని మీరు పురుషులను ద్వేషిస్తూ న్యూనతపరుస్తూ స్త్రీలను రెచ్చగొడుతూ వుపన్యాసాలిస్తున్న ప్రతి మీటింగుకు నేను హాజరైతే, నా వ్యక్తిత్వాన్ని కోల్పోయినట్లవుతుందేమో!"

"అవి కేవలం పిరికితనాన్ని ప్రదర్శించే మాటలు, యదార్థమని విశ్వసించే వాటిమీద నిష్కర్షగా నిర్భీతిగా మాట్లాడాలి. స్త్రీలను తమ

ఆటవస్తువులుగా చేసుకుని తరతరాలుగా పీడించిన పురుషజాతిని విమర్శించుట, తమ వ్యక్తిత్వాన్ని విమర్శించి ఆధిక్యతను కోల్పోయి దాని సత్వానికి అలవడిన స్త్రీ జాతిని రెచ్చగొట్టుట పొరపా టెలా అవుతుంది చెప్పండి !"

"మహిళామండలి ఖర్చులకు వసూలవుతున్న నిధిలో ముఖ్య భాగం పురుషులనుంచి, హాజరవుతున్న అధికభాగం ప్రేక్షకులు పురుషులు, మీ వుద్రేకపూరిత వుపన్యాసాలు విని కరతాళధ్వనులు చేసేది పురుషులు అయినపుడు వారిని ప్రతికక్షులుగా యెలా భావిస్తారు ?"

"మనకు కావలసింది విని ఆనందించి వెళ్ళిపోయేవారి సంఖ్య కాదు, నడుము బిగించి కదనరంగంలోకి వురకేవారు కావాలి. పోరాట బృందం కావాలి."

"దారితప్పి హక్కులను కోల్పోయిన స్త్రీలు యెవరైతే వున్నారో వారంతా మహిళామండలిలో చేరిపోయారు. మిగిలిన స్త్రీలంతా తృప్తితో సంసార తాపత్రయంతో పురుషులతో అన్యోన్యంగా హాయిగా జీవన యాత్రసాగిస్తున్నారేమో ! మీరు యెంత రెచ్చగొట్టినా పురుషుని ఎంత కసాయిగా చిత్రించినా తన మనోభీష్టాలను మన్నిస్తూ కష్టసుఖాలను పంచియిస్తూ ప్రేమబంధంతో పెనవేసుకున్న తమ ప్రియమైన భర్తలను, సోదరులను, పుత్రులను యెలా హేయంగా చూడగలరు ? ఏ రూపంతో ప్రతికక్షిగా నిలిచి తొడగొట్టగలరు ?"

"ఇంతకాలం స్త్రీలయెడ, స్త్రీ స్వాతంత్ర్య వుద్యమంయెడ ఎంతో ఆదరము అభిమానముచూపి ఆదర్శమూర్తులుగా మా హృదయాలను చూరగొన్నారు. కాని మీలోని తరతరాలుగా కరుడుగట్టి వస్తున్న పురుష స్వార్థం నేడు బయల్పడుతున్నది. ఇంతకాలం మిమ్ము మీరు మోసం చేసుకున్నారా లేక మమ్ము మోసంచేశారా?"

నిద్రమేల్కాంచిన వారివలె తడబడుతూ "లేదు — లేదు. అయినా మీలో ఏదో మాంత్రికశక్తి వున్నది. మీవెంట నడువాలనిపిస్తుంటుంది. మీ మాటలను సమర్థించాలనిపిస్తుంటుంది."

"అయితే యిపుడు మాంత్రికశక్తి పనిచేయటంలేదంటారా?"

"కాదు- అదికాదు - అన్నివేళలా మిమ్మల్ని అంటిపెట్టుకునివుంటే నన్ను మీ మహిళల్లోనే లెక్కిస్తారేమోనని భయం."

"మీరు మనస్సులోని మాట చెప్పారుగనుక నేనుకూడా హృదయంలోని యదార్థాన్ని వినిపించుతే మంచిది. నేను జీవనయాత్రలో అలసిపోయాను కైలాసబాబు! నా ఆశయాల అంధవిశ్వాసం వుండబట్టే దీక్షబూని యింతదూరం పయనించగలిగాను. మీ సమాగమంలో నాలోని యదార్థ మానవీయత మేల్కొన్నది. ఇక నటనవప్పు నడక సాగించలేక పోతున్నాను. నాలోని అజ్ఞాతశక్తి ఓవైపు లాగుతున్నది. ఎల్లప్పుడు మిమ్మల్ని అంటిపెట్టుకుని మీ అనుగుణాల్లో నడిస్తే ఆత్మశాంతి లభించునట్లు తోస్తున్నది."

కళవళపడుతూ 'మీలో మరెవరో ప్రవేశించి మాట్లాడుతున్నట్లు తోస్తున్నది. మీ ఆశయాలకు పూర్తిభిన్నమైనమాటలు పలుకుతున్నారు.'

"అవును. నేటివరకు నేను నడిచిన నడకకు వ్యతిరేకమైన మాటలనే మాట్లాడుతున్నాను. నన్ను చూస్తూ మీలోని యదార్థతను విస్మరించి నా మాటలనే మీరు వల్లించినట్లు, మీ ప్రభావం నాలోని అమాయకత్వంతోగూడిన అంధత్వాన్ని నిర్మూలించి నారీ స్వభావాన్ని ప్రసాదించింది. స్త్రీని వుద్ధరించగలవాడు పురుషుడేనని నేడు నాలో ప్రతిధ్వనిస్తున్నది."

"ఆగండి, ఆగండి! మిమ్మల్ని మీరు మర్చిపోవటం మంచిదికాదు. పురుషులను నిందిస్తున్నపుడే మీరు ఆకర్షణీయంగా అవుపిస్తారు. అది మీలోని ప్రత్యేకతగా ద్యోతకమౌతున్నది. ఆ విశిష్ట స్థానంనుంచి జారిపోకండి."

"ప్రముఖుల కాంక్షలకొరకు పోరాడే సైనికులు రణదుందుభుల మత్తులో కొంతదూరం మాత్రమే పోగలుగుతారు. నాలోని ప్రతీకారవాంఛ సడలిపోయింది. ఇపుడు పురుష అనురాగంకొరకు హృదయం వాపోతున్నది."

చిరునగవును చిలికిస్తూ 'నిన్నటి మీ వుపన్యాసం యింకా నా చెవులలో గింగురు పెడుతున్నది.'

"ఇంతదూరం ఆ ధోరణిలో పయనించాక మనస్సు మారినా మరో మార్గం తెలియక, వెనక్కుపోయే సాహసంలేక నేత్రాలు మూసుకుని వెనుకటివాటినే వల్లిస్తూ ఆ స్థానాన్ని అంటివుండటం పరిపాటి గదా।"

"అయితే మీ భవిష్య కార్యక్రమం యేమి టంటారు?"

దీనదృక్కులను బరపుతూ 'అలా విడదీసి నా మనస్సుకు క్షోభను కలిగించకండి కైలాసబాబు. ఇక ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించగల శక్తి నాలో లేదు. తెలియని అంధత్వంలోను ప్రతీకార పట్టుదలలోను పయనించునపుడు ఆత్మ విశ్వాస ముంటుంది; దీక్ష నిశ్చల రూపంలో ముందుకు పరుగు లెత్తిస్తుంది. అలాంటి దీక్షలోనే యేదైనా సాధించగలుగుతాము. ఆత్మవిశ్వాసము తొలగినపుడు దీక్ష అదృశ్యమౌతుంది. మార్గం అంధకారంగా వుంటుంది.'

"ఇంతకాలం మీరు ఆశయాల పేరుతోను లక్ష్యాల పేరుతోను, ఆదర్శాల పేరుతోను మహిళాలోక కళ్యాణం పేరుతో యిచ్చిన వుపన్యాసాలన్నీ వ్యర్థంకావలసిందేనంటారా?"

సిగ్గిలుతూ "ఆఖరు విజయం యదార్థరూపమైన సత్యానిదేగదా। ప్రకృతికంటె పరమసత్యమైనది మరొకటిలేదు. మానవ అహం ప్రకృతికి వికృతరూపాన్నివ్వను నిరంతరకృషి సలుపుతుంటుంది. అంతిమ విజయం ప్రకృతికే లభిస్తుంది. మీ పరిచయం కాకపోతే బహుశ నాకి సహజసిద్ధమైన రహస్యం అర్థమయేదికాదేమో. ఆ మార్గంలో యిక నాకు శాంతి లభించదు. ఇక మిమ్మ అనుసరించుటలోనే నా వుద్ధరణ వున్నదని తెలుసుకున్నాను కైలాసబాబూ."

అనభిజ్ఞునివలె వెలవెలబోతూ "ఇంతకు ముందే నన్నుకూడా సలిసభకు మీతోపాటు రమ్మని ప్రోత్సహించారు. మీ ధోరణిలోనే మాట్లాడమన్నారు. పురుషుని ద్వేషిస్తూ స్త్రీలను రెచ్చగొట్టుట మన

విధానమని, అవసరమని అన్నారు. ఇపుడు అందుకు పూర్తిగా భిన్నంగా మాట్లాడుతున్నారు."

"కైలాసబాబూ, యింకా నన్ను అర్థంచేసుకోనట్లు మాట్లాడకండి. మీరన్నట్లు నేను దారి తప్పినదాన్ని. ఈ మార్గంనుంచి విముక్తి కలిగించి నన్ను స్వీకరించండి."

కైలాసపతి మనస్సు అయోమయంలో పడిపోయింది. ఒకకోణం నుంచి విముఖత చెలరేగుతున్నది. ఆమెకు దూరంగా వెళ్ళిపోవాలనిపిస్తున్నది. తనకు విరుద్ధభావాలతో నున్న ఆమె వైపు పరువులెత్తుటకు కారణాలేమిటో, తనకు అనుకూలభావాలతో నున్న యిప్పటికి ఆమె ఆకర్షించలేక పోవటానికి హేతువేమిటో ఆయన యెంత ఆలోచించినా అర్థమవుటలేదు. ఆమె పతితురాలని, స్వయంకృతంగా భ్రష్టురాలయిందని తెలుసుకున్నరోజుకూడా ఆమెకు దూరంగావాలనిపించలేదు. పురుష ఆధిక్యతను అధికారాన్ని చిత్రాతి విచిత్రంగా వర్ణించి గంభీర శైలిలో వుపన్యసిస్తున్నపుడు అందరికంటెముందు తానే కరతాళధ్వనులు చేయాలనిపించేది. సిగ్గు యెగ్గులు లేకుండా అందరితోను అతిచనువుగా పురుషులకు మించిగా మెలగుతున్నపుడు ఆమె స్పర్శానుభూతులకొరకు తాపత్రయం కలిగేది.

నేడు పశ్చాత్తప్తురాలయింది. తన నిజ స్వరూపాన్ని గుర్తించింది. స్త్రీత్వాన్ని పొందింది. పురుషుని ఆధిక్యతను అంగీకరిస్తున్నది. పురుషుని అడుగుజాడలలోనే స్త్రీకి విముక్తి కలుగుతుంటుందని ఘంటాపథంగా చెబుతున్నది. గత జీవితంలోని అపరాధాల నన్నిటిని మన్నించి తనను స్వీకరించమని ప్రార్థిస్తున్నది. కాని ఆమెకు దూరంగా పారిపోవాలనిపిస్తున్నది. ఈ ఉద్యమాలకు సభలకు స్వస్తిచెప్పాలనిపిస్తున్నది. పేరుప్రతిష్ఠల మోజు విడిలిపోతున్నది.

గంగరాజులాంటి నిస్స్వార్థ త్యాగమూర్తుల నిష్కల్మషంతో గూడిన నిర్దిష్టపోరాటకు యుండబట్టే లోకంలో ఏమి యింకా నిలిచివున్నదని ప్రజాపోరాటాలు సాగుతున్నవని అనుకున్నాడు కైలాసపతి. సుభద్రకూడా నిష్కాపట్యంలోనే నిజ హృదయపు ఆవేదనతో నుంచుకు

పరుపులెత్తింది. సమాజంలో సంచలనాన్ని రేకెత్తించింది. పొందిన అనుభవంతో యదార్ధ సత్యాలను తెలుసుకుని పశ్చాత్తాపపడుతున్నది. మాన అపరాధాలకు పశ్చాత్తాపమే నిష్కృతిగదా! అనిపించింది. పొరపాటునో గ్రహపాటునో ఆమె ఆకర్షణలో పడిపోయి యింతదూరం వచ్చాక ఆమెద్వారానే అనేక నిగూఢవిషయాలను తాను తెలుసుకో గలిగాడు. కనుకనే ఆమెను ఆదరించవలసిన స్వీకరించి వుద్ధరించవల సిన బాధ్యత తన కున్నట్లు గుర్తించాడు.

కాని ఆకస్మికంగా ఆయనలో కలిగిన భయభీతి హేయత వెనక్కు నెడుతున్నవి. దేశంలో పేరుపొందిన అధికారాలను హస్త గతం జేసుకునిపరిపాలిస్తున్న మహానాయకులందరిలోనూ యిలాంటి రహస్యాలు యెన్నిఉన్నవో ననిపిస్తున్నది. ఆ తర్క వితర్కాలతో బుర్ర వేడెక్కి పోతున్నది.

ఆమె ముందు తటపటాయించుతూ "ఈ విషయంతో దీర్ఘంగా ఆలోచించుకునే అవకాశ మివ్వండి" అన్నాడు.

"అలభ్యంగా తోచిన దానివైపు మనస్సు పరుపులెడుతుంది. అక్కడ యెంత త్యాగానికైనా సంసిద్ధులవుతారు. అంతకంటె అమూల్య మైందయినా వడిలోకి వచ్చినపుడు చౌకపాటుగా కనిపించి నిర్లక్ష్యం చేయుట మానవ స్వభావం. కనిపించని, ప్రాప్తించని నిష్ప్రయోజనమైన దాని కొరకు తపస్సుచేయుట పరిపాటి. అది యే రూపంలోనైనా యెలాంటిదైనా పొందినప్పటికంటె పోగొట్టుకున్నపుడే మహత్వాను కలిగి వుంటుంది. ఇకమీదు నన్నుగురించి బాధపడవలసిన పనిలేదు కైలాసపతిగారు! నాలోని ప్రతీకార ఆవేశం అంతరించింది. పురుషుని నుంచి స్త్రీలను వేరుచేసి ఒకరిని నిందిస్తూ మరొకరిని తెచ్చగొడుతూ చేసిన ప్రచారం హాస్యాస్పదమైందని తెలుసుకున్నాను. పురుషుని అండతోనే ఆదరంతోనే స్త్రీ రాణించగలదు. సుఖప్రదసమాజానికి పునాదులు వేయగలనని విశ్వసిస్తున్నాను. నా బాధ్యత వహించను మీరు భయపడుతున్నారు, కాని మీ ఆజ్ఞను జీవితాంతం శిరసావహించను స్థిర నిర్ణయం చేసుకున్నాను. తిరిగి మన యిరువురం కలువగలమో లేదో

చెప్పలేను. కనుక నన్ను ఏ మార్గంలో పయనింపమంటారో వివరించి వెళ్ళండి."

ఆయన మరింత భీతిగొని అబోధకునివలె వెర్రిగా ఆమెవైపే చూస్తున్నాడు.

ఆమె కొంచెంసేపు ఆగి చిన్నగా మందహాసం చేస్తూ "ఏ మార్గం చూపితే యేమి జరుగుతుందో, ఆ పరిణామ ఫలితంగా యేమిభారం మీద పడుతుందో అని భయపడుతున్నట్లున్నారు. పిరికితనం అన్నిటికంటె హేయమైందని మాత్రం గుర్తుంచుకోండి. ఇక మీరు నిశ్చింతులుగా వుండండి కైలాసబాబు. నా శేషజీవితాన్ని అనాథ స్త్రీల రక్షణలో గడుపుతాను. అది సభలద్వారాను ప్రచారాలద్వారాను ప్రదర్శనల ద్వారాను మాత్రం కాదు. వృత్తి విద్యలద్వారా కుటీర పరిశ్రమలద్వారా........" అంటుండగా కైలాసపతి ఒక విధంగా నిశ్చితాభిప్రాయానికి వచ్చాడు గాబోలు, 'నన్ను అపార్థం చేసుకోకండి సుభద్రాదేవిగారు' అన్నాడు.

"అపార్థం చేసుకోవలసిన అవుసరమూలేదు అథవా చేసుకున్నా అందువలన మీకు కలిగే అపకారమూలేదు" అన్నది.

"నాలో పిరికితనం యెంత వున్నదో అంతకు యెన్నోరెట్లు కోపం మీలో వున్నట్లు గ్రహించారా?"

"నేను కోపంతో అనటంలేదు. నా మాటలతీరే అంత."

"మీ మాటతీరే అంత అయినపుడు మీలో కోపం యెప్పుడూ వుంటుందన్నమాట. జీవితంలో పిరికితనం వలన కొన్నిటినిమాత్రమే కోలుపోతాము, కాని కోపంద్వారా సర్వాన్ని కోల్పోతాము. నాలోని పిరికితనంకంటె నీలోని ఆవేశం మహా చెడ్డదని గుర్తించాలి." అంటూ ఆమె హస్తంబట్టి దగ్గరకు లాక్కున్నాడు.

ఆమె మందహాసాన్ని ప్రదర్శిస్తూ "కోపమున్నచోట హృదయముంటుంది. పశ్చాత్తాపమూ వుంటుంది. కాని పిరికితనంలో ఆశలతో నిండిన లుబ్ధతదప్ప మరేమీ వుండదుగదా!" అన్నది.

ఆమె చుబుకాన్నిబట్టి వూపుతూ "పిరికితనంలో ఓర్పు సహనము

కాంతి వుంటుంది. కాని కోపంలో మూర్ఖత్వంతో గూడిన ఆవేశం ప్రతీ కార నాలుకలు చాపుతుంది. అది ఘోర విపత్కారమైందిగదా।

ఆయన కవుగిటిలోంచి ముఖాన్ని బయటకుపెట్టి "మీ నిర్వచనను కాదనను. నాకోపావేశాలద్వారా నేను పడిన నష్టం సామాన్యమైంది కాదు. మీ ప్రేమ చిహ్నంగా యీ రోజు నాలోని ఆవేశాన్ని సమూలంగా త్యజిస్తున్నాను. ఇకమీదట యేన్నటికీ ఏసందర్భంలోనూ నాలోని ఆవేశం బయల్పడకుండా కాపాడుకుంటానని ప్రతిజ్ఞ చేస్తున్నాను." అంటూ ఆయన హస్తాన్ని తన శిరస్సుమీద వుంచుకున్నది.

"అయితే నాలోని పిరికితనాన్నికూడా యిక చూడలేనని ప్రతిజ్ఞ........" అంటుండగా అర్ధంలోనే ఆయన నోటిమీదచేయివేసి ఆపుతూ "లేదు లేదు, అలాంటి ప్రతిజ్ఞ చేయకండి. మీ లోని పిరికితనం వుండవలసిన మోతాదులోనే వున్నది గనుక అది మీకు శోభనిస్తున్నది." అన్నది.

"పిరికి వాడినని పరిహసించుటకా।"

"మిమ్ము పరిహసిస్తే నన్ను నేను పరిహసించుకోవటమేగదా। ఆ పిరికితనం లేకపోతే తిరిగి నన్ను త్యజించటానికికూడా తొందరపడ వచ్చు." అన్నది.

"ఆడవారికి ధైర్యమెంత కనిపిస్తుందో అంతకు మించినభయం కూడా వుంటుంది." అన్నాడు.

"స్త్రీ స్వభావమే అంతగదా కైలాసబాబు."

"నీవుపూర్తిగా మారిపోయావు. తర్కనైపుణ్యాన్ని ప్రదర్శించుట కంటె యదార్ధాలను అంగీకరించుటతోనే ఆనందపడుతున్నావు."

"ఆనాటి నా జీవితం కళాయిలేని అద్దంలాంటిది."

"ఈ వుద్యమాలద్వారా నీవు బొందిన అనుభవము, విజ్ఞానము అమూల్యమైనవి, ఇకమీదట ఈఅనుభవమంతా నిరర్థకమవుతుందేమో।"

"స్త్రీకి విజ్ఞానము వివేకము గర్వకారణం కాజాలవని భర్తే గర్వ కారణమని తెలుసుకున్నాను కనుక నాలో నిజమైన స్త్రీత్వంజనించింది."

"ప్రకృతి రహస్యం ఎన్నటికీ ఎవ్వరికీ అర్థంగాని విచిత్రమైంది. ఒకప్పుడు నాలోని ఏ అజ్ఞాతశక్తి ప్రేరణతో నీవైపు పరువులెత్తానో అపుడు మన విరుద్ధభావాలు, మీలోని భావాలు పరిణతిచెంది నా భావాలలో లీనమైననాడు నాలోని ఆ అజ్ఞాతశక్తే నన్ను పిరికివానిజేసి సందిగ్ధలో ముంచినవి. అందుకు కారణాలు ఎంత వెదికినా కనిపించవు. ప్రకృతి రహస్యం అర్థంగాదు. ఆ అర్థంగాని రహస్యభాగం మానవునిలో మరింతగా వుందేమో!"

"ఒకనాడు అర్థంగానిది నేడు సుస్పష్టంగా అర్థమైనట్లు తోయుట మరొకనాడు అపార్థం చేసుకున్నట్లు రుజువవుటకూడా కద్దు. ఎప్పుడూ యే విషయంలోనైనా అర్థం చేసుకున్నదానికంటె చేసుకోవలసిందే యెక్కువగా వుంటుంది."

"ఇక నాబదులుకూడా అలాంటి తికమక ఆలోచన లన్నీ నీవే చేస్తుండు నేనుమాత్రం అనవసరమైన ఆలోచనలలో మునిగి పిరికి ముద్ర వేయించుకోను."

"అవును, అవకాశం చిక్కితే బాధ్యతలనుంచి విముక్తిపొందుట పురుషజాతికి బాగా తెలుసు."

"ఇన్ని చెబుతూ, యింత అనుభవం పొంది, హృదయాన్ని మార్చుకునికూడా మరో పొరపాటు చేస్తున్నావు సుమా!"

"ఏమిటో చెలవిచ్చి సరిదిద్దండి."

"స్త్రీ, మిత సంభాషణలోను అధిక బాధ్యతలలోను శోభిస్తుంది"

"తమ ఆజ్ఞను శిరసావహించి వినయశీలి ననిపించుకుంటాను." అంటూ హస్తాలు జోడించింది.

ఆమె భుజస్కంధాన్ని బట్టి వూపుతూ కవుగిటిలోకి లాక్కున్నాడు.

పంచాయతీ
మన గ్రంథాలయం,
...లప్రోలు :: కృష్ణా జిల్లా

23. వాంఛితశిక్ష

అమాయకంగా వ్యక్తిత్వంలేకుండా సాధుస్వభావంతో తృప్తితో నడిచిపోతున్న వింధ్యారాణి జీవితం భర్త వియోగంతో వూగిసలాడినపుడు, యేకైక పుత్రుని అదుపులో పెట్టలేక అల్లాడినపుడు, కుటుంబ నావ ప్రళయానికి గురికాబోతున్నపుడు భూదేవి ప్రవేశించి చక్కదిద్ది గట్టెక్కించి. ఎవరినీ లక్ష్యంచేయక అల్లరిమూకలతో చెల్లాట లాడుతున్న వసంతకుమార్ భూదేవి మాటలతో కట్టుబడిపోయినందుకు ఆమె ముగ్ధురాలయింది. తనను అంతగా లక్ష్యంచేస్తూ గౌరవించినందుకు చెల్లిబిడ్డయైన వసంతకుమార్‌ను తన బిడ్డగా తలచింది. ఆ అనురాగానికి కట్టుబడిపోయి ఆ కుటుంబంలోనే నిలిచిపోయింది. తన అన్న కుమార్తె స్వర్ణకుమారినికూడా ఆ యింటి సమ్యరాలునుగా పసితనంలోనే కలిపివేసింది. వసంతకుమార్ స్వర్ణకుమారిల జంట యెంతో ముచ్చటయిందిగా యెంచింది.

వసంతకుమార్ విదేశాలలో రాణిస్తున్నట్లు విని పొంగిపోయింది. స్వర్ణకుమారిని అతనికి తగింది చేయాలని బొంబాయి పంచి లూసీని పిలిపించింది.

వసంతకుమార్ యింటికి వచ్చాక అతని ధోరణికి మనస్సు నొచ్చుకున్నది. కాలం సరిదిద్దుతుందని ఆశించింది. కాని కాలం జరిగిన కొంది ఆమె మరింత నిస్పృహ చెందింది. స్వర్ణకుమారి గంగరాజుతో వెళ్ళిపోయినపుడు ఆమె మనస్సు వికలంచెందింది. భరించలేని బాధను పొందింది. జీవితంమీద విరక్తి కలిగింది. లోకమంతా శూన్యంగా తోచింది. ఎవరిని నిందించి ప్రయోజనంలేదని, లోకపురీతే ఈ రూపు ధరించిందని నిష్టురపడింది. తనకు తన చెల్లి కుటుంబానికి సంబంధం లేనట్లు తోచింది. తన యింటికి వెళ్ళిపో నుద్యుక్తురాలయింది. వింధ్యారాణి ఎంత వినతిచేసినా ప్రయోజనం లేకపోయింది. పద్మ ఆమెపాదాల మీద శిరస్సుంచి కన్నీటితో కడుగుతూ ఆర్తనాదంతో అర్థించినపుడు ఆమె నిలిచిపోయింది. యదార్థమైన హృదయశోకం. పవిత్రమైన

ప్రేమానురాగం ఎవరినుంచి బయల్పడినా ఎదుటివారిని లీనంచేసుకుంటవి.

తగిన కార్యరంగం వున్నపుడే ప్రజ్ఞా ప్రభావాలు, హృదయ విశాలతలు బయల్పడుతవి. రాపిడిచేసినకొద్ది మెరుపు అధికమైనట్లు సేవలో హృదయ సౌకుమార్యం పెరుగుతుంటుంది.

పద్మకిపుడు క్షణం తీరుబడిలేదు. భూదేవి పాదాలొత్తుతూ 'బాబుగారు ఫ్లాస్కులోని పాలు తీసుకున్నారో లేదో! వ్రాసుకుంటూ మర్చిపోయారేమో, వారు ఆకలినిగూడా గుర్తించరు' అని మనస్సులో ఆందోళన పడుతుంటుంది. వసంతకుమారిచేత భోజనం చేయించి వెళ్ళాలనే నిరీక్షణలో వుంటూ, ఆమెను పదేపదే హెచ్చరించను ధైర్యం చాలక దీనంగా ఆమె చేస్తున్న పనివైపు చూస్తూ 'పెద్దమ్మగారు యెండలో కూర్చున్నారేమో, అనే ధ్యాస వస్తుంది; నిన్న మోకాలు నొప్పిగా వున్నదన్నారు, అమృతాంజనం వేసి తోమాను. ఇవ్వాళ మళ్ళీ నొప్పిగా వున్నదేమో, వేడినీటి కాపడం పెడ్తే బాగా తగ్గిపోతుంది. అయినా అమ్మగారికి తనమీద తనకు శ్రద్ధ లేకుండా పోయింది. ఆమెగారు కోరినట్లే అమ్మాయిగారికి బాబుగారికి వివాహం జరిగివుంటే యీ యిల్లు స్వర్గతుల్యమై వుండేది' అని మనస్సులో అనుకుంటుంది. పరిపరి సేవలో పద్మకు సమయం చాలటంలేదు. గడియారాలు తొందరగా తిరిగిపోతున్నందుకు వాటిమీద ఆమెకు విసుగట.

పదిగంటల రాత్రి అయినా పానుపుమీద కూర్చుని, భూదేవి పాదాలు వత్తుతూనే వుంటుంది పద్మ. 'పగలు పొద్దాక యేదో పనిచేసిన తిరుగుతుంటావు. పదిగంట లయింది యికనైనా పోయి పడుకో పద్మా' అంటుంది భూదేవి.

"మీరు నిద్రపోయాక పోతానులే అమ్మగారు" అంటుంది పద్మ.

"నా నిద్ర సుఖాన్ని యేనాడో హరించుకుపోయింది ఆ పాపిష్టి స్వప్నకుమారి."

"అమ్మాయిగారు అమాయకురాలు. ఆ గంగరాజు మోసంలో

మునిగిపోయింది. ఏదో ఒకనాడు తెలిసివస్తుంది. ఆనాడు తప్పక మీ పాదాలచెంత చేరుతుంది అమ్మగారు."

"ఛీ, దానిమొఖం యిక యీ జన్మలో చూడను. ఎంత చదివి యేం ప్రయోజనం. నీకున్న జ్ఞానం దానికి లేకపోయింది."

"అది కేవలం అమ్మాయిగారి అపరాధం గాదు అమ్మగారు. అన్నివేళలా మన తెలివి అక్కరకురాదు. విధిని తప్పించుకోవటం భగవంతునికికూడా సాధ్యం గాదంటారుగదా!"

"దానికి యేమి లోపం చేశాను? దానికీ మనకీ ఋణం తీరిపోయింది అంతే!"

"పొరపాటు సహజం అమ్మగారు. ఒక్క పొరపాటుతోనే జీవితం సర్వనాశనమైతే యీ లోకం మనలేదు. తప్పు తెలుసుకుని వచ్చిన రోజు క్షమించుట ధర్మం."

"నీవు పిచ్చిదానివి." దాన్ని వెనుకేసుకొచ్చి నా మనస్సు మరీ చీకాకు పరచవోకు. అదిగాదు, నీవు నా నిజమైన బిడ్డవు. నిన్ను ఆదరిస్తే దేవుడు మెచ్చుతాడు" అంటూ పద్మ శిరస్సును నిమిరింది.

పద్మ ఆమె పాదాలమీద శిరస్సుంచి రుద్ధకంఠంతో 'నాకు యే లోపం చేశారు అమ్మగారు! నేను యెల్లప్పుడూ మీ బిడ్డనే. మిమ్ము విడవాడని మీ దాసిబిడ్డను" అన్నది.

"ఆ మాటలు అనవోకు పద్మా. నిన్ను చూస్తూచూస్తూ దాసీ అని తలంపుకొచ్చినా, ఎవరినోటైనా విన్నా మనస్సెందుకో క్షోభ చెందుతుంటుంది. నీవే నిజమైన బిడ్డవు, అనుకున్నపుడు తెలియని ఆత్మతృప్తి కలుగుతుంటుంది."

"పద్మా." అన్న వింధ్యారాణి పిలుపు వినిపించింది.

"చెల్లి యెందుకో పిలుస్తున్నది వెళ్ళమ్మా" అన్నది.

వింధ్యారాణికి తోచనపుడు. అనవసర ఆలోచనలతో చీకాకు చెందినపుడు పద్మను పిలుస్తుంటుందని అందరికీ తెలుసు. ఆ యింటిలోని అందరికి వూరటకు, వోదార్పుకు, సేవకు మందులాంటిది పద్మ.

జనసామాన్యంలో వసంతకుమార్ పేరు ప్రఖ్యాతులు అంతగా పొందకపోయినా, ఆయన కృషిలోని దీక్ష నానాటికి పెరుగుతున్నది. ప్రయోగశాలకూడా అనేకరీతుల అభివృద్ధి చెందుతున్నది. గంగరాజు దుష్ప్రచారంవలన, కొంతమందిమీద తెచ్చిన వత్తిడివలన వారి బిడ్డలను ప్రయోగశాలనుంచి తీసుకుపోయినా ఆయనలోని దీక్ష చెదరలేదు. పసివారిమీద ఆయన చేస్తున్న ప్రయోగాలు ఫలవంత మవుతూనే వున్నవి. కాని సామాన్యరోగులను ఆయన స్వీకరించడు. పరీక్షించడు. మందు లివ్వడు. అందుకే సామాన్యప్రజలలో ఆయన్నుగూర్చి హేళన రూపం లోని వదంతులుప్రబలినవి. అందరూ అందమైనవాళ్ళు. ధృఢమైనవాళ్ళ సమాజ నిర్మాణం కావాలనే ఆయన వాంఛ. అనేకమందికి హాస్యాస్పదంగా నేటికీ తోస్తున్నది. అందమైనవారు దీర్ఘకాయులు కాగలిగినవారుగానే జన్మించేట్లు చేయ వీలవుతుందంటాడు ఆయన. పొట్టి దంపతులకు జన్మించేవారు దీర్ఘకాయులు కాగలిగేట్లు. నల్లటివారికి యెర్రటివారిని జన్మించేట్లు చేయవచ్చు నంటాడు. అనారోగ్యులైన కొందరికి సంతానాన్ని కనే హక్కు వుండరాదంటాడు. ఆ రూపంగా వికారరూపులు, నల్లటివారు, పొట్టివారు, జన్మతః అనారోగ్యులు లేకుండా చేయగలిగితే సమాజం అత్యున్నతస్థాయికి పోతుందంటాడు. ఈ సందర్భ పరిశోధనలలో అనేక కుటుంబాలను కూడా ప్రయోగశాలలో చేర్చి పోషిస్తున్నాడు. తన ప్రయోగాలు నిర్విరామంగా సలుపుతున్నాడు.

"ఇదంతా వెర్రితనం చాదస్తంగాని భగవంతుడు యెవరిని యెలా దీవిస్తే అలా జన్మిస్తారు" అంటారు లోకులు.

అను క్షణమూ ఆయన యేదో ఒక ప్రయోగం చేస్తుంటాడు. ఎందులో ఏ రూపమైన బాక్టీరియాలున్నవో, ఏ బాక్టీరియా స్వభావ మెలాంటిదో, వాటి జాతులను రీతులను, వాటినిరోధశక్తి యెలాకావాలో, ఆహారంలో యెన్నిరకాల ప్రొటీన్‌లున్నవో, యెందులోని ప్రొటీన్ స్వభావ మెలాంటిదో, ఎలాంటి వారు ఏ స్వాభావిక ప్రొటీన్‌లున్న పదార్థాలు యెంత మోతాదులలో భుజించాలో మొదలగునవి ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. నిత్యము ఆ పరిశోధనలలోనే మునిగి తేలుతుంటాడు.

కాని సామాన్య మానవ స్వభావం తెలియదేమోననిపిస్తుంటుంది. స్వార్ధ సుఖంలోని అనుభూతులు యింకా ఆయన జోలికిరాలేదు.

ఆయన కనుగొన్న 'డైబిటీస్'కు అమోఘంగా పనిచేసే ఒక మందు ఫార్ములాను అమెరికన్ కొలాబరేషన్‌తోవున్న ఒక మందుల కంపెనీ రెండు లక్షలకు కొన్నది. ఆ ఫార్ములామందు ద్వారా డైబిటీస్‌ను పూర్తిగా నిర్మూలించవచ్చునని ఆ కంపెనీవారు అనుభవం పొందారు. ఆ మందు విపరీతమైన అమ్మకాల నుత్సాహంతో వసంతకుమార్‌కు గౌరవపురస్కారంగా మరో రెండు లక్షల నిధిని సమర్పణతో సత్కరించారు.

ఆ విషయం తెలిసినపుడు పద్మ యెంత ముగ్ధురాలైందో వ్రాయను భాషచాలదు. పులకితురాలై ఆనంద బాష్పాల నొలికిస్తూ తడబడలాడుతూ ఆయనముందుకు వెళ్ళలేకపోయింది. అమ్మాయిగారికి విషయం తెలిస్తే యెంత బావుండును. అనుకున్నది. బాబుగారినిగూర్చి వెర్రి వెర్రిగా అనుకునే పామరజనాలందరికి యీ విషయం చాటిరావాలనిపించింది. అందరూ గలిసి గంగరాజుచేత క్షమాపణ గోరిస్తే బావుండుననిపించింది. తనను యీ రీతిలోచూసి యేమనుకుంటారోనని బిడియంతో అదుపు చేసుకున్నది.

తడబడుతున్న అడుగులను సరిదిద్దుకుంటూ వసంతకుమార్ ముందుకు వెళ్ళింది. రోజూవలె ఆయన ముఖాన్ని చూడజాలక అధోముఖంజేసి క్రీగంటగా చూసింది. ఆయన మామూలుగానే వున్నాడు. ఆయన దృష్టి స్పిరిట్‌లాంపుమీద మరుగుతున్న ట్యూబ్‌మీద వుంది.

"ఏం పద్మా!" అని మామూలుగానే అన్నాడు.

ఆమెలోని భీతి, అదుర్దా సన్నగిలినవి. ఆయన ముఖంలో దృష్టిని వుంచగలిగింది. తెలియని మహత్వపూర్ణవిషయాల నెన్నిటినో ఆ ముఖంలోచూసి తెలుసుకోవాలని ఆమె ఆకాంక్ష. కాని స్నిగ్ధరూపంలోని నిర్మలము, గంభీరము అక్కడ మరేమీ గోచరించుటలేదు. ఏమి అడుగుటకు సాహసంలేదు. ఏమిచేయటానికి తోచలేదు.

ఆయన కుర్చీప్రక్కన క్రిందపూలబడి, విడిచివున్న ఆయన పాదరక్షలనుతీసి ఒకమాటు తన ముఖమండలానికేసి అదుముకున్నది. ఆనందబాష్పాలు గాలోలు వాటిని తడిపినవి. తన కొంగుతో పాదరక్షలను తుడుస్తున్నది.

వసంతకుమార్ తన పనిచేసుకుంటూనే "ఏమిఫలహారం తెచ్చావు పద్మా!" అని ప్రశ్నించాడు.

అది ఫలహారం తెచ్చేటయం కాదన్నసంగతి ఆయన ఆలోచించలేదు. ఫలహారమో, పాలో, భోజనమో తెస్తూ వస్తుందినప్పదట్టిచేతులతో రాదని ఆయన అనుభవం.

పద్మముఖం వెలవెలబోతున్నది. వస్తూ కనీసం పండ్లయినా తీసుకురానందుకు వేదనపడుతోంది.

ఆమెనుంచి జవాబురానందునకు ఆశ్చర్యపోతూ ఆ జీవాణువుల పరిశోధకుడు ప్రక్కకుచూసి విస్మితుడయ్యాడు.

వెంటనేలేచి ఆమెచేతిలోని పాదరక్షలను లాక్కుంటూ "ఇదేమిటి పద్మా, తప్పుగదూ!" అంటూ ఆమె కపోలాలనుబట్టి వత్తాడు. అశ్రుబిందువులలో ఆయన అంగుళీయములు తడిసినవి. మరింత ఆశ్చర్యపోతూ, ఆమె అశ్రువులను అద్దుతూ "అమ్మకోప్పడిందా!" అని ప్రశ్నించాడు.

మబ్బులచాటుగా జాబిలి తొంగిచూసినట్లు ఆమె అధరాలలో నవ్వు మెరిసింది.

ఆదుర్దాతో 'ఏమి జరిగిందో చెప్పు మరి!' అన్నాడు గాలిలో కూడుకున్న మబ్బులు విడిలిపోయినట్లు ఆమె మనస్సులోని వూహలన్నీ యెగిరిపోయినవి. "ఏమీలేదు బాబుగారు." అన్నది.

"ఆఁ, అవును. యిదీ నిజమే. యీ లోకంలో కారణం లేకుండా కూడా ఎన్నెన్నో జరుగుతుంటవి. జరిగిన ప్రతిదానికి కారణము తెలుసుకోను పట్టుదలవహించుట మంచిదిగాకపోవచ్చు." అంటూ తిరిగి తన ప్రయోగ కార్యక్రమంలో నిమగ్నం కాబోతున్నాడు.

ఈ సదవకాశాన్ని జారవిడుచుకో గూడదని గాబోలు ఒకడుగు ముందుకొచ్చి "బాబుగారు, ఒక్కటడుగుతాను యిస్తారా?" అని బరువు కంఠంతో అడిగింది.

ఆయన ప్రసన్నవదనంతో "నీవు మహాఅమాయకురాలవు పద్మా. నా అనుమతి తీసుకోవాల్సిన అవసరం యెప్పుడూ లేదు. నీకు ఏది కావలసినా యెప్పుడు కావలసినా నిరభ్యంతరంగా తీసుకో" అన్నాడు.

"అది నేను తీసుకో గలిగేదిగాదు బాబుగారు. మీరు ప్రసాదిస్తే పొందగలిగేది మాత్రమే."

"అయితే నిరభ్యంతరంగా చెప్పు పద్మా."

ఆయన దగ్గరగావెళ్ళి వినమ్రతగావంగి "నన్ను ఒక్క దెబ్బ వెయ్యండి." అన్నది.

"నన్ను పరీక్షించాల్సిన పనిలేదు. నాలో అలాంటి కఠినత్వంలేదు. నీకు కావలసిందేదో అడుగు పద్మా." అన్నాడు.

"మీచేత్తో ఒక్క దెబ్బతినాలనివుంది బాబుగారు." అన్నది.

ఆయన గల గల నవ్వుతూ "బలిచక్రవర్తికి, అక్బరు చక్రవర్తికి కలిగిన ఆశ్చర్యాలను నాకూ కలిగించదలచావా ?" అన్నాడు.

ఆయన హస్తాన్నిబట్టి తన కపోలంమీద మోదుకుంటూ అను రాగార్ద్ర కంఠంతో "కొట్టండి బాబుగారు" అన్నది.

అంత గంభీరంగా దూరంగా వుండే పద్మ నేడు ఆకస్మికంగా యింత పసితనంగా చేస్తున్న చర్యకు ఆశ్చర్యపోతూ 'పోనీ యెందుకో యేమిటో చెప్పరాదూ? నీవు యెలాంటి అపరాధం చేసినా నేను శిక్షించను. క్షమిస్తానని కూడా తెలుసుగదా!' అన్నాడు.

'అపరాధ మేమీలేదు. కృతజ్ఞత ముగ్ధతలోని వుత్సాహంలో మనస్సు ఆరాటపడుతున్నది. చిలిపిగా మీచేత దెబ్బతిని ఆనందం పొందా లనిపిస్తున్నది' అన్నది..

'ఊఁ!' అంటూ మందహాసా లొలికిస్తూ ఆమె కపోలాన్ని బట్టి అటూయిటూ వూపి "సరిపోయిందా ?" అన్నాడు.

"గంగరాజునే మహానాయకుడుగా దేశరక్షకుడుగా యెంచే యీ మూర్ఖ ప్రజ మిమ్మి యెప్పటికయినా అర్థంచేసుకోగలుగుతుందా బాబు గారు" అన్నది.

"ప్రజలందరు తనను అర్థం చేసుకోవాలని, తన కార్యరంగానికి మహత్తు నివ్వాలని, తనకు పేరు ప్రతిష్టలు రావాలని, ఆహ్వానాలు ఆదరాలు జరగాలని చేసే పనులలో పవిత్రత వుండదు. అందులో కటిక స్వార్థం దాగివుంటుంది. అలాంటి కార్యాలు ప్రజోపయోగ మవుతవని గట్టిగా చెప్పలేము. అయినా నీ స్వభావం యెవరినీ ద్వేషించేది గాదు. గంగరాజును గురించి అంత ఆవేశ పడతా వెందుకు పద్మా."

'గంగరాజు పచ్చి మోసగాడని చాలామందికి తెలుసు. ఆయన వెంట వుండేవారే, ఆయన దోపిడిగాడని నిందిస్తూ వుంటారు.'

'దోపిడిగాడంటూ అతని ననుసరించవలసిన అవసరం?'

"ఆ దోపిడిలో భాగాలకొరకు అర్రులు చాచేవారు గదా!"

"స్వార్థంకొరకు అతనివెంట నడుస్తూ ప్రక్కకుతిరిగి నిందించే వారికంటె ఒకవిధంగా గంగరాజే మంచివాడు."

ముఖాన్ని వికృతం చేసుకుని "మిమ్మి చులకనచేసి అందరి ముందూ చెబుతుంటాడుట. మీ కార్యక్రమాలన్నీ చాదస్తంలోనివని అంటున్నాడుట బాబుగారు."

"ఓహో, నన్ను నిందిస్తున్నాడు గనుకసహించలేక అసహ్యించు కుంటున్నావు. ఎదుటివారి విమర్శలకు క్రుళ్ళిపడుట బలహీనతను రుజువు చేస్తుంది."

"ఒక మూర్ఖుడు పరమ పవిత్రమైన నిస్వార్థ త్యాగిని నింది స్తుంటే సహించట మెలా బాబుగారు!"

"సహనాన్ని కోల్పోయి ప్రతివిమర్శ చేస్తే నీవు వున్నదనుకున్న విశిష్టతను కోల్పోయినట్లే గదా?"

వినమ్రతతో హస్తాలు జోడించి "మీరు మహోత్తర పురుషులు.

అఖండ ప్రజ్ఞాశీలురు, దయానిధులు, సహనశీలురు, మిమ్మల్ని గుర్తించగల శక్తి యీ సమాజానికి లేదు. మిమ్మల్ని గుర్తించిననాడు మానవలోకమే వుద్ధరింపబడుతుంది. మిమ్మల్ని సేవించే అవకాశం కలిగిన నేను ధన్యురాలను బాబుగారు."

"ఒక మానవుడిని సేవిస్తే నిరాశ మిగులుతుంది. మాధవుని సేవిస్తే కనీసం తృప్తయినా కలుగుతుంది.

"ప్రకృతిసృష్టి మానవులు. మానవసృష్టి దేవుళ్ళు దేవతలు అని మీరే ఒకప్పుడన్నారు. అలాంటి దేవుళ్ళు మీకంటె శక్తివంతులెలా అవుతారు?"

"నిజఆకలిదప్పులులేని దేవుళ్ళ శక్తివంతులుకారని మాత్రం ఎలా అనగలవు?"

అలకను అభినయిస్తూ "అబ్బ! మీ ముందు నేను మాట్లాడలేను బాబుగారు?" అన్నది.

అయిదు నిమిషాల నిశ్శబ్దం తరువాత "అమెరికా మందులకంపెనీ వారు, మీ ఫార్ములాతో తయారుచేసిన మందు గొప్పగా పనిచేస్తున్నదని, విరివిగా వాడబడుతున్నదని ఎంతగానో ప్రశంసిస్తూ వ్రాశారట బాబుగారు, మీరు చదివారా?"

వస్తున్న నగవును ఆపుకుంటూ "నువ్వుద్వారా విన్నావా? ఆ ఫార్ములాద్వారా నాలుగు లక్షలడబ్బు కూడా వచ్చింది చూశావా? నేను చాదస్తుడినని, పనికిమాలిన ప్రయోగాలు చేస్తుంటానని అంటారు మీరు."

చిలిపిగా చిరునవ్వు ప్రొత్సాహంతో లెంపకాయలు వేసుకుంటూ "స్వయంగా అలాంటి మాటలు నా చెవులతో విని సహించలేను. నాలుగు లక్షలుగాదు నాలుగుకోట్లు మీ ముందు వచ్చిపడినా నేను గొప్పగా ఎంచను. అంత పెద్ద కంపెనీవారు మిమ్మల్ని మహా గొప్పగా ప్రశంసించారు. వారి ప్రశంసలు నన్ను పులకింపజేసినవి బాబుగారు. ఆ ఆనందంలోనే మీ వద్దకు పరుగెత్తుకొచ్చాను. నేను చేయగలిగేదిలేక, ఆనందాన్ని ఆపుకోలేక, మీచేత ఒక దెబ్బ తినాలనుకుంటున్నాను." అన్నది.

"ఓహో, అందుకా నీవు అలా కోరింది। అయితే యిపుడావని చేస్తానుండు (అంటూ ఆమె చెంపకి కీయిస్తూ, వీపుమీద చప్పిడిదెబ్బ విపిస్తూ) యిక చాలా। మరి నా తరపుగాకూడా ఏదయినా కోరవా?" అన్నాడు.

"నేను దాసిని. నన్ను కోరగలిగేదేముంటుంది బాబుగారు।"

ఆయన అటూ యిటూ పరికించి, ఎర్రసిరాలో కలముంచి, ఆమె లలాటంమీద అద్దుతూ "నాకోర్కెను నెరవేర్చుకున్నాను." అన్నాడు.

వెల వెలబోతూ "యిదేమిటి బాబుగారు?" అని బెదురు కంఠంలో అన్నది.

"సిందూరంగా భావించి తిలకమద్దాను. ఇక నమ్మతించినా సమ్మతించకపోయినా నీవు నా ధర్మ...." అంటుండగా ఆయన నోటిమీద హస్తంవేసి అదుముతూ "మీ పవిత్రమైన నోటితో ఆమాట అనకండి." మీ స్థానాన్ని అత్యున్నత శిఖరాగ్రంలో చూడాలని నా అభిలాష, నా ద్వారా మిమ్ము న్యూనతపర్చి రసాతలానికి దించుట నావల్లకాని విషయం" అన్నది.

"నన్ను విశ్వసించు పద్మా. నీ ద్వారా నాకు పూర్ణత్వం లభిస్తుంది. సర్వవిధాల ధన్యుడనవుతాను. మనస్ఫూర్తిగా నిన్ను ప్రేమిస్తున్నాను. నన్ను స్వీకరించు పద్మా."

"మీరు నిస్వార్థ త్యాగమూర్తులు. మీ త్యాగానికి మెచ్చనంటగల క్షుద్రకార్యంవైపు కన్నెత్తి చూడనైనా చూడరు. అలాంటి మీ స్వామి నన్న నేను స్వార్థానికి లొంగితే, నాకంటే యీ ప్రపంచంలో హీనులెవరుంటారు చెప్పండి? మీ నిస్వార్థతను దృఢత్వంతో పవిత్రం చేసుకుంటూ నా నిస్వార్థతను భగ్నం చేయజూచుట ధర్మమా బాబుగారూ?"

దీర్ఘ నిట్టూర్పు విడుస్తూ "నీవు అపార్థం చేసుకుంటున్నావు." అన్నాడు.

"ఎవరిస్థానంలో వా రున్నపుడే ధర్మం నిలుస్తుంది. రాణింపు కలుగుతుంది; నన్ను దాసిగానే వుండనివ్వండి బాబుగారు."

"నిశ్చయం యేనాడో జరిగిపోయింది. నేను యిచ్చానో నీవు పొందావో నేను చెప్పలేను. కాని నా హృదయాన్ని నీవు శాశ్వతంగా అధిష్టించావు. దాన్ని చెదర్చను. అంత సాధ్యమయ్యే పని గాదు. నీవు భీష్మించుకు కూర్చున్నందువలన నేను బ్రహ్మచారిగానే వుండిపోతాను. ఈ విషయం పెద్దమ్మతో చెప్పా లనుకుంటున్నాను. ఆమె నిన్ను స్వీకరిస్తుందని నా విశ్వాసం. ఆమె మాటను త్రోసివేయగలవా?"

ఆయన పాదాలను స్పర్శిస్తూ "అంతపని చేయకండి. అమ్మాయిగారు చేసిన అఘాయిత్యానికి యింకా కుమిలికుమిలి దుఃఖిస్తున్నారు. ఈ అనర్థ ఆలోచన వారి చెవినబడితే భరించలేరు."

"నీ వెర్రితనాన్ని రుజువుచేస్తాను పద. పెద్దమ్మకు అమ్మకు నా అభిప్రాయం తెలుసు. వివాహం జరిగిననాడు అందరికంటె ఆనందపడేది వారే." అన్నపుడు మ్రాన్పడిపోయింది. కొద్దిక్షణా లలానే వుండిపోయింది, ముఖం జేవురించింది.

జీవాణువుల మనస్తత్వాలను యేకరువుపెట్టగల అఖండ నిపుణుడు అర్థం చేసుకోలేక ఆమెనుచూస్తూ ఆదుర్దా పడుతున్నాడు.

"ఏమిటి పద్మా!" అంటూ ఆమె హస్తాన్ని బట్టి సోఫాలో కూర్చుండబెట్టాడు. శిరస్సుమీద చేయివేసి నిమురుతూ, చెదిరిన కేశరాసిని సరిదిద్దుతూ ఆమె ముఖంలోకి చూడ ప్రయత్నిస్తున్నాడు. ఆయన శరీరం వేడెక్కి పోతున్నది.

ఎవరు యెంతటివారైనా, ప్రకృతి ప్రభావం అందరిమీదా ఒక్కటిగానే పనిచేస్తుంటుంది. నిగ్రహం కృత్రిమమైంది. అందుకే ఒక స్థాయికి పోయాక నిగ్రహిని పరాజితుని జేస్తుంది ప్రకృతి. ఆమె ముఖాన్ని చూస్తున్నకొద్ది వసంతకుమార్ హృదయం చలిస్తున్నది. ఆమె సోఫాలో ప్రక్కకు వరిగిపోయింది. వసంతకుమార్ తొడల మీదకు చేరింది పద్మ శిరస్సు. అర్థమయ్యీ కాని సుఖానుభూతులు శరీ

రంలో తరంగితమై నర్తిస్తున్నవి. వెలుగుతున్న విద్యుత్‌దీపం చుట్టూ రెపరెప కొట్టుకొను రెక్కపురుగువలె ఆయనదృష్టి ఆమె ముఖంమీద నుంచి వక్షోజాలవైపు తిరిగి ముఖంవైపు అల్లిబిల్లిగా తిరుగుతున్నది. ముఖాన్ని పైకెత్తి అధరాలమీద గాఢంగా చుంబించాడు. తృప్తి తీరలేదు గాబోలు ఆమె వక్షస్సు మధ్య తన ముఖమండలాన్నుంచి అటూయిటూ వత్తుకుంటూ అసంతృప్తిలోని శ్వాసను దీర్ఘంగా విడిచాడు.

పది నిమిషాల అనంతరం ఆమె లేచి సిగ్గుదొంతరలమధ్య గాభరాపడుతూ 'వస్తాను బాబుగారు' అంటూ తుర్రున పారిపోయింది. నవ్వుముఖంతో ఆమెవైపు చూస్తూ వుండిపోయాడు వసంతకుమార్.

24. ఆధునికదోపిడి

సుభద్ర విషయంలో అనేకవిధాలుగా ఆలోచించాడు కైలాసపతి. పతిద్వారా మోసగింపబడలేదని, అనేక సందర్భాలలో తన అమాయకత్వంతో ఆవేశపు వెర్రిలో తప్పులుచేసి పురుషులమీదనే కోపం దోషులుగా యెంచి ద్వేషిస్తూ ప్రతీకారవాంఛలతో పరుగులెత్తిందని, హృదయదుడుకుతనంతో స్థానాన్ని కోల్పోయాక శీలాన్ని నిలుపుకొనుట కష్టసాధ్యం గనుక వేసికలిసిన నందోళనాయిస్తూ పతిత మార్గాన పరుగులెత్తిందని, నేడు వయస్సు, అనుభవములతో జీవిత రహస్యాలను అర్థంచేసుకున్నది గనుక పశ్చాత్తాపముతున్నదని అనుకున్నాడు. ఆమె అనభిజ్ఞతతో చేసిన ఘోరపాపాలను నేటి ఆమెలోని పశ్చాత్తాపము పరిశుద్ధము చేస్తున్నదని. అనుకున్నాడు అంతేగాదు ఆమెను స్వీకరించనుకూడా నిర్ణయించుకున్నాడు.

కోర్టులో గంగరాజు విచారణ జరుగుతున్నకొలంది అనేక రహస్యాలు బయటపడుతున్నవి. పార్టీలో, పత్రికల్లో పడిన బలశాలియైన అయిన యువకుని గంగరాజు స్వయంగా ఖూనీ చేసినట్లు, విషప్రయోగం ద్వారా నలుగురు విరోధులను కైలాసయాత్ర చేయించినట్లు. ఆయన చేసిన ప్రతికార్యానికి ఒక మంత్రి పుంగవుని మద్దతునిస్తున్నట్లు

బయల్పడినపుడు వార్తా పత్రికలవేడి పెరిగిపోయింది. గుప్తచారుల ఆరాలు తీయుటకూడా అధికమయింది.

దొంగ కరెన్సీతోకూడా సంబంధం వున్నట్లు, కొన్ని లక్షలు చలామణి అయినట్లు వుత్తరాలు, ఆ తరువాత అప్పూవర్సు దొరికారు. ఒక రహస్యమైన స్థానంలో కోటిరూపాయల కరెన్సీ జాడీలలో పెట్టి భూస్థాపితం చేసినట్లు అవసరమైనపుడల్లా ఒకోజాడీ తీస్తున్నట్లు తెలిసినపుడు పోలీసువారు పెద్ద బందోబస్తుతో వెయ్యి గజాలవైశాల్యం త్రవ్వకుంటూ పోగా జాడీలు బైటపడినవి. ఆ వింత దృశ్యాలనుచూసి పోవటానికి వందలమైళ్ళనుంచికూడా వచ్చిపోతున్నారు.

మహానాయకుడుగా, ప్రజారక్షకుడుగా, ఆదర్శమూర్తిగా, విజ్ఞానవేత్తగా, గొప్పవక్తగా ప్రచలితమై ప్రజామెప్పుపొంది, అనేక యెన్నికపదవులకు యేకగ్రీవంగాఎన్నికై, నిత్యము వేదికలమీద పూలమాలలతో సత్కారాలుపొంది జేజేధ్వనులతో కరతాళ ధ్వనులు చేయించుకుని, వున్నత పదాడంబర శబ్దాలతో మహోత్తర నీతులను త్యాగాలను ప్రబోధించిన ఆ మహనీయుని నిజ స్వరూప మిదా, యని యెవరికి వారే ఆశ్చర్యపోతున్నారు ప్రతినాయకుని గురించి ఆలోచిస్తున్నారు. ఈ మహానాయకులంతా తెరచాటున యింతేనేమోనని భీతిల్లుతున్నారు. వ్యభిచారంలో ఆరితేరకుండా, మత్తుపానీయంలో మునకవేయకుండా, దోపిడిలో ఆధునికరీతులలోని నైపుణ్యం పొందకుండా అధికారం అందదు అని కొందరు లోకోక్తుగా అంటున్నారు. అందరినీ అనుట అపరాధం గావచ్చు. కాని నేటి రాజకీయ అగ్రజులలో అధికభాగం అంతే, అన్నా అత్యుక్తికాదు, అని మరికొందరి సవరణ.

ఇంతవరకు తెలిసిన అనేక బ్యాంకులలో గంగరాజుపేరవున్న మొత్తం తొంబది లక్షలపైచిలుకు తేలింది. అంతేగాక బంగారం బాండ్ల రూపంలో నలుబదిలక్షలు కనిపించినవి. స్థిరాస్తి అంచనా ముప్పది లక్షలని అంచనా వేల్చారు. ఆయన రాజకీయంలో ప్రవేశించుముందు 50 వేల రూపాయల ఆస్తిమాత్రమే కలిగి వున్నాడుట. నేటి యీ సోషలిస్టిక్ పాట్రన్ ఆఫ్సొసైటీలో నిరాడంబరిగా, త్యాగమూర్తిగా, ఆదర్శ

నాయకుడుగా దేశసేవచేస్తూ తన 50 వేల ఆస్తిని ఒకకోటి అరువది లక్షల ఆస్తిగా మార్చగలిగాడు.

ఈ మహాపాపం, గంగరాజు ఒక్కడితోనే ఆగిపోలేదు. రాజకీయ సహచరులు, గుప్తస్నేహితులు వ్యాపారాలలోని భాగస్తులను అనేకమందిని గంగరాజు చెంతకు చేర్చింది. రాజకీయరంగంలోని ఒక వర్గానికి చెందిన జిల్లా మొత్తా అంతా జైలుకు చేరిసట్లున్నది. ఒక్క జిల్లాలోనే యింతమంది మహనీయులుంటే యిక రాష్ట్రమంతటిలోను యెంతమంది యే రూపంలో వుంటారో, అని అంచనావేస్తున్నారు కొందరు. పట్టుపడిన సంఖ్యను ప్రత్యక్షంగా చూస్తున్నాము. పట్టుపడని సంఖ్య యెంత వుందో యెవరికి తెలుసు? అంటున్నారు మరికొందరు. అయినా సోషలిస్టు వ్యవస్థ అనే పేరుతో సాగుతున్న ఈ ప్రభుత్వ విధానంలో దొంగవ్యాపారాలకే అవకాశం అధికంగా వుందని మరికొందరు విమర్శించుకుంటున్నారు.

కలలో కరచిన నాగపామువలె తెల్లవారకముందే సుభద్రా దేవికి వచ్చిన వారెంటు కైలాసపతిని కలవరపెట్టింది. ఒకప్పుడు గంగరాజు ఆయనకు ఆదర్శపురుషుడు. ఆయన అడుగుజాడలలో నడవాలని మోజు పడేవాడు. కోర్టు పనులు కూడా వదులుకుని గంగరాజువలె త్యాగమూర్తిగా నిలిచి సేవ చేయాలని, ప్రజాదరం పొందాలని, అనుకునేవాడు. మనసులో గంగరాజును రాజకీయ గురువుగా స్వీకరించాడు కాని కోర్టులో గంగరాజు నిజస్వరూపం ప్రదర్శితమయ్యాక బెదిరిపోయాడు. ఘృణీకరించుకోసాగాడు. ప్రభుత్వాన్ని ప్రజలను మోసగించిన అతనిని చిత్రవధ చేయాలన్నాడు. ఈ చర్యలు రాజకీయరంగానికేగాదు మానవత్వానికే తీరని కళంకం అన్నాడు.

కాని తన యింటిలో తనతో వుంటున్న సుభద్రకు వారెంటు రావటం గాభరాను పెట్టింది. గంగరాజు రాక్షసకృత్యాలతో ఆమె కేమి సంబంధముంటుంది? సాక్షిగా పిలిపించటకు వారెంటుమీద పిలిచి వుండవచ్చు ననుకున్నాడు.

సుభద్ర మాత్రం మ్లానత చెందింది గాని, బెత్తరపోలేదు. 'మీరు

విచారపడకండి. యెలా కానున్నదో చూదాం" అంటూ ఆమె పోలీసు వారి ననుసరించింది.

గంగరాజుతో కలిసి అనేక సభలలో వుపన్యసించింది. సుభద్ర రాజకీయ, సాంఘిక కార్యరంగాలలో కొన్నిచోట్ల ఆయన్ను అనుసరించింది. అంతమాత్రాన గంగరాజు ఘోర మోసాలను సుభద్ర నెత్తిన కూడా రుద్దే హక్కు పోలీసువారికీలేదు కోర్టువారికీలేదు. అనుకుంటూ ఆమె తరపు వాదించుటకు సంసిద్ధుడై కోర్టుకు పయనమయ్యాడు.

విమల ఆత్మహత్యగాధను పోలీసువారు కోర్టులో వివరించినపుడు ప్రేక్షకులంతా కన్నీరు కార్చారు. గంగరాజుద్వారా మోసగించబడిన అమాయక అబలలు యింకా యేడుగురు పోలీసువారి ప్రోత్సాహంతో స్వేచ్ఛగా కోర్టుకు హాజరయ్యారు. అందరూ సంతానవతులే. అందరికీ అరచేతులో వైకుంఠంచూపి మోసగించినట్లు, సంతానం కలిగేవరకూ మాత్రమే ప్రతి ఒక్కరితోనున్నట్లు, ఆ తరువాత అదృశ్యమైనట్లు, తరువాత కదాచిత్‌గా కనిపించినా తిరస్కరించినట్లు, వారి జీవితాలను సర్వనాశనంచేసి నిరాధారంతో విడిచి మర్చిపోయినట్లు, వారందరి వాఙ్మూలసారాంశంగా తేలింది.

మహాభారతంలోని వుపకధలవలె వీటన్నిటిని వింటూ తనకు కావలసిన ఘట్టంకొరకు యెదురు చూస్తున్నాడు కైలాసపతి. ఈ అబలలందరూ సాక్షులుగామాత్రమే విచారించి విడిచిపెట్టబడ్డారు. ఈవిధంగానే సాక్షిగా సుభద్ర వస్తుందని, ఆమెను ఎవ్వరూ నిందించకుండా వాదించి పోలీసువారికి మర్యాదనేర్పి ఆమెను విముక్తలచేయించాలని, ఆలోచనలలో మునిగిపోయాడు.

మంచి రసవత్తరమైన డ్రామాలోని మరోసీను అమృతాలకొరకు యెదురు చూస్తున్నట్లు, కోర్టు వరండా అంతటా నిండివున్న ప్రేక్షకులు వుత్సాహభరితులై తహతహ లాడుతున్నారు.

పోలీసువారు మహిళానాయకురాలు సుభద్రాదేవిని, మరో ఆరు సంవత్సరాల ప్రాయపు బాలికను బోనులో నిలబెట్టారు.

కైలాసపతి వుత్సాహభరితు డైనాడు. కాని ప్రక్కనున్న బాలి కను చూసి అయోమయంలో పడిపోయాడు.

పోలీసువారి కథనం ప్రకారం, ఆ బాలిక సుభద్రాదేవి గంగరాజుకు కలిగిన అక్రమ సంతానమైనట్లు, ఆ బాలిక బాధ్యతనుంచి యిరువురు విముక్తికాగోరి. అమెరికన్ హాస్పటల్‌వారికి ఆ పాపను, ఇరువదివేల డబ్బును దానం చేసినట్లున్నూ, గంగరాజు చేయించిన ఒక ఖూనికేసులో సుభద్రాదేవికికూడా సంబంధమున్నట్లు, కోఆపరేటివ్ సొసైటీలోని దొంగ వ్యాపారంలో ఆమెకూ ఒక పీసభాగ మున్నట్లు, ఆ సందర్భంగా ఆమెవంతు వచ్చిన యాభై వేల ధనాన్ని ఆమెపేర బ్యాంకులో వున్నట్లు తెలిసినపుడు కైలాసపతి శిలాప్రతిమ అయిపోయాడు.

ఆ బిడ్డ సందర్భంగా చెప్పబడినదంతా యదార్థమని. ఆ బిడ్డ తన బిడ్డేనని, మిగతా విషయాలు తనకు తెలియవని, ఆ సమయంలో తన యడల గంగరాజుకున్న అనురాగంవలన తన పేరుతో బ్యాంకులో వేసి వుండవచ్చునని, అంతకుమించి తనకు తెలియదని సుభద్రాదేవి వాఙ్మూలమిచ్చింది.

ఏమి నిర్ణయించుకున్నాడో యేమో కైలాసపతి అధోముఖుడై తప్పటడుగులు వేసుకుంటూ బయటకు వెళ్ళిపోయాడు.

మండుతున్న హోమగుండంలో క్రమబద్ధంగా ఆజ్యం పోస్తున్నట్లు, హృదయాన్ని చీల్చివేసే వార్తలు రోజుకో విధంగా కోర్టునుంచి వస్తున్నవి స్వర్ణకుమారికి. నిండుచూలాలతో వున్న స్వర్ణ శయ్యమీద ముసుగులో దాగి వుంటున్నది. ఏరోజుకారోజు అంతకుమించిన ఘోరమైన వార్తలే వస్తున్నవి. ఏ సమయం యెంత భరించరాని విషయాలు వినవలసి వస్తాయోనని ఆమె శరీరం కంపించిపోతున్నది. గుండెల్లో రైళ్ళు పరుగులెడుతున్నవి.

25. ఆవేదన

స్వర్ణకుమారి ఉచ్ఛ్రశ్రేణికిచెందిన సాంప్రదాయంలోనిది. అక్కడ వ్యభిచారానికి, త్రాగుడుకు పెద్దదోషం లేకపోవచ్చు. కాని ద్రోహాన్ని.

మోసాన్ని. కటికి స్వార్థాన్ని సహించలేరు. ఇపుడు గంగరాజును ఘృణీ కరించుకుంటున్నది. తనంత తెలివిమాలినది, దురదృష్టవంతురాలు మానవకోటిలోనే వుండదని పరితాపంతో కుమిలిపోతున్నది. ఇపుడు వసంతకుమార్, పద్మ, భూదేవి అందరూ తనచుట్టూ కూర్చున్నట్లు కని పిస్తున్నారు. జాలితో ఓదారుస్తున్నట్లున్నది. ఆమె దుఃఖం మరీ పొంగి పొర్లుతున్నది శయ్యమీదఆగలేక అటూ యిటూదొర్లుతున్నది "లోకాన్ని అర్థంచేసుకోకపోతే అనర్థం తప్పదు." అని భూదేమి అంటున్నట్లు విని పించింది. "ఆర్భాటాల ఆధిక్యతల మోజులోపడి అదే ఆదర్శమను కుంటే వెర్రితనంగాక మరేమవుతుంది!" అని పద్మ అంటున్నట్లు విని పించింది. "జీవితం అమూల్యమైంది. ప్రతివరంలాంటిది. చేసిన పొర పాటును ముందుంచుకుని, భవిష్యతును నాశనం చేసుకోగూడదు. పశ్చాత్తాపంతో అపరాధాన్ని కడిగివేసి ముందుకు నడవాలి." అని వసంతకుమార్ అన్నట్లు వినిపించింది.

ఆలోచనలతో వేడెక్కి వూపిరి సలుపక ముసుగునుతీసి కూర్చు న్నది. ఎదురుగా గోడనున్న గంగరాజు తైల చిత్రం గనిపించి, హేయ తలోని ద్వేషంతో పంతాలు నూరుకుంటూ నేత్రాలుమూసి తిరిగి ముసు గులోదూరి నిర్మలము, నిష్కామము, త్యాగముతో ప్రభవిస్తున్న వసంత కుమార్ ముఖాన్ని చూడాలని స్మరిస్తున్నది. తన యింటి వాతావరణము, గంగరాజు మోజులోపడిన తన దుస్థితి మనస్సులో మెదిలి దుఃఖం పొర్లింది.

"నీవు మూర్ఖురాలవు, మహాపాపిష్టివిగాకపోతే దేవతా సమాను లైన వారున్న స్వర్గధామాన్ని విడచి యీ రాక్షసుని చెంతకు యెందుకు చేరతావు! నీ గర్వము, అహంకారము యీ హంతకుడైన గంగరాజు ముందు తుస్సునియలైనవి. ఇక జీవితమంతా అనాధగా, పాపిగా భరించ లేని దుఃఖాన్ని నెత్తిన వేసుకుని దుఃఖింపు" అని మనస్సులోని ఒక ప్రవృత్తి వినిపించింది. విమల, ఆమె ప్రక్క పసిబిడ్డలు దీనంగా కని పిస్తున్నారు వారు తన్ను ప్రసన్నంతో ఆహ్వానిస్తున్నట్లున్నది ఇలాంటి జీవితంకంటె అదే వుత్తమము శరణ్యంగా గనిపించింది. విమల ధన్యు

రాలనిపించింది. ఆ రోజు ఆమెను ఆలింగనం చేసుకుని వోదారిస్తే ఎంత బావుండేది, అనిపిస్తున్నది. తన జీవితమే తప్పుల తడికగా కనిపించింది. ఆమెను ఆదరించలేని పాపి తాను. అందుకే నేడు తనను ఆదరించేవారు ఒక్కరూ లేరు.

ఈ మాయలమారి బారిలో యెందుకుపడ్డానా, అని వాపోతూ శిరస్సును మోదుకున్నది. అతనిద్వారా పతితులు, దరిద్రులు, అనాథలు అయినవారు గుంపుగా మనస్సులో కనిపించి, గుండె ఝల్లని పిస్తున్నది. లోకం వీరందరిని చూసి వినోదాన్ని పొందుతూ హాస్యమాడుకుంటున్నట్లు తోచింది. అప్పుడు తాను లోకానికి మొఖ మెలా చూపగలుగుతుంది! విమల మళ్ళీ గుర్తుకొచ్చింది. పదేపదే ఆమె మార్గమే శరణ్యమనిపిస్తున్నది. మరణానికి మార్గాన్ని మనస్సు వెదుకుతున్నది. కాని హృదయం వెనక్కు లాగుతున్నది. విమలకున్న తెంపు సాహసము తనకు లేదని తేలిపోయింది. మరెవరికీ ముఖం చూపకుండా యీ దుర్భర జీవితాన్ని గడిపేది యెలా? ఆ కిరాతకుని పొందుతో తనకు కలుగబోతున్న సంతానం సంగతేమిటి? తన జీవితానికి అన్నివైపులా అంధకారాన్ని సృష్టించి పోయాడు, ముళ్ళకంచె మధ్య బంధించి వెళ్ళిపోయాడు.

సత్ప్రవర్తనలోను, ధర్మంలోను, న్యాయంలోను, సేవలోను, త్యాగంలోను సాధుత్వముంటుంది. అక్కడ అతితెలివికి, చతురతకు, మాయాజాలానికి అవసరం లేదు, మోసానికి, ద్రోహానికి, కిరాతకానికి, దోపిడికి గొప్ప నిపుణత అవసరం. చతురత వుండితీరాలి.

గంగరాజు చేసిన కార్యాలు సామాన్య ప్రవీణులు చేయగలిగింది గాదు. అతను మోసాన్ని ద్రోహాన్ని దోపిడిని సర్వవైపులనుంచి ప్రారంభించాడు. ఆ కారణంగానే మహానాయకుడుగా సర్వవైపులనుంచి విజయం పొందాడు. నేడు కాలమెచ్చి పట్టుబడినా అంతటి శక్తిసంపన్నుడు యీ కోర్టులనుంచి కూడా [illegible] బయటపడి తన యెదుట కొచ్చి నిలిస్తే యేమిటి చేయుటం? అన్న ఆలోచన కలిగినపుడు

స్వర్ణకుమారి భయంతో వణికిపోయింది. భూతావేశురాలివలె కెవ్వున కేక వేసింది.

దొడ్లోవున్న దాసి పరువెత్తుకొచ్చి "ఏమి టమ్మగారు!" అని ప్రశ్నించింది.

కాని స్వర్ణకుమారి స్పృహలోలేదు. సపర్యలతరువాత నేత్రాలు తెరచింది. దీర్ఘ నిట్టూర్పును విడిచింది.

ఇలాంటి సంఘటనలు నిత్యము మామూలయిపోయింది గనుక దాసి చూస్తూ వుండిపోయింది.

స్వర్ణకుమారిలోని భీతి యింకా పోలేదుగాబోలు సైగతో దాసిని దగ్గరకు పిలిచి చెయ్యిబట్టి తన శయ్యమీద కూర్చుండబెట్టింది.

ఇపుడు హృదయం కుదుటపడింది, కాని తన చేతిని విడువలేదు. తిరిగి తన మనస్సు యింతకుముందున్న ఆలోచనలలోకి పరువులెత్తింది. గంగరాజు జైలునుంచి విడుదలై వచ్చి తన యెదుట నిలిచినట్లున్నది. శరీరం ఒకమాటు జలతరించింది.

"ఛీ! ఛీ. అతనిముఖం యెన్నటికీ చూడగూడదు. రాక్షసుడుగా పేరుబొందిన రావణునిలోని రాక్షసత్వం యితనిముందు హాస్యాస్పదము. అధికారతృష్ణలో దుష్టుడుగా ప్రచలితమయిన దుర్యోధనునిలోని దుష్టత్వం యితనిముందు వెలవెలబోయింది. దోపిడిలో పండిపోయిన ఘజనీ, ఘోరీలు యితనిముందు తెలివితక్కువవారు. ఆనందా న్ననుభవించుటే పరమావధిగా ప్రబోధించిన ఉమర్ ఖయాం యితనిముందు ఖుర్లరాయుడు. అధికారాన్ని హస్తగతం చేసుకోవటంలో ఆధునిక చాణక్యుడు. ఇలాంటి పరమ కిరాతకుణ్ణి, నరరూప రాక్షసిని చరిత్ర స్తుతించవచ్చు. విని ప్రేక్షకులు వినోదం పొందవచ్చు. కాని ప్రత్యక్ష అహుతిలోని యీ వ్యథ భరించరానిది. ఇలాంటి కిరాతకునికి యే లోకంలోను క్షమ వుండరాదు. ఒకవేళ తిరిగివస్తే యేమిటి చేయటం!" అనుకుంటుండగానే హృదయం కంపించింది. తనకు

తెలియకుండానే అస్పష్టశబ్దాలలో గాద్గిక కంఠంతో "ఆత్మహత్య చేసుకుంటాను" అన్నది.

ప్రక్కనున్న దాసి ఖంగారుపడుతూ "ఏమిటి అమ్మగారు?" అంటూ ఆమె హస్తద్వయాన్ని పట్టుకున్నది.

పెద్దగా అలిసిపోయినదానివలె రొప్పుతూ ఎదురుగా గోడనున్న తైలచిత్రాన్ని చూపుతూ "ఆ పటాన్ని దింపి తీసుకురా" అన్నది.

"భగవంతుడను గ్రహిస్తే ఆయన తిరిగి రాగలడమ్మా పోలీసు ద్వారానే మంత్రులకు తన సందేశాలను అందజేశాడుట. పైవారు కల్పించుకుంటే అన్నీ మాసిపోతవి." అని గొప్ప ఓదార్పుమాటలు పలికినట్లు, కాస్త వుల్లాసాన్ని ప్రదర్శిస్తూ, వెళ్ళి ఆ పటాన్ని పట్టుకొచ్చింది. అంత బలహీనంలో నీరసంలోకూడా ఆబలం యెక్కడినుంచి కలిగిందో, ఆవేశితురాలివలె, ఆ పటాన్ని అందుకుని మంచపుకోటిమీద మోదింది. ఘల్లుమంటూ అద్దం వేలముక్కలుగా రాలిపోయింది. ఆ చిత్రాన్నితీసి అంతకంటె చిన్న చిన్న ముక్కలుగాచేసి తూర్పారపట్టింది.

దాసి విస్మితురాలై "అదేమిటమ్మగారు." అన్నది.

వెల్లుబుకిన క్రోధావేశాలతో, గర్జిస్తున్న కంఠంలో "నా ఒక్క జీవితం నాశనమైతే లెక్కించను. ఎంతోమంది అబలజీవితాలను సర్వనాశనంచేసినందుకుకూడా నేను అంతగా చింతించను. నావలెనే అంధత్వంతో అహంకార ఆదేశమత్తులో అగ్నికి ఆహుతియై మిడుతలవలె, స్వయంకృతాపరాధంతో నాశనమైనారని వూరట పొందేదాన్ని. కాని యితను ఒక్క స్త్రీలనేగాదు ప్రజలకు ద్రోహంచేశాడు. ప్రభుత్వానికి ద్రోహం చేశాడు. రాజకీయరంగానికి కళంకం ఆపాదించి సచ్చరిత్రులయిన రాజకీయ నాయకులకు తలంపులు చేశాడు. దేశసేవఅంటే పచ్చిమోసమను భయాన్ని కల్పించి నిస్వార్థ సేవాతత్పరులయిన త్యాగమూర్తులకు ఆదరంలేకుండా చేశాడు. ప్రజాశ్రేయస్సుకు పట్టుగొమ్మయిన సమిష్టి వ్యవసాయ విధానాన్ని, సహకార సంఘాలను పరపతి సంఘాలను హాస్యాస్పదంచేశాడు, నీతికి నిజాయితీకి గొడ్డలి పెట్టుపెట్టాడు.

(ఆమె కంఠం బరువెక్కింది. అశ్రుప్రవంతి జారుతున్నది — దుఃఖాన్ని ఆపుకో ప్రయత్నిస్తూ పూడిపోయిన కంఠంతో) ఇతను యీనాడు చేసిన రాక్షసకృత్యాలకు వేయిజన్మలు నరకయాతనలతో గూడిన శిక్ష ననుభ విస్తూ పోయినా పాపం పరిహారంకాదు." అంటూ మొఖాన్ని అరచేతు లలో దాచుకుంటూ కుమిలికుమిలి యేడుస్తున్నది.

దాసి తనను తాను మర్చి మంత్రించినట్లు అలాగే నిలిచివున్నది. ఇంతవరకు ఆలోచించిందివేరు యిపుడు తెలుసుకున్నది వేరు అని పించింది. "అవును. మహానాయకులకుకూడా స్వార్థం వుండచ్చు కాని స్వార్థంలో రాక్షసత్వముంటే మానసత్వానికే ముప్పు కలుగుతుంది." అని మనస్సులో అనుకున్నది దాసి. స్వర్ణకుమారిమీద సానుభూతికూడా కలిగింది. అద్దం పెంకులను కాగితం ముక్కలను ప్రోగుచేసి తీసు కెళ్ళింది.

ఏరోజుకారోజు కోర్టునుంచి వచ్చిన గంగరాజు దురంతాల వివరం విని విని విసిగిపోయింది. దుఃఖంతోను ద్వేషంతోను మరిగిపోయింది. ఆయన దురంతాలతో స్వర్ణకుమారి యేమీ సంబంధంలేదని గ్రహించి నప్పటికి, తనను మోసగించిన విధానాన్నయినా తన దుఃఖ గాధనైనా కోర్టులో వినిపిస్తే సాక్షిగా వుపకరిస్తుందని ప్రయత్నించారు. ఆమె నిరో ధించింది. అయినా వారంటుతో రప్పించాలని ప్రయత్నించారు. కాని ఆమె అనారోగ్యం అందుకను మతించలేదు.

గంగరాజు విడుదలకొరకో, చూడాలన్న అపేక్షతోనో ఆమె దుఃఖించుటలేదని, అతని స్వరూపం తెలిశాక హేయంగా ద్వేషిస్తున్న దని, పొరపాటుగా యింత ఘోరవిపత్తులో మునిగి జీవిత సర్వస్వాన్ని నాశనం చేసుకున్నందుకు దుఃఖిస్తున్నదని నౌఖర్లందరికి తెలిసి పోయింది. సానుభూతికూడా కలిగింది. ఇపుడామె ముందు ఆయన విష యాలు చెప్పాలని యెవరూ ప్రయత్నించుటలేదు.

కలిగిన భీతిలోని నిరాశలో ఆత్మహత్యకు యెన్నో వుపాయాల నాలోచించింది. భరించలేని బాధలనుంచి విముక్తి పొందుటకు ఆత్మ హత్య ఒక్కటే శరణ్యం, అది అన్ని పాపాలను హరించి దివ్వత్వాన్ని

ప్రసాదించగల పరిస్థితేమైందని, కాని అవి విమలలాంటి సాహసులకు తప్ప అందరికీ సాధ్యమయేదికాదని, బాధలను భరించలేక, ఆత్మహత్యను స్వీకరించలేక పిరికితనంతో భయపడినవారే, ఆత్మహత్య మహాపాపమని ప్రబోధించి వుంటారని, అనుకున్నది.

ఎవరు యెంతటి సంకటంలోపడి నలిగిపోతున్నా ఆర్తనాదానికి కూడా హాయిలేక అలమటిస్తున్నా పగటి తరువాత రాత్రి, రాత్రి తరువాత పగలు వరుసగా యధావిధిగా నడుస్తూనే వుంటవి.

అంతఃపురాలలోను, ఆనందనిలయాంలోను నర్సింగుహోముల లోను కత్తుల కటారులమధ్య జన్మించేవారికి యెన్నో కొరతలుండవచ్చు. ఔషధాల అవుసరమైనా వుండవచ్చు, కాని నిస్సహాయులై వృక్షచ్ఛాయల్లో జన్మించిన వారికి యే కొరతలూ కనిపించకుండా దీర్ఘాయుషను పొందుతుంటారు,

అదేరీతి ఆత్మక్షోభతో క్రుంగుతూ, కన్నీరుకూడా కరువైన హీన స్థితిలోనున్న స్వర్ణకుమారి మగబిడ్డను గన్నది. పసిబిడ్డ అరుపులతో బయటనున్న దాసి పరువులెత్తిచూసి ఆశ్చర్యపోయింది.

భర్త అమానుషకార్యాలు బయటపడుట ప్రారంభించినప్పటి నుంచి ఆమెనౌఖర్లతోకూడా ముఖాముఖిమాటాడలేకపోతున్నది.నౌఖర్లలో కూడా నిర్లక్ష్యము అవహేళనలు దాగివుండి తొంగిచూస్తున్నట్లుగ్రహించ గలిగింది. తన అసహాయస్థితిని గుర్తించింది గనుకనే ప్రవాహానికి వాలునపో ప్రయత్నిస్తున్నది. అందుకే ఆలోచనలను అణచుకుని దుఃఖాన్ని భరించుటే కోర్కెగా పెట్టుకున్నది. నిరుపాయురాలై "భగవాన్, నాకు ముక్తిమార్గం చూపించు" అని పదే పదే అనుకుంటున్నది. బాల్యంలో మేనత్త చూడకుండా పూజామందిరంలోచేరి దేవతా విగ్రహాలనుతీసి గూట్లో దాసివచ్చేది. పూజకునచ్చి కూర్చున్న భూదేవి విగ్రహాలు కానక భయ కంపితురాలై విలపిస్తుంటే తాను విజయానంద సూచకంగా గెంతులువేస్తూ చప్పట్లు చరుస్తూ "దేవుడు మాయమైపోయాడా అమ్మా," అనేది.

ఛీ", అలా అనగూడదమ్మా" అని గద్గదికంగా అన్నపుడు

తాను జాలితో దగ్గరగా జేరి "దేవుడు గూట్లో ప్రత్యక్షమయ్యాడేమో చూడు!" అనేది.

ఘూదేవి ఒకప్రక్క ఆనందపడుతూ, మరోవైపు భయపడుతూ ఆ విగ్రహాలను పునఃప్రతిష్ట చేసి ధూపదీపాలు వెలిగించి, టెంకాయలు వరుసగా కొడుతూ హారతితో స్తోత్రం చేస్తూ "పసిది తెలియక చేసింది తండ్రి! దాన్ని క్షమించు" అంటూ తన చిన్ని హస్తాలను పట్టి దేవునికి సాష్టాంగము చేయించేది. అదంతా తనకు హాస్యంగానే వుండేది. తన చిన్ని బీరువాలో అనేక బొమ్మ లుండేవి. పింగాణీవి, రాతివి, కొయ్యవి, యిత్తడివి యెన్నో రకాల బొమ్మలుండేవి. రోజుకో రకమైన బొమ్మలతో ఆడుకునేది. వాటిలోనే రాజులు రాణులుగాను, పెళ్ళికొడుకు పెళ్ళికూతురుగాను, దేవుడు దేవతగాను భావించి దుస్తులు ధరింపజేసి ఆడుకునేది. అమ్మ యెన్నడూ ఒకే బొమ్మను విసుగులేకుండా పూజిస్తుంది. తాను యెప్పటికప్పుడు బొమ్మలను మార్చాలి. వాటి అలంకరణలు మార్చాలి. అమ్మ పూజించే బొమ్మకంటె తన బొమ్మలు యెంతో అందమైనవి. తన బొమ్మలలో రాజా రాణీ బొమ్మలు, మాయలఫకీరు బొమ్మ యెంతో ఆకర్షణీయమైనవి. ఒకమాటు పూజామందిరంలో గోపాలకృష్ణుని బొమ్మను తీసివేసి మాయలఫకీరు బొమ్మను పెట్టివచ్చింది. పరిశీలనగా చూడనందువలన ఘూదేవి వారంరోజులవరకు ఆ మాయలఫకీరు బొమ్మకే పూజలు సలిపింది. తెలిసినపుడు ఆ మందిరంముందే శిరస్సు మోదుకుని బలి కాబోయింది. సౌఖ్యంతా పట్టి ఆపారు. ఆ తరువాత వారంరోజులు కటిక వుపవాసవ్రత మాచరించి, వేల డబ్బుతో సంతర్పణలు జరిపి అప్పటికి తృప్తిపడింది. అంత అఘాయిత్యం చేసినపుడుకూడా తనను ఒక్క దెబ్బ వేయలేదు. ఆమె అంత శిరస్సు మోదుకుని హంగామాతో వుపవాసాలు జరిపినా తనకు ఆ మందిరంలో మాయలఫకీరు బొమ్మే బాగున్నదని ఆ బాగున్న బొమ్మకే పూజలు చేస్తే ముచ్చటగా వుండేదనిపించేది.

ఒక్కమాటుగా ఆమె హృదయం కంపించింది. మనస్సు వాపోవ సాగింది, అవును ఆనాడు దేవతాస్థానంలో మాయలఫకీరును

పెట్టింది. నేడు అలాంటి మాయలఫకీరు పాలిట పడి సర్వనాశనమైపోయింది. ఆనాటి చిలిపి చర్యకిది శిక్ష గాబోలునని దుఃఖించింది. ఎక్కిళ్ళతో పొర్లివస్తున్న దుఃఖంతో "అమ్మా, నేను మహాపాపిని. నన్ను అంత గారాబంగా యెందుకు పెంచావు? భయభక్తులలో పెరిగితే, భయభక్తులలో మెలిగితే నా జీవిత మిలా వ్యర్థమయేది కాదమ్మా. మమతలో నీవు శిక్షించలేకపోయావుకాని నేడు భగవంతుడు యింత నిర్దయగా శిక్షిస్తుంటే నీ వెలా చూస్తున్నావు. నే నెలా భరించేది!" అలా యెంతసేపు విలపించిందో చెప్పలేము.

ఎంతటివారికైనా దుఃఖాంగణంలో ప్రవేశించినపుడు భక్తి కుదురుతుంది. తన సర్వశక్తులు విఫలమైనపుడు మరో మహత్తరమైన అజ్ఞాత శక్తి రక్షణగోరుట స్వాభావికం. గంగరాజు విషయం మనసులో మెదిలినపుడు హృదయాన్ని కంపాలతో కోస్తున్నట్లు బాధ కలుగుతున్నది. ఆ విషయాలను విస్మరించను తగినోపాయాన్ని అర్థించను ఆరాటపడినఫలితంగా భగవద్ధ్యానం ఆమెకు లభించింది. అందు ఆమెకు అనుభవంలేదు గనుక భగవంతుని యే పేరుతో స్మరించాలా అని తడబడలాడింది. సర్వనదులు సాగరంలో తరిస్తున్నట్లు దైవ సంబంధమైన పేర్లన్నీ ఒక్క దేవునికి చెందినవెగదా. ఏ పేరుతో స్మరిస్తే బాగుంటుంది, ఆయన అసలు చిరునామా ఏమిటి? అని ఎన్నోవిధాల ఆలోచించింది. భగవంతుడు ఒకడే అయితే ఆయన, నా అసలు పేరు ఇది, అని యెవరికి చెప్పాడు. చెప్పాడని యెవరైనా విలపించినా యెలా విశ్వసించటం! అసలు ఆ దేవుడు తనకు పేరుపెట్టుకున్నాడో లేదో, పెట్టుకునివుంటే అది ఏమి పేరో యెవరికి తెలుసు! అని సందిగ్ధాలలో మునిగిపోతున్నది. ఈ ఆపత్సమయంలో భగవంతుని ధ్యానించాలనుకుంటూ విధానం తెలియక తికమకలతో సతమత మౌతున్నది. అవును యెడారిలో పెరిగినవాడు ఏటివద్దకుచేరి ఒక్కమాటుగా యీదుకుపోవాలంటే సాధ్యంగాదు.

జిల్లాకోర్టులో విచారణానంతరం గంగరాజుకు ఆయన అనుచరులకు జన్మఖైదు, కొంతమందికి స్వల్పకాల శిక్షలు, సుభద్రాదేవికి ఆరు

మాసాల కఠినశిక్ష విధించబడింది. తరువాత హైకోర్టుకు అప్పీలు చేయబడింది.

26. అదృష్టం

హైకోర్టులో విచారణ జరుగుచుండగానే శిక్ష పూర్తయినందున సుభద్రాదేవి విడుదల కాబడింది.

అనేకకాల అనుభవం పొందిందిగనుక ప్రజలముందుకు పోయి తన నిర్దోషిత్వాన్ని ఋజువుచేసుకోను వెరపులేదు. అయినా ప్రజాకార్యం మీద, పేరుప్రతిష్టలమీద, పదవులమీద నేడు వ్యామోహంలేదు. ఒకప్పుడు యీ వ్యామోహంతోనే భర్త కాళిదాసును యెదిరించి, బెదరింపులతో కొంత ఆస్తిని పొంది ఎన్నికలలో నిలిచి డిపాజిట్టును కోల్పోయింది. మరోమార్గం లేక ప్రజాకంగంలోనే ఒక అంకాన్ని తనదిగా చేసుకుని రథయాత్రను నలిపింది. పూలమాలలు వేయించుకున్నది, జేజేలు కొట్టించుకున్నది. మహానాయకురాలుగా ప్రసిద్ధి చెందింది. అయినా వుదాసీనత లభించింది, కైలాసపతిని కోరింది. కాని జైలుశిక్ష లభించింది నేడు బాహ్య ప్రపంచానికి తిరిగి పోతున్నది. కాని అన్ని ద్వారాలు మూసుకుని వున్నవి. తన కిపుడు హారాలతో సత్కారాల అవసరం లేదు, జేజేలతో పనిలేదు, వుపన్యాస వేదికల మోజు పోయింది, ఆహ్వానాలు అందవని తెలుసు, నేడు తనను స్వీకరించేవారుంటే ధన్యతగా భావిస్తుంది. కైలాసపతి రాడు. తాను పెళ్ళినా కన్నెత్తి చూడడు. తన భర్త కాళిదాసును గురించి ఆలోచించే అర్హతలేదు తనకు. ఆయన వుత్తముడు, వుదాత్తుడు. తానే ఆయన్ను రచ్చకీడ్చి హీనపర్చింది. అనేక సంవత్సరాలవరకు ఆయన యింటినుంచి బయటిముఖం చూచూట లేదన్న వార్త విన్నపుడు పరిహాసించింది. ఆ తరువాత ఆయన్ను శాశ్వతంగా విస్మరించింది. అయినా ఆయనకూడా నేడు మనస్సునందు పరువులెడుతున్న రీలులో ఒక మెరుపుగా కనిపించాడు. కామోద్రేకంలో కలిసినవారుకూడా వరుసగా కొందరు కనిపించారు, కొందరు మరుగున

పడి పోయారు. ఆమె ముఖం వుదాసీనతలో వెలవెల బోతున్నది. 'ఎక్కడికి పోవటం, ఏమిటి చేయటం' అన్నవి మనస్సుమీద సుత్తె దెబ్బలవలె వినిపిస్తున్నవి. యావజ్జీవ శిక్ష విధిస్తేనే బావుండేది, అనిపించింది.

ఆఖరిలో తన బిడ్డ సంగతి గుర్తుకొచ్చింది. కోర్టులో తనతోపాటు తన ప్రక్కన నిలిచినబిడ్డ స్వరూపం మనస్సుముందు ప్రత్యక్షమై తన మీద తనకే రోత కలిగింది. తన రాక్షసత్వం తనకే బట్టబయలైంది. తనలో స్త్రీత్వం లేదని వాపోయింది. దిక్కులేని బిడ్డగా అమెరికన్ హాస్పటల్‌వారి కివ్వమని గంగరాజును తానే కోరింది. తిరిగి ఒక్కమారైనా తన కన్నబిడ్డను చూడాలని తలంచలేదు. తానా విషయాన్నే పూర్తిగా విస్మరించింది. తనలో స్త్రీత్వంలేదని యింతకంటె రుజువేం కావాలి? స్త్రీత్వంలేని తాను స్త్రీ యదార్థ మనస్తత్వాన్ని యెలా అర్థం చేసుకోగలుగుతుంది? స్త్రీలోకవుద్ధరణ ఏ రూపంలో వుండాలో తనకెలా తెలుస్తుంది? ఇంతకాలం తను యిచ్చిన గంభీర వుపన్యాసాలను స్మరించి తనలో తానే సిగ్గుపడింది. పోలీసువారి పుణ్యమా అని తన బిడ్డను తాను చూడగలిగింది. చూసినదే తడవుగా తనలో స్త్రీత్వం జనించింది. జీవితంలో చేసినవన్నీ అపరాధాలని పశ్చాత్తాపం కలిగింది. బిడ్డకోసం మనస్సు వాపోయింది. తన బిడ్డను ముద్దిడుకుంటూ యేమేమో అడగాలని ఆర్రా పడింది. కాని అంతమందిలో ధైర్యం చాలక పోయింది. పోలీసులు బిడ్డను బయటకు తీసుకెళ్ళారు. తనను లోపలకు తీసుకొచ్చారు. ఎంత కష్టమైనాసరే తనబిడ్డను తాను పొందుటే తన లక్ష్యంగా నిర్ణయించుకున్నది.

తను పతితురాలు. రాక్షసస్వరూపిణి. తన బిడ్డే తనను ఘృణీకరించుకుంటుందేమోనని భయం కలిగింది. ఏమైనాసరె పాదాలమీద పడి ప్రాధేయపడతాను, క్షమాపణ కోరతాను. కాదంటే అక్కడే శిరస్సు మోదుకుని బిడ్డముందు ప్రాణాలు విడుస్తాను, అనుకున్నది. తన బిడ్డ సమ్మతించినా హాస్పటల్‌వారు అనుమతించరేమో నని శంక కలిగింది.

కాని మిషన్ హాస్పటల్‌వారి ఆశయం మానవసేవ. తనవలెకాక

వారు ఆశయానికి సూటిగా నడుస్తారు. అనాథలను ఆదరించి పోషిస్తారు. అనాథలకు నిజ ఆర్తులు లభించినా కాదని తమవద్దనే అనాథలుగా వుంచాలని వారెన్నటికీ తలంచరు, అని ఆశను సృష్టించుకున్నది.

ఆశలులేకుండా మానవజీవితమే లేదు. ఆశలే వుత్సాహాన్ని, సాహసాన్ని, శక్తిని కల్పింస్తుంటవి. ఇపుడు సుభద్రాదేవికి నిర్ణీత మార్గం లభించింది. మరోప్రక్క భీతికూడా పీడిస్తున్నది.

జేవురించిన ముఖంతో ముందుకు నడిచింది.

ఒక్కమాటు వెనుదిరిగి జైలు ఆవరణను పరిశీలనగా చూసింది. ఆ విచిత్రమైన మరో చిన్న ప్రపంచాన్ని స్మరించింది. ఆరుమాసాలు తాను యెవరెవరితో గడిపిందో వారందరి చరిత్రలను నెమరువేసుకున్నది. భర్తలను ఖూనీచేసినవారు, పాత సంబంధితులను ఖూనీచేసినవారు, తండ్రులకు మందుపెట్టిన వారు ఆమె హృదయాని కంత నొప్పి గలిగించలేదేమోకాని తమ చెడు ప్రవర్తనకు విముఖులై యెదురు నిలిచిన తమంతటి మొగబిడ్డలకుకూడా మందుబెట్టి హత్యజేసినట్లు తెలిసినపుడు ఆమె కలవరపడింది. జీవితంలో ఒక్కమాటు యిలాంటి జైలు జీవిత అనుభవం బొందితే యెంతటి మూర్ఖులైనా లోకాన్ని అర్థంచేసుకోగలరు, మానవత్వాన్ని పొందగలరు, అనుకున్నది. విశ్వవిద్యాలయాల ద్వారా మానవత్వాన్ని పొందజాలని వారు జైలుద్వారా తప్పకపొందగల రనుకున్నది. ఆ విషయాలన్నీ తిరిగి మనస్సులో మెదిలినవి.

ఆమెకు తెలియకుండానే అశ్రువులొలుక సాగినవి. అశ్రువులను అద్దుకుంటూ జైలు గేటుదాటి బాహ్యప్రపంచంలో అడుగిడింది.

ఎంత విచిత్రం! మానవజీవితంలో భరించలేని దుఃఖం ఒక్క క్షణంలో యెలా ప్రాప్తిస్తుందో అలానే ఆనందంకూడా అనుకోని రీతిగా క్షణంలో సంప్రాప్తమౌతుంటుంది.

“అమ్మా!” అంటూ ఒక పాపాయి పరువు పెత్తుకుంటూ వచ్చి ఆమె కాళ్ళను చుట్టవేసుకున్నది. ఆశ్చర్యపోతూ శిరస్సును నిమురుతూ చుబుకాన్నిబట్టి పైకి యెత్తింది. ఆ పాపే. తను కలలుగంటున్న తన

పాపే. హృదయానికేసి హత్తుకుంటూ. కన్నీటిలో కడుగుతూ. బరువు కంఠంతో "ఈ పాపిష్టిదాన్ని అమ్మా అని పిలుస్తున్నావా తల్లీ" అంటూ ఆమె కపోలాలమీద. ఫాలభాగంమీద. అసంఖ్యాకమైన చుంబనలతో ముంచివేస్తున్నది. ఆ పాపాయి ముద్దులనుంచి కొంచెం తొలగించుకుని "నాన్న అడుగోనమ్మా." అన్నది.

ఏమిటో అర్థంగాక సుభద్రగుండె ఝల్లుమన్నది. ప్రక్కకు తిరిగి చూసింది. జైలుగోడ ప్రక్కన మందస్మితవదనుడైన ఒకవ్యక్తి నిలిచి వున్నాడు. ఖద్దరు దుస్తులలో నిండుగా గనిపిస్తున్నాడు. 34 సం॥ ప్రాయ ముంటుంది. తను యెంతోమంది నాయకులను అధికారులను నిత్యము చూస్తూ వచ్చింది. కాని యెక్కడా కనిపించని ఆకర్షణ యీ వ్యక్తిలో ప్రభవిస్తున్నది. నాయకులలోని దొందుతనం ఆయనలో లేదు. అభిఖ్యాతా దర్పం అసలేలేదు. ఆ నిరాడంబర నిర్మల సాధుత్వమే ఆయనలోని ఆకర్షణకు మూలమేమో! కారుమేఘాలను విడలగొట్టి ప్రకాశిస్తున్న ప్రభాకరునివలె ఆయన మొఖం తేజోవంతమై దీప్తినిస్తున్నది. నిష్కల్మషము నిస్వార్థముతో నిర్మలత్వాన్నిపొంది ప్రభవిస్తున్నది. ఆ, ఆకర్షణలో స్నిగ్ధార్ద్ర ప్రేమ ద్యోతితమౌతున్నది.

"నాన్న దగ్గరకుపోదాం, రా అమ్మా!" అంటూ ఆ బాలిక ఆమె చెయ్యిబట్టిలాగుతూ, వుబికివస్తున్న వుల్లాసంతో "నాన్నా!" అంటూ పిలుస్తున్నది.

అబ్బ! ఆ పిలుపులో యెంతమాధుర్యమున్నది! అనురాగార్ద్రమైన ఆ పిలుపు మనస్సును పూపవేస్తున్నది.

"రా సుభద్రా, నిన్ను తీసుకెళ్ళనే వచ్చాము. ఉదయం 7 గంటల నుంచి నిరీక్షణలో వున్నాము. ఐనా విసుగు వేయలేదు. అమ్మాయి మాటలలో కాలం గడిచిపోయింది." అని ఆయనగారు పలికారు. అవి పలుకులుగాదు. అమృతంలో మునకలు వేసే తునకలు,

హద్దులను అధిగమించిన కరుణ, అసంభవమైనచోట క్షమ లభించినపుడు హృదయం భరించలేదు.

కొన్ని క్షణాలముందే ఆమె జైలునుంచి బయట కదుగిడినది. మానవలోకంలోకి కాదనిపించింది. ఇది మామూలులోకం మాత్రంకాదు. స్వర్గమే అయివుంటుంది. సుఖశాంతులతో కూడిన ఆనందనిలయమే స్వర్గమన్నారు. కాని అలాంటి స్వర్గమంటూ యెక్కడా వుండదని తాను యెన్నోమారులు విమర్శించింది. కాని తాను నేడు ప్రత్యక్షంగా స్వర్గంలో ప్రవేశించింది. శీతలపవన తెమ్మెరలకు మేఘాలు కరుగునట్లు యీ మధురాను భూతులలో సుభద్ర హృదయం కరిగి కన్నీరు కాల్వలు గట్టి ప్రవిస్తున్నది. కొంగుతో అద్దినకొంది అధికమౌతున్నది.

"ఏడుస్తావెందుకమ్మా!" అని పాపాయి అలక సూచనతో అడిగింది. ఆ ప్రశ్న, ఆమెలోని నిగూఢ వ్యధను కెరికినట్లయింది గాబోలు క్రిందకు కూలబడి, పాపాయిని రొమ్ముల కేసి అదుముకుంటూ "నేను మహాపాపిని తల్లీ!" అంటూ రోదించసాగింది.

పాప విసిగిపోయింది. ఆ కౌగిటిలో వూపిరి సలుపుటలేదు. సాంత్వన కనిపించుటలేదు! నాన్న వడిలో పొందిన సాంత్వన మధుర రూపంలో గుర్తున్నది. నాన్నవైపే మనస్సు పరువు లెడుతున్నది, అమ్మ మంచిదని నాన్న యెంతో చెప్పాడు. అది సుద్ద అబద్ధం. నాన్న మహా మంచివాడు. ఈ అమ్మ తన కనవసరం. నాన్నే కావాలి అనిపించింది ఆ హృదయానికి.

మొఖాన్ని ప్రక్కకు బెట్టి, కౌగిటినుంచి పారిపోను ప్రయత్నిస్తూ విఫలమై యేడ్పునిండిన కంఠంతో "నాన్నా, అమ్మ మంచిదని అబద్ధాలు చెప్పావెందుకు?" అంటూ పెద్దగా యేడుస్తూ గుంజుకోసాగింది. ఆ గింజులాటలో పాపాయి అధరానికి దెబ్బతగిలిందికాబోలు, చుబుకం మీద రుధిరం జిడ్డుకదుతున్నది.

ఆ రుధిరాన్ని గాంచి విస్మితుడై దగ్గరగావచ్చి తన వుత్తరీయంతో సుభద్రవడిలో వున్న పాప చుబుకాన్ని తుడుస్తూ "జిద్దిచెయ్యగూడదమ్మా," అంటూ లాలింపుగా వోదార్చ చూశాడు. పాప వాటిని వినగల స్థితిలో లేదు. నాన్న కువ్వుగిట్టిలోకి పారిపోవాలన్న కాంక్షతో యింకా పెనగులాడుతున్నది,

సుభద్ర అధీయరాలై విడిచిపెట్టింది అనకాశం చిక్కినదే తడవుగా పాప బయటపడి నాన్న హస్తాలను గట్టిగా పట్టుకుని పైకి ప్రాకటానికి ప్రయత్నిస్తున్నది. ఆయన తన కౌగిటిలోకి తీసుకుని తన భుజస్కంధంమీదికి వాల్చుకున్నాడు.

సింహాసనం అధిష్టించిన యువరాజ్ఞివలె పాప కిప్పుడు తృప్తి కలిగింది గాబోలు. ఆ చిన్ని హస్తాలలో ఆయన కంఠాన్ని పెనవేసి "నాన్నా" అన్నది.

"ఏమిటమ్మా తల్లీ!" అన్నాడు,

"నువ్వు అందరికంటె మంచివాడివి నాన్నా" అన్నది.

ఆయన బుజ్జగింపులతో, కమనీయమైన కంఠంతో "ఎందుకనమ్మా!" అన్నాడు.

సమాధానం తెలియక చెప్పలేక సిగ్గుపడుతూ అలుకను అభినయిస్తూ ఆయన ముఖంమీద చిన్నగా మోదుతూ, చెవులను మెలిదిప్పుతూ, చిలిపి ఆటలమధ్య "నేను చెప్పను ఫో నాన్నా!" అన్నది.

సుభద్రకు ఎన్నడూ వూహలలోకూడా అందని విచిత్రానుభూతులు కలుగుతున్నవి. ఇది నిజంగా స్వర్గమే. అనర్హురాలయిన తాను పొరపాటుగా ప్రవేశించినట్లు తోస్తున్నది. ఆ పాపకు ఆయనకు యేమిటి సంబంధం? తండ్రి బిడ్డలు కారని యెవరనగలరు? వారిరువురిని వేరు చేయగల శక్తి యెవరికున్నది? తాను కన్నతల్లి. అయినా ఆకర్షించలేక పోతున్నది. అదే తనలోని లోపమై వుంటుంది. అందుకే దారితప్పి ద్వేషిస్తూ ప్రతీకార వాంఛలో అంధకారం సృష్టించుకున్నది. కాని ఆ అంధకారం కనిపించి భయావేశురాలై ప్రక్కనున్న ఆయన కాళ్ళను పెనవేసుకుని, పవిత్రమైన ఆయన పాదపద్మాలమీద శిరస్సుంచి విలపిస్తున్నది.

పాప ఆయన భుజస్కంధంమీద వున్నందున వంగలేక, ఒక హస్తాన్ని ఆమె శిరస్సుమీద వేసి నిముఖుతూ "లే సుభద్రా" అన్నాడు.

"ఈ ఘోరపాపిని క్షమించండి. మీ పవిత్ర హస్తాలతో శిక్షిస్తే ధన్యురాలనవుతాను" అన్నది.

"చేసిన పాపాలకు పశ్చాత్తాపానికి మించిన శిక్ష లేదని బుద్ధభగవానుడు ప్రబోధించాడు. నీ పశ్చాత్తాపంతోనే పవిత్రతను పొందావు" అన్నాడు.

"మీ మృదుమధుర వాణిలో క్షమించానని చెప్పండి స్వామీ" అన్నది.

ఆయన మందహాసం చేస్తూ "బౌద్ధభిక్షువు సంఘంలో వుండి ఆ శక్తినే పొందాను. నిన్ను క్షమించగల శక్తి నాకున్నది. క్షమిస్తున్నాను. లేచి పాపను తీసుకో" అన్నాడు.

సుభద్రకేదో నూతన సందేశం వినిపించి నట్లయింది. నూతన జీవితం పొందినట్లున్నది. అబ్బ! ఆ పాదాలవద్ద పొందుతున్న శాంతిలో అనిర్వచనీయమైన ఆనందానుభూతి లభ్యమవుతున్నది. ఆ తన్మయత్వాన్ని కోల్పోజాలక పాదాలమీద అలానే వుండిపోయింది. ఆయన పాదాలమీద ఆమె అధరాలు ముద్రించుకుంటున్నవి. పతియే ప్రత్యక్ష దైవమని యెందుకన్నారో యిపుడు స్పష్టమవుతున్నది. యుగయుగాల అనుభవ సారాన్ని అహంతో అవహేళన చేసినందుకు తన మీద తనకే రోత కలుగుతున్నది.

తనను అతి గారాబంగా ముద్దుగా చూస్తున్న తండ్రినుంచి యెవరో తీసుకోవస్తున్నట్లు పాప తన బాహువులను బిగింపు చేసుకుంటున్నది.

తన నైపుణ్యాన్నంతా క్రోడీకరించి బుజ్జగిస్తూ "మమ్మగదూ, నా మాట వినవూ? వినమ్మా రాణీ, అమ్మా నిన్ను క్షమించాము యిక లే, అను" అని యెంతో అనునయంగా అన్నాడు.

పాపాయి కొంచెం మెత్త బడింది.

"అమ్మా క్షమించాము. అని చెప్పురాణీ!" అని తిరిగి అనురాగ దృక్కులలో ముంచుతూ అన్నాడు.

ఆ పసిపాపకూడా ఆయన అమృత దృక్కులకు తన్మయురాలై తనను తాను మర్చి చిలకపలుకువలె "అమ్మా క్షమించాము." అన్నది.

తనబిడ్డ పేరు తన కింతవరకు తెలియదు. అమెరికన్ హాస్పటల్‌వారు యేమి పేరుపెట్టుకున్నారో తెలియదు. ఆనాడు లేశమాత్ర మమతైనా తనకు లేదు. ఆయన నోటినుంచి "రాణీ" అన్న పిలుపు విన్నపుడు సుభద్ర పీనులు విశాలరూపం ధరించినవి.

"అమ్మా క్షమించాము." అన్నపుడు వెంటనేలేచి తన భుజాల మీదకు తీసుకోవాలని పించింది. కాని అంటుకు పోయినట్లు ఆ పాద పద్మాలను విడువలేకపోతున్నది.

రాణీని రాజీపెట్టి క్రిందకుదించి సైగతో వుత్సాహపరిచాడు.

"నాన్నలేనమంటున్నాడమ్మా." అంటూ సుభద్ర భుజస్కంధాన్నిబట్టి పైకిలాగు తున్నది రాణి.

సుభద్ర శిరస్సు పైకెత్తి రాణినిచూస్తూ చేయి చాచింది. ఆమె కౌగటిలోకి పోను రాణికి యిష్టంలేదు. అందుకని తండ్రికాళ్ళచాటుకు వెళ్లిదాగింది,

సుభద్ర దీనత్వంలో శిరస్సు పైకెత్తి ఆయనవైపు చూసింది. మందహాసంలోని ఆయన ముఖం యింకా ఆకర్షణీయంగా కనిపించింది. కాని ఆయన దుస్తులకు రుధిరమరకలు కనిపిస్తున్నవి. ఆందోళనలో గూడిన ఆమర్దాలో సిగ్గుబిడియాలు అదృశ్యమవుతవి.

వెంటనేలేచి "ఈ రక్తపు మరకలేమిటి ?" అంటూ అంగుళీయములతో తడిపిచూస్తున్నది.

ఆయన చిరునవ్వుతో చిందిస్తూ "ఏమీలేదు. ఇంతకుముందు నీ వడిలోంచి పారిపోను రాణి అటూ యిటూ లాగినపుడు నీ శిరస్సు తగిలి అమ్మాయి అధరానికి దెబ్బ తగిలిందిగాబోలు చిట్టి రుధిరం స్రవించింది. అది కండువాతో అద్దాను, అంతే." అన్నాడు.

అధీరతతో "నా అఘాయిత్యాలకు యింకా అంతంలేదా ?" అన్నది.

ఆమె శిరస్సుమీద చేయివేసి నిమురుతూ "తెలియక చేసినవి అఘాయిత్యాలూకావు, అపరాధాలు కావు." అన్నాడు.

వినమ్రతతో భక్తి ప్రపత్తులతో "తెలిసి చేసినా తెలియకచేసినా వాటి వాటి ఫలితాలు ఒక్కటేగదా!" అన్నది.

"పరిణతినుంచి నిష్కృతిపొందే మార్గంకూడా సహజరూపం లోనే వుంటుంది." తన వెనుకవైపు దాగివున్న రాణిని పైకి తీసుకుని "అమ్మ దగ్గరకు పో." అన్నాడు.

"నాకు అమ్మనచ్చు. నువ్వే కావాలి నాన్నా." అంటూ ముఖం త్రిప్పి పారిపోజూస్తున్నది. ఆయన వెంటనే రాణి ముఖంమీద ముద్దుల వర్షం గురిపించి గుస గుసలు వినిపించాడు వీనులలో, రాజీ కుదిరింది. నవ్వుముఖంలో రాణి చేతులు చాచింది.

సుభద్ర తన బిడ్డను స్వీకరించింది.

"ఇక వెళదాం పదండి" అన్నాడు ఆయన.

ఆమె మనస్సులో ప్రశ్నల పరంపర రేకెత్తింది. ఒక్క ప్రశ్న అడగాలనిపించింది. కాని ఆ సాహసంకూడా లేకపోయింది. పురుషులను ద్వేషిస్తూ. నింపి[redacted] స్త్రీ స్వాతంత్ర్యాన్ని ప్రబోధించిన ఆ మహానాయకురాలు ఆయన్ను ఒక ప్రశ్న అడగాలనుకునికూడా, అడిగి అనవసర చిక్కులను కల్పించుకుని ఆయ న్ననుసరించుటలో పొందే హాయిని కోల్పోజాలక విరమించుకున్నది. పురుష ననుసరించుటలోనే స్త్రీ పురుష సుఖ సౌఖ్యాలు, లోకకళ్యాణం వున్నదని మనస్సా అనుకున్నది.

పాఠకులకు యింకా ఆ వ్యక్తిని గురించి సందేహం వుండవచ్చు. ఆయన మరెవరో గాదు, సుభద్ర భర్త కాళిదాసు.

27. లక్ష్యం

జట్కా సాగిపోతున్నది. ఎరిగినవా రెవరైనా చూసిపోతారేమో నని ముఖాన్ని దాచుకుంటున్నది. సుభద్రముందు గూర్చున్న కాళిదాసు వడిలో ఆడుకుంటూ, ఏమేమో ప్రశ్నిస్తున్నది రాణి. ఏ మహిళామండలి ఆఫీసును జూసి తన ప్రజ్ఞావిశేషాలకు వ్యక్తిత్వానికి చిహ్న సూచకమైనట్లు గర్వించేదో ఆ మహిళామండలి ఆఫీసు వచ్చినపుడు పాతపుండు రేగుతుందన్నట్లు — భయంతో శరీరం గగుర్పాటు చెందింది. అగంతా నియమరహితమైన గాలి చిహ్నంగా తోచింది. చూడకుండా ముఖాన్ని చాటుజేసుకున్నది. వసంతకుమార్ ప్రయోగశాల భవనాలు వచ్చినపుడు అంతటి ప్రజ్ఞానంతుడు, విజ్ఞానవేత్త, గంభీరహృదయుడు నిష్కళంక సేవలో నిరాడంబరంగా జీవితాన్నే అంకితంజేసిన త్యాగమూర్తి అయిన ఆయన్ను తాను యెంతో అవహేళనగా చూసిన విషయాలు గుర్తుకొచ్చి తన మూర్ఖతకు తాను నిందించుకుంటున్నది. వసంతకుమార్‌కు కాళిదాసుకు అనేక విషయాలలో సామ్యం వున్నట్లు తోచింది. ఇరువురు సచ్చరిత్రులు, సహనమూర్తులు, సాధుస్వభావులు, త్యాగనిరతులు. ఆలోచిస్తున్నకొలంది తన వెర్రితనం తననే గేలిచేస్తున్నట్లున్నది. ఒక్కమాటు కాళిదాసు ముఖంవైపు చూసింది. అవును దుష్టురాలైన తానెక్కడ కరుణాసాగరుడైన కాళిదాసెక్కడ!

కైలాసపతి నివాసం వస్తున్నపుడు చూసి ఆమె హృదయంలో వైఖ్య పరువులెత్తసాగినవి. భయంతో వణికిపోతున్నది. కోర్టులో పాపను చూసివున్నాడుగనుక బండిలోనున్న ఆమె గుర్తించి తనవైపు చూస్తాడనే భయంతో ఖంగారుపడుతూ "ఇలారా, తల్లీ రాణీ!" అంటూ బిడ్డను లాక్కొని రొమ్ములమధ్య దాచుకుంటూ కాళిదాసు తొడలమీనకు వరిగిపోయింది.

ఆయన కది మామూలు విషయమైపోనట్లు, ఆమె శిరస్సును పొట్టకుజేర్చి నిమురుతున్నాడు. అకస్మికంగా కలిగిన యీ ఖంగారుకు కారణమడిగితే యేమి చెప్పాలి, అని యెన్నోవిధాల ఆలోచించింది.

కాని ఆయన వుపచర్యలు జేస్తున్నాడు తప్ప ప్రశ్నించనే లేదు. "ఎంత విచిత్రం! క్షుద్రత్వంలో సంకుచితస్వార్థం, ప్రలోభం, ఆమర్షా, ఆవేశం, అనుమానం. యీర్ష్యాద్వేషములతో పెనచున పడియుంటుంది. అక్కడ ఆశలు, ప్రశ్నలు, సమస్యలు యెదుర్కొని పరికితనాన్ని నింపి పటా పోపాలలో కలుషితమవుతవి. అక్కడ సహితము. మూర్ఖత్వము. అంధ విశ్వాసు తప్ప మరేమి లేదు. దేవత్వంలో ప్రేమానురాగాలు, సేవా తత్పరతలు, సహన ఓర్పులు త్యాగములతో నిర్మలత్వ ముంటుంది. క్షమించేశక్తి కలిగినవారు అపరాధిని పరీక్షించరు. అపరాధాల లోతులను కొలమానాలతో లెక్కించరు. అపరాధం యెంతటిదయినా యెలాంటిదయినా, అపరాధి యెవరైనా చిరునవ్వులతో క్షమించి ఆదరించుట వారి సహజము" అనిఆలోచిస్తుండగానే కైలాసపతి యిల్లు దాటిపోయింది.

తిరిగి సుభద్ర మామూలుస్థితిలో కూర్చున్నది. గంగరాజుకు కైలాసపతికి కొన్ని విషయాలలో సామ్యమున్నట్లుకూడా వూహించకుండా వుండలేకపోయింది.

ఒక గొందిలో చిన్న యింటిముందు బండి ఆగింది. ఇంటికి తాళం వేసివున్నది. ఇంటిలో మరెవ్వరూ లేరని తేలిపోయింది.

"నాన్నా తాళం నేను తీస్తాను. తాళంచెవి నాకివ్వు!" అంటూ రాణీ వుబలాటపడుతూ తానే తలుపులు తీసింది. తన ఆటవస్తువుల చిన్న పెట్టెను తెచ్చుకుని బల్లమీద కూర్చున్నది. పెట్టెలోని ఒక్కటొక్కటి తీసి దుకాణంగా యేర్పరుస్తున్నది.

వీ రిరువురి సాంపత్యం యెంతకాలంనుంచో! యింతటి అనురాగాలు యెలా అల్లుకుపోయినవో, అని ఆలోచిస్తూ బయటనే వుండిపోయింది.

"రాణీ, అమ్మను లోపలకు తీసుకురా!" అంటూ కాశిదాసు కుర్చీ తెచ్చివేశాడు. రాణీ కిపుడు పలుకను తీరుబడి లేదు.

"రా సుభద్రా. వచ్చి కుర్చీలో కూర్చో!" అన్నాడు.

సుభద్రలోని రక్తం నీరయిపోతున్నది. "భగవాన్ నేను పరమ నీచురాలిని. నన్నింకా యెందుకు బ్రతికిస్తున్నావ్. ఆ పరమ పవిత్రుడు వేసిన కుర్చీలో నేనెలా కూర్చోను!" అనుకుంటూ లోపల ప్రవేశించింది.

"సంచికోచిస్తావెందుకు, యిది నీ యిల్లే కూర్చో!" అని మందహాసంతో అన్నాడు.

అబ్బ! ఆ పలుకులలోని అనురాగం తరింప జేస్తున్నది. కాని ఆమె భరించలేక "ఇక మీగౌరవాలు భరించలేను స్వామీ, నా మీదగా నడిచి వెళ్ళండి, కంఠంమీద కాలువేసి తొక్కండి భరిస్తాను" అంటూ మనస్సులో వాపోయింది. కాని భర్త ఆజ్ఞను పాలించక తప్పలేదు.

తన దుష్టత్వంతో దూరమయ్యాక యింతకాలానికి వారి జీవితం యెలాగడిచిందో, తనను గురించి వారు యేమేమి అనుకున్నారో, తన ద్వారా వారికి సాటివారిలో యెంతగా తలవంపు లయినవో, రాణిని వారు యెలా పొందారో, యీచోట యెందు కుంటున్నారో, భవిష్యత్తు యెలా గడుపా లనుకుంటున్నారో మొదలగు ప్రశ్నలు అడుగాలని మనస్సు వేధిస్తున్నది. కాని నోరెత్తి అడుగుటకు యెంత కూడదీసుకున్నా శక్తి చాలటలేదు. అడిగితే ప్రసన్నవదనంతో అన్నిటిని సవివరంగా చెబుతాడని తెలుసు. కాని అడుగలేదు. అడుగదు.

స్త్రీ స్వాతంత్ర్యంకోసం సమాన హక్కులకోసం పింపిం కట్టుకుని దండోరా వాయించింది. పురుషజాతిమీద సవాలు చేసింది, ఆ వీరవనిత నేడు సాధుస్వభావుడైన ఒక సామాన్యపురుషుని ముందు నిలిచి ప్రశ్నించటానికి మనస్కరించక వినమ్రంగా అనుయాయిగా అమాయకిగా ఆయన చెప్పినట్లు చేస్తున్నది. కర్తవ్యంగా యెంచి నడుస్తున్నది. అది దానిసహజస్వభావమో పరస్పరానురాగాల సమన్వయ సంయోగమో ఆమెకే తెలియాలి. అలాంటి అనుసరణలోనే సంయమనంలోనే జీవిత

మాహాత్మ్యముంటుంది నేడు. నాడుఅడిగివుంటే అదికేపలం దానిసత్వమని వుండేది.

ఆయన వంటగదిలోనుంచి గాజోలు రెండుచేతులలో రెండు గిన్నెలు పట్టుకొస్తూ "అమ్మా రాణీ, ఇదిగో నీగిన్నె నీవు తీసుకెళ్ళు" అంటున్నాడు.

రాణీ ఆటబొమ్మలను అవలబెట్టి "నీతోనే తింటాను నాన్నా" అని ప్రాధేయత పడుతున్నది.

"అయితే యీ గిన్నె పట్టుకో తల్లీ," అంటూ రాణీ చేతి కిచ్చి రెండోగిన్నెను సుభద్ర దగ్గరకు తెచ్చి "నిన్న జైలుకువచ్చి విచారిస్తే యీ రోజు ఉదయం 9 గంటలకే విడుదల చేస్తామన్నారు. అందువలన తెల్లవారకముందే నీ కొరకని యీ పాయసం చేసిపెట్టి అక్కడికి వచ్చి కూర్చున్నాము. కాని యిపుడు మూడోఝాము తప్పింది. ఏ వేళకు యేది ప్రాప్తమో అదే లభ్యమవుతుంది. దీన్ని తీసుకో సుభద్రా" అంటూ యిచ్చాడు.

ఆయన్ను చూస్తూ ఆ గిన్నెను పట్టుకోలేక, నిలిచి అధోముఖం చేసి తీసుకుంటూ, మనస్సులో "మీ నిగ్రహం అపిచ్ఛిన్నమైంది, ఏ వేళకు ఏది ప్రాప్తమో అదే లభ్యమవుతుంది, అన్న మీ విశ్వాసం అనిర్వచనీయమైంది. కనుకనే దుఃఖము, దురాశ, నిరాశ, నిస్పృహ, దుస్సహనము మీ చెంతకు చేరవు, మిమ్మ పొందికూడా పోగొట్టుకున్న యీ మూర్ఖురాలను తిరిగి చేరదీసి మిమ్మ అర్ధంచేసుకునే అవకాశ మిచ్చారు, నేను ధన్యురాలను స్వామీ" అనుకున్నది.

అల్పాహార విందు ముగిశాక కాళిదాసు యేదో చిన్న పుస్తకాన్ని చేతబట్టుకుని "సుభద్రా, నేను ఒక్క గంటలో తిరిగివస్తాను. నీవూ రాణీ మాట్లాడుకుంటూ వుండండి" అంటూ బయలుదేరబోతూవుంటే

రాణీ అలకజేస్తూ వెంటబడింది, "అమ్మతో వుండమ్మా" అంటూ యెంత బుజ్జగించినా "నేను నీతో వస్తాను నాన్నా" అంటూ

పాటను పేసింది. చూస్తూ వూరుకోలేక సుభద్ర బుజ్జగించను ప్రయత్నిం చింది. కాని రాణి తుస్సాకంగా ఆమెను నెట్టివేసి ఆయనకు చుట్టి వేసు కున్నది. ఆయన యెత్తుకుని ముద్దులతో ముంచెత్తించి చెవులో గుస గుసలు వినిపించాడు. తిరిగి సంధి కుదిరింది. ఆమె పుస్తకాలు తెచ్చి ముందుంచుతూ "చదువుకుంటూ వుండమ్మా వస్తాను" అని సుభద్ర వైపు తిరిగి మధురమైన నవ్వును విసిరి వెళ్ళిపోయాడు.

భయంతో బిగబట్టుకున్నట్లున్న సుభద్ర కిపుడు పూర్తి అవ కాశం లభించింది. వెంటనే వెళ్ళి రాణి ప్రక్కని గూర్చుని మచ్చిక చేసుకున్నది.

"నీకు చక్కగా జడ వేస్తాను రా అమ్మా!" అంటూ వడిలోకి తీసుకుని యెన్నోరకాల ప్రశ్నించి యేమేమో తెలుసుకోను ప్రయత్నిం చింది. కొన్ని విషయాలు విని ఆశ్చర్యపోయింది. దుఃఖపడింది. తన తల్లి చనిపోయిందని, హాస్పిటల్‌లో పెరిగానని, రాణీ అనే పేరు అక్కడ సిస్టర్ పెట్టిందని, హాస్పిటల్‌లోనే రోజూ ఆడుకునేదాన్ని చదువుకునేదాన్ని అని, పోలీసులు తనను తీసుకొచ్చారని, తా నపుడు రోజూ యేడ్చేదాన్నని, భయపడ్డందున జ్వరపడ్డానని, బ్రతకనని వదిలి పెట్టారని, అపుడే యీ నాన్న వచ్చి పెద్ద ఆస్పత్రికి తీసుకెళ్ళి నయం చేయించాడని, అప్పటినుంచి నాన్నతోనే వుంటున్నానని, నాన్న అందరికంటె మంచివాడని రాణి చెప్పినమాటల సారాంశం. ఈ యింటి లోనే చాలారోజులనుంచి వుంటున్నట్లుకూడా చెప్పింది.

నాన్న మంచివాడని పదే పదే రాణి వినిపిస్తున్నపుడు సుభద్ర మనస్సు పులకిత మౌతున్నది. తన పొరపాటు పిల్లకు రానందుకు ఆనంద పడుతున్నది. తెలిసీ తెలియని పాప తెలిపిన కొన్ని విష యాలతోనైనా మనస్సు కొంత తేలికపడింది.

అరగంట కాకముందే కాశీనాథు యింటికి తిరిగి వచ్చేశాడు. చేతిలోని పుస్తకాన్ని బల్లమీద వేస్తూ "మన ప్రయాణం యీ రాత్రికి పడదు సుభద్రా!" అన్నాడు.

ఆమెకు ప్రయాణం సంగతి అసలు తెలియదు. ఎక్కడికో యెందుకో అంతకంటె తెలియదు. అందువల్ల ప్రశ్నార్థకంగా చూస్తూ వుండిపోయింది. బల్లమీద వేసింది బ్యాంకు పాస్‌బుక్ అని మాత్రం తెలుసుకున్నది.

ఆమెలోని భయంపోయింది. అయినా సాహసంలేదు. ఉత్సాహాన్ని ఆపుకోలేక "ప్రయాణం మన యింటికేనా ?" అన్నది.

ఆయన సంకోచిస్తూ "లేదు సుమిత్రా. నీతో విషయాలన్నీ చెప్పిన తరువాతనే ప్రయాణం కావటం మంచిది. నీకు యిష్టంలేని ప్రయాణం చేయాలనే పట్టుదలమాత్రం నాకులేదు." అన్నాడు.

ఆమె కన్నీరు కారుస్తూ ఆర్ద్రతతో "లేదు లేదు, మీరు యింకా నాకు ప్రాధాన్యత నివ్వాలని ప్రయత్నించకండి. మీవెంట నరకానికయినా నడుస్తాను. మీ ఆజ్ఞ అయితే అగ్నిలోనైనా దుముకగలి శక్తి మీ భక్తి ద్వారా నేడు లభించింది. కనుక వివరాలు నాకు చెప్పవలసిన అవసరం లేదు. మిమ్ము అనుసరించి నడచుట నా కర్తవ్యము ధర్మము." అని ధైర్యంగా వినిపించగలిగింది.

"నీకు కొన్ని విషయాలు వినిపించాలనుకోలేదు. కాని నీమాటలు విన్నాక నా సాంత్వనకై వినిపించక తప్పదు. నీవు యిల్లు విడిచి వచ్చాక, యిరుగు పొరుగు అంతకంటె బంధువర్గము నన్ను హీనంగా చూస్తున్నట్లు గుర్తించినప్పుడు వ్యధపడ్డాను. అనేకమంది పునర్వివాహానికి వత్తిడి పెట్టారు. శిక్షపడిన ఖైదీ జైలు ననుభవించకతప్పదు. జైలు నుంచి పారిపోతే పోలీసువారికి దొరకటం, శిక్ష ద్విగుణంగావటం తిరిగి జైలు శిక్షననుభవించక తప్పదు. అలానే భగవంతుడు విధించిన శిక్షను కాదని మరోమార్గం ప్రోత్సహించుట నావల్ల కానిపని. యీ శిక్ష ననుభవించుటకే ఈ జీవితాన్ని వాడుకుంటాను, అని సమాధానం చెప్పినపుడు చాదస్తులలో లెక్కించి నిర్లక్ష్యంగా చూశారు. ఉదాసీనతను పొగొట్టుకోను యాత్రలకు బయలుదేరాను. దేశంలోని అన్ని యాత్రాస్థలాలను చూశాను. ఎక్కడా మనస్సు లగ్నంకాలేదు. సాధనమాత్రం నన్ను బంధించి

చేసింది. ఆశలతోను, ఆవేశాలతోను, మోసాలతోను, ఈర్ష్యా ద్వేషాలతో రాక్షసత్వాన్ని వహిస్తున్న ఈ మానవాళికి త్యాగమూ సేవాభావము నేర్పి మానవత్వాన్ని ప్రసాదించగలిగింది సారనాథ్ మాత్రమే. నిన్ను క్షమించగల శక్తిని స్వీకరించగల శక్తి ఆ బుద్ధదేవుని సూక్తులనుంచే పొందాను. అప్పుడు నిన్ను క్షమించాను. ప్రీతితో స్వీకరించాను. ప్రతిఫలంగా పశ్చాత్తాపంతో పరితపిస్తూ మానవత్వాన్ని పొందావు. నిన్ను క్షమించలేక స్వీకరించలేక, నీ అపరాధాలను లెక్కపెడుతూ వుంటే మరో వుపాయంలేక ఆ పతితనూర్గంలోనే పయనిస్తూండేదానివి. క్షమ, సేవ, ప్రేమ శాంతి బుద్ధభగవానుని వరాలు. నిజంగా ఆయన్నుగన్న ఈ పృథ్వి ధన్యమైంది. ఆ సారనాథ్ ఒక్కటే ఈ దేశంలో మిగిలివున్న మానవత్వాన్ని ప్రసాదించు యాత్రాస్థలం. అక్కడే దేవత్వం మిగిలివున్నది. నన్నుకూడా భిక్షువు సంఘంలో స్వీకరించమని వేడుకున్నాను. నీవు ఒక్కరినైనా పతనోన్ముఖంనుంచి మానవత్వంపై పునరలించి వుద్ధరించినపుడే నీకా అర్హత కలుగుతుందని సెలవిచ్చారు. ప్రప్రథమంగా అంధత్వంలో నున్న నిన్నే వెలుగువైపుకు మరల్చాలనుకున్నాను. రాక్షస స్వభావంతో నున్న నిన్ను దేవతా స్వభావిని చేయాలనుకున్నాను. నీలోని కాంక్షలను కడిగి త్యాగదీక్ష నుపదేశించాలను కున్నాను. ఆ తరువాత వనపుత్రిక రాణిని నా ఆశయ లక్ష్యాల ప్రతిబింబంగా పెంచాలనుకున్నాను. నీపిలుపుకొరకు నిరీక్షణలో ఇంతకాలం రాణితో ఇక్కడ గడిపాను. ఇక మన ప్రయాణం సారనాథకు సాగించాలి." అన్నాడు.

సుభద్ర ఆయన పాదాలముందు సాష్టాంగపడింది. "బుద్ధభగవానుడు నిర్దేశించిన మార్గంలో దృఢ సంకల్పంతో నిశ్చల హృదయంతో సేవాదీక్షతో పయనించగల శక్తిని పొందాలని నిన్ను ఆశీర్వదిస్తున్నాను సుభద్రా, లే" అంటూ ఆమెను లేవనెత్తాడు.

చెదిరిన శిరోజాల మధ్య అశ్రువులతోను ధూళితోను ముద్రితమై యున్న ఆమె ముఖం అమాయకత్వంతో అలరారుతూ సహజ సౌందర్యంతో శోభిస్తున్నది. కృత్రిమాలు కలితమైన ఆ సహజత్వంలో యెంత ఆకర్షణ వున్నది!

"నా యెదుట నీవు కన్నీరు కార్చవలసిన అవసరం లేదు సుభద్రా. నీకు నా హృదయంలో యథాస్థానంకంటె అధికమే లభించింది" అన్నాడు.

తనలోని విశ్వాసాన్ని ప్రకటించుకోవాలని మనస్సులో ఆదుర్దా పురివిప్పి నాట్యం సలుపుతున్నది. ఆమె ధైర్యాన్ని పూరించుకుని, నేను చేసినవి మహాపాపాలు, కాని ప్రతిఫలంగా యీ లోకంలో యే స్త్రీ పొందనంత వున్నతమైంది పొందాను. మిమ్ము పూర్ణంగా అర్థం చేసుకున్నాను. నా జీవితం తరించింది. పిరికిబారిన పార్థవుడు విశ్వరూప సందర్శనం పొందినప్పుడుకూడా యింత విస్మయము ఆనందము పడి వుండడు. ఇంతటి విశ్వాసాన్ని పొందివుండడు. కాని నా ఆఖరి వినతి ఒక్కటి మన్నించండి. బుద్ధభగవానుని ఆదేశంగా జీవితాంతం నిస్వార్థంతో త్యాగంతో సంఘసేవ చేస్తాను, కాని మిమ్ము చూస్తూ దీక్ష నిలుపుతూ మీ అడుగుజాడలవెంట నడిచే అవకాశ మివ్వండి స్వామీ" అన్నది.

"జాతి మత కుల రహితమై, వ్యక్తిగత స్వార్థానికి సుఖానికి అధిఖ్యతకు అతీతమై, సర్వప్రజలు సాధుస్వభావులై సజ్జనత్వంతో, సౌజన్యంతో, సౌభ్రాతృత్వంతో, సమాన సుఖసౌఖ్యాలతో, శాంతి నిలయంగా, ఆనందమే ఆశ్రయంగా వుండు నవ సమాజ సృష్టికొరకు కృషి సలుపుట నా ఆశయం. అందుకు కావలసిన అనుభవాన్ని సత్తాను ధృఢత్వాన్ని పొందియున్నావు గనుక దీక్షతో నా అడుగు జాడలలోనే నడిచినా నా అభ్యంతరం లేదు" అన్నాడు.

మరునాడే ప్రయాణ సన్నాహాలలో మునిగి స్వల్ప సామాగ్రితో స్టేషనుకు చేరారు. కాశిదాసు నేరుగా సారనాధకు దారి టిక్కెట్లను కొన్నాడు.

"బండి కింకా చాలా టయిమున్నది. సీతా రాణికి పూరీలు తెస్తాను" అంటూ కాశిదాసు స్టాల్సువైపు వెళ్ళాడు. సుభద్ర ఒడ్డింగు మీద కూర్చుని వడిలో వున్న రాణితో ముచ్చట్లాడుతున్నది.

వెతుక్కుంటూ వచ్చిన ఒక పోలీసు, వుత్సాహభరితుడై "ఇదిగో యిక్కడే వున్నారు." అని పిలుస్తూ చేతితో సైగచేస్తూన్నాడు బయట నున్నపోలీసువారికి. బయట జీపులోనున్న పోలీసువారు దిగి పరుపుకెత్తుకుంటూ వచ్చారు.

"సుభద్రదేవిగారు, మీరు పోలీసుస్టేషనకు రావాలి." అన్నాడు ఇన్స్పెక్టరు.

పండుగకు యిల్లు అలుక్కు కూర్చుంటే, వెనకనుంచి అగ్ని ప్రమాదం సంభవించినట్లు, ఆమె వణికి పోయింది. మాట పెగలలేదు. లేచి పాపను చంకలోకి తీసుకుంటూ "ఏమి టంటారు?" అని ప్రశ్నించింది.

"గంగరాజుగారి కేసులో మీకు ఆరు నెలలు శిక్ష విధించారు గదా."

"అవును. ఆ శిక్షనుంచి విడుదలై వచ్చాను."

"ఆ కేసు హైకోర్టు అప్పీలుకు వెళ్ళింది. నిన్ననే అక్కడ తీర్పు జరిగింది. ఆ తీర్పులో గంగరాజుకు మరికొందరికి మరణశిక్ష. మీకు మరి కొందరికి యావజ్జీవ కారాగార శిక్షగా మార్చబడింది. మిమ్మ తిరిగి జైలుకు హాజరు పర్చమని టెలిగ్రాం వారంటు వచ్చింది." అన్నాడు.

దేదీప్యంగా గనిపించిన వెలుగంతా క్షణంలో మాయమై అంధకారం ఆవరించింది. మతి భ్రమించినట్లయింది, గుండె దడదడలాడుతూ వూపిరి సలుపుటలేదు.

పూరీలపొట్లాలు పట్టుకొచ్చిన కాశిదాసు యీ వింత దృశ్యం చూసి విస్మితుడయ్యాడు. కాని క్షణంలో ఆయన యధాదృఢత్వాన్ని పొందాడు.

"ఏమిటి సుభద్రా!" అని ప్రశ్నించాడు.

ఆమె నేత్రాలు తేలవేసి జాలిగాచూస్తున్నది.

పోలీసు ఇన్స్పెక్టరు వివరించి చెప్పారు.

"ఏది జరిగినా ధైర్యం తృప్తి ప్రధానం. చేసిన వాటి ఫలితాలు యేరూపంలో అనుభవించ వలసివచ్చినా దుఃఖించరాదు. నిన్నటి ప్రతిజ్ఞ అపుడే మర్చిపోయావా ? మన లక్ష్యంలోను దీక్షలోను మార్పు రానంత వరకు చింతించాల్సిన పనిలేదు. నీలోని లక్ష్యము దీక్ష ధృఢమైన వయితే నీకింత దుఃఖం రాదు. కార్యసిద్ధికి కావలసింది కార్యరంగం. దీక్ష వున్నవారికి వున్నచోటే కార్యరంగ నిర్మాణం జరుగుతుంటుంది. మన లక్ష్యాలు తపస్సు చేయనుగాదు ప్రచారం చేయను. బాహ్య లోకంలో ఆ ప్రచారం యెవరైనా చేయగలుగుతారు. కాని జైలు మన ప్రచారానికి మరింత అనుకూలమైంది. అక్కడ వుండే వారంతా దుఃఖితులు. వారికి కావలసింది బుద్ధభగవానుని ఆశయం. కనుక నీమాటలు వారి మనస్సులో నాటుకుపోతవి. అక్కడున్న వారిలో కొంతమందినైనా బౌద్ధబిక్షు వ్యభావులుగా చేయగలిగితే. నీవు మా అందరికంటె విజయినివిగా పరిగణింపబడతావు. నీలోని దీక్ష లక్ష్యము యెంత దృఢమైన వయితే అంత శాంతిని పొందగలుగుతావు. ఎక్కడికి వెళ్లినా, ఏమై పోవలవచ్చినా నీలోని నీ దీక్ష, లక్ష్యము నీకు తోడుగా ధైర్యాన్ని తృప్తిని కలిగిస్తుంటవి. కనుక విచారించక, ఆ కార్య క్షేత్రానికి నిన్ను పంపుతున్నట్లు భావించి వెళ్ళు." అన్నాడు.

ఆమెలోని భయము దుఃఖము తెరలు తెరలుగా విడిలిపోయినవి. "మీరు నిజంగా దీక్షలో పరిపక్వం బొందిన మహాయోగులు. నాలోని దీక్ష లక్ష్యంలో ధృఢత్వం లేకపోయినా మీరి స్మృతి నాకు తరుణోపాయాన్ని చూపిస్తుంటుంది." అనుకున్నది. తిరిగి "బుద్ధభగవాన్, ఈ పాపి నీ ఆశ్రయానికొస్తే అపవిత్రమౌవుతుందని నాకీ శిక్ష విధించావా ?" అని వాపోయింది. ఆ మహాపురుషుని యెదుటే తన హృదయ దౌర్బల్యం బయటపడుతున్నందుకు చింతస్తూ ధైర్యాన్ని పూరించుకుని, ఆఖరిసారిగా సాష్టాంగ ప్రణామమాచరించింది. పాపను ముద్దుకుని "నీవు నా బిడ్డవుగాదు, వారి బిడ్డవు. ధన్యురాలవు." అని మనస్సులో

అనుకుంటూ వారి కిచ్చి, పోలీసు వారివైపు తిరిగి పోనుద్యుక్తురాలయింది.

"సుభద్రా, ఈ పూరీలు నీ కని తీసుకొచ్చాను. తీసుకెళ్లు" అంటూ పొట్లాన్ని ఆమె చేతికిచ్చి, చుబుకాన్ని పట్టి ముద్దుగా వూపుతూ, ఆమె హృదయంలోకి చొచ్చుకుపోయే అనురాగాన్ని ముఖంద్వారా ప్రదర్శించాడు.

"ఈ పోలీసువారికి, మరెవరికి కనిపించకుండా మాయా మంత్రంతో ఆయన హృదయంలో ప్రవేశించి శాశ్వతంగా దాగితే యెంత బాగుండు." అని ఒక వెర్రి ఆశ కలిగింది.

"చాలా టయమైందండి!" అన్నాడు పోలీసు ఆఫీసరు. నిరుపాయురాలై వెనుదిరిగి జాలిదృక్కులను పరపుతూ, పోలీసువారివెంట వెళ్ళిపోయింది సుభద్ర.

28. ఆదర్శసమాజం

వసంతకుమార్ తన నూతన మందు ఫార్ములాద్వారా పొందిన ధనాన్ని తన వూహాలలోని ఒక నమూనా పథకానికి కేటాయించి, ఆ పథక విషయంలో అనేక ఆలోచనలు సలిపాడు. ఆ ప్రణాళిక సఫలత కొరకు ఆ ధనమేగాదు తన యావత్ శక్తిని సమర్పించాలనికూడా నిర్ణయించుకున్నాడు.

రెండువందల జనాభాగలిగిన తన వూహాలకు అనుగుణమైన ఆదర్శ గ్రామ నిర్మాణం చేయాలని ఆయన తలంపు. ఆ గ్రామానికి చెందే క్షేత్రాలు, గృహాలు, పశుసంపద సర్వము సంఘానికి చెందినవిగా వుండాలని, సంఘంకొరకే సర్వులు కష్టించాలని, కష్టఫలితంగా సంఘ సంపత్తి పెరగాలని, అవకాశమైన అనుభవాలు అందరికీ సమంగా వీలయినంతవరకు తృప్తిగా అందాలని, వ్యక్తిగతస్వార్థ కాంక్షలు కుత్రిమాలు మనస్సులనుంచే నిర్మూలనమై సాధుస్వభావంతో

సౌభ్రాతృత్వంతో, సౌజన్యంతో, సహనశీలురై, ఆదర్శప్రాయులై మెలగాలని, అందరూ ఆరోగ్యవంతులై అంగసౌష్టవ సౌందర్యాలతో దీర్ఘకాయులై వుండాలని, వారి తరువాతి తరం సహజరూపంలోనే అంద మైందిగా ఆదర్శమైందిగా వుంటుందని ఆయన నిర్ణయం.

ఏ కార్యమైనా యువకులద్వారానే సాధింపబడుతుందని, యువ కులలోనే వుత్సాహంతోపాటు నూతన విధానంలో విశ్వాసము, త్యాగ స్వభావము వుంటుందని, యువకుల ద్వారానే నవ సమాజ నిర్మాణం సాధ్యందప్ప వయోవృద్ధులద్వారా నిష్ప్రయోజనమని ఆయన భావన. అందుకని అనాధలైన యువకులను, యువతులను తనకు నచ్చిన రీతిలో సేకరించ నిర్ణయించుకున్నాడు.

కొండప్రాంతపు అతి సారవంతమై సాగులేకుండా వున్న రెండు వేల యకరాల భూమిని కొని, ఆ క్షేత్రం మధ్య నిర్మాణం కానున్న "అశోక్ నగర్" అనే గ్రామంలో నివసించే వారందరికి సమిష్టిగా తరతరాలుగా అనుభవించే హక్కు వుండునట్లు రిజిష్టరు చేయించాడు.

గ్రామ భవన నిర్మాణానికి ముందు పెద్ద పార్కును యేర్పరచి నపుడు అనేకులకు హాస్యాస్పదంగా తోచింది. కాని పార్కుకు చుట్టూ పాఠశాలను, పఠనాలయాన్ని, వినోద ప్రదర్శనశాలను, భోజనశాలను, వంటశాలను, విశ్రాంతి హాలును, కుటీరపరిశ్రమలకు లఘుపరిశ్రమలకు కార్ఖానాలను, తాలింఖానాను, ధాన్యనిల్వలకు గోడవునులను' నిర్మాణం చేయించాడు. వీటన్నిటిని చుట్టి వలయాకారంగా నివాసభవన నిర్మాణం జరిగింది. అవి వంద గదులుగా ఆధునిక వసతులలో విభజింపబడినవి.

దిక్కులేని దీన జనావళి నుంచి తనకు నచ్చిన యువకులను, యువతులను సేకరిస్తున్నాడు. తనకు కావలసిన సంఖ్య పూర్తయింది. ఉన్నతవిద్య నభ్యసించినవారుకూడా అనేకు లున్నారు. వారిలో వారినే అధ్యాపకులుగా నిర్ణయించాడు. చదువులకొరకు తరగతులుగా నిర్ణ యింపబడ్డారు.

వందమంది యువకులు అంతమందే యువతులు సేకరింప

బడ్డారు. అందరూ అవివాహితులే. అందరూ కామన్ హాలులో నివాసం. వంటశాల భోజనశాల యెప్పుడూ సమిష్టిగానే వుంటవి. నివాస క్వార్టర్సుగా నిర్మాణమైన వంద విభాగాలకు తాళాలు వేయబడినవి. ఏయువతి యువకులైనా ప్రేమించుకుని వివాహమాడగోరితే ఆ యిరువురు ఆ రోజు వంటశాల బాధ్యత ప్రత్యేకంగా వహించి విశేష పదార్థాలలో విందుచేసి ఆనందోత్సాహాలలో ముంచి అందరి ఆశీర్వాదాలు పొంది ఒక కుటుంబ క్వార్టరులో ప్రవేశించవచ్చు.

అశోక్ నగర్‌కు కావలసిన పశుసంపదకూడా సేకరించబడింది. వ్యవసాయానికీ, పరిశ్రమలకు కావలసిన పరికరాలుకూడా సిద్ధమైనవి. వసంతకుమార్ సూచనతో కొండవాగుకు స్వయంగా డామ్ నిర్మాణం జరిపి గ్రామానికి క్షేత్రానికి అమోఘమైన నీటివసతిని కల్పించారు.

చూస్తూచూస్తుండగానే ఆ వూసర క్షేత్రమంతా సశ్యశ్యామలమై లక్ష్మీనిలయంగా కన్నులపండుగా కనిపిస్తున్నది. ఎక్కడెక్కడి నుంచో ఒక్కరొక్కరుగా వచ్చి చేరిన ఆ అశోక్ నగర్‌లోని అందరూ యేకమై ఒకే వృక్షరూపమై, ఏ జంట కా జంట కొమ్మలు రెమ్మలుగా సమాన స్వేచ్ఛలో బాధ్యతతో, హాయితో, ఆనందంలో శోభిస్తున్నారు.

అందరూ స్వచ్ఛంద ప్రేమతో వివాహితులైనారు. కుటుంబ క్వార్టర్లన్నీ నిండిపోయినవి. రాత్రులు యెవరి విభాగంలో వారుంటారు. విశ్రాంతి సమయాలలో అందరూ కామన్ హాలులో ఖుబుర్లతో వుంటారు. వ్యవసాయ పనులకు, పరిశ్రమలకు చదువులకు, విశ్రాంతికి, వినోదాలకు సమయాలు నిర్ణయింపబడినవి. ప్రతికార్యంలోను నిపుణులు చేస్తున్నారు, రాని వారు నేర్చుకుంటున్నారు. వారిలో వారే నాట్య ప్రదర్శనలు జరుపుకుంటున్నారు। పాటకచ్చేరీలు చేసుకుంటున్నారు.

అశోక్‌నగర్ స్వయం పోషణశక్తిని పొందింది. ఇపుడు వసంత కుమార్ ఆర్థిక సహాయం అవసరంలేదు. గ్రామ సమిష్టి సంపత్తి పెరిగిపోయింది. వారి పంటలో 80 శాతం బయటకుపంపి యితర ఆధునిక పరికరాలను అభివృద్ధి చేసుకో గలుగుతున్నారు.

ఇపుడు వసంతకుమార్ వారికి గురువు, సలహాదారు మాత్రమే. ఆయన్ను అందరూ తమ ఆరాధ్యదేవతగా భావిస్తారు. వారిలో వ్యక్తిగత స్వార్ధమనే జాడ్యము ద్వేషము రాకుండా సమిష్టి కృషిలోను, ఆనందం లోను, వుత్సాహంలోను కుంటురాకుండా వేయివిధాల పర్యవేక్షణ చేస్తున్నాడు వసంత్‌కుమార్. అంతేగాదు ఆ గ్రామంలోని అందరు ఆకర్షణీయమైన ఆజానుబాహులు, వారి సంతానం అంతకంటె విశిష్టమైంది వుండటానికి వారి ఆహారంలోను, వ్యాయామాలలోను వసతులలోను అవసరమైనచోట ఔషధ ప్రయోగాలలోను శ్రద్ధవహిస్తున్నారు.

వసంతకుమార్‌కు ఆత్మతృప్తికలిగింది. కాని రెండు ప్రయోగశాలలను పరిశీలించుటలో ఏవంతతీరుబడి వుండుటలేదు. అశోక్‌నగర్ ఆయన మనస్సును మరింతఆకర్షిస్తున్నది. తానూ ఆ వుల్లాసభరితులైన జనాభాలో కలిసిపోతే బాగుండుననిపిస్తున్నది.

పద్మ అశోక్‌నగర్‌చూసి ఆనందపడింది. "త్వరలోనే యిది ఆదర్శరూపంలోవి మహానగర్‌గా రూపొంది మీరు నగర్ అని పెట్టిన నామాన్ని సార్ధకం చేస్తుంది." అన్నది పద్మ.

"ఇందులో నీకు యేజంట బాగా నచ్చిందో చెప్పు పద్మా." అని ఆయన కొంటెచూపులతో వినిపించారు.

ఆమె సిగ్గుదొంతరుల మధ్యగా "ఒక జంటకు మించి మరొక జంటగా ఎవరికివారే అందరూ అతిసుందర రూపాలతో, అన్యోన్యతతో కేరింతలు కొడుతూ మురిసిపోతున్న వీరిలో విడదీసి చూపగల శక్తి నాలోలేదు బాబుగారు." అన్నది.

ఆయన ముఖాన్ని దగ్గరగాజేర్చి ప్రేమలొలికిస్తున్న కంఠంతో "పద్మా, నీవు సమ్మతిస్తే మనంకూడా ఒకజంటగా దంపతులమై వీరిలో కలిసి యిక్కడే వుండిపోదాం." అన్నాడు.

ఆమె జేవురించిన ముఖంతో "బాబుగారు, మీరు అఖండ ప్రజ్ఞావంతులు, సమర్ధులు. మీరు యేది చేసినా దానిలో వినూత్నత

వుంటుంది. కాని ఒక దాసివి పరిహాసాల పాలు జేస్తే ప్రయోజనం లేదు" అన్నది.

ఆయన విసగటతో "నీవు నన్ను యెన్నటికీ అర్థం చేసుకోలేక పోవచ్చు. నీ నిర్ణయమే అదిఅయితే నా నిర్ణయం అంతకంటె నిశ్చయమైందని మాత్రం గుర్తుంచుకో." అన్నాడు.

ఆమె అనునయంగా "కాదు బాబుగారు, దాసిగా వుంటూ మిమ్మ పొందినపుడు, నేను మోసపుచ్చినట్లు లోకంలో చెలరేగే అపవాదుల దుమారం భరించుట సాధ్యమా చెప్పండి" అన్నది.

అసంతృప్తితో అలనటతో ఆయన మాట్లాడలేక పోయాడు.

తాను ఒక్కటొక్కటిగా అనేకం సాధించగలుగుతున్నాడు. కాని పద్మను పొందలేక పోతున్నందుకు తీరని వ్యధకు గురియైనాడు. పరిష్కారంకాని సమస్యలతో బాధపడేకంటె వాటికి దూరమైనపుడు వాటంతటవే పరిష్కృత మవుతవని ఆయన విశ్వాసం. తన దీర్ఘ కాల అప్రత్యక్షంలో యీ అశోక్ నగర్ వాతావరణం యెలా వుంటుందో చూడాలనికూడా అపేక్ష కలిగింది. అందుకే ఆయన ఆకస్మికంగా పయనమై విదేశ యాత్రలకు వెళ్ళిపోయాడు.

ఆయన ప్రయాణం భూదేవికన్న వింధ్యారాణికన్న పద్మను క్రుంగదీసింది. ఏ పనిమీదా మనస్సును లగ్నం చేయలేని స్థితికొచ్చింది. ఉదాసీనతలో మునిగిపోయింది. క్షణంకూడా విడువకుండా భూదేవి సేవలోనే కాలం గడుపుతున్నది. దేశ వార్తలుగాని పట్టణ వార్తలుగాని యిపుడు వారి కంటుటలేదు. అవసరమూ లేదు. వార్తాపత్రికలు వచ్చినవి అలానే వుండిపోతున్నవి. వసంతకుమార్ వుత్తరాన్ని నిత్యము చదివి వినిపిస్తుంది పద్మ. క్రొత్తవుత్తరం వచ్చేలోగా పాత వుత్తరం నలిగి చివికిపోతుంటుంది.

29. సంధి

ఈ సమయాలలోనే గంగరాజు కోర్టుకెక్కుట, శిక్షపడుట, స్వర్ణకుమారి ప్రసవించుట మొదలగు కార్యాలన్నీ జరిగిపోయాయి. ఈ విషయాలేవీ పద్మచెంతకుగాని భూదేవిచెంతకుకాని చేరలేదు. ఈ మధ్య కాలంలోనే హైకోర్టు అప్పీలులో గంగరాజుకు ఆయన ముఖ్య అనుయాయులకు మరణశిక్ష విధించుట, అమలు జరుగుట, వసంత విహార్‌ను కూడా కోర్టువారు ఖాళీచేయించి ఆక్షను పెట్టుట, స్వర్ణకుమారి దిక్కులేనిదై ఆత్మహత్య చేసుకోలేక ఆ పేటలోనే వున్న ఒక దాసి యింటికి చేరుట జరిగినవి.

భూదేవి పాదాలువత్తుతూ "అమ్మగారు. మీరు రోజు రోజుకు నీరసించిపోతున్నారు. మీకు గనుక ఏదయినా ప్రమాదం జరిగితే మాగతి యేమి కావాలి చెప్పండి." అని రుద్ధ కంఠంతో అన్నది పద్మ.

"పిచ్చి దానివి, నిన్ను నీవు అద్దంలో చూసుకో తెలుస్తుంది. ప్రేతకళ పట్టింది. తూలిపడిపోతున్నావనికూడా వంటమనిషి చెప్పింది. ఇది మనందరికీ వసంతుడిచ్చిన శిక్ష" అన్నది భూదేవి.

"బాబుగారు వెళ్లి సంవత్సరం గడిచిపోయింది అమ్మగారు." అంటూ అశ్రువులను అద్దుకున్నది కొంగుతో.

"వాడు పసితనంలో గాలివాడుగా వున్నపుడు మనవాడుగా సంచరించాడు. ఉన్నతభావాలతో ఉదాత్తుడుగా అయినపుడు పరాయివాడుగా పరిణతిచెందాడు. వాడిని మొదట పదేశ చదువుకు ప్రోత్సహించిందినేనే. అందుకే వాడు నాకీ శిక్ష విస్తున్నాడు."

పద్మ ధైర్యాన్ని పూరించుకుని "బాబుగారు మహా గొప్ప వ్యక్తి. ఆయనకో అతీతమైన శక్తి వున్నది. వారు దేవతా స్వరూపులు. అంతటి శక్తి, సంపన్నులు ఒక అనాధను వివాహమాడవచ్చా అమ్మగారు!" అన్నది.

భూదేవి విక్షిప్తమైన కంఠంతో "వాడెన్నడూ అలాంటి పని

చేయదు. ఆ విషయంలో మనందరికంటె వాడే తెలివిగలవాడు. స్వర్ణను గురించి వాడు జోస్యం తెలుసుకున్నాడు. ఎంత చెప్పినా దాని విషయంలో విముఖుడయ్యాడు. ఆ తరువాత వాడి నిర్ణయమే మంచిదని ఆ దౌర్భాగ్యురాలే రుజువు చేసింది." అన్నది ఆవేశంగా.

పద్మ విమూఢురాలివలె చూస్తూ వుండిపోయింది.

"యే అనాధ విషయమైనా నీతో అన్నాడా పద్మా!" అని ప్రశ్నించింది భూదేవి.

పద్మ భీతిలుతూ "లేదు అమ్మగారు........" అని నతనత గొట్టింది.

పద్మ చేతిని తన చేతిలోనికి తీసుకుని లాగుతూ శిరస్సుమీద చేయివేసి నిముకుతూ "నీవు పిచ్చిదానివి గనుక అర్థం చేసుకోలేక పోతున్నావు. వాడు నిన్ను ప్రేమిస్తున్నాడు. నిన్నే వివాహం చేసుకుంటానని నా అనుమతి కోరాడు, నేను ఆనందంతో ఆశీర్వదించాను. ఆ తరువాత యేమిజరిగిందో నాకు తెలియదు." అన్నపుడు పద్మ విస్మితురాలైంది. ఆమె పాదాలకు కరుచుకుపోయి యెంతసేపటికి విడువలేదు.

భూదేవి ఆమెను తనవైపుకు లాక్కొని అలాటంమీద చుంబించి "నీవు సర్వవిధాలా వాడికి తగినదానివి పద్మా" అన్నది.

"నేను అనాధ దాసినిగదా, అమ్మగారు!" అన్నది.

"నీవు అనాధ వెలా అవుతావు వెర్రిదానా, స్వర్ణవలె నీవు నా బిడ్డవు. తల్లికి సేవజేసేవారు దాసీలవుతారా? నీవు మా గృహలక్ష్మివి పద్మా" అన్నపుడు పద్మ తన్మయత్వంతో ఆమె వడిలో వాలిపోయింది.

బయటనుంచి "అమ్మా!" అన్న పిలుపు చిన్నగా వినిపించింది. తోటలోని నౌఖర్లంతా అలానే పిలుస్తుంటారు. ఆ పిలుపు వినిపించినా పద్మకూడా వున్నచోటనుంచి లేవలేకపోయింది.

"అమ్మ గదిలో లేదా." అంటూ గదిలో ప్రవేశించాడు. ఎవరో గాదు వసంతకుమార్. తత్తరపడుతూ పద్మ లేచింది. భూదేవి లేవబో తుండగా "ఫరవాలేదు నీవు పడుకో అమ్మా!" అన్నాడు.

శల్యావస్థలోనున్న వారిని చూసి ఆశ్చర్యంలో మునిగిపోయి "ఇలా అయిపోయారేమిటి!" అన్నాడు.

భూదేవి లేచి "నీవు మా కిస్తున్న శిక్ష సామాన్యమైంది గాదు వసంత్, ఈ పిచ్చిదాన్ని చూడు యెలా వుందో" అంటూ పద్మ శిరస్సు మీద చేయివేసి వసంతకుమార్ వైపు నెట్టింది.

పద్మ ఆయన పాదధూళి తీసుకుంటున్నది, "దాన్ని ఆశీర్వ దించు వసంత్" అన్నది భూదేవి.

జీవితమంతా పెంకిగా వుండమని. ఆశీర్వదించనా, అమ్మా!" అన్నాడు.

"అది పెంకిదిగాదురా వెర్రిది. అది లేకుండా నాకు క్షణం గడు వదు. నీ బెంగతో శల్యమైపోయింది, అంతటి శిక్షను విధించగూడదు నాయనా"

నా మాటకు విలువలేనపుడు నేను చేయగలిగిందేముంటుంది." అన్నాడు వసంతం.

భూదేవి నవ్వులో మిళితంజేసిన క్రోధాన్నభినయిస్తూ జరిగి పోయిన దానికి క్షమించండి, ఇక నెప్పుడూ మీ మాటకు జవదాట" అను పద్మా. అంటూ వీపుమీద చేయివేసి నిమిరింది.

అంత గంభీరంగావుండే పెద్దమ్మగారు, యింత చనువుగా చాతు ర్యంగా ఆదరంగా మాట్లాడుతున్నందుకు ఆశ్చర్యపోతున్నది.

"నన్ను క్షమించండిబాబుగారు. యిక మీదట యెన్నడూ జవ దాటను." అన్నది పద్మ.

అంతటితో ఆ విషయం రాజీపడిపోయింది. అనేక కుశలప్రశ్నల అనంతరం పద్మనుకూడా తీసుకుని అశోక్ నగర్ వెళ్లారు.

చిన్న అభిప్రాయభేదంతో రెండు ముఠాలుగా చీలినట్లు. ఒకటి అతివాద ముఠాగాను రెండవది మితవాద ముఠాగాను వారిలో వారు ప్రచలితంగా అనుకుంటూ వాదోపవాదాలు చేసుకుంటున్నట్లు పోరాడు కుంటున్నట్లు వసంతకుమార్ విని ఆశ్చర్యపోయాడు. ఆయన సమక్షంలో అందరూ వినమ్రులుగా హాజరయ్యారు.

ఈ విభిన్నత మానవసహజ జాడ్యమేమో అనిపించింది. ఆయన రెంటు పక్షాలవాదాన్ని విన నుద్యుక్తుడయ్యాడు.

సమిష్టి వ్యవసాయ క్షేత్రాలు, సహకార క్షేత్రాలు, సహకార సంఘాలు ప్రజాశ్రేయోదాయకమైనవిగా భావించి ప్రభుత్వం అటువైపుకు ప్రోత్సాహపరచుటకు అనేకవిధాల సహకరిస్తున్నది, కోట్లధనాన్ని ఆ పేరుతో వ్యయం చేస్తున్నది. వట్టిబూటకపు క్షేత్రాలు సంఘాలు ప్రభుత్వ ధనాన్ని విచ్చలవిడిగా పొందుతున్నపుడు యదార్థరూపంలోని మన క్షేత్రం యెందుకు పొందగూడదు. అని ఒక పక్షం వాదన.

ఒక మహా వ్యక్తి యిచ్చిన శక్తితో మనం మహా శక్తివంత మైన క్షేత్రాన్ని నిర్మించుకున్నాము. నేడు అందరికంటె శక్తివంతు లంగా ఆదర్శగాములంగా నిలిచి వున్నాము గనుక ఆ బూటక సంఘాల మోజుకు ప్రభావానికి లోనవుతున్న ప్రభుత్వ సహకారం మనకనవసరం. అని ద్వితీయపక్షవాదన. వీరు అతివాదులు, వారు మితవాదులు.

అంతా విన్నాక ఆయన దుఃఖితవదనుడై అధోముఖంవేసి అలానే వుండిపోయాడు. ఆయన మాట వినాలని ఆదుర్దాతో అంతా యెదురుచూస్తున్నారు. నిశబ్ద వాతావరణంలో 20 నిమిషాలు గడిచిపోయి నవి. ప్రక్కనున్న పద్మకూడా ఆశ్చర్యంతో చూస్తున్నది. ఏ పక్షానికా పక్షం తమను సమర్థిస్తారని ఆశిస్తూ కనులార్పకుండ చూస్తున్నారు. 20 నిమిషాల తరువాత ఆయన ముఖంపైకెత్తాడు. ఆయన నేత్రాలనుంచి అశ్రుస్రవంతి ప్రవహిస్తున్నది. ముఖమంతా మలిన ముద్రలతో కావు రులు క్రమ్మింది.

ఎంతటి విషాద విషయాలనైనా మ్రింగివేసి నవ్వును ప్రదర్శించు గంభీరవ్యక్తి, ఎంతటి నష్టాన్నైనా పరిగణించని త్యాగమూర్తి నేడు కన్నీరు కారుస్తున్నరీతిని చూసి పద్మ భయభీతులతో చలించిపోతున్నది. ఆమెలోని దుఃఖం మరింత పొర్లుతున్నది.

ఎవని ఆరాధ దేవతగా అనుకున్నారో ఎవరి సైగలో తమ ప్రాణాలనైనా నవ్వుతూ అర్పించగల మనుకున్నారో ఆయన తమను గురించి తమ సమక్షంలో కన్నీరు కార్చుటచూసి ప్రతిఒక్కరు విచలితు లయ్యారు. ఆయన ముఖంలోని దుఃఖావేదన కావుర్లుచూసి ప్రతి హృదయం క్షోభించ సాగింది. స్త్రీ హృదయం మరింత దుర్బలమైంది. స్త్రీలు దుఃఖాన్ని నిగ్రహించలేక రోదించసాగారు. అందులో ఒకరు తెంపుజేసి ఆయనముందు నిలచి "ఈదఫాకు మమ్ము క్షమించడి, ఇక యెన్నటికీ యిలాంటి భేదాలు రానివ్వము. మీ అడుగు జాడలలో మా ప్రాణాలనర్పిస్తాం." అంటూ ఆయన పాదాలంటి వెళ్ళిపోయాడు. అది తమ వోటువేసే విధానమైనట్లు ప్రతి ఒక్కరు ఆ పనినే చేసివెళ్ళి వినమ్రులై నిశ్శబ్దముగా కూర్చున్నారు.

వసంతకుమార్ తన వుత్తరీయంతో ముఖాన్ని తుడుచుకుని, ఉదాసీనత్వ వుట్టిపడుతున్న కంఠంతో 'నా సంకల్పం కొందరికి జీవనోపాధి చూపుట గాదు. పెట్టుబడితో సంపత్తిని అభివృద్ధి పరచుట గాదు. కీర్తి సౌధాలను నిర్మించుకొనుట గాదు, అనుయాయులనో స్తుతించే వారినో పెంచుకొనుట గాదు. మానవునిలోని బలహీనతను నిర్మూలించుట. సజ్జనత్వంతో గూడిన సహనము త్యాగముల నలవర్చి యీర్ష్యా ద్వేషాలను స్వార్థాలను నిర్మూలించుట, హెచ్చుతగ్గులు లేకుండా తారతమ్యాలు లేకుండా వ్యక్తిగత సంపత్తులు లేనేలేకుండా సర్వసుఖాలతో ఆనందంతో హాయిగా పరస్పరానురాగాలతో ఆప్యాయతలతో సౌభ్రాతృత్వంతో అలరారు సమాజాన్ని చూడాలని నా ఆకాంక్ష. మీ ద్వారా అలాంటి సమాజాన్ని యీ హద్దులలోనే చూడగలనన్న ఆశతో మిమ్ము ఒక్కొక్కరినిగా యిక్కడకు చేర్చాను. ఇక్కడ మీరు కష్టించి

పెంచే సంపత్తికంటె, కార్యాలకంటె మీలోని భావాలు సాధుత్వంవైపు సజ్జనత్వంవైపు సామరస్యంవైపు ముందుకు పోవుట ముఖ్యం.

నేను కోరుతున్న సమాజ నిర్మాణానికి పునాదులు సంపత్తిగాదు; భావము, త్యాగము.

భావప్రాధాన్యతను గుర్తించినపుడు ప్రభుత్వ సహాయం అనవసరం, మన శక్తిమీద మనకు విశ్వాసం కుదిరిననాడు భావప్రాధాన్యతను గుర్తించి పాటించిననాడే నేను కోరిన సఫలత లభ్యమవుతుంది.

"సంపత్తినే ప్రధానంగా యెంచినపుడు వీలున్న అవకాశాలనన్నిటిని వుపయోగించుకోవాల్సి వస్తుంది. పరిణామంగా లోకంలోని అన్నిటివలె ఆఖరిలో మనస్పర్ధలకు గురియై శూన్యం మిగులుతుంది" అన్నాడు.

మితవాద పక్షంగా నిలిచినవారు ఖిన్నులై "బాబుగారు, తెలియక మేము గొప్ప అపరాధం చేశాము. మమ్మ్మ క్షమించండి. ఈ అపరాధానికి ప్రాయశ్చిత్తంగా మూడు రోజులు వుపవాసదీక్ష వహిస్తాము." అన్నారు.

"వాళ్ళు తెలియక వాదించి, యిప్పుడు పశ్చాత్తాప పడుతున్నారు గనుక క్షమించండి. ఈ అపరాధానికి ప్రాయశ్చిత్తంగా అందరము మూడురోజులు ప్రాయోపవేశము ఆచరిస్తాము." అని అతివాద పక్షము వారన్నారు.

ఆయన ప్రసన్నుడై "మీరు నిర్ణయించుకున్న నిరాహార దీక్షే మిమ్మ్మ పరిశుద్ధం చేస్తుంది. ఇకమీద యెవరుచేసిన అపరాధానికయినా యీ నిరాహార దీక్షే ఆత్మ శిక్ష," అన్నాడు. అందరూ జేజేలతో కరతాళ ధ్వనులుచేశారు.

ఆ సంతోషంలో ఆయన మరో నియమాన్నికూడా వారి కందించాడు. రాత్రి భోజనశాల కెళ్ళేముందు అందరూ కలిసి అరగంట మౌన వ్రతం పాటించాలి. గడిచిన 24 గంటల లోపల తన కార్యకలాపాలన్నిటిని స్మరించుకుని పొరపాటును పరిశీలించుకుని, ఆత్మ విమర్శతో

అవసరమయితే ఆ పూట భోజనంమాని ప్రాయశ్చిత్త దీక్షగా పరిగ గణించాలి,

తిరిగి కరతాళ ధ్వనులుచేస్తూ హర్షించారు. ఏమి జరుగుతుందో నని ఆందోళనపడిన పద్మ కిపుడు మహదానందం కలిగింది.

ఏ రూపంగా వారి నాకర్షించి వశీభూతం చేసుకుని, వారిచేతనే పశ్చాత్తప్తులను చేశాడోచూసి తనలో తానే ముగ్ధురాలయింది. అంత మందిలోకూడా తనను తాను మర్చి ఆయన్నే చూస్తున్నది మనస్సులో ఆయన్ను గురించే ఆలోచనలు చెలరేగుతున్నవి. బాబుగారు వారిని శాసించినా వినకతప్పదు. ఆజ్ఞగా చెప్పినా అందరూ ఆమోదిస్తారు. కాని ఆయన అలా చేయలేదు. అందరి హృదయాలలోకి చొచ్చుకు పోయి, పశ్చాత్తాపంతో వాపోవునట్లుచేసి వారంతట వారే ప్రాయశ్చిత్తాని కుద్యుక్తు లవునట్లుచేసి, తరువాత తన మాటలను వినిపించారు. మన సత్వంమీద విజయంపొందే మార్గమిదేనేమో! అవును సీజరు విజయం గాని, అలగ్జాండర్, చెంగేజ్‌ఖాన్, నెపోలియన్, హిట్లర్ మొదలగు వారి విజయాలు మానవహృదయాలలోలేవు. కాని బుద్ధభగవానుని విజయము, క్రైస్తు విజయము, కన్ఫూసియస్ విజయము, సోక్రటీస్ విజయము మానవ హృదయాలమీద శాశ్వత ముద్రలను పొందింది. అని యేమేమో ఆలోచిస్తుండగా "వెళదాం పద పద్మా." అన్న పిలుపు విని చెదిరిపోయింది.

అశోక్‌నగర్ ప్రవేశించినపుడు యెంత చీకాకు చెందాడో యిపు డంత వుల్లాసంతో తిరుగుముఖ మయ్యాడు.

పోతున్న కారులో 'ఒక విషయంలో నేను నిశ్చింతుడినయ్యాను పద్మా!' అన్నాడు వసంతకుమార్.

'ఏ విషయంలో!' అన్నది పద్మ.

'అశోక్ నగరులో నా ఆశయాలు తప్పక ఫలవంత మవుతవి.'

'ఇంతటి మహా ప్రపంచంలో ఒక మూల రెండువందల జనాభా

మధ్య మీ ఆశయం సిద్ధించినంతమాత్రాన ప్రయోజన మేమిటి? అంతటి రష్యాలో సిద్ధించిన సమాజవాదమే నేడు తిరిగి పూంజీవాదరూపం ధరించిందని చైనా కమ్యూనిష్టు లంటున్నారు.'

'చైనావారు అన్నంతమాత్రాన రష్యాలోని లక్ష్యాలన్నీ యెగిరి పోజాలవు. చిన్నచిన్న బిక్షు ఆరామాలను ఆదర్శప్రాయంగా నమూనాగా నిలిపే బుద్ధుడు తన ఆశయాలను ఆసియా అంతటా వ్యాపింప జేయగలిగాడు.'

'ఆ బౌద్ధమతాన్ని విశ్వవ్యాప్తం చేసిన మహనీయుడు అశోకుడు గనుక మీరు అశోక్ నగర్ అని నామకరణం చేశారు. బాగానేవుంది. ఇక మీరు విచారిస్తున్న రెండో విషయ మేమిటి బాబుగారు!'

'నిన్ను పొందే విషయమే!'

'నేను మీ ప్రక్కనే వున్నానుగా!'

'మన యిరువురంకూడా దంపతులంగా అశోక్ నగర్ జనాభాలో కలిసిపోదాం పద్మా' అంటూ ఆమె శిరస్సుమీద చేయివేసి తనవైపుకు లాగాడు.

ఆయన తొడలమీదికి వాలిపోయింది. మొఖాన్నిబట్టి పైకియెత్తి చుంబిస్తూ 'అబ్బ! యెన్నిరోజులకు విజయం. అన్నివైపులా సత్ఫలితాలే గనిపిస్తున్నవి' అన్నాడు.

ఆయన హస్తాన్ని తన ముఖంమీదవేసి అదుముకుంటూ 'ఇది నా అదృష్టం బాబుగారు' అన్నది.

ఇంటికి వచ్చాక ఫలహారము, స్నానము, భోజనము అయ్యాక యీజీచైర్‌లో కూర్చుని వార్తాపత్రికలు ముందేసుకు కూర్చున్నాడు.

'ప్రయాణాలమీద ప్రయాణాలు చేసివచ్చారు. కాస్త విశ్రాంతి తీసుకోండి, బడలిక పోతుంది' అన్నది పద్మ.

ఒక పేపరులోని యేదో వార్త చూసి నిర్ఘాంతపోతూ 'పద్మా, స్వర్ణ యెలా వుందో తెలుసా ?'

'తెలియదు బాబుగారు !'

'వసంత్‌విహార్‌ను రేపు ఆక్షన్‌లో కోర్టువారు అమ్మెతారుట.'

"ఎందుకని ?"

"అదే తెలియలేదు."

"మీరు లేనందువలన నేనూ యింతవరకు చూడలేదు."

"అయినా చూసిరావటం మంచిది. ఆర్థికచిక్కులలోపడితే ఆదుకోవట మవసరం. స్వర్ణ కనీసం నీకైనా ఖబురు పంపవలసింది."

"చిన్నగా మాట్లాడండి. అమ్మాయిగారి విషయాలంటే పెద్దమ్మకు నచ్చవు. ఇపుడే వెళ్ళి చూసివద్దాం పదండి" అని ప్రోత్సాహ పరచింది.

30. ప్రతిఫలం

వారు కారులో బయలుదేరి వసంతవిహార్ భవనానికివెళ్ళి విషయాలు తెలుసుకుని శిలాప్రతిమలై పోయారు. ఎంతో గాలించి, స్వర్ణ వున్న దాసి యింటికి వెళ్ళారు. దాసి యింట్లోలేదు. అరుగుమీద చాపనే శయ్యగా చేసుకుని పవళించిన ఒక దీర్ఘరోగి, ఆ రోగిప్రక్కనే పుల్లలాంటి చేతులు కాళ్ళు కలిగి వుబ్బిన వుదరకాయుడైన ఒక బిడ్డ వున్నారు. ఆ రోగిలో ప్రక్కకు తిరిగి చూడగలశక్తికూడా లేనట్లున్నది. కురులు జడలుగట్టుకుపోయినవి. రోగి ప్రేతరూపం ధరించి రోజులను లెక్కిస్తూ మృత్యువును ఆహ్వానిస్తున్నట్లున్నది.

దేశ విదేశ ఫ్యాషన్లలో, భాషలలో ఆరితేరిన విదుషీమణి స్వర్ణకుమారే ఆ రోగియని యెవ రనుకోగలరు ? పద్మ పరువులెత్తుకుంటూ

వెళ్ళి ప్రక్కనకూర్చుని. ఆమె శిరస్సును తన తొడలమీదకు చేర్చుకుని. పసిబిడ్డను రొమ్ములలో చేర్చుకుని "ఎంతపని చేశారు అమ్మాయిగారు! ఇంత దురంతం జరిగినపుడు ఏవంత ఖబురైనా పెట్టగూడదా!" అన్నది.

పద్మ ముఖంలోకి చూస్తూ "బావను నా దగ్గరకు పిలువు పద్మా" అన్నది.

ఆ మాట వింటూనే వసంతకుమార్ ప్రక్కకువెళ్ళి నిలిచాడు. "నిన్ను చూడటానికే యింతకాలం బ్రతికి వున్నాను బావా, నన్ను క్షమించండి" అని పుల్లలాంటి తన హస్తాలను జోడించింది. మిగిలి వున్న కన్నీటి బిందువొకటి చిన్నగా బయటికి తొంగిచూసింది.

ఓదార్చే విధానం తెలియక వసంతకుమార్ వెర్రివానివలె చూస్తున్నాడు.

"జరిగిందేమో జరిగిపోయింది. ఇక ఆలస్యం చేయుట మంచిది గాదు బాబుగారు. మన పరిశోధనాలయానికి తీసుకెళదాం" అంటూ ఆ వంటివూపిరిలో నున్న బాలుని ఆయన చేతి కిచ్చింది. స్వర్ణకుమారిని బలవంతాన లేపి తన భుజస్కంధాలమీద చేతులు వేయించింది. "మీ కింత శ్రమెందుకు పద్మా. నన్ను నా ఖర్మకు విడువండి" అంటూ గొణుగుతున్నది. పద్మ ఆదేమీ వినిపించుకోకుండా కారుదగ్గరకు చేరవేసింది.

వసంతకుమార్ విశ్రాంతి గదిలోని శయ్యమీదనే వారిని పరుండ బెట్టారు.

వైద్య పరీక్షలన్నీ జరిగాక "అదృష్టం కొంది మనం వెళ్ళటం జరిగింది. లేకపోతే రెండు రోజులకంటె స్వర్ణ జీవించుట కష్టం. ఇపుడు తల్లీ బిడ్డ కిరువురికి రక్తం కావాలి పద్మా." అన్నాడు.

"రక్తాని కేమీ కొదువ బాబుగారు! అమ్మాయిగారు బ్రతికితే చాలు. నా రక్తం తీయండి" అన్నది.

"నీలో రక్తమెక్కువున్నది. ఆ బలహీనతలో తీస్తే నీకు ప్రమాదం సంభవించవచ్చు." అన్నాడు.

"నాకే ప్రమాదమూ జరుగదు, నన్ను గురించి భయమొద్దు. ముందు నా రక్తంతీసి అమ్మాయిగారి కివ్వండి." అంటూ ఆయన్ను హస్తంబట్టి లాక్కెళ్ళింది.

పద్మ రక్తాన్ని తీయటం, స్వర్ణకుమారి, కివ్వటం, ఒక గడ్డు సమస్యనుంచి బయట పడటం జరిగిపోయింది. పసివాని గురించి ఆలోచిస్తున్నాడు.

బలహీనతలో తూలుతూనే పద్మ అక్కడికివచ్చి "నానుంచి రక్తంతీసే పడిపోతానన్నారు. చూడండి యెంత పుష్టిగా వున్నానో. యింకా తీసినా నేను యిలాగే వుంటాను." అంటూ నవ్వును ప్రదర్శించింది. కాని ఆ నవ్వులో శుష్కత బయల్పడు తున్నది.

మతిపోయిన దానివలె ఆయన హస్తాన్నిబట్టి లాగుతూ "మీరు త్యాగులు. నేను స్వార్థిని. నా రక్తంతో నా యజమానురాలిని ఆమె బిడ్డను రక్షించానన్న ఖ్యాతి కాంక్ష నన్ను పిశాచురాలను చేస్తున్నది. ఆ బాబుకుకూడా నా రక్తం తీసి యివ్వండి" అని హటం వేసింది. తీసినట్లు నటించి పరోకరి రక్తాన్ని పసిబిడ్డ కిచ్చాడు.

వసంతకుమార్ వైద్యంతోను పద్మ సేవలోను స్వర్ణకుమారి ఆరోగ్యం త్వరలోనే కుదుటపడింది.

ఆ గదినుంచి మారుటకుగాని, మహోకరి కంటబడుటకుగాని స్వర్ణకుమారి కిష్టంలేదు. అందుకని వినతిచేసి పద్మను సమ్మతింపజేసింది.

పెద్దమ్మగారికి వివరాలన్నీ తెలియజేసి ఆమెలో గూడుకట్టుకున్న కోపాన్ని దూరంచేయాలని, తిరిగి అన్యోన్యతను పెంచి పెద్దమ్మగారి ఆదరంలోకి చేర్చాలని పద్మ తాపత్రయం. తాను పసితనంలో స్వర్ణ వెంట వచ్చింది. కనుక ఆమె రక్షణ తన కర్తవ్యమని పద్మ నిర్ణయం.

స్వయంకృతాపరాధంతో రసాతలానికి చేరిన తనను వుద్ధరిం

చుటకంటె శిక్షించుటే మంచిదని తన ఆత్మ క్షోభను వినిపించి "నన్ను యీ గోడలమధ్య ఖైదీగా జీవించనివ్వు పద్మా. పిరికితనంతో యీ దుర్భర జీవితాన్ని అంతం చేసుకోలేక బ్రతుకుతున్నాను. కటిక కష్టాల లోనే హృదయ లోతులు బయటపడుతవి. నిన్ను బావను నేడు సంపూర్ణంగా అర్థం చేసుకోగలుగుతున్నాను. కృతజ్ఞతాభారంతో కృంగిపోతున్నాను. నేను నిర్మించుకున్న శాశ్వత అంధకారంలోనే నన్ను వుండనివ్వండి" అని ప్రాధేయపడుతుంది స్వర్ణ.

వసంతకుమార్ ఆమె యెదుట గతాన్ని స్మరించడు. భవిష్యత్తు నుపదేశించడు. అతి ప్రీతితో యెప్పటికప్పుడు ఆమెకు కావలసిన అన్నిటిలోను పద్మ ఆదేశానుసారం శ్రద్ధ వహిస్తుంటాడు.

స్వర్ణ ప్రయోగశాల విశ్రాంతిగదిలో చేరి నెలరోజులు గడిచిపోయినవి. ఆరోగ్యాన్ని పొందింది. పద్మతో మనసిచ్చి మాట్లాడ గలుగుతున్నది. కాని మనస్సులోని క్షోభను మరిపించలేక పోతున్నది. తన బిడ్డను యెంతో ముస్తాబుచేసి ముందుంచినా ముచ్చటించలేక పోతున్నది. ఆ బిడ్డకు "అశోక్" అని నామకరణం చేసింది పద్మ.

"బావకు అంత ఇష్టమైన పేరును వాడికి పెట్టి, ఆ పేరును కళంకము చేయవోకు పద్మా" అంటుంది.

"భయపడవలసినచోట గ్రుడ్డిగా సాహసం చేసినవారు శాశ్వతంగా పిరికిపారిపోవుట సహజం. బంగారం మట్టిలో వుద్భవించినా పనివారిచేతిలో పడినపుడు రూపురేఖలు మెరుగులు పొంది ఆకర్షవంత మౌతుంది. ఈ ప్రయోగశాలలో పడిన బాబు ప్రయోజకుడు గాక తప్పదు అమ్మాయిగారు" అంటుంది పద్మ.

"నీవు గొప్ప అదృష్టవంతురాలవు పద్మా! కనుకనే వారి ప్రతి కార్యంమీద నీకు మొదటినుంచి అవిచ్ఛిన్నమైన విశ్వాసం వుంది" అంటుంది స్వర్ణ.

"భక్తి విశ్వాసాల ప్రభావం తక్కువైందిగాదు" అంటుంది పద్మ.

అశోకుని ముస్తాబునుంచి ఆడించేవరకు అన్ని బాధ్యతలు పద్మ పరమయినవి. అందువలననే యిపుడు పెద్దమ్మగారి గదిలో యెక్కువ సమయం వుండలేక పోతున్నది. వసంతకుమార్‌తో అన్యోన్యత పెరిగి నందున తనవద్ద యెక్కువసేపు వుండలేక పోతున్నట్లు భావిస్తున్నది భూదేవి. వసంతకుమార్ ద్వారా వివాహ ప్రస్తావన యెంత తొందరగా వస్తుందా అని యెదురు చూస్తున్నది.

పద్మ తన సమయాన్ని అధికంగా స్వర్ణ అశోక్‌లకు అంకితం చేసినట్లు ప్రవర్తిస్తున్నందువలన గాబోలు వసంత్‌లో వుదాసీనత తొంగి చూస్తున్నది. ఏదో చెప్పాలని ఆందోళన పడినపుడే ఆమె అందుబాటులో లేకుండా వుంటున్నది.

ఈ దాగుడుమూత లాటలో విసగట కలిగించి గాబోలు, పద్మ, అశోకుని ముస్తాబుచేసి తెచ్చినా అటు చూడలేకపోతున్నాడు. అంతే గాదు, స్వర్ణకుమారిని తన ప్రయోగశాలనుంచి తరలింపాలనికూడా అని పిస్తున్నది. అమ్మకు చెప్పి సమ్మతింపచేసి యింటిలోకైనా చేర్చాలని ఆయన ఆలోచన. కాని యీ కార్యమంతా పద్మద్వారా జరగాలి. అందుకు ముందు ఆమెను సమ్మతింపజేయాలి.

ఆరోజు ఆమెను పట్టుదలతో అశోక్‌నగర్ తీసుకెళ్ళాడు. స్వర్ణ ప్రయోగశాలలో వుంటున్నందువలన తన కార్యక్రమం కుంటుపడు తున్నదని ఆమె కారోగ్యం సమకూరిందిగనుక యిక నచటుంచుట మంచిదిగాదని, వుదారతలో హద్దులు తొలగినపుడు కర్తవ్యం కుంటు పడుతుందని, నాంది ప్రస్తావనతో వివరించాడు.

"బాబుగారు మీరు నిష్కామ కర్మయోగులు. కర్తవ్యా లన్ని టితోపాటు అమ్మాయిగారి రక్షణకూడా బాధ్యతాయుతమైందే గదా।" అన్నది పద్మ.

"బాధ్యతలద్వారా దీక్ష వుధృత రూపంధరించి ప్రోత్సాహం నిస్తుండాలి."

"అయితే ఒక అనాధ రక్షణ బాధ్యత మిమ్ము వేదిస్తున్నదంటారా?"

"అపోహతో అధమస్థాయికి లాగవోకు. వేదనాలేదు అయిష్టతా లేదు. ఒక బాధ్యతతో ప్రధాన బాధ్యత కుంటువడుట సహించరానిది."

"పశ్చాత్తప్తులైన అపరాధులు పవిత్రులుగా పరిగణింప పడతారని మీద్వారానేవిన్నాను. అమ్మాయిగారు జీవితంలో పెద్దపొరపాటే చేశారు. అందుకామె నేడు పరితపిస్తున్నది. అలాంటి ఆమె నుద్ధరించుటకూడా గొప్ప కార్యమేగదా!"

ఆయన చిరాకుతో "అధిక ప్రసంగం అనర్ధానికి దారితీస్తుంది" అన్నాడు.

ఆమె ఆశ్చర్యపోయింది. అది సామాన్య చిరాకే, ఆయన ముఖ మండలంలో అంతటి క్రోధచిహ్నాలిదివరకెన్నడూ చూడలేదు. ఎవరి ద్వారా యెంతటి నష్టాలు సంభవించినా, అత్యాచారాలు జరిగినా, అల్పుల ద్వారా అవహేళనలు విన్నా చిరునవ్వుతో పెడచెవినిపెట్టి శాంతి దేవతగా ద్యోతితమయిన ఆయన నేడు చిన్న విషయంలో యింత చిరాకు చెందినందుకు ఆమెలో ఆమె ఆవేదనపడుతూ ఏదో చెప్పాలని హస్తాలు జోడించింది. అదరాలు అదురుతున్నవి. గొంతు పెగులుటలేదు. అశ్రు బిందువు లొక్కటొక్కటిగా ముత్యాలవలె దొర్లుతున్నవి.

31. అమరత్వం

ఆయన మనస్సు ద్రవించింది గాబోలు ఆమె శిరస్సును వక్షస్సు మీదకు వాల్చుకుని, అశ్రువులను అద్దుతూ "మానవ మనస్సు బలహీనతలతో నిండివుంటుంది. ఏన్నో కఠినమైన కట్టుదిట్టాలతో నిర్దిష్టబాటను నిర్మించుకుంటాడు, కాని స్వప్రభావితమైన ప్రకృతి చిన్నచూపుతో బాట కదిలి కంకరమయమై పోతుంటుంది. అన్ని విషయాలలో అన్నివేళలా

మనస్సు ఆధీనంలో వుంటుందన వీలులేదు. నా మనస్సులో రేగుతున్న తత్తరంగాలను యెవరికి చెప్పను ?........" అంటూ చుబుకాన్నిబట్టి వూపుతూ పైకెత్తి అధరాలమీద చుంబించాడు.

"నేను మూర్ఖురాలను బాబుగారు ! ఇప్పుడైనా విపులంగా వినిపించండి. అమ్మాయిగారి దుఃఖాన్ని దూరం చేయుటే ప్రధాన మనుకున్నాను." అన్నది.

"నేను ఒకే ధ్యేయంలో మునిగి మిలిగిన లోకాన్ని విస్మరించినట్లు అందరూ అనుకుంటారు. అది అపార్థం. తలపెట్టిన కార్యంలో దీక్ష యేకాగ్రత కొంతకాలం విలిచింది. నీ సాంపర్క్య సన్నిహితత్వం పెరిగినకొంది యేకాగ్రత యెగిరిపోయినది. యాంత్రిక జీవితంలోనుంచి మధుర జీవితాన్ని చవిజూడ మనస్సు తాపత్రయ పడుతున్నది. స్వర్గ యిక్కడికి చేరినప్పటినుంచి, నీవు మారిపోతున్నావు. నాకు దూరమౌతున్నట్లు తోచినపుడు బాధ కలుగుతున్నది. చలించని మనస్సు యెంతైనా పయనించ గలుగుతుంది. చలించిన మనస్సు చంచలత్వంలో మునకలు వేస్తుంటుంది.

"ఒకతుచ్ఛురాలికొరకు మిమ్ము మీరు న్యూనత పర్చుకోకండి. లోకానికొక వినూత్న విజ్ఞానాన్ని ప్రసాదించ అవతరించిన మహాపురుషులు మీరు. అమూల్యమైన మీ ఫార్ములాతోను, అశోకనగర నమూనాద్వారా అచ్ఛసమాజసృష్టిలోను పొందుకీర్తి అమరత్వాన్నిస్తుంది. మీ వుదాత్తతకు మిరే సాటియైనవారు. అలాంటి మీరు ఒక సామాన్య దాసి కొరకు పొందే తపనలో అధీరత వడుతున్నట్లు పలుకుట న్యాయంగాదు బాబుగారు." అన్నది.

"చలించుటను క్షుద్రత్వంగా చిత్రించుట ప్రకృతిని పరిహసించుట రసభరిత హృదయం అంతం వరకు కఠినత్వం వహించలేదు. దీక్షలో మునిగి యాంత్రికజీవనం గడుపలేదు. రసహీనహృదయంద్వారా లోకానికి శాశ్వతమేలు కలుగజాలదు. చలించుట యెంతటివారికైనా సహజం. అది దోషంగాదు పద్మా"

ఈ లోకంలో అంతస్థుపోయాక జనాకర్షణ అదృశ్యమౌతుంది. దీనులవైపు ఒక జాలిచూపు విసరొచ్చుకాని అంతస్థు ఆధిక్యతవున్న వారివైపు పరువులెత్తి పాదాలముందుచిందులు త్రొక్కుతుంది. అలాంటి ప్రజాకర్షణ మీబోటి మహావ్యక్తులకు ముఖ్యము. మీరు కోరితే ఆధునిక సభ్యతలో ఆరితేరిన విదుషీమణులు, అంతఃపురాలలోనున్న అందాలు చిందించు అప్సరసలు మీ పాదాలముందు ప్రణమిల్లి తరించినట్లు భావించుకుంటారు. అలాంటి అర్హులైనవారు ఆ స్థానం పొందినపుడే మీ విశిష్టతకు నూతన శోభ కలుగుతుంది. మీరు మీ కొరకు జీవించే సామాన్యులుకారు. దేశోద్ధారకులు. అంతటి వున్నత స్థాయిలోని మిమ్మి నా కొరకు క్రిందికిదించుట భరించలేని నష్టాన్నిస్తుంది బాబుగారు."

"అందచందాలు, అయిశ్వర్యాలు, పాండిత్యాలు అత్యధిక ఆధిక్యత కలవే. అక్కడ అన్నివేళలా మోహం సంతృప్తి చెందవచ్చు. కాని పవిత్రప్రేమ విషయంలో మన నిర్ణయాలు పనిచెయ్యవు. మోహం మోజు వెంట నడుస్తుంది. మోహాన్ని అదుపుచేయగల శక్తి మార్పుచేయగలశక్తి మానవుని కుంటుంది. పవిత్రప్రేమ మహత్తరశక్తివంతమైనది. అది పూర్ణస్వాతంత్ర్యముతో పరువులెడుతుంటుంది. అక్కడ సంశయాలకు సందిగ్ధాలకు, తర్క వితర్కాలకు అవకాశముండదు. ఎన్ని అడ్డంకులు గలిగినా అవరోధాలు సంభవించినా ఆవేశనియై తెరతెరలాడు తపనలతో పోరాటహోరు సలిపి విడుదల పొంది సాగరంలో కలువను యేకాగ్రగంగాపరువులిడు నదీప్రవాహంవలె పవిత్రప్రేమలోని యేకాగ్రత తరుగులేనిది. ప్రేమకు భగవంతుడు దృష్టిదోషము శ్రవణదోషము పెట్టి జరిగే విచిత్రాలనుచూసి ఆనందిస్తుంటాడు. లోకమంతా పరిహసిస్తూ కోడై కూస్తున్నా ప్రేమకు వినిపించదు, కనిపించదు. కనుకనే యేకాగ్రతలోని దృఢత్వం తరుగుటకు బదులు పెరుగుతుంటుంది. అలాంటి పవిత్రప్రేమ అన్ని హృదయాలలోను జనించదు. కాని అలాంటి ప్రేమవలన సుఖంకంటె దుఃఖమే లభ్యమవుతుంటుంది. ఆ రూపంలోని ప్రేమానుభూతులద్వారా ప్రతిఫలించే సాహిత్యమే వున్నతరూపం ధరించి హృదయాలను కదిపివేస్తుంది. పవిత్రప్రేమలోని పరాజయమే

త్కృష్ణ సాహిత్యానికి జనని. పవిత్రప్రేమలోని పరాజయంలోనే ఆత్మ క్షోభిస్తుంది. క్షోభలోనే విజ్ఞానరూప సాహిత్యం వెలువడుతుంది. ఆధ్యాత్మిక ప్రేమ అమరత్వాన్నిస్తుంది. అది వరప్రసాదమువంటిది. అలాంటి పవిత్ర ప్రేమను మరోవైపు మరల్చను. విస్మరించను సాధ్య మయితే వ్యధితులుగా ఆధ్యాత్మిక ప్రేమరంగంలో ప్రవేశించి ప్రేమ దేవతను స్మరిస్తూ ఆలాపించిన వ్యధాభరిత కవిత లెందుకుండేవి।"

మీ ఆశయం మహోత్కృష్ణ మయిందని, మీ శక్తి నిరాడం బరమైన విరాట్ రూపియని అనుభవంగా అర్థం చేసుకున్నపుడు పొంగి పోయి కృతజ్ఞతతో మీకు అంకితమైపోయాను. దేశసేవ చేయను చాత గాని నేను మీ సేవచేస్తూ దేశసేవలోని అనుభూతులను పొందగలిగాను. నాలోవి సేవ, త్యాగ స్వభావాలకు తీర్చిదిద్దినట్లు రూపురేఖలు కలిగినవి. మధురాతి మధుర సంగీతం వింటున్నపుడు కమనీయమైన భానుమతి కంఠం కావాలనిపించునట్లు మీ అనుకరణలో మీకు మించిన త్యాగినై మీ సేవలో జీవితం అర్పించాలనుకున్నాను. కాని నేడు మీరు మరో కోణంవైపు తిరిగి మాటాడుతున్నారు. అవి అంతగా అర్థం కాకపోయినా ఆకర్షిస్తున్నవి. మీ యెడలగల భక్తిలోని పారవశ్యం అలాచేస్తున్నదో లేక ఆ విషయాలే అంతటి మహనీయమైనవో వూహించలేక పోతు న్నాను."

"ఏ ఆశయాలతో ఒక నూత్నరూప ఆదర్శసమాజ నాందివేసి ప్రచారంలో వుంచాలని కృషిసలిపానో, ఆ కృషి ఫలించింది. తరువాత కార్యక్రమం మరింత బాధ్యతాయుతమైంది. స్వయంగా నేను కూడా అశోక్‌నగర్ ప్రజలలో కలిసిపోవాలి. మిగిలిన కార్యభారాన్నంతటివి వారిలో లీనమై సమిష్టిరూపంలో వహించాలి. వారిలో ఐక్యమై పోవ టానికి నీవు కావాలి. అపుడే నా కార్యరంగానికి నాకు పూర్ణత్వం లభిస్తుంది.

"మీ సాన్నిధ్యంలో నేను నేర్చుకున్నది త్యాగం బాబుగారు. నేను యివ్వగలిగే సర్వాన్ని మీకు సమర్పించగలను. మీరు నా కివ్వ గోరుతున్న స్థానాన్నిమాత్రం స్వీకరించలేను. ఎన్ని జన్మలపుణ్య ఫలి

తంగానో లభ్యంగావలసిన ఆ పవిత్ర స్థానాన్ని పొందితే ఈ లోకంలో నాకంటె అదృష్టవంతు లెవరుంటారు! అంతటి అంతస్థుకి తలవగ్గితే మీ సమక్షంలో నేను అలవర్చుకున్న త్యాగదీక్ష వ్యర్థమైనట్లేగదా!"

"సత్ఫలితం కొరకు కృషిసలిపితే దుష్ఫలితం లభ్యంగావచ్చు, కొన్ని వేళలందు ఆశించని అమృతఫలితం అందవచ్చు. అయాచితంగా లభించినా ఆ ఫలితాన్ని స్వీకరించుటే వివేకవంతం. ధర్మం కొరకు పోరాటం సలుపుతూ, ధర్మధ్యేయంతో గూడిన ఆదర్శ సమాజ నిర్మాణం కొరకు కృషిసలుపుతూ ధర్మసహితమైన ఆనందం స్వీకరిస్తా నని ఆశిస్తున్నావా పద్మా?" అన్నపుడు ఆమె ఆదుర్దాతో అందుకుని "అబ్బ! మిమ్మ అపార్థం చేసుకునేంత అధమురాలినికాను. నన్ను క్షమించి కాస్త ఆలోచించే అవకాశ మివ్వండి బాబుగారు." అంటూ వాపోయింది.

ఆయన వోదార్పు రూపంలో నవ్వుతూ, శిరస్సుమీద చేయివేసి నిమురుతూ "ఇప్పటికి ఒక మంచి సమాధానం చెప్పావు సంతోషం. బాగా దీర్ఘంగా ఆలోచించు, అవసరమైనపుడు సలహాలిస్తా అమ్మ." అన్నాడు.

తిరిగి ప్రయోగశాలకు చేరారు. పద్మ యిపుడు యే పనిలోను నిమగ్నం కాలేకపోతున్నది. స్వర్ణకుమారికి కావలసిన సదుపాయాలు యెప్పటికప్పుడు చూస్తున్నదిగాని, యెక్కువ సమయం వుండలేక పోతున్నది.

రేగిన తేనెతుట్టెవలె ఆమె మనస్సు ఆలోచనలతో దిమ్మెత్తి పోతున్నది. ఏకాంతాన్ని వాంఛిస్తున్నది. అందుకు అనువైనచోటు వసంతకుమార్ ఆఫీసు, అక్కడికి మాటిమాటికి మరొకరురారు. ఆయన తన పనులలో మునిగి వుంటాడు. ఆఫీసులోని ఒక సోఫాలో కూర్చుని, వదిగి అధో ముఖిగా వుంటున్నది.

వసంతకుమార్ మనస్సులో నూతన ఆలోచన లేమి చెలరేగు తున్నవో తెలియదు. పరీక్షలో కూర్చుని ప్రశ్న పత్రానికి జవాబులు

వ్రాస్తున్న విద్యార్థినిని పరిశీలించు పరీక్షాధికారివలె, ఒక మూల సోఫాలో నున్న పద్మను అపుడపుడుచూసి తనలో తాను నవ్వుకుంటుంటాడు. చూపుతో చూపు కలిసినపుడు చిన్న నవ్వును ప్రదర్శించి సిగ్గుపడినట్లు తానే శిరస్సు వంచుకుంటాడు.

ఆయన దృక్కులలో యెంతో వోదార్పువుంది! ఆమె కృతజ్ఞతతో మరింత కృంగిపోతుంటుంటుంది. పొదుగుతున్న పక్షివలె గంటల తరబడి అలానే కూర్చుంటుంది.

రోజులు గడిచి పోతున్నవి. ఆలోచనలు పెరిగిపోతున్నవి. నిర్ణయం అసంభవరూపం దాలుస్తున్నది. మనస్సు వేడెక్కి విసగటలు చెందిపోయింది.

ఆయన అడుగు జాడలలో నడచుట మహదావహం తన ద్వారా ఆయనకు సుఖం లభిస్తే తన జీవితమే ధన్యమైనట్లు, ఆయన కొరకు ఆహుతి కాగలదు. కాని ఆయన ధర్మపత్ని స్థానాన్ని వూహించి నపుడు భయకంపితురాలవు తుంటుంది. తను యెవరిసేవలో, ఎవరి రక్షణలో వచ్చిందో ఆ స్వర్ణకుమారి నేటి దీనస్థితి. ఆమె దీనదృక్కులు గుచ్చుకుంటున్నవి, అయినా ఆయన ఆదరించి యిచ్చిన స్థానాన్ని స్వీకరించుట అపరాధంగాదు. అన్యాయమూగాదు. లోకంలో వుంటూ లోకాన్ని పాటించకపోతే యెలా! లోకం తన దృష్టితో పరికించదు, లోకం దృష్టితో లోకంచూసి నిందిస్తుంది, అపహాస్యం చేస్తుంది, అందుకు తాను చింతించదు. తనను గురించి తనకు భయంలేదు. ఆయన ప్రస్తుతమున్న వున్నతస్థాయి నుంచి లోకం దృష్టిలో జారిపోతాడు, సామాన్యులలో కలిసిపోతాడు. చులకనగా చూడబడతాడు, అని భయం, అంతేగాదు, యెవరి అనుకరణలో తనలోని త్యాగస్వభావానికి, సేవాభావానికి రూపురేఖలు కల్పించుకున్నదో ఆయన ప్రక్కన పరమపవిత్రమైన, తన కలితమైన వున్నతస్థానాన్నిపొంది స్వార్థిగానిలచుటకు మనస్సు అంగీకరించుటలేదు.

వారి కోర్కె తనకు ఆజ్ఞలాంటిది, శిరోధారితమైంది. కాని ఆ ద్వారా తన వుద్ధరణ జరుగుతుంది. ఆయన అనంత నష్టాన్ని పొందుతారు. అందుకు తానంగీకరింపజాలదు. కాదంటే ఆయన ప్రేమ విఫలు

దొరాడు. ప్రేమ విఫలత్వంలో ఆత్మక్షోభ, ఆ క్షోభలోని ఆవేశంద్వారా అమూల్య సాహిత్య సంపద వెలువడుతుందని అయనే వివరించాడు. ఆయన, రచనలద్వారా అమరుడైతే, ఆ వెలుగుతో నీడవలె తానూ అమరత్వాన్ని పొందుతుంది. తరుణోపాయమేదో దొరికినట్లు మనస్సు తేలిక పడింది, దీర్ఘ శీతల శ్వాసను విడచింది. శిరస్సు పైకెత్తిచూసింది. కుర్చీలో వసంతకుమార్ లేడు. ఆయన్ను వెంటనే చూడాలనిపించింది. నేత్రాలు నులుముకుంటూ లేచింది. బయటనుంచి వినవస్తున్న అడుగుల ధ్వని విని అక్కడే నిలిచిపోయింది.

ఆయన దగ్గరగా వచ్చి శిరస్సు నిమురుతూ ముద్దులొలుకు కమనీయ పలుకులలో "అబ్బ! యెంతగా చిక్కిపోయావో చూడు! నేను విధించిన శిక్షవలె నా యెదుటనే వుండి నీ విలా చిక్కిపోతే ప్రతీకార శిక్షగా నేనేం పొందాలో చెప్పు పద్మా!" అన్నాడు.

ఆయన పాదాలమీద వాలిపోయి పెనవేసుకున్నది. ఆయన యెంత తీయ ప్రయత్నించినా ఆవేదనలోని వుద్భృతం తీరేవరకు లేవలేదు.

"మీరు మానవరూపంలోవి దేవతలు బాబుగారు. జన్మజన్మకు మీ దాసిగా జన్మించాలని నన్ను ఆశీర్వదించండి" అని మనస్సులోనే అనుకున్నది.

"వినపడకుండా మనస్సులోనే అనుకుంటున్నా వేమిటి పద్మా!" అన్నాడు.

ఆమె లేచి చూస్తూ నిలిచిపోయింది.

అరుణోదయ బాలభాస్కరునివలె ఆమె ముఖమండలం నిర్మల రూప స్నిగ్ధాను రాగార్ద్రమై ప్రభవిస్తున్నది. మంత్రించినట్లు పులకితుడై గాఢచుంబనలు పొందాడు.

ఆమె ఒక నిర్ణయానికి వచ్చివుంటుందని భావించి వుత్సాహితుడయ్యాడు. అయినా తానుగా ప్రశ్నించ గూడ దనుకున్నాడు. ఎన్ని

రోజులయినాసరే ఆమె స్వయంగా వినిపించేవరకు నిగ్రహించుకోవాలనుకున్నాడు. ఇపు డామె మూల్యం ఆయన దృష్టిలో అనుకున్నకంటె అనేకరెట్లు అధికమని భావించుకున్నాడు. ఇంతటి శక్తిసంపన్నురాలైన యీమె ధర్మపత్నిగా తన ప్రక్క నిలిచినపుడు అశోక్ నగర్ లాంటి మోడల్ నగరాలను జిల్లా కొకటి నిర్మించి ప్రజాకర్షణకు గురిచేసి దేశవ్యాప్తం చేయగలననుకున్నాడు.

ఇరువురిలోను దీప్తి ప్రభవిస్తున్నది. ఒకరినుంచి ఒకరు వినాలని యిరువురిలోను వున్నది. కాని యెవరి నిర్ణయాలు వారిలోనే వుంచుకుని యెదుటివారి మాటలకొరకు యెదురులు చూస్తున్నట్లున్నది. అదొక విచిత్రమైన దాగుడుమూతలాట.

ఆరోజు గడిచిపోయింది. వసంతకుమార్‌లోని వుత్సాహం పెరుగుతున్నది. కాని పద్మలోని వుత్సాహం యెంత కూడదీసుకున్నా సన్నగిలిపోతున్నది.

సంధ్యాసమయం నాలుగుగంట లయింది. పద్మ సోఫాలో వోరగలబడి నిద్రిస్తున్నది. కుర్చీలో కూర్చున్న వసంతకుమార్ గడియారంవైపు పద్మవైపు చూస్తూ తన పనిలో దృష్టిని నిలుపలేక పోతున్నాడు. పద్మ యెన్నిపనులున్నా సరిగ్గా రెండుగంటలకు ఫలహారం అందించేది. నేడు అదమరసి సోఫాలో నిద్రిస్తున్నది. స్వయంగా ఆమె లేచేవరకు లేపగూడదని నిశ్చయించుకున్నాడు. నిద్రనుంచి లేచి గడియారం చూసి గాభరాపడుతూ తననుతాను నిందించుకుంటూ ముందుకొచ్చి కంపితకంఠంలో "క్షమించండి బాబుగారు. మీరయినా కేకవేయగూడదా!" అంటుందని. అంతటి నీ సుఖనిద్రకంటె ఫలహారం విలువైందిగాదులే, అనవచ్చునని వూహలు సలుపుతున్నాడు.

చూస్తూచూస్తుండగా, అయిదుగంట లయింది. అయినా పద్మ లేవలేదు. నిన్ననే ఒక నిర్ణయానికి వచ్చిందిగనుక మనస్సు తేలికపడి హాయినిద్ర పట్టి వుంటుందనుకున్నాడు. ఆమెనుచూస్తూ తానూ టయం విషయం మర్చిపోయాడు.

తయారుచేసిన ఫలహారం వంటమనిషి తీసుకొచ్చి బల్లమీదుంచి, పద్మను లేప ప్రయత్నించాడు. వసంతకుమార్ ఆదేశంతో వంటమనిషి వెళ్ళిపోయాడు.

పద్మను తాను స్వయంగా మేల్కొలిపి, యీరోజు శుభసూచకంగా ఆమెచేత ఫలహారం తినిపించాలని ఆకాంక్ష. ఫలహారాలనుంచి రవ్వలడ్డును తీసుకుని పద్మచెంతకు చేరాడు. నిద్ర పూర్తిగా లేవకముందే ఆమె నోటిలో కుక్కాలని ఆయన అభిలాష. ఆమె ముఖాన్ని పైకి యెత్తకుండానే లడ్డును నోటిలో కుక్క ప్రయత్నిస్తూ, సాధ్యపడక ద్వితీయ హస్తంతో చుబుకాన్నిబట్టి పైకెత్తి చూసి నిర్ఘాంతపోయాడు.

ఆయన పాదాలు పృధ్వీమీద ఆనుటలేదు. కంపిస్తున్న హస్తాలతో సరిగా కూర్చుండబెట్ట ప్రయత్నించాడు. కాని ఆమె వాలిపోతున్నది. ఆమె కొంగుచాటున సోఫామీద వుత్తరం గనిపించింది. దాన్ని చేతబట్టి చదువబోతే దృష్టి చెదురుతున్నది. హస్తాలు అదురుతున్నవి.

"దేవతాస్వరూపులైన బాబుగారి పాదపద్మములకు నమస్కరించి వ్రాయినది,

బాబుగారు, మీ ద్వారా నాలోని నిస్వార్ధతకు, త్యాగానికి, సేవకు కొన్ని రూపురేఖలు అమర్చుకుని స్వార్ధవాసన లేశమాత్రంకూడా లేని త్యాగినిగా నాకు నేను స్థిరీకరించుకున్నాను. కాని నేడు ఒక స్వార్ధిగా యీ లోకంనుంచి వెళ్ళిపోతున్నానని వ్రాసుకోవటంలో సిగ్గుపడుటలేదు. జీవిత మర్మమయినట్లు' పరమార్థం తెలిసిపోయినట్లు, లోకమంతా అనుభవమయినట్లు అనిపిస్తుంది. మరో అడుగు ముందుకు వేసినపుడు అంతా అయోమయం. ఏమీ అర్ధం గాలేదు. తెలుసుకున్నది వూహించుకున్నది అంతా పొరపాటనిపిస్తుంటుంది. ఎప్పటికీ అర్ధంగాకుండా, అయినట్లు గనిపించి భ్రమలలో పరువులెత్తిస్తూ నిరాశను గల్పిస్తూండటమే లోకపు అస్థిత్వము సజీవత్వమేమో। మానవజీవితమే స్వార్ధంతో నిండిన బుడగగా తోచినపుడు చీకాకు చెందిపోయాను. మనస్సు చెదిరి

పోయింది. త్యాగమని వేసే ప్రతి అడుగులోను స్వార్థభాగం స్పష్ట రూపంలో కనిపించినవి. అయితే బాబుగారు స్వార్థజీవా? అని మనస్సులో మెదిలినపుడు, లోకోద్ధారకుడైన ఆ భగవంతుని నిందిస్తున్నట్లు భయపడిపోయాను' నాకు మీ కార్యాలకంటె, మీరే ముందు ప్రత్యక్షంగా ఒక విశిష్ట తేజస్సుతో కనిపించారు. మిమ్మే చూస్తూ మీరు చేసే కార్యాలలో స్వార్థభాగ ముందని యెలా అనుకోను. లోంకవైపు తిరిగితే ప్రతి అడుగులో స్వార్థం, మీ వైపు తిరిగితే స్నిగ్ధార్థిత్యాగం అన్న ద్వంద్వాత్మ సంఘర్షణలో వోడిపోయాను. ఏ నిర్ణయమూ చేసుకోలేక పోయాను. మీ రివ్వదలచిన ఆ పవిత్ర స్థానాన్ని స్వీకరిస్తే స్వార్థినే అవుతాను, మీ మాట నుల్లంఘించిన తరువాత కూడా జీవించుట దుర్లభం. ఆత్మహత్య అంతకంటె స్వార్థపూరితమైందిగా తోచి భయపడి పోయాను. ప్రేమ విఫలంద్వారా పొందే ఆత్మక్షోభలోని ఆవేశంలో అమరలేఖిని వెలువడుతుందన్న మీ మాటలు నన్నుత్సాహపరుస్తున్నవి. మీ ప్రయోగశాల కార్యాలద్వారానే కాకుండా కవనరంగంలో అమరులు కావాలని నా అభిలాష. మీ వెలుగులో నీడ మరకలుగా నాకూ అమరత్వం లభిస్తుందని నాకు తెలుసు. కాని యీ స్వార్థానికే నా మనస్సు అంగీకరించింది. ఉత్తమమయిందిగా తోచింది.

అయితే ముంతాజ్‌లాంటి స్వార్థినై మిమ్మే షాజహానులాంటి పిచ్చివానిగా చేయాలని నాకు లేదు. తన తరువాత భర్తను మరో వివాహం చేసుకోవద్దని, తన స్మృతిచిహ్న నిర్మాణంతో అమరత్వం ప్రసాదించి, ఆయన్ను విలాపవేదనలతో జీవయాత్ర జీవన్మృతుడుగా సాగించమని ఆదేశించింది. అభయం తీసుకున్నది, ముంతాజ్ కంటె హేయమైన స్వార్థము, మూర్ఖము, నీచము యే స్త్రీలోను వుండదు, సతీమణి ఆదేశానికి లేక ప్రియురాలి ఆ దేశానికి బద్ధుడై, తన కర్తవ్యాన్ని ప్రజాశ్రేయస్సును విస్మరించి, మృతించిన తన ప్రియురాలి కోర్కెకొరకు ప్రజాద్రవ్యాన్ని కోట్లకొలది విచ్చలవిడిగా వెచ్చించి తాజ్‌మహల్ అనే సమాధిని నిర్మించి, ప్రజాపాలకులు ధర్మప్రభువులు అన్న ఆ సాంప్రదాయానికే శాశ్వత కళంక మాపాదించిన షాజహాన్‌వలె మీరు

నా తరువాత వెర్రివారో పిచ్చివారో కావాలని నాకు లేదు. నా స్మృతి చిహ్నంగా మీ అశోక్‌నగర్‌లోని కార్యదీక్ష తీవ్రరూపం ధరించి విరాట్‌స్థితికి రావాలని నాకోర్కె. మీరు మన్నిస్తే నా కోర్కెగా మరొక విషయాన్ని అర్థించుకుంటున్నాను. అభాస్యాలను సాధ్యాలుగా స్వీకరించగల శక్తి, ఉదాత్తత మీలో పూర్ణ రూపంగా వున్నవి గనుక విశ్వాసంతో మిమ్మ అర్థిస్తున్నాను. అమ్మాయిగారు అమాయకురాలు చదువులద్వారా పటాటోపాలను వుబలాటాలను అలవర్చుకున్నదిదప్ప, ఆత్మశక్తిని అందుకు కావలసిన విజ్ఞానాన్ని పొందలేదు. అందువలనే ఆమె అతి తేలికగా గంగరాజు మోసానికి గురియై జీవితంలో వోటమిని పొందింది. పవిత్రమైన మానవజీవితం ఒక్కపొరపాటుతో సర్వనాశనం కావటానికి వీలులేదని నేను మీ దగ్గర నేర్చుకున్నాను. ఆమెగారిని పసితనంలో మీకు మోల్చుకున్నారు మీ కాబోయే సతీమణి అనే వాడుకలో పెరిగి పెద్దదయింది. విధి వక్రించింది. ఆమె నేడు అనాథ అయిపోయింది. ఆమెకు ప్రత్యేకదాసిగా ఆమె వెంట వచ్చినదే యీ పద్మ. ఆమె పొందవలసిన ఆ అమూల్య స్థానం ఆమె దాసినైన నన్ను ఆహ్వానిస్తున్నది. రక్షణకువచ్చి భక్షణ చేయుట అందరూ చేయగలిగిందిగాదు, ఈ కారణంతోనే భయంతో పిరికితో ఆత్మహత్య నాహ్వానించుకుంటున్నానేమో ! ఆ అమాయకురాలైన అమ్మాయిగారిని స్వీకరించి ఆమె స్థానా న్నామెకు ప్రసాదించమని నాహృదయపూర్వక వినతి. ఇది బేగం ముంతాజ్ మహారాణి ఆజ్ఞలాంటిదిమాత్రంకాదు. సమాజానికి మార్గగాములుగా నిలిచిన మీరు ఆ అపరాధిని స్వీకరించి మీలోని వుదాత్తత అద్వితీయమైందిగా ప్రదర్శించమని నా ప్రార్థన మాత్రమే. ఈ దీనురాలిని క్షమించండి బాబుగారు, సెలవు.

మీ భక్తురాలు,

పద్మ."

సమాప్తం.

312

TPCA104B109

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TPLA104B109
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	25-10-24
ముందు అట్ట	NO
వెనుక అట్ట	NO
మొత్తం పేజీలు	321
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	D,F,312
లేని పేజీలు	NO
తయారు చేసినది	Habeeba
పేజీలు విడదీసినది	Habeeba
స్కాన్ చేసినది	E Daveed
పరీక్ష చేసినది	RAMYA
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good